
'ఆసక్తిని, కుతూహలాన్ని రేకెత్తిస్తూ ఏకబిగిన చదివించే పుస్తకం.'
- శశిథరూర్

# అశ్విన్ సంఘి



# చాణక్య మంత్రం

## CHANAKYA'S CHANT

NOW IN TELUGU

JAICO

# రచయిత మాట

చాణక్యుడిపై నవల రాయమని మొట్టమొదట సూచించిన అపర్ణగుప్తకు రుణపడి ఉంటాను. ఆమె వేసిన ఆలోచనాబీజమే క్రమంగా ఈ నవలగా రూపుదిద్దుకుంది.

ఈ పుస్తకం రాస్తున్నపుడు వారితో ఎక్కువ సమయం గడపలేకపోయినా సహనంతో భరించిన నా భార్యకు, కుమారుడికి నా కృతజ్ఞతలు.

నా ప్రయత్నాలలో - నా రచనలకు కూడా సహకరించిన నా కుటుంబానికి రుణపడి ఉంటాను.

వివిధ రచయితలు, పుస్తక నిర్మాతలకు నా కృతజ్ఞతలు. విడిగా పుస్తకాల పట్టికలో చివరలో కృతజ్ఞతలు చెప్పాను.

నా ఎడిటర్ ప్రీతామైత్రకు, నా ప్రచురణకర్త గౌతమ్ పద్మనాభన్‌కు, నా కృతజ్ఞతలు - వారు లేకుండా - ఈ నవలతో సహా నా నవలలేవీ వెలుగు చూసేవి కావు.

ఇద్దరు ప్రతిభావంతులు కుశాల్ గోపాలక, అమేయ నాయక్‌లతో కలిసి పనిచేసినందుకు చాలా సంతోషిస్తున్నాను. వారి శ్రమ, ప్రేరణ లేకుండా వెంటాడే చాణక్యమంత్రం ఆడియో ట్రాక్‌ని సృష్టించలేకపోయేవాళ్ళం.

చివరిగా, కీర్తిశేషులైన శ్రీరాంప్రసాద్ గుప్త గారి మనుమడుగా, ఆయన సోదరుడు కీర్తిశేషులైన శ్రీరాంగోపాల్ గుప్త గారి మనుమడుగా పుట్టడం నా అదృష్టం. కలం పట్టిన నాచేతిని వారి ఆశీస్సులే కదిలిస్తాయి.

# ఆరంభం

ఆ వృద్ధుడు ఆసుపత్రి మంచం మీద పడుకొని ఉన్నాడు. ఆయన ముఖ్యావయవాలు ఎలా పనిచేస్తున్నాయో చూపిస్తూ మానిటర్ల మీద అంకెలు, గ్రాఫులు వస్తున్నాయి. బలహీనంగా ఉన్న ఆయన చేతులకి ఎన్నో సూదులు గుచ్చి ఉన్నాయి. నోట్లోంచి ఒక ట్యూబు ఊపిరితిత్తులలోకి వేశారు. శరీరంలోనుంచి ప్రాణం నిష్క్రమిస్తున్నదని ఆయనకు తెలుసు కాని తాను నిరీక్షిస్తున్న క్షణం వరకూ బ్రతికించమని శక్తిని ప్రార్థిస్తున్నాడు.

గది చీకటిగా ఉంది, ఎండ రాకుండా కర్టెన్లు మూసేశారు, టీవీ తెర మీద కనిపించే వెలుతురు తప్ప గదిలో వెలుతురే లేదు. ఆయన ఇనుప మంచం పక్కనే డ్యూటీ నర్సు కూర్చుని కునికిపాట్లు పడుతోంది. భారతదేశ పద్దెనిమిదో ప్రధాని ప్రమాణస్వీకారం చూస్తుండగా టీవీ వెలుతురు ఆ ఎనభైయ్యేళ్ళ వృద్ధుడి కళ్ళలో మెరిసింది.

మూడు మొబైల్ ఫోన్లూ ఆగకుండా మోగుతుండడంతో, ఆయన వ్యక్తిగత సహాయకుడు మీనన్ పరిగెత్తుకుంటూ లోపలికి వచ్చాడు. పక్క గదిలో రోగి అలా ఆగకుండా మోగే ధ్వనులు భరించలేపోతున్నానని ఫిర్యాదు చేశాడు. యాభయ్యేళ్ళ సెక్రటరీ గదిలోకి తొంగి చూశాడు, యజమాని ఆసుపత్రి పడక మీద నుంచి టీవీలో న్యూఢిల్లీలో జరిగే దృశ్యాలను రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. ఫోనులు మోగేశబ్దం ఆయన వినడం లేదు. ముప్ఫయ్యేళ్ళపాటు ఈ క్షణం కోసం నిరీక్షించాడు. ఫోన్‌కాల్స్ దానికి అంతరాయం కలిగించడం ఆయనకిష్టం లేదు. అయినా నోటిలో గొట్టం ఉండగా ఆయన మాట్లాడలేడు ఎలాగూ. ఫోన్లు ఆపి ఉంచుదామని మీనన్ అన్నాడు కాని, ఆయన ఒప్పుకోలేదు. నేను నా ప్రాణంతో సహా – దేనినీ ఈ క్షణంలోని ఆనందాన్ని అనుభవించకుండా ఆపను అనుకున్నాడాయన మనసులో.

అయన పరిస్థితిని చక్కదిద్దగల పరికరాలేవీ కాన్పూర్ ఆసుపత్రిలో లేవు. పండిట్ గంగాసాగర్ మిశ్ర అదేం లెక్కచేయలేదు. ఆయనకి న్యూఢిల్లీలో గాని, ముంబయిలో గాని ఆసుపత్రి మంచం మీద చనిపోవాలని లేదు. కాన్పూర్ తన ఇల్లు. తనని సృష్టించినవాడిని తన ఇష్టప్రకారం తన నివాసం నుంచే కలుసుకుంటాడు.

రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్నదంతా ఆయన చూస్తున్నాడు. ప్రజాకర్షణ గల మహిళతో రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేయిస్తున్నాడు. ఆమె ఎప్పటిలా కోరా నూలు చీర, వజ్రాల చెవికమ్మలు పెట్టుకొంది. ఆమె ముందు కాగితంలో ప్రమాణ పాఠం ఉంది గాని, ఆమెకి దాని అవసరం ఉన్నట్టు లేదు. ఈ సందర్భం కోసం జీవితమంతా తయారయినట్టు ఉంది. ఆక్స్‌ఫర్డ్ యాసలో ఆమె ఆంగ్లంలో ఇలా చెప్పింది. 'చాందిని గుప్త అనే నేను దైవసాక్షిగా ప్రమాణం చేసి – భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసాన్ని, విధేయతను కలిగి ఉంటానని, చట్టప్రకారం భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమైక్యతను కాపాడతానని, విశ్వాసంతో, చిత్తశుద్ధితో ప్రధానమంత్రిగా నా విధులు నిర్వహిస్తానని, ప్రజలందరికీ భయంగాని, పక్షపాతంగాని, అభిమానంగాని, దుశ్చింతగాని లేకుండా రాజ్యాంగం ప్రకారం, చట్టప్రకారం న్యాయం చేస్తానని చెబుతున్నాను'. ఆ రాజనీతివేత్త చిరునవ్వు నవ్వాడు. భయం, అభిమానం, పక్షపాతం, దుశ్చింత! గాడిదగుడ్డుకాదూ! ఇవేమీ కాకుండా ప్రధానిగా ఉండడం సాధ్యం కాదు. అది ఆమెకీ బాగా తెలుసు. ఇది ఆయన అభిప్రాయం. అయినప్పటికీ ఎంత మూర్ఖుడికైనా వాస్తవాలు కళ్ళముందే *ఉంటాయి – కనబడే వాటిని చూసి అభిప్రాయం ఏర్పరచుకోవడం కళ* అని కుటిలుడైన మాకియవెల్లి అనుకున్నాడు.

ఆయన భుజాలెగరేశాడు ఫలితంగా బాగా దగ్గు వచ్చింది, తను చనిపోబోతున్నాడని ఊపిరితిత్తుల్లో కేన్సర్ ఉందని గుర్తు చేసేది అది. ఆయన గది బయట ఉన్న సీక్రెట్ సర్వీసు వాళ్ళు ఆయన దగ్గు విన్నారు. ఎవరి నుంచి ఆయన్ని రక్షించుతున్నామని వాళ్ళు ఆశ్చర్యపోయారు. చాలామంది ఈ లంజాకొడుకు చావాలని కోరుకున్నారు కాని దేవుడి ప్రణాళికలు మరోవిధంగా ఉన్నాయి. గంగాసాగర్ ముక్కు మీద వేలు పెట్టి చెయ్యూపుతూ వెక్కిరిస్తూ, 'వచ్చి నన్ను పట్టుకోండి, నేనుండను!' అని శత్రువులతో అంటున్నట్టుగా ఉంది చూస్తే.

తల మీద కొంచెం చెమట పట్టింది, బట్ట తలపైన రెండు పక్కల రెండు తెల్ల వెంట్రుకల పాయలు షాక్ చెందినట్టుగా ఉన్నాయి. నర్సు తువాలుతో చెమట తుడిచింది.


తన లోతైన, చొచ్చుకుపోయే, అన్నిటినీ చూసేయగల కళ్ళతో – చిన్న వీడియో కెమెరాలవి. మానవుల్లో ఉండే అన్ని రకాల అసహ్యకర ప్రవర్తనలని మెదడులోని హార్డ్ డిస్క్‌లో ఉన్న గిగాబైట్స్‌లో నిక్షిప్తం చేసిన కళ్ళతో ఆమేం చేస్తుందో చూశాడు. పల్చని పెదాలు శ్వాసకోసం అన్నట్లుగా కదిలాయి. ఆక్సిజన్ ట్యూబ్ ఉన్నా ఆయన గద్ద ముక్కు శ్వాసించడానికి యాతన పడుతోంది. ఆయన చర్మం అర్థపారదర్శకంగా ఉంది, ప్రదర్శనశాలలో పాత కాగితంలా. మంచం మీదున్న ఆయన ఆకారం చిక్కిపోయి కొంచెం స్థలాన్నే ఆక్రమించింది. ఇంత అల్పంగా కనిపిస్తున్న మనిషి ఇంత శక్తిమంతుడెలా అయ్యాడు?

ఆయన గది బయట లాబీలో రాజకీయ అనుచరులు చాలామంది ఉన్నారు. పండిట్ గంగాసాగర్ మిశ్రకు స్నేహితులు లేరు. ఆయన రాజకీయ ప్రపంచంలో కేవలం శత్రువులే ఉన్నారు. బయట ఉన్న రాజకీయ నాయకులు ఆయన చనిపోకముందే ఆయన చావు గురించి స్కూప్ ఏమైనా అందిస్తారేమోనని కొందరు పత్రికా విలేఖరులు వాళ్ళ చుట్టూ మూగి ఉన్నారు.

ఆ వృద్ధుడు ఏదో గొణుక్కుంటున్నట్లుగా ఉన్నాడు, పదాలు బయటికి రావడం చాలా కష్టమవుతోంది. అది ఆయన రోజూ చేసే సంస్కృత ప్రార్థన. అది ఇలా ఉంటుంది, *'ఆదిశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; సర్వవ్యాపిత శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; దైవసృష్టికి సాయపడేశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; కుండలినీ సృజనాత్మక శక్తీ; సర్వమాతా నీకు నమస్కరిస్తున్నాను'* తన శిష్యురాలివైపు చూశాడు – ఇప్పుడు ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసింది – కృతజ్ఞతలు చెబుతున్నట్లుగా టెలివిజన్ కెమేరాలకు వందనం చేసింది.... తర్వాత వెనక్కి పడిపోయింది. ఆమె ఎడమ భుజం మీద ఎర్రమరక – నిదానంగా పెద్దదైంది – అది .22 మాగ్నం స్టింగర్‌తో కాల్చడం మూలంగానే అయింది.

రాష్ట్రపతి భవన్‌లోని అశోకాహాలులో గందరగోళం నెలకొంది. టీవీలో ఆ దృశ్యం చూస్తున్న మిశ్ర, సంస్కృతంలో మంత్రాన్ని జపిస్తూనే ఉన్నాడు, *'ఆదిశక్తి నమోనమః; సర్వశక్తి నమోనమః; ప్రథమ భగవతి నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి, నమోనమః'*

# చాణక్య
# మంత్రం


ప్రాచీన భారతదేశ
రాజ్యాలు
కాంభోజ
గాంధార
తక్షశిల
కేకయ
సింధు
కురు
ఇంద్రప్రస్థ
పాంచాల
కొసల
శూరసేన
యమున
మాళవరాజ్యం
వృజ్జి
పాటలీపుత్ర
గంగ
మత్స్య
వత్స
కాశీ
అవంతి
చేతియ
మగధ
అంగ
కళింగ
అస్సక
మ్యాప్ స్కేలు ప్రకారం లేదు.
ఇందులో చూపిన ప్రాంతాలు రాజ్యాలు
సుమారుగా చూపినవి. పుస్తకంలో
వచ్చిన పేర్లకు పోలి ఉండేలా రాజ్యాల
పేర్లను మార్చాం.

## ఒకటో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

ముద్దు నుంచి విడివడాలని లేదు. అతని పెదవులపై సున్నితంగా తన పెదవులను తాకించిందామె, అతని వెన్నులో చిరు విద్యుత్తు పాకింది. ఆవేశరహితమైన ఆ చర్య తృప్తినిచ్చే విధంగా ముగియాలనుకున్నాడతను.

ఆమె పేరు విశాఖ – అంటే స్వర్గంలో ఉండే నక్షత్రం – నిజంగానే ఆమె అప్సరస. పారదర్శకంగా ఉన్న ఆమె తెల్లని శరీరఛాయను, రసరమ్యమైన నోటిని, అల్లరిచేసే ఆకుపచ్చని కళ్ళను పట్టులాంటి ఆమె జుట్టు పాక్షికంగా కప్పివేసింది. ఆమె అతనిపైకి వంగుతున్నప్పుడు, అతని కళ్ళు, ముక్కు, పెదవులపై ఆమె ఆనందంగా చుంబించింది.

విలాస మందిరంలో పురుషోత్తముడు పట్టుపానుపుపై పడుకుని ఉన్నాడు. పక్కనే ఉన్న గదిలోంచి ఆస్థాన నర్తకి వీణపై వాయించే – హిందోళరాగం – ప్రేమరాగం వినిపిస్తోంది. గదిలో ఈశాన్యపుమూల గోడపక్కన స్వచ్ఛమైన గులాబీజలం నింపిన పెద్ద బంగారుపళ్ళెం ఉంది. దానికి ఎదురుగా చందనపు నూనెతో వెలిగించిన బంగారుదీపం ఉంది. పురుషోత్తముడు పారవశ్యంలో ఉన్నాడు.

విశాఖ చేస్తున్న పనులకు తనను తాను అర్పించుకుని తృప్తిగా నిట్టూర్చాడు. నిర్వాణానికి సంపూర్ణంగా దైవానికి తనను తాను సమర్పించుకోవాలని ఏ మహాగురువు చెప్పాడో గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. ఇంత ఆనందాన్నిచ్చే జీవి దానికేమన్నా తక్కువదా? అతను తన చేతులు చాచి ఆమెను తన ముఖం మీదకు లాక్కున్నాడు. తన పెదవుల దాహాన్ని సుగంధపరిమళభరితమైన ఆమె శ్వాసతో తీర్చుకోవాలనుకున్నాడు. అతను దహించుకుపోతున్నాడు.

అతని గొంతు దహించుకుపోతోంది! కంగారుగా పురుషోత్తముడు ఆమె జుట్టుని వదలి, తన గొంతును పట్టుకొన్నాడు. పాషాణమూ పాదరసాల సమ్మేళనం తన పెదవులు, నాలుక, గొంతుపై బొబ్బలు వచ్చేలా చేశాయని తెలుసుకుని, అరవాలని ప్రయత్నించాడు కాని గొంతులోంచి ఏ శబ్దమూ రాలేదు – స్వరపేటిక అప్పటికే ఆమె పెదాలపైనున్న సాంఖియ విషంతో పాడైపోయింది. అమృతమూర్తిలా ఉన్న విశాఖ ఇంకా అతని తలను తన గుండ్రని ఛాతీకి హత్తుకొంటూనే ఉంది, ఆ క్షణంలో ఆమెకర్థమైంది అతని శరీరంలోంచి నిశ్శబ్దంగా శ్వాస దూరమైందని. రాజుగారి వేదన తెలియక రాజోద్యానంలోని నెమళ్ళు ఇంకా నాట్యం చేస్తూనే ఉన్నాయి. కేకయకు, మగధకు చక్రవర్తి అయిన పురుషోత్తముడు మరణించాడు. రాజుగారు వర్ధిల్లాలి!

ఈ సమయంలో భారతదేశానికి తూర్పున గంగామైదాన ప్రాంతంలో ఉన్న గొప్ప బ్రాహ్మణ సామ్రాజ్యం, మగధ రాజధాని, పాటలీపుత్రం నిశ్శబ్దంగా ఉంది. నగరం చుట్టూ ఉన్న కందకంలోని మొసళ్ళు దీర్ఘనిద్రలో ఉన్నాయి. రక్షక భటులు ఇంక ఆ రాత్రికి నగర ద్వారాలు మూసేశారు. నగరంలో యమద్వారం వైపునే కొంచెం సందడిగా ఉంది. దక్షిణం వైపున మదిరాలయాలు, వేశ్యల ఇళ్ళు ఉంటాయి. ఉత్తర దిశగా బ్రహ్మద్వారం వైపున రాజప్రాసాదం, బ్రాహ్మణులు నివసిస్తారు. వీధుల్లో అలికిడే లేదు.

సాదాసీదాగా ఉన్న ఇంటిలో, విశాఖ చెప్పే విషయాన్ని చాణక్యుడు శ్రద్ధగా విన్నాడు, నల్లని శరీరఛాయపై అతని అధ్యయన బల్లమీదున్న రెండు దీపాలకాంతి ఆగి ఆగి పడుతోంది. అతను వికారంగా ఉన్నాడు. శరీరమంతా మచ్చలు. కవళికలు మోటుగా ఉన్నాయి. అతని గుండు కర్కశంగా, నల్లగా, నునుపుగా ఉంది. నుదుటి మీద చందనంతో త్రిశూలం దిద్దుకున్నాడు. తల వెనుక శిఖ ఉంది. రాజ్యంలో ఉండే బ్రాహ్మణులందరికీ ఇది ఉంటుంది. ఒంటిపైన ముతకగా ఉన్న ఒకే ఒక నూలు వస్త్రం, యజ్ఞోపవీతం మాత్రమే ఉన్నాయి. అతను అరుదుగా నవ్వుతాడు, నవ్వితే అందవికారంగా ఉన్న పళ్ళు బయటికి కనిపిస్తాయని. అతనికి పుట్టినపుడు మొత్తం పళ్ళన్నీ ఉన్నాయి – పాలకుడి గుర్తు అది – కాని దివ్యదృష్టిగల ఒక యోగి ఇతను రాజుకన్న చాలా బలవంతుడవుతాడని జోస్యం చెప్పాడు – తన కాలంలో అత్యంత శక్తిమంతుడైన రాజప్రతిష్ఠాపకుడిగా అవుతాడని అన్నాడు. చాలామందికి అతను కౌటిల్యుడిగా తెలుసు– కుటిలుడు అని; బాల్యస్నేహితులకి విష్ణుగుప్తుడిగా తెలుసు; కాని దాదాపుగా అందరికీ చాణక్యుడిగా తెలుసు – మగధలో పేరొందిన గురువు, గొప్పవాడు, జ్ఞాని అయిన చణకుని ప్రసిద్ధ కుమారుడిగా తెలుసు.

హత్యకు సంబంధించి ఆమె ఇస్తున్న సవివరమైన వ్యాఖ్యానాన్ని వింటున్నప్పుడు అతని ముఖంలో ఉద్వేగం కాని, సంతోషంగాని లేశమాత్రంగా కూడ కనిపించలేదు. ఇతరులకు మనసులో మనమేమనుకుంటున్నామో తెలియజెప్పే విధంగా ఉండడం వల్ల ప్రయోజనం లేదని వివేకి అయిన వృద్ధ బ్రాహ్మణుడికి తెలుసు. తరచుగా 'ముగ్గురు రహస్యాన్ని కాపాడగలరు, వారిలో ఇద్దరు చనిపోతే' అంటాడతడు.

కాని లోలోపల నవ్వుకోకుండా ఉండలేకపోయాడు. బుద్ధిహీనుడైన పురుషోత్తముడు తన పక్కలో ఉన్నది అప్సరస విశాఖ అనుకున్నాడు – మిలమిల మెరిసే నక్షత్రం అనుకున్నాడు. విశాఖ తాను శిక్షణ ఇచ్చిన విషకన్య అని మూఢుడు తెలుసుకోలేకపోయాడు. నిజానికి, ఇటువంటి కన్యల సైన్యాన్ని తయారుచేసేటపుడు చాణక్యుడే వ్యక్తిగతంగా పర్యవేక్షించాడు. అతని రహస్య వేగులు చిన్నగా ఉన్న, వివాహ వయస్సు వచ్చినవారిని – జాతకంలో విధవలవుతారని చెప్పబడిన వారిని గుర్తిస్తారు. ఈ అందమైన అమ్మాయిలను చిన్నతనంలోనే తీసుకొచ్చి తక్కువ మోతాదులలో విషాన్ని ఇస్తూ, వారిలో విషానికి నిరోధకశక్తిని పెంచుతారు. చాణక్యుడి విషకన్యలు పుష్పవతులయ్యేసరికి పూర్తిగా విషపూరితులవుతారు. చిన్నముద్దు, లాలాజలం తగిలితేనే వృషభం లాంటి మనిషి కూడా చనిపోతాడు.

వెళ్ళి చంద్రగుప్తుడికి చెప్పు – ఇప్పుడతను మగధకి చక్రవర్తి అని – కుటిలుడైన బ్రాహ్మణుడు అతి సామాన్యంగా తన విషపూరిత విద్యార్థికి పురమాయించాడు మనసులో ఇదెలా మొదలైందో గుర్తుచేసుకుంటూ.

మగధరాజు ధననందుడు కోపంగా ఉన్నాడు. అతని బ్రాహ్మణ ప్రధానమంత్రి, విచక్షణాపరుడైన షక్తర్ ఉపదేశమిస్తున్నాడు అతనికి – భూమ్మీది దైవ ప్రతినిధికి! రాజుగారు మద్యపానం, విలాసాలకు తక్కువ సమయం కేటాయించి, మగధపౌరుల జీవితాలు మెరుగుపరచడానికి ఎక్కువ సమయం వెచ్చించాలని షక్తర్ కోరుకుంటున్నాడు. షక్తర్ లాంటి మేధావులంటే ధననందుడికి విసుగు, చిరాకు. అయినాగాని బ్రాహ్మణులకు మంత్రిమండలిలో ఆశ్రయం కల్పించినందుకు తనని అందరూ వివేకి అనుకుంటారని వారిని భరించేవాడు.

మగధ సభాభవనం పైకప్పుకి ఎనభై పెద్ద స్తంభాలు ఊతమిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన రాజుగారి ఆస్థానం అందమైన పరదాలతో, వస్తువులతో అలంకరింపబడి ఉంది. రాజప్రాసాదానికి కొంచెం దూరంలో బంగారుపూత

పూసిన దురఖీదేవి ఆలయం, బౌద్ధారామం, ఆయుర్వేద ఆసుపత్రి ఉన్నాయి - మగధ మత, భౌతిక, ఆధ్యాత్మిక ప్రగతులకు చిహ్నాలుగా.

ధననందుడు తన కుడివైపున ఉన్న మొదటికుర్చీని గమనించాడు. అది దేశంలో అత్యంత ముఖ్యుడైన బ్రాహ్మణుడికి కేటాయించినది - ప్రధానమంత్రి షక్తర్ కోసం. షక్తర్ ప్రస్తుతం రాజుగారికి ఉపదేశమివ్వడానికి నిలబడ్డాడు గనుక ఆ కుర్చీ ఖాళీగా ఉంది. ఆడంబరాల లంజాకొడుకు అనుకున్నాడు ధననందుడు. అందరూ స్వార్థపరులైన నీచులు... తమలో అత్యంత గర్విష్టులని మంత్రులుగా సిఫారసు చేస్తారు, తర్వాత ధననందుడి ధనాన్ని తమకు బిరుదులు, నిధులు, సత్కారాల కోసం వెచ్చిస్తూ, అతనికే బోధలు చేయాలని చూస్తారు - శక్తిమంతుడైన ధననందుడికి - రాచరిక విధులను గురించి! వారి కపటత్వం ఆగ్రహం తెప్పించిందతనికి. ధననందుడు తన పరిచారికల వైపు చూశాడు. మగధరాజు చుట్టూ ఆడవారుంటారు. వాళ్ళు ఎన్నో పనులు చేస్తారు. రాజుగారిని రక్షించడం, ఆయన మందిరంలోకి ఎవరినీ ప్రవేశించనీయకుండా నియంత్రించడం, ఆయన ఆహారం విషపూరితం కాదని నిర్ధారించేందుకు ఆయనకు పెట్టే ఆహారాన్ని ముందుగా తినడం, సందేశాలను అందించడం, కవచాన్ని శుభ్రం చేయడం, సంగీతంతో ఆయనని ఆనందింపచేయడం, స్నానం చేయించడం, వస్త్రాలు ధరింపచేయడం, ఆయన లైంగికావసరాలు తీర్చడం, రాత్రిపూట ఆయనను నిద్రపుచ్చడం.

ధననందుడికి సేవ చేయడానికి వెయ్యిమందికిపైగా పరిచారికలు, నర్తకీమణులు ఉన్నారు. పిల్లుల్లాగా వారు క్రూరస్వభావులు, యజమానిని రక్షిస్తుంటారు. ధననందుడు ఒంపుసొంపులతో అందంగా ఉన్న ఒకతెను చూసి ధూర్తుడిలా కన్నుగీటాడు. ఎదుటి మనిషిని చంపగల ఆమె శక్తి, సామర్థ్యాలు సౌందర్యం మాటున దాగి ఉన్నాయి. ఆమె అతనివైపు చూసి నవ్వుతూ అతనిలానే మళ్ళీ కన్నుగీటింది.

అలా కన్నుగీటడంతో ఆగ్రహం గట్టు తెగింది. సాధారణంగా ప్రశాంతంగా ఉండే షక్తర్ సహనం కోల్పోయాడు, కుళ్ళి చీముపట్టిన గాయం నుంచి చీము ఉబికి వచ్చినట్లుగా ఎన్నో ఏళ్ళ నుంచి అణుచుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'రాజా! మీ ఆస్థానంలో కాముకత్వం మూలంగా మీ రాజ్యంలో ఏ స్త్రీ కూడా సురక్షితంగా లేదు. అత్యాచారానికి గురై, హతులై గంగాతీరంలో అమ్మాయిలు కనిపించడం సాధారణమై పోయింది. ఆరా తీస్తే ఆధారాలు అన్నీ రాజప్రాసాదంలోకే దారితీస్తున్నాయి! అని ఉరిమాడు. ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యబలానికి అధిపతి అయిన ధననందుడు

ఆగ్రహంతో ఊగిపోయాడు. 'షక్తర్, జాగ్రత్తగా మాట్లాడు, లేకపోతే నీ నాలుక తెగ్గోస్తాను! నా ధర్మం మీద బతుకుతూ, ఇక్కడకొచ్చి మాట్లాడే హక్కుందని అనుకుంటున్నావా - ప్రపంచంలోనే' అత్యంత శక్తిమంతుడైన చక్రవర్తిని - నాకే ఎలా ఉండాలో నేర్పుతావా?' అంటూ నోటి నుంచి తెల్లటి ఉమ్మునురుగు బయటికి వస్తుండగా అరిచాడతడు. 'రాక్షసా! ఈ నీచుణ్ణి నందుడి నరకంలోకి తోసెయ్యి. చిత్రహింసలంటే ఏమిటో ప్రత్యక్షానుభవం కలిగించు' ఆంతరంగిక భద్రతా మంత్రి అయిన రాక్షసుడిని ఆదేశించాడు.

నందుడి నరకమంటే ధననందుడి చెరసాలలో హింసించే గది. దాని పర్యవేక్షకుడైన గైరికుడు నిజంగా రాక్షసుడే. చిన్నపిల్లవాడిగా ఉన్నపుడే చీమల్ని, ఈగల్ని, చుంచుల్ని, చేపల్ని పట్టుకొని హింసించి ఆనందించేవాడు. తర్వాత పిల్లులు, కుక్కల్ని కొక్కేలు, వలలు, వేడి మైనం, వేడినీళ్ళు, రాగికడ్డీలతో హింసించడంలో నిష్ణాతుడయ్యాడు. గైరికుడు పనిచేసే చోటినుంచి రోజంతా రక్తం గడ్డకట్టేలా భయంకరమైన అరుపులు వినిపిస్తుంటాయి. నిస్సహాయులైన ఖైదీల పళ్ళను రెంచిలతో పీకుతూ, మర్మాంగాలపై రాగిని కరిగించిపోస్తూ, పురీషనాళంలోకి ఎర్రగా కాల్చిన కడ్డీలు దోపుతూ ఖైదీలను హింసిస్తాడు.

రాక్షసుడు కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు. ఎర్రటి కడ్డీలను తల్చుకోగానే అతడికి మూలశంక ఎక్కువైంది. ముందు నుయ్యి వెనక గొయ్యిలా ఉందతని పరిస్థితి. రాజు మాట శిరసావహిస్తే ప్రజలంతా తనని రాజుగారి తొత్తు అంటారు - నిజానికి అలాంటివాడే - మాట వినకపోతే, ఆజ్ఞను ధిక్కరిస్తే తనే నరకంలోకి వెళ్ళవలసి ఉంటుంది.

నృత్యం, నాటకం, సంగీతం, సాహిత్యం, చిత్రకళలంటే అభిరుచి గల రాక్షసుడు సంస్కారమున్న, నాగరకతగల కళాకారుడు. తన కళాప్రపంచంలో అతని చుట్టూ అందగత్తెలు సౌందర్యంతో ప్రకాశిస్తూ ఉండేవారు. దానితో రాజ్యంలోని అత్యంత సౌందర్యవతులైన స్త్రీలను ధననందుడికి సమర్పించే సామర్థ్యం అతనికుండేది. రాజు దగ్గర ప్రాపకం లభించడానికి ఇదే కీలకం. రాక్షసుడిలోని రాజనీతిజ్ఞుడు ప్రత్యక్షంగా విభేదించడాని కిష్టపడలేదు. బుద్ధిహీనుడైన షక్తర్ ఎందుకీ విషయాలన్నీ తిరగదోడు తున్నాడు? రాక్షసుడు కుర్చీలోంచి అయిష్టంగా లేచి ప్రధానిని బంధించమని సైనికులను ఆదేశించాడు.

రాజప్రాసాదం వెలుపల ఒక వ్యక్తి బండరాతిమీద నిలబడి ధననందుడిపై విషం కక్కుతున్నాడు. 'మగధ పౌరులారా, ఈ క్రూరత్వం ఎంతోకాలంగా సాగుతోంది. మనరాజు ధననందుడు దోపిడీ దొంగ. తననెదిరించగల ఒకే ఒక మంత్రిని చెరసాలలో బంధించాడు.

వివేకి అయిన ప్రధాని షక్తర్‌ని, రాజ్యానికి రక్షకుడిని ఇలా అవమానిస్తుంటే మనం నిస్సహాయంగా నిలబడి చూస్తూ ఊరుకుందామా? ధననందుడి శిస్తు అధికారులు తమ ధాన్యాన్ని దోచుకుపోతుంటే ఇంకా ఎంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవాలి? రాజుగారి విలాసాల కోసం అత్యాచారానికి గురై మరణించిన కూతుళ్ళ శవాలపై పడి ఎంతమంది తల్లులు ఏడవాలి? ఇంకా ఎంతకాలం ఈ దుష్టరాజుని మనం భరించాలి?'

గుంపు చేరింది. మాట్లాడే వ్యక్తి సామాన్యుడైనవాడు కాదు మరి. చణకుడు - రాజ్యంలో అత్యంత గౌరవాస్పదుడైన గురువు - మేధావి చాణక్యుడి తండ్రి. ప్రధాని షక్తర్ ఆప్తమిత్రుడు. ఆంతరంగికుడు. భవిష్యత్తులో రాజ్యాధికారం చేపట్టవలసిన తమ కుమారులను చణకుడి దగ్గర శిక్షణ కోసం, విద్యాభ్యాసం కోసం పంపడానికి రాజులు తమలో తాము పోటీపడతారు.

రాజప్రాసాదం లోపల అంగరక్షకులు ప్రధాని షక్తర్‌ను బంధించి ఎన్నో రహస్య మార్గాల ద్వారా భూగృహంలోకి తీసుకెళ్ళారు. ప్రధాన అంగరక్షకుడితో షక్తర్‌ను మర్యాదగా చూడమని, గైరికుడు ఆయనకు దూరంగా ఉండాలని రాక్షసుడు నెమ్మదిగా చెప్పాడు. 'ప్రధాని తలవెంట్రుక ముట్టుకున్నా నేనే స్వయంగా గైరికుడి వట్టలు కోసి, వేయించి ఉపాహారంగా వాడికే తినిపిస్తానని నా మాటగా చెప్పండి' అని సహాయకుడి చెవిలో చెప్పాడు.

తర్వాత చేయవలసిన దాని గురించి రాక్షసుడు ఆలోచిస్తుండగానే రాజుగారి అంగరక్షకుల అధికారి గబగబా వచ్చి రాజుతో మాట్లాడాలన్నాడు. భయంతో వణుకుతున్న అధికారి ప్రాసాదం బయట పెద్ద గుంపు ఉందని, వారిని చణకుడు తిరుగుబాటు చేయమంటున్నాడని చెప్పాడు.

● ధననందుడికి ఆగ్రహం పెల్లుబికింది. ముఖం వికృతంగా అయింది. బయట కవాతు చేస్తున్న సైనికుల భేరీనాదంతో సమానంగా కంఠనాళాలు ఎగసిపడుతున్నాయి. 'లంజాకొడుకుని చంపెయ్యండి! చణకుడి తల నరికి గంగా తీరంలో వేలాడదీయండి ఇప్పుడే!' అని అరిచాడు. తమ చలచిత్తం ప్రభువు ఆజ్ఞను పాటించడానికి దురదృష్టవంతుడైన సేనానాయకుడు ఉద్యుక్తుడయ్యాడు. లేకపోతే తన తలే ధననందుడి భోజనశాలలో పళ్లెంలో ఉంటుందని, ఆస్థానంలోని ఆహార పరీక్షకులు ముందుగా దానిని రుచిచూసి తర్వాత దానిని అతనికి వడ్డిస్తారని అతను భయపడ్డాడు.

'ఆయన చనిపోయాడు విష్ణుగుప్తా, నాయనా, నీకిలా జరిగినందుకు నాకు బాధగా ఉంది రాజుగారి వేగులు అన్ని చోట్లా ఉన్నారు. నువ్వు పారిపోవాలి. వాళ్ళు నిన్ను వెతుకుతూ ఉంటారు' అన్నాడు ధననందుడి మంత్రిమండలిలో ఒక మంత్రి, చణకుడికి విధేయుడైన స్నేహితుడు కాత్యాయనుడు. ఆస్థానంలో ఉండగానే చణకుడి తల నరికిన వార్త విన్నాడు. వెంటనే చణకుడి కొడుకు విష్ణుగుప్తుణ్ణి హెచ్చరించడానికి వచ్చాడు.

'నేను పారిపోతే నాతల్లిని ఎవరు చూస్తారు? ఆమె ఎక్కడికీ కదలలేని వృద్ధురాలు', అన్నాడా అబ్బాయి.

'ఆవిడని నేను సంరక్షిస్తాను. దిగులు పడకు', అన్నాడు కాత్యాయనుడు హామీ ఇస్తున్నట్టుగా.

'మరి సువాసిని?' అని అడిగాడు విష్ణుగుప్తుడు. సువాసిని చెరసాల పాలైన ప్రధాని షక్తర్ కుమార్తె. విష్ణుగుప్తుడి ఆబాల్య ప్రేయసి.

'నిన్ను నువ్వు కాపాడుకోగలిగితే మిగిలినవారిని నేను సంరక్షిస్తాను, విష్ణుగుప్తా', అన్నాడు అసహనంగా కాత్యాయనుడు.

భావరహితంగా ఉన్న విష్ణుగుప్తుడి ముఖం చూసి కాత్యాయనుడు చకితుడయ్యాడు. దానిలో తిరస్కారం గాని ఆగ్రహంగాని లేవు.

'నన్ను విష్ణుగుప్తుడని పిలవకండి' పొగరుగాను, కోపంగాను ఉన్న ఆ అబ్బాయి కాత్యాయనుడితో అన్నాడు' ఈ రోజు నుంచి నాకున్న ఒకే ఒక గుర్తింపు చణకుడి కొడుకు చాణక్యుడనే!'

అమావాస్య – పక్షంలోనే చిమ్మచీకటిరాత్రి – కాత్యాయనుడు చెప్పినట్లుగా పని పూర్తి చేయడానికి చాణక్యుడు పూర్తిగా రెండు రోజులు సహనంతో నిరీక్షించాడు. వంటి నిండా నల్లగా అయ్యేవరకూ బొగ్గుపొడి, నూనె కలిపి రాసుకున్నాడు. వెన్నెల వెలుగు అస్సలు లేకపోవడం, చీకటిలో కలిసిపోయిన అతని రూపం రెండూ గంగా తీరంలో ఎవరూ గమనించకుండా వెళ్ళడానికి తోడ్పడ్డాయి.

కాత్యాయనుడి సూచనలను తుచ తప్పకుండా పాటించి నదీ తీరంలోని మర్రి చెట్టు ఎక్కడుందో కనుక్కున్నాడు. పండుగ రోజులలో పూజించే పవిత్ర వృక్షమది – ఈ విషయం తెలిసే సామాన్యులెవరూ దానిని తాకరని ధననందుడి భటులు ఆ చెట్టుకే చణకుడి తలను వేలాడదీశారు. చెట్టు దగ్గరికి వచ్చిన చాణక్యుడు చెట్టుమొదట్లో ఉన్న

నూనెదీపాన్ని పట్టించుకొనకుండా చెట్టెక్కాడు. చెట్టు మీద నుంచి వస్తున్న దుర్వాసన శిఖతో కట్టబడి బేతాళుడిలా తన ప్రియమైన తండ్రి తల ఏ కొమ్మకు వేలాడుతుందో అతనికి తెలియజేసింది.

నరకబడిన తండ్రి తల గాలికి ఊగడం చూసి చాణక్యుడి కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి. అతని తండ్రి కళ్ళు బాగా తెరచుకుని ఉన్నాయి. పురుగులు పండుగ చేసుకొనడంతో బుగ్గల స్థానంలో గుంటలు పడ్డాయి. అతనికిష్టమైన సూక్తిని గుర్తు చేస్తూ అతడి నోరు గట్టిగా మూసుకుని ఉంది – 'ఎక్కువగా మాట్లాడే వ్యక్తి అజీర్ణం వల్లో, ఉరి తీయబడడంవల్లో మరణిస్తాడు!' దురదృష్టవశాత్తు విధి దానిని నిజం చేసింది.

చాణక్యుడు సర్దుకొని, కొమ్మపైకి పాకి, శిఖను విప్పాడు. వీలైనంత మృదువుగా తలను పైకెత్తి చేతుల్లోకి తీసుకొని గౌరవంతో నుదుటి మీద చుంబించాడు. కన్నీళ్ళు వరదలా పారుతూ తండ్రి కపాలాన్ని తడిపాయి. ఈ క్షణం వరకూ అతనేడ్వలేదు. తాను ఏడ్చే ఒకే ఒక సందర్భం ఇది మాత్రమేనని నిశ్శబ్దంగా తనకు తాను ఒట్టు వేసుకున్నాడు; ఇక నుంచి చాణక్యుడు ఇతరులను ఏడిపిస్తాడు. వాళ్ళు చేసినదానికి ఫలితం అనుభవిస్తారు. తన కన్నీళ్ళకు రక్తంతో ప్రతీకారం తీర్చుకుంటాడు.

త్వరగా చెట్టుదిగాడు. తండ్రి తలను తనతో తెచ్చిన కొత్తబట్టలో చుట్టి నడుము పై భాగంలో కట్టుకుని చీకటిగా, అమంగళకరంగా ఉన్న నదిలోకి దూకాడు. చల్లటి నీళ్ళ వల్ల కలిగిన గగుర్పాటు కొద్ది నిముషాల్లోనే అణిగింది. గంగానదిలో ఈదుకుంటూ ఆవలి తీరంలో ఉన్న దుర్గాదేవి ఆలయం దగ్గరకు వెళ్ళాడు.

కాత్యాయనుడు రాజభటులకి లంచమిచ్చి చణకుడి శరీరాన్ని రహస్యంగా ఆలయ ఆవరణలోకి తేవడానికి ఏర్పాటు చేశాడు. హిందూ ఆచారం ప్రకారం శవాన్ని సూర్యాస్తమయంలోగా దహనం చెయ్యాలి. కాని చణకుడి మరణం సంభవించిన పరిస్థితుల దృష్ట్యా ఆచారాన్ని వదలాల్సి వచ్చింది. ధననందుడికి గనుక, చాణక్యుడు చణకుడికి దహనసంస్కారం చేస్తున్నాడని తెలిస్తే, అతడిని చంపడానికి తన తొత్తులను పంపేందుకు ఏమాత్రం సందేహించడు. ప్రవాహంలో పూర్తిగా తడిసి బయటకు వచ్చిన అతనికి ఎర్రని వస్త్రం ధరించి భయపడుతూ తన కోసం నిరీక్షిస్తున్న పూజారి కనిపించాడు. వెలుగుతున్న కాగడాను పట్టుకొని ఉన్న అతను మౌనంగా పేర్చిన చితివైపుకు రమ్మని చాణక్యుడికి సైగ చేశాడు. ఏమీ మాట్లాడకుండా చణకుడి తల ఉన్న మూటను తీసుకొని మిగిలిన శరీరంతో పాటు చితిపైన ఉంచాడు. ఒకసారి ప్రదక్షిణ చేసి చితిని అంటించమని

చాణక్యుడికి చెప్పి నిప్పుతో ఉన్న గడ్డిని అతనికి ఇచ్చాడు. చణకుడి శరీరాన్ని మంటలు చుట్టుముట్టగానే వెదురు కర్రను ఇచ్చి దానితో శవం తలను కొట్టమన్నాడు – ఇలా చేస్తే లోపల ఉన్న చణకుడి ఆత్మకు స్వేచ్ఛ లభిస్తుందని.

మంటలు చల్లారగానే ఒకసారి గంగానదిలో స్నానం చేసి రమ్మని చాణక్యుడికి చెప్పాడు పూజారి. తర్వాత అతనికి కాషాయరంగు వస్త్రాలనిచ్చాడు వేసుకొనడానికి. స్నానం చేసి, బట్టలు కట్టుకొన్న చాణక్యుడు పూజారి ఇచ్చిన మూటను తీసుకున్నాడు. అది కాత్యాయనుడు అతనికి ఇచ్చిన వీడ్కోలు కానుక, దానిలో అతని రక్షణ కోసం ఒక చిన్న కత్తి, అవసరాల కోసం ఏభై బంగారు పణాలు, తక్షశిల విశ్వవిద్యాలయం పీఠాధిపతికి ఒక లేఖ ఉన్నాయి.

తొమ్మిది వందల మైళ్ళ దూరంలో వాయవ్యంలో ఉన్న తక్షశిల ప్రపంచంలో మొట్టమొదటి విశ్వవిద్యాలయం. మూడువందల ఏళ్ళకు పూర్వం స్థాపించబడిన ఆ విశ్వవిద్యాలయంలో ఏటా అరవైకి పైగా విషయాలలో పది వేల మంది విద్యార్థులు పట్టాలు తీసుకొంటారు.

ఏడాదికి పైగా పట్టే సుదీర్ఘమైన కష్టమైన ప్రయాణాన్ని చాణక్యుడు ఆరంభించాడు.

రెండో అధ్యాయం

# వర్తమానం

కాన్పూర్‌లో బిర్హాణ మట్టిరోడ్డు రోజంతా తిండిపోతులకు ఆనందం కలిగిస్తుంది. రోడ్డుపక్కనున్న చిన్నదుకాణాల్లో నోరూరించే గోల్‌గప్పాలు, ఆలూటిక్కి, దహీకచోరి టీపి, కారం పిండివంటలు అనారోగ్యకరమైన పదార్ధాలతో చేసినవి – బాగా వేయించిన బంగాళ దుంపలు, పిండి, చక్కెర, ఉప్పుతో చేసిన వంటలు ఉంటాయి. లడ్డూలు, బర్ఫీ, కుల్ఫీ, జిలేబీలు, మలాయిమఖన్, గులాబ్‌జామూన్లు మరెన్నో రసాలూరే పిండివంటలు అమ్మే మిఠాయి దుకాణాలు తిండిపోతులను కొలెస్ట్రాల్ దాడి గురించి భయపెట్టలేవు. రోజంతా వీధిలో రద్దీగానే ఉంటుంది – నల్లని పొగ వెదజల్లే ఆటో రిక్షాలు, కార్లు, స్కూటర్లు, తోపుడుబళ్ళు, గేదెలు, ఆవులు మనుషులతో గాలి కలుషితమేగాని ఉద్విగ్నంగా ఉంటుంది. కార్బన్ మోనాక్సైడ్ కలిసిన చెమట, మూత్రం వాసనలు, వేయించిన ఆహార పదార్థాల వాసన, సమీపంలోని ఆలయాలలో వెలిగించే అగరొత్తుల ధూపం అన్నీ కలిసిపోతాయి.

బిర్హాణ రోడ్డు నానుకుని ఉన్న సందుల్లో ఒక దానిలో ఒకప్పుడు వైభవంగా ఉండి, ఇప్పటికీ పడిపోకుండా ఉండాలని ప్రయత్నిస్తున్న భవనం ఉంది. దానిలో రెండో అంతస్తు ఫ్లాట్‌లో కాన్పూర్‌లోనే మొట్టమొదటి చరిత్ర ప్రొఫెసర్ అయిన పండిట్ గంగాసాగర్ మిశ్ర ఉంటారు. అప్పుడే చక్కగా స్నానం చేసి తెల్లని నూలు కుర్తా, పైజమా వేసుకుని ప్రార్థన చేసుకుంటున్నాడు. ప్రార్థన చాప మీద ఉదయించే సూర్యుడికి ఎదురుగా తూర్పుకు తిరిగి కూర్చున్నాడు. ఇంటిలోని పూజామందిరంలో ఉన్న వెండి విగ్రహాలకు పూలు, అగరుధూపం, చందనం అర్పించాడు. దేవుళ్ళకి శుభోదయం పలికిన తర్వాత ఊగుతున్న మెట్లు దిగి వీధిలోకి నడిచాడు. యువకుడుగా ఉన్నపుడు పండిట్‌జీ అందగాడే. ఉన్నత వంశసంజాత లక్షణాలు, విశాలమైన నుదురు, గద్దముక్కులా ఉండే ముక్కు, బాగా తెల్లని

ఛాయ కాని పొట్టిగా ఉంటాడు. అయితే నెపోలియన్‌లా అతని ఆకారం కూడా మోసగిస్తుంది. నెత్తి మీద జుట్టు మొత్తం రాలిపోయింది. మిగిలిన నాలుగు పరకలనీ ఎడమ నుంచి కుడికి జాగ్రత్తగా దువ్వి పదిలంగా ఉంచుకున్నాడు.

తర్వాత గబగబా అరగంటసేపు మోతీఝీల్ చౌరస్తా దగ్గరున్న బనార్సీటీ హౌస్‌కు నడుస్తాడు. అక్కడ టీ అమ్మే వ్యక్తి ఆయన కోసం టీ తయారుచేసి ఉంచుతాడు. అంతకన్న మంచి టీని తాను చేసి ఇస్తానని పండిట్‌జీ పనివాడు చెప్పినా, ఉదయపు నడక, అలవాటైన టీ స్టాల్ మనుషులను కలవడం ఆయనకిష్టం. టీ తాగి, రెండు దుకాణాల అవతల ఉన్న పత్రికలమ్మే వ్యక్తి దగ్గర పత్రికలు తీసుకొంటాడు. మరో అరగంట తర్వాత ఇంటికొచ్చి లివింగ్ రూంలో కూర్చుని దేశవ్యాప్తంగా ఉన్న పత్రికల నుంచి వార్తలు చదువుతాడు. ఆయనకి పత్రికలు అమ్మే వ్యక్తి, స్థానికంగా కాన్పూర్, లక్నోల నుంచి వచ్చిన పత్రికలే కాకుండా ముంబయి, న్యూఢిల్లీ, కోల్‌కత, చెన్నైల నుంచి కూడా పత్రికలు తెప్పించి ఉదయాన్నే పండిట్‌జీకి ఇస్తాడు.

'పండిట్‌జీ రోజూ ఎందుకు అన్ని వార్తాపత్రికలు చదువుతారు?' ఆ పిల్లవాడు కుతూహలంతో అడిగాడు ఒక రోజు. "దేశంలో జరిగే ప్రతి విషయం నేను తెలుసుకోవాలి. లేకపోతే దేశాన్ని ఎలా పాలించగలను?" అని సమాధానమిచ్చాడు పండిట్‌జీ. నమ్మలేనట్లుగా తలను ఊపుతూ ఆ కుర్రాడు మరేమీ అనలేదు.

ఉదయం పదిగంటలకల్లా ముందు వచ్చే సందర్శకులను కలుసుకోవడానికి పండిట్‌జీ సిద్ధంగా ఉంటారు. ఆయన కార్యదర్శి – మీనన్ – తెలివైనవాడు. కేరళ వాసి. అప్పుడే వచ్చాడు. ఆయన ఉత్తరాలను పరిశీలిస్తున్నాడు. ఈ ఆచార్యుడి జీవితంలో మరో ముఖ్య కోణం ఉంది. ఆయన **అఖిల భారత నవనిర్మాణ సమితి**కి అధ్యక్షుడు. దీని పూర్తి పేరును సరిగా గుర్తుంచుకోలేని పాత్రికేయులు **అభానస** అంటారు దీన్ని. ఈ రాజకీయ సంస్థను పండిట్‌జీ చాలా ఏళ్ళ క్రితం స్థాపించారు. ఇది అసలు ఏమీ సాధించలేని స్థితి నుంచి ఎవరూ నిర్లక్ష్యం చేయలేని రాజకీయ పార్టీగా రూపొందింది.

'శుభోదయం, సర్' అన్నాడు మీనన్ అంగుళం మందంగా ఉన్న కాగితాల బొత్తిని పండిట్ గంగాసాగర్ మిశ్రకు ఇస్తూ. 'శుభోదయం, మీనన్, నన్ను కలవడానికి చాందినీని ఎన్ని గంటలకు రమ్మన్నారు?' అడిగాడు గంగాసాగర్.

'ఆవిడ పదకొండు గంటలకల్లా ఇక్కడ ఉంటారు. పార్టీ ఫిరాయించాలనుకునే ప్రతిపక్ష **ఎంఎల్‌ఏ**లను తీసుకొస్తారు' అన్నాడు మీనన్ నవ్వుతూ. ఆ రోజు గుర్తుంచుకోదగిన

రోజని అతనికి తెలుసు. ఈ రోజు **అభానస,** భారతదేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రం, న్యూఢిల్లీలో అధికారానికి కీలకమైన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని పడగొట్టి తన పార్టీ ముఖ్యమంత్రిని పీఠమెక్కిస్తుంది. దీని వెనుక ఉన్నది బనార్సీటీ హౌస్‌లో ప్రతి ఉదయం టీ తాగే, తనను తాను చరిత్ర ఉపాధ్యాయుడినని చెప్పుకునే సామాన్యుడైన పండిట్‌జీ.

పండిట్ గంగాసాగర్ మిశ్ర గురించి బాగా తెలిసిన వారికి మాత్రం ఆయనకి చరిత్రను బోధించడం కన్న, చరిత్రను సృష్టించడంపైనే ఆసక్తి అని తెలుసు.

గంగాసాగర్ 1929లో కాన్పూర్‌లో పుట్టాడు. గంగాతీరంలో ఉన్న నిరాడంబరమైన పట్టణం. కన్హయ్య (కృష్ణయ్య) పేరు మీద వెలసిన ఈ పట్టణాన్ని కాన్హపూర్ అనేవారు. మహాభారతేతిహాసానికి నాయకుడైన కృష్ణుడికి మరోపేరు కన్హయ్య. బ్రిటిష్ వాళ్ళు వచ్చి కాన్పూర్ అంటే బాగుందని కాన్హపూర్ పేరు మార్చి, ఏడు వేల మంది సిపాయిలతో పట్టణాన్ని ఆయుధాగారంలా మార్చివేశారు. సిపాయిలు 1857లో తిరుగుబాటు చేశారు. బహుశా కొత్తపేరు నచ్చలేదేమో.

గంగాసాగర్ తండ్రి మిశ్రగారు బీద బ్రాహ్మడు. నదీ తీరంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వసాయంతో నడిచే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బ్రతుకునీడ్చేవాడు. ఇద్దరు కూతుర్ల తరువాత కొడుకు పుట్టినప్పుడు అతనికి గంగ అంత విశాలమైన పేరు పెట్టాలని గంగాసాగర్ అని పేరు పెట్టాడు. గంగాసాగర్ తల్లి కుటుంబ కనీస అవసరాలను తీర్చడానికి నానాయాతన పడేది రోజూ.

కూతుళ్ళను అప్పులుగా, కొడుకులను ఆస్తులుగా భావించే సమాజంలో ఆమె బ్యాలెన్స్‌షీట్‌లో గంగాసాగర్ ఒక్కడే కూతుళ్ళ కట్నాన్ని సంపాదించగల ఆస్తిగా తోచాడామెకి. గంగాసాగర్‌కి బాగా పోషణ చెయ్యడానికని సంతోషంగా తను తినడం మానేసి అతనికి తిండిపెట్టేది.

శ్రాద్ధాలు పెట్టే పితృపక్షాల్లో హిందూ సంప్రదాయం ప్రకారం బ్రాహ్మలకు బాగా డిమాండు ఉండేది. సంపన్నులు తమ పూర్వీకుల స్మృత్యర్థం వీరికి భోజనాలు పెట్టి బట్టలు ఇస్తారు. మిశ్రగారిని బాగా పోషించే ధనవంతులలో వ్యాపారి అగర్వాల్ ఒకరు. శ్రాద్ధ దినాలలో వారింట్లో భోజనం చేయడం కోసం పిల్లవాడైన గంగాసాగర్ ఎదురుచూసేవాడు. భోజనంతో పాటుగా పాయసం ఎంత కావాలంటే అంత పెట్టేవారు.

ఒకనాడు అగర్వాల్‌గారి ఇంటి దగ్గర భోజనం చేస్తూ గంగాసాగర్ తండ్రినిలా అడిగాడు 'నాన్నా, శ్రాద్ధం అంటే పూర్వీకులను గుర్తుచేసుకోవడం కదా?'

'అవున్నాయనా. బ్రాహ్మలకు భోజనం పెడితే చనిపోయిన వారి ఆత్మలకు భోజనం పెట్టినట్లు అవుతుంది.'

'అయితే ఏదో ఒక రోజు నువ్వూ చచ్చిపోతావా?' విచారంగా తండ్రిని అడిగాడు గంగాసాగర్.

మిశ్రగారు నవ్వారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలు తమను ప్రేమించాలని ఎంతగానో కోరుకుంటారు. మిశ్రగారు కూడా అలాంటివాడే. తన మీద కొడుకుకు ఉన్న ప్రేమను చూసి ఆయన హృదయం ఉప్పొంగిపోయింది.

'గంగా, ఏదో ఒక రోజు ప్రతి ఒకరూ, నాతో సహా అందరూ చనిపోవాల్సిందే.'

గంగాసాగర్ మిన్ను విరిగి మీద పడినట్లుగా అయ్యాడు. జీడిపప్పు, కిస్‌మిస్‌లతో చేసిన పాయసాన్ని మరో ముద్ద మింగుతూండగా అతని కళ్ళలో నీళ్ళు నిండాయి. కొడుకుని చూసి మిశ్ర గారి హృదయం కరిగిపోయింది. తన మూలంగా కొడుక్కి కలిగిన బాధని తొలగించాలనుకున్నాడు. 'అయినా ఇటువంటి విషయాల గురించి ఎందుకు గంగా నీకు?'

'అది కాదు నాన్నా, నువ్వు చచ్చిపోతే మళ్ళీ మనం అగర్వాల్ గారింటికి పాయసం తినడానికి రాగలమా?'

మిశ్రగారు ఎలాగో కష్టపడి, తాను చదువు చెప్పే ప్రభుత్వబడిలో కాకుండా కొంచెం మంచి బడిలో గంగాసాగర్‌ను చేర్పించాడు. బుద్ధిగా ఉండమని గంగాసాగర్‌కు నూరిపోసేవాడు, కాన్పూర్‌లో మరో బడికి పంపడానికి అతనికి స్థోమత లేదు.

కొత్తబడికి వెళ్ళిన రోజే గంగాసాగర్‌ను టీచర్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పమన్నాడు. బాగా ఆత్మవిశ్వాసంగల గంగాసాగర్ సంతోషంగా అంగీకరించాడు. పాత విద్యార్థులు ఒకరివైపొకరు చూసి బాగా ప్రశ్నిస్తాడులే అనుకొన్నారు.

'అమెరికా మొదటి అధ్యక్షుడెవరు?' ప్రధానోపాధ్యాయుడు ప్రశ్నించాడు.

'జార్జి వాషింగ్టన్', గంగాసాగర్ చెప్పాడు.

'వెరీగుడ్' చిన్నతనంలో అతడేవో కొంటె పనులు చేశాడని చరిత్రలో ఉంది. అదేమిటి?'

'తండ్రి చెర్రీమొక్కను నరికేశాడు'.

'అద్భుతం. గంగాసాగర్. తండ్రి అతన్నేమీ అనలేదు ఎందుకో తెలుసా?'

'ఇంకా జార్జి వాషింగ్టన్ చేతిలో గొడ్డలి ఉండడం వల్లా?' అని అడిగాడు గంగాసాగర్ కూర్చుంటూ.

కొన్ని నెలల్లోనే హెడ్‌మాస్టర్‌గారి పేపర్లు దిద్దడం ఆరంభించాడు. ఆయనకి ప్రియశిష్యుడయ్యాడు. బడికి దీపావళి సెలవులు ఇచ్చే సమయం ఆసన్నమైంది. పరీక్షలైపోయాయి. హెడ్‌మాస్టర్‌కు పరీక్ష పేపర్లు దిద్దడంలో సాయం చేస్తున్నాడు - తనకిష్టమైన చరిత్ర పేపర్లు. తన సహ విద్యార్థులు రాసిన సమాధానాలు చూసి అతను నవ్వాడు.

'ప్రాచీన భారతదేశంలో ఎన్నో కట్టుకథలు. ఇవి తండ్రి నుంచి కొడుకుకు వారసత్వంగా వచ్చాయి. ఈ కట్టుకథలన్నిటినీ కలిపి పురాణం అంటారు'

'మొగ్లీలు గొప్ప పాలకులు మొగ్లీలలో గొప్పవాడు అక్బర్'.

'అప్పుడు బ్రిటిష్‌వాళ్ళు వచ్చారు. వారితో పాటు కొత్తగా క్రికెట్, ట్రాంలు ఆవిరి పట్టిన రైల్వేలు వచ్చాయి.

చివరికి బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని పరిపాలించసాగారు ఎందుకంటే మన ఏకత్వంలో చాలా భిన్నత్వం ఉంది గనుక. వాళ్ళు గొప్ప ఎక్స్‌పొటెంట్లు (expotents) మరియు ఇంపొటెంట్లు (impotents). వాళ్ళు భారతదేశం నుంచి ఉప్పును ఎక్స్‌పోటింగ్ చేస్తూ, వస్త్రాన్ని ఇంపోటింగ్ చేసుకున్నారు.

చాలా కష్టమైన ప్రశ్న చంద్రగుప్త మౌర్యుడి గురువైన చాణక్యుడికి సంబంధించినది. చాణక్యుడు రాజనీతి, అర్థశాస్త్రాలకు సంబంధించి రచించిన గ్రంథం అర్థశాస్త్రం అతని సొంతరచనా? లేక అంతకుముందున్న అభిప్రాయాలను క్రోడీకరించాడా?' అనేది ప్రశ్న. తెలివైన వాడైనా, ఒక బద్ధకస్తుడైన విద్యార్థి ఇలా రాశాడు. 'చాణక్యుడు చనిపోయాడు కాబట్టి ఈ ప్రశ్నకు సమాధానం దేవుడికే తెలుసు. హ్యాపీ దీవాలి'.

మార్జిన్లో గంగాసాగర్ 'దేవుడికి ఎ-ప్లస్, నీకు ఎఫ్. నీక్కూడా హ్యాపీ దీవాలి!' అని రాశాడు.

ఇది మిశ్రగారికి చివరి దీపావళి. జీవితం ఎన్నో కఠినమైన దెబ్బల్ని కొట్టింది ఆయన్ని. చివరికి ఒత్తిడి వల్ల ఆయన మరణించాడు. పదిహేనేళ్ళ వయసులో గంగాసాగర్ వృద్ధురాలైన తల్లి, పెళ్ళీడుకొచ్చిన ఇద్దరు చెల్లెళ్ళతో తండ్రి లేనివాడయ్యాడు. బడి మానేయాలని, కాలేజీ చదువును గురించి మర్చిపోవాలని ముందు ఏదైనా పని చూసుకోవాలని అతనికి తెలుసు. తండ్రిని పోషించిన అగర్వాల్‌గారే మొదటి దిక్కుగా కనిపించాడు. ఆయన గంగాసాగర్‌ని ఎప్పుడూ దయగా చూసేవాడు.

అగర్వాల్ గారి భవనం కాన్పూర్‌లో ఒకమూలకు నిర్జనంగా ఉండేచోట గంగాతీరంలో ఉంటుంది. పదెకరాల్లో పది పడకగదులున్న ఇల్లు. ప్రయివేటు నది ఒడ్డు కూడా ఉంది. అక్కడ రోజూ పదిమంది బ్రాహ్మణులు, మరో పదితరాల వరకు అగర్వాల్ గారి కుటుంబం అదృష్టంతో కళకళలాడాలని ప్రతిరోజూ పూజాదికాలు నిర్వర్తిస్తారు.

1864లో ఆకస్మాత్తుగా పత్తి వ్యాపారం పుంజుకొనడంతో అగర్వాల్ గారి తండ్రికి అదృష్టం కలిసొచ్చింది. పత్తి వ్యాపారానికి కీలక కేంద్రమైన కాన్పూర్ కాటన్ ఎక్ఛ్సేంజిలో ఆయన ప్రముఖుడయ్యాడు. అమెరికా అంతర్యుద్ధం సమయంలో బ్రిటన్‌కు పత్తి సరఫరా లేకపోవడంతో తన అవసరం తీర్చుకొనడానికి భారతదేశాన్ని ఆశ్రయించింది. పత్తి స్పెక్యులేషన్ పిచ్చి తీవ్రమై, వ్యాపారం అర్థరాత్రి వరకూ కొనసాగేది. వ్యాపారులు అంతర్జాతీయ పత్తి ధరలు తెలుసుకొన్న తరువాతే తమ ట్రేడింగ్‌ను ముగించేవారు. సీనియర్ అగర్వాల్‌కి స్పెక్యులేషన్ అంటే చాలా ఇష్టం. ఆ కాలంలో ప్రజలకు తెలియని విషయం ఏమిటంటే ఆయన నిజంగా అసలు స్పెక్యులేటర్ కాదు అని. సరళమైన మోర్స్‌కోడ్‌నుపయోగించుకొని తన సంపదనంతా సంపాదించాడు. తెలివైన మార్కెట్ ఆపరేటర్ ఇద్దరు వ్యక్తులను, ఒకరిని న్యూయార్క్‌లో, మరొకరిని టోక్యోలో నియమించాడు. న్యూయార్క్‌లో ఉన్న ఉద్యోగి మోర్స్‌కోడ్‌ను ఉపయోగించి టోక్యోలో ఉద్యోగికి పత్తి ధరను చెబుతాడు. టోక్యో ఉద్యోగి కోడ్‌లో కాన్పూర్‌లో సీనియర్ అగర్వాల్‌కు ధరలు చెప్పేవాడు. దీనితో ఇతరులకన్న గంట ముందుగానే అగర్వాల్‌కు ధరలు తెలిసేవి. అగర్వాల్ అదృష్టరహస్యం ప్రతిరోజూ అరవై నిముషాల ముందుగా రేటు తెలియడం అంతే కాని తెలివిలేని స్పెక్యులేషన్ కాదు.

సీనియర్ అగర్వాల్ తర్వాత ఆయన కొడుకు వారసుడయ్యాడు. అతనికీ తండ్రి నుంచి టక్కరితనం, జిత్తులమారి తెలివి సంక్రమించాయి. తండ్రి అమెరికా అంతర్యుద్ధాన్ని ఉపయోగించుకొని వ్యాపార ప్రయోజనాలు పెంచుకుంటే, జూనియర్ కూడా రెండో ప్రపంచ యుద్ధాన్ని ఉపయోగించుకొని ఇలాగే చేశాడు. ఇరవై అయిదు లక్షలమంది మనుషులను పంపి, 80శాతం జాతీయాదాయాన్ని బ్రిటిష్‌వాళ్ళ యుద్ధం కోసం బ్రిటిష్ కాలనీ అయిన ఇండియా ఖర్చు చేస్తే, వీటన్నిటికీ సంబంధించిన సరఫరాలను అందించి ఎక్కువ లాభాలను ఆర్జించాడు జూనియర్ అగర్వాల్. అలాగని అగర్వాల్ గారు బ్రిటిష్‌వాళ్ళ పక్షం కాదు. ఆయన భవిష్యత్తు తెలిసిన వ్యవహారదక్షుడు. బ్రిటిష్ వాళ్ళు భారతదేశం వదిలిపెట్టిపోవడానికి ఎంతో సమయం పట్టదని ఆయనకి తెలుసు. అందుకనే దానికోసం స్వాతంత్ర్యోద్యమానికి కూడా పెద్ద మొత్తాల్లో విరాళాలు ఇచ్చాడు.

గంగాసాగర్ చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు గాంధీగారు కాన్పూర్ వచ్చారు. అప్పుడు అగర్వాల్‌గారి ఇంటిలోనే బస చేశారు. భారత జాతీయ కాంగ్రెసు నలభయ్యవ వార్షిక సమావేశానికి హాజరు కావడానికి గాంధీజీ అలహాబాదు నుంచి వచ్చారు. ఆయనకు స్వాగతం పలకడానికి రైల్వేస్టేషన్‌లో ఇరవై ఐదు వేల మంది గుమికూడారు. అగర్వాల్ గారు గాంధీగారిని వెంటబెట్టుకుని ఇంటికి తీసుకొచ్చారు. గాంధీగారికి చేదోడుగా గంగాసాగర్ ఉంటాడని మిశ్రగారు అన్నారు. వెంటనే అగర్వాల్ గారు ఒప్పుకొన్నారు.

పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో గాంధీగారు ఉపన్యాసమిచ్చారు. సహాయ నిరాకరణోద్యమానికి మద్దతునివ్వమని, దాన్ని బ్రహ్మాండంగా విజయవంతం చేయమని అక్కడి జనసందోహాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమం అయిన తర్వాత తామిద్దరే ఉన్నపుడు ఆ మహానాయకుడిని అగర్వాల్ గారు అడిగారు, 'బాపూ, బ్రిటిష్ వాళ్ళతో పోరాడగలననే నమ్మకం మీకెలా కలిగింది?'

మహాత్మాగాంధీ చిరునవ్వు నవ్వారు. 'మనం గెలుస్తాం. ఎందుకంటే, మన నాలుగు దశల పోరాటంలో ఇప్పుడు మూడో దశలో ఉన్నాం' అన్నారాయన.

'నాలుగు దశల పోరాటమా?' అగర్వాల్‌గారు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

'మొదట, వాళ్ళు నిన్ను పట్టించుకోరు, రెండు నిన్ను చూసి నవ్వుతారు, మూడు నీతో పోరాడతారు, నాలుగు నువ్వు గెలుస్తావు. అదే నాలుగో దశ మిత్రమా', అన్నారు మహాత్మ చాలా మామూలుగా. గాంధీగారి పాదాలు ఒత్తుతున్న పిల్లవాడు వివేకి అయిన

నాయకుడి మాటలు చాలా శ్రద్ధగా విన్నాడు. సందేహిస్తూ, 'బాపూ, బ్రిటిష్ వాళ్ళకి తుపాకులు, పోలీసులు ఉన్నారు. నేను చిన్నపిల్లవాణ్ణి. వాళ్ళతో నేనెలా పోరాడగలను? వాళ్ళెంతో బలవంతులు!' అన్నాడు.

బాలుడైన గంగ తలపై గాంధీ ఆత్మీయంగా తన చేతిని ఉంచి, బలం శారీరక సామర్థ్యంవల్ల రాదు. అచంచలమైన పట్టుదల వల్ల వస్తుంది. అది నీలో నాక్కనిపిస్తోంది నాయనా' అన్నారు. ఆ రోజు నుంచి, తనక్కూడా ఏదో ఒక రోజున సామ్రాజ్యాలను నెలకొల్పడానికి గాని, విచ్ఛిన్నం చేయడానికిగాని కావలసినంత శక్తి ఉంటుందని గంగాసాగర్‌కి తెలిసింది.

గంగాసాగర్ అగర్వాల్ గారి ముందు ఇబ్బందిగా కూర్చున్నాడు. పాశ్చాత్య దుస్తులు వేసుకున్నాడు గాని అవి అతనికి అంతగా నప్పలేదు. అతని చెంపలు పొడవుగా, కింద వెడల్పుగా వున్నాయి ఎల్విస్ స్టైల్లో. కొట్టొచ్చినట్టుగా కనిపించే అతని ముక్కు మందపాటి ఫ్రేమున్న కళ్ళజోడుకు తగినంత పార్కింగు ప్లేస్‌నిచ్చేలా ఉంది. తలకి బాగా నూనె రాసుకుని ఎడమ పాపిడి తీశాడు. లేతరంగు పొడుగు చేతుల చొక్కా, పాత బెల్‌బాటమ్ ప్యాంటు వేసుకున్నాడు. గడ్డం చేసుకున్నాడు. తెల్లగా ఉన్నాడు. ఎత్తు అయిదడుగులపైన కొంచెం ఉండి పొట్టిగా ఉన్నాడు. తన సైజు కన్న రెండంగుళాలు పెద్దగా ఉన్న బూట్లు వేసుకున్నాడు. 'ఇంక ఎవరిని సాయమడగాలో నాకు తెలియదు' అన్నాడు సందేహిస్తూ యువకుడైన గంగాసాగర్. 'సర్, మీరు నాకేదైనా ఉద్యోగం ఇస్తారని ఆశపడుతున్నాను. మీరేం చేయమన్నా చేస్తాను. కష్టించి పనిచేస్తానని ప్రమాణం చేస్తున్నాను. దయుంచి నాకు సాయం చెయ్యండి' వేడుకోలుగా అన్నాడు.

అగర్వాల్‌గారు కుంకుమ పువ్వు, యాలకులు సువాసన వచ్చే పొగాకు హుక్కాను ఒకసారి పీల్చి ఆ యువకుణ్ణి చూసి చిరునవ్వు నవ్వారు. 'నాకు సొంత కొడుకులు లేరు గంగాసాగర్. నీకు ఉద్యోగం ఇస్తాను కాని బానిసలా పనిచేయిస్తాను. నీ జీతం నెలకు ఇరవై అయిదు రూపాయలు ఇష్టమేనా?'

'ఈ విషయంలో మీరు పశ్చాత్తాపపడరు సర్. నేనెంతో అదృష్టవంతుణ్ణి'.

'నేనూ అదృష్టాన్ని నమ్ముతాను నాయనా. నేనెంత కష్టించి పనిచేస్తే, అది నాకు అంత ఎక్కువగా ఉంటుందని అనుకుంటాను' అని అగర్వాల్‌గారు జోక్ చేశారు.

మొట్టమొదటి పాఠాలు బుక్ కీపింగ్, అకౌంటెన్సీకి సంబంధించినవి. అగర్వాల్ గారి లెక్కలను నమ్మకస్థుడైన మార్వాడి మునీమ్ - కోశాధికారి - చూస్తారు. డబుల్ ఎంట్రీబుక్ కీపింగ్ మెలకువలను యువకుడికి నేర్పే బాధ్యతను ఆయనకి అప్పగించారు.

మొదటిరోజు 'గంగాసాగర్, రెండూ రెండూ కలిపితే ఎంత?' అని అడిగాడు మునీమ్.

'నాలుగు' అన్నాడు గంగాసాగర్.

'తప్పు చెప్పావు. మరోసారి అడుగుతానులే'.

కొన్నాళ్ళ తర్వాత ప్రైమరీ బుక్స్ మెయింటినెన్స్, లెడ్జర్ పోస్టింగ్, ట్రయల్ బాలన్స్ తయారుచేయడం వరకూ వచ్చారు. మళ్ళీ మునీమ్ అడిగారు 'గంగాసాగర్, రెండూ, రెండూ కలిపితే ఎంత?'

'నాలుగు' సమాధానమిచ్చాడు గంగాసాగర్.

'తప్పు. మరో అవకాశమిస్తాను కరెక్టుగా చెబుదువుగాని'

కొన్ని వారాల తర్వాత ఆదాయ గుర్తింపు, ఖర్చుల అంచనా, లాభ నష్టాల స్టేటుమెంటు ఖరారు కూడా పూర్తయ్యాయి.

'నీకిది చివరి అవకాశం. రెండూ, రెండూ కలిపితే ఎంత?' మునీమ్ అడిగారు.

విసిగిపోయిన పిల్లాడు 'మీరెంతనుకుంటే అంత!' అన్నాడు రకీమని.

'సరైన సమాధానం' మునీమ్ నవ్వారు. 'చివరికి అకౌంటింగ్‌లో సౌలభ్యం అర్థమైంది!'

అగర్వాల్ రక్తంలో లాభముంది. ఏదైనా సరే కొని లాభానికి అమ్మడం అంటే అగర్వాల్‌కి ఇష్టం. తనో గొప్ప గురువు చేతిలో పడ్డానని గంగాసాగర్‌కి త్వరలోనే అర్థమైంది. ఒకరోజు అగర్వాల్‌గారు, మునీమ్ మాట్లాడుతున్నప్పుడు అక్కడే ఉన్నాడు.

'మునీమ్ గారూ మనం జనపనార వ్యాపారం ఎందుకు చేయడం లేదు?'

'అయ్యా, లాభాలు చాలా తక్కువ. కష్టానికి తగ్గలాభాలు రావు'.

'అయినా ఎగుమతి చేయవచ్చు కదా?'

'ఎగుమతి రేట్లు మన దేశీయ కొనుగోలు ధరలకన్న కూడ చాలా తక్కువ. మనం సరుకు కొని తక్కువ ధరలకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. అయ్యా, నష్టం తెచ్చే ప్రతిపాదన'.

'మనం జనపనార బదులు జనపనార రద్దుని ఎగుమతి చేసి దాన్ని జనపనార అంటే పోలా? అది కూడా జనపనారే కదా'.

'అయ్యా, మనదగ్గర్నించి? రద్దుని ఎవరు కొంటారు?'

'నేను'.

'అయ్యా, మీ ఉద్దేశ్యమేమిటి?'

'మీ రద్దుని అగర్వాల్ హాంగ్‌కాంగ్ కొనేలా చేస్తే ఎలా ఉంటుంది? భారతదేశంలో జనపనార రద్దుని కొనొచ్చు – దానికేం పెద్ద ఖర్చవదు – దాన్ని మన విదేశీ అనుబంధ సంస్థకు జనపనార అని చెప్పి అమ్మితే'.

'లాభం కూడా ఉత్తుత్తిగానే ఉంటుంది. మన భారతదేశ సంస్థ లాభం చూపిస్తే, విదేశీ సంస్థ నష్టం చూపిస్తుంది. అప్పటికీ ఇది సున్న వచ్చే లెక్కే.'

'కాదు, మునీమ్‌గారూ, మనం సరుకును ఎగుమతి చేస్తే దానికి సమానమైన విలువగల దిగుమతి లైసెన్సులను ప్రభుత్వం ప్రోత్సాహకాలుగా ఇస్తోంది. ఈ లావాదేవీలో తప్పనిసరిగా మనకు లాభం రాకపోవచ్చు. కాని దిగుమతి లైసెన్సుల ప్రీమియంతో దాన్ని పూడ్చుకోవచ్చు!'

తన గురువుగారి జిత్తులమారి తెలివితేటలు తనకూ వచ్చేవరకూ ఓవర్‌టైం పనిచేస్తానని గంగాసాగర్ ఒట్టు పెట్టుకున్నాడు.

ఒకనాటి ఉదయం అగర్వాల్‌గారు నడకకు వెళ్ళారు. మామూలుగా ఆఫీసు వైపు నుంచి నడుస్తారు. చలికాలం ఉషస్సు ఇంకా కాన్పూర్‌లో చాలామంది గాఢనిద్రలో ఉన్నారు.

యజమాని రావడం చూసి సెక్యూరిటీ గార్డు చురుగ్గా సెల్యూట్ చేశాడు.

'రాం రాం, సాహెబ్', అన్నాడు

'రాం రాం గౌరీప్రసాద్. ఆఫీసులో లైట్లున్నాయేమిటి? ఈ వేళలో ఆఫీసులో ఎవరున్నారు?'

'గంగాసాగర్ వేశారు' అన్నాడు గార్డు.

'ఇంత ప్రొద్దున్నే ఆఫీసుకి వస్తాడా గంగాసాగర్?' అని అడిగారు అగర్వాల్‌గారు ఆశ్చర్యంగా.

'లేదు. సాహెబ్. చాలా రోజులు ఆయన పొద్దున్నే రారు' అని చెప్పాడు గౌరీప్రసాద్.

'సర్లే! అతనికి తల్లి ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళతో కూడా కొంత సమయం గడపాలి కదా' అన్నారు అగర్వాల్ గారు.

'అది కాదు సాహెబ్. ఆయన చాలా రోజులు రాత్రులు ఇంటికి వెళ్ళరు కనుక ఉదయాన్నే రారు'.

గంగాసాగర్ ఒక ఆలోచనను చర్చిస్తూ యజమానితో ఆఫీసులో ఉన్నాడు. అగర్వాల్ గారికి ఎప్పుడూ లాభసాటి ఆలోచనలే వస్తాయి. ఇప్పుడు తాజాగా కలిగిన ఆలోచన బంగారం చుట్టూ తిరుగుతోంది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. అగర్వాల్ గారు ఆశపడడానికి కారణముంది.

'బంగారం విలువతో అమెరికా డాలరు ఎప్పుడూ అనుసంధానించి ఉంటుంది. ఇటీవలి వరకు ట్రాయ్ ఔన్సు బంగారం ధర ఇరవై డాలర్లు. కాని ఇటీవల జరిగిన ప్రపంచ యుద్ధం దానిని మార్చేసింది. డాలర్ విలువ పడిపోయింది. ఒక ట్రాయ్ ఔన్స్ బంగారం ధర ఇప్పుడు ముప్ఫయి ఐదు డాలర్లు' అన్నారు అగర్వాల్.

'అయితే?' గంగాసాగర్ అడిగాడు.

'గంగాసాగర్, దీనర్థం ఏమిటంటే, ఒక డాలరు విలువ ఔన్సు బంగారంలో ముప్ఫయి అయిదో వంతు అని'.

'అది మనకు అవకాశం ఎలా అవుతుంది?'

'అమెరికా ప్రభుత్వం డాలరు విలువను బంగారంతో అనుసంధానించినా, డాలరు నికర విలువ పడిపోతూ ఉంటుంది. యుద్ధలోటును భర్తీ చేసుకొనడానికి ఎక్కువ డబ్బుని ముద్రిస్తారు కనుక'.

'అయితే?'

'డాలరు నికర విలువ పడిపోతున్న కొద్దీ, బంగారం నికర విలువ తప్పనిసరిగా పెరగాలి'.

'అయితే దీనిలో లాభసాటి అవకాశం ఉందా?'

'కేవలం అవకాశం మాత్రమే కాదు – ధరల తేడా బేరం ఉండే అవకాశం'

'నాకర్థం కాలేదు'.

'సింపుల్. నా దగ్గర ఒక డాలరు ఉంటే, దాన్ని ఒక ఔన్సు బంగారంలో ముప్ఫయి అయిదోవంతుకి మార్చుకోవచ్చు కదా?'

'అవును'

'కాని ఆ ఔన్సు బంగారంలోని ఆ భాగం నికర విలువ డాలరు విలువ కన్న చాలా ఎక్కువ కాదా?

'అవును'

'మనం డాలర్లు కొని, అధికారిక బంగారం ధరకు మార్పిడి చేసుకుంటే, ఏం జరుగుతుంది?'

'మనకు లాభమొస్తుందా?'

'వస్తుంది. మరింక దేనికాలస్యం?'

డాలర్‌తో బంగారం ధరల తేడా వ్యాపారం చేస్తూ అగర్వాల్ గారు తన కంపెనీకి లక్షలు సంపాదించారు. గంగాసాగర్ చూశాడు, విన్నాడు, గ్రహించాడు.

మరో సందర్భంలో పత్తి వ్యాపారం. బ్రిటిష్ వాళ్ళ నుంచి భారతదేశం ఇంతకు ముందే స్వాతంత్ర్యాన్ని సంపాదించింది. కొత్త ప్రభుత్వం పాలిస్తోంది.

'బట్టల మిల్లుల్ని జాతీయం చేయాలని పరిశ్రమల కొత్త మంత్రి అనుకుంటున్నాడు' అన్నారు అగర్వాల్ గారు మామూలుగా.

'మనకేం కాదు. మనం వ్యాపారులం, వస్త్రాల ఉత్పత్తిదారులం కాదు' అని గంగాసాగర్ జాగ్రత్తగా సమాధానం చెప్పాడు.

'పారబడుతున్నావ్. దీనివల్ల మనకీ నష్టమే. పరిశ్రమ పడిపోతుంది'.

'అయితే?'

'పత్తి ధరపడిపోతుంది'

'దాని వల్ల మనకేం నష్టం?'

'పత్తిని నాకు షార్ట్‌సెల్ చెయ్యండి'

'హు!?'

'ఈ రోజు పత్తిని అమ్మి తర్వాత తక్కువ ధరలో కొనాలి'.

'కాని జాతీయీకరణ వెంటనే జరిగితే, ఈ రెండు లావాదేవీలు సమర్థంగా చేయడానికి తగినంత సమయం ఉండదండీ'.

'మంత్రి జాతీయీకరణ నాటకాన్ని కొంతకాలం తర్వాత జరిపేలా చూడాలి మనం.'

'ఎలా?'

'ఈ లాభసాటి పథకంలో అతను మనతో భాగస్వామి ఎలా అవ్వచ్చో మనం చెబుతాం'

వ్యాపారానికి, రాజకీయాలకి ఉన్న వావివరసల్లేని సంబంధాన్ని గంగాసాగర్ అర్థం చేసుకొనడం మొదలుపెట్టాడు.

రాత్రి అయింది. గంగాసాగర్ ఆఫీసు నుంచి బయల్దేరాడు. ఇంతలో అగర్వాల్ గారు అతన్ని తన కాబిన్‌లోకి పిలిచారు. 'వచ్చే అయిదేళ్ళలో ఆనకట్టలు, రోడ్లు, వంతెనలపై దేశం బాగా పెట్టుబడి పెడుతుందని ప్లానింగ్ కమిషన్ ప్రకటించింది' అని చెప్పాడు.

'మనం నిర్మాణ వ్యాపారంలో లేము కదా' గంగాసాగర్ తన గురువుకు నెమ్మదిగా గుర్తుచేశాడు.

'అయితే ఏమైంది. మొదలుపెడదాం'

'అది ప్రత్యేకమైన పరిశ్రమ. మనం వ్యాపారులం, సర్'. మనకి నిర్మాణం గురించి అస్సలేమీ తెలియదు'.

'కంపెనీ పెట్టు చాలు. లక్ష్మీ అండ్ కోకి పదిశాతం షేర్లు కేటాయించు. కంపెనీ షేరు స్టీలు, సిమెంట్ సరఫరాదార్లని రిజిస్టర్ చేయించు'.

'దేనికి?'

'నిర్మాణ సామగ్రి కావాలని ఆర్డర్లు పెట్టడం ఆరంభించవచ్చు'

'కాని మనకేం ప్రాజెక్టులు లేవు! చేతిలో ప్రాజెక్టులు లేకుండా సామగ్రి ఎందుకు కొంటాం?'

'ఎందుకంటే, ఒక ఏడాది తర్వాత నిర్మాణ కంపెనీని అమ్మాలనుకుంటాం'.

'కాని ప్రాజెక్టుల్లేని నిర్మాణ సంస్థనెవరు కొంటారు?'

'ఇతర నిర్మాణ సంస్థలేవైనా కొంటాయి, ఎందుకంటే స్టీల్, సిమెంట్ ఎక్కువ స్థాయిల్లో ఉన్న కొద్ది సంస్థల్లో మనదీ ఒకటవుతుంది కనుక. ఈ రెండిటికీ కొరత ఏర్పడుతుంది'

'ఒకవేళ ఆర్థికమంత్రి దొంగ నిలవ చేశామని మనల్ని నిందిస్తే?'

'ఎలా నిందించగలడు? లక్ష్మీ అండ్ కో ఆయన అల్లుడిదే.'

గంగాసాగర్‌తో 'నువ్వోసారి పాట్నా వెళ్ళిరావాలి' అన్నారు అగర్వాల్‌గారు.

'మీరెక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళతాను' అన్నాడు గంగాసాగర్.

'ఎందుకో తెలుసుకోవాలని లేదా?' అతని గురువు ప్రశ్నించారు.

'ముఖ్యమనిపిస్తే మీరే చెబుతారుగా', అన్నాడా యువకుడు.

'నీకు తెలుసుగా. పాట్నా బీహారు రాజధాని. బీహార్‌లో ఖనిజ నిల్వలు బాగా ఉన్నాయి. ప్రత్యేకించి ముడి ఇనుము'.

'అయితే?'

'ప్రభుత్వం గనుల తవ్వకానికి రాయితీలిస్తోంది. మనక్కూడా కొంత భాగం ఉంటే బాగుంటుంది'.

'నన్నేం చేయమంటారు సర్, మీరు?'

'ప్రభుత్వానికి ఖనిజ నిల్వలు ఎక్కడున్నాయో తెలియదు. బిడ్ వేసే ముందుగానే నేలలోపల ఏముందో నేను తెలుసుకోవాలి, తర్వాత కాదు'.

'ఇనుప ఖనిజం కోసం పొరపట్టుకొని నన్ను తవ్వమంటారా?'

'లేదు. నువ్వు నా స్నేహితుడిని కలవాలి. ఆయన ఆర్ఎఎఫ్‌లో ఫైటర్ పైలెట్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం పాట్నాలో ఉంటున్నాడు.'

'నేలలోపల ఏముందో చూడడానికి బాంబులు వేద్దామా?'

'వేళాకోళం ఇంక చాలు గంగా. ఆయన్ని కలవడమెందుకో నీకు అర్థమవుతుంది. ఇది బాగా సులభమైన, హుందాయైన పరిష్కారం'.

స్క్వాడ్రన్ లీడర్ మోహన్‌లాల్ స్కాచ్ అండో సోడా మనిషి. విస్కీ ఆయన జీవితామృతం, ఏం తాగినా ఆయన గుబురు మీసాలు మంచి ఫిల్టర్‌లా పనిచేస్తాయి. ఢిల్లీ ఫ్లయింగ్ స్కూల్‌లో విమానాలు నడపడం నేర్చుకుని ఇండియన్ పోస్ట్‌లో ఉద్యోగిగా చేరాడు. అప్పుడు జర్మనీలోకి హరికేన్లు తీసుకెళ్ళే ఇరవై నాలుగు మంది సభ్యులున్న ఇండియన్ స్క్వాడ్‌లో చేరాలని బ్రిటిష్ రాయల్ ఎయిర్ ఫోర్స్ ఆయనని కోరింది.

చివరి దాడిలో తన డేష్‌బోర్డు మొత్తం పోయిందని అతనికి హఠాత్తుగా తెలిసింది. ఇంజను రొదలో దాన్ని గమనించలేదు. ఇంగ్లీషు ఛానెల్‌పైన పద్దెనిమిదివేల అడుగుల ఎత్తులో నల్లని పొగ, హరికేన్ ఇంజిన్ నుంచి ఆయిలు బయటికి రావడం మొదలైంది. ఏడువేల అడుగుల ఎత్తులో ఉన్నపుడు గ్రౌండ్ కంట్రోల్ ఛానెల్‌లో దూకేయమని చెప్పింది ఆయనకి. తర్వాత బోటులో తీసుకొస్తామన్నారు.

'బోటు పంపవద్దు' అని రేడియోలో సమాధానమిచ్చాడు. 'ఎందుకని?' ఆపరేటర్ అడిగాడు. 'ఎందుకంటే నేనీది చావలేను అందుకు!' అని అరిచాడు. మోహన్‌లాల్ డోవర్‌లోని మంచు శిఖరాలవైపు ఎగిరాడు కాని, విమానం లాండింగ్ గేర్ తెరవగానే హరికేన్‌లో మంటలు చెలరేగాయి. ఆయనెలాగో క్రాష్ లాండయ్యాడు. మండుతున్న శిథిలాల నుంచి ఎలాగో బయటికి తీశారు. ఆసుపత్రి భోజనం అంతగా రుచించలేదు కాని నర్సు, స్కాచ్ బాగా నచ్చాయి. త్వరలోనే నర్సులా స్కాచ్ ఎప్పటికీ తన మనసు మార్చుకోదని, అతనికి అర్థమైంది.

యుద్ధం ముగిసింది, మోహన్‌లాల్ భారతదేశం తిరిగి వచ్చేశాడు. ఆర్‌ఎఎఫ్ ఇచ్చిన ఉదార పెన్షన్‌తో పాత హాకర్ హార్ట్‌తో లిమిటెడ్ రూట్ ఎయిర్ చార్టర్ సర్వీసును ప్రారంభించాడు.

అదే ఇప్పుడు అగర్వాల్ గారు చెప్పిన అద్భుతమైన, సులభమైన, హుందాయైన పరిష్కారం చూపించేది.

'అదిగో కింద కనిపించేదే పాట్నా నగరం' అన్నాడు మోహన్‌లాల్ హాకర్ హార్ట్ వేగంగా ఒకవైపుకి ఒరుగుతుండగా. గంగాసాగర్ తన బ్రేక్‌ఫాస్ట్‌ని విసిరేయడానికి సిద్ధమయ్యాడు, ఎముకలు కొరికే చలిలో ఉదయాన్నే అయిదుగంటలకి అక్కడికి రప్పించినందుకు అగర్వాల్‌గారిని, మోహన్‌లాల్‌ని తిట్టుకున్నాడు. ఆ విమానంలో ఒకరి వెనుక ఒకరు ఇద్దరు కూర్చోవచ్చు.

'రైల్వే లైన్లకు దక్షిణంగా ఉన్న శిథిలాలను చూశారా? అదే కుంహ్రార్ – ప్రాచీన పాటలీపుత్రనగరానికి సంబంధించిన శిథిలాలు. దాని నుంచే పాట్నా అనే పేరు వచ్చింది' మొదటిసారి విమానయానం చేస్తున్న తన ప్రయాణికుడి ఇబ్బందిని అర్థం చేసుకోకుండా గట్టిగా చెప్పాడు మోహన్‌లాల్. ఇద్దరూ బి–8 గాగుల్స్, ఆర్‌ఎఎఫ్ హెల్మెట్లు, ఎ–2 బాంబర్ జాకెట్లు 1941 ఆర్‌ఎఎఫ్ మే వెస్ట్ పారాచూట్ బ్యాక్‌ప్యాక్‌లు ధరించారు. మోహన్‌లాల్ చూపించేదాన్ని చూడడానికి గంగాసాగర్ భయంగా ఎయిర్‌క్రాఫ్ట్ పక్కకు వంగి చూశాడు.

'రెండు వేల మూడొందల ఏళ్ళ కిందట చంద్రగుప్త మౌర్యుడి సామ్రాజ్యానికి పాటలీపుత్రం రాజధాని. ఇప్పుడున్న పాట్నా దీనస్థితిని చూస్తే ఊహించుకోవడమే కష్టం కదా?' అంటూ శబ్దం చేస్తున్న మెషీన్‌ను ఉత్తరం వైపుకు తిప్పాడు. నదిని అనుసరించడానికి.

'నగరం గంగానదికి దక్షిణ తీరంలో ఉంది. కాని ఈ ప్రాంతమంతా ముడి ఇనుము సమృద్ధిగా ఉంది. ప్రభుత్వం ఇంతవరకు చేయలేనిది, అంటే కచ్చితమైన ప్రదేశాలను గుర్తించడంలోనే తమాషా ఉంది'.

గంగాసాగర్ బూతులు తిట్టుకున్నాడు. తన మాటలు పైలెట్ వినకుండా ఇంజన్ రొద అడ్డుపడినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

'ప్రపంచవ్యాప్తంగా ఖనిజాల తవ్వకాలలో భూభౌతిక నైపుణ్యాలను వాడడం బాగా పెరిగింది. నా దగ్గర మేగ్నటో మీటర్ అనే వస్తువుంది. ప్రపంచంలో ఇవి కొన్నే

ఉన్నాయి. మీ యజమాని తన అమెరికా పరిచయాలనుపయోగించి ఒకటి సంపాదించ గలిగాడు. ఇది చాలా అద్భుతమైంది', అన్నాడు మోహన్‌లాల్.

'ఎలా పనిచేస్తుంది?' బ్రేక్‌ఫాస్ట్ పొట్లలో తిప్పుతున్నా లెక్కచేయకుండా గట్టిగా అరుస్తూ అడిగాడు గంగాసాగర్.

'భూ ఉపరితలంలోని వివిధ భాగాల సాపేక్ష అయస్కాంత ఆకర్షణని ఇది కొలుస్తుంది. ఖనిజాలలో ఐరన్ ఆక్సైడ్‌కి అయస్కాంత ఆకర్షణ బలంగా ఉంటుంది. ఖనిజాలున్న చోట మనం ప్రయాణిస్తున్నప్పుడు అయస్కాంత శక్తిలో వచ్చే మార్పులను గమనించగలం', ప్రొపెల్లర్ల మోత, ఇంజన్ రొదలో కలిసిపోయిన గొంతుతో వివరించాడు మోహన్‌లాల్.

---

హాకర్ ఆల్టిట్యూడ్ వేగంగా తగ్గిపోవడంతో 'మనం కిందికి వెళుతున్నాం!' అని అరిచాడు మోహన్‌లాల్. గంగాసాగర్ మోహన్‌లాల్‌ని, అగర్వాల్‌గారిని, చివరికి తన దురదృష్టాన్ని తిట్టుకున్నాడు వరసగా. ఒక క్షణం పిచ్చి పైలెట్ క్రూరమైన జోక్ వేస్తున్నాడు అనుకున్నాడు కాని సెకన్లలోపే అది జోక్ కాదని అర్థమైంది. గాలిలో ఉన్న పాత విమానం పడిపోతూ ఉంది.

'బయటికి దూకేయాలి!' కేకేశాడు మోహన్‌లాల్. కింద ఇంత ఉదయాన్నే వచ్చిన సందర్శకులని ఏమాత్రం పట్టించుకోని పాటలీపుత్ర శిథిలాలున్నాయి. 'ఏమదృష్టం నాది, రెండు వేల మూడు వందల ఏళ్ళ ఎముకల పోగుల మధ్య చచ్చిపోబోతున్నాను. ఒకవేళ నా శవం దొరికినా, దాన్ని కూడా ప్రాచీన నాగరకతా అవశేషంగా భావిస్తారేమో! భూగర్భంలో వందల అడుగుల లోతులో ఉన్న ఇనుప ఖనిజం కోసం అన్వేషించమని అత్యాశతో బాస్ నన్నెందుకు విమానంలో పంపాలి? ఇనుపఖనిజానికి బదులు ఇనుప విమానంలో సమాధి అయిపోయిన నా శవం కోసం తవ్వుతారు. అగర్వాల్ గారూ చూడండి మీక్కావాల్సిన ఇనుము ఇక్కడే ఉంది!' అనుకున్నాడు గంగాసాగర్. విమానం కుదుపులతో కిందికి పడిపోతుండడంతో గంగాసాగర్‌కి కళ్ళు తిరిగినట్లయింది. 'దూకు! ఇప్పుడే' అని అరుస్తూ మోహన్‌లాల్ దూకేస్తూ తన పేరాచూట్ రిప్ కార్డ్‌ను లాగాడు. గంగాసాగర్ గుడ్డిగా అనుసరించాడు. ఇప్పుడు అతనేమీ పట్టించుకోవడం లేదు. ఎలాగూ చనిపోతాడని తెలుసు కనుక పేరాచూట్ తెరుచుకుందా, లేదా అని పట్టించుకోలేదు. మోహన్‌లాల్ విమానం పరిస్థితి చూస్తే, బ్యాక్‌పాక్‌లో పేరాచూట్ ఉండడానికి వీలేలేదు!

అతను స్వర్గంలో ఉన్నాడు. తను కచ్చితంగా చనిపోయాడని, మేఘాలపైన ఇంద్రలోకంలో గాలిలో తేలుతున్నానని అనుకున్నాడు. అటూ ఇటూ చూస్తే మోహన్‌లాల్ తన పక్కనే తేలుతున్నాడు. మోహన్‌లాల్ పక్కనుంటే కచ్చితంగా ఇది స్వర్గం కాదు అనుకున్నాడు. వాళ్ళిద్దరి పేరాచూట్లు తెరచుకుని ప్రయాణిస్తున్నాయి. గాలిలో తేలుతూ నిదానంగా భూమ్మీదకు వెళుతుండగా గంగాసాగర్ ముఖానికి గాలి తగిలింది.

దబ్! దభాలున కింద పడ్డారు. పేరాచూట్లు నిదానంగా దిగాలి కదా? భూమ్మీద ఎలా పడ్డామో అని ఆలోచించడానికి సమయం లేదు. వంద అడుగుల లోపే మోహన్‌లాల్ హాకర్ పెద్ద శబ్దాలతో కూలిపోయి అగ్నిగుండంలా మండుతోంది. మోహన్‌లాల్, గంగాసాగర్ ఇద్దరూ విమానం కూలి, కాలుతున్న శబ్దాల నుంచి రక్షించుకొనడాకి నేలకు అంటుకుపోయారు.

ఇద్దరూ తలలెత్తి చూసేసరికి చాలా నిముషాలు గడిచాయి. ముఖాలకి నల్లమసి అలముకొంది, బట్టలు చిరిగిపోయాయి. గంగాసాగర్ జుట్టు విద్యుత్తు పాకినట్టుగా నిటారుగా నిలబడి ఉంది. కాళ్ళు, చేతులు, ముఖానికి దెబ్బలు తగిలి కమిలిపోయాయి. ఎంత నీరసంగా అనిపించినా, మోహన్‌లాల్‌ని కొట్టి చంపేయాలని బాగా అనిపించింది. పైలెట్‌పై దాడి చేయకుండా తనను తాను నిరోధించుకొనడానికి తీవ్రంగా ప్రార్థించాడు.

చుట్టూ చూశాడు. ఉదయం 5.30కి పాటలీపుత్ర శిథిలాలు దయ్యాల నగరంలా అనిపిస్తున్నాయి. ఒక్కరోజులో హఠాత్తుగా చంద్రగుప్తుడి సజీవ సామ్రాజ్యం నిర్జీవమై పోయినట్టుగా ఉంది. కుంహ్రార్ మధ్యలో బహుశా మగధరాజు సభాభవనానివి కాబోలు ఎనభై పెద్ద స్తంభాలు నిలబడి ఉన్నాయి. పైకప్పులేదు, పాలిష్ చేసిన నేల లేదు, పరదాలు లేవు, విలువైన వస్తువులు లేవు, ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన రాజుగారి ఆస్థానాన్ని అలంకరించినవేవీ ఇప్పుడు లేవు. కొంచెం దూరంలో దురఖీదేవి ఆలయం, బౌద్ధ సంఘారామం, ఆయుర్వేద ఆసుపత్రి శిథిలాలున్నాయి. 'ఇది చాలా పెద్ద సామ్రాజ్యమేననుకుంటా' అనుకున్నాడు. గంగాసాగర్ తనకు చరిత్ర పట్ల ఉన్న అభిరుచికి తావిస్తూ.

'హలో? ఏ లోకంలో ఉన్నారు?' అన్నాడు వెర్రి మోహన్‌లాల్ గంగాసాగర్ కళ్ళ ముందు చేతిని ఊపుతూ. 'విమానం కూలిన చోటికి వెళ్ళి అక్కడ ఎవరూ లేరని నిర్ధారించుకోవాలి. ఎవరైనా గాయపడి ఉండవచ్చు' అన్నాడు మోహన్‌లాల్ మంటలవైపు ఇద్దరూ నడవడం మొదలుపెడుతుండగా.

విమానం కూలిన చోట భూమిలో గుంట పడింది. నల్లటి పొగ మండుతున్న విమానం నుంచి సెగలు కక్కుతోంది. పాటలీపుత్ర మహాసభాభవనం శిథిలాలు పడమటి దిశలో వందగజాల దూరంలో ఉన్నాయి. 'పాట్నా వైపు నడుద్దామా?' అన్నాడు గంగాసాగర్.

'లాభం లేదు. మనం పర్యాటక ప్రదేశం మధ్యలో ఉన్నాం. ఒకటి రెండు గంటలు ఇక్కడే కూర్చుంటే బస్సులు వస్తాయి. వాటిలో టౌన్‌కి వెళ్ళిపోవచ్చు', అన్నాడు మోహన్‌లాల్.

విమానం కూలిన చోటికి దూరంగా కూర్చుని మంటలు ఆరిపోవడం చూశారు. బట్టలకంటిన దుమ్ము దులుపుకొని, చేతిలో ఉమ్ముకొని, ఉమ్మితో కళ్ళు శుభ్రం చేసుకున్నాడు గంగాసాగర్. నడుముకి ఉన్న ఫ్లాస్కులోంచి మోహన్‌లాల్ మద్యం తాగమన్నాడు. కాని గంగాసాగర్ పైలెట్ మాట విననట్టుగా, తనముందు నేల మీద ఉన్న చిన్న రెమ్మను నేలలోకి దూర్చడం మొదలుపెట్టాడు. అది మెత్తని ఎర్రని ఒండ్రుమట్టి నేల. ఇనుప ఖనిజం సమృద్ధిగా ఉన్నది. అగర్వాల్‌గారూ, చూడండి, మీ ఇనుపగనులు కనుక్కొన్నాను అనుకున్నాడు గంగాసాగర్.

కొమ్మ నేలలోకి వెళ్ళకుండా ఏదో అడ్డుపడుతోంది. కుతూహలంతో గంగాసాగర్ దాన్ని మరింతగా లోపలికి నెట్టసాగాడు ఆపకుండా. గంగాసాగర్‌ని భరించేందుకన్నట్టుగా మోహన్‌లాల్ మరికొంచెం తాగాడు. గంగాసాగర్ మోకాళ్ళ మీద కూర్చుని రెమ్మతో తవ్వడం మొదలుపెట్టాడు. అడ్డు పడేదేమిటో తెలుసుకోవాలనుకున్నాడు. కొన్ని నిముషాల సేపు గంగాసాగర్ తవ్విన తర్వాత, మోహన్‌లాల్ మరికొన్ని పెగ్గులు విస్కీ తాగిన తర్వాత అడ్డుపడుతున్నదేమిటో కనబడింది.

అది నలుచదరంగా ఉన్న నల్లగ్రానైటు పలక. అది నేలలో కొన్ని అడుగుల లోతున కప్పబడి ఉన్నా, పాలిష్ చేసినట్టుగా సాఫీగా ఉంది. గంగాసాగర్ చేత్తో దాని మీద ఉన్న దుమ్ముని తుడిచాడు, తుడుస్తుండగా చేతికి గరుకుగా తగిలింది. అది సాధారణమైన రాయి కాదు. అది రాతి శాసనం!

'రండి! వచ్చి సాయం చేయండి!' అని పైలెట్‌ను పిలిచాడు గంగాసాగర్. మోహన్‌లాల్ చిరాకుగా లేచి, ఫ్లాస్కు మూతపెట్టి దాన్ని తన బ్యాగీపాంటులో పెట్టుకున్నాడు. 'పారలాగా పనికివచ్చే లోహపు రేకులు కావాలి' అన్నాడు గంగాసాగర్. పైలెట్‌కు ఎల్విస్ చెంపల కోపాన్ని భరించేశక్తి లేదు. రెక్కలకు ఊతంగా నిల్చిన లోహపు ముక్క కాబోలు కనిపించింది. జాగ్రత్తగా తాకాడు. కాలలేదు. దాన్ని పట్టుకొచ్చి గంగాసాగర్‌కిచ్చాడు. అతను దాన్ని గభాలున లాక్కొని తవ్వడం మొదలుపెట్టాడు.

'ఏముందక్కడ?' అడిగాడు మోహన్‌లాల్. గ్రానైట్ పలకను చూసి ఎందుకంతగా ఉద్రేకపడుతున్నాం? దానికి కనీసం రొమ్ములు కూడా లేవు!'

గంగాసాగర్ అతన్ని పట్టించుకొనకుండా తవ్వుతూనే ఉన్నాడు. పావుగంట లోపే చాలామట్టిని తీసేశాడు. రాతి పలక బాగా కనిపిస్తోంది. అది సమాధి మీద పరచిన పలకలా ఉంది. బాగా పాలిష్ చేసిన పలక మీద గంగాసాగర్‌కి అర్థం కాని లిపిలో శాసనాలున్నాయి. బహుశా అది బ్రాహ్మీ అయి ఉంటుందనుకున్నాడు - మౌర్యుల కాలంలో వాడినది - కాని నిశ్చితంగా తెలియదు.

---

వృద్ధ గురువు పలకను నీటితోను, పీచుతోను రుద్ది కడుగుతూ *'ఆదిశక్తి నమోనమః' సర్వశక్తి నమోనమః; ప్రథమ భగవతి నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః;* అన్నారు. 'ఇది స్త్రీ శక్తి సుగుణాలను కీర్తించే సంస్కృత మంత్రం' అన్నారు గంగాసాగర్ పాత హెడ్‌మాస్టర్.

గంగాసాగర్, మోహన్‌లాల్ కొంతమంది పర్యాటకుల సాయంతో పలకను బయటికి తీసి, కూలిపోయిన విమానం కన్న ఘోరంగా ఉన్న ఒక బస్సులో పెట్టుకుని పాట్నా తీసుకువచ్చారు. గంగాసాగర్ ఇంక విమానం జోలికి పోకుండా రైల్లో కాన్పూర్ వచ్చేశాడు.

అతను క్షేమంగా తిరిగి వచ్చినందుకు అగర్వాల్‌గారు సంతోషించారు. కాని ఇంకా ఎక్కువగా మేగ్నటోమీటర్ రీడింగులు చూసి మరింతగా సంతోషించారు, మైనింగ్ రాయితీల కోసం మరింత ఆత్మవిశ్వాసంతో బిడ్‌లు వేయొచ్చని. గంగాసాగర్ తల్లి భయంతో, బాధతో పిచ్చిదైంది. వందసార్లు అతన్ని కావిలించుకొని ముద్దులు పెట్టుకొంది. తన కొడుకు బ్రతికి ఉన్నాడని నిర్ధారించుకొనడానికన్నట్లుగా పదే పదే అతని తలను, ముఖాన్ని నిమిరింది. అతను క్షేమంగా తిరిగి వచ్చినందుకు అక్కలు సంతోషంగా పాయసం చేశారు. అగర్వాల్‌గారు కట్నం సాయం చేయడంతో కుదిరిన కూతుళ్ళ ప్రదానాల గురించి గంగాసాగర్ తల్లి కూడా సంతోషంగా ఉంది.

కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్న తర్వాత ఎడ్లబండి మీద గ్రానైట్ రాయిని పెట్టుకుని పాత స్కూలు మాస్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయనొక్కడే రాతి మీద శాసనానికి అర్థం చెప్పగలడు. 'గంగా, నీకు తెలుసా, పాటలీపుత్రంలోని రాతి శాసనాలన్నిటినీ మౌర్యులలో

గొప్పరాజు – చంద్రగుప్త మౌర్యుడి మనుమడు అశోకుడు వేయించాడనుకుంటారు – కాని ఇది అశోకుడు వేయించిన శాసనం కాదు!' అన్నాడు హెడ్‌మాస్టరు ఆశ్చర్యంగా.

'ఎందుకని?' అడిగాడు గంగాసాగర్ కుతూహలంగా

'ఎందుకంటే సంస్కృతం వాడడం అశోకుని పాలనలో పూర్తిగా కనుమరుగైంది. మగధకు కళింగులకు జరిగిన యుద్ధంలో లక్షమంది సైనికులను చంపిన తరువాత అశోకుడు పూర్తిగా బౌద్ధమతాన్ని అవలంబించాడు. బౌద్ధులు సంస్కృతాన్ని వాడలేదు. వాళ్ళు దాన్ని చదువుకున్న బ్రాహ్మణుల భాషగా భావించారు. తమ ప్రార్థనలు సామాన్యులకు కూడా అర్థం కావాలని అనుకున్నారు. అందుకని అశోకుడు శాసనాలు ప్రాకృతంలో, ప్రజల భాషలో వేయించాడు సంస్కృతంలో కాదు, కాని ఇది సంస్కృతంలో ఉంది!' అన్నాడు ఉద్విగ్నుడైన గురువు. అయోమయానికి గురైన గంగాసాగర్ 'ఇది బ్రాహ్మీలో ఉందనుకున్నాను నేను' అన్నాడు.

'బ్రాహ్మీ లిపి. భాష కాదు – నువ్వు సంస్కృతంలో రాస్తున్నావా, ప్రాకృతంలో రాస్తున్నావా అనే దానితో సంబంధం లేకుండా లిపి ఒకటే ఉంటుంది – బ్రాహ్మీ'.

'అయితే ఈ మంత్రానికి అర్థమేమిటి?' గంగాసాగర్ అడిగాడు.

***'ఆదిశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; సర్వవ్యాపిత శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; దైవసృష్టికి సాయపడే శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; కుండలినీ సృజనాత్మకశక్తీ, సర్వమాతా నీకు నమస్కరిస్తున్నాను'*** అన్నాడాయన చిరునవ్వుతో. 'ఇది స్త్రీ శక్తికి అత్యున్నతమైన గుర్తింపు.'

'కాని పలకకు అటువైపున కూడా ఏదో శాసనం ఉంది. అది కూడా ఈ మంత్రమేనా?' గంగాసాగర్ అడిగాడు.

'ఆс! కాదు. నేను దాన్ని చదివాను. ఈ మంత్రాన్ని ఎలా చదవాలో దాని ఫలితమేమిటో దానిలో ఉంది'.

గంగాసాగర్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. 'దానిలో ఏముందో నాకు చెప్పండి' అన్నాడు కుతూహలంగా.

వృద్ధుడైన స్కూలు మాస్టరు చిరునవ్వు నవ్వారు. 'నువ్వు అడిగే దానికన్న ఎక్కువే చేశాను. దాన్ని అనువాదం చేసి ఏముందో కాగితం మీద రాశాను నీ కోసం'.

నాలుగు వేల రోజులు నువ్వు ప్రార్థించాలి.

ప్రతి రోజూ నాలుగువందలసార్లు

చాణక్యుడి శక్తి నీదవుతుంది

చంద్రగుప్తా, చేయడానికైనా, చెడగొట్టడానికైనా

ఒకవేళ తప్పు వస్తే, మళ్ళీ ఆరంభించు

కచ్చితంగా రాజు రాణి కావాలి.

సువాసిని శాపం శాశ్వతంగా పోతుంది

నువ్వు గనుక చాణక్యుడి తప్పును దిద్దగలిగితే.

## మూడో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

తక్షశిల రెండు ప్రసిద్ధ వ్యాపార మార్గాల కూడలిలో ఉంటుంది. మగధ, గాంధార దేశాల మధ్య ఉన్న ఉత్తరాపథ రహదారికి, కాశ్మీరుకు, కల్పితమైన సిల్క్‌రోడ్‌కు మధ్యనుండే సింధు రహదారికి కూడలిలో ఉంటుంది. తక్షశిల గాంధార లోయ రాజ్యంలో ఉంటుంది – గాంధార అంటే సువాసనకు సంస్కృతపదం. చుట్టూ కొండలు, పళ్లతోటలు, అడవిపూలతో నిండి ఉన్న గాంధార ప్రకృతి సంపదలకు కల్పవృక్షంలా ఉంది.

హిమాలయాల నుంచి, హిందూకుష్ పర్వతాల నుంచి వీచే చలిగాలులకు ఒంటి మీద పాత బట్టలు తప్ప రక్షణగా ఏమీ లేకుండా చాణక్యుడు తక్షశిల విశ్వవిద్యాలయం గేటు దగ్గర ద్వారపండితుడి ముందు నిలబడ్డాడు. అప్పుడే సూర్యోదయం అయింది. గాలి నిండా ఆలయధూపాలు, వేదోచ్చారణలు నిండాయి. ప్రణాళిక ప్రకారం వేసిన వీధులు ఊడ్చి, నీళ్ళు చల్లారు. ఉపాహార నిలయాలు కూడా మొదటి వినియోగదారుల కోసం తయారీలు మొదలుపెట్టాయి.

"ఎవరిని కలవాలనుకుంటున్నావ్, అబ్బాయ్?' ద్వారపండితుడు ప్రశ్నించాడు.

విశ్వవిద్యాలయ పీఠాధిపతి ఆచార్య పుండరీకాక్షుడిని కలవాలని చెప్పాడు చాణక్యుడు. ద్వారపండితుడి సూచనల ప్రకారం చుట్టూ పళ్ళ చెట్లున్న కుటీరం వద్దకు చేరాడు. అధిపతి తోటలో, ఎముకలు కొరికే చలిలో చొక్కా లేకుండా కూర్చుని ఉదయపు ధ్యానం, ప్రార్థన చేసుకుంటున్నారు. ఆయన ధ్యానాన్ని భగ్నం చేయకూడదని చాణక్యుడికి తెలుసు. అతను తోటలో ఒక మూలకి వెళ్ళి వణుకుతూ కూర్చున్నాడు. కొన్ని క్షణాల తర్వాత పుండరీకాక్షుడు కళ్ళు తెరిచి నల్లగా, పుల్లల్లా వేళ్ళాడుతున్న చేతులతో,

అందవికారంగా, అనాకారిగా ఉన్న కుర్రవాడు తోటలో కూర్చుని చలిలో వణుకుతుండడం చూశాడు.

'ఎవరు నాయనా నువ్వు?' అని ప్రశ్నించాడు. 'ఆర్యా, నా పేరు చాణక్యుడు. మగధకు చెందిన ఆచార్య చణకుడి కొడుకుని. మగధ మంత్రిమండలిలో మంత్రి కాత్యాయన గారి వద్ద నుంచి మీ కోసం ఒక లేఖ తెచ్చాను. ఆయనకి మీరు తెలుసని చెప్పారు', అని వివరించాడు చాణక్యుడు.

కాత్యాయనుడి పేరు వినగానే పీఠాధిపతి ముఖం వెంటనే విప్పారింది. వాళ్లిద్దరూ బాల్యస్నేహితులని అర్థమైంది. తన భుజం మీద ఉన్న శాలువా తీసి చాణక్యుడికి కప్పాడు. ఆ కుర్రవాడి చుట్టూ చెయ్యి వేసి ఆత్మీయంగా వంట గది వేడితో వెచ్చగా ఉన్న కుటీరం లోపలికి నడిపించాడు. వెంటనే ఈ కుర్రవాడి కోసం వేడిపాలు, లడ్డూలు తీసుకురమ్మని సేవకుడికి చెప్పాడు. చాణక్యుడు ఆకలిగా ఉన్నాడు, వేడి పాలు తాగుతూ వాటిని తిన్నాడు.

కాత్యాయనుడు రాసిన లేఖను చదువుతున్నాడు పుండరీకాక్షుడు. చాణక్యుడు మగధలోకెల్లా ప్రతిభావంతుడైన విద్యార్థి అని, రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రాల్లో నిపుణుడైన ఆచార్య చణకుడి కొడుకు అనీ రాశాడు.

'నీకు విశ్వవిద్యాలయంలో ప్రవేశం కల్పించమంటున్నాడు' అన్నాడు పుండరీకాక్షుడు. *ఈ పవిత్ర ద్వారాల్లోపలికి రావాలని ప్రపంచం నలుమూలల్లోని రాకుమారులు సంవత్సరాల తరబడి నిరీక్షిస్తారని నా మిత్రుడికి తెలియదా?* అని ఆశ్చర్యపోయాడు పుండరీకాక్షుడు లేఖ చదవడం కొనసాగిస్తూ. తక్షశిలలో తానూ, కాత్యాయనుడు విద్యార్థులుగా ఉన్న కాలంలోకి అతని మనసు వెళ్ళిపోయింది. పుండరీకాక్షుడు బీద అనాథ. కాత్యాయనుడి తండ్రి అతడి చదువుకి ఆర్థిక సహాయం చేశాడు. తన బాల్యమిత్రుడు చేసిన సాయానికి ప్రతిఫలం కోరుతున్నాడని పీఠాధిపతికి అర్థమైంది. ఈ అబ్బాయికి ప్రవేశం నిరాకరించడం కుదరదు.

'చాణక్యా, నువ్వు అలసిపోయి ఉంటావు. విశ్రాంతి తీసుకో. నా సేవకుడికి నీకు వెచ్చని పక్క సిద్ధం చెయ్యమని చెబుతాను. నేను ప్రవేశాల నిర్దేశకుడిని కలిసి ఈ విషయం మాట్లాడతాను. ఒకవేళ ఆయన నిన్ను పరీక్షించాలనుకుంటే నీకు కబురు చేస్తాను', అని కుశాగ్రబుద్ధిగల పీఠాధిపతి వెళ్ళటానికి లేచాడు.

'సుపరిపాలన ఉద్దేశ్యమేమిటి, చాణక్యా?' అని అడిగాడు ప్రవేశాల నిర్దేశకుడు. ఆయన కార్యాలయంలో వాళ్ళిద్దరూ నేల మీద కూర్చుని ఉన్నారు. ఆ గదిలో దుమ్ముపట్టిన కాగితపు చుట్టలు, తోలు కాగితాలు, రాతప్రతులు ఉన్నాయి, పెద్దగా అలంకరణ ఏమీ లేదు. గదంతా రాత్రి పూట వెలిగించే యూకలిప్టసు నూనె దీపాల వాసన వేస్తోంది.

చాణక్యుడు ఇచ్చిన సమాధానం ఆత్మవిశ్వాసంతో నిండి సరిగ్గా ఉంది. 'ప్రజల సంతోషంలోనే రాజు సంతోషం, వారి సంక్షేమమే అతని సంక్షేమం' అతను దృఢంగా చెప్పాడు.

'నాయనా, రాజు నిర్వర్తించవలసిన విధులేమిటి?'

'రాజు విధులు మూడు. రక్ష-బాహ్యదండయాత్రల నుంచి రాజ్యాన్ని రక్షించడం; పాలన-రాజ్యంలో శాంతిభద్రతలు కాపాడడం; చివరిగా యోగక్షేమం -ప్రజల సంక్షేమం'.

'చణకుని పుత్రుడా, రాజకీయ వివాదాల పరిష్కారానికి రాజు ఏ పద్ధతులను ఆశ్రయించాలి?'

'నాలుగు పద్ధతులున్నాయి. సామము – నిదానంగా నచ్చజెప్పడం, ప్రశంసించడం; దానం-ఆర్థిక లాభాలు కల్పించడం; దండించడం – శిక్షించడం లేదా యుద్ధం చేయడం; భేదం -వేగులనుపయోగించడం, ప్రచారం చేయడం, సమాచారం సరిగా చేరకుండా చూడడం'.

'రాజ్యం, దేశం, ప్రజల మధ్య ఉన్న తేడా ఏమిటి?'

'ప్రజలు లేకుండా దేశం ఉండదు, దేశం లేకుండా రాజ్యం ఉండదు. ప్రజలే రాజ్యాన్ని నిర్మిస్తారు; వట్టిపోయిన ఆవులా ప్రజలు లేని రాజ్యం వల్ల ఉపయోగం లేదు'.

'తెలివైన విద్యార్థీ, ప్రభుత్వంలో ఏముంటాయి?'

'గురువర్యా, ఏడు అంగాలుంటాయి. రాజు, మంత్రిమండలి, ప్రదేశమూ,ప్రజలు, చక్కగా నిర్మించిన పట్టణాలు, ధనాగారం, సైనికులు, స్నేహితులు'.

'రాజుకి మంత్రులెందుకు అవసరం?'

'ఒక్క చక్రం రథాన్ని నడపలేదు. రాజు తెలివైనవారిని మంత్రులుగా నియమించుకొని వారి సలహాలను వినాలి'.

'సంపదకు మూలమేమిటి?'

'సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలు. ఇవి లేకపోతే కోశాగారం దుస్థితి పాలవుతుంది. విజయవంతమైన ఆర్థిక కార్యకలాపాలు లేకపోతే, ప్రస్తుత సంపద, భవిష్యత్తులో ఎదుగుదల రెండూ నాశనమయ్యే ప్రమాదం ఉంటుంది. ఏనుగులని పట్టుకోడానికి ఏనుగులు అవసరమైనట్టుగా, సంపదను మరింతగా సంపాదించాలంటే సంపద అవసరం.'

'రాజ్యంలోని ప్రజలపై శిస్తు విధించడానికి తగిన స్థాయి ఏమిటి?'

'పండిన పండ్లను తోట నుంచి కోసినట్టుగా, రాజు తనకు రావలసిన పన్నును సేకరించాలి. పక్వం కాని పండును ఎలా కోయమో, అలాగే రాజు తనకు రావలసినది కాని సొమ్మును వసూలు చేయరాదు. అలా చేస్తే ప్రజలకు కోపం వచ్చి, ఆదాయానికి మూలమైన మార్గాలు చెడిపోతాయి'.

'శిస్తు వసూలు అధికారులను రాజు ఎంతవరకు నమ్మవచ్చు?'

'నీటిలో ఈదే చేప నీళ్ళు ఎప్పుడు తాగుతుందో తెలియదు. అలాగే సొమ్ము వసూలు చేసే ప్రభుత్వ సేవకులు ఎప్పుడు ధనాన్ని దుర్వినియోగం చేస్తారో కనుక్కోలేం'.

'రాజ్యపాలనలో శిక్షించడమనేది ఎంతముఖ్యం?'

'ఇహ పరాలను రక్షించేది శిక్షించే అధికారం ఒక్కటే. ఈ అధికారాన్ని నిష్పక్షపాతంగా, నేరానికి తగ్గట్టుగా, శిక్షించేది యువరాజునా, శత్రుసేవకుడినా అని ఆలోచించకుండా ఉపయోగించాలి'.

'ఏ రాజులు తనకు మిత్రులో, ఎవరు శత్రువులో రాజు ఎలా నిర్ణయించాలి?'

'తన దేశానికి పొరుగున ఉన్న దేశాన్ని పాలించే రాజు శత్రువు. పొరుగు దేశానికి పక్కనున్న రాజు స్నేహితుడు, అని భావించాలి. నా శత్రువుకు శత్రువు నాకు మిత్రుడు'.

ప్రవేశాల నిర్దేశకుడు ఆ బాలుడిని అబ్బురంగా చూశాడు. తర్వాత పుండరీకాక్షుడి వైపు చూసి చిరునవ్వు నవ్వాడు.

'ఇతని జ్ఞానం, విశ్లేషణానైపుణ్యాలు, తెలివితేటలు గురించి నాకేం అనుమానం లేదు. కాని ఇతని బోధనారుసుము ఎవరు చెల్లిస్తారు?' అని అడిగాడు. పీఠాధిపతి ఇబ్బందిగా నవ్వి, 'నా బాల్యమిత్రుడు కాత్యాయనుడు అప్పు చెల్లించమన్నాడు. ఈ ఖర్చును నేను భరిస్తాను', అని చెప్పాడు.

చాణక్యుడు పుండరీకాక్షుడి ముందు సాష్టాంగపడ్డాడు. కాత్యాయనుడు తన ప్రయాణఖర్చుల కోసం ఇచ్చిన యాభై బంగారు పణాలలో మిగిలిన పది పణాలను స్వీకరించమని కోరాడు. 'ఉంచుకో, చాణక్యా. అప్పును నేను కోరినప్పుడు తీర్చుదువుగాని', అన్నాడు పుండరీకాక్షుడు. 'నువ్వు భారతదేశమంతటినీ ఐక్యం చెయ్యాలి; శలభాలను ఆకర్షించే మంటలా నీ నిశితబుద్ధి, తెలివి తేటలు రాజులను ఆకర్షించి వారు నీమాట వినేలా చేయాలి; చాణక్యా, మేలుకో, మాతృభూమికి నీ అవసరం ఉంది', అని ప్రకటించాడు పీఠాధిపతి. కృతజ్ఞతతో పుండరీకాక్షుడి పాదాలకు నమస్కరించి ఆ బాలుడు నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

'ఇతనికి తక్షశిలలో విద్యాభ్యాసం అవసరమా అనిపిస్తోంది నాకు', అని చాణక్యుడు వెళ్ళగానే ప్రవేశాల నిర్దేశకుడు పీఠాధిపతితో గుసగుసలాడాడు.

వికృతంగా ఉండే చాణక్యుడి ముందు పళ్ళు, పుల్లల్లా వేలాడే చేతులు, మచ్చలతో లోతుకుపోయిన ముఖం, బొగ్గులాంటి మేని ఛాయ, అతని పొడలుగా ఉన్న చర్మం తక్షశిలలో ఎవరికీ నచ్చని వ్యక్తిని చేసింది. రాకుమారులు, ఉన్నత వంశ సంజాతుల కొడుకులు, కులీనులు, అందగాళ్ళు విశ్వవిద్యాలయంలో అధికంగా ఉన్నారు. చాణక్యుడి మేధస్సు, ప్రతి విషయంపైనా నిర్భీతిగల అభిప్రాయం అతనికి స్నేహితులను సంపాదించడానికి ఏమీ తోడ్పడలేదు.

ఒకనాడు వసతి గృహం నుంచి తరగతులకు నడచి వెళ్తుండగా, నదీతీరం వెంబడి ఉన్న ఎండిపోయిన కుశగడ్డి కుడిపాదానికి గుచ్చుకొని హఠాత్తుగా నొప్పి కలిగింది. అతను యాంత్రికంగా పాదాన్ని ఎత్తి దానికి గుచ్చుకున్న ముల్లులాంటి గడ్డిని బయటికి లాగాడు. ముల్లును బయటికి తీసి, రక్తం నదిలో కడిగి వేర్లతో ఉన్న గడ్డి దుబ్బు పరీక్షించాడు. గడ్డి దుబ్బుని పెరికి నదిలో వేయడం మొదలుపెట్టాడు.

'మిత్రులారా! చాణక్యుణ్ణి చూడండి. దేశానికి శత్రువులని ఎలా నాశనం చేస్తాడో మనకు సుదీర్ఘోపన్యాసాలిస్తాడు. పాదానికి గుచ్చుకున్న గడ్డిని కూడా నాశనం చేయలేకపోతున్నాడు!' అన్నాడొక సహవిద్యార్థి. చాణక్యుడు తన ముందున్న సమస్యలో లీనమై హేళనను పట్టించుకోలేదు. తన చుట్టూ వారు చేస్తున్న హేళనను కాని, పరిహాసాలను పట్టించుకొనకుండా గట్టి కుశదుబ్బుల కొనలను పీకేస్తూనే ఉన్నాడు. కొన్ని నిముషాల తర్వాత చాలా దుబ్బులు పీకినా, ఇలా చేస్తూ చెడు చేసే ఈ గడ్డిని పూర్తిగా నాశనం

చేయలేనని గ్రహించాడు. ఏం చేయాలో మనసులో నిర్ణయించుకుని గబగబా తరగతికి వెళ్ళాడు. 'ఓడిపోయావా, అప్పుడే!' అని సహ విద్యార్థులు వెక్కిరించారు.

'అదే గనక నిజమైన యుద్ధమైతే, రక్తపాతం లేకుండా పూర్తి అయేది. శత్రువు ముందు చాణక్యుడు చేతులు చాచి నిలబడేవాడు', అన్నాడొక యువరాజు. వాళ్ళ మాటలకు ప్రత్యుత్తరమివ్వడానికి చాణక్యుడికేమీ తోచలేదు.

మర్నాడు, చాణక్యుడు తెల్లటి ద్రావణాన్ని మట్టిపాత్రలో పోసుకుని రావడం చూసి ఆశ్చర్యపోయారు. వాళ్ళు నడుస్తున్నారు. చాణక్యుడు ఆ తెల్లటి ద్రావణాన్ని గడ్డి దుబ్బులపై వీలైనంత దూరం చల్లాడు. వ్యంగ్యంగా మాట్లాడుతూనే ఉన్నారు. 'ఇది చాణక్యుడి కొత్త యుద్ధవ్యూహం. శత్రువుని చంపలేకపోతే, అతనికి పాలివ్వాలి. అప్పుడింకా బలవంతుడై, సునాయాసంగా నిన్ను చిత్తు చేస్తాడు', అన్నాడొకడు. మరొకడు వ్యంగ్యంగా, 'కాదు, కాదు మీకర్థం కాలేదు... ఇది వేదాల్లో గొప్పగా చెప్పిన కుశగడ్డి. గడ్డికి చాణక్యుడు పాలు సమర్పించి దేవుళ్ళను సంతృప్తులుగా చేస్తున్నాడు. బదులుగా వారే అతనికి శ్రమ లేకుండా శత్రువుని చంపేస్తారు', చాణక్యుడు యథాప్రకారం ఏమీ మాట్లాడలేదు. వివరణ ఇవ్వలేదు.

మర్నాడు గడ్డి చాలావరకు అదృశ్యమవడం చూసి పిల్లలు నివ్వెరపోయారు. 'ఏయ్ చాణక్యా! నిన్న నువ్వు ఇక్కడ చల్లిన పాలల్లో ఏముంది?' అని అడిగాడొక పిల్లవాడు కుతూహలం ఆపుకోలేక.

"కుశగడ్డి చాలా ఉంది. దాన్ని నేను పీకలేను, అందుకని ఆలోచించాను నా శత్రువుకి శత్రువు నాకు స్నేహితుడు అయితే - ఈ కుశగడ్డికి పెద్ద శత్రువు ఎవరు? సమాధానం బూజు, చీమలు, రెండూ గడ్డికి పట్టి దాన్ని తింటాయి. నేను నిన్న చల్లింది పాలు కాదు. పాలవిరుగుడులోని తేట. దానిలో తీపి కలిపాను. తేటలోని మాంసకృత్తులు బూజు పెరిగేలా చేస్తే, తీపికి చీమలు చేరాయి' అని చెప్పాడు తనతో కలవని పిల్లలతో. ఆ పిల్లలు చాణక్యుడి చేతిలో ఇంకా పాలవిరుగుడు తేటతో మట్టి పాత్ర ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. అతను మళ్ళీ ముందు రోజు చేసినట్లుగానే దాన్ని చల్లుతున్నాడు.

'చాణక్యా, నువ్వు ఇప్పటికే గడ్డిని చంపేశావు. రెండో పాత్ర ఎందుకు?' నిన్న వెక్కిరించిన గొప్పవాళ్ళ పిల్లల్లో ఒకడు అడిగాడు.

'రుణాన్ని చివరిపణం వరకు చెల్లించెయ్యాలి. శత్రువుని కూడా ఛాయ కూడా

మిగలకుండా చెయ్యాలి', తన కొత్త అభిమానులకు అర్థమయ్యేలా చెప్పాడు చాణక్యుడు పనిచేస్తూనే.

'మన హిందూర్యుల, సాంస్కృతిక వారసత్వ సంపదకు నిలయమైన భారత దృక్పథం దురదృష్టవశాత్తు చిన్న రాజులు, రాజ్యాలతో జయింపబడింది. మనందరికీ ఒకే ధార్మిక గ్రంథాలు, సాంప్రదాయాలు, సంస్కృతి, ప్రార్థనలు, దేవుళ్ళు. మరి మనం మన దేశాలను మగధ, గాంధారం, కాశీ, కురు, కోసల, మాళవ రాజ్యం, పాంచాలం అని ఎందుకంటాం? మనం భారత పౌరులమని ఎందుకనం? ఈ మౌలికమైన విభజనశీలతే భవిష్యత్తులో మన పతనానికి దారితీస్తుంది', అన్నాడు చాణక్యుడు తన తలను వంచి గృహస్థు వైపు తిప్పి చూస్తూ. అతను తక్షశిల శివారులో దండాయన రుషి కుటీరంలో ఉన్నాడు. ఈ ఋషి యోగి. ఆయన కొన్నాళ్ళ నుంచి తలకిందులుగా ఉన్నాడు. అందువల్ల చాణక్యుడు తలకిందులుగా ఉన్న యోగికి కన్పించేలా వంగాల్సి వచ్చింది.

గత ఆరేళ్ళుగా చాణక్యుడు తక్షశిలలో పాఠ్యప్రణాళికలో ప్రతి విషయంలోను ప్రతిభావంతుడుగా గుర్తింపబడడమే కాకుండా, ప్రతి యేడాది ప్రతిభావంతుల పట్టికలో స్థానం దక్కించుకున్నాడు. అత్యున్నతమైన విద్యాసామర్థ్యం వల్ల తన అభిమాన విషయాలైన రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రాల్లో అతనికి ఉపాచార్య పదవి దక్కింది. ఉద్యోగం ద్వారా లభించే ఆదాయం కొంచెమే అయినా, సరిపోయేంతది. రుణశేషం మిగల్చరాదనే తన నమ్మకం ప్రకారం దీనితోనే గురువు పుండరీకాక్షుడి రుణం తీర్చేశాడు, అయితే వడ్డీ ఇంకా మిగిలే ఉందని, దాన్ని నగదుగా కాకుండా, మాతృభూమిని ఐక్యం చేసి ఆ రుణం తీర్చాలని పుండరీకాక్షుడు చమత్కరించాడు. పుండరీకాక్షుడు చాణక్యుడిని అంతర్దృష్టిగల యోగికి పరిచయం చేశాడు. చాణక్యుడికి కూడా అప్పుడప్పుడు వెళ్ళి యోగిని దర్శించడం బాగుండేది. ప్రతి ప్రధాన సమస్యపైన ఒక అభిప్రాయంగల ఈ తెలివైన యువకుడంటే దండాయనుడికి ఇష్టం ఏర్పడింది.

'గుత్తిలో వెలిగే కొవ్వొత్తుల కింద వేడి తగిలేవరకూ వాటి వాటి వెలుగులో ఒంటరిగా ప్రకాశిస్తూనే ఉంటాయి. ఉమ్మడి శత్రువు – వేడి – ఎదురైతే అవన్నీ కలిసి ఒకే వత్తిగా వెలుగుతాయి' తలకిందులుగా ఉన్న సాధువు తల చుట్టూ మడుగులా తెల్లని గిరజాల జుట్టు, గడ్డం నేలమీద పరుచుకుని ఉండగా వివరించి చెప్పాడు.

యోగి ప్రశాంతంగా ఇలా చెబుతూ పోయాడు. 'తూర్పున ఉదయించి పడమట

అస్తమించే సూర్యుడిలా కాకుండా, గ్రీకుతార పడమట ఉదయించి తూర్పు దిశగా ప్రయాణిస్తూ వస్తోంది. తెల్లని దేవుడు తన నెదిరించిన అందరినీ, అన్నిటినీ రూపుమాపుతాడు. నీ నిజమైన శత్రువు ధనసందుడు కాదు, చణకుని మేధావి పుత్రుడా, నీ శత్రువు మాసిడోనియా రాజు, 'ప్రపంచ విజేత అలెగ్జాండర్!'

'నేనేం చేయాలి గురూజీ? ధననందుడిపై నా ఆగ్రహం చల్లారలేదు. నా లక్ష్యాలను నేనెలా నిర్లక్ష్యం చేయగలను?' గాభరా పడిన చాణక్యుడు ప్రశ్నించాడు.

'చాణక్యా, రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న పండునెవరూ చెట్టు నుంచి కోయనవసరం లేదు. పండు దానంతటదే రాలిపోతుంది. గొప్ప లక్ష్యంపై దృష్టి సారించు. నువ్వు చేయాలనుకున్న పనులన్నీ వాటంతటవే నెరవేరుతాయి'.

అధ్యాపకుడిగా చాణక్యుడి కీర్తిప్రతిష్ఠలు పెరిగాయి. అతని తరగతిలో కూర్చోడానికి విద్యార్థులు ఒకరితో ఒకరు పోటీపడేవారు. అప్పుడప్పుడు చాణక్యుడు వల్లె వేయించి నేర్పకుండా, విద్యార్థులను వెంటవెంటనే ప్రశ్నలు వేయమని, వారడిగిన ప్రశ్నలకు హాస్య చతురతతోను, సూటిగాను, రాజకీయ నైతికత పట్ల అంతగా గౌరవం లేనట్లుగాను సమాధానాలు చెప్పేవాడు.

'ఆచార్యా, అధ్యాపకులందరిలో బాగా చదువుకొన్నవారు మీరు. మీరెందుకు రాజు కాకూడదు?'

'నిజానికి, నేను రాజు కాకపోయినందుకు నాకేం చింతలేదు మరొకరు రాజయ్యారనే నా సమస్య'.

'ఆచార్యా, పాలనలో గోప్యంగా ఉండడం ఎందుకు?'

'పౌరులకు నువ్వు చేసేది తెలియకపోతే, వారికి నువ్వు తప్పు చేస్తున్నావని తెలియడానికి అవకాశం లేదు కదా? అందుకే నాయనా, గోప్యత అవసరం.'

'ఆచార్యా, దేశ చట్టాలను ప్రజలెందుకు గౌరవించరు?'

'ప్రజలు చట్టాన్ని గౌరవించాలని మనం భావిస్తే, చట్టాన్ని గౌరవాస్పదంగా తయారుచెయ్యాలి నాయనా'

'ఆచార్యా, వాస్తవానికి రాజు ప్రజలకు సేవకుడు కదా?'

'పొరపాటు. రాజు కావాలంటే, పాలకుడు తాను ప్రజలకు సేవకుడినని ప్రచారం చేసుకోవాలి'

'ఆచార్యా, సంక్షోభం, ఆందోళనల సమయంలో ప్రధానమంత్రి ఏ విధంగా రాజు భారాన్ని తగ్గించగలడు?'

'ఎందుకలా చేయడం? రాజులు ఆందోళన పడాలి. వాళ్లు రకరకాల సంక్షోభాలతో సతమతమవుతుండేలా చెయ్యాలి. అది వారేం సాధించారో చెప్పే కొలమానం!'

'ఆచార్యా, ఎల్లప్పుడూ నిజాన్ని చెప్పడం రాజు పవిత్ర కర్తవ్యమా?'

'హాహా! రాజుకి సత్యంతో పనిలేదు. రాజుకి ప్రజలకు చెప్పడానికి ఏదో ఒక విషయం కావాలి నాయనా. రాజు నిజం చెబుతున్నాడనడానికి రుజువు మంచి ఉపన్యాసం కాదు, అతను గప్పాలు కొడుతున్నాడని ఎవరూ రుజువు చేయలేని ఉపన్యాసం'.

'ఆచార్యా, ప్రభుత్వం పౌరులకు ఇవ్వాల్సిన స్వాతంత్ర్యాలేమిటి?'

'మ్... ఆలోచించండి. ఆకలేసే మనిషికి నాలుగు రొట్టె ముక్కలపై ఉన్నంత ఆసక్తి నాలుగు రకాల స్వాతంత్ర్యాలపై ఉంటుందా?'

'ఆచార్యా, మీలాంటి బ్రాహ్మణులకు రాజకీయాలతో జోక్యం ఎందుకు?'

'రాజకీయ నాయకులకు వదిలేసేంత చిన్న విషయం కాదు నాయనా, రాజకీయాలు'

'ఆచార్యా, రాజకీయ విభేదాలకు యుద్ధమే పరిష్కారమా?'

'వివేకవంతుడైన విద్యార్థీ, రాజకీయాలు రక్తపాత రహిత యుద్ధం. యుద్ధమంటే రక్తపాతంతో కూడిన రాజకీయాలు'.

'ఆచార్యా, తాము కట్టే శిస్తుల మొత్తం ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకొనే హక్కు పౌరులకు లేదా?'

'అయ్యో నాయనా, లేదు. లేదు. లేదు. శిస్తు మొత్తాలు ఎలా ఖర్చు చేశారో ప్రజలకు తెలుసుకోవాలని ఉండదు. ఎన్నడైనా పూజాది కార్యక్రమాల్లో దైవానికి నివేదించే పదార్థాలు ఏమయ్యాయని భక్తుడు పూజారిని ప్రశ్నిస్తాడా?'

'ఆచార్యా, సుపరిపాలన అంటే నియమబద్ధంగా నడిచేది కాదా?'

'ఖచ్చితంగా. ప్రభుత్వమంటే నియమాలే. అసలు నియమమేమిటంటే నియమం ప్రకారం చేయకూడదని.'

'నియమాలు డబ్బు కంటె గొప్పవా?'

'ముఖ్యమైన సూత్రం ఒక్కటి గుర్తుపెట్టుకో బాబూ. ఎవరైనా "డబ్బు కోసం కాదు, నియమం కోసం" అన్నారంటే వాళ్ళు నిజానికి డబ్బు గురించే మాట్లాడుతున్నారని అర్థం.'

'ఆచార్యా, మంత్రిమండలి ఒక విషయాన్ని గురించి ఎంతసేపు చర్చించాలి?'

'ఒక విషయాన్ని గురించి ఎక్కువగా చర్చించకూడదనుకుంటే వాళ్ళు చర్చించే విషయాల పట్టికలో చివరన చేర్చు. అల్పాహారాలకి ముందుగా'.

'ఆచార్యా చట్టాన్ని, న్యాయాన్ని కాపాడడానికి రాజు యుద్ధం చెయ్యాలా?'

'చట్టమూ, న్యాయమూ విదేశీ విధానంలో జోక్యం చేసుకోనంతవరకు రాజు ఎప్పుడూ వాటి పక్షమే వహించాలి'

'రాజ్యంలో ఏం జరుగుతుందో రాజుకి తెలియకుండా ఉంచే ప్రధానమంత్రికి ఏ శిక్ష వెయ్యాలి?'

'కుమారా, రాజులు అమాయకంగా ఉండడానికి కారణం ప్రధానమంత్రులు సరైన సమాధానాలు చెప్పకపోవడం కాదు. వాళ్ళు ప్రధానమంత్రులని సరైన ప్రశ్నలు అడగకపోవడం. ఇంక పాఠం ముగిసింది!'

హాస్యకుశలత, చురకలు వేసినట్టు చెప్పే చమత్కారాల్లో నిగూఢంగా వేదన, ఒంటరితనం ఉన్నాయి. చాణక్యుడు కేవలం కాత్యాయనుడి వాగ్దానంతో తల్లిని మగధలో వదలి వచ్చాడు. ఆమె ఆరోగ్యంగా ఉందా? ఆమెకి కొడుకు గుర్తుకొస్తాడా? భర్త, కొడుకు లేకుండా ఆమె ఎలా జీవిస్తోంది? చాలా ఏళ్ళుగా, వ్యాపారులతోను, సంచార గుంపుల వారితోను ఆమెకు చాలాసందేశాలు పంపాడు. కానీ సమాధానమనేదే రాలేదు. సందేశకులకు ఆమె ఎక్కడుందో తెలియకపోయి ఉండవచ్చు. లేదా జరగరానిదేదైనా జరిగి ఉండవచ్చు.

అమావాస్య అర్థరాత్రి చీకటిలో మగధను విడిచిపెట్టి ఇప్పటికి పదేళ్ళు పైగా అయింది. అతడి గురువు పుండరీకాక్షుడు గత ఏడాది మరణించాడు. చనిపోవడానికి ముందు, దయగల పీఠాధిపతి చాణక్యుడిని మగధకు వెళ్ళి తల్లిని తక్షశిలకు తీసుకొని వచ్చి జాగ్రత్తగా చూసుకోమని కోరాడు.

'నీ తల్లికి, నీ మాతృభూమికి కూడా సంరక్షణ అవసరం. కాని జన్మభూమికన్న జనని ముందు చాణక్యా!'

తన శిష్యుడికి మూడు ఆస్తులను ఇచ్చి పుండరీకాక్షుడు చనిపోయాడు – అతని ఇల్లు, తాళపత్రాలు, విధేయుడైన సేవకుడు. తాను దూరదేశం వెళ్ళాక ఇవన్నీ చూడడానికి చాణక్యుడు తనకు ఇష్టులైన విద్యార్థులు సింహరణ్, మిహిర్, శారంగరావులను నియమించాడు. సింహరణ్ మాళవరాజ్య అధిపతి కొడుకు. ఆ ప్రాంతంలోని గణతంత్ర రాజ్యంలో అది ఒకటి. అతడిని మోసగించి అతడి బాబాయి ఆ రాజ్యాన్ని సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. మిహిర్ మాసిడోనియా దండయాత్ర వల్ల మాతృదేశం నుంచి పారిపోయి వచ్చిన విద్యార్థి. శారంగరావు విశ్వవిద్యాలయంలోనే ప్రతిభావంతుడైన బ్రాహ్మణ బాలుడు. ఈ ముగ్గురూ అతనికి ప్రియమైన విద్యార్థులు – వీరికి నిరంతరం అహంకారి, అప్పుడే విశ్వవిద్యాలయంలో చేరిన గాంధార యువరాజు అంభితో పడకపోయినా.

'అతడిని అదుపులో ఉంచండి, సింహరణ్', అని సలహా ఇచ్చి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడి నుంచి దీర్ఘకాలిక సెలవుకు అనుమతి పొంది తన జన్మస్థలానికి వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకోవడం మొదలుపెట్టాడు చాణక్యుడు.

శ్రమతో కూడిన మగధ ప్రయాణం తల్లిదండ్రులవేగాక, ప్రియమైన సువాసిని స్మృతులను కూడా రేపింది. చెరసాలలో బంధింపబడిన ప్రధాని షక్తర్ కుమార్తె, తనకు బాల్య స్నేహితురాలు. చిన్నపిల్లగా ఉన్నపుడు సన్నగా, నిపుణంగా చెక్కిన శిల్పంలా ఉండేది. ఆమె గులాబీ బుగ్గలు, సూటిగా చూసే గోధుమ రంగు కళ్ళు చాణక్యుడికి పిచ్చెత్తించేవి. అతనామెను ప్రేమించాడు కాని ఆమెకి చెప్పడానికి ధైర్యం చాలలేదు. తాను ప్రేమిస్తున్నానని ఆమెకి తెలుసని అతనికి తెలుసు. కాని తనకు తెలియనట్లుగా నటిస్తూ వినోదించేది. మగధ దగ్గరవుతున్నకొద్దీ తన కౌమారప్రేమ స్మృతులు తరచూ గుర్తుచేసుకుంటున్నట్లుగా గ్రహించాడు.

పాటలీపుత్రం పరిమాణంలోనే కాకుండా, అతిలాలసత్వం, విచ్చలవిడితనం, అవినీతి, కాముకతలలో కూడా బాగా పెరిగింది. ప్రతి వీధి చివర పందేలు, జూద గృహాలున్నాయి. మాయా పాచికలు, హస్తలాఘవాలు, జంతువులతో కాసే దొంగపందేలు వల్ల జరిగే పోట్లాటలు సర్వసాధారణం. మద్యం అతిగా తాగుతున్నారు. మదిరాలయాల నుంచి మద్యం మత్తులో తూలుతూ వచ్చే మనుషులు ఎప్పుడూ కనిపిస్తారు. కిన్వ, ఆసవ,

మైరేయ, మేదక, మధు లేదా ప్రసన్న వంటి మద్యాలను మగధలోని మదిరాలయాలు అందుబాటులో ఉంచుతాయి. ఇవేకాక *గణికలు, రూపజీవాలు, పుంసచలిస్‌లు* – వేశ్యలు, స్వతంత్రంగా వెంటబడి వచ్చేవారు, ఉంపుడు గత్తెలు కూడా అక్కడ లభిస్తారు. మగధ వేశ్యలు ఎంతో ప్రతిభానైపుణ్యాలు కలిగినవారు – గానం, వాద్యసంగీతం, సంభాషించడం, నృత్యం చేయడం, దేహమర్దనం, సువాసన ద్రవ్యాలను తయారుచేయడం, దండలు గుచ్చడం, అభ్యంగన స్నానం, స్నానం చేయించడంతోపాటు ముఖ్యమైన కళ సంభోగంలో కూడా ఆరితేరిన వారు. మగధలో పేరొందిన గురువు వాత్స్యాయనుడు ఇటీవలే కామసూత్ర అనే బహుళ జనాదరణ పొందిన గ్రంథాన్ని పన్నెండు వందల పద్యాల్లో డెబ్భయ్యేడు భిన్నమైన సంభోగ భంగిమలను వివరిస్తూ ప్రచురించాడు.

చాణక్యుడు రాజధాని పాటలీపుత్ర ద్వారాల వద్దకు వచ్చినప్పుడు వలస పత్రాలు పరిశీలించే అధికారి పూటుగా తాగి ఉన్నాడు. ఉదయమే అయినా కనీసం ఆ పత్రాలను చూడలేదు సరికదా ఏ ప్రశ్నలూ వెయ్యలేదు. నగర ద్వారాల దగ్గరున్న కావలివారు కూడా ముందు రోజు రాత్రి తాగిన మద్యం మత్తు దిగకుండా, ఎర్రటి కళ్ళతో ఉన్నారు. మగధ నిరాకరిస్తున్న రాజ్యంలా ఉంది – భారత సరిహద్దు రాజ్యాలకు మాసిడోనియా దండయాత్ర భయం ఉండగా మగధ దానినసలు గుర్తిస్తున్నట్లుగా కూడా లేదు. రాజు, అతని ప్రజలు ఇద్దరూ రాత్రి గడిచిపోయినా వినోదాన్ని ఆపాలనుకోవడం లేదు.

నగరం పెద్దగా మారలేదు కనుక చాణక్యుడు కాత్యాయనుడి ఇంటికి వెళ్ళడానికి పెద్దగా కష్టపడలేదు. వీధులు, ఇళ్ళు, వీధుల్లో వెలిగించిన నూనెదీపాలు ఏమీ మారలేదు. కాత్యాయనుడి ఆకారంలోనే మార్పు వచ్చింది. పదేళ్ళలో ఆయన వయస్సు మరో ఇరవై అయిదేళ్లు పైబడినట్లున్నాడు. తన ఇంటివైపు వస్తున్న చాణక్యుడిని వెంటనే గుర్తించాడు. గబగబా అతనికెదురు వచ్చాడు చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు చూసినా. చాణక్యుడిని కౌగలించుకొనగానే కన్నీళ్ళు జలజలా కారాయి. కౌగిలి విడువడానికిష్టపడలేదు. ఇంట్లోకి వెళ్ళగానే సేవకుడిని పిలిచి చాణక్యుడి కాళ్ళు, చేతులు కడగమని పురమాయించాడు, వంటవాడి చేత మధ్యాహ్న భోజనం సిద్ధం చేయించమని చెప్పాడు.

ఇద్దరూ వంట గదిలో నేల మీద కూర్చోగానే సేవకుడు అరటాకులను వేసి, మట్టిపాత్రలలో నీరు పెట్టాడు. బ్రాహ్మణ సాంప్రదాయం ప్రకారం వారు ఆకుచుట్టూ నీళ్ళు చల్లి శుద్ధి చేశారు. తర్వాత సేవకుడు అన్నం కూరలు తెచ్చి ఆకులలో వడ్డించాడు. ఆచారం ప్రకారం ఇద్దరూ తినేముందుగా అన్నంలోంచి ముందుగా చేతితో ముద్దలు తీసి

పక్కన పెట్టారు – జంతువులకి – పిల్లులు, కుక్కలు, కాకులు, చీమలకు ఆహారం కోసం – దేవుళ్ళని సంతోషపెట్టటానికి. వాళ్ళిద్దరూ దశాబ్దం పైగా ఒకరినొకరు చూసుకోకపోయినా వేదాచారం ప్రకారం నిశ్శబ్దంగా భోజనం చేశారు.

భోజనం ముగించి ఆవరణలో విశ్రాంతి తీసుకోడానికి వచ్చినప్పుడు మాత్రమే చాణక్యుడు మాట్లాడాడు. 'నేను అమ్మను నాతో తీసుకొని వెళ్ళడానికి పాటలీపుత్రం వచ్చాను. ఆమె ఎలా ఉంది? కాత్యాయనగారూ', అని అడిగాడు. అప్పుడావరించిన నిశ్శబ్దం చాలా సేపుంది. భరించలేనంత బరువుగా అయింది. చివరికి కాత్యాయనుడు మాట్లాడాడు.

"విష్ణూ... చాణక్యా.. నీకు నేనెలా చెప్పాలి? మీ నాన్న కిరాతకంగా చనిపోయిన తర్వాత, నువ్వు తక్షశిలకు వెళ్ళిన తర్వాత ఆమెను బాగా ఉంచాలని నేనన్ని విధాలా ప్రయత్నించాను. నా బలవంతం మీద పాటలీపుత్రానికి సమీపంలో కుసుమపురాలో ఉన్న పూర్వీకుల ఇంటికి వెళ్ళింది. భర్త హత్య జరిగిన, కొడుకు వెళ్ళిపోయిన పాటలీపుత్రంలో కంటె అక్కడే ఉంటే ఆమె ఈ స్మృతులకు దూరంగా ఉంటుందని నేను అనుకున్నాను. నేనావిడకు డబ్బు, కావలసిన సరుకులు అన్నీ క్రమం తప్పక పంపేవాణ్ణి. వీలైనప్పుడల్లా వెళ్ళి చూసి వచ్చేవాణ్ణి. కాని చాణక్యా, ఆమె నీకోసం ఆక్రోశించేది. నీ తండ్రి హత్యను తలచుకుని కుమిలిపోయేది. తినడం మానేసి చిక్కి శల్యమైంది. ఆరేదేళ్ళ కిందట చనిపోయింది. నన్ను క్షమించు చాణక్యా. ఇప్పటికి నీ జీవితంలో రెండుసార్లు నేను దుర్వార్తలను వినిపించాను'.

చాణక్యుడి కళ్ళలో కనిపించిన భావరాహిత్యం, ఎక్కడో నిలిచిన చూపు చూసి అతని తండ్రిని నరికి చంపారని చెప్పినపుడున్న చాణక్యుడి రూపం గుర్తొచ్చింది కాత్యాయనుడికి. ఆ వృద్ధుడు చాణక్యుడి చేయి పట్టుకుని సముదాయించాలని చూశాడు కాని ఏ విధమైన ప్రతిస్పందనా రాలేదు. రాగద్వేషాలకతీతమైన కవచం మరోసారి ధరించినట్లుగా, చాణక్యుడు వెంటనే చర్చించే చాలా విషయాల్లో తల్లి మృతి కూడా ఒకటి అన్నంతగా మరో విషయంలోకి వెళ్ళిపోయాడు.

'ప్రధానమంత్రి షక్తర్ జీవించి ఉన్నారా? ఆయనెలా ఉన్నారు?' అని అడిగాడు.

'ఆయనింకా జైల్లోనే ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ధననందుడు సర్వనాశనం చేశాడు. రాక్షసుడు, నేను ఆయనను బ్రతికి ఉంచడానికి గైరికుడికి లంచమిస్తూ ఉంటాం. నీకు తెలుసుగా, నందుడి నరకం నుంచి బయటపడడం అసాధ్యం – చెరసాల, హింసించే చీకటి గదులు ఆ రాక్షసుడు గైరికుడి అధీనంలో ఉంటాయి – సజీవంగా

బాగుంటాయి. షక్తర్ గారి జీవితం సజీవ నరకమని, నా వార్తాహరులు ఆయన రోజుకి వెయ్యిసార్లు చచ్చి బతుకుతారని చెప్పారు!'

'అయితే షక్తర్‌గారి కూతురు – సువాసిని – కూడా మరణించిందా?' సందేహిస్తూ అడిగాడు చాణక్యుడు.

'నీకామె అంటే ఇష్టమని నాకు తెలుసు చాణక్యా. నేనేం చెప్పగలను? ఆమె బ్రతుకు చావుకన్నా దుర్భరం. ఆ వ్యభిచారి రాక్షసుడి ఉపకారం వల్ల ఆమె బ్రతికి ఉంది కాని అతడి ఉంపుడు గత్తె అయింది'.

'నా ప్రియమైన సువాసిని వేశ్యా? నా తల్లి చనిపోయింది! ప్రధానమంత్రి నరకం లాంటి చీకటి కొట్టులో! మగధలో న్యాయం ఎక్కడుంది?'

'బ్రాహ్మణులను హింసించడం ఆగిపోయింది. అదొక్కటే పరిహారం. రాక్షసుడు ప్రధానమంత్రి అయినప్పటి నుంచి ధనసందుడిని మద్యం, మగువల మత్తులో ముంచడంలో సఫలుడయ్యాడు. ఫలితంగా బ్రాహ్మణ వ్యతిరేక విధానంలో రాజుగారి అలసత్వం మొదలైంది. బ్రాహ్మణుడైన రాక్షసుడు పండితులైన బ్రాహ్మణులకు దానాలివ్వడానికి ధర్మాదాయ నిధిని ఏర్పాటు చేయడానికి కూడా ధననందుడిని ఒప్పించాడు. ఒక శూద్రుడు బ్రాహ్మణులకు కించిత్తైనా మంచి చేస్తాడని ఎవరనుకున్నారు?'

'అయితే ధననందుడు, రాక్షసుడు దానధర్మాల ద్వారా బ్రాహ్మణుల సమ్మతిని నిశ్శబ్దంగా కొనేశారన్నమాట. కాదా? భూమాత ఈ మోసానికి దుఃఖిస్తోంది – బ్రాహ్మణులు ఆమె రక్షకులుగా, ధర్మపరిరక్షకులుగా, అంకితభావం కలవారుగా, దైవత్వం, నిజాయితీ, న్యాయం, సత్యం, సుగుణం, హుందా, న్యాయవర్తనం కలవారుగా ఉండాలి కదా. బదులుగా మనం ఎవరెక్కువ చెల్లిస్తే ఆ రాత్రికి వాడి దగ్గర పడుకొనే ఉమ్మడి వేశ్యలమయ్యామన్న మాట'.

'ష్.... చాణక్యా.... గట్టిగా అనకు నాయనా.... గోడలకి చెవులుంటాయ్. నువ్వన్నది నిజమే మనం వేశ్యలకన్న మెరుగ్గాలేం. నేను కూడా నేరస్థుడిలా నీ ముందు నిలబడ్డాను. మంచి ఏదో చెప్పాలని ప్రయత్నించిన ప్రఖ్యాత చణకుడికి, నీ తండ్రికి ఏం జరిగిందో చూశాను. రాజుగారికి ఉచితానుచితాలు చెప్పి సన్మార్గంలో పెట్టాలనుకున్న ప్రధాని షక్తర్ ఎన్ని హింసలకు గురవుతున్నాడో నేను చూస్తున్నాను. నీ అమ్ముల పొదిలో విడవడానికి బాణాలు లేకుండా విల్లు సంధించడం ఎంతవరకు సబబు? చెప్పు చాణక్యా. ఇది నీకు కఠోర వాస్తవంగా కనిపిస్తుంది'.

'నేను మిమ్మల్ని నిందించడం లేదు, కాత్యాయనగారూ, మీరే గనక లేకపోతే నేను బతికి బట్టకట్టే వాణ్ణి కాను. నా జీవితమంతా మీకు రుణపడి ఉంటాను. నా కోపమంతా నిరాశాపూరితమైన పరిస్థితిని చూసి. ఇది మీ మీద కాదు'.

'నేను అర్థం చేసుకోగలను చాణక్యా. ఈ ఆగ్రహాన్ని మనం ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలి. ధననందుడిని గద్దెదించాలి అంటే, నీకు మనుషులు కావాలి, సామగ్రి కావాలి, స్నేహితులు కావాలి, ప్రణాళిక అవసరం... దీనికంతటికీ మూలమైంది సంపద. ఆ సంగతి నీకు బాగా తెలుసు. మగధను కాలుష్యరహితం చేయాలంటే నీకు ధనం కావాలి'.

రాజ్యంలోని పండితులైన బ్రాహ్మణ గురువుల కోసం రాజు నిర్వహించే వేడుక జ్ఞాన వేడుక. వారి పాదాలు కడిగి, భోజనం పెట్టి, వారికి బంగారు కానుకలు సమర్పిస్తాడు. ప్రతిగా వారు రాజుని, ఆయన రాజ్యాన్ని ఆశీర్వదిస్తారు. ఈ వేడుక కోసం పాటలీపుత్ర రాజభవనం బంతిపూలతోను, అరటి ఆకులతోను అలంకరింపబడింది. బ్రాహ్మణులకు సమర్పించే పదార్థాలు వండుతూ వందలాది మంది వంటవాళ్ళు పాకశాలలో శ్రమిస్తున్నారు. ప్రాసాదం ద్వారాల దగ్గర వేడుక ప్రారంభమైందని సూచించే మంగళవాద్యాలు మోగాయి. వేడుక ప్రారంభం కావడానికి ముందే రాజుగారు ఎవరికి భోజనం పెడతారో, దానధర్మాలతో గౌరవిస్తారో విజేతల పట్టిక నిర్ణయింపబడుతుంది. ఆస్థానంలో రాజుగారి సమక్షంలో జరిగే చర్చలలో ఇది నిర్ణయించడం జరుగుతుంది. ఈ చర్చలలో బాగా పాల్గొన్నవారికి రాజుగారి గుర్తింపు, ప్రయోజనాలు లభించే అదృష్టం లభిస్తుంది.

ధననందుడు సభలో విసుగ్గా కూర్చున్నాడు. చిరాకుగా ఉన్నాడు. బండమనిషి, రాజపురోహితుడు – ఆస్థాన జ్యోతిష్యుడు రాజుగారి జాతక చక్రాన్ని చూస్తున్నాడు.

రెండో నక్షత్రం శుక్రుడు షష్ఠభావంలో పాపగ్రహం కేతువుతో యుతి కలిగి, శనితో సంబంధం కలిగి ఉన్నాడు. ఈ రోజు అంతమంచి రోజు కాదని, ఇబ్బంది కలుగవచ్చని ధననందుడికి సూచించాడు. 'రాజా గత ఏడాదిగా మీకు రాహు దశ నడుస్తోంది. అష్టమ గ్రహం కుజుడు ఆయుర్భంగాన్ని, పరివర్తనను, మార్పుని సూచిస్తాడు. షష్ఠమాధిపతి శని సభలో చిక్కులు సూచిస్తున్నాడు. ఈ గ్రహం మీద చంద్రదృష్టి, రవిదృష్టి ఉంది. గోచారంలో లగ్నాధిపతి మూడవదృష్టి ఉంది. కాబట్టి ఈ రోజు ఏదైనా మాట్లాడేటప్పుడు, చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి!' అన్నాడు జ్యోతిష్యుడు.

'ఈ రోజు నువ్వేం మాట్లాడినా, ఏం చేసినా జాగ్రత్తగా ఉండాలి చాణక్యా', అని సలహా ఇచ్చాడు కాత్యాయనుడు. చాణక్యుడికి ఏ పోటీలోనూ పాల్గొనే ఉద్దేశ్యం లేకపోయినా. ఇటువంటి వాటిలో పాల్గొనాల్సిన అవసరం లేనంత విశిష్ట మేధావి అతను. ధననందుడి ఆస్థానాన్ని, కొత్త ప్రధాని రాక్షసుడికి, రాజుకి ఉన్న సంబంధాన్ని గమనించాలన్నదే అతని కోరిక. ధననందుడి దృష్టిలో పడకుండా ప్రాసాదంలోని అతిథులతోపాటుగా కనబడకుండా ఉంటానని హామీ ఇచ్చాడు. ఏది ఏమైనా అతను చేసిన తప్పేమిటంటే కాత్యాయనుడి పక్కన నిలబడి, రాక్షసుడి దృష్టిలో పడడం. వికారంగా ఉన్న చాణక్యుడిని రాక్షసుడు వెంటనే గుర్తించాడు. వాతావరణాన్ని ఉద్విగ్నంగా చేయడానికవకాశం దొరికిందన్నట్లుగా, 'విఖ్యాత మగధ పుత్రుడు, తక్షశిల విశ్వవిద్యాలయంలో ఎంతో గౌరవింపబడే ప్రసిద్ధుడు చాణక్యుడు' ఈరోజు ఈ సభలో ఉండడం ఎంతో గర్వించదగిన విషయం. ఆచార్యులవారే ఈనాటి చర్చాగోష్ఠిని ప్రారంభించాలని సభ కోరుతున్నది', అంటూ ఎంతో గంభీరంగా ప్రకటించాడు. అందరూ మర్యాదగా హర్షధ్వానాలు చేశారు. చాణక్యుడు తప్పనిసరిగా లేచి వేదికకు వచ్చాడు. 'జాగ్రత్తగా మాట్లాడు, ఆగ్రహాన్ని అదుపులో ఉంచుకో', అని వేదికకు వెళుతున్న చాణక్యుడితో హడావిడిగా గుసగుసగా చెప్పాడు కాత్యాయనుడు.

'ఓం! దేవతలకు, రాక్షసులకు గురువులైన, రాజనీతిశాస్త్ర ఆద్యగురువులైన బృహస్పతికి, శుక్రుడికి నమస్కారాలు! అంటూ సింహాసనంపై కూర్చున్న ధననందుడికి, అతని ప్రక్కనే కుడివైపున నిలబడి ఉన్న రాక్షసుడికి అభిముఖంగా నిలబడి ప్రార్థించాడు. సభలో అందరూ కూడా 'ఓం!' అంటూ ప్రార్థించారు.

'జ్ఞానియైన ఆచార్యా, రాజ్య ప్రగతికి సమాజం సామరస్యంగా ఎలా పనిచేయ గలదు?' అని రాక్షసుడు ప్రశ్నించాడు.

'తన కర్తవ్యాన్ని నిర్వహించడం ద్వారా. చదవడం, బోధించడం, మనిషి తరఫున దేవుడిని ప్రార్థించడం బ్రాహ్మణుని కర్తవ్యాలు. ఆయుధాలను ధరించి అందరి ప్రాణాలు రక్షించడం క్షత్రియుడి కర్తవ్యాలు. వ్యాపారం చేయడం, ఉత్పత్తి చేయడం, సంపదను సృష్టించడం వైశ్యుని కర్తవ్యాలు. పై మూడు అగ్రవర్ణాలకు సేవ చేయడం శూద్రుడి కర్తవ్యం', అంటూ సింహాసనం మీద కూర్చున్న రాజు శూద్రుడని తెలిసి కూడా ప్రకటించాడు చాణక్యుడు.

దుర్బుద్ధితో రాక్షసుడు సంతోషించాడు. అతను ఇప్పటికే నిప్పు రాజేశాడు. పేలడానికి ఎంతో సేపు పట్టదు. అయితే ఆశ్చర్యకరంగా, ధననందుడు ప్రశాంతంగానే ఉన్నాడు. ఈ మాటలను పట్టించుకోలేదు.

'ఆచార్యా, రాజుకు ఉండవలసిన లక్షణాలేమిటి?'

'ఆదర్శవంతుడైన రాజు వాగ్ధాటి, నిర్భీతి, సునిశిత మేధస్సు, మంచి జ్ఞాపకశక్తి, కుశాగ్రబుద్ధి కలిగి ఉండాలి. మార్గదర్శకత్వాన్ని గ్రహించే స్థితిలో ఉండాలి. సత్కరించడం, శిక్షించడాలలో న్యాయంగా వ్యవహరించాలి. దూరదృష్టితో తనకున్న అవకాశాలను వినియోగించుకోవాలి. శాంతి, సమరం అనే రెండు సందర్భాలలోను పాలించే సామర్థ్యం కలిగి ఉండాలి. ఎప్పుడు పోరాడాలో, ఎప్పుడు మాటు వేసి నిరీక్షించాలో, ఎప్పుడు దాడి చేయాలో తెలిసినవాడై ఉండాలి. ఎల్లవేళలా హుందాగా ఉండాలి, ప్రియంగా మాట్లాడాలి, ముక్కుసూటిగా ఉండాలి. స్నేహపూర్వకంగా ఉండాలి. మోహం, కోపం, దురాశ, మొండిపట్టు, చంచలత్వం, వెన్నుపోటు పొడవడం పరిహరించాలి. పెద్దల సలహాలు స్వీకరిస్తూ అతడు ప్రవర్తించాలి-"

'నోరుముయ్! నాకీ ఉపదేశాలేమీ అవసరం లేదు!' ఆగ్రహంతో ధననందుడు అరిచాడు. సభలో సూదిపడితే వినబడేంత నిశ్శబ్దం అలముకుంది. రాక్షసుడికి నోట మాట రాలేదు. ఇంతత్వరగా ఫలితం వస్తుందని అతననుకోలేదు.

'రాజా! మీతో నేను ఏకీభవిస్తాను. మీకు నా సలహా అవసరం లేదు. విని గ్రహించగల నేర్పు ఉన్నవారికి ఆచరించగల వారికి నా సలహా. దురదృష్టవశాత్తు మీకు అవేమీ లేవు!' చాణక్యుడు గర్జించాడు. కాత్యాయనుడు భయంతో లోలోపలే కుంచించుకుపోయాడు. చాణక్యుడిని ఇక్కడికెందుకు తీసుకొని వచ్చాడు? తెలివితక్కువగా సింహం పంజాకు చేతులు అందించాడు.

'రాక్షసా! నువ్వు ఎంతో గౌరవాస్పదుడని, అధ్యాపకుడని చెప్పిన ఈ కురూపి ఎవడు? వీడు మన మధ్యలో ఉండడానికే తగడు, పైగా ఉపన్యాసాలిస్తున్నాడు!' ప్రశ్నించాడు ధననందుడు.

'ఉత్తములైన రాజా, ఈయన చాణక్యుడు. చనిపోయిన మన చణకుల వారి కుమారుడు' జిత్తులమారితనంతో రాక్షసుడు సమాధానమిచ్చాడు.

'ఆహా! ఇప్పుడర్థమైంది. సిగ్గులేని, బుద్ధిహీనుడైనవాడి తల నరకమన్నపుడు, వాడి కొడుకుని కూడా నరకమని ఉంటే పోయేది. ఎలుకలు కుప్పలు తెప్పలుగా పుట్టేస్తాయి'; అన్నాడు ధననందుడు.

'మరోసారి, మీతో ఏకీభవిస్తున్నాను రాజా, తెలివితక్కువగా నన్ను చంపకుండా

వదిలేశావు. శత్రువుని ఆనవాలు లేకుండా రూపుమాపాలి – పదభ్రష్టుడవైన నిన్ను, నీ వంశాన్ని నాశనం చేస్తాను ఏదో ఒకనాడు' ప్రశాంతంగా భవిష్యత్తు చెప్పాడు చాణక్యుడు.

'ఈ దుష్టుడిని బంధించి, నందుడి నరకంలో పడేయండి. నిపుణుడైన గైరికుడి చేతిలో గిలగిలలాడుతూ, చిత్రహింసలు పడుతూ నా పతనానికి మార్గాలు ఆలోచిస్తాడు. ఎలుకతోక పట్టుకున్నట్టుగా వీడి పిలక పట్టుకొని ఈడ్చుకెళ్ళండి', రాజభటులు చాణక్యుడి వైపు నడుస్తుండగా ధననందుడు అరిచాడు.

చాణక్యుడు తన శిఖను విప్పాడు. ఆగ్రహంతో ఊగిపోతున్నా, ధననందుడిలో కుతూహలం పుట్టింది, 'పిలక ఊడదీస్తే కూడా లాభం లేదు. కోతి ఎప్పుడూ కోతే!' అన్నాడు.

'బుద్ధిలేని, అజ్ఞానివైన రాజా, నేను భారతదేశాన్ని ఏకం చేయడం నా పవిత్ర కర్తవ్యమని భావించాను. మన మీద దండయాత్ర చేసే విదేశీయుల శక్తికి అప్పుడే దేశం ఎదురొడ్డి పోరాడగలుగుతుంది. చరిత్రలో నిన్ను లేకుండా చేయడం నా మొదటి కర్తవ్యం. ఈనాడు నేను శపథం చేస్తున్నాను! వివేకి అయిన నా తండ్రి చితాభస్మం మీద, నా ప్రియమైన తల్లి మీద ఒట్టు వేసి చెబుతున్నాను. నిన్ను, మాసిడోనియా నుంచి దాడులు చేసేవారిని నా దేశం నుంచి వెళ్ళగొట్టి, ఒక సమర్థుడైన, ఉదారుడైన రాజు అధీనంలో దేశాన్ని ఏకం చేసేవరకు ఈ శిఖను ముడివేయను', రాజభటులు జుట్టు పట్టుకొని నందుడి నరకంవైపు ఈడ్చుతుండగా చాణక్యుడు ప్రతిన చేశాడు.

## నాలుగో అధ్యాయం

# వర్తమానం

‘అగర్వాల్‌గారూ, మీ ఆశీస్సులతో మీ దగ్గర ఉద్యోగం మానేయాలనుకుంటు న్నాను’ అని గంగాసాగర్ చెప్పాడు. ఇన్నేళ్ళలో అగర్వాల్ గారి బ్యాగులో ఉన్న ట్రిక్కులన్నీ నేర్చుకున్నాడు. కృతజ్ఞత ఉంది కానీ ముందుకు వెళ్ళాలని భావిస్తున్నాడు.

‘ఎందుకని గంగా? నా దగ్గర ఎంతో నేర్చుకున్నావు? దాన్నంతా వదిలేస్తావా?’

‘సర్, నేను మీతోనే ఉన్న దానికన్న, బయటినుంచి ఎక్కువగా మీకు ఉపయోగపడగలను’.

‘ఏమంటున్నావు?’

‘భారతదేశంలో ఉన్న కళంకిత ప్రజాస్వామ్యంలో రాజకీయాలు, వ్యాపారం పరస్పరం అవసరమవుతాయి. మొదటిది అధికారానికి సంబంధించింది కాని అది రావాలంటే డబ్బు అవసరం; రెండోది సంపదకు సంబంధించింది కాని దానిని సృష్టించడానికి, నిలుపుకొనడానికి అధికారం అవసరం. నన్ను మీ రాజకీయ బలం అయ్యేలా దీవించండి’.

‘అయితే నా నుంచి ఏమాశిస్తున్నావ్?’

‘ఆర్థిక సాయం. మీకు అవసరమైనపుడు రాజకీయ సాయంతో దానిని చెల్లిస్తాను’.

‘గంగాసాగర్, నీకు నా ఆశీస్సులు’

పాన్ దుకాణదారు గుప్తా ముదురాకుపచ్చ తమలపాకు మీద సున్నం, ఏలకులు, పోకలు, గులాబీరేకుల చూర్ణం వేసి గంగాసాగర్‌కు పాన్ సిద్ధం చేస్తూ, ఆనందంగా

చుట్ట తాగుతున్నాడు. అతని కొట్టు చుట్టూ భరించలేనంత దుర్గంధం, మురుగువాసన శ్వాసను మరింత దుర్భరం చేస్తోంది. 'అందుకే నేను చుట్ట తాగుతాను' అన్నాడు గుప్తా. 'ఈ దుర్గంధంలో శ్వాస తీసుకోవడం సులభమవుతుంది. కార్సినోజెన్లున్నా నాకేం కాదు!'

భారతదేశంలోని పెద్ద చర్మపరిశ్రమల్లో చాలా కాన్పూర్‌లో ఉన్నాయి. ఆ ప్రాంతంలో కూడా ఒకటి ఉంది. చర్మం, జంతుమాంసంతో చర్మకారశాలకు వస్తుంది. దాన్ని తీయటానికి అక్కడ మూత్రాన్ని, సున్నపు అడుసుని ఉపయోగిస్తాయి చర్మశాలలు. తర్వాత చర్మాలను పావురాల పెంటతో శుద్ధి చేస్తారు. కుళ్ళిన మాంసం, ఎండిన మూత్రం, పావురాల పెంట కలిసిన దుర్గంధం ఆ ప్రాంతమంతా వ్యాపించి ఉంటుంది ఎప్పుడూ. నిరుపేదలకు వేరే మార్గం లేక ఈ చర్మకారశాలల్లో పనిచేస్తారు, ఆ చుట్టుపక్కలే గుడిసెల్లో ఉంటారు. ఫలితంగా అక్కడో మురికివాడ వెలిసింది.

కాన్పూర్ ధనవంతులకు ఈ మురికివాడలు ఇబ్బందికరంగా ఉంటాయి ఒంటిమీద కోసేయాల్సిన కురుపుల్లాగ; కాని వాటిల్లో నివసించే వాళ్ళకి అవే బ్రతకడానికి ఆధారం – ఎంత ఛండాలంగా ఉన్నా. పదిహేను వందల మందికి ఒకే మరుగుదొడ్డి ఉండడంతో మురుగు కాల్వల్లో విసర్జన క్రియలు చేయడం తప్ప వేరే మార్గం లేదు. ఈ కాల్వల్లోకే చర్మకార పరిశ్రమల నుంచి రక్తంతో కూడిన వ్యర్థాలు వచ్చి చేరతాయి. మురికి కాల్వల్లోంచి వచ్చే దుర్గంధంతో పాటుగా, ఈ నరకంలో టైఫాయిడ్, కలరా, మలేరియాలు సర్వ సాధారణం.

దాని చుట్టూ గుప్తా దుకాణాల వంటి దుకాణాలున్నాయి. మురికివాడలో కావలసిన సదుపాయాలన్నీ ఉన్నాయి. పాన్, సిగరెట్ దుకాణాలు, టీకొట్లు, కూరగాయల దుకాణాలు అన్నీ ఉన్నాయి. కెమిస్టులకు వినియోగదారులు పుష్కలంగా ఉండడంతో వ్యాపారం బాగా సాగుతుంది. 'ఇక్కడేమైనా స్కూళ్ళున్నాయా?' అనడిగాడు గంగాసాగర్ పాన్ నములుతూ.

'మునిసిపల్ స్కూలుండేది. కాని టీచర్లు పారిపోయారు. స్థానిక మాఫియా గూండాలకు దొంగసారా వ్యాపారానికి ఆ చోటు అవసరమైంది' అన్నాడు గుప్తా వెగటు పొగ వదులుతూ... 'స్థానిక రాజకీయ నాయకులు పిల్లల్ని చదివించడానికి స్కూళ్ళు కావాలని ఉపన్యాసాలు దంచుతారు కాని, నిజానికి మనని చదువురాని వాళ్ళుగా ఉంచడమే వాళ్ళకిష్టం. ఓటు బ్యాంకుని కాపాడుకోవడానికి ఇదే సరైన మార్గం' అన్నాడు గుప్తా కుట్ర చేస్తున్నట్టుగా.

'నేనిక్కడ స్కూలు పెడితే, తల్లిదండ్రులు పిల్లల్ని పంపుతారా?' గంగాసాగర్ అడిగాడు.

'మిగతావాళ్ళ సంగతి నాకు తెలీదు. నా కూతుర్ని సంతోషంగా పంపుతాను' అన్నాడు గుప్తా.

'అమ్మాయి పేరేంటి?'

'చాందిని. తనకి పదేళ్ళే'.

అతను మోటుగా, అనాగరికంగా ఉంటాడు. కాని బట్టలు మాత్రం శుభ్రంగా ఉంటాయి. రక్తవర్ణంలో ఉండే కళ్ళతో సమానంగా అతని పళ్ళు కూడా ఎర్రగా ఉంటాయి పాన్ మూలంగా. ఇక్రం భాయ్ తాగుతాడని కాదు. అది అతని మతానికి వ్యతిరేకం. భూకబ్జాలు, అక్రమ పందేలు, బలవంతంగా డబ్బులు గుంజడం, దొంగసారా వ్యాపారాలతో బాగా లాభసాటిగానే నడుస్తున్నాయి అతని పనులు. అతను తాగడు. అతనస్సలు నిద్రపోడు కాబట్టి కళ్ళు ఎర్రగా ఉంటాయి. మురికివాడకి రాజైనా సరే కష్టపడాల్సిందే. అతని నల్లటి ఒంటికి పూర్తిగా వ్యతిరేకంగా ఉండే తెల్లటి ఎంబ్రాయిడరీ కుర్తా వేసుకున్నాడు. దాని గుండీలు మెరిసే వజ్రాలు. చేతి వేళ్ళకి కూడా రకరకాల విలువైన రాళ్ళ ఉంగరాలుంటాయి.

ఆరోగ్యం, ఆయుర్దాయం కోసం కెంపు ధరించాడు, తన ఆయుర్దాయం పెరగడం అంటే ఇతరుల ఆయువు మూడినట్టేనని తెలిసినా. సహనంగా ఉండడానికి పిల్లికన్ను రాయి పెట్టుకున్నాడు. అతను తరచుగా మాట వినని వాళ్ళను అతని మనుషులు కొడుతుంటే ఓర్పుతో ఉంటాడు. అందుకనే తను ప్రశాంతంగా, మౌనంగా ఉండడానికి ముత్యం కూడా పెట్టుకున్నాడు. కనకపుష్యరాగం సంపదను పెంచడానికి పెట్టుకున్నాడు, సంపద మంత్రం వేసినట్టుగా పెరుగుతూనే ఉంది, ఇంక వజ్రాన్ని పురుషత్వం కోసం పెట్టుకున్నాడు, మగతనం విషయంలో ఎవరిసాయమూ అతనికవసరం లేకపోయినా. అందరితో బాగా మాట్లాడడానికి పచ్చను, దిష్టి నుంచి రక్షగా పగడాన్ని పెట్టుకున్నాడు – మరి అతని వృత్తిలో ఇట్లాంటివి చాలా ఉంటాయి కదా.

ఇక్రం భాయ్ పెట్టుకున్న వివిధ ఉంగరాలు చూస్తూ, 'నీలం ఎందుకు పెట్టుకోలేదు మీరు?' అనడిగాడు గంగాసాగర్.

'ఏం? అది నాకేం మంచి చేస్తుంది?'

'అధికారం, పరపతి ఇస్తుంది – నిజమైన అధికారం, పరపతి'.

'వా! అవి నాకున్నాయి. నాకు చెప్పకుండా ఈ మురికివాడలో ఎవడూ ఏమీ చేయడానికి సాహసించడు', అన్నాడు గర్వంగా, గంగాసాగర్ కళ్ళలోకి చూస్తూ.

'మరి మిగతా ప్రపంచం మాటేమిటి? ఈ చర్మకార పరిశ్రమ, మురికివాడలోనే మీ ప్రపంచం ఉంది. మీ అంత శక్తి సామర్థ్యాలున్న వ్యక్తి నగరమంతటికీ మంచి చేయగలడు– బహుశా రాష్ట్రానికే చేయగలడు'

'అంటే జూదగృహాలు, దొంగసారా బట్టీలు నగరమంతా పెట్టమనా మీరు చెప్పేది?', నిజాయితీగా అడిగాడు ఇక్రం భాయ్.

'మీ సామ్రాజ్యం లాంటి దాన్ని నడపడానికి, నగర పాలనకు పెద్దగా తేడా లేదు. ఎవరినీ లెక్కచేయని మీలాంటివాళ్ళే నగరాన్ని బాగా పాలిస్తారని నాకు తరచుగా అనిపిస్తుంటుంది. అందుకే మిమ్మల్ని రాజకీయాల్లో చేరమని చెప్పడానికి వచ్చాను. నేను మీ గురువుగా ఉంటాను!'

అగర్వాల్‌గారు సంతోషంగా స్కూలుకు కావలసిన ధనాన్ని ఇచ్చారు. పెద్ద మొత్తం కాకపోయినా లైట్లు, ఫ్యానులు, బ్లాక్‌బోర్డు, మౌలిక వస్తువులు, కొంచెం పెయింటు, పుస్తకాలు కొనడానికి సరిపడేటంత. ఇక్రంభాయ్ స్కూల్‌ను ప్రారంభించాడు. తనకు ఇక్రంభాయ్ మద్దతు అవసరమని గంగాసాగర్‌కు తెలుసు.

'అతనికెందుకు అంత గొప్ప నాపాదిస్తున్నావ్!' కష్టమంతా పడేది నువ్వు – పిల్లలకు చరిత్ర కూడా బోధిస్తున్నావు – డబ్బులన్నీ నేనిస్తున్నాను'.

'ఒక దయ గల మాట ఒక్కదానితోనే కన్న, ఒక దయగల మాట, ఒక తుపాకీతో ఎక్కువ పని చేయగలరు' అని సమాధాన మిచ్చాడు గంగాసాగర్. 'స్కూలు విషయంలో తనూ కొంత చేశాడన్న గౌరవమిస్తే, అతని గుండాలు మన జోలికి రారు. పిల్లల్ని స్కూలుకి పంపకపోతే తంతానని తల్లిదండ్రులందర్నీ బెదిరించాడు మీకు తెలుసా?' అంటూ నవ్వాడు గంగాసాగర్.

'ఇక్రం భాయ్ ఇంత ఉదారంగా ఉండడానికి ఏమి ఎరవేశావు?' అగర్వాల్ అడిగాడు.

'అతను రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నాడు. ఆర్థిక సాయం, మేధావుల సాయం కావాలి' గంగాసాగర్ వివరించాడు.

'అయితే నువ్వు నా డబ్బుని అతనికి వాగ్దానం చేశావా?' అగర్వాల్ భావరహితంగా ప్రశ్నించారు.

'నా తెలివితేటలు కూడా' గంగాసాగర్ ప్రతి సమాధానం చెప్పాడు. అదికూడా **అభానస** టిక్కెట్ మీద పోటీ చేస్తేనే'.

'ఏ రాజకీయ పార్టీ అది? నేనింతవరకూ వినలేదు'

'ఇప్పటివరకూ లేదు. రాబోయే మునిసిపల్ ఎన్నికలలోపు వస్తుంది'.

'నీ కొత్త సంస్థ టిక్కెట్లు మాఫియాడాన్లకు ఇస్తావా గంగా?'

'బ్యాంకును ఎలా రక్షించాలో బాగా చెప్పగలవాడు దొంగ. ఇతను నా ఓటుబ్యాంకును ఏర్పాటు చేసి రక్షించగలుగుతాడు'.

'ఎలా?'

'నేను బ్రాహ్మణుణ్ణి. అగ్రవర్ణాల హిందువుల ఓట్లను నేను పొందగలను. కింది కులాలవారు, ముస్లింలు నన్ను అనుమానంగా చూస్తారు. ఇక్రంభాయ్ ముస్లిం ఓట్లను కాపాడగలడు'.

'అతనితో కలిసి పనిచేయడం వల్ల నీకు అప్రతిష్ట కలగదా, గంగా?'

'మీరేంటో మీ ప్రవర్తన చెబుతుంది. ప్రతిష్ట అంటే మన గురించి ప్రజలు అనుకునేది. నా ప్రవర్తనని అతను మార్చనంతవరకు నేను బాగానే ఉంటాను'.

'నువ్వేం చేస్తున్నావో నీకు తెలుసనుకుంటాను. దెయ్యంతో ఒప్పందం చేసుకుంటున్నావ్'.

'దేవుడు నన్ను క్షమిస్తాడు. ఆయన పని అదే కదా!' అన్నాడు అగర్వాల్‌కు కన్నుగీటుతూ గంగాసాగర్.

బ్రిటిష్ వాళ్ళ పరిపాలన కాలంలో కాన్పూర్ మునిసిపాలిటీ ఏర్పాటైంది. తర్వాత కాలంలో స్వాతంత్ర్యం వచ్చాక కొన్నేళ్ళకి, మేయర్‌తో కాన్పూర్ నగర మహాపాలిక పేరుతో కార్పొరేషన్ అయింది. మేయర్‌ను అయిదేళ్ళకోసారి ఎన్నుకుంటారు. ఆ ఎన్నిక పరోక్ష ఎన్నిక. వందమంది కార్పొరేటర్లు నగరంలో వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు

మేయర్‌ను ఎన్నుకుంటారు. పురపాలక మండలికున్న వంద సీట్లలో ఇక్రం భాయ్ ఒక సీటుకు పోటీ చేస్తున్నాడు. **అభానస** తరఫున పోటీ చేయమని గంగాసాగర్ కొంతమందిని ఒప్పించాడు. ఇక్రంను మేయర్‌గా చేస్తానని నమ్మకంగా చెప్పాడు.

'మండలి కులం, మతాల వారీగా చీలిపోయింది. ఇరవై అయిదు శాతం మంది బ్రాహ్మణులు, మరో పావుమంది యాదవులు, మరోపావు మంది దళితులు, మిగిలిన పావుమంది మహమ్మదీయులు.

'నీకేం అవకాశముండదు' అగర్వాల్ గారన్నారు నిస్సహాయంగా.

ఇది రాజకీయం. ఆర్థిక శాస్త్రం కాదు. ఈ ఆటలో ఆరితేరినవాడు గంగాసాగర్, అగర్వాల్ కాదు.

'అదేం కాదు. నాలుగు వర్గాల నుంచి అయిదుశాతం తీసుకోగలిగితే చాలు నేను. అలా తీసుకోగలిగితే మొత్తంలో ఇరవై శాతం నాదవుతుంది. అయిదో వర్గం'.

'అయినా గాని అన్ని వర్గాలతో సమానంగా నీకూ ఇరవై శాతం మాత్రమే ఉంటుంది', ఈ చదరంగపు ఆటలో ఎత్తులు పై ఎత్తులు అన్నీ ఆలోచించే ఉంచాడని తెలియక అగర్వాల్ వాదించాడు.

'మిగతా నాలుగు వర్గాలకు ఒకరంటే ఒకరికి పడదు. ఎవరికి అధికారం కావాలన్నా మాతో స్నేహం చేయాల్సిందే. మరో మార్గం లేదు – కులం, మతంతో సంబంధం లేని తటస్థ సంస్థ అది' అన్నాడు. గంగాసాగర్ విజయోత్సాహంతో.

'వాళ్ళ అభ్యర్థి మేయర్ అవడానికి ఒప్పుకొంటేనే వాళ్ళు నీకు మద్దతిస్తారు. మరి ఇక్రంని మేయర్ ఎలా చేస్తావ్?'

'మేయర్‌ను సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ఈ ఆట సిద్ధాంతం ఏమిటంటే ఇది సాధారణ ఓటు కంటె భిన్నమైంది', గంగాసాగర్ వివరించాడు. 'పెందలకడే లేచేవాడికి లాభం కాని రెండో వాడికే వెన్న దొరుకుతుంది! ఇక్రంభాయ్‌కి అందరూ మొదటి ప్రాధాన్యతా ఓటేయనవసరం లేదు – రెండో ప్రాధాన్యతనిస్తే చాలు'.

'అతనికి అదెలా ఉపయోగిస్తుంది?' అగర్వాల్ అడిగాడు.

'కార్పొరేటర్లందరూ బ్యాలట్‌ను సమర్పించేటప్పుడు అయిదుగురు అభ్యర్థులను ప్రాధాన్యతా క్రమంలో సూచించాలి',

'అయితే?'

'అయిదు రాజకీయ వర్గాలకు, మాతో సహా మొదటి ప్రాధాన్యత వాళ్ళ వర్గం నుంచే ఉంటుంది'.

'నిజమే. కాని అప్పుడు కూడా ఇక్రం మిగిలిన అభ్యర్థులతో సమానంగానే ఉంటాడు'.

'ఆc... కాని ఒక్కో కార్పొరేటరు మొదటి ప్రాధాన్యతనే కాకుండా వరుసగా అయిదుగురు అభ్యర్థుల ప్రాధాన్యతాక్రమాన్ని సూచించాలి. నాలుగు వర్గాలకు ఒకరంటే ఒకరికి తీవ్ర విద్వేషం కనుక మరొకరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత నివ్వరు. నేను వారికి చెప్పేది ఇదే, వారు ఇక్రంను రెండో ప్రాధాన్యతలో సూచించాలని'.

'ఈ ప్రక్రియ ఖచ్చితంగా ఎలా జరుగుతుంది?', వాకబు చేశారు అగర్వాల్.

'మొదటి విడతలో మొదటి ప్రాధాన్యతా అభ్యర్థులను లెక్కిస్తారు. ఇక్రంతో సహా అందరూ సమానంగానే ఉంటారు. కచ్చితంగా ఎవరూ గెలవలేదు కనుక రెండో ప్రాధాన్యతా ఓట్లు లెక్కించి ప్రతి అభ్యర్థికి కలుపుతారు. ఈ దశలో ఇక్రం బలపడతాడు. రెండో ఎలుక వెన్నను తీసుకొస్తుంది ఇంటికి!' గంగాసాగర్ వివరించాడు.

'నీ ఎలుక పిల్లిలా మారకూడదని ఆశిస్తాను గంగా' అన్నారు అగర్వాల్.

'మహాత్మాగాంధీ చెప్పిన ప్రధాన తాత్త్విక సిద్ధాంతమేమిటి? ఎవరైనా చెప్పగలరా?'

వెనుకనుంచి 'అహింస' అని సమాధానం వచ్చింది. నాజూగ్గా, చూడముచ్చటగా ఉన్న పదమూడేళ్ళ బాలిక ఆమె. ముఖం గుండ్రంగా ఉంది. నల్లని జుట్టుకి నూనె రాసి ఒక జడ వేసి ఎర్ర రిబ్బనుతో పైకి కట్టింది. నూనె నుంచి, దువ్వెన నుంచి తప్పించుకున్న ముంగురులు ముఖం మీద ఉన్నాయి. వెలిసినట్టున్న బూడిదరంగు స్కర్ట్, నీలం చొక్కా – మురికివాడల్లోని స్కూళ్ళ యూనిఫాం వేసుకుంది. అయితే ఆమె మేనిఛాయ మాత్రం ఆ పరిసరాల్లో అసాధారణమైనంత తెల్లగా కనిపిస్తోంది. చిన్న చిన్న తెల్లని పళ్ళు, గులాబీ పెదాలు, మెరిసే ఆకుపచ్చని కళ్ళు, తెలివితేటలు, అమాయకత్వం కలిసి ఉన్నట్టుగా ఉంది.

గంగాసాగర్ తన వైపు చూడగానే పిరికిగా పెన్సిలును తిప్పుతూ ఉండిపోయింది. 'వెరీగుడ్' చాందినీ. దాని అర్థమేమిటో చెప్పగలవా?'

'అహింస అంటే హింసించకుండా ఉండడం'.

'అంటే పోట్లాడకూడదని అర్థమా?'

'కాదు. అహింస అంటే పిరికితనం కాదు. ధైర్యంగా నిలబడి ప్రమాదాన్ని ఎదుర్కొనడం'.

'అంటే, హింస లేకుండా మనక్కావలసింది సాధించుకొనడమా?'

'అవును. మీరేం సాధించాలనుకుంటున్నారో ప్రజలకు అర్థమయేలా చెప్పే నైతికాధికారం మీకుండాలి. గాంధీగారి నైతికాధికారం చాలా గొప్పది'.

'ఆ నైతికాధికారం ఆయనకెలా లభించిందో చెప్పగలవా?'

'ఇతరులకు ఉదాహరణ ప్రాయంగా ఉన్నాడాయన?' సందేహిస్తూ చెప్పింది గుప్తా కుమార్తె.

'అవును. భారతీయులందరూ పరిత్యాగాన్ని ఆరాధిస్తుంటాం. ప్రాచీన యోగుల నుంచి ఈ సంప్రదాయం మనకు వచ్చింది. అలా చూస్తే, గాంధీజీ ఆధునిక యోగి'.

'ఆయన పేదరికంలో జీవించాడనా?', ఆమె తన పచ్చని కళ్ళు విప్పార్చి చూస్తూ అడిగింది.

'అవును. కాని పేదరికం ఒక ప్రతీక. ఆ ప్రతీక ప్రజలను తనతో కలిపి ఉంచుకునే రాజకీయాధికారాన్ని ఆయనకు ఇచ్చింది'.

'దాని వల్ల దేశానికి చాలా డబ్బు ఆదా అయిందా?'

'హః! సరోజినినాయుడు – మన ఉత్తరప్రదేశ్‌కు మొదటి గవర్నర్ ఇదే విషయాన్ని చాలా సొగసుగా చెప్పిందోసారి – మహాత్ముడిని పేదరికంలో ఉంచడానికి భారతదేశానికి చాలా ఖర్చయిందని!'

'మరి ఆయనెందుకలా చేశారు?

'పరిత్యాగానికున్న శక్తి అది తల్లీ'.

'మీరు మేయర్ కాకుండా త్యాగం చేసి ఇక్రం అంకుల్‌ని మేయర్ అవనీయడం వంటిదా?'

'ఆc, అలాంటిదే'. నిశ్శబ్దంగా నవ్వాడు గంగాసాగర్.

---

'ఇక్రం ఈ నగరాన్ని శుభ్రం చెయ్యాలి.'

'అంటే 'ఎవరినైనా చంపమని' అంటున్నారా గంగాసాగర్ గారూ?'

'కాదు.'

'వీధులూడ్చి, చెత్తను పారేసి శుభ్రం చేయమనడం లేదు కదా, అలా చేయమంటున్నారా?'

'అదే చేయమంటున్నాను. నగరం రోతగా ఉంది'.

'మునిసిపల్ కార్పొరేషన్‌ని నియంత్రించే అధికారాన్ని పొందడం డబ్బు సంపాదించడానికి గాని వాస్తవంగా శుభ్రం చెయ్యడానికి కాదు'.

'అవినీతి జీవిత విధానం కాదనేంత తెలివితక్కువవాణ్ణి కాను. **అభానస**ను శక్తిమంతం చేయడానికి డబ్బు కావాలి, అయినాగాని దానితోపాటు కొంతమంచి కూడా చేయాలి'.

'ఎందుకు? స్థానిక ప్రభుత్వంలో ఎవరైనా మంచి పనులు చేశారా?'

'మనం మంచివాళ్ళం కాబట్టి మంచి చేయాలనడం లేదు. వచ్చే ఎన్నికల్లో వేరే పార్టీల సాయం లేకుండా గెలవడానికి మనం మంచి చేయాలి'.

'ఈసారి మనం బాగా డబ్బులు సంపాదిస్తే, కార్పొరేషన్‌కి మరోసారి ఎన్నిక కావాల్సిన అవసరం రాదు. మనం ధనవంతులమవుతాం'.

'కార్పొరేషన్ గురించి ఎవరు మాట్లాడుతున్నారు?'

'హుc'

'ఓయ్ ఇక్రం. నిజమైన అధికారం రాష్ట్రస్థాయిలో ఉంటుంది. స్థానిక ప్రభుత్వంలో కాదు. అయిదేళ్ళ తర్వాత మనమంతా అక్కడుంటాం – ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో'.

---

'గంగాసాగర్‌గారూ, చెత్త పనివాళ్ళు సమ్మె చేస్తున్నారు. వాళ్ళు కొత్త క్రమశిక్షణ ప్రకారం ఎక్కువ గంటలు పనిచేయాల్సి ఉందట – జీతభత్యాలు ఎక్కువ కావాలంటున్నారు'.

'ఇప్పటికే వాళ్ళకి జీతాలెక్కువున్నాయి. కార్పొరేషన్ ఇంకా జీతాలు పెంచే స్థితిలో లేదు'.

'మరి నన్నేం చేయమంటారు? మునిసిపల్ కమీషనర్ ప్రతి పది నిముషాలకోసారి ఫోన్ చేసి సంప్రదింపు సెటిల్మెంట్ అడుగుతున్నాడు'.

'సంప్రదింపులు బలమైన స్థితిలో జరపాలి. బలహీనంగా కాదు. ఒకవేళ అత్యవసర సేవలకు అంతరాయం కలిగితే వాళ్ళదే పైచేయి అవుతుంది'.

'మీరనేదేమిటి మేయర్ని నేను. వెళ్ళి ఊరంతా చెత్త ఎత్తిపోయమనా?'

'కాదు. మీ మురికివాడలో చెత్తపోగు చేసుకునే వాళ్ళు వందలాదిమంది ఉన్నారు. వాళ్ళకి కొంచెం రోజువారీ భత్యం ఇచ్చి పనిచేయించుకోండి. వాళ్ళు పనిచేయడమే కాకుండా చెత్తను రీసైకిల్ చేస్తారు. అది ఆర్థికంగా, పర్యావరణ పరంగా ప్రయోజనం కలిగించే పరిష్కారం'.

'చెత్త పారేసేవాళ్ళకి కోపం వస్తుందేమో'.

'మనకి రాకుండా వాళ్ళకి రావడం మంచిది. ఒకసారి చర్చలు జరిపితే దారికొస్తారు'.

'మునిసిపల్ ఆసుపత్రులు దయనీయంగా ఉన్నాయి. గంగాసాగర్గారూ'.

'వాటిని బాగు చేసి స్థాయి పెంచాలి ఇక్రం'.

'మన దగ్గర బడ్జెట్ లేదు. లోటులో ఉన్నాం'.

'అయితే ఆసుపత్రుల పేరు మార్చుదాం'.

'కొత్త పేర్ల వల్ల పరిస్థితి ఎలా మెరుగవుతుంది?'

'సింపుల్. పన్ను ఎగవేసినందుకు కోర్టు కేసులు నడుస్తున్న వారెంతమంది ఉన్నారు ఊర్లో?

'చాలామందే ఉన్నారు ఎందుకు?'

'వాళ్ళ పేరుతో ఏదైనా దాన కార్యక్రమం చేస్తామని చెప్పండి. సౌకర్యాలను మెరుగుపరచడానికి పెద్దమొత్తంలో విరాళమివ్వమనండి. మనం ఆసుపత్రులకు సంతోషంగా

పేరు మార్చుదాం! వాళ్ళు సహాయం చేసిన వారవుతారు. మనకి సౌకర్యాలు పెంచుకోవడానికి డబ్బు వస్తుంది!'

'వాళ్ళు ఒప్పుకోకపోతే?'

'పన్ను ఎగేసిన కేసులు రెట్టించిన వేగంతో నడుస్తాయని చెప్పు'.

'గంగాసాగర్ గారూ, రోడ్లు మళ్ళీ గుంటలు పడ్డాయి.

'ఇక్రం, రోడ్లేసిన నిర్మాణ సంస్థలకు జరిమానాలెందుకు వెయ్యకూడదు?'

'మునిసిపల్ వాళ్ళు చెప్పిన ప్రమాణాల ప్రకారమే సామాగ్రి ఉపయోగించాం అంటున్నారు. ప్రమాణాలు తక్కువస్థాయిలో ఉండడం వాళ్ళ తప్పు కాదు'.

'సరే. వచ్చే ఏడాది పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం ప్రాజెక్టులు చేపడుతున్నామని ప్రకటించు. పత్రికలకు చెప్పండి.

'కాని మనం చేపట్టడం లేదు కదా'

'ఆం కాని వాళ్ళకు తెలీదు కదా. మన దగ్గర్నుంచి భవిష్యత్తులో వ్యాపారం ఆశించే సంస్థలు మీ గుంటలన్నిటినీ ఉచితంగా పూడ్చేస్తాయి'.

'గంగాసాగర్‌గారూ, ఈ ఏడాది రెవెన్యూ ఆదాయం తగ్గింది'.

'మన రెవెన్యూ వనరులేమిటి, ఇక్రం?'

'ఆస్తి పన్ను, లైసెన్సు ఫీజు, మునిసిపల్ భూముల అద్దె'.

'ఆస్తి పన్నును గాని, లైసెన్సు ఫీజును గాని పెంచడం తగిన పని కాదు. ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడి పన్ను రెవెన్యూలు తగ్గుతాయి. మునిసిపల్ భూముల అద్దె పెంచండి'.

'మార్కెట్ రేట్ల కన్నా తక్కువున్నా మునిసిపల్ అద్దెలు పెంచలేం. అద్దె ఒప్పందాలు లాక్ ఇన్ అయి ఉన్నాయి.'

'ఒప్పందాలు రద్దు చెయ్యండి'.

'అద్దెదారులు కోర్టుకెళతారు'.

'వెళ్ళనీ. మునిసిపల్ కార్పొరేషన్ తరపున ఒక ప్రభుత్వ వకీలు ఉంటే, ప్రతి అద్దెదారుడికీ బోలెడుమంది కావాలి. మన కోర్టు ఖర్చులు వాళ్ళతో పోలిస్తే చాలా తక్కువ.

'ఏళ్ళ తరబడి సమస్య పరిష్కారం లేకుండా కోర్టులో ఉండిపోతుంది. చివరికి మనం ఓడిపోతాం. చట్టపరంగా మనం నిలబడలేం'.

'మంచిది. ఉన్నది ఉన్నట్టుగా అద్దెకిచ్చిన భూములను అమ్మేస్తామని బెదిరించండి'.

'అద్దెకిచ్చిన ఆస్తులను ఎవరూ కొనరు'.

'ఇక్రం, నువ్వు మేయర్ కాకముందు మురికివాడకు రాజువు కదా. నేను చెప్పింది రైటేనా?'

'మీ ఆశీర్వాదం, అండదండలతోనే సర్' విక్రం అన్నాడు.

'ఆలోచించు నువ్వే. కొనేవాడు చీకటి ప్రపంచం డాన్ అయితే అద్దెకుండేవాళ్ళు డాన్‌ని భూస్వామిగా ఉంచుకొని ప్రశాంతంగా ఉండగలరా?'

'కచ్చితంగా ఉండలేరు. మాఫియా వాళ్ళు భూమిని ఖాళీ చేయించడానికి అడ్డమైన, ఉన్నవీ లేనివీ అన్ని ట్రిక్కులూ ఉపయోగిస్తారు అద్దెదారులు భయభ్రాంతులవుతారు'.

'అద్దె పెంచడానికి మనతో ఒప్పందానికి రావడమో, ఆయుష్షు తగ్గించుకోవడానికి డాన్‌తో సంప్రదింపులు జరపడమో, రెండే అవకాశాలున్నాయని అద్దెదారులకు చెప్పు. వాళ్ళు మొదటి దానికే అంగీకరిస్తారని నా నమ్మకం.'

'గంగాసాగర్‌గారూ, మురుగు పారబోత విధానం కాంట్రాక్టుపై సంతకం చేశాను'.

'పార్టీకి అయిదుశాతం ఉంచావా ఇక్రం!'

'ఉంచాను. మీరు చెప్పినట్టుగానే'.

'నగరం కూడా 20శాతం ఆదా చేసుకొనేలా చూశారా?

'బిడ్డింగ్ ప్రక్రియ అదే విధంగా ఉంది'.

'గుడ్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే మన పార్టీకి డబ్బు బాగా ఉండాలని నాకు తెలుసు. కాని పౌరుల కోసం ధనం దాయకుండా ఇట్లా చేయడానికి నేనొప్పుకోను.

సాధారణ పౌరులకు ఏమీ మిగల్చకుండా తమ జేబులు నింపుకొనేవారు మునిసిపల్ కార్పొరేషన్లో ఎందరో చెడ్డ అధికారులున్నారు'.

'పాపాలన్నిటికీ మూలం డబ్బే కదా'.

'ఆc. కొన్నిసార్లు మనిషికి మూలాలు అవసరం'.

'మన శక్తికొద్దీ బ్యూరోక్రసీని తగ్గిద్దాం' గంగాసాగర్ సూచించాడు. కొత్తగా నియమింపబడిన మునిసిపల్ కమీషనర్‌తో కలిసి మేయర్ ఆఫీసులో కూర్చున్నాడతను. నిజమైన రాజకీయాధికారి గంగాసాగరేనని కమిషనర్‌కు తెలుసు. మేయర్ టి.వి. అయితే గంగాసాగర్ రిమోట్ కంట్రోల్.

గంగాసాగర్‌ని సంతోషపెట్టటానికి అధికారిక జాప్యం జరగకుండా మార్గదర్శకాలు రూపొందించమని తన డెప్యూటీలకు చెప్పాడు. అది ప్రభుత్వ భాషలో రాసిన పెద్ద డాక్యుమెంటు. దాని పైన చిన్న గమనిక రాసి మర్నాడు కమిషనర్‌కు తిప్పి పంపాడు గంగాసాగర్. ఆ గమనిక ఇలా ఉంది:

గాయత్రీ మంత్రం : 14 పదాలు

పైథాగరస్ సిద్ధాంతం : 24 పదాలు

ఆర్కిమెడిస్ సూత్రం : 67 పదాలు

ద టెన్ కమాండ్‌మెంట్స్ : 179 పదాలు

జవహర్లాల్ నెహ్రూ ప్రారంభోపన్యాసం : 1,094 పదాలు

జాప్యాన్ని నివారించడానికి మీరు చేసిన సిఫారసులు : 22,913 పదాలు

గంగ ఒడ్డున అగర్వాల్ ప్రయివేటు నదీ తీరంలో ఇక్రం, గంగాసాగర్, అగర్వాల్ గారు లాగూలతో కాలుమీద కాలేసుకుని కూర్చుని ఉన్నారు. ఒక్కొక్కరి వెనుక ఒక్కో మాలిష్‌వాలా ఉన్నాడు. కాన్పూర్‌లో ఒళ్ళు పట్టేవాళ్ళకిష్టమైన ఆవనూనె వాసనొస్తున్నారు వాళ్ళంతా. గోరు వెచ్చటి నూనెతో ముగ్గురికీ మాడు బాగా మర్దన చేశారు. అగర్వాల్‌గారికి బట్టతల. అయినా గాని మాలిష్‌వాలా బాగా మర్దనా చేశాడు. తలలపై నూనె మర్దనా

చేస్తూనే అప్పుడప్పుడు వాళ్ళు యజమానుల మెడలు, భుజాలు, చేతులు, వెన్ను కూడా మర్దనా చేస్తున్నారు. అది జిడ్డు, గొణుగుడు కలిసిన ఉన్మత్తానందం.

'గంగా, రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేంత బలం మనకుందా?', అగర్వాల్ గారడిగారు.

'మనకి బలం ఉందా లేదా అనేది కాదు చర్చనీయాంశం. ప్రతిపక్షాన్ని బలహీనం చేయగలమా లేదా అని ఆలోచించాలి'.

మాలిష్‌వాలా తన వేళ్ళను చెవుల్లో పెట్టి కర్ణభేరికి వైబ్రేషన్ థెరపీ ఇస్తున్నప్పుడు కలిగిన ఆనందాన్ని అనుభవిస్తూ గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

'నువ్వెలా పనిచేస్తావో తెలుసు కనుక ప్లాన్ సిద్ధంగా ఉంచుకున్నావనుకుంటాను', అన్నారు అగర్వాల్ చేతులు చాచి మాలిష్‌వాలాకి అరచేతులను గుండ్రంగా బొటనవేళ్ళతో మాలిష్ చేయడానికి వీలుగా ఇస్తూ – ఇలా చేస్తే రక్తప్రసరణ బాగా ఉంటుంది.

'మన మాననీయ ముఖ్యమంత్రి గారికి గౌరవాస్పదం కాని దుర్గుణాలున్నాయని విన్నాను', అన్నాడు గంగాసాగర్.

'ఏమిటవి?' ఇక్రం అడిగాడు.

'ఎవరని అడగడం సరైన ప్రశ్న' అని గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

'సరే. ఎవరు వాళ్ళు?'

'ఆడాళ్ళ పేర్లు అకారాది క్రమంలో అప్పజెప్పాలా?' జోక్ చేశాడు గంగాసాగర్.

'అయితే కానీండి, కాని ఇది మనకెలా ఉపయోగపడుతుంది?' అగర్వాల్ గారడిగారు. ముఖ్యమంత్రికి మంచి పరిపాలకుడిగా పేరుంది. అతని చేతిలో చుక్కాని ఉండగా, ప్రభుత్వాన్ని కూలదోయలేం. అతను తప్పుకుంటే, పరిస్థితి వేరుగా ఉంటుంది'.

'పని విషయంలో సఫలతకోసం ఆలోచించేవారు, మిగిలిన విషయాల గురించి కూడా అంతే శ్రద్ధగా ఉంటారు'. గంగాసాగర్ సూచించాడు.

'ఎన్నికలు దగ్గరపడ్డాయి కనుక అతను జాగ్రత్తగా ఉంటాడు. తప్పు చేస్తుండగా మనకి అంత తేలిగ్గా దొరకడు' ఇక్రం.

'ప్రలోభం నుంచి తప్పించుకొనడానికి మార్గం తరచుగా దానికి లొంగడమే' గంగాసాగర్ శాంతంగా అన్నాడు.

లక్నోలో అక్బరీ దర్వాజా దగ్గరున్న గుల్బదన్ కోఠాకి ప్రచ్ఛన్నంగా పేరుంది. కాలంతో పట్టింపులేకుండా అలాగే నిలిచి వున్న వేశ్యల నివాసాలలో అదొకటి. ఆ కోఠాకి యజమానురాలు సంపన్నురాలు. కాశ్మీరు ఊలు, జరీ పనితనం ఉన్న శాలువాలు ధరిస్తుంది, క్రిస్టల్ హుక్కాలు పీలుస్తుంది. పచ్చల పానపాత్రలతో తాగుతుంది, విలువైన రాళ్ళు పొదిగిన పాదరక్షలు వేసుకుంటుంది, వెండి ఉమ్మి పాత్రలు వాడుతుంది, స్వచ్ఛమైన పట్టుపరుపులపై పడుకుంటుంది. ఒక్క మనిషితో మాత్రమే పడుకుంటుంది.

బాగా ఆలోచించి ఎన్నుకుంటుంది. డబ్బు కోసం కాదు. అది ఆమెకు చాలా ఉంది. అధికారం కావాలి. అధికారం తన సమక్షంలో ఉన్నపుడు మాత్రమే పడకలో ఆర్ద్రంగా, కోరికలు పడగెత్తిన ఆడదిలా ఉండగలదామె. లక్నోలో రాష్ట్ర ముఖ్యమంత్రి కన్న అధికారం గలవాళ్ళెవరూలేరు.

పడకగది తలుపు బయట నిలబడి ఉన్న రిపోర్టర్ మురికిగా, చింపిరిజుట్టుతో ఉన్నాడు. చొక్కా అంతా చెమట మరకలు. నాసిరకం ప్యాంటు బాగా నలిగి ఉంది. కుడి బూటుకు లేసు కూడా సరిగా కట్టలేదు. కళ్ళద్దాలు జిడ్డుగా ఉన్నాయి. దుబ్బులా ఉన్న నల్లటి జుట్టులోంచి చుండ్రు భుజాల మీద పడింది. అతని మెడకు ఇంగ్లాండులో తయారైన, అన్‌కపుల్డ్ రేంజ్ ఫైండర్ ఉన్న అగిలెక్స్ కెమెరా ఉంది. రిపోర్టర్‌కి బాగా డబ్బు ముట్టింది. దాదాపు నెల జీతం. టిప్ ఆఫ్ కూడా సరిగ్గా ఉంది. కాగితం మీద ఏ గుర్తులూ లేకుండా, సంతకం లేకుండా స్థలం, తేదీ నీట్‌గా టైప్ చేసి ఉంది. అతని జీవితంలో ఇదే అతి పెద్ద స్కూప్.

పడగ్గది బయట ఉన్న పని మనిషి డోర్ హాండిల్ తిప్పమని సైగ చేసింది. అతను మునిగాళ్ళ మీద తలుపు దగ్గరికి వచ్చి చేత్తో హాండిల్‌ను తిప్పాడు. తాళం తీసే ఉంది. తెలిసిందే. పనిమనిషి తన దగ్గరున్న తాళంతో దానిని తెరిచింది. పనిమనిషి సహకరించడానికి కారణమైనది అతని చేతుల్లో ఉంది – బ్రౌన్ పేపర్లో చుట్టి దారంతో కట్టిన పెద్ద పార్శిల్ అతని చేతిలో ఉంది. దానిలో క్షయ వ్యాధి చికిత్సకు పనికి వచ్చే అద్భుతమైన కొత్త మందు ఉంది – అమెరికాలో మాత్రమే తయారై, అక్కడ మాత్రమే దొరికేమందు.

గుల్‌బదన్ కోఠాను గమనిస్తున్న ప్రయివేటు డిటెక్టివ్ ఆ అమ్మాయిని ఉపయోగించుకోవచ్చని సూచించాడు. ఆమె తల్లి క్షయవ్యాధితో తీసుకుంటోందని వైద్యానికి డబ్బు లేక ఆమె చాలా ఇబ్బందిపడుతోందని పరిశోధన వల్ల తెలిసింది. క్షయవ్యాధికి

కొత్తగా మందు కనిపెట్టారు. న్యూయార్క్‌లోని తన వ్యాపార పరిచయాల ద్వారా ఈ మందు తెప్పించమని అగర్వాల్‌గారిని గంగాసాగర్ అడిగాడు. ఆ తర్వాత ఈ పనిలో సాయం చేసేలా ఆ అమ్మాయిని ఒప్పించడం పెద్ద కష్టం కాలేదు.

రిపోర్టర్ హాండిల్‌ని వదిలి, ఆ హాండిల్ పట్టుకోమని ఆ అమ్మాయికి సైగ చేసి కళ్ళ ముందు కెమేరా పట్టుకున్నాడు.

'మూడు లెక్కపెట్టగానే తలుపు తియ్యాలి' అని గుసగుసగా చెప్పాడు 'ఒకటి-రెండు-మూడు!' ఆమె తలుపు తెరవగానే ఒకసారి క్లిక్‌మనిపించాడు కెమెరాని. తర్వాత సంభోగిస్తున్న జంట ఎక్కడున్నారో చూసి వాళ్ళవైపు వ్యూఫైండర్ తిప్పి మరోసారి క్లిక్ చేశాడు. మూడో ఫోటో కూడా తియ్యాలనుకున్నాడు కాని టైం లేదు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ వాళ్ళని పిలిచాడు. 'గార్డ్స్! బుద్ధిలేని కుక్కని పట్టుకోండి!' అంటూ కేకపెట్టాడు. కాని అప్పటికే చాలా ఆలస్యమైంది.

రిపోర్టరు బయటకు వచ్చే దారిని ముందుగానే పనిమనిషి సహకారంతో పని వాళ్ళు వచ్చే వైపు నుంచి ఏర్పాటు చేసుకున్నాడు. గార్డులు ముఖ్యమంత్రి అంబాసిడర్ కారులో ఎవరికీ కనబడకుండా ఇంటికెళ్ళేదారిలో కూర్చున్నారు.

ఇంటికి ఉత్తరంగా చీకటిగా ఉన్న సందులోకి వచ్చి రిపోర్టరు ఊపిరి పీల్చుకున్నాడు. మర్నాటి పేపరుకు, ఎడిటర్ కివ్వడానికి కథనం సిద్ధం చేసుకుంటూ గబగబా నడిచాడు. తన ఫిల్మ్ రోల్‌లో ఉన్న ఫోటోలను తలచుకున్నాడు. తనలో తనే నవ్వుకున్నాడు. 'శృంగారానికి, అశ్లీలానికి తేడా వెలుతురుతోనే కలుగుతుంది', తనలో తానే అనుకున్నాడు.

'అతను రాజీనామా చేసేశాడు!' గంగాసాగర్ విజయోత్సాహంతో బిగ్గరగా అన్నాడు, 'బంతితో కాదు ఆ మనిషినే ఆడుకోవాలని నాకు తెలుసు?'

'ఏమిటి? వాడి బంతులుతోనా?'

ఇక్రం వేసిన జోక్‌ని పట్టించుకోకుండా 'అది కూడా' అన్నాడు. 'అతని రాజీనామాతో, పార్టీ గందరగోళంలో పడుతుంది. ఎడం పక్క గుద్దిన గుద్దుతో పాటు వెంటనే కుడివైపు కూడా దెబ్బపడాలి. దాంతో పార్టీ మళ్ళీ కోలుకొనడం, కుదురుకొనడం అసాధ్యమవుతుంది' మరో పాన్ నోట్లో పెట్టుకుంటూ.

'రాష్ట్రంలో, ముఖ్యమంత్రి తర్వాత అంత అధికారముండేది ఎవరికి?'

'రాష్ట్ర హోంమంత్రికి' ఇక్రం అన్నాడు.

'హోం మినిస్టర్ చేసే పనేంటి?'

'శాంతిభద్రతలు కాపాడడం.'

'శాంతిభద్రతలు క్షీణిస్తే ఏమౌతుంది?'

'సహచరులు అతన్ని ప్రత్యామ్నాయ అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేయడానికిష్టపడరు'.

'ఇక్రం, మేయర్‌వి గదా. నువ్వు పోలీసు కమిషనర్‌తో నేరుగా మాట్లాడవచ్చు కదా?'

'నాలాంటి రాస్కెల్స్‌కి, పోలీసులకి ఎప్పుడూ, డైరెక్ట్ కనెక్షన్ ఉంటుంది' అని ఇక్రం నవ్వాడు. 'ఏం చెయ్యమంటారు? కచ్చితంగా చెప్పండి'.

రజ్జోభయ్యా తన పాత మహేంద్ర జీప్‌లో గుబురుగా ఉన్న నల్ల మీసాలు సవరించుకుంటూ డ్రైవర్ సీట్లో కూర్చున్నాడు. చేతిలో స్టీలు మగ్గులో ఠండాయీ ఉంది. మగ్గులో మొదటి సగంలోని చల్లటి పాలు – బాదాంలు, చక్కెర, గులాబీరేకులు, మిరియాలు, ఏలకులు, కుంకుమపువ్వు, తెల్లగసాలు బాగా వేసినవి ఇప్పటికే అతని కడుపులో కదులుతున్నాయి. హత్యలు, దాడులు, అక్రమాయుధాలు కలిగి ఉండడం వంటి ఇరవై ఆరు క్రిమినల్ కేసుల్లో విచారణలో ఉన్న రజ్జో రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడు. అక్రమ సంబంధంతో పట్టుబడ్డ ముఖ్యమంత్రికి బాగా నమ్మకస్థుడు. రాష్ట్ర రాజకీయాలు కడుపులో దాచుకున్న అసహ్యమైన రహస్యం రజ్జో.

అతని పక్కనే కూర్చున్నది పాత స్నేహితుడు పోలీసు కమీషనర్. ఏకాంతంగా ఉండే చోట కలవాలని స్పష్టంగా చెప్పాడు. రజ్జోతో మాట్లాడుతూ ఎవరికీ కనబడకూడదు–శత్రువు అవుతాడు కదా. ఆగ్రహంతో ఉండే పత్రికలు, మోసపోవడానికి సిద్ధంగా ఉండే జనాలు రజ్జో, పోలీసు చీఫ్ పరస్పర సహకారంతో వృత్తులు నిర్వర్తిస్తుంటారనే వాస్తవాన్ని ఎన్నడూ అంగీకరించలేరు. రజ్జో లాంటి వాళ్ళు పౌరుల్లా ఉండే నేరస్థులు, పోలీసులు యూనిఫాంలో ఉన్న నేరస్థులు. పోలీసు కమీషనర్ అదే పనిగా ముక్కు గిల్లుకుంటున్నాడు. మధ్యలోగొంతులో ఏదో దురద అనిపించిందేమో, బాగా దగ్గి, కాండ్రించి కఫాన్ని నోట్లోంచి

నేల మీద ఊశాడు. ముక్కు గిల్లుకోవడం, గొంతు సవరించుకొనడం అతనికిష్టమైన పనుల్లా ఉన్నాయి చూడబోతే.

"ఆ దొంగనాకొడుకు నీ మీదున్న పెండింగ్ కేసులన్నీ విచారించమన్నాడు. నిన్నో ఉదాహరణగా చూపమన్నాడు', చివరికి పోలీసు కమషనర్ చెప్పాడు.

'వాడికి మతి పోయిందా ఏంటి? దానివల్ల పార్టీకే నష్టమని ఆ రోత నా కొడుక్కి తెలియదా? పాలక పక్షంలో పేరున్న సభ్యుణ్ణి. కాదా? ఎన్నికలలో ఇదెలా అతన్ని గెలిపిస్తుంది?' ఆగ్రహంతో రజ్జో డిమాండ్ చేశాడు.

'ఇప్పుడున్న స్థితిలో తన సహచరులందరికీ తను చవటని కాదని రుజువు చెయ్యడమే హోం మినిస్టర్‌కి ముఖ్యమైనది. తన స్థితి భద్రంగా ఉంటే, తర్వాత పార్టీ గురించి ఆలోచిస్తాడు!' అన్నాడు పోలీస్ కమీషనర్, అప్పటివరకూ బయటికి రాకుండా ముక్కులో ఉండి ఇబ్బంది పెడుతున్న వెంట్రుకని బయటికి పీకుతూ.

'అలాగైతే ఆ ముచ్చు ముండాకొడుక్కి నేనేం చేయగలనో చూపిస్తాను', కోపంగా అన్నాడు రజ్జో మగ్గులో మిగిలిన ఠండాయిని జీపులోంచి నేల మీదకి విసిరేస్తూ.

'ఎదురుపడి విరోధం పెట్టుకోకుండా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించేలా చేస్తూ ఒక సంకేతం పంపొచ్చు అతనికి', సాయం చేస్తున్నట్టుగా అన్నాడు పోలీస్ కమీషనర్.

'ఎలా?' గొణిగాడు రజ్జో.

'రాజకీయంగా ఛాలెంజ్ చెయ్యొచ్చు. అతని నియోజకవర్గంలో ర్యాలీ జరుపు. దాంతో కొంచెం కంగు తింటాడు'.

రజ్జో చిరునవ్వు నవ్వాడు. అతని ముందు పళ్ళు రెండు బంగారపువి. విజయహాసం లాంటి నవ్వుని విసురుతున్నట్టుగా భావిస్తూ. 'పేపర్లు సర్దుకునే పోలీసు కమీషనర్‌గా నిన్నెవరు తయారుచేశారు? నువ్వు మంత్రివి కావాల్సింది - నంగిగా ఉండేవాళ్ళలాగా అని అనడం లేదు!'

'ర్యాలీ జరపొద్దని చెప్పాను సర్, అతనికి. దానివల్ల శాంతిభద్రతల సమస్య వస్తుందని చెప్పాను. తన నిర్ణయం మార్చుకుంటానని చెప్పాడు నాతో. కాని మార్చుకోలేదు', ఆందోళన పడుతున్న ఉత్తరప్రదేశ్ హోంమంత్రికి పోలీస్ కమీషనర్ వివరించాడు.

'ఆ ముండలమారి ఎదురు తిరగ్గానే నేను నోరుమూసుకుని కూర్చుంటానను కున్నాడా?' మంత్రి అరిచాడు. 'వాడు పార్టీని గందరగోళ పరుస్తాడని భయపడుతున్నా, ఈ రోజే వాణ్ణి అరెస్టు చెయ్'.

మంత్రి తన కుర్చీని కోపంగా ఊపుతున్నాడు. 'బాధ ఊగే కుర్చీ లాంటిది' మనసులో అనుకున్నాడు. పోలీసు కమిషనర్. 'అది మనని బిజీగా ఉంచుతుంది, కాని ఏం తోచనివ్వదు' తన ఆలోచనలు ఆపి, ఇలా అన్నాడు.

'అదంత తెలివైన పని కాదు సర్. అతని కులం వాళ్ళలో చాలా మంది అనుచరులున్నారతనికి. వాళ్ళు ఇతన్నో రాబిన్‌హుడ్‌లా చూస్తారు. అరెస్టు చేస్తే మనం వాడి చేతుల్లో ఇరుక్కున్నట్టే', కుట్ర చేస్తున్నట్టుగా అన్నాడు పోలీస్ కమిషనర్.

'అరెస్టు చెయ్యకపోతే నేను బలహీనంగా, చవటలా కనిపిస్తాను. అదేమన్నా బాగుంటుందా? మీ బ్యూరోక్రాట్లకి ఎన్నికల చింత ఉండదు. మీకు బ్రతకడమంటే రిటైర్మెంటు వరకు పదవిలో ఉండడం; నాలాంటి రాజకీయ నాయకులు బ్రతకడమంటే ఆదివారం ఉదయం వరకు ఉండగలగటం!'

'మీ సెంటిమెంట్లు నాకర్థమయ్యాయి సర్. నేనొక సలహా ఇవ్వవచ్చా?'

'చెప్పు', అన్నాడు ఆగ్రహంతో ఉన్న మంత్రి.

'వాడికి బదులుగా వాడి సహచరులని అరెస్టు చేస్తే? వాళ్ళని తర్వాత బెయిల్ మీద విడుదల చేయొచ్చు. అవిధేయతని మీరొప్పుకోరని వాడికి సిగ్నల్ అందుతుంది, నేరుగా వాడితో తగాదాకి దిగినట్టు ఉండదు. వాడికి ఏంచేయాలో పాలుపోకుండా చెయ్యగలరు సర్. వాడింక ఎదురు తిరగలేడు'.

ఉత్తరప్రదేశ్ హోం మినిస్టర్ చిరునవ్వు నవ్వాడు. ఆయన డెబ్భయ్ ఐదేళ్ళ ముసలివాడు. పళ్ళు లేవు. కట్టుడు పళ్ళు. ఆయనకి కావలసిన వైపుకి తప్ప అవి అన్ని వేపులా తిరుగుతాయి. పోలీస్ చీఫ్‌కి కట్టుడు పళ్ళ నవ్వు నొకదాన్ని విసిరి, 'నువ్వెందుకు రాజకీయాల్లోకి రాలేదు? నువ్వూ కావల్సినంత వక్రంగానే ఆలోచిస్తావు', అన్నాడు. కుర్చీని ఊపడం ఆపాడు.

'స్నేహితులారా, కొట్టుకుంటున్న ఈ నేరస్థులని చూడండి. వాళ్ళు మీ రక్షణ, భద్రత గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నామని చెబుతారు. నిజమేమిటంటే వాళ్లు ఒకళ్ళ

నౌకళ్ళు రక్షించుకోవడంలో బిజీగా ఉన్నారు – మీ భద్రత ఏమైతే వాళ్ళకేమిటి!' ఆక్రోశించాడు ఇక్రంభాయ్ హర్షధ్వానాల మధ్య.

'ఈ రాస్కెల్ రజ్జో, పెండింగ్ క్రిమినల్ కేసులు ఇరవై ఆరున్నా స్వేచ్ఛగా తిరిగేస్తున్నాడు ఎలా?'

మళ్ళీ చప్పట్లు.

'హోం మినిస్టర్ నియోజకవర్గంలో తిరుగుతూ హోంమినిస్టర్ వ్యవహారంలో ఎందుకు తలదూర్చుతున్నాడు? దీనివల్ల వాళ్ళు దొంగల్లా ముదురులని తెలియడం లేదా?', ఇంకా గట్టిగా చప్పట్లు మోగాయి.

'నేరస్థులని తెలిసిన వాళ్ళని హోంమినిస్టర్ ఎందుకు రక్షిస్తున్నాడు? సమర్థుడైన మన పోలీస్ కమిషనర్ రజ్జో అనుచరులని వందలమందిని అరెస్టు చేశాడు. ప్రతిసారి ఆయనకి మన రాజకీయ నాయకులు ఫోన్లు చేసి వాళ్ళని బెయిల్ మీద వదిలేయమని ఒత్తిడి చేశారు. వెన్నెముక లేకుండా తనని తాను హోంమినిస్టర్ అని చెప్పుకునే ఈ మనిషిని రాజీనామా ఇవ్వాలని మనం ఎందుకు డిమాండ్ చేయకూడదు?', పెద్ద ఎత్తున చప్పట్లు, ఈలలు కేకలతో అనుమతి లభించింది.

'ఇక్రంని క్షణంలో హీరోని చేసేశావ్', అని వ్యాఖ్యానించారు అగర్వాల్‌గారు. 'ఎన్నికల్లో **అభానస** గెలిస్తే తేలిగ్గా ముఖ్యమంత్రి పదవికి పోటీదారవుతాడు'.

'అదే నా సమస్య. అతను ఆ పదవికి తగినవాడు కాదు' అన్నాడు గంగాసాగర్.

'నీకేమైనా మతిస్థిమితం తప్పిందా, గంగా? చెత్త నుంచి అతన్ని పైకి తీసుకొచ్చావ్. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకొనే దశకి వచ్చేసరికి వెనక్కి తగ్గమంటున్నావ్? నమ్మలేను!' రుసరుసలాడాడు అగర్వాల్.

'ఎట్రోపైన్ గురించి విన్నారా? గంగాసాగర్ అడిగాడు

'లేదు. ఏమిటది?'

'విషం. డెడ్లీ నైట్ షేడ్ అనే మొక్క నుంచి తీస్తారు'.

'ఇక్రంకి విషం ఇవ్వాలనుకుంటున్నావా? అలా చేయడం అతి కాదా?'

ఈ ప్రమాదకరమైన విషాన్ని – ఎట్రోపైన్‌ని నరాలకు యాంటిడోట్‌గా వాడతారు. ఇది విషమైనా, చిన్నమోతాదుల్లో ఇచ్చి పెద్ద ప్రమాదాలు తగ్గించవచ్చునని చెబుతున్నాను అంతే.'

'అంటే ఇక్రం చిన్న మోతాదుల్లో వాడాల్సిన విషమా?'

'దురదృష్టవశాత్తు, అతని లేబుల్ మీదున్న కాలం చెల్లిపోయింది'.

సంచీ భుజాన వేసుకుని ఆమె తన గుడిసె వేపు నడుస్తోంది. ఆ రోజు ఆమెకిచ్చిన పాకెట్ మనీతో మసాలా పల్లీలు కొనుక్కుంది. నిమ్మకాయ, మిరపకాయల కారం కలిపిన పల్లీలు ఆమెకిష్టమైన చిరుతిండి. పోయిన వారం వాళ్ళ నాన్న ఆర్భాటంగా చూపించిన బాలీవుడ్ కొత్త సినిమా పాటని కూనిరాగం తీస్తూ కౌమార బాలిక – ఊహల్లో తేలుతోంది నూతన ప్రపంచం వైపు – పేదరికం, వ్యాధి, నశించడం లేని చోటికి. తన వెనకాలే తాగి తూలుతూ వస్తున్న మనిషిని చాందినీ చూడలేదు.

ఇంటికి కొంచెం దూరంలో ఉంది. రెండిళ్ళ మధ్య కిటికీల్లేని సందులోకి కుడివైపుకి తిరిగింది. నిర్మానుష్యంగా ఉన్న మలుపు తిరగబోతుండగా వాడామెను వెనుక నుంచి భుజాలు పట్టుకుని లాగాడు. ఆమె వెను తిరిగి వాడికెదురుగా నుంచుంది. పల్లీలు జారి నేల మీద ఆమె చుట్టూ పడ్డాయి. ఆమె రొమ్ములు అందుకోవాలన్నట్టుగా వాడు ముందుకొచ్చాడు. వాడి శ్వాసలోని దుర్వాసనకు వాంతి వచ్చినట్లై ఆమె అరిచింది కాని ఎందుచేతనో గొంతు బైటకి పెగల్లేదు. కారణం వాడి చేయి. ఎలాగో ఆమెని వెనక్కి తిప్పి ఒక చేత్తో ఆమె నోరు మూసి, రెండో చేత్తో ఆమెని తనకేసి గట్టిగా అదుముకున్నాడు. ఆ కాముకుడి నుంచి తప్పించుకోవడానికి ఆమె బాగా గింజుకుంది.

నోరు తెరిచి వాడి చేతివేళ్ళను కొరికింది. వాడు బాధతో అరిచి ఆమెను వదిలేశాడు. ఆమె వాడివైపు తిరిగింది, కళ్ళలోకి చూసి నవ్వింది, గురి చూసి వాడి రెండు కాళ్ళ మధ్య తన్నింది. వాడు బాధతో రెండు కాళ్ళ మధ్య చేతులు పెట్టుకుని ఆమెని తిట్టాడు.

చాందిని చిరునవ్వు నవ్వింది. ఆ క్షణంలో బలహీనురాలైన బాలిక మాయమైంది. 'ఇంకోసారి నన్ను ముట్టుకోవాలని ప్రయత్నించేసరికి నేనెంత శక్తిమంతురాలినై ఉంటానంటే, నీకు బుద్ధ కొట్టమని ఆదేశాలిస్తాను.'

తర్వాత ఏడ్చుకుంటూ ఇంటికి పరిగెత్తింది.

'ఆమె నాక్కావాలి. ఆమె నాకు చాలా అవసరం', అన్నాడు గంగాసాగర్.

'కాని గంగాసాగర్‌గారూ, చాందినీకిప్పుడు పదహారేళ్ళు. తనకి పెళ్ళి చెయ్యాలి. మీదగ్గరెలా ఉంచగలను? తనని' గుప్తా అడిగాడు.

'నేను చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చలేదా? దూరంగా ఉన్న కొత్త స్కూలుని, ఆసుపత్రిని చూపిస్తూ అడిగాడు గంగాసాగర్. 'ఒకనాటికి ఆమె బాగా అధికారం కలిగి ఉంటుంది. నువ్వామెని చూసి గర్వపడతావు. నేను వాగ్దానం చేస్తున్నా!'

'పార్టీలో ఆమేం చేస్తుంది?'

ఇప్పుడామె విదేశాలకి వెళ్ళి చదువు పూర్తి చేయాలి. తిరిగి వచ్చాక సాధారణ పార్టీ కార్యకర్తగానే పనిచేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు – వరదలు, కరువు కాటకాలు, భూకంపాలు వచ్చి కష్టపడుతున్న జనాలను పరామర్శించేందుకు అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తుంది. పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ వారికి ప్రియమైన వ్యక్తిగా మారుతుంది. ఆమె తనకో రాజకీయ, సామాజిక వేదికను తయారుచేసుకోవాలి'.

'ఇంకా మీకోసం నేనేం చేయాలి గంగాసాగర్‌గారూ?'

'ఆమెను దత్తత ఇవ్వాలి'.

'మీకేమైనా మతిపోయిందా? తన తల్లిదండ్రులు బ్రతికే ఉన్నారు. మీరామెకి కొత్త తల్లిదండ్రుల కోసం వెదుకుతున్నారా? ఇప్పుడున్న వాళ్ళెందుకు పనికి రారు?' నోట్లో ఉన్న పాన్ ఉమ్మిని ఊస్తూ గట్టిగా అడిగాడు గుప్తా.

'ఇక్రంభాయ్ ఆమెను దత్తత తీసుకోవాలని నా కోరిక'.

'మీకు పచ్చి పట్టింది! నా ప్రియమైన బిడ్డని మహమ్మదీయుడికి దత్తత ఇవ్వడానికి ఒప్పుకోవాలా? కుదరదు! ససేమిరా కుదరదు!'

'పేరుకే ఆమె దత్తత. నీకూతురుగానే ఉంటుంది'.

'ఈ తల తిక్క ప్లానెందుకు?'

'ఇక్రం ఆమెని దత్తు తీసుకుంటే, నేను మూడు ముఖ్యమైన విషయాలు సాధిస్తాను. మొదటిది విదేశాల్లో ఆమె చదువుకయ్యే ఖర్చుని ఇక్రంభాయ్ భరిస్తాడు. రెండోది ఇక్రం

ఆమెను తన కూతురిగా, తన రాజకీయ వారసురాలిగా చూస్తాడు. మూడోది భారతదేశంలో ఆమెకి సార్వత్రిక అంగీకారం లభిస్తుంది – హిందువుల అమ్మాయి, మహమ్మదీయ తల్లిదండ్రులు. అద్భుతమైన రాజకీయ కలయిక'. గాఢాలోచనతో అన్నాడు.

'కాని అతను దత్తు తీసుకుంటే ఆమె నా కూతురుగా ఉండదుకదా', రుద్ధంగా అన్నాడు గుప్తా.

'షరియత్ – ముస్లిం పర్సనల్‌లా – దత్తతను గుర్తించదు'.

'తన చట్టమే విలువ నివ్వకపోతే అతనెలా దత్తు తీసుకుంటాడు?'

'తన ప్రాంతీయ కమ్యూనిటీలో దత్తత సంప్రదాయమని అతను సివిల్ కోర్టులో రుజువు చెయ్యాలి'.

'అలా కుదురుతుందా?'

'కుదరదు. పంజాబ్, సింధ్, కాశ్మీర్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లోని మహమ్మదీయ వర్గాలలో దత్తత బాగా ఉంది. కాని ఉత్తరప్రదేశ్ మహమ్మదీయుల్లో లేదు. కోర్టులో ఇక్రం ఏమీ రుజువు చెయ్యలేదు'.

'నాకర్థం కాలేదు. అతను దత్తత తీసుకుంటే అతని సొంత మత చట్టం, సివిల్ కోర్టు ఆ దత్తతను అంగీకరించవు కనక దత్తత తీసుకోవాలని మీరంటున్నారా?'

'ఖచ్చితంగా అదే. దత్తతను చట్టబద్ధం చేయడం కుదరదు. కనుక ఆమె నీ కూతురు గానే ఉంటుంది. కాని సెంటిమెంటు ఉంటుంది. రాజకీయాలంటే మొత్తం సెంటిమెంటు, ప్రతీకవాదం. ఆమె హిందూమతం, ఇస్లాం మతం అనే రెండు గొప్పమతాల కలయికకు ప్రతినిధిగా ఉంటుంది!'.

'అసలు ఇక్రంభాయ్ ఆమెనెందుకు దత్తత తీసుకొంటాడు?'

'ఎందుకంటే, ఆమె వల్ల అతనికి హిందూ ఓట్లు పడతాయ్, ఆమెకి అతని వల్ల మహమ్మదీయ ఓట్లు పడినట్లుగా! ఇది పరస్పరాశ్రిత సంబంధం'.

'నేను దత్తు వెళ్ళను. వెళ్ళనంటే వెళ్ళను! ఇక్రంభాయ్‌కి దత్తు వెళ్ళడం నాకిష్టం లేదు'.

'చాందినీ, చెప్పేది విను'

'లేదు. గంగా అంకుల్, ఆయన మీకు రాజకీయ స్నేహితుడని నాకు తెలుసు'. అయినా నన్ను బాగా చూసుకొనే అమ్మా, నాన్న ఉన్నారు. నేను ఇక్రం భాయ్‌కి దత్తు వెళ్ళను'.

'మీ అమ్మానాన్నల్ని వదిలివెయ్యమని చెప్పడం లేదు. మీ అమ్మానాన్న ఎప్పటికీ నీకు అమ్మానాన్నలే. ఎవరూ దానిని మార్చలేరు. కేవలం నేను నీ రాజకీయ జీవితాన్ని నిర్మిస్తున్నానమ్మా. అంతే–'

'కాని నా తల్లిదండ్రులను ఎలా వదులుకుంటాను? ఇది చాలా పెద్ద మూల్యం!'

'చాందినీ, నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నీ మీద అత్యాచారం జరగలేదు', శాంతంగా అన్నాడు గంగాసాగర్.

'అదృష్టంతో దీనికేం సంబంధం లేదు'.

'ఒకవేళ మరొకరైతే ఏం జరిగుండేది? భారతదేశంలో ప్రతి అరగంటకీ ఒక ఆడది అత్యాచారానికి బలవుతుందని నీకు తెలుసా?'

'లేదు. నేనెన్నడూ'

'ప్రతి రెండు గంటలకీ ఒక స్త్రీ చంపబడుతుంది – సాధారణంగా ఎక్కువ కట్నం తేలేదని. ఆ విషయం తెలుసా?'

'ఆ – నేనేమంటున్నానంటే – లేదు – నాకు తెలీదు–'

'నువ్వు కూడా ఆ లెక్కల్లో చేరిపోవాలనుకుంటున్నావా చాందినీ?'

'లేదు. గంగా అంకుల్'.

'దేశాన్ని పాలించాలని లేదా నీకు? శక్తిమంతురాలివి కావాలని లేదా? ఏ మగవాడి దయ మీద ఆధారపడకుండా ఉండాలని లేదా?'

'ఉంది'.

'నీ చుట్టూ ఉన్న మురికి, దరిద్రం నుంచి బైటపడాలని లేదా?'

'ఉంది'.

'నీ వృత్తిలో రాణించడానికి తోడ్పడే అత్యుత్తమ అంతర్జాతీయ విద్య నీకు వద్దా? జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని లేదా నీకు?'

'ఉంది'.

'అయితే నేను చెప్పినట్టు చెయ్! ఇక్రంకు దత్తు వెళ్ళు!'

ఆ అమ్మాయి అంగీకారంగా తలూపింది. గంగాసాగర్ చిరునవ్వు నవ్వాడు. అమ్మాయిని భయపెట్టమని పని అప్పగించిన ఇక్రం గూండాకి నోరు జారొద్దని గట్టిగా చెప్పాలి అనుకున్నాడు.

***'ఆదిశక్తి, నమోనమః', సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి నమోనమః కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'*** లోలోపలే స్మరించుకున్నాడు.

## అయిదో అధ్యాయం

# 2300 ఏళ్ళకు పూర్వం

మలమూత్రాల దుర్గంధంతో ముక్కు బద్దలవుతోంది. రాతినేల మీద రక్తం, చెమట, మలమూత్రాలు అడుసుకట్టాయి. దుర్వాసనతో నిండిన ధననందుడి చెరసాల ఆవరణ రక్తం గడ్డకట్టేలా హింసించబడుతున్న ఖైదీలు చేసే ఆర్తనాదాలతో కొత్త ఖైదీకి స్వాగతం పలికింది. మండుతున్న కాగడాల వెలుతురు చాలా కొద్దిగా ఉండడంతో చెక్కీ చెక్కని రాతిగోడలు, వాటికున్న గొలుసులు, కొక్కాలు అంతగా కనిపించడం లేదు.

దుర్గంధంతో నిండిన చెరసాల గది తలుపు మూసుకోగానే పాము కాబోలు తన కాళ్ళపై పాకినట్టుగా అనిపించింది చాణక్యుడికి. తెలియకుండానే రెండో కాలితో దాన్ని తొక్కిపట్టి ఇంక అది కదల్లేదు అనుకున్నాక కాలు తీసేశాడు. అదేచోట కొంచెం సేపు కదలకుండా నిలబడి, చీకటికి అలవాటుపడ్డాడు. చీకటిలో మాంసం ముక్క బహుశా మనుషులదే అయి ఉండొచ్చు – దాన్ని పీక్కుతినాలని కొట్టుకుంటున్న ఎలుకలను చూశాడు.

'ముడ్డిని వందసార్లు కడుక్కున్నా అసహ్యంగానే ఉంటుంది. ధననందుడు బ్రాహ్మణులకు వెయ్యిసార్లు దానాలు చేసినా వాడు అవినీతిపరుడుగానే ఉంటాడు!' అనుకున్నాడు చాణక్యుడు. కొంచెం శుభ్రంగా ఉన్న మూలను చూసుకుని చెమ్మగా ఉన్న గోడనానుకుని కూర్చున్నాడు. ఆ చెరసాల గదికి కిటికీలు లేవు. వెలుతురు లేదు. కళ్ళు మూసుకుని మహనీయుడైన దండాయన ఋషి చెప్పిన ప్రాణాయామాన్ని చేస్తూ ఈ అనారోగ్యకర వాతావరణానికి అలవాటుపడడానికి ప్రయత్నించాడు.

అనుకోకుండా తలుపు తీసిన శబ్దం వినిపించింది. కొంచెం వెలుతురు కనిపించింది. నూనె దీపం పట్టుకొన్న మరుగుజ్జు కనిపించాడు. అతను నోటి మీద వేలు

వేసుకొని మాట్లాడవద్దు, నిశ్శబ్దంగా ఉండమని చాణక్యుడికి సైగ చేశాడు. లేచి తనతో రమ్మన్నట్టుగా తల వూపి చాణక్యుడికి సూచించాడు.

ఆ పొట్టి మనిషి చాణక్యుణ్ణి గోడల మధ్య ఇరుకుగా ఉన్న సందు లోపలికి తీసికెళ్ళి, ఆ ఇరుకులోనే చాణక్యుడి నడుముకి తాడు కట్టాడు. తాడుకి రెండో కొస ఎక్కడుందో చాణక్యుడికి తెలియదు. హఠాత్తుగా తననెవరో లాగుతున్నట్టనిపించింది. వెంటనే పాదాలు పైకి లేచాయి. ఎవరో పైకి లాగుతున్నట్టుగా ఉంది. పట్టు గట్టిగా స్థలం చాలనట్టు పైకి వెళుతోంది. పైకి వెళుతున్నప్పుడు, చాణక్యుడి ముఖం, తొడలు, చేతులకు గోడలు గీసుకొని రక్తం కారుతోంది. చాలాసేపటి తర్వాత చల్లటిగాలి తగిలింది, నీళ్ళు పారుతున్న శబ్దం వినిపించింది. మళ్ళీ గంగాతీరంలో వున్నాడు.

తనకి కట్టిన తాడుని పట్టుకొని లాగటానికి చాలామంది మరుగుజ్జులుండడం చూసి ఆశ్చర్యపోయాడు. వాళ్ళ నాయకుడు ముందుకొచ్చి వివరించాడు. 'ఆచార్యా కలవరపడకండి. కాత్యాయనిగారు సాయం చెయ్యమని కోరారు. చెరసాల నుంచి పారిపోయే ఈ పురాతన మార్గం ఉపయోగించమని చెప్పారు. మీ కోసం దీన్ని వెడల్పు చేశాం– అలా చేశాక కూడా మార్గం చాలా ఇరుగ్గా ఉంది చూశారుగా.'

'మీకు, కాత్యాయనగారికి కృతజ్ఞుణ్ణి, కాని మీరెవరు? మీరేం చేస్తుంటారు?' ఆపదలో ఉన్నా కుతూహలాన్ని ప్రదర్శించాడు.

'మగధలో మరుగుజ్జులు చాలా ముఖ్యమైన పనులు చేశారు ఆచార్యా. మేము రాజధనాగారానికి రక్షకులం. రాజధనాగారాలన్నీ రహస్యంగా దొంగలకీ, బందిపోటులకీ ఎవరికీ కనిపించని చోట ఉంటాయి మీకు తెలుసుగా. మరుగుజ్జులమైన మేము వీటికి సరైన రక్షకులం!'

'మీరు రాజసేవకులు కదా. నాకెందుకు సాయం చేశారు?'

'మేము ప్రియమైన ప్రధాని షక్తర్ గారికి సాయం చేయాలనుకున్నాం. ఆయనే రాజకోశాన్ని, దాన్ని రక్షించడానికి మమ్మల్ని నియమించారు. చాలా ఏళ్ళుగా ఆయనక్కడ బందీగా ఉన్నారు. చాలా నెలలుగా మేం ఈ మార్గాన్ని వెడల్పు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. మిమ్మల్ని తీసుకురావడానికి కొంచెం ముందుగానే ఆయనని బయటికి తీసుకువచ్చాం. ఆ తర్వాత మిమ్మల్ని తేవడం మా పని. కాత్యాయనగారు, సేనాపతి మౌర్య కలిసి మమ్మల్ని ఈ పనికి నియోగించారు'.

'మగధ సర్వసేనాని సేనాపతి మౌర్యుడా? ఆయన ధననందుడికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాడా?'

'ఆ విషయం మీకు ఆయనే చెప్పాలి, అయ్యా'.

'ప్రధాని షక్తర్ ఎక్కడున్నారు?'

ఆయన్ని ఇప్పటికే పిప్పలివనం తీసుకెళ్ళాం. అక్కడ సేనాపతి మౌర్యుడు ఆయన కోసం నిరీక్షిస్తున్నారు. ఆయనని రాజుకు కనపడకుండా దాచడానికి సేనాపతి నివాసం కన్న మంచి చోటు లేదు. ఆచార్యా, మీరు కూడా వెంటనే పిప్పలివనానికి వెళ్ళాలి. హెచ్చరిక గంట మోగి ఉంటుంది ఈ పాటికే. రాజభటులు మీకోసం వెదుకుతూ ఉంటారు. మీకోసం గుర్రం సిద్ధం చేశాను.'

'కాత్యాయన గారి మాటేమిటి? ఆయన్ని కలిసి, ధననందుడి ఆస్థానంలో కోపాన్ని ప్రదర్శించినందుకు ఆయనకు క్షమాపణలు చెప్పాలి నేను', అన్నాడు చాణక్యుడు.

'ఆయనకి మీరు బాగా తెలుసు అయ్యా. ఆయన కూడా ధర్మ, న్యాయ పక్షపాతి. అయితే ధననందుడిని, అతని అసహ్య ప్రభుత్వాన్ని కూలదోయటానికి బయటి నుంచి కన్న ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే బాగా తోడ్పడుతుందని ఆయన భావిస్తున్నారు. బయటి నుంచి ధననందుడిపై దాడి చేసే పులి మీరైతే, లోపల ఉండి ధననందుడి కడుపులో గడబిడ సృష్టించే చిన్న క్రిమి తానవుతానని ఆయనన్నారు!'

చీకటిరాత్రి ప్రశాంతతలో – చాణక్యుడి తండ్రిని అంత్యక్రియలు చేసి పారిపోయిన చీకటిరాత్రి లాంటిది కాదు – వారు గుర్రాన్నెక్కి పిప్పలివనానికి బయలుదేరారు.

వాళ్ళు పిప్పలివనం వెళ్ళేసరికి సూర్యోదయానికి కొంచెం సమయముంది – ఏటి తీరంలో కొన్ని గుడిసెలు, మట్టి ఇళ్ళు ఉన్నాయి. కొంచెం పెద్దదిగా అనిపిస్తున్న ఇంటికి మరుగుజ్జులు అతనిని తీసుకొని వెళ్ళారు. అప్పటివరకు ఎవరితోనో మాట్లాడుతున్న సేనాపతి వీరిని చూడగానే లేచి వచ్చాడు.

చాణక్యుడు భద్రంగా వచ్చినందుకు సేనాపతి మౌర్యుడు సంతోషించాడు. ఆచార్యుడికి నమస్కరించి 'గురువర్యా, మగధకు మీ అవసరం ఉంది. నా మాతృభూమిని జలగల్లా పీడిస్తున్న వారిని పారద్రోలడానికి నాకు సాయం చెయ్యండి', అన్నాడు.

'దానికి ఇంకా సమయం రాలేదు సేనాపతీ. చరిత్రలో నిలిచిపోయే విధంగా మహత్తర లక్ష్యసాధన చేయడానికి బాగా ఆలోచించి సిద్ధం కాగలవారు కావాలి'.

నేను మీ మార్గదర్శకత్వం కోసం ఎదురుచూస్తున్నాను గురువర్యా, రండి. మీరు అలసి ఉంటారు. మీ గాయాలను శుభ్రం చేయాలి. శుభ్రమైన వస్త్రాలు, ఉపాహారం సిద్ధం చేయమని నా భార్యకు చెబుతాను. నాతో రండి. మీరు స్నానం చేయగలిగిన చోటు చూపిస్తాను'

'ఒక వృషలుడి దగ్గర నేననుకున్న దానికన్న మంచి మర్యాదే దొరికింది' అనుకున్నాడు మనసులో చాణక్యుడు.

మౌర్యుడు వృషలుడు – ఇతడిని కడజాతి క్షత్రియుడుగా చాణక్యుని వంటి అగ్రకుల బ్రాహ్మణులు భావిస్తారు. మౌర్యుడి తండ్రి హిందూ కులవ్యవస్థను వదలి మహాబోధకుడైన గౌతమబుద్ధుని మార్గానుయాయి అయ్యాడు. కాలక్రమంలో సేనాపతి హిందూమతంలోకి వచ్చినా ఇతడిపై హిందువుల వ్యతిరేకత పోలేదు. వృషలుడనే ముద్రవేశారు. స్నానం చేసి, వస్త్రాలు ధరించి ఉదయ ప్రార్థనలు పూర్తి చేసి మౌర్యుడి గుడిసె బయట అరుగు మీద కూర్చున్నాడు చాణక్యుడు. సేనాపతి భార్య తృణధాన్యాలతో చేసిన జావను, వేడిపాలను అతని ముందుంచింది. అప్పుడే సూర్యోదయమైంది. తోటలో నెమళ్ళు నాట్యం చేస్తున్నాయి. అవి పురివిప్పి నీలము, ఆకుపచ్చ ఈకలను విప్పార్చి అందమైన వాటి కన్నులను ప్రదర్శిస్తున్నాయి.

ఇది నెమళ్ళ దేశం. మౌర్యుడి వంశనామం కూడా మోర్ – అంటే నెమలి నుంచే వచ్చింది.

ఇంటి బయట చిన్న పిల్లలు కొందరు నాటకం వేస్తున్నారు. ఒకబ్బాయి తల చుట్టూ పాగా కట్టుకుని దానిలో ఒక నెమలి ఈకను పెట్టుకున్నాడు. పెద్దరాతిపై కూర్చున్న అతను చక్రవర్తిలా నటిస్తున్నాడు. అతని చుట్టూ ఉన్న పిల్లలు ప్రజలు, ఆస్థానంలో అధికారులు.

'వినండి! వివేకి, ఉదారుడు మహారాజు చంద్రగుప్తుడు, ప్రపంచ చక్రవర్తి సభ తీర్చి వున్నారు. వచ్చి విన్నపాలు చేసుకోండి!' అన్నాడో బాలుడు ప్రధానిలా నటిస్తూ రాజుగారి పక్కన నిలబడి.

'మహారాజా, నేను పెద్ద ఇబ్బందిలో ఉన్నాను. నా పొరుగువాడు నాకు నూతిని అమ్మాడు. కాని ఇంకా నీళ్లు తోడుకుంటున్నాడు. దయచేసి అతనిని ఆపండి', అని బాధపడుతున్న వ్యక్తిగా నటిస్తున్న బాలుడు వినయంగా వేడుకున్నాడు.

'నూతిని అమ్మినది ఎవరు?' రాజు ప్రశ్నించాడు.

'నేనే ప్రభూ. నేను నూతినే అమ్మాను. నీళ్ళను కాదు, దయచేసి న్యాయం చెయ్యండి', అన్నాడు కొంచెం పెద్ద బాలుడు. పెద్ద పిల్లవాడిని హుందాగా చూస్తూ 'నువ్వుచెప్పేది నిజమే. నువ్వు నూతిని అమ్మావు. నీటిని కాదు. మరి మరొకరి నూతిలో నీళ్ళెందుకు ఉంచావు తప్పు కదా. వెంటనే ఖాళీ చేసెయ్! తర్వాతి ఫిర్యాదు!' అన్నాడు.

చాణక్యుడు తనలో తానే నవ్వుకున్నాడు. ఈ నాటకాన్ని శ్రద్ధగా చూస్తున్నాడు. తను కూడా వినోదంలో పాలుపంచుకోవాలనుకున్నాడు. అరుగు మీద నుంచి లేచివెళ్ళి రాజు గారి ముందు చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

'చెప్పండి, బ్రాహ్మణుడా? ఏం కావాలి మీకు?' రాజు గంభీరంగా అడిగాడు.

'ఉదారుడవైన రాజా, నేను బీద బ్రాహ్మణుడిని. నాకు పాలు, నేను చేసే యజ్ఞాలకు, పూజాది విధులకు నెయ్యి కావాలి. నాకు ఆవులేదు. భూరక్షకుడా, నాకు సాయం చెయ్యి', అన్నాడు చాణక్యుడు పట్టుదలగా.

'కోశాధికారీ! ఈ బ్రాహ్మణుడికి ఒక ఆవును ఇవ్వండి' అని ఆజ్ఞాపించాడు రాజు. ఉత్తుత్తి కోశాధికారి ఒక గులకరాయిని ఆవుకి బదులు చాణక్యుడికి ఇవ్వడానికి ముందుకొచ్చాడు.

'కాని దీనికోసం చెల్లించడానికి నా దగ్గర డబ్బులేదు రాజా', చెప్పాడు చాణక్యుడు.

'ఓ బ్రాహ్మణుడా, దేవుళ్ళకి మీరు చేసే నివేదనలు చాలినంతగా లేకపోతే నా రాజ్యంలో సంపదలు తగినంతగా ఎలా ఉంటాయి? నా రాజ్యం సుభిక్షంగా లేకపోతే నేను పన్నులు ఎలా వసూలు చేయాలి? పన్నులు లేకపోతే కోశాగారానికి, సైన్యానికి ఎలా జరుగుతుంది? సైన్యం లేకపోతే రాజ్యాన్ని ఎవరు రక్షిస్తారు? చూశారా! నేను మీకేమీ ఉపకారం చేయడం లేదు. నా సంపద తగ్గకుండా చూసుకుంటున్నాను అంతే!' అన్నాడు మేధావియైన ఆ బాలుడు.

చాణక్యుడు చిరునవ్వు నవ్వి ఆ అబ్బాయిని ఆశీర్వదించాడు.

'ఎవరు నాయనా నువ్వు?' అనడిగాడు.

'నా పేరు చంద్రగుప్తుడు. సేనాపతి మౌర్యులవారి కుమారుణ్ణి'.

'షక్తర్ గారి దగ్గరకు తీసుకెళ్ళనా మిమ్మల్ని' అనడిగాడు చాణక్యుణ్ణి ఇంట్లో నుంచి బయటికి వస్తూ సేనాపతి. చాణక్యుడు తల ఊపాడు. చనిపోయిన తండ్రి స్నేహితుణ్ణి కలవాల్సిన సమయం ఆసన్నమైంది – చణకుడు ఈ మిత్రుడి కోసమే ప్రాణాలను అర్పించాడు.

చాణక్యుడు చూసిన వృద్ధుడు చిక్కి శల్యమై ఉన్నాడు. ఏళ్ళ తరబడి హీనమైన జీవిత పరిస్థితులు, మానవులు తినలేని తిండి, అనారోగ్యం, హింసకు లోనవడంతో మాజీ ప్రధాని పరిస్థితి దిగజారింది. చాణక్యుడి స్మృతులలో కనిపించే షక్తర్ కులీనుడు, ఉత్తముడు, వైభవశీలి. ఎప్పుడూ చక్కని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్రాల రక్షరేకులు, ఉంగరాలు, కంఠహారాలు ధరించేవాడు. ఒకప్పుడు రాజ్యంలో రాజు తర్వాత అంతటి శక్తిమంతుడైన రెండో వ్యక్తిని అతను ఇప్పుడు గుర్తుపట్టలేకపోయాడు.

షక్తర్‌కు చాణక్యుడు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ వృద్ధుడు అతన్ని పైకి లేవమన్నాడు. చాణక్యుడు పైకి లేచి షక్తర్ ముఖంలోకి చూడగా, ఆ పండు ముదుసలి కళ్ళలో నీళ్ళున్నాయి. ఆప్యాయంగా ఆశీర్వదించడానికి ఆయన చాణక్యుడి శిరస్సుపై చేతిని ఉంచాడు.

'నాకు మిగిలిన ఒకే ఒక కుమారుడివి నువ్వే చాణక్యా. నా సొంత కొడుకులు చనిపోయారు. నా కూతురు – సువాసిని – నువ్వెంతగానో ప్రేమించినది – చనిపోయిన దానికన్న హీనంగా బ్రతుకుతోంది. మీ నాన్న ఎన్నడూ అనలేదు కాని మీ ఇద్దరికీ పెళ్ళి చేసి, రెండు కుటుంబాలను కలిపి ఉంచాలని అనుకున్నాడు'.

చాణక్యుడు మౌనంగా ఉండిపోయాడు.

'అనంతమైన పీడకలకి నా జాతకంలో ఏ భయంకర గ్రహాలు కలిసి కారణమయ్యాయో! నా భార్య చనిపోయింది. నా ప్రియమిత్రుడు చణకుడు చనిపోయాడు; నా కొడుకులు చనిపోయారు; నా కూతురు, రాక్షసుడి ఉంపుడుగత్తె; నా శరీరం జవసత్వాలుడిగి బలహీనమైంది; రాజ్యం – పిచ్చివాడి అధీనంలో ఉంది!' కష్టాలను ఒకదాని తర్వాత ఒకటిగా చెప్పుకుంటూ పోయాడాయన.

చాణక్యుడు షక్తర్ చేయి పట్టుకుని ఇలా అన్నాడు, 'పీడకల త్వరలో అంతమవుతుంది. నేను వాగ్దానం చేస్తున్నాను. ఈ బాధ నుంచి మీరు బయటపడాలి. మేల్కొని, సూర్యకిరణాలు చూడాలి, ఇది భయంకర స్వప్నం మాత్రమేనని గుర్తించాలి. షక్తర్ గారూ, సేనాపతిగారూ నాకు సాయం చెయ్యండి'.

'చాణక్యా, మీకు సాయం చేయడానికి నా దగ్గరేముంది?' సేనాపతి మౌర్యుడడిగాడు.

'చంద్రగుప్తుడు'.

'మరి నేనెలా సాయం చేయగలను?' షక్తర్ అడిగాడు.

'మరుగుజ్జులు'.

మగధ రాజులకు సైన్యం ఆహారంతోనే నడుస్తుందని తెలుసు. రాజధనాగారం– రాజకోశం – ఇంకా ముఖ్యం సైన్యం కన్న. ఎందుకంటే పోరాడే యంత్రాన్ని నడిపే ఇంధనం కోశాగారమే. గనుల తవ్వకం ప్రభుత్వానిదే. అందుకని భూమిలో నుంచి తవ్వి తీసిన బంగారం, వెండి, విలువైన మణులు అన్నిటినీ ధనాగారానికే తరలించేవారు.

ధనాగారానికి రక్షణ, భద్రతలను రకరకాలుగా కల్పించేవారు. ప్రభుత్వ ధనాగారం ఎప్పుడూ రాజధానిలోనే ఉండేది. కాని భూగర్భంలో మూడంతస్తులలో నేలలో తలుపులు, నిచ్చెనలతో కూడిన గదులలో విలువైన లోహాలు, మణులు ఉండేవి. భూగర్భ నిర్మాణానికి సంబంధించిన గోడలు, నేల కూడా చుట్టూ మరో మందపాటి రాతితో కప్పబడి ఉండేవి. ఎవడైనా దురాశాపరుడైన దొంగ రావాలనుకన్నా ప్రవేశం దొరకడానికి అవకాశం లేకుండా. కోశాగారం సాధారణంగా రాజధాని ఉత్తరభాగంలో రాజప్రాసాదానికి, నగర ప్రధాన దేవాలయానికి మధ్యలో ఉండేది. రక్షక భటులు వలయాలుగా ఏర్పడి రాత్రి పగలు కాపలా కాసేవారు. రాజకోశానికి చుట్టూ ఎత్తైన ప్రదేశాలలో విలుకాళ్ళు విషం పూసిన బాణాలు ధరించి నిరంతరం కాపలా కాసేవారు. దొంగతనానికి వచ్చే దొంగకు తక్షణ మృత్యువు లభించేది.

భద్రతకు సంబంధించి తీసుకొనే మరో చర్య ఏమిటంటే ధనాగారాన్ని వికేంద్రీకరించి, జన సంచారం లేని ప్రాంతాల్లో రహస్యంగా నిధులు దాచేవారు. సాధారణంగా మరణశిక్ష పడిన ఖైదీలతో ఈ రహస్య ధనాగారాలను నిర్మింపజేసి తర్వాత

వారిని ఉరితీసేవారు. రహస్యంగా ఉండే ఈ ధనాగారాలను గురించి రాజుకు, ప్రధానమంత్రికీ తప్ప ఎవరికీ తెలిసేది కాదు. చాలా తరచుగా ఈ ఈ ధనాగారాలను భూగర్భంలో రహస్య మార్గాల ద్వారా వెళితే తప్ప కనుక్కోలేని విధంగా నిర్మించేవారు. కావాలని, వీటిలో చాలా వాటిని వయోజనులు వెళ్ళలేని విధంగా నిర్మించేవారు. వీటిని చేరుకోవడం శిక్షణ పొందిన మరుగుజ్జులకే సాధ్యం. బాగా చెట్లూ చేమ, పాములు, తేళ్ళు, క్రూర మృగాలు బాగా ఉండే చోట నిధులు దాచేవారు దొంగలకు దొరకకుండా.

మాజీ ప్రధాని షక్తర్‌కు ధననందుడికున్న ఇటువంటి రహస్య ధనాగారాల గురించి తెలిసి ఉంటుందని, వీటిని దక్కించుకోవాలంటే కాత్యాయనుడి మరుగుజ్జులే కీలకమని చాణక్యుడికి తెలుసు.

పిప్పలివనానికి ఉత్తరాన ఉన్న అడవులు చాలా విశాలమైనవి, విపత్కరమైనవి. ఉల్లిపొరల్లా వలయాకారంలో ఒకదాన్ని మించి మరొకటి చీకటిగా, నిర్మానుష్యంగా ఉంటాయి. బయటకు పైకి కనిపించే అడవిలో కలప, మూలికలు, ఔషధ మొక్కలు ఉంటాయి; దానిలోపల ఉండే అడవిలో ఋషుల ఆశ్రమాలు ఉంటాయి; ఇంకా లోపలికి వెళితే రాజులు, కులీనుల వేట ప్రదేశాలుంటాయి; ఈ ప్రదేశాన్ని దాటి లోపలికి వెళితే సైన్యంలో ఉపయోగించటానికి ప్రభుత్వం ఏనుగులను పెంచే చోటు ఉంటుంది; దీనికన్న లోపల ఉండే ఆంతరిక వలయంలో సింహాలు, పులులు, చిరుతలు స్వేచ్ఛగా సంచరించే అభయారణ్యాలు ఉంటాయి. షక్తర్ చెప్పిన ధనాగారం ఈ ప్రదేశంలోనే ఉంది.

గుర్రాలకు ఒక యోజనం దూరంలో నాలుగు మైళ్ళు వెనుకగా – రక్షక భటులను వదిలిపెట్టేశారు. దారిలేని దట్టమైన అడవిలో గుర్రాలు ముందుకు కదలలేని స్థితిలో ఉన్నాయి. చాణక్యుడు, సేనాపతి మౌర్యుడు, కాత్యాయనుడి నమ్మకస్థుడైన సహాయకుడు జీవసిద్ధి, మరుగుజ్జులు నిదానంగా ముందుకు వెళుతున్నారు. షక్తర్ ఇచ్చిన పటం చాలా ఉపయోగపడుతోంది. ప్రధానమైన గుర్తులన్నీ కనిపించాయి, అడవీ పర్యావరణం క్షణక్షణం మారుతున్నా.

ఈ ప్రయాణానికి బృందాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకున్నారు. నిధి అన్వేషణకి ఎక్కువమందిని తీసికెళితే ధననందుడికి విషయం తెలిసే అవకాశముంటుంది. బృందంలో తక్కువమంది ఉంటే క్రూరమృగాల చేతిలో చనిపోయే ప్రమాదం ఉంది లేదా నిధిని తీసుకెళ్ళడానికి చాలినంత మంది ఉండరు.

గండశిలలున్న ప్రదేశానికి చేరారు. వాటి మీద తీగలు దట్టంగా అలముకున్నాయి. గమ్యానికి చేరువగా ఉన్నామని చాణక్యుడికి అర్థమైంది. పటాన్ని చూసి నిర్ధారించుకొనే లోపే అతని ఎడమ చెంపను రాసుకుంటూ బాణం దూసుకెళ్ళింది. వెంటనే అప్రమత్తుడై ఒరలోంచి కత్తిని తీశాడు శత్రువుని ఎదుర్కోవాలని. కాని మరోబాణాన్ని ఎక్కుపెట్టి తన దిశలోనే తీక్షణంగా చూస్తున్న జీవసిద్ధి కనిపించాడు.

సామాన్యుడెవరైనా అయితే జీవసిద్ధిని అనుమానించేవారు. కాని జీవసిద్ధి కళ్ళు తన వైపున్నా, దూరంగా తనను దాటి చూస్తున్నాయని చాణక్యుడు గ్రహించి వెనుతిరిగి చూశాడు. వెనుక పెద్ద పులి ఒకటి పడి ఉంది. బాణం దాని మెడలో గుచ్చుకుని ఉంది.

చాణక్యుడు వెనుతిరిగి తన కత్తిని ఒరలో పెట్టాడు. జీవసిద్ధిని ఆశీర్వదిస్తున్నట్లుగా చేతిని ఎత్తాడు. మాటలు లేకపోయినా ఆ మూకాభినయమే వెయ్యిమాటల పెట్టు. ఆనాటి నుంచి జీవసిద్ధి ఆచార్యుడికి నమ్మకస్థులైన సేనానుల్లో ఒకడయ్యాడు. నాచుతోను, తీగలు పాకి ఉన్న గండశిలలవైపు వెళ్ళారు. తాను పర్యవేక్షిస్తుండగా కలిపిన పొడి ఉన్న సంచిని బయటకు తీయమని చాణక్యుడు సేనాపతి మౌర్యుడికి సూచించాడు. మరుగుజ్జులకు సేనాపతి ఆ పొడిని ఇవ్వగానే వారు దానిని చల్లారు. పుదీనా కాడల నూనె, కుళ్ళినగుడ్లు, వెల్లుల్లి, వాము నూనె, గంధకం కలిపిన పొడి అది వెగటు కలిగించే వాసన వేస్తుంది.

బ్రాహ్మణులు సాధారణంగా గుడ్లు, వెల్లుల్లి వంటి వాటిని ఉపయోగించరు, కాని చాణక్యుడు మాత్రం మరుగుజ్జులు ఆ పొడిని దంచి, ఎండబెడుతున్నప్పుడు అక్కడే ఉన్నాడు. గాలి అంతా ఆ పొడి దుర్గంధం వ్యాపించడంతో రాళ్ళలోంచి పాములు బయటికి వచ్చి దూరంగా వెళ్ళిపోయాయి. చాణక్యుడు తల ఊపగానే సేనాపతి మౌర్యుడు, జీవసిద్ధి కనిపిస్తున్న నేలమాళిగ తలుపువైపు నడిచారు. ఆ తలుపు నుంచి మెలికలు తిరిగిన మార్గం భూగర్భ సొరంగాలలోనికి వెళుతుంది.

గండ శిలలు, మొక్కలు కప్పేసి ఉన్న నేలమాళిగ తలుపు పెద్దది కాదు. పదిహేను అంగుళాల వెడల్పు – ఒక అడుగంత. సేనాపతి మౌర్యుడి గద పురాతన రాగితాళాన్ని పగలగొట్టింది. కొన్ని నిముషాల్లోనే వారికి చీకటిగా, ఇరుకుగా నిలువుగా భూగర్భంలో ఉన్న గొయ్యి కనిపించింది.

పొడవైన తాటిని గండశిలల్లో ఒకదానికి గట్టిగా కట్టి ఒక మరుగుజ్జు కాగడాను తలకు కట్టుకొని నిదానంగా లోపలికి దిగాడు. కొన్ని నిముషాల తర్వాత 'ఇది ఖాళీగా ఉంది! మరో తలుపు ఎక్కడుందో వెతకాలి. మరొకరిని పంపండి', అని అరిచాడు.

రెండో మరుగుజ్జు వజ్రంగానికి పనికి వచ్చే ఉపకరణాలు పట్టుకొని కిందికి దిగాడు. కొంచెం సేపటి తరువాత ఏదో కొడుతున్న శబ్దం వినిపించడంతో వారికి మొదటి అంతస్తులో తలుపు కనిపించిందని అర్థమైంది. మూడో మరుగుజ్జు రెండో అంతస్తుకి చేరడానికి వీలుగా తాడును తీసుకొని కిందికి దిగాడు.

లోపలి నుంచి 'నమోలక్ష్మీ!' అని ఒక మరుగుజ్జు అరిచాడు 'నిధి కనిపించింది'. చాణక్యుడు, సేనాపతి మౌర్యుడు, జీవసిద్ధి ఒకరినొకరు చూసి చిరునవ్వు నవ్వుకున్నారు. సూచనలు ఇవ్వడానికి వీలుగాను, వస్తువులు పంపడానికి మరికొంతమంది మరుగుజ్జులను కిందికి పంపారు.

'లోపల ఏముందో కొంచెం కొంచెం పైకి పంపండి. మొత్తమంతా బయటికి తీసుకెళ్ళగలిగేంతమంది మన దగ్గర లేరు. బాగా విలువైన, బరువులేని వాటి పై దృష్టి పెట్టండి', అని చాణక్యుడు వారికి సూచించాడు. వారి ముందు – వజ్రాలు, ముత్యాలు, కెంపులు, నీలాలు, మణులు, వెండి పణాలు, రాగి కాకానీలు పోగుపడ్డాయి.

'ఆవుపేడ, ఆవనూనె కోసం వెదకండి' అని సూచించాడు చాణక్యుడు.

ఆచార్యుడికి పిచ్చి పట్టిందా అన్నట్లుగా సేనాపతి, జీవసిద్ధి ఆయనను చూశారు. కచ్చితంగా ఆయనకు పిచ్చిలేదు అన్నట్లుగా కొంచెం సేపటికి ఆవుపేడ, ఆవనూనె కలిపిన ఇటుకలు కింది నుంచి పైకి వచ్చాయి. తన స్నేహితులతో 'ఆవుపేడ చూసి మోసోవద్దు' అని చెప్పాడు చాణక్యుడు. 'బంగారాన్ని సీసం ఉపయోగించి శుద్ధి చేస్తారు. మిగిలిపోయిన సీసాన్ని ఆవుపేడతో తీసేస్తారు. బంగారం పెళుసుగా ఉంటే ఆవనూనెతో మృదువుగా చేస్తారు. అందుకనే బంగారాన్ని నిల్వ చేయడానికి ఆవుపేడను, ఆవనూనెను, అద్ది నిల్వచేస్తారు. మీ ముందున్నది స్వచ్ఛమైన బంగారం!'

'బంగారానికే ముందుగా ప్రాధాన్యమివ్వాలి. దాని విలువ అధికం. సులభంగా నగదుగా చేసుకోవచ్చు. తర్వాత ప్రాధాన్యం వెండి పణాలకు ఆ తర్వాత కెంపులకు ఇవ్వాలి. రాగి, ముత్యాలు, నీలాలు లేదా స్ఫటికాలు, వైఢూర్యాలు మనం తీసుకువెళ్ళొద్దు. నిధిలో ఉన్న చందనం, కలబంద, కర్పూరాన్ని కూడా మనం తీయవద్దు', అని చాణక్యుడు చెప్పుకుంటూ పోయాడు. మౌర్యుడు జీవసిద్ధి అతడికి నిధి విషయంలో ఉన్న పరిజ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపడి, 'ఆచార్యా మీరు పవిత్రులు – గురువర్యులు. సంపదకు సంబంధించిన ఈ వివరాలు మీకెందుకు?' అని అడిగారు.

తమ ముందు గుట్టగా పోగవుతున్న విలువైన వస్తువులను ఓ కంట చూస్తూనే చాణక్యుడు ఇలా సమాధానమిచ్చాడు. 'మనిషి దేనికి తాపత్రయపడాలి? ధర్మార్థ కామమోక్షాలకే కదా. ధర్మం, సంపద, కామం, మోక్షం. సంపద లేకపోతే నీ భార్యాబిడ్డలు నిన్ను ప్రేమించరు. ఏ ఒక్క పౌరుడూ కూడా ఆర్థిక ప్రోత్సాహకాలు లేకుండా ఏ బాధ్యతనూ నిర్వర్తించడు. తన కుటుంబం బ్రతకడానికి వీలైనంత సంపద లేకపోతే ఏ మనిషైనా మోక్షం కోసం సన్యాసం స్వీకరించగలడా? నేను అధ్యాపకుడిని – సంపదకు సంబంధించిన అర్థశాస్త్రాన్ని బోధించే అధ్యాపకుడిని. మనుషుల ఉపాధికి మూలం సంపద. దానిని పొందే విధానాన్ని, రక్షించే విధానాన్ని చెప్పే శాస్త్రం రాజనీతిశాస్త్రం!

చాణక్యుడు, అతనితో ఉన్నవారు గుర్రాల మీద అపరిమితమైన సంపదను వేసుకుని వెనుక రక్షకభటులు కాపలా రాగా పిప్పలివనానికి బయలుదేరారు. ఆ సాయంత్రం బయట చలిమంట ముందు కూర్చుని చాణక్యుడు విషయం కదిపాడు. 'సేనాపతీ, మీ బాధ్యత మీరు నిర్వర్తించారు. మీ జీవితాన్ని అనుభవించారు. వైభవోపేతమైన మగధను చూడాలనుకున్న మీ స్వప్నం రాజలక్షణాలున్న చంద్రగుప్తుడితోనే సాకారమవుతుంది. అతణ్ణి నాతో తక్షశిలకు పంపండి. రాచరికానికి అతణ్ణి సంసిద్ధుణ్ణి చేస్తాను. ఈలోగా, ఇప్పుడున్న సంపదతో ఒక సైన్యాన్ని తయారుచేయడానికి నాకు సాయం చేయండి!'

సేనాని చాణక్యుడి మాటలు విని, ఆలోచించి ఇలా అన్నాడు', ఆచార్యా, వాడు నా ఒక్కగానొక్క కొడుకు. వాడిని విడిచి నేనుండలేను. మీరు ఇక్కడే మాతో ఉండి పోవచ్చుగా?' చాణక్యుడు చిరునవ్వు నవ్వాడు.

'సామ్రాజ్యాన్ని ఏకం చేయడం అంత సులభమైతే ఎంత బాగుంటుంది సేనాపతీ. మనమిక్కడ మాట్లాడుకుంటున్నాం గాని గాంధార సరిహద్దులపై అలెగ్జాండర్ దాడి చేసే ప్రమాదం పొంచి ఉంది. గాంధార ఆక్రమించబడితే, భారతదేశమంతా ఆక్రమించ బడుతుంది. తలుపులు బలవంతంగా తెరిచి ఉంటే శత్రువుని ఎలా వెళ్ళగొట్టగలం? మనం సంపాదించిన సంపదతో మాసిడోనియా దాడులను ఎదుర్కొనడానికి సైన్యాన్ని తయారుచేయాలి. అనైక్యంగా కీలక సమయాల్లో కూడా ఎన్నటికీ కలవకుండా అలాగే ఉన్న చిన్నచిన్న రాజ్యాలను సంఘటితం చేసే పని కూడా ఈ సైన్యం చేస్తుంది', అని వివరించాడు.

'అయితే మరి నేను, నా భార్య కూడా మీతో, చంద్రగుప్తుడితో పాటు తక్షశిలకు రావాలా?' అని అడిగాడు మౌర్యుడు.

'అదంత మంచి ఆలోచన కాదు' అని వాదించాడు చాణక్యుడు.

'మీరు దగ్గర లేకపోతే చంద్రగుప్తుడు విజయం సాధించడానికి చాలా అవకాశాలున్నాయి. మీరు ధననందుడి ప్రత్యక్ష శత్రువు. అతని చారులు మీ కోసం ఎప్పుడూ వెదుకుతూ ఉంటారు. వందలాదిమంది విద్యార్థులతో కలిసి తక్షశిలలో చదువుతూ ఉండే చంద్రగుప్తుడెవరో ఎవరికీ తెలియదు. ప్రమాదం ఉండదు. వీటన్నిటినీ మించి మీరు, షక్తర్‌గారు, కాత్యాయన గారు మగధలోగాని, పరిసరాల్లో గాని ఉండి చంద్రగుప్తుడు వచ్చే సమయానికి ధననందుడిని అస్థిమితం చెయ్యాలి'.

ఇంటిలోపలి నుంచి తమ సంభాషణ వింటున్న భార్యని మౌర్యుడు బయటికి పిలిచాడు. ఆమె బయటికి వచ్చి చలిమంటతో చేతులు వెచ్చ చేసుకుంటున్నప్పుడు ఆచార్యుడి సూచనపై ఆమె అభిప్రాయాన్ని అడిగాడు. క్షత్రియ యోధుడి భార్యగా ఆమె సమాధానమిచ్చింది. 'బుద్ధుడి చితాభస్మం దొరికిన కొద్దిమంది అదృష్టవంతులలో మనమొకరం. మనమారాధించే భగవంతుడు మోక్షం కోసం సామ్రాజ్యాన్ని త్యాగం చేశాడు. క్షత్రియులుగా జీవులన్నిటినీ, అందరినీ రక్షించాల్సిన బాధ్యత మనది. మహత్తరమైన లక్ష్యం కోసం కొడుకుని త్యాగం చేయాల్సివస్తే, అలాగే చేద్దాం', అంది చాలా మామూలుగా. 'జ్ఞానం లేని బ్రాహ్మణుడు, ధైర్యంలేని క్షత్రియుడు సమాజానికి ఉపయోగపడరు'.

మగధను పాలించిన శక్తిమంతుడైన శిశునాగవంశానికి చెందిన మహానందికి, పిప్పలివనంలో నివసించే మోరియ అనే క్షత్రియ తెగ ముఖ్యుడి కూతురు మురకు జన్మించినవాడు సేనాపతి మౌర్యుడు. సేనాపతి మౌర్యుడు మహానందికి వారసుడిగా తగినవాడు, కాని రాజుకు ఇంకా చాలామంది కొడుకులుండడం వల్ల వాళ్ళే ఆ పదవికి తగిన వారని భావించడం జరిగింది. అయితే ఆ యోగ్యులైన కొడుకులలో ఎవరూ సింహాసనాన్ని అధిష్ఠించలేకపోయారు. వృద్ధుడైన మహానందికి తన మంగలి, తెలివిగా, తీయగా మాట్లాడే మహాపద్ముడు అంటే ఇష్టం. మహాపద్ముడు క్షత్రియవంశ తండ్రికి, శూద్రురాలైన తల్లికి జన్మించినవాడు.

జిత్తులమారి మంగలి రాజునే కాకుండా, రాణి సునందని కూడా తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. కొద్దిరోజుల్లోనే రాజుకి క్షవరం చేయడంలోనే కాకుండా

రాణితో అక్రమ సంబంధం పెట్టుకొనడంలో కూడా నిష్ణాతుడయ్యాడు. రాణితో సంబంధం ఉంది గనుక, ఆమె సాయంతో మంగలి రాజుని, ఆయన కొడుకులని చంపేశాడు. బ్రతికి ఉన్నది చిన్న పిల్లవాడైన మౌర్యుడొక్కడే. పిల్లవాడు కనుక అతని వల్ల భయం లేదు.

మహాపద్ముడు మంగలి అయినా మంచి తెలివితేటలు కలవాడు. సేనాపతి మౌర్యుడి నైపుణ్యాన్ని గుర్తించి సేనాధిపతిగా చేశాడు. మహాపద్ముడు నిరంకుశుడు కాని ఉదారుడు. అతని పాలనలో నేరాలు అస్సలు లేవు. మహానంది పాలనలో నిరంకుశులుగా మారిన పాలెగాళ్ళను నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. ఉత్తర భారతంలో చాలా భాగాన్ని, దక్కనును జయించి హిమాలయాల నుంచి కుంతల వరకు, యమున నుంచి బ్రహ్మపుత్ర వరకు దేశాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. ఉత్తర భారతంలో మగధను శక్తిమంతమైన రాజ్యంగా చేశాడు. క్షత్రియ శూద్రుడైనా, బ్రాహ్మణులను ఆదరించాడు. వరరుచి, వ్యాధి, వర్ష వంటి ఆచార్యులు అతని ఆదరణకు పాత్రులయ్యారు. ఉన్నతస్థాయి సామర్థ్యము, బలమైన సైనికాధిపత్యం, న్యాయమైన పన్నులు, బృహత్తర నీటిపారుదల పథకాలు, ధర్మబుద్ధి, సహనశీలత అతని పాలనలో కనిపించాయి.

అతని కుమారుడు ధననందుడి కాలానికి ఈ బంగారు కాలం మారిపోయింది. కుటిలుడైన కొడుక్కి సేనాపతి మౌర్యుడు బలంగా కనిపించక – బాధ్యతగా అనిపించాడు. భారతదేశంలో ఎన్నో రాజ్యాలని జయించడానికి మహాపద్ముడికి సాయం చేసిన మనిషి ఈనాడు తానే కాందిశీకుడయ్యాడు – అలా అయినందుకు ప్రతీకార జ్వాలతో రగులుతున్నాడు.

చాణక్యుడికి కోపం అంటే ప్రేమ. అది అద్భుతమైన శక్తినిచ్చే ఉద్వేగం. దాన్ని సత్క్రమమార్గంలో పెడితే మంచి పనులకు బాగా ఉపయోగించుకోవచ్చు.

## ఆరో అధ్యాయం

# వర్తమానం

ఆమెని నఖశిఖ పర్యంతం నిదానంగా చూసింది మిస్ ఫీవర్‌షాం. 'నేను నీతో ఉన్నదున్నట్టు పచ్చిగా చెప్పేస్తాను. నీ భుజాలు గుండ్రంగా, మోకాళ్ళు బిగుతుగా, పొట్ట బయటికి ఉంది' సునిశితమైన సూచనలు ఇచ్చిన బాధాకరమైన మరో గంట. చాందిని వెంటనే తన పొట్టను లోపలికి లాక్కుంటూ, భుజాలను పైకి లేపింది. ఫలితం మరింత వికారంగా ఉంది. మిస్ ఫీవర్‌షాం నిట్టూర్చింది. ఈ పని చాలా కష్టమయ్యేట్టుంది. చాందిని లండన్‌లో మిస్ ఫీవర్‌షాం ఫినిషింగ్ స్కూల్లో ఉంది – పూర్తిగా ఆమె పనైపోయింది. 'నీ భుజాలు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. పాదాలు బయటికి వస్తున్నాయి. తలవాల్చే పద్ధతి ఆడదానిలా అనిపించడం లేదు'.

చాలాసార్లు నిలబడమని, కూర్చోమని చాందినీచేత గుంజీలు తీయించింది. ఆమె కదలికలను సునిశితంగా గమనించింది. 'చాలా స్థలం ఉపయోగిస్తున్నావ్. నిలబడేటప్పుడు యాంగిల్స్ చూడు. చేతులు కూడా బాగా కదుపుతున్నావ్. కొంచెం చుంచులా అనిపిస్తున్నావు. చుంచు వినయంగా ఉంటుంది. నడిచేటప్పుడు నీ బ్రా దిగువన ఉన్న నరాల కూడికతో సమానంగా నడవాలి. తలపైకెత్తు. మెడ నిటారుగా పెట్టు' చాందిని చేతులకు వీపుకి మధ్య కర్ర పెట్టి భుజాలు దిగువకి, నిటారుగా ఉండేలా చేస్తూ చెప్పింది ఫీవర్‌షాం.

గత నెలలో ఆ పిల్ల ఇంగ్లీషుపై ఫీవర్‌షాం దృష్టి పెట్టింది. కాన్పూర్ మురికివాడ బడిలో నేర్చుకున్న ఇంగ్లీషు ఆమె తల్లిదండ్రులను సంతోషపెట్టడానికి పనికి వచ్చింది కాని, ఇంగ్లండులో మాట్లాడడానికి పనికి రాలేదు.

చాందిని ప్రతిరోజూ ఇంగ్లీషు నుడికారంలో బాగా మాట్లాడగలిగే విధంగా మిస్ ఫివర్‌షాం పాఠాలను శ్రద్ధగా రూపొందించి బోధించింది. ఆమె శ్రవణ, పఠన, లేఖన, భాషణ నైపుణ్యాలు పెంపొందించే విధంగా పాఠ్యప్రణాళిక రూపొందించడం జరిగింది.

భాష ఒక్కటే నేర్చుకుంటే సరిపోదు. ఫోర్కు, కత్తి ఎలా ఉపయోగించాలో కూడా నేర్పాలి – *చాలాకత్తులు గనుక ఉంటే పైన ఉండే ఫోర్కులు, కత్తులు ముందు ఉపయోగించాలి;* పబ్‌లో ఆహారం ఎలా ఆర్డరు చెయ్యాలి – *ఈ రోజు సూప్ ఏమిటో చెబుతారా, ప్లీజ్;* పార్టీకి వెళ్ళడం ఎలా – *ఒకవైన్ సీసా లేదా పూలు లేదా చాక్లెట్లు తీసికెళ్ళి అతిథేయికి ఇవ్వాలి;* రెస్టారెంటులో బిల్లు ఎలా చెల్లించాలి – *బిల్లులో సర్వీసు కలపలేదు అని ఉంటే, పదిశాతం టిప్‌గా బిల్లుతో పాటు అదనంగా చెల్లించాలి;* టీ ఎలా తాగాలి – *టీ పాట్‌లో టీ లూజుగా ఉంటే కప్పులో పోయడానికి ముందుగా వడకొట్టే గరాటను కప్పుపైన పెట్టి అప్పుడు పోయాలి.* రొట్టెలను సరైన పద్ధతిలో ఎలా తినాలి – *కత్తినుపయోగించి రొట్టెను రెండు ముక్కలు చేయాలి. దాని పైన జామ్ రాయాలి. ముందుగా బటర్ రాయాల్సిన అవసరం లేదు. తర్వాత పైన క్రీంను జాగ్రత్తగా రాయాలి. పై ముక్కను అడుగు ముక్కను విడిగా తినాలి. వాటిని శాండ్‌విచ్‌లా చేయవద్దు.*

'మాట్లాడేటప్పుడు చేతులు నిదానంగా కదపాలి. హుందాగా ఉండాలి. కూర్చునే ముందు కుర్చీ ముందు కుడి వైపుకి తిరిగి నిలబడి, కొంచెం పక్కకు తిరిగి కుర్చీలో కూర్చోవాలి. ఒక కాలు వెనకమరో కాలు ఉంచాలి. ఈ పని నిదానంగా, ఏమాత్రం శబ్దం కాకుండా చెయ్యాలి', అని మిస్ ఫివర్ షాం చెప్పిందా అమ్మాయికి.

'శారీరక స్పర్శ విషయంలో ఇంగ్లీషు వాళ్ళు ఇంకా బాగా ముభావంగానే ఉంటారు. ఇంగ్లీషు హేండ్ షేక్‌లో వదిలిపెట్టలేకపోవడం ఉండదు. "హౌడుయుడూ?" అనగానే పలకరింపు పూర్తయినట్టే. దీన్ని మించి చేతిని కలిపి ఉంచరాదు. పరస్పరం పరిచయమున్న ఆడవారు ఒకరినొకరు ఒక బుగ్గపైనో, రెండు బుగ్గల పైనో ముద్దు పెట్టుకోవచ్చు. ఆడవాళ్ళు 'మిస్‌కిస్'ను ఉపయోగించాలి. ముద్దుపెట్టేవాళ్లు ముద్దుపెడుతున్నట్టుగా ఎవరికి ముద్దు పెడుతున్నారో వారి చెవి ప్రాంతంలో ముద్దుపెట్టిన శబ్దాన్ని చేస్తారు. పలుకరిస్తున్నట్లుగా పురుషులు స్త్రీలకు ముద్దు పెట్టవచ్చు, కాని ఒక బుగ్గపైనే, రెంటిపైన పెట్టకూడదు', ఆశ్చర్య చకితురాలైన అమ్మాయికి మిస్ ఫివెర్‌షాం వివరించింది. ఇంగ్లీషు వాళ్ళు వెర్రివాళ్ళు.

ఇంగ్లండులో మనోహరంగా ఉండే నగరాల్లలో ఆక్స్‌ఫర్డ్ షైర్ ఒకటి. ఎనిమిది వందల యేళ్ళ కిందట నిర్మింపబడిన విశ్వవిద్యాలయ భవన నిర్మాణవైభవం, చారిత్రక విశిష్టత చూసి విస్మయం చెందింది చాందిని. వైభవోపేతమైన బాడ్లియన్ లైబ్రరీ, రాడ్‌క్లిఫ్ కెమేరా, షెల్డోనియన్ థియేటర్, ఆష్మోలియన్ మ్యూజియం నిర్మాణంలో చరిత్ర, సంస్కృతి, స్వేచ్ఛాపూరిత ఆలోచన, మేధోపరమైన స్వాతంత్ర్యం కలిపి కట్టినట్టుగా ఉన్నాయి. కొత్తగా వెళ్ళిన అందరిలానే, చాందినీ కూడ కార్‌ఫాక్స్‌టవర్ పై వరకూ వెళ్ళింది, తరువాత ఆయాసపడుతూ హైస్ట్రీట్‌లో ఉన్న యూనివర్సిటీ చర్చ్ మెట్లు ఎక్కింది. ఈ రెండు ప్రదేశాల నుంచి నగర సౌందర్యాన్ని యథేచ్ఛగా చూడవచ్చు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న అన్ని కాలేజీల్లోను క్రైస్ట్ చర్చ్ కాలేజ్ పెద్దది, అన్నిటికన్న శోభాయమానమైంది. వాస్తవానికి కాలేజి చర్చిలో ఆక్స్‌ఫర్డ్ బిషప్‌పీఠం కూడా ఉంది. ఆక్స్‌ఫర్డ్‌కు తూర్పున యూరప్‌లోకెల్లా అందమైన వీధి హైస్ట్రీట్ ఉంది. దీనికి సమీపంలోనే ఆక్స్‌ఫర్డ్‌లో అత్యంత సుందరమైన పార్కులు – హెడింగ్‌టన్ హిల్, సౌత్‌పార్క్ ఉన్నాయి. ఆక్స్‌ఫర్డ్‌లో భవనాలు మాత్రమే అందంగా ఉండడం కాదు, ఒకే ఒక్క నగరంలోనే దేవుడు ప్రకృతి రామణీయకాన్నంతటినీ గుమ్మరించినట్లుంటుంది. ఎకరాల కొద్దీ పచ్చిక బయళ్ళు, మేత మేసే పశువులు, మిలమిలమెరిసే థేమ్స్ సెలయేళ్ళు ఈడెన్‌ను తలపిస్తాయి.

మిస్ ఫివర్ షాం ఫినిషింగ్ స్కూల్ చాందిని ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అయితే కాన్పూర్ మురికివాడలోని అంతర్ముఖురాలైన బాలిక హఠాత్తుగా ఆక్స్‌ఫర్డ్ వాతావరణానికి అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది. పాడింగ్‌టన్ నుంచి ఆక్స్‌ఫర్డ్ లోని మహిళా కళాశాల సెయింట్ హిల్డాకు రావడానికి భయపడింది. ఎందుకంటే ఆక్స్‌ఫర్డ్‌లో ఆమె కలిసిన ప్రతి ఒక్కరు తెలివితేటల్లోను, ఆర్థికంగాను, సామాజికంగాను ఆమెకన్న అధికులే. అయితే సెయింట్ హిల్డాలోని స్నేహపూర్వకమైన కుటుంబాన్ని తలపించే జూనియర్ కామన్ రూం వాతావరణం ఆమె భయాన్ని మొదటి క్షణంలోనే పోగొట్టింది. హిల్డా ఆవరణలోని వోల్ఫ్‌సన్ గార్డెన్ బిల్డింగ్ గదిని కేటాయించారామెకు. తన గదికి సూట్‌కేసును తోసుకుంటూ వెళ్తుండగా, పొడవుగా సన్నగా బంగారు రంగు జుట్టున్న అమ్మాయి వచ్చి సామాను తీసుకెళ్ళడానికి ఆమెకు సాయం చేసింది. 'హలో, నా పేరు జోసఫిన్ రిచర్డ్‌సన్ – ఆర్ట్ మేజర్‌ని. నా పక్క గదిని భారతీయ అమ్మాయికి కేటాయించామని చెప్పారు. అది నువ్వే అనుకుంటాను'

'నైస్ టు మీట్ యు', అంది చాందిని మిస్ ఫివర్ షాం ఇచ్చిన తర్ఫీదు నుంచి ధైర్యం తెచ్చుకుంటూ, 'సామాను తీసుకురావడానికి సాయం చేసినందుకు కృతజ్ఞతలు.'

'ఫరవాలేదు. నువ్వు సామాను సర్దుకోవడం అవగానే మనం బటరీకి వెళదామా?' జోసఫిన్ అడిగింది'.

'బటరీ ఏమిటి? అడిగింది చాందిని.

'సెయింట్ హిల్డాలో బటరీ షాపు. టోస్టీలు, చిప్స్, హాట్‌చాక్లెట్' టీ అమ్ముతారు. చాలామంది మనలాంటి అమ్మాయిలు అక్కడ కనిపిస్తారు. నేను నీ కోసం ఆగుతాను. అహ్! వచ్చేశాం. గదిలో సింగిల్ బెడ్, బ్లాంకెట్, డెస్క్, రెండు కుర్చీలు, సింక్, అల్మారా, టేబుల్ ఉంటాయి. పక్క బట్టలు మాత్రం నువ్వే తెచ్చుకోవాలి. నువ్వు కొనుక్కోడానికి అవి దొరికేమంచి చోటు చూపిస్తాను నేను'.

ఉత్సాహంగా మాట్లాడుతున్న జోసఫిన్ మాటలు వింటుంటే చాందినీ భయాలు, నిరాశానిస్పృహ త్వరగానే పోతున్నాయి.

ప్రపంచ ప్రఖ్యాత డిబేటింగ్ సొసైటీ 1823లో స్థాపించబడింది. దాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అంటారు. విషయంలోను, ప్రభావంలోను వివాదాస్పదమైన చర్చలకు కేంద్ర బిందువైంది ఇది. ప్రఖ్యాత 1933 తీర్మానం, 'ఈ సభ ఏ పరిస్థితుల్లోను రాజు కోసం,దేశం కోసం పోరాడదు' అనే తీర్మానం ఆక్స్‌ఫర్డ్ యూనియన్లో 153 వ్యతిరేక ఓట్లు, 275 అనుకూల ఓట్లతో పాసయి మీడియా ద్వారా జాతీయ ఆగ్రహాన్ని రేకెత్తించింది. విన్‌స్టన్ చర్చిల్ దీన్ని అత్యంత సిగ్గుపడాల్సిన తీర్మానమని, 'నికృష్టమైన, నీచమైన లజ్జాహీన ప్రకటన' అని ఖండించాడు. ఈ ఓటు యూరపుపై దండయాత్ర చేయాలనే హిట్లర్ నిర్ణయాన్ని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్ర వహించిందని చాలామంది భావించారు. చర్చిల్, మీడియా ఏమనుకున్నా ఆక్స్‌ఫర్డ్ యూనియన్ సభ్యులకి లెక్కలేదు. యూనియన్ వ్యవస్థాపక ఉద్దేశ్యానికి భిన్నాభిప్రాయాలు, ముక్కుసూటిదనం కీలకంగా నిలిచాయి.

కొత్తబ్యాచ్ సభ్యులను ఆహ్వానిస్తూ యూనియన్ జరిపే కార్యక్రమానికి జోసఫిన్, చాందిని హాజరయ్యారు. ప్రెసిడెంట్‌కు వారిని పరిచయం చేసినప్పుడు బహిరంగ చర్చ ద్వారా స్వేచ్ఛా సమాజాన్ని నిర్వహించడానికి యూనియన్ చేసిన కృషికి ఆయనని అభినందించింది ఆమె. ప్రెసిడెంట్ కరచాలనం చేస్తూ ఆమెని చూసి చిరునవ్వు నవ్వి, 'స్వేచ్ఛా సమాజమంటే అప్రతిష్టపాలవడానికి సురక్షితమైనది, అయినాగాని, వాక్స్వాతంత్ర్యంతో పాటు వినకుండా ఉండే స్వేచ్ఛ కూడా ఉంటుంది!' అన్నాడు.

మిగిలిన కొత్తవారితో కలిసి రాజకీయ చర్చా ప్రపంచంలోకి ప్రయాణం మొదలుపెడుతూ, ఇది తనకు విశిష్టమైందని చాందిని ఆ క్షణంలో నిర్ణయించుకుంది.

గురువారం రాత్రి కార్యక్రమాన్ని ఛైర్మన్ ఆరంభిస్తూ, డిబేటు, ఓటింగు విధానాలను గురించి చెప్పాడు. 'లేడీస్ అండ్ జంటిల్మన్, ఈ డిబేటుకు ఛైర్మన్‌గా ఉండడం నాకు సంతోషంగా ఉంది. ఎందుకంటే ప్రపంచంలో ఇంత దీర్ఘకాలం, ఇన్ని భేదాభిప్రాయాలు కలిగిన అంశమిది. ఈనాటి తీర్మానం ఇది, చట్టబద్ధంగా స్త్రీలకు సమాన వేతనం ఇవ్వాలని ఈ సభ నమ్ముతున్నది. చర్చను ప్రారంభించమని మొదటి వక్త జాఫ్రీ హెమింగ్ ఫోర్డ్‌ను పిలిచాడు.

ప్రతిపాదనకు అనుకూలంగా మాట్లాడే మొదటి వక్తకు మిగిలిన వక్తలను పరిచయం చేయవలసిన బాధ్యత ఉంటుంది. "మొదటి వక్తగా ఈనాటి మీ అతిథులను పరిచయం చేయాల్సిన బాధ్యత నాకుంది. ప్రతిపాదనకు వ్యతిరేకంగా మాట్లాడే మొదటి వక్త చాందినీ గుప్త – బహుశ – ఆక్స్‌ఫర్డ్ నుంచి వెళ్ళే భారతదేశ ప్రధానమంత్రి అభ్యర్థిని కావచ్చు. గత కొన్నేళ్ళుగా వాదనల్లో పూర్తిగా గెలిచిన రికార్డు ఆమెది. వాస్తవానికి ఆ వాదనను ఆమె విశ్వసిస్తుందా లేదా అనేది వేరే విషయం – రాజకీయ నాయకులకు ఉండాల్సిన ప్రధాన లక్షణమిదే – ఈ రోజు ఆమె అధికారికంగా చేసే వాదనకు, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని నేను చెప్పగలను. ఈ రోజు ఆమెతో కలిసి వాదిస్తున్నందుకు నేనానందిస్తున్నాను. నాకు మద్దతిస్తూ మాట్లాడే రెండో వ్యక్తి ఎలిజబెత్ లిటన్, లిట్టన్, ట్రయాన్ అండ్ యాబొరొలో ఎలిజబెత్‌కు ఉద్యోగమిస్తానని హామీ ఇచ్చారు. ఆమెకా అర్హత ఉందని నేను చెబుతున్నాను. ఆక్స్‌ఫర్డ్‌లోని తెలివైన యువ మేధావులలో ఒకరైన ఎలిజబెత్ తీర్మానానికి అనుకూలంగా మాట్లాడతారు. వ్యతిరేకంగా మాట్లాడే రెండో వక్త విక్టర్ వాల్‌సింఘామ్. విక్టర్ గత పన్నెండు నెలలుగా దీర్ఘకాలిక సెలవు తీసుకుని అమెరికా అంతా తిరిగి వచ్చారు. మన కజిన్స్‌ను పరిశీలించి వచ్చారు గనుక ఆ విశేషాలు చెప్పి అలరిస్తారు. మిస్టర్ ఛైర్మన్, వీళ్ళు మీ అతిథులు. వారికి స్వాగతం పలుకుతున్నాను'. అయిదు వందల మంది శ్రోతలు మర్యాదపూర్వకంగా చప్పట్లు కొట్టారు.

'మిస్టర్ ఛైర్మన్ ప్రజాప్రాతినిధ్య చట్టం 1918 గ్రేట్ బ్రిటన్లో మహిళలకు ఓటు హక్కు నిచ్చింది. అయితే విచిత్రగా ముప్ఫయ్యేళ్ళుపైబడినవారు, సొంత ఇళ్ళు ఉన్న వారికి మాత్రమే బాలెట్ పేపరు మీద గుర్తుపెట్టగల తెలివితేటలుంటాయని భావించారు.

పదేళ్ళ తర్వాత చట్టాన్ని సవరించి, ఇరవై ఒక్కేళ్ళున్న స్త్రీలందరికీ ఓటు హక్కునిచ్చారు. మనం మరింత వెనక్కి తగ్గి, తప్పును సరిదిద్దే అవకాశాన్ని ప్రకృతి శక్తులకే ఇద్దామా?'

శ్రోతల్లో చాలామంది ఆడవారు అంగీకారంగా తలలు ఊపుతున్నట్లుగా గమనించి, మళ్ళీ ఆరంభించాడు. 'యుద్ధం ముగిశాక చాలా మంది స్త్రీలకు జరిగిన మేళ్ళు చెప్పుకో దగినంతగా లేవు. మెటల్ వర్కర్లుగా, ఐరన్ వర్కర్లుగా విమానాల్లోను, ఆయుధ కర్మాగారాల్లోను పనిచేసే వారికి హఠాత్తుగా వారి మగపని, మగజీతం పోయింది. రివెట్లు బిగించే రోజీ అయిష్టంగా వెయిట్రెస్ రోజీగా వెళ్ళాల్సి వచ్చింది యుద్ధం రాకముందున్నప్పటి కన్న తక్కువ జీతానికి! సమాన వేతనం అంటే, వాస్తవానికి మగవాళ్ళకిచ్చే దానిలో డెబ్బయి అయిదు శాతం. ఈ ప్రాథమికమైన వివక్షని మన తరానికి కూడా మోసుకొచ్చాం. ఈ అన్యాయాన్ని మనం కొనసాగనివ్వాలా?' అతను డిమాండ్ చేశాడు.

'మిస్టర్ ఛైర్మన్, పార్లమెంటు జోక్యం అవసరమైతే, మన పార్లమెంటులోని గౌరవనీయులైన సభ్యుల్లో మెజారిటీ ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటువేసేవారు ఇప్పటికే. అయితే మెజారిటీ లేదని వాదిస్తున్నారు. శ్రోతలకు నేను చెప్పదలచుకున్నదేమిటంటే కొన్నిసార్లు మెజారిటీ అంటే మూర్ఖులందరూ ఒకే వైపున ఉన్నారని అర్థం. ఈ కేసుల్లో ఇప్పుడున్న పరిస్థితి అదే' అన్నాడు జాఫ్రీ. అక్కడున్న స్త్రీలు గట్టిగా చరిచిన చప్పట్లు స్వీకరిస్తున్నట్లుగా చిరునవ్వుతో కూర్చున్నాడు.

చాందిని లేచి నిలబడి శ్రోతలను చూసింది. సగానికి పైగా మగవాళ్ళున్నారు. వాళ్ళని తనవైపుకు తిప్పుకొనడం అవసరమని తెలుసునామెకు. ఇప్పటివరకు మాట్లాడిన మొదటి వక్త జాఫ్రీ హెమింగ్ ఫోర్డ్‌ను పరిచయం చేస్తూ మాట్లాడడం ఆరంభించింది. గత ఏడాది కేంబ్రిడ్జ్‌తో జరిగిన బోట్‌రేస్‌లో ఆక్స్‌ఫర్డ్ విజయానికి అతనే కారణం కావడంతో మంచి పేరుంది అతనికి. రేసు జరిగిన రోజున పదిలక్షల మంది ప్రేక్షకులు థేమ్స్ తీరంలో పుట్నీ నుంచి మోర్ట్‌లేక్ వరకు నిలబడి జాఫ్రీ బృందం రేసు గెలవడాన్ని వీక్షించారు. తనకు ఓట్లు అవసరమని చాందినికి తెలుసు – వాదనలో గెలిచి, కేసు ఓడిపోవడం వల్ల ప్రయోజనం లేదు.

'మిస్టర్ ఛైర్మన్, ప్రతిపాదనకు వ్యతిరేకంగా వాదిస్తున్న మొదటి వక్తగా ప్రతిపాదనకు అనుకూలంగా వాదించిన మొదటి వక్త మిస్టర్ జాఫ్రీ హెమింగ్ ఫోర్డ్‌ను పరిచయం చేయడం నా బాధ్యత, ఆయనకు పరిచయం అసవరం లేదు నిజానికి. నార్త్ ఫెన్స్ పోలిటెక్నిక్ నుంచి వచ్చిన మన ఫ్రెండ్స్ గురించిన పాత కథ మీకు తెలుసు అంటూ

ఆక్స్‌ఫర్డ్‌లో కేంబ్రిడ్జి వాళ్ళని తక్కువ చేసి మాట్లాడే మాటని ఉపయోగించింది కావాలని, 'వాళ్ళొక పడవ నడిపే బృందాన్ని పోటీకి పంపాలని నిర్ణయించుకున్నారు. వాళ్ళు ప్రతిరోజూ చాలాగంటలపాటు ప్రాక్టీసు చేసినా ఆక్స్‌ఫర్డ్‌ను ఓడించలేకపోయారు. చివరికి వాళ్ళొక వేగును పంపాలని నిర్ణయించుకున్నారు. వాళ్ళ వేగు పొదల్లో దాక్కొని జాఫ్రీ నాయకత్వంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ బృందం రోజూఎలా ప్రాక్టీసు చేస్తుందో చూశాడు. రెండు వారాల తర్వాత వేగు తిరిగి వచ్చి ప్రత్యర్థుల రహస్యం తెలుసుకున్నానని చెప్పాడు. 'ఏమిటది? చెప్పు' అన్నారు అతని బృందం. "మనం ఒక్కడినే మాట్లాడనివ్వాల్సింది. మిగిలిన ఎనిమిది మంది పడవ నడపాల్సింది!" అని చెప్పాడు వేగు. ఆక్స్‌ఫర్డ్ పడవ నడిపే వీరుడిని చాందిని ప్రశంసించిన తీరుకు అందరూ గట్టిగా చప్పట్లు చరిచారు. శ్రోతలలో చాలామంది మగవారి అభిమానాన్ని చూరగొని ఆమె తన వాదన కొనసాగించింది.

'మిస్టర్ ఛైర్మన్, వివాహమైన పురుషులు ఒంటరిగా ఉండే పురుషులకన్న ఎక్కువ కాలం జీవిస్తారని అంటారు. పని ప్రదేశాల్లో స్త్రీలుండాలనే దానికి అనుకూలంగా దీన్ని మనం గ్రహించవచ్చు. వాళ్ళు అక్కడ కేవలం ఉండడం మూలంగానే వారి మగ సహోద్యోగుల ఆయుష్షు పెరుగుతుంది. వివాహితులైన పురుషులు ఒంటరి పురుషులకన్న ఎక్కువకాలం జీవిస్తారని, అయితే వాళ్ళలో చాలామంది తొందరగా చనిపోవాలని కోరుకుంటారని నేను విన్నాను.'

శ్రోతలు నవ్వారు. 'ఒక మగవాడు మీ భార్యకు లేపుకొని పోతే, ఆమెని అతని దగ్గరే ఉండనిస్తే ప్రతీకారం తీర్చుకొన్నట్టే అనడానికి కారణమిదే' అని అంది. ఇంకా ఎక్కువగా నవ్వారంతా. మగ శ్రోతలు తనవైపేనని ఆమెకి తెలుసు – వాళ్ళే మెజారిటీ – ఆయువుపట్టు పట్టుకొంది.

'భారతదేశం నుంచి వచ్చిన స్త్రీగా, ఏ విషయంలో స్త్రీని పురుషుడితో పోలుస్తున్నారో దానిపై స్త్రీ అసలు విలువ ఉంటుందని చెప్పగలను. మహత్తరమైన సమానత్వానికి పరిష్కారం స్త్రీల జీతాలు పెంచాలనే కృత్రిమ చట్టంలో లేదు. ఇలా పోల్చి చూసే మౌలిక విధానాన్ని మార్చడంలో ఉంది. కొన్ని ఉద్యోగాలు స్త్రీల కన్న పురుషులు బాగా చేయగలరు – అక్కడ పురుషులకు ఎక్కువ చెల్లించాలి. అదే విధంగా కొన్నింటిని స్త్రీలే బాగా చేయగలరు. అక్కడ స్త్రీలకే ఎక్కువ చెల్లించాలి. కాని ఎవరికి ఎంత ఇవ్వాలో నిర్ణయించేదెవరు? వెస్ట్ మినిస్టర్లో ఉన్న కాగితాలను కదిపే కొద్దిమంది అధికారులు కాదు. అలా చెప్తే, గౌరవనీయుడైన నా ప్రత్యర్థికి తెడ్డును వెయ్యడానికి ఎనిమిది మందికి బదులుగా

పదిమందిని పెట్టుకోమని చెప్పినట్లుగా ఉంటుంది!' అంటూ దద్దరిల్లేలా వినపడుతున్న చప్పట్ల మధ్య, తనను పొగిడిందా, తిట్టిందా అని జాఫ్రీ విస్మయం చెందుతుండగా చాందిని కూర్చుంది.

అతన్ని చూసి సిగ్గుగా నవ్వింది. అతను ఆకర్షితుడైనట్టుగా ఉన్నాడు.

'ఎన్నికలు ప్రకటించారు', అన్నాడు గంగాసాగర్ విజయోత్సాహంతో, 'వాళ్ళకి వేరే మార్గం లేదు. పాలక పక్షం నిట్టనిలువుగా చీలింది. మనంతట మనం ఎన్నటికీ సాధించలేనిది ఉత్తరప్రదేశ్ హోం మినిస్టర్, రజ్జోభయ్యాల గొడవ సాధించింది!'

'మనం తప్పకుండా గెలుస్తాం' అన్నారు అగర్వాల్. స్పూనుతో మలాయి మఖన్ నోట్లో పెట్టుకుంటూ – కుంకుమపువ్వు వేసిన మీగడ చిలికిన వెన్నతో చేసినది అది. నోట్లో పెట్టుకున్నారో లేదో కరిగిపోయింది, ఆయనకి ఆ రుచిని ఇంకా కావాలనిపింపజేస్తూ.

'జీవితంలో తప్పనిసరిగా జరిగేది మృత్యువు' అన్నాడు గంగాసాగర్ తన తాత్త్విక ధోరణిలోకి పోతూ, 'నేను ఈ ప్రభుత్వానికి మృత్యువు నవ్వాలని ప్లాన్ వేశాను'.

'ఇక్రంను తప్పించాలనుకున్నావు కదా' పొట్టలో ఆహారం సర్దుకోగానే తృప్తిగా వెనక్కి వాలుతూ అన్నారు అగర్వాల్.

'ఈ ప్రపంచంలో ఓడింపబడని వాళ్ళు, మోసగింపబడని వాళ్ళు ఎవరూలేరు' మరో గుటక వేస్తూ అన్నాడు గంగాసాగర్. ఠగ్గూకెలడ్డూ మెట్ల మీద కూర్చున్నారు వాళ్ళు – కాన్పూర్‌లో పేరున్న స్వీట్‌షాపు. యజమాని తాత ఠగ్గుకి – చక్కెర వాడడం వల్ల ఆ పేరు వచ్చింది – మహాత్మాగాంధి వాడకూడదని నిర్దేశించిన పదార్థం – ప్రపంచ ప్రఖ్యాతి పొందిన తన మిఠాయిలలో వాడాడు. అతనిని ఠగ్ అని ముద్ర వేశారు. దాంతో ఠగ్గు అనే పేరు స్థిరపడింది. *ఐసా కోయీ సగా నహీ, జిస్‌కో హమ్‌నె ఠగా నహీ*– కుటుంబ సభ్యులతో సహా మేము మోసగించని వారు ఎవ్వరూ లేనేలేరు – అనేది దుకాణానికి ఆదర్శంగా నిలిచింది, ఈ వాక్యమే కాన్పూర్ గురించి, దాని రాజకీయాల గురించి సంక్షిప్తంగా చెప్పేస్తుంది.

కేవలం దాని ప్రతిబింబమే గంగాసాగర్.

'వాళ్ళు ఎన్నికలు ప్రకటించారు' అంది చాందిని ఉత్సాహంగా, 'వాళ్ళకి మరో మార్గం లేదు. అధ్యక్ష పోటీలో ఎలిజబెత్‌కి, విక్టర్‌కి మధ్య ఉన్న స్పర్థలో సయోధ్యకు తావు లేకుండా పోయింది'.

'బొమ్మ కోసం నువ్వు కదలకుండా కూర్చోవాలి', ఫిర్యాదు చేసింది జోసఫిన్. ఎసైన్‌మెంట్ కోసం ఆర్ట్ టీచర్ ఆమెని కాన్వాసు మీద ఆయిల్ పెయింటింగ్ వేయమన్నాడు. క్షణం కూడా కదలకుండా కూర్చోలేని వాళ్ళ బొమ్మ పూర్తి చేయడానికి సతమత మవుతున్నపుడు, ఉపశమనం లభించడంతో జోసఫిన్ పెయింట్ బ్రష్ క్రింద పెట్టింది. 'ఇద్దరూ నియమాలు ఉల్లంఘించారు, రైట్? ఎన్నికలలో దుష్ప్రవర్తన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు'.

చాందిని తల ఊపింది. 'మెర్టన్ కాలేజ్‌లో సోషియాలజీ విద్యార్థి ఇరవై మూడేళ్ళ విక్టర్ వాల్ సింఘమ్ ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌కి వేసవి కాలానికి నవంబర్లో జరిగిన ఎన్నికల్లో గెలిచాడు. బాలియోల్ కాలేజ్‌లో పాలిటిక్స్, లా లో మేజర్ చేస్తున్న ఇరవై ఒక్క ఏళ్ళ ఎలిజబెత్ లిట్టన్‌ను 961-656 ఓట్ల తేడాతో ఓడించాడు" అని చెప్పింది చాందిని ఉత్సాహంగా.

'విక్టర్ యూనియన్‌కి కోశాధికారిగా పనిచేశాడు. ప్రత్యేకంగా రిజర్వ్ చేసిన గదిలో అతను ముప్ఫయి అయిదు మందికి ఎన్నికల సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ప్రచారాన్ని నిషేధించిన యూనియన్ నిబంధనలకు ఇలా చేయడం వ్యతిరేకమని ఎలిజబెత్ ఫిర్యాదు చేసింది. దానితో యూనివర్సిటీ ట్రిబ్యునల్ అతడిని మళ్ళీ పోటీ చేయడానికి అనర్హుడని ప్రకటించింది'.

'అయితే చివరికి ఎవరు గెలిచారు?' బ్రష్‌లు తుడుచుకుంటూ అడిగింది చాందిని.

'ఎవరూ గెలవలేదు. విక్టర్ వర్గం కూడా యూనియన్ లైబ్రేరియన్ అయిన ఎలిజబెత్ తన తండ్రి కంపెనీ లిట్టన్, ట్రయాన్ అండ్ యాబొరొలోని లండన్ వకీలును తన కేసు వాదించమని కోరిందని, ఆమె కూడా సంప్రదాయాన్ని పాటించలేదని ఆరోపించింది. ఎలిజబెత్ తనే బైడిఫాల్ట్ అధ్యక్షురాలిగా ప్రకటింపబడుతుందని భావించింది కాని యూనియన్ కొత్తగా ఎన్నికకు ఆదేశించింది', అని చాందిని చెప్పింది.

'అయితే నువ్వెందుకు పోటీచేయకూడదు?' జోసఫిన్ అడిగింది.

'నేనలా చేయలేను. ఎలిజబెత్, విక్టర్ ఇద్దరూ నా ఫ్రెండ్స్', అంది చాందిని.

'రాజకీయాల్లో స్నేహితులతో ఇదే సమస్య', అంది జోసఫిన్.

'ఏ సమస్య?'

'స్నేహితులు వచ్చి పోతుంటారు. శత్రువులు పెరుగుతుంటారు'.

'ఏం చెయ్యాలో తెలిసింది', ప్రకటించాడు గంగాసాగర్.

'ఏమిటి?' అగర్వాల్ అడిగారు.

'ప్రజాప్రాతినిధ్య చట్టం, విభాగం ఎనిమిది, ఉపవిభాగం మూడు'

'ఏమిటి?' మరింత అయోమయంగా అడిగారు అగర్వాల్.

'ఏదైనా క్రిమినల్ నేరానికి దోషిగా నిర్ణయింపబడిన వ్యక్తి అలా నిర్ణయింపబడిన నాటి నుంచి ఆరేళ్ళ పాటు ఎన్నికలలో నిలబడడానికి అనర్హుడుగా ప్రకటింపబడతాడు'.

'కాని ఇక్రం మీద దోష నిర్ధారణ జరగలేదు. ప్రతి ఒక్కరికీ, నీతో సహా ఇక్రం డాన్ అని తెలుసు కాని తన మీద కేసులేమీ రాకుండా చూసుకున్నాడు. తన స్నేహితుడు పోలీస్ కమిషనర్ అలా జరక్కుండా చూశాడు.'

'అం! తనకీ, రజ్జో భయ్యాకి మధ్య పోలీసు కమీషనరే చిచ్చు పెట్టాడని ఉత్తరప్రదేశ్ హోంమినిస్టర్‌కి చెబితే ఏమవుతుంది?' అడిగాడు గంగాసాగర్ తొందిగా.

'తప్పుకుంటాడు' అన్నారు అగర్వాల్, 'కాని ఆ పరిస్థితి **అభానస**కు కూడా నష్టం కదా, గంగా. పార్టీ తన ప్రధాన అభ్యర్థి ఇక్రంను కోల్పోతుంది'.

'మీరు చెప్పేది రైటే. అందుకే చట్టప్రకారం పోటీ చేయగలిగిన వ్యక్తిని తన నామినీగా అంగీకరించి అధికారం చలాయించుకోవచ్చని ఇక్రం అర్థం చేసుకోవాలి'.

'అలాంటివాళ్ళెవరు?'

'కూతురు కన్నా మించిన వాళ్లెవరు?' గంగాసాగర్ కొంటెగా అడిగాడు అగర్వాల్‌నవ్వారు.

***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'***, అన్నాడు గంగాసాగర్.

'అతను పోటీ చేయకూడదని నిశ్చయించుకున్నాడు', అంది చాందిని ఉత్సాహంగా జోసఫిన్‌తో, 'విక్టర్ నాకు మద్దతిస్తానని అన్నాడు'.

'ఎందుకు?' స్నేహితురాలిని చూసి సంతోషిస్తూ అడిగింది జోసఫిన్.

'నేను అభివృద్ధి చెందని దేశం నుంచి వచ్చిన బీద అమ్మాయినని, తను చెప్పినట్టు నేను వింటానని, నా ద్వారా యూనియన్‌ను నడపాలని అనుకుంటున్నాడు'.

'పాపం పిచ్చోడు' అని భుజాలెగరేసి, 'వాడు జాఫ్రీని అడగాలి' అంది జోసఫిన్.

వాళ్ళు ఆక్స్‌ఫర్డ్‌లో అందరికీ నచ్చిన ఈగల్ అండ్ ఛైల్డ్ బార్‌లో కూర్చున్నారు. సి.ఎస్.లూయిస్, జె.ఆర్.ఆర్. టోల్‌కీన్ ఇక్కడే కూర్చుని సాహిత్యం, ప్రేమ, జీవితాలను గురించి చర్చించేవారు. ఒక గోడ మీద ఉన్న స్మృతి ఫలకం మీద సంతకాలు చేసిన వాళ్ళ ఫోటోలు, యజమాని ఆరోగ్యం కోసం మేం బాగా తాగామని చెబుతూ వాళ్ళు చేసిన ఆటోగ్రాఫ్‌లు ఉన్నాయి.

వాళ్ళిద్దరి మధ్య జరిగిన చర్చ చివరిలో అతన్ని చూసి ఆమె సిగ్గుపడుతూ నవ్వడంతో ప్రేమ వ్యవహారం మొదలైంది. జాఫ్రీ సందేహిస్తూ తనతో బయటికి రమ్మని అడిగాడామెని, భారతీయ స్త్రీలకు డేటింగ్ అంగీకారమో కాదో తెలియకపోయినా. అతడు తనని అడుగుతాడని ఆమె లోలోపల ఆశించింది అడగగానే ఒప్పుకుంది.

చాలాసేపు మాట్లాడుకుని కొన్ని వైన్‌సీసాలు ఖాళీ చేశాక వాళ్ళు మౌనంగా ఉండిపోయారు. ఆమె మనసులో ఇలా అనుకొంది, *'డేటింగ్ కెళ్ళిన మగవాడు అదృష్టం కలిసొస్తుందా అని ఆశిస్తుంటాడు, కాని అమ్మాయికి ముందే తెలుస్తుంది'.*

జాఫ్రీ ఉండే గదికి వెళ్తూ వాళ్ళు ఒకరి చేతులలో ఒకరు ఒదిగిపోయారు. ఇలా కౌగిలించుకొని ఉండే క్షణం కోసమే పుట్టామనుకున్నట్టుగా. అతనామెను ముద్దుపెట్టుకున్నాడు. ఆమె కూడా మరింత గాఢంగా అతనికి ముద్దు పెట్టింది. అతడిని తినెయ్యాలన్నంతగా, మళ్ళీ అతని చేత తినిపింపబడాలన్నంతగా ఆమె కోరుకుంది.

మర్నాడు ఉదయం ఆమె నిద్రలేచినప్పుడు, అతను కిచెన్లో టీ కాస్తూ, గుడ్లు వేయించుతున్నాడు. పడక మీదే బ్రేక్‌ఫాస్ట్ తిన్నారు. కొన్ని తప్పులు ఎంత ప్రియంగా ఉంటాయంటే అవి మళ్ళీ మళ్ళీ చేయాలనిపిస్తాయని నిర్ణయించుకున్నారు.

ఒక ఆదివారం ఉదయం చాందిని, జాఫ్రీ హెూలీవెల్ మ్యూజిక్‌రూంలో కూర్చున్నారు. యూరప్‌లో కచేరీల కోసం కట్టిన వాటిలో ప్రాచీనమైనది. 1748లో ఆరంభమైన ఆ హాలు హేదన్, హెండెల్‌తో సహా గొప్ప గొప్ప గాయకులు, స్వరకర్తలు కచేరీలు చేశారు. ఆదివారం ఉదయం హెూలీవెల్‌లో ఆక్స్‌ఫర్డ్ కాఫీ కచేరీలు జరుగు తున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన గాయకులు, కళాకారులు రిమ్మెత్తించే పరిసరాల్లో ప్రదర్శిస్తున్నారు.

చాందినికి బాలీవుడ్ పాటలంటే ఇష్టం. మొదట్లో జాఫ్రీకి బాక్, బిథోవెన్, మోజార్ట్‌లపై ఉన్న అభిమానాన్ని చూసి నీరసించింది. కాని ఆర్గాన్, వయొలిన్‌ల కల్తీలేని ధ్వనులను వింటూ తన్మయత్వంలో మునిగిపోయింది.

వయొలినిస్ట్ స్ట్రింగ్ క్వార్టెట్, ఆర్గానిస్ట్ సహకారంతో వివాల్డి కన్‌సెర్టో ఇన్ ఎ మైనర్ వాయిస్తున్నాడు. జాఫ్రీ ఆమె చేతిని సున్నితంగా నిమిరాడు. తరువాత వయొలినిస్ట్ బ్రూఖ్ స్కాటిష్ ఫాంటసీని మధురంగా వాయిస్తున్నాడు. వయొలినిస్ట్ బిథోవెన్ వయొలిన్ కాన్‌సెర్టో ఇన్ డి మేజర్ వాయిస్తుండగా అతని చేయి ఆమె తొడ మీద ఉంది. వయొలినిస్ట్ బాక్ పార్టిటా ఇన్ డి మైనర్‌లో చాకొనె వాయించేవరకు వాళ్ళు కూర్చోలేదు.

ఫాన్ భారంగా మరోసారి తిరిగింది కాని గాలి ఏమాత్రం రాలేదు. దాని కింద కూర్చున్న మనిషి చెత్త కుప్పలోంచి తెచ్చి కూర్చోబెట్టినట్టున్నాడు. ఒకప్పుడు బాగుండి ఇప్పుడు మురికిగా ఉన్న ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నాడు. అతని ముందు ఊగిసలాడే టేబుల్, దాని మీద మురిగ్గా ఉన్న పసుపురంగు ప్లాస్టిక్ షీటు పరచి ఉన్నాయి. మరింత రోతగా ఉన్న రెండు కుర్చీలు సందర్శకుల కోసమేమో అతనికెదురుగా ఉన్నాయి.

సబిన్స్పెక్టర్ బ్రిజ్‌లాల్ పోలీసుస్టేషన్ని తన సొంత జాగీరులా నడుపుతాడు. అతని దర్బారుకు ఎడమ వైపున మగవాళ్ళ లాకప్ ఉంది. దాన్లోంచి దుర్వాసన వస్తోంది. కుడివైపున ఆడవాళ్ళ లాకప్ ఉంది. చీకటిగా ఉంది ఎవరూ లేరు. ఆఫీసు మధ్యలో స్టీలు బీరువా ఉంది. దాన్నిండా ఫైళ్ళు కుక్కి ఉన్నాయి. ఎలుకలు వాటిని సగం సగం కొరికి తిన్నాయి. ప్లాస్టిక్ కవర్ వేసిన అతని డెస్క్ మీద పనిచేయని పాత రోటరీ ఫోను, పనిచేసే విస్కీ సీసా ఉన్నాయి. గ్లాసులోంచి మరో గుక్క తాగి, సమస్యనెలా పరిష్కరించాలి అని ఆలోచనలో పడ్డాడు'.

ఉత్తరప్రదేశ్ హోంమినిస్టర్ నుంచి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుకు ఆదేశాలు వచ్చాయి. ఆయన వాటిని డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు, ఆయన సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుకు చెప్పాడు. ఈ ఆదేశాల గొలుసు అడిషనల్ సూపరింటెండెంట్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్‌కు అక్కడి నుంచి సీనియర్ ఇన్‌స్పెక్టర్‌కు చేరింది. అతను గొలుసులో చివరన ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ బ్రిజ్‌లాల్‌కు ఆదేశాలిచ్చాడు. ఏం చేసైనా సరే బందీ నోరు విప్పేలా చేయమని బందీ కాన్పూర్ మేయర్ ఇక్రంభాయ్ అనుచరుడు – అతని కోసం బెదిరించి డబ్బు గుంజేవాడు.

ఇక్రం స్నేహితుడు పోలీస్ కమిషనర్ ఉన్నపుడు ఎవరూ ఇక్రం అనుచరుల జోలికి వెళ్ళే సాహసం చెయ్యలేదు. కాని ఇప్పుడు పరిస్థితి వేరుగా ఉంది. తనకి, రజ్జోభయ్యాకి మధ్యలో కావాలనే పోలీస్ కమిషనర్ రాజకీయంగా విద్వేషాలు రగిలించాడని ఉత్తరప్రదేశ్ హోం మినిస్టర్ దగ్గర ఖచ్చితమైన సమాచారం ఉంది. పోలీస్ కమిషనర్‌ని నిర్దాక్షిణ్యంగా తీసేశాడు. ఇప్పుడు ఇక్రంని దెబ్బతీయటానికి ఒక నేరాన్ని నిరూపించ గలగాలి, దీనికోసం ఎంతమందినైనా చంపడానికి వెనుకాడడం లేదు.

సబ్ ఇన్‌స్పెక్టర్ బ్రిజ్‌లాల్ మరో గుక్కతాగి, కుర్చీలో వెనక్కి జారబడి పిత్తాడు. పోలీసు క్యాంటీనులో దొరికే ఆహారం అతనికి సరిగా అరగడం లేదు – దాన్నిండా పురుగులు. అందుకనే విస్కీ బాగా తాగి పేగుల్లో బాక్టీరియాని చంపేస్తున్నాడు. చివరికి ఎప్పటికో లేచి, ఒక కానిస్టేబుల్‌ని తనతో రమ్మని దురదృష్టవంతుడైన ఇక్రం అనుచరుడిని బంధించిన సెల్ వైపు తాపీగా నడిచాడు. ఆ జైలు గది పది అడుగుల చదరపు గది. లైటు లేదు. పురుగులు తినేసిన దుప్పటి ఒక మూలన పడి ఉంది. దాని మీద భయపడుతూ దిగంబరంగా ఉన్న బందీ కూర్చుని ఉన్నాడు. ఒకమూల మూడడుగుల ఎత్తులో ఉన్న గోడ లెట్రిన్‌కు గదికి మధ్య ఉంది. గాలి వెలుతురు లేని ఆ గదిలో మంచి ప్రణాళికతో మలమూత్రాల వాసన బయటికి పోకుండా చూశారు.

బ్రిజ్‌లాల్ చేతిలో అతను 'సమాజ్ సుధారక్' అని పిలిచే ఆయుధం ఉంది. అది 'సంఘసంస్కర్త'కు హిందీ పదబంధం. అది చెక్కకు తగిలించి ఉన్న రెండడుగుల పొడవున్న రబ్బరు బెల్టు. బందీ జుట్టు పట్టుకొని అతని చెవిలో 'దీనితో సంఘసంస్కరణ చేసేటప్పుడు ఫ్రాక్చర్లు అవ్వవు. రక్తం కారదు. చర్మం ఊడదు. పోస్ట్ మార్టంలో ఏమి కనపడదు. కాని నొప్పి మాత్రం భరించలేని విధంగా ఉంటుంది. దేవుడికి మొరపెట్టుకున్నా ఆయన వినడు. ఫ్రెండ్, మరి నువ్వు సంస్కరింపబడడానికి సిద్ధంగా ఉన్నావా?' అని అన్నాడు.

ఒక గంటలోపే అపరాధం లిఖితపూర్వకంగా ఒప్పుకొని సంతకం చేయటం జరిగింది. సమాజ్ సుధారక్‌తోపాటు గంగాసాగర్ అందించిన ఉప్పు కూడా ఈ చమత్కారానికి సాయం చేసింది.

నూనె రాసి జాగ్రత్తగా జుట్టుని వెనక్కి దువ్విన యువకేరళీయుడు. 'సార్' అంటూ మొదలుపెట్టాడు. 'ఐయామ్ ఆ – నెర్డ్ టు మిట్ యు' అన్నాడు.

'యు ఆర్ ఆ–నెర్డ్ టు మిట్ మి?' నల్లగా, మర్యాదగా మాట్లాడుతున్న యువకుడేమంటున్నాడో అర్థంకాక అడిగాడు గంగాసాగర్. తర్వాత అర్థమైంది. ఈ దక్షిణ భారతీయుడేమంటున్నాడో. అతనికి తనని కలవడం గర్వంగా ఉందని ఆనర్డ్ టు మీట్ హిమ్.

'ఐ స్టడీడ్ ఇన్ కో–లియేజ్ ఇన్ కేరళ, నౌలుకింగ్ టు యర్న్ మెనీ ఇన్ జాబ్ విత్ యు'.

గంగాసాగర్ మనసులోనే అనువాదం చేసుకున్నాడు. *ఐ స్టడీడ్ ఇన్ ఎ కాలేజ్ ఇన్ కేరళ. అండ్ యామ్ నౌ లుకింగ్ టు ఎర్న్ మనీ ఇన్ ఎ జాబ్ విత్ యు* – కేరళలో కాలేజ్‌లో చదివాను. ఇప్పుడు మీ దగ్గర ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాలనుకుంటున్నాను.

'కేరళ వదిలేసి ఎందుకొచ్చావు?' ప్రశ్నించాడు గంగాసాగర్.

ఐ జింబ్లీ జంబ్‌డ్ ఎట్ ద ఛాన్స్ ఆఫ్ బేయింగ్ హియర్ ఇన్ ఇండియన్ పుల్లీ–టిక్స్', *ఐ సింప్లీ జంప్డ్ ఎట్ ద ఛాన్స్ ఆఫ్ బీయింగ్ హియర్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్*, అని గంగాసాగర్ అతని మాటలను అనువాదం చేసుకుని, చిరునవ్వుతో ఆ పట్టుదల గల యువకుడిని చూశాడు.

'నీ అర్హతలేమిటి?'

'యమ్‌బీయే'

ఆహా! 'ఎంబీఏ నా గుడ్. మేనేజ్‌మెంట్ నైపుణ్యాలున్న వాళ్ళు నాక్కావాలి?'

'నాకు తెలుసు సార్. మీరు చాలా బిజీ మనిషి'.

'నిజమే. కాని నా అంతట నేను అన్నీ బాగానే చూసుకోగలను బిజీగా ఉన్నా. నీకో అవకాశం ఇస్తాను - నీకు ఉద్యోగం ఇచ్చినందుకు బాధపడాల్సిన అవసరం రాదనిపిస్తోంది. వెయ్యి రూపాయల జీతం సరేనా?'

'ఇన్‌గంటాక్స్ పడుతుందా?'

'ఇన్‌కంటాక్స్? పడదనుకుంటాను. కనీస పరిధిలోనే ఉంటుంది' అన్నాడు గంగాసాగర్ నవ్వుతూ తన కొత్త సెక్రటరీతో.

'సర్, నాకో స్నేహితుడున్నాడు. అతను వెయిటర్. మిమ్మల్ని కలవడానికి వేచి ఉన్నాడు'.

మీనన్ ఉచ్చారణను పట్టించుకోకుండా 'అతణ్ణి నేనెందుకు కలవడం మీనన్?' అడిగాడు గంగాసాగర్. చాలా నెలలు గడిచిపోయాయి, ఇప్పుడు తను మీనన్‌లా మాట్లాడుతున్నట్లుగా గంగాసాగర్ గ్రహించాడు.

'సర్, మీరతనిని కలవాలి. అతను మీకు చాలా విలువైనవాడు'.

'వెయిటర్ నాకు విలువైన వాడవడం ఏమిటి? ఎలా?'

'సర్. అతను మీతో కలిసి పనిచేయాలనుకుంటున్నాడు'

'బట్లర్‌తో నాకేమిటి పని? మరొకరినెవరినైనా చూసుకోమను'.

'నో, నో, సర్. అతనికి ఉద్యోగం అవసరం లేదు. మీకేదో అమ్మాలనుకుంటున్నాడు'.

'ఏమిటి?'

'సమాచారం'.

గంగాసాగర్ శ్రద్ధగా విన్నాడు.

'నేనతన్ని లోపలికి పిలవనా? గంట నుంచి వేచి వున్నాడు', అడిగాడు మీనన్.

'తప్పకుండా. అతన్ని కలుద్దాం', అన్నాడు గంగాసాగర్.

కుతూహలంతో మీనన్ ఆ కేరళ ముస్లిం యువకుడిని లోపలికి తీసుకొచ్చాడు. 'సర్, ఇతని పేరు హమీద్. కాన్పూర్ గోల్డెన్ గేట్ బార్‌లో వెయిటర్. హమీద్ - ఏం చెప్పాలనుకుంటున్నావో సార్‌కి చెప్పు', అన్నాడు.

సబ్ జ్యుడీషియల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆవులించాడు. ఖైదీల బెయిలు దరఖాస్తులు వింటూ చాలా అలసిపోయాడు. మరో డిఫెన్స్ లాయర్ తనకి తెలియని కేసు వాదిస్తుండగా విన్నాడు. 'బెయిల్ తిరస్కరించబడింది!' అని మధ్యలోనే అరిచాడు. విస్తుపోయిన లాయర్ తన వాదనను ఆయన పూర్తిగా ఎందుకు వినలేదన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూశాడు. వాదన వినడానికి ముందుగానే మేజిస్ట్రేటు నిర్ణయం తీసుకున్నాడని అతను గుర్తించలేదు.

మేజిస్ట్రేటుకి చెప్పుకోలేని ఒక రహస్యం ఉంది. అతనికి పెళ్ళయింది. ప్రేమించే భార్య, ఇద్దరు కొడుకులున్నారు. కాని భార్య అతనిని ఉద్రేకపరచలేకపోతోంది. ఆయుర్వేద చికిత్సలెన్నో ప్రయత్నించాడు కాని తగ్గిపోతున్న కామవాంఛని పెంచుకోలేకపోయాడు. వేశ్యాసంపర్కంతోనైనా పరిస్థితి మెరుగవుతుందని వ్యభిచార గృహాలకి వెళ్ళాడు. కాని ఆడపిల్లలు అతన్ని చూసి నవ్వారు. బాధాకరమైన జీవితంతో విసిగి నిదానంగా నడుస్తూ ఒక బార్‌లోకి వెళ్ళాడు. విస్కీ, సోడా, ఐసు ఆర్డరు చేశాడు. వెయిటర్ అతనికి అడిగిన వాటితో పాటు పల్లీలు, చేగోడీలు తెచ్చాడు. ఆ రాత్రి అతను వెయిటర్‌తో కలిసి బార్ నుంచి బయటికొచ్చాడు. అప్పుడే అతనికి తెలిసింది తన బుర్రలో వైర్లు తేడాగా కలిశాయని. అతని యంత్రసామగ్రి బాగానే పనిచేస్తోంది కాని దానికి మరో కరెంటు కావాలి, నేరుగా దొరికేది కాదు. అతను హఠాత్తుగా సంతోషపడ్డాడు – స్వలింగ సంపర్కం చేస్తాడు.

డబ్బులు దండుకోవడానికి మంచి లాభసాటి అవకాశం వచ్చిందని వెయిటర్ త్వరలోనే గ్రహించాడు – టేబుల్స్ దగ్గర పనిచేయడం, గిన్నెలు కడగడం, గోల్డెన్ గేట్ బార్‌లో అసంతృప్తులైన కస్టమర్లకు నచ్చచెప్పడం ఇంక అనవసరం అనుకున్నాడు. ఇప్పుడతను సబ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కి రహస్య ప్రేమికుడు.

మేజిస్ట్రేటు చెప్పుకోలేని రహస్యం అతను హోమోసెక్సువల్ అనేది కాదు. మేజిస్ట్రేట్ వినే ఏ కేసైనా ఒక ధరకు లొంగుతుంది అనేది ఆ రహస్యం. అతని ఏజెంటు సమర్థుడైన వెయిటర్ పల్లీలు అందించడం నుంచి గ్రాడ్యుయేటై, శిక్షలు చెప్పేవరకు వచ్చిన హామీద్.

ఇది కచ్చితమే. పైకి కనిపించే లక్షణాలేమీ లేవు. కడుపులో నొప్పి, గర్భాశయంలో సంకోచస్థితి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించాల్సిన రోజులవి నెలలో. కాని ఆ లక్షణాలేవీ లేవు. ఆమె కచ్చితంగా గర్భవతి.

ఈ పరిణామాలు చూసి భయపడి జాఫ్రీని కలవాలని కాలేజ్‌కి వెళ్ళింది చాందిని. అతని క్లాసు అయ్యేవరకు బయటే వేచి ఉంది. ఆమె పచ్చని కళ్ళలోకి చూడగానే అతనికి అర్థమైంది. ఆమె ముఖం నిండా ఆందోళన అలుముకుంది. ఆమె చేతిని పట్టుకొన్నాడు. వాళ్ళిద్దరూ నేల మీద పడిన ఆకులు తొక్కుకుంటూ హెడింగ్‌టన్ హిల్‌కి నడిచారు నేల మీద పడిన ఆకులు తొక్కుకుంటూ.

చివరికి ఆమె అడిగింది, 'జాఫ్రీ మనం ఏం చేద్దాం?'

మనం పైనే ఊనిక ఉంది.

'నువ్వేం చెయ్యాలో నాకు నిజంగా తెలీదు' అన్నది అతని సమాధానం.

ఊనిక అంతా నువ్వుపైనే ఉంది.

'ఇదిగో నీకివ్వాల్సిన ప్రతిఫలం అయిదు' అంటూ విక్టర్ నోటును జాఫ్రీకి ఇచ్చాడు'.

'హెమింగ్ ఫోర్ట్‌లు ఎప్పుడూ పందెం ఓడరు కాని నువ్వు నాకు పది ఇవ్వాలి' అన్నాడు జాఫ్రీ తెలివిగా.

'ఎందుకు?'

'ఆ పాకీతో పడుకుంటే అయిదు, ఆమె తల్లయితే మరో అయిదు' అన్నాడు జాఫ్రీ . జిత్తులమారిలా.

'అయితే ఆమె గర్భవతా?' అడిగాడు విక్టర్.

విక్టర్ ఇచ్చిన రెండో నోటును తీసుకుంటూ, 'మనం అనాల్సింది ఒకటే, 'నువ్విప్పుడు ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అధ్యక్ష పదవి నీదేననుకోవచ్చు,' అన్నాడు జాఫ్రీ.

గంగాసాగర్ ముందున్న టెలిగ్రాం ఆయన తెలుసుకోవాలనుకున్న దానికన్నా చాలా తెలిపింది. అది మామూలుగా వచ్చే నెలవారీ నివేదిక. మిస్టర్ హార్వే రిచర్డ్‌సన్ ఇంగ్లండ్ నుంచి పంపేది. ఆమె గ్రేడ్లు, ప్రగతి, చర్చలు, స్నేహాలు మిగిలిన పాఠ్యేతర కార్యకలాపాలు – ఆమెకి అవసరమైనదానికన్నా ఇవి ఎక్కువే ఉన్నాయి.

మిస్టర్ రిచర్డ్‌సన్ ధనవంతుడు కాదు కాని సందర్భం వస్తే పని చేసిపెట్టగలడు.

అగర్వాల్ గారితో వ్యాపారభాగస్వామి అతను. అగర్వాల్ గారి దగ్గర గంగాసాగర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు, ఇంగ్లండులో తయారైన వస్తువులను దిగుమతి చేసుకొనడానికి ఇంగ్లండుకు సరుకులు ఎగుమతి చేయడానికి అతనికి సాయం చేసేవాడు. జోసఫిన్ రిచర్డ్‌సన్ అతని కుమార్తె. ఆమెని ఆక్స్‌ఫర్డ్‌లో చదివిస్తానని గంగాసాగర్ అనగానే చాలా సంతోషించాడు. అది నమ్మశక్యం కాని ఉదారవైఖరి.

ఉదార వైఖరులతో సాధారణంగా మరికొన్ని బాధ్యతలు కలిసివస్తాయి. అతని విషయంలోను – జోసఫిన్ విషయంలోను – ఇది ఆక్స్‌ఫర్డ్ సెయింట్ హిల్డాలో భారతీయ అమ్మాయిని జాగ్రత్తగా చూడడం.

కీలకమైనవి సిరంజి, కార్బొలిక్ సోపు ముక్కలు. శక్తిమంతమైన ఆమె గొట్టం గర్భవతి అయిన అమ్మాయికి నలభై ఎనిమిది గంటల్లోగా గర్భాశయ పొర బయటికి వచ్చేలా చేస్తుంది. ఆ తరువాత అంతా మామూలుగానే ఉంటుంది. జోసఫిన్‌తో కలిపి చాందిని వచ్చిన ఇల్లు తక్కువ ఆదాయంగల కింది తరగతి ఇల్లులా ఉంది. పేరులేని, మధ్యవయసుగల మేట్రన్‌లాంటి ఆడమనిషి, భయభ్రాంతులైన ఆడపిల్లలకు ఈ విధంగా కడుపును తీసేస్తుంది. ఆమె ఎవరికీ తెలియకుండా వందకు పైగా ఆబార్షన్లు చేసింది. ఇంటి నుంచే అత్యంత శుభ్రమైన అక్రమ క్లినిక్‌ను నడుపుతున్నది.

ఆ ఆడమనిషి పేరుని జోసఫిన్ మరో అమ్మాయి దగ్గర్నుంచి రాబట్టింది. తన తండ్రి గుప్తాజీకి ఈ సంగతి తెలిస్తే కుటుంబాన్ని అప్రతిష్ట పాలుచేశావని ఇంగ్లండు వరకూ వచ్చి చంపుతాడని భయపడింది, కాని జోసఫిన్ మొత్తం వ్యవహారాన్ని తన చేతిలోకి తీసికోగానే ఊపిరి పీల్చుకుంది.

మేట్రన్ చాందినీని బట్టలు తీసేసి చెక్క టేబుల్ మీద పడుకొని కాళ్ళను రికాబు మీద ఒక్కొక్కటిగా పెట్టమంది. చాందిని కాళ్ళ మధ్యకు చేరుకుని కాళ్ళు దూరంగా పెట్టమంది కాని ఎంత ప్రయత్నించినా చాందిని కాళ్ళు ఒకదానికొకటి అతుక్కునే ఉన్నాయి, లోపలి నుంచి ఎవరో గర్భం తీయించుకోవద్దని చెబుతున్నట్లుగా.

గ్రాస్మియర్‌లో ఉన్న మదర్ అండ్ బేబీహోం ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా దూరంగా ఉంది. అంతేకాకుండా 'పెళ్ళికాని తల్లుల' అక్రమ ప్రసవం కోసం, తరువాత

పిల్లలను దత్తత నిచ్చేటువంటి నన్స్ నడిపే హెూం లాంటిది కాదు. దీనికి విరుద్ధంగా ధనవంతుల గర్భవతులైన పిల్లలను జాగ్రత్తగా చూసుకొనేది. అలా సంరక్షించినందుకు తగినంత ఫీజును వసూలు చేసే ప్రయివేట్ హెూం. ఈ హెూంలో పద్నాలుగేళ్ళపాటు గడిపిన విలియం వర్డ్స్‌వర్త్ మాటల్లో గ్రాస్మియర్ మనిషి కనుక్కోలేని సుందర ప్రదేశం. లేక్ డిస్ట్రిక్ట్ మధ్యలో ఉంది ఇది, కొండలు, సరస్సులు, పొలాలు దీని చుట్టూ ఉన్నాయి, గ్రాస్మియర్ ఆకాశానికి భూమికి మధ్య ఉన్న మనోహర ప్రదేశం. చాందినిని ఎవరికీ చెప్పకుండా – గంగాసాగర్‌కి, చివరికి తనకి కూడా ఆమె పరిస్థితి చెప్పకుండా గ్రాస్మియర్‌కు తీసికెళ్ళమని జోసఫిన్‌కు హార్వే రిచర్డ్సన్ చెప్పాడు.

జోసఫిన్ ఒక గ్రామఫోన్ తెచ్చి చాందిని గదిలో ఒక మూల పెట్టింది. చాందినికి ఇష్టమైన మ్యూజిక్ – వయొలిన్ కచేరీల ప్లేయింగ్ రికార్డులు – బాక్, బోథోవెన్, బ్రామ్స్, చెకోవ్‌స్కీ, పగనినిలవి తెచ్చిపెట్టింది. చాందిని కిటికీ పక్కన కూర్చుని ప్రశాంతమైన గ్రాస్మియర్ వీధులను ఎగుడు దిగుడు శిఖరాలను చూస్తూ ఉంటుంది. చాందిని వయొలిన్ వింటూ ధ్యానంలోకి వెళితే, జోసఫిన్ తరచు మార్కెట్‌కి వెళుతుంది. తిరిగి వచ్చాక కొన్నిసార్లు జోసఫిన్‌కి చాందిని కళ్ళు చెమ్మగిల్లినట్టు, ముఖం మీద కన్నీటి చారికలు కనిపించేవి. వయొలిన్ వింటుంటే జాఫ్రీ ఎక్కువగా గుర్తు వచ్చేవాడు. చాందిని కిష్టమైన గులాబీరంగు చేమంతులు తాజాగా తెచ్చి అప్పుడప్పుడు కిటికీలో పెట్టి జోసఫిన్ ఆమెని సంతోషంగా ఉంచాలని చూసేది.

వచ్చిన ఎనిమిది నెలల తర్వాత చాందినికి ప్రసవ సమయం వచ్చింది. ప్రసవమంటే ముక్కు రంధ్రంలోనుంచి బౌలింగ్ బంతిని తోస్తున్నట్టుగా ఉంటుందని చాందినికి తెలియదు. మేట్రన్ ఆమె గర్భాశయం వ్యాకోచించిందా లేదా అని పరీక్ష చేస్తున్నపుడు జోసఫిన్ పక్కనే నిలబడి చాందిని చేతిని పట్టుకొంది. రక్తం, ఉమ్మనీరు పడుతున్నాయి. కొంచెం ముక్కి బిడ్డను బయటికి తోయమని నర్స్ బ్రతిమాలింది. చాందిని శక్తినంతా ఉపయోగించి బిడ్డని బయటికి తోసింది. తన లోపలి నుంచి బిడ్డ జారినట్టు అనిపించింది కాని వెంటనే ఆమెకి స్పృహ తప్పింది.

చాందిని మేల్కొనేసరికి తనని శుభ్రంచేసి, తన గదిలోకి చేర్చారని గ్రహించింది. జోసఫిన్ ఆమె పక్కనే కూర్చుని ఆమె తల నిమురుతోంది. ఒక్కసారి జోసఫిన్‌ను చూడగానే, ఆమెకు అర్థమైపోయింది.

'ఐ యాం సారీ హనీ, నీకు ఇంకా పిల్లలు పుడతారని, ఈ బిడ్డ కడుపులోనే చనిపోయిందని డాక్టరు చెప్పింది' అంది జోసఫిన్ నెమ్మదిగా.

☰

కాన్పూర్‌లో గంగాసాగర్‌కు వచ్చిన మరో టెలిగ్రాం అంతా సక్రమంగా జరిగిందని తెలిపింది. తండ్రులిద్దరిలో – గుప్తాజీకి, ఇక్రంకి, ఎవరికీ గంగాసాగర్ ఏం చెప్పలేదు. ఆ ఇద్దరమ్మాయిలు లేక్ డిస్ట్రిక్ట్‌లో మరికొన్ని వారాలుండటానికి కాటేజ్ తీసుకున్నారని, తర్వాత చాందిని ఇంటికి వస్తుందని ఆ టెలిగ్రాంలో ఉంది.

'ఒకరి పనైంది. ఇంకొకరి పని ఉంది' అనుకున్నాడు. గంగాసాగర్, సాయంత్రపు వాహ్యాళికి అగర్వాల్‌గారిని నదీ తీరంలో కలవడానికి వెళుతూ.

☰

ఎయిర్ ఇండియా బోయింగ్ 707-420 లండన్, కైరో, జెనీవా, ముంబయి రూట్లో ప్రయాణిస్తుంది. 160 మంది ప్రయాణికులున్నారు. తుఫానువల్ల జెనీవాలో దిగినపుడు చాందినికి విమాన ప్రయాణ అస్వస్థత కలిగింది. ముంబయి విమానాశ్రయంలో చేరగానే ఇంటికొచ్చేశానని హాయిగా ఊపిరి పీల్చుకుంది.

తన జీవితంతో ఆటలాడుకున్నందుకు జాఫ్రీని ఆమె ఎన్నటికీ క్షమించలేదు. మర్చిపోవడానికి ప్రయత్నిస్తుంది-కాని ఎన్నటికీ క్షమించదు. గంగాసాగర్ కూడా క్షమించదు.

☰

లండన్‌లో విల్టన్ ప్లేస్‌లో నైట్స్ బ్రిడ్జి నానుకుని వున్న ఫ్యాషనబుల్ వీధిలో ఎస్మరాల్డా బార్న్ ఉంది. జూదరుల కొత్త చట్టం వచ్చాక తెరిచిన క్లబ్‌లలో ఒకటి ఇది. దీనిలో నగరంలోని మంచి జూద నిర్వాహకులు, వెయిటర్స్, హెూస్టెస్‌లు, వంటవాళ్ళు ఉంటారు. ఇరుకుగా అంతగా వెలుతురులేని దారి పెద్ద ఆఫీసులోకి వెళుతుంది. దానిలో రెండు పెద్ద పాత డెస్కులున్నాయి. ఒక్కో దానిపైన ఆకుపచ్చ దీపం వెలుగుతోంది. ఆ డెస్కుల వెనకాల కూర్చుని క్యూబన్ చుట్టలు తాగుతున్న ఇద్దరు, పదినిమిషాల వ్యవధిలో విడిపోయారు. ఫ్రెడ్ కన్న పది నిముషాల ముందుగా టెడ్ పుట్టాడు. ఈ కవలలిద్దరూ కలిసి పేనె బ్రదర్స్ పేరుతో ఇంగ్లండ్‌లోనే పెద్ద క్రైం సిండికేటును సృష్టించి, నిర్దాక్షిణ్యంగా నడుపుతున్నారు.

ఈస్ట్ లండన్‌లోని హాక్స్టన్లో జాక్‌పేనె అనే రద్దు బంగారు వ్యాపారికి పుట్టిన వీరిద్దరూ, భవిష్యత్తులో వారిలో కనిపించబోయే ఏ గుణాలను బళ్ళో చూపించలేదు. వాళ్ళ తాత వాళ్ళకి బాక్సింగ్ నేర్పించాడు. వీళ్ళిద్దరూ ఏ పోటీలోనూ ఓడిపోలేదు. వాళ్ళకి రింగులోపల నుంచి గుద్దడం కన్న బయటి నుంచి గుద్దడం ఎక్కువ ఇష్టం కావడమే సమస్య. వాళ్ళు త్వరలోనే స్థానికంగా చెత్నాల్ గ్రీన్‌లో ఉన్న పాత స్నూకర్ క్లబ్‌ను కొని, బోలెడన్ని కుటిల వ్యాపారాలు ప్రారంభించారు – రక్షించడం, హైజాకింగ్, సాయుధ దోపిడీ, దహనాలు, పందేలు, వ్యభిచారం. వాళ్ళ ఆస్తులలో చెప్పుకోదగ్గది, హైప్రొఫైల్ ఉన్నది ఎస్మరాల్డా బార్న్.

హార్వే రిచర్డ్సన్ రౌలెట్ వీల్ దగ్గరకు వెళ్ళాడు. జూద నిర్వాహకుడు చిప్స్ పెడుతున్నాడు. కస్టమర్లు తమ రంగుల చిప్స్‌ని ఆడే చోట పెడుతున్నారు. నిర్వాహకుడు నిపుణంగా చిన్న తెల్లటి రౌలెట్ బంతిని బొటనవేలు, చూపుడు వేలు మధ్య పట్టుకొని తిప్పుతూ రిమ్ వైపు విసిరాడు. బంతి వెళ్ళి తిరుగుతున్న కక్ష్యలో పడింది. హార్వే నలుపు మీద అయిదు కాశాడు. బంతి వేగం తగ్గి, ఇంకా తిరుగుతున్న చక్రంలో పడిపోయింది. నిర్వాహకుడు 'డబుల్ జీరో' అని 'నో విన్నర్స్' అన్నాడు.

'ఛ!' అంటూ హార్వే లేచాడు. బౌన్సర్ అతన్ని చూసి తల ఊపాడు. సోదరులు అతన్ని కలవడానికి సిద్ధంగా ఉన్నారు. అతను భయపడుతున్నాడు కాని పైకి దాన్ని కనిపించనీయకుండా ప్రయత్నిస్తున్నాడు. అన్నదమ్ములిద్దరు ఒకసారి మత్తెక్కిన మనిషిని తీసికెళ్ళి పందులకు ఆహారంగా వేశారని ఒక వదంతి ఉంది. హారోడ్స్‌లో టెడ్‌గాని, ఫ్రెడ్‌గాని ప్రవేశించగానే డబ్బు కోసం క్యూల్లో నిలబడ్డవారంతా, మోజెస్‌కు ఎర్రసముద్రం దారిచ్చినట్టుగా వారికి దారి ఇస్తారు. ప్రతిగా వారిద్దరూ కమ్యూనిటీని కాపాడతారు. గతేడాది వాళ్ళు లండన్లో గైఫాక్స్ ఫైర్ వర్క్స్ కోసం వేలకు వేలు దుబారా చేశారని అంటారు.

తన ఇంటిలో దొంగతనం జరిగినప్పుడు వాళ్ళు సాయం చేశారు హార్వేకి. అలా వాళ్ళు తెలుసు అతనికి. దొంగతనం జరిగినప్పుడు జోసఫిన్ ఆక్స్‌ఫర్డ్ సెయింట్ హిల్డాలో ఉంది. పోలీసులకి ఫిర్యాదు చేశారు కాని ఫలితం లేదు. తర్వాత మంచి బట్టలు వేసుకున్న ఒక వ్యక్తి వచ్చి రిచర్డ్సన్ దంపతులను కలిశాడు. దొంగతనం గురించి వాళ్ళు చెప్పినదంతా విని, తన సానుభూతి తెలిపి, బాధ్యులైన వారిని పట్టుకోవడానికి చేయగలిగినంత సాయం చేస్తానన్నాడు. వారంలోపుగానే హార్వే భార్యకు పోయిన నగలతో పాటుగా పోయిన వస్తువులన్నీ దాదాపుగా దొరికాయి.

గంగాసాగర్ చేయాలనుకున్నది వీళ్ళు తప్ప మరెవరూ చేయలేరు. పేనె సోదరులే సరిపోతారు. నిజంగానే సమాజసేవకులు. పని చేయడానికి వాళ్ళు పెట్టే షరతులేమిటో, పనిపూర్తి చేయడానికి వాళ్లెంత అడుగుతారో కనుక్కోమని హార్వేని గంగాసాగర్ కోరాడు.

**ఒయుబిసి** - ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ బోట్ క్లబ్ మామూలుగా మేల్కొంది. థేమ్స్‌లో **ఒయుబిసి**కి బోట్‌హౌస్ ఉంది. ఉదయం ఆరు గంటలకల్లా మొదటి బోట్లు వెళ్ళిపోయాయి. గంట తర్వాత క్లబ్‌లో ఎప్పుడూ ఉండే ప్రశాంతత భగ్నమైంది నగ్నంగా ఉన్న ఒక పురుషుడి శవం బోటుకి ఢీకొనడంతో. ఉదయం ఏడుగంటలకి క్లబ్ బోటు శవానికి కొట్టుకుంది. గ్రీన్ స్పిట్ పోస్ట్ దాటగానే రేవు దగ్గర. వెంటనే పోలీసులను పిలిచారు. శవం ఆరోగ్యంగా ఉన్న ఇరవై - ఇరవై అయిదేళ్ళ శ్వేత జాతి పురుషుడిది. ముఖాన్ని చితగ్గొట్టేశారు. అందుకని గుర్తుపట్టడం వీలుకాలేదు.

అరగంట తర్వాత ఏడుగురు పోలీసులు, కరోనర్ ఒక పోలీసు బోటులో గుర్తు తెలియని మనిషి బట్టలు, వస్తువుల కోసం నదీతీరంలో వెతకడానికి బయలుదేరారు. కొన్ని గంటల తర్వాత ఆక్స్‌ఫర్డ్ ఎనిమిది అంకె ఉన్న ముదురు నీలంరంగు చేతుల్లేని బనీను రక్తంతో తడిసినది కనపడింది వారికి. దాని పక్కనే **ఒయుబిసి**కి చెందిన తెడ్డు రక్తం అట్టకట్టి పడి ఉంది. బాధితుడి ముఖాన్ని గుర్తుపట్టకుండా దానితో బాదినట్టు ఉన్నారు. దొరికిన ముదురు నీలం బనీను వెనకాల గుర్తింపు లేబిల్ కుట్టి ఉంది. దాని మీద 'జాఫ్రీ' అని ఉంది.

## ఏడో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

నల్లటి దుప్పటి, నీలి తలపాగా మనిషిని చూసి తక్షశిల వీధుల్లో నడిచే వేల మంది పౌరులలో ఒకడని అనుకోవడానికి అవకాశం ఉంది. అతని బంగారు తాయెత్తులు చూసి వ్యాపారి అనుకోవచ్చు, కాని మెలితిరిగిన మీసాలు, పొడవైన జుట్టుతో యోధుడిలా అనిపిస్తున్నాడు. రాత్రి చాలా పొద్దుపోయింది అతని లెక్క ప్రకారం రాత్రి పది ముహూర్తాలయింది. పగలు, రాత్రి ఒక్కొక్కటి పదిహేను ముహూర్తాలపాటు ఉంటాయి. అతను ఏదో లక్ష్యంతో నడుస్తున్నాడు కాని వేగంగా నడవడం లేదు. ఇంత రాత్రివేళ ఎవరి దృష్టినీ ఆకర్షించాలని లేదు అతనికి. అతని కనుచూపు మేరలో ఆమె ఇల్లు ఉంది– జలక్రీడ. జలం అంటే నీరు, క్రీడ అంటే వినోదం. ఈ విలాసమందిరంలో ధనవంతులు, పరపతి ఉన్నవాళ్ళ కోసం ఈతకొలను ఉంది. తక్షశిలలోనే అత్యంత ప్రసిద్ధురాలైన గణిక–వేశ్య మైనిక ఇల్లది.

ముసుగువేసుకొన్న కొత్తమనిషి జలక్రీడను చేరి, ఎవరూ చూడడం లేదని నిర్ధారించుకొని, తలుపు దగ్గరకు వెళ్ళి తట్టాడు – ఒకటి, ఒకటి–రెండు, ఒకటి–రెండు, ఒకటి. యజమానురాలు వెంటనే దాన్ని గుర్తించి ఓరగా తలుపు తీసి, నేరుగా పడకగదికి అతడిని తీసుకెళ్ళింది. లోపలికి వెళ్ళగానే లోపలి నుంచి తలుపు గడియవేసింది. కాని ఇలా కలుసుకోవడం మైనిక రహస్యోద్యానంలో రాత్రివేళ దొరికే సుఖాలను పొందడానికి కాదు. ఆ వ్యక్తి నిలబడే ఉండి 'నేను సమాచారం తెచ్చాను', అన్నాడు గుసగుసగా.

'నేనింకా ఎంత ఒత్తిడి భరించాలి?' ఆమె కఠినంగా అడిగింది.

'ఇంకా రెండు మూడు రోజులు చాలు. కేకయ సరిహద్దు పొలాలపై గాంధార సైన్యాలు పశువుల కాపరుల్లా వచ్చి దాడి చేస్తున్నాయి. వాళ్ళు పశువులను, ధాన్యాన్ని

దోచుకుంటున్నారు. మేమేమీ చేయలేకపోతున్నాం. చివరికి మేం కూడా ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నాం!'

'కాని ఎప్పుడు? నేనేం చేయాలని మీరాశిస్తున్నారు?' మైనిక అడిగింది.

'ఈ మాఘమాసం బహుళ పక్షంలో మూడో రోజు కేకయ సైన్యాలు గాంధారను ముట్టడిస్తాయి. ఆ రోజు గాంధార సేనాని నీతో గడిపేలా చూడు'.

'నేనిచ్చే సుఖాల పట్ల ఎంతో అనురక్తుడతడు. వేడి నీళ్ళలో స్నానించేందుకు ప్రతిరాత్రి ఇక్కడకు వస్తాడు. కాని దాడి జరుగుతున్నంతసేపు ఇక్కడే అతన్నెలా ఉంచగలను? పురుషుడికి అత్యున్నతానందాన్ని కలిగిస్తాయి నాకున్న నైపుణ్యాలు. కాని పారవశ్య క్షణం దాటిన తర్వాత అతడిని ఇక్కడ నేనుంచలేను!' ఆమె వాదన చేసింది.

'గాంధార సేనలకు ఆజ్ఞ ఇవ్వడానికి అతను సిద్ధంగా ఉండకూడదు మేము దాడి చేసినప్పుడు – దిగ్భ్రాంతి, విస్మయం కలిగించాలి. ఏం కావాలంటే అది చెయ్యి. నీ దగ్గర గంజాయి ధూపం ఉంటే వెయ్యి!' వెంటనే అన్నాడు.

'కాని – ఉహ్... మనం ఇదంతా ఎందుకు చేస్తున్నాం? రాజకీయ నాయకులు వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకొని వివాదాన్ని ఆమోదయోగ్యంగా పరిష్కరించుకోలేరా?' మైనిక అడిగింది.

'వృద్ధుడైన గాంధార రాజు పొరుగున ఉన్న మా ప్రభువు కేకయరాజు పురుషోత్తముడితో సత్సంబంధాలు ఉంచుకోవాలని చూస్తాడు. కాని ధూర్తుడు, అహంకారి అయిన అతని కొడుకు అంభి మాత్రం మాసిడోనియా వాళ్ళతో పడుకుని అయినా సరే పొరుగు రాజుని నాశనం చేయాలని చూస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో రక్షించుకొనే ఉత్తమ మార్గం దాడి చేయడమే' కేకయ వేగు వాదించాడు.

'కాని అంభి తక్షశిల విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతనెలా ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేస్తాడు?' ఆశ్చర్యపోయిన వేశ్య అడిగింది.

'దుష్ప్రవర్తన వల్ల విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించబడ్డాడు. విశ్వవిద్యాలయ అధికారులు ఆ విషయం బయటకు పొక్కనీయలేదు. ప్రాసాదంలోపలే తన కొడుక్కి చదువు చెప్పాలని గాంధార రాజు కోరాడు. అహంకారి, మూర్ఖుడైన ఆ యువకుడు తన తండ్రినే గద్దెదించి అలెగ్జాండర్ గాడి లంజాకొడుకుల సాయంతో గాంధార అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకుంటున్నాడు –

'ష్, ఇది గణిక ఇల్లే కావచ్చు. కాని నా పవిత్ర ప్రేమ మందిరం ఆవరణలో మేం తిట్లను వాడం!'

'ప్రియమైన మైనికా, వెయ్యి క్షమాపణలు. మన ప్రాచీన ధార్మిక గ్రంథాలలో, మైనిక అత్యంత సౌందర్యవతి అయిన అప్సరస అని విశ్వామిత్ర మహర్షికి తపోభంగం చేయడానికి ఇంద్రుడు ఆమెను పంపాడని నేను మర్చిపోయాను' అని హాస్యమాడాడు.

'విశ్వామిత్రుడికి తపోభంగమైందని, తన ఆశ్రమ సమీపంలో కొలనులో ఈత కొడుతున్న ఆమెని చూసి అతనిలో మోహం మేల్కొందని మర్చిపోకు. సేనానితో కూడా అదేవిధంగా చెయ్యమనే కదా నువ్వు చెబుతున్నావు నాకు?' ప్రతి నింద చేసిందామె.

'నీకు సొంతంగా కొలను ఉంది అదే తేడా', అని వేళాకోళమాడుతూ చలిపెడుతున్న తక్షశిల చీకటి వీధుల్లోకి జారిపోయాడు.

చాణక్యుడు తన కొత్త ఆశ్రితుడిని తన ప్రియమైన విద్యార్థులైన సింహరణ్, మిహిర్, శారంగరావులకు పరిచయం చేశాడు. 'ఇతను చంద్రగుప్తుడు. సేనాపతి మౌర్యుని కుమారుడు. రాచరిక విద్యలు – పోరాటం, యుద్ధనీతి, రాజనీతి, ఆర్థిక శాస్త్రం, భాషలు, గణితం, విజ్ఞాన శాస్త్రాలను బోధించాలని ఇతడిని నాతో తీసికొని వచ్చాను. సింహరణ్, నువ్వితనికి ప్రియమిత్రుడివి కావాలి.'

'అలాగే ఆచార్యా' అంటూ సింహరణ్ తన చేతితో యువకుడైన చంద్రగుప్తుని దగ్గరకు లాక్కున్నాడు. 'గత కొన్నేళ్ళుగా ఆచార్యులు నాకు ఇవే విషయాలు బోధిస్తున్నారు చంద్రగుప్తా. మా తండ్రి మాళవ రాజ్య గణతంత్రాధిపతి. మాకూ మాసిడోనియా బెడద ఉంది. ఆచార్యులు రెండింతల వేగంతో చెప్పాల్సినవన్నీ నా సాయంతో తొందరగా గ్రహించగలవు' అన్నాడు, కొత్తబాలుడు, తల్లిదండ్రులను వదిలి వచ్చాననే దిగులుతో ఉన్న ఆ కుర్రవాడిని అనునయిస్తూ.

సింహరణ్ కొనసాగించాడు. 'ఇతను నా స్నేహితుడు మిహిర్. పర్షియా నుంచి వచ్చాడు. నేను ఇతని దగ్గర పర్షియా భాష నేర్చుకుంటున్నాను – చాలావరకు తిట్లు! గాంధార యువరాజు ఇక్కడ విద్యార్థిగా ఉన్నప్పుడు తన గురించి మేమేమి మాట్లాడుకుంటున్నామో తెలుసుకోవాలని కుతూహలంతో ఉండేవాడు, మేము పర్షియాలో అతని గురించి ఇష్టమొచ్చిన పిచ్చిమాటలు మాట్లాడే వాళ్ళం అని తెలియక! ఇతను

శారంగరావు - ఇతని సమక్షంలో జాగ్రత్తగా మాట్లాడాలి. ఏనుగుకున్నంత జ్ఞాపకశక్తి ఇతనికుంది!'

భారతదేశంలో తూర్పున ఉన్న మగధ నుంచి, వాయవ్య సరిహద్దులో ఉన్న గాంధార వరకు ప్రయాణం బడలికతో కూడినదైనా చక్కగా పూర్తయింది. ఆరు నెలల్లో ప్రయాణం పూర్తి చేశారు. గతంలో చేసిన ప్రయాణంతో పోలిస్తే, ఈసారి చాణుక్యుడికి కొత్త గుర్రాలు, కొందరు సహాయకులు ఉన్నారు. కొంత సంపదని ధననందుడిని గద్దె దించే సైన్యాన్ని తయారుచేయడానికి, విదేశీ దాడి ప్రమాదాన్ని తప్పించడానికి సేనాపతి మౌర్యుని దగ్గరుంచాడు. 'సేనాపతి నన్ను మోసగించడు', అనుకున్నాడు ఆట నియమాలు, జిత్తులు తెలిసిన బ్రాహ్మణుడు. 'అతని కొడుకు నా దగ్గరున్నాడు. ఇంకా ఆ కొడుకు మగధకు కాబోయే రాజు, బహుశా భారతావనికంతటికీ చక్రవర్తి'.

చాణక్యుడు, చంద్రగుప్తుడు తమతో పెద్ద మొత్తంలో బంగారాన్ని తీసుకువచ్చారు. దీనిని విద్యార్థి సైన్యాన్ని తయారుచేసి గాంధార ముఖ ద్వారంలోకి వచ్చే మాసిడోనియా సైన్యాన్ని తరమడానికి ఉపయోగిస్తారు. ఆ దీర్ఘమైన, ప్రయాసతో కూడిన ప్రయాణం నిరంతరం బందిపోటులు, దొంగల బెడద, భయంతో గడిచింది. సేనాపతి మౌర్యుడు శిక్షణ ఇచ్చి పంపిన పెద్ద సైనిక దళం లేకపోతే వాళ్ళు ఆ నిధితో భద్రంగా తక్షశిలకు చేరేవారు కాదు.

'ఇక్కడ అమలవుతున్న వ్యూహాలు చూద్దాం. గాంధార శక్తిమంతమైన రాజ్యం. కాని రాజు వృద్ధుడు, బలహీనుడు. అతని కొడుకు అంభి అసహనపరుడు, అత్యాశాపరుడు. నేను చెప్పేది నిజమని కాలమే రుజువు చేస్తుంది. సింహాసనం కోసం అతను శత్రువైన అలెగ్జాండర్‌తో కలుస్తాడు. ఈ సమయంలో గాంధారపై దాడి చేయడం తెలివితక్కువతనం. అలా చేస్తే పరిస్థితులు విషమిస్తాయి. అతన్ని మనమే మాసిడోనియా వాళ్ళ దగ్గరకు పంపినట్లవుతుంది', తన స్నేహితుడు, కేకయ ప్రధాని ఇంద్రదత్‌ని చాణక్యుడు జాగ్రత్తగా హెచ్చరించాడు.

సింధునదీ తీరంలో గోనెపట్టాలపై కూర్చున్నారు వాళ్ళు. ఇంద్రదత్ భార్య వాళ్ళ విహార యాత్రకు కొన్ని పళ్ళు, పెరుగు, పిండి వంటలు ఇచ్చింది. గుర్రాలను సమీపంలోని చెట్టుకు కట్టేశారు. చాణక్యుడికి, ఇంద్రదత్‌కి మధ్య జరిగే సమావేశాలు రహస్యంగానే జరగాలి. లేకపోతే చాణక్యుడు శత్రువుతో కలిసి కుట్ర చేస్తున్నాడని అంభి ఆరోపించే

అవకాశముంది. చాణక్యుడు చెప్పేదానిలో అర్థముందని ఇంద్రదత్‌కి తెలుసు. శత్రువు బయట నిలబడి ఉండగా తలుపులకున్న మడతబందులు వదులు చేయడంలో అర్థం లేదు. తన రాజు పురుషోత్తముడు సాహసోపేతుడైన వీరుడు, యోధుడు, సంప్రదాయవాది. తనని తాను ధూర్తుడైన అంభిని నిలువరించి మరిచిపోలేని గుణపాఠం చెప్పగల యోధుడిగా భావిస్తాడు.

'నీ మాట ఒప్పుకుంటాను విష్ణూ' – విష్ణుగుప్తుడని తల్లిదండ్రులు పెట్టిన పేరుతో చాణక్యుడిని పిలవగలిగే కొద్దిమందిలో అతనొకడు – 'అంభి పదే పదే సరిహద్దుల్లో అల్లర్లు రేపుతున్నాడు. సైన్యాన్ని పశువుల కాపర్లుగా పంపి పశువులను దోచుకుంటున్నాడు. కేకయ రాజ్యం ఆగ్రహంతో ఉంది. మహారాజు పురుషోత్తముడు గత్యంతరం లేని పరిస్థితిలో ఉన్నాడు. గాంధారకు వ్యతిరేకంగా పోరాడకపోతే, తన ప్రజలే తనని చేవలేని వాడంటారని భయపడుతున్నాడు, అని వివరించాడు ఇంద్రదత్ యాపిల్‌ని అన్యమనస్కంగా కొరుకుతూ.

'అన్నిసార్లూ పనిచెయ్యాల్సిన అవసరం లేదు. పనిచేస్తున్నట్టుగా కనిపిస్తే చాలు. గాంధారకు వ్యతిరేకంగా ఒక ప్రసంగం చేయమను పురుషోత్తముడిని. తక్షశిలతో దౌత్య సంబంధాలు ఆపెయ్యమను. కఠిన పదజాలంతో హెచ్చరించే లేఖను పంపమను. క్లుప్తంగా, ఏమీ చెయ్యకుండా చేస్తున్నట్లుగా కనిపించమను', అన్నాడు చాణక్యుడు గులకరాయిని పెద్ద నదిలోకి విసురుతూ. ఇంద్రదత్ నిట్టూర్చాడు. గుంట నక్క వేట కోసం చూస్తోందని అతనికి తెలుసు. గాంధారులు మాసిడోనియా వాళ్ళను బయటే ఉంచేలా చేయడం మంచిది, అంభిని వాళ్ళ దగ్గరకు వెళ్ళేలా చేయడం కన్న. అనవసరంగా మాసిడోనియా సైనికులకు కేకయతో పోరాడేందుకు గాంధార కంచుకోట అవుతుంది. 'పురుషోత్తముడితో ఈ పరిణామాలను గురించి నేను మాట్లాడతాను, విష్ణూ, నువ్వు భయపడవద్దు. మారాజుకు తన గురించి తనకు తెలిసిన దానికన్న నాకు ఆయన గురించి బాగా తెలుసు!'

దేవుడు సంతోషించాడు. ఈ ప్రత్యేక సందర్భంలో దేవుడు మాసిడోనియా దేశస్థుడు. పేరు అలెగ్జాండర్. అతనేమీ దివ్యుడుగా అనిపించడు. దేవుడని చెప్పేందుకు వీలు లేకుండా పొట్టిగా ఉంటాడు. పొడవైన బంగారు రంగు జుట్టు మెడ వరకు ఉంటుంది. సూటిగా ఉన్న ముక్కు, వెడల్పు నుదురు, ముందుకు వచ్చిన చుబుకం పొట్టిదనాన్ని మరుగున పడేసేలా ఉన్నాయి. సిరియా, ఈజిప్టు, మెసపొటేమియా, పర్షియా, బాక్ట్రియాలపై సైన్యాన్ని నడిపించి అక్కడ భయంకరమైన ధూళి తుఫాను రేపాడు ఈ అతిలోక దేవుడు. అతని

తల్లి ఒలింపియాస్‌కు మాసిడోనియా రాజు ఫిలిప్‌తో శోభనానికి ముందు రాత్రి తన గర్భం పిడుగుపాటుకు గురైనట్టుగా కలవచ్చిందట. ఒలింపియాస్‌కు ఫిలిప్‌కు మధ్య జరిగిన ఆ మార్మిక కలయిక వల్ల ఒక కొడుకు పుట్టాడు, అతను పిడుగు కన్న తక్కువవాడు కాదు.

తరువాత ఆ పిడుగు తాను సింహాసనాన్ని అధిష్ఠించడానికి ఒక దాయాదిని ఉరితీశాడు, మాసిడోనియా యువరాజులను ఇద్దరిని హత్య చేశాడు, సేనానికి విషం పెట్టాడు, సవతి తల్లిని ఆమె కూతురిని సజీవంగా దహనం చేశాడు. తర్వాత బలవంతుడైన డరియస్-3ని ఓడించడానికి నలభై రెండు వేల మంది మనుషులను దీర్ఘ ప్రయాణం చేయించాడు. యుద్ధం నుంచి మరలి వెళ్ళేటప్పుడు డరియస్ తన కూతురిని బలవంతంగా ఇతనికి ఇవ్వాల్సి వచ్చింది. ఈ సర్వాంతర్యామియైన దేవుడు పెర్సిపోలీస్ చేరి షహెన్‌షా - రారాజు-గా తనను తాను ప్రకటించుకున్నాడు. సైనికులుగా ఉండగలిగిన వయసు వారందరినీ బంధించి చంపేశాడు. వారి స్త్రీలను, పిల్లలను బానిసలుగా అమ్మేశాడు.

రారాజు తనకు అలవాటైన విధంగా యువకులతో కాకుండా తన కొత్త భార్య, ఉజ్బెక్ యువరాణి రుక్సానాతో సంభోగిస్తుండగా భారతదేశంపై దండయాత్ర చేయాలనే ఆలోచన కలిగింది. అంభి దీనికి తాళం చెవి అని అతను నిర్ణయించుకున్నాడు.

ధూళి ధూసరిత పొలాల్లో వేలాది మంది రౌతులు గుర్రాలపై వెళ్ళడం ఆశ్చర్యం కలిగించే దృశ్యం. కేకయ చతురంగ బలాలు దుర్ఘటమైనవి. కాని ఒక అంగబలమే చాలా భయపెట్టే విధంగా ఉంది. యుద్ధంలో, సైన్యంలోని చతురంగ బలాలు పదాతి దళం, అశ్విక, గజ, రథబలాలు ఉంటాయి. అయితే గాంధారను జయించడానికి కేకయ వేగాన్ని, విస్మయాన్ని ఉపయోగించుకొనడానికి అశ్విక బలాన్ని వాడాలని నిశ్చయించుకుంది.

మైనిక జలక్రీడలో సర్వసేనాని స్పృహ లేకుండా నిదురిస్తున్నాడు. అతన్ని చక్కగా స్నానం చేయించి, ప్రణయోద్దీపకంగా మర్దన చేసి, మైనిక విందు చేసింది. అతను ప్రశాంతంగా నిద్రలోకి జారగానే మంచంపక్కనే గంజాయి ధూపం వేసింది. తర్వాత గది బయటకు వచ్చి గడియ వేసింది. అతను చాలాసేపు అలాగే నూనెలేని దీపంలా స్పృహ లేకుండా పడి ఉంటాడు.

హెచ్చరిక గంట మోగింది. తక్షశిల ద్వారాలు మూయడానికి ప్రయత్నించే లోపే ఆలస్యం జరిగిపోయింది. కేకయ అశ్విక యోధులు తక్షశిలలోకి వచ్చేశారు.

ఆయుధాగారాన్ని చుట్టుముట్టారు. గాంధార రాజ ప్రాసాదం వరకూ వెళ్ళి రాకపోకలకు అవరోధం కల్పించారు. గాంధార రాజ కుటుంబం కేకయ అశ్విక దళం చేతిలో బందీగా ఉండిపోయింది. గాంధార సర్వసేనాని స్మృతి లేకుండా గాంధారలోని అత్యంత ఖరీదైన వేశ్య పడక గదిలో ఉన్నాడు, తక్షశిల కోటలోకి అశ్వికదళాలు గుంపులు గుంపులుగా వచ్చి చేరాయి. కోట లొంగిపోయింది.

ప్రాసాదంలోపల వృద్ధుడైన గాంధార రాజుకి సందేశం అందింది. మహారాజు పురుషోత్తముడి ప్రధాని ఇంద్రదత్, గాంధార రాజుని కలవడానికి అనుమతి కోరుతున్నాడని. తను సమయమివ్వాలట! లంజాకొడుక్కి వ్యంగ్యం. తన అనుమతితో వాడికేం పని - రాజభవనమే ముట్టడింపబడింది కదా!

'ప్రధానిని సమావేశ మందిరానికి తీసుకొని రండి. కొంచెం సేపటిలో అక్కడే అతనిని కలుస్తాను', అన్నాడు సందేశకుడితో నిలబడడానికి సహాయకులు సాయం చేస్తుండగా బలహీనంగా డస్సిపోయిన చక్రవర్తి.

*బుద్ధిలేని నా కుమారా అంభీ, కేకయపై తెలివితక్కువగా దాడులు జరపకు అని హెచ్చరించాను. వినలేదు. చూశావుగా దాని ఫలితం,* అనుకున్నాడు చక్రవర్తి. సేవకులు అతనికి పట్టుకండువా ధరింపజేసి, ముప్పయి మూడు కేరట్ల వజ్రం పొదిగిన దండ కడియాన్ని పెట్టి పురుషోత్తముడి రాయబారితో సమావేశానికి సిద్ధం చేశారు.

ఇంద్రదత్ గాంధార రాజుకు వంగి నమస్కరించి, 'శక్తిమంతుడవైన చక్రవర్తీ, గాంధారలోయకు ప్రభువు యజమాని, తక్షశిలకు మేలు చేసేవాడా, గాంధార పౌరులకు ఉదారుడవైన తండ్రీ, వివేకి, జ్ఞాని, ధైర్య–' అంటుండగా గాంధార రాజు అతనిని మధ్యలో ఆపి 'ఇంద్రదత్, నాతో ఇంత మర్యాదగా ప్రవర్తించడం నీ మంచితనం, వాస్తవానికి నువ్వు విజేతవు. నేను ఓడాను' అంటూ ఆ వృద్ధుడు కూర్చోమని అతనికి సైగ చేశాడు. తనను కూర్చోమని చెప్పిన కుర్చీలో కూర్చొనకుండా ఇంద్రదత్తు వృద్ధుడైన చక్రవర్తిని గౌరవిస్తున్నట్లుగా ఆయన పాదాల వద్ద కూర్చున్నాడు.

'ఎందుకు నన్నింతగా గౌరవిస్తున్నావు?' అడిగాడు గాంధార రాజు. 'నేను నీ బందీని ఒక్క దెబ్బకి ఓడిపోయాను'.

'గాంధార రాజా, కేకయ రాజ్యానికి మీరంటే ఎనలేని గౌరవం. మా ప్రభువు పురుషోత్తముడు మీ గురించి ఎప్పుడూ అభిమానంగా, గౌరవంగా మాట్లాడతారు. మీరు

వివేకి, న్యాయపరులు, నిజాయితీ కలవారని ఆయనకు తెలుసు. మీ రాజ్యంపై దాడి చేయాలనే నిర్ణయం గత్యంతరం లేని పరిస్థితిలో తీసుకొనవలసి వచ్చింది. మీ కుమారుడు అంభి మారువేషాలలో సైనికులను, ప్రలోభాలు పెట్టేవారిని పంపి కేకయ సరిహద్దుల్లో సమస్యలు సృష్టిస్తున్నాడు. చిన్న చిన్న అలజడులు మేం ఉపేక్షించాంగాని, కారణం లేకుండా చేసే దాడులు తగ్గలేదు', అని చెప్పాడు ఇంద్రదత్, అలసిన, బలహీనుడైన చక్రవర్తికి.

'మీ సంకటం అర్థమైంది ఇంద్రదత్. భౌతికంగా నేను చేయగలిగిందంతా చేసి అంభిని నియంత్రిస్తాను. కాని వాడు అవివేకి. మాట వినడు. నా కోసం అతనిని క్షమించమని పురుషోత్తముడికి చెప్పు', అని వేడాడు చక్రవర్తి.

మాట్లాడడానికి ముందు ఇంద్రదత్ సందేహించాడు, 'కుశాగ్రబుద్ధిగల రాజా, నన్ను సిగ్గుపడేలా చేయకండి. నేను మీ సేవకుడిని, మా ప్రభువు మీతో ఏ విభేదమూ లేదని స్పష్టం చేశారు. అంభితోనే సమస్య. అంతేకాకుండా అలెగ్జాండర్‌తో రహస్యంగా ఒడంబడిక కోసం ప్రయత్నిస్తున్నాడని తెలిసి మారాజు ఆందోళన పడుతున్నారు. అలెగ్జాండర్‌ను భారతదేశంలోకి రావడానికి గాంధార అనుమతిస్తే, మన రాజ్యాలన్నీ ప్రమాదంలో పడతాయి', అన్నాడు.

'అది అసాధ్యం! నా అనుమతి లేకుండా ఏ ఒప్పందం చేసుకోవడానికి అంభికి అధికారం లేదు. ఆ విషయం అతనికి తెలుసు', అన్నాడు గాంధార రాజు మనసులో నమ్మకపోయినా ఆశగా.

'అంభి చేసే పనుల గురించి మిమ్మల్నెలా నమ్మించగలను మహారాజా?' ఇంద్రదత్ విస్మయం ప్రకటించాడు. సమాధానం కోసం ఎదురుచూడకుండా 'అభయా! లోపలికి రా' అని కేకవేశాడు.

క్షణాల్లో మైనికతో ఆమె జలక్రీడలో మంతనాలాడిన వేగు లోపలికి వచ్చాడు. ఇద్దరికీ నమస్కరిస్తున్నట్టుగా చేతులు జోడించి ఇంద్రదత్ ఆజ్ఞ కోసం మౌనంగా నిలబడ్డాడు.

'అభయా, యువరాజు అంభిని నీ మనుషులు అనుసరిస్తున్నారా?' ఇంద్రదత్ దాదాపుగా న్యాయస్థానంలో అడిగినట్లుగా అడిగాడు.

'అనుసరిస్తున్నారు ప్రభూ', అభయ సమాధానమిచ్చాడు.

'పగలు పదిహేను ముహూర్తాలు, రాత్రి పదిహేను ముహూర్తాలు యువరాజుని మీరు గమనిస్తున్నారా?'

'గమనిస్తున్నాం ప్రభూ, ఎప్పుడూ మా దృష్టిని తప్పించుకోలేదు.'

'గత శుక్లపక్షంలో ప్రతిరోజు యువరాజు తక్షశిలలోనే ఉన్నారా?'

'లేదు. ప్రభూ, వేటకు వెళ్ళారు. శుక్లపక్షంలో రెండో రోజు కాంభోజలో ప్రవేశించారు'.

'కాంభోజలో ప్రవేశించినపుడు అక్కడ విడిది చేశారా?'

'చేశారు ప్రభూ. కాంభోజలో మూడు పగళ్ళు, మూడు రాత్రులు విడిది చేశారు'.

'ప్రత్యేక అతిథులెవరైనా యువరాజుని కలవడానికి వచ్చారా?'

'ఒకే ఒక్కరు వచ్చారు ప్రభూ. సెల్యూకస్ వచ్చి కొన్ని గంటల పాటు ఆయనతో ఉన్నారు'.

'సెల్యూకస్, అలెగ్జాండర్‌కు విశ్వాసపాత్రుడైన సేనానా?'

'అవును ప్రభూ. గుర్రాలపైనున్న మాసిడోనియా రాజముద్ర అంతమాత్రం తెలియజేసింది'.

'వారేం చర్చించారో మీ వేగు విన్నాడా?'

'లేదు. కాని సెల్యూకస్ కార్యదర్శి సమావేశ గుడారం నుంచి బయటికి వచ్చి వేడి లక్కని, సేనాని ముద్ర ఉన్న ఉంగరాన్ని సిద్ధం చేయమని చెప్పాడు'.

'అంటే ఇది స్నేహపూర్వకంగా వెళ్ళి చేసిన వేట కాదు. లేకపోతే వేట జ్ఞాపికలపై కూడా లక్కతో ముద్రలు వేయడం ఇప్పుడు మొదలుపెట్టారేమో' అన్నాడు వ్యంగ్యంగా ఇంద్రదత్. గాంధారరాజు ఆందోళన పడుతున్నట్టు కనిపించాడతనికి. 'కృతజ్ఞతలు, అభయా నువ్వెళ్ళవచ్చు' చెప్పాడు ఇంద్రదత్.

'అయ్యో! మూర్ఖుడైన నాబిడ్డ ఏం చేశాడు? ఈ తప్పును నేనెలా సరిదిద్దగలను ఇంద్రదత్?' అని అడిగాడు గాంధారరాజు, అభయ వెళ్ళగానే.

ఇంద్రదత్‌కి ఏమనడానికీ రాలేదు. చాణక్యుడు సరిగ్గా చెప్పాడని అతనికి తెలుసు. గాంధారపై దండెత్తి అంభిని అలెగ్జాండర్ ఒడిలోకి చేర్చడం తప్ప పురుషోత్తముడేమీ సాధించలేదు.

ఆ వ్యక్తి నల్లని పైజామా, నల్లని చొక్కా వేసుకొన్నాడు. నల్లని ముసుగును చెంపలకు వేసుకున్నాడు. నడుముకి పెద్ద తాడు కట్టుకున్నాడు. కళ్ళు, తల బయటికి కనిపిస్తున్నాయి. చీకటి రాత్రిలో కనిపించకుండా ముఖానికి చేతులకు బొగ్గు మసి పూసుకున్నాడు. నడుముకి ఒక వైపున బాకు వేలాడుతోంది. మరోవైపున మురళిలా కనిపించే వెదురు గొట్టం నున్నగా చెక్కి ఉంది. కాళ్ళకి చెప్పులు లేవు. ప్రాసాదం వరండాలో చప్పుడు కాకుండా చల్లటి రాళ్ళ మీద నడిచాడు. కొన్ని నిముషాల తర్వాత, ఒక కిటికీ పక్కన ఆగి, తాడు తీసి దగ్గరలో ఉన్న స్తంభానికి గట్టిగా కట్టి బయటకు వేసి కిందకు వదిలాడు. తాడు పట్టుకుని ఒక అంతస్తు కిందికి దిగాడు. కిందికి చేరగానే లోపలకు దూకి, నిలబడి దూరంగా లతలు తీర్చిన రాజుగారి పడక గది ద్వారాన్ని చూశాడు.

ఇద్దరు రక్షక భటులు తలుపు కడ్డంగా బల్లేలు నిలిపి నిలబడి ఉన్నారు. దారి అంతా పడక గది వరకూ, భటులు నిలబడినంత వరకూ స్తంభాలున్నాయి. ఆ వ్యక్తి స్తంభాల చాటు నుంచి గది గుమ్మం వరకూ చేరాడు. జాగ్రత్తగా అడుగులు వేస్తూ వారికి సమీపంగా స్తంభం చాటున నక్కాడు. మురళి లాంటి గొట్టాన్ని తీసి బాగా శ్వాస తీసుకున్నాడు.

ఆ గొట్టాన్ని పెదవుల మధ్య పెట్టుకొని భటులలో ఒకడిని లక్ష్యం చేసుకొని గట్టిగా ఊదాడు. గొట్టం నుంచి వచ్చిన విషపు (ఏకోనైట్) గడ్డరసం, పాము విషం కలిపిన చాలా చిన్న బిందువు వేగంగా వచ్చి ఆ భటుడి మెడ మీద చిన్న రంధ్రం చేసింది. దోమకాటులా చురుక్కుమన్నదంతే. కాని ప్రభావం కోలుకోలేనిది. రెండో భటుణ్ణి అప్రమత్తంగా ఉండమని చెప్పేలోపే అతని ప్రాణం పోయింది. ఈలోపు రెండో భటుడి కనుబొమల మధ్య మళ్ళీ విషం రంధ్రం చేసింది. కొన్ని సెకన్లలోనే భటులిద్దరూ చనిపోయారు. నిశ్శబ్దంగా ఉన్న వరండాలో వారి బల్లేలు కిందపడి శబ్దమైంది.

అతను గెంతి చనిపోయిన ఇద్దరి భటుల శవాల దగ్గరకు వెళ్ళి నాడి చూశాడు. వాళ్ళు చనిపోయారని నిర్ధారించుకొన్నాడు. బాకు పట్టుకొని నిదానంగా తలుపు తెరిచాడు. తూర్పు వైపున పెద్ద పడక మీద నుంచి వచ్చే లయాత్మక గురక మినహాయించి గది నిశ్శబ్దంగా ఉంది. గదిలో అంతగా వెలుతురు లేదు. తలుపు దగ్గరే నూనె దీపం వెలుగుతోంది. హంతకుడు మంచం మీద గురకపెడుతున్న వ్యక్తిని చేరాడు. తండ్రి ముఖాన్ని చూశాడు. కత్తిని ఎత్తి ఒక్కసారిగా తండ్రి గుండెలో గుచ్చాడు. వృద్ధరాజు ఎడమ జఠరిక సంకోచించడంతో ఒక ఉదుటున రక్తం బయటకు వచ్చి పక్క మీద పడి అంతా ముదురు

ఎరుపురంగు అలముకుంది. సామ్రాట్టు కళ్ళు క్షణకాలం తెరుచుకున్నాయి. కనుపాపలలో హత్య చేస్తున్న కొడుకు రూపం నిలిచిపోయింది. భయభ్రాంతుడైన ఆయన ముఖంలో వెంటనే తన వేదనామయ జీవితం అంతమైందనే ఊరట కనిపించింది.

తక్షశిల ఆవరణలోని మల్లయుద్ధశాలలో – బురద అఖాతంలో చంద్రగుప్తుడు సింహరణ్‌తో చేస్తున్న కుస్తీ చూస్తూ, 'నిన్ను ముందే హెచ్చరించాను, ఇంద్రదత్' అన్నాడు చాణక్యుడు. యోధులిద్దరూ మురికి గోచిగుడ్డలను కట్టారు. వళ్ళంతా నువ్వుల నూనెతోను, చెమటతోను తడిసి ఉంది. వారు భారతదేశంలో ఉన్న హనుమంతి, జాంబవంతి, జరాసంధి భీమసేని పద్ధతులన్నిటినీ కలిపి అభ్యాసం చేస్తున్నారు. ఇది కేవలం మామూలు కుస్తీ పోటీ కాదు. ప్రత్యర్థిని పడగొట్టిన అభ్యర్థి పైకి భయంకరాకారులు కొందరు దండాలతో దాడి చేస్తారు. ఈ లోపు ఓడిన అభ్యర్థి కొంచెం కోలుకొని లేస్తాడు.

చాణక్యుడి మాట విని ఇంద్రదత్ సందేహించాడు.

'నాకు బాగా తెలుసు. 'నేను ముందే చెప్పాను' అని నువ్వంటావని కాని పురుషోత్తముడు నాకు గత్యంతరం లేకుండా చేశాడు. గాంధార రాజు తన కొడుకుని అదుపు చేస్తానని హామీ ఇవ్వగానే సైనికులను గాంధార నుంచి వెనక్కి పిలిచాను. ఆ దౌర్భాగ్యుడు అంభి తండ్రినే హత్య చేస్తాడని ఎవరూహిస్తారు! అంతా ఛండాలమైంది. ఇప్పుడు అంభి స్వేచ్ఛగా అలెగ్జాండర్‌తో సంధి చేసుకుంటాడు. అతను దేవుడిలా ఉంటాడని అంటారు!' సింహరణ్‌ని చంద్రగుప్తుడు కిందపడవేయడం చూస్తూ ఫిర్యాదు చేశాడు.

ఏళ్ళు గడిచిన కొద్దీ చంద్రగుప్తుడు పురుషత్వానికి ఉదాహరణగా ఎదిగాడు. విశాలమైన భుజాలు, కండలు తిరిగిన చేతులు, మృదువైన ముఖానికి భిన్నంగా ఉన్న మల్లయోధుల తొడలు, ఉన్నత వంశీకుడని చెప్పే ముక్కు, భుజాలపైకి జాలువారే దట్టమైన వంకీలు తిరిగిన నల్లని జుట్టు. అతనికి కుస్తీ, విలువిద్య, గుర్రపుస్వారీ, కత్తియుద్ధాలలో దేహదారుఢ్య శిక్షకులు శిక్షణనిచ్చారు.

అతని రోజువారీ దినచర్య బ్రహ్మచర్య దీక్షను చేపట్టిన సన్యాసుల దినచర్య కంటె కఠినమైనది. ముప్ఫయి ముహూర్తాలున్న రోజులో సూర్యోదయం తర్వాత మొదటి రెండు ముహూర్తాలలో వ్యాయామం, శారీరక, యుద్ధ శిక్షణ ఉంటుంది. తర్వాత రెండు

ముహూర్తాలు రాచరిక విషయాలైన – ఆర్థికశాస్త్రం, రాజనీతి, చరిత్ర, భూగోళాలను గురించి నేర్చుకుంటాడు. తరువాత రెండు ముహూర్తాలు అతని వ్యక్తిగత పనుల కోసం – స్నానం చేయడం, మధ్యాహ్న భోజనం కోసం. ఆ తరువాత మధ్యాహ్నం రెండు ముహూర్తాలు కాలం గణితం, విజ్ఞానశాస్త్రం, భాషలు అధ్యయనం చేస్తాడు. పిమ్మట రెండు ముహూర్తాలు అశ్వారోహణ సంబంధి కార్యకలాపాలు గుర్రాల మీద శత్రువునెదుర్కొనడం, యుద్ధం చేయడం నేర్చుకొనేవాడు. సూర్యాస్తమయానికి ముందున్న రెండు ముహూర్తాలు ఆధ్యాత్మిక విద్యకు, ప్రాచీన ధర్మశాస్త్రాలు నేర్చుకొనడానికి. తర్వాత స్నానానికి, రాత్రి భోజనానికి రెండు ముహూర్తాలు – భోజనం తర్వాత రెండు ముహూర్తాల కాలం పగలు నేర్చుకొన్నదంతా పునశ్చరణ చేసుకొని, ఇంటి పని పూర్తి చేయడం. తర్వాత రెండు ముహూర్తాలు ధ్యానానికి, ఆలోచనకు. పిదప నలభై కునికి పాట్లతో మళ్ళీ సూర్యోదయంతో దినచర్య ప్రారంభం. 'నేను ఆందోళన పడడం లేదు ఇంద్రదత్. నేనే గనక నీ స్థానంలో ఉంటే, ఏమీ చెయ్యకుండా ఉండడమే ఉత్తమ వ్యూహం అనుకునేవాణ్ణి' అన్నాడు చాణక్యుడు మెడకి బరువులు కట్టుకుని గుంజీలు తీస్తున్న కుస్తీయోధులను చూస్తూ.

'నువ్వు నాకర్థం కావడం లేదు విష్ణూ, మనదేశానికి మాసిడోనియా యుద్ధ యంత్రం వల్ల కలిగే నష్టాలను గురించి ఉపన్యాసమిస్తావు మాకు. వాళ్ళు మన గడపలో కాలుపెట్టాక నిష్క్రియగా కూర్చోమంటావు!' దుగ్ధగా అన్నాడు ఇంద్రదత్, చేతిలో గదలు పట్టుకొని తిప్పుతున్న ముగ్గురు కుస్తీ వీరులని పట్టించుకొనకుండా.

'మిహిర్! ఇటురా, నేనెందుకు అంత నిబ్బరంగా ఉన్నానో ఇంద్రదత్ గారికి చెప్పు" అని చాణక్యుడు తన పర్షియన్ విద్యార్థిని దగ్గరకు పిలిచాడు. మిహిర్ కూడా చెమటతో తడిసి ముద్దయి ఉన్నాడు, తన చేతిలో బరువులని పడేసి వారి దగ్గరికి వచ్చాడు. వచ్చి గౌరవంగా వారిద్దరికీ చేతులు జోడించాడు.

'కేకయ ప్రధానికి చెప్పు, నేనెందుకు ఏమీ చేయవద్దంటున్నానో', అన్నాడు చాణక్యుడు.

'ఆచార్యుల సలహాతో పెర్సిపోలిస్‌లో ఏం జరుగుతుందో నాకు చెప్పడానికి పర్షియా వ్యాపారులతో సంబంధాలు నెలకొల్పుకున్నాను. మాసిడోనియా వాళ్ళు ఆ నగరాన్ని ఆక్రమించగానే నేను అక్కణ్ణించి వచ్చేశాను. కొన్ని నెలల తర్వాత ప్రాసాదంలో అలెగ్జాండర్ మద్యం విందును ఏర్పాటు చేశాడట. అక్కడ మంటలు చెలరేగాయి. పెర్సిపోలిస్‌లో

చాలా భాగం, దాని అద్భుత నిధులు నాశనమయ్యాయి ఆ మంటల్లో. అలెగ్జాండర్ దాడులకు తోడ్పడే పర్షియా సంపద నాశనమైంది' అని వివరించాడు మిహిర్.

'దీనర్థం ఏమిటంటే ఇంద్రదత్, అలెగ్జాండర్ త్వరగా రాలేదు. అతని దళాల్లో చాలామంది కిరాయి సైనికులు. వాళ్ళకి జీతం ఇవ్వకపోతే, వాళ్ళు పోరాడరు. తగ్గిన సామర్థ్యంతో బలమైన కేకయ సైన్యాన్ని అలెగ్జాండర్ ఓడించడం కష్టమవుతుంది', అన్నాడు చాణక్యుడు, అన్యమనస్కంగా పక్కనే ఉన్న కుండలోంచి నువ్వుల నూనె తీసుకుని పొడిబారిన మోచేతులకి రాసుకుంటూ.

'అయితే మా రాజుకి నేనేం చెప్పాలి?' అడిగాడు ఇంద్రదత్.

'ప్రశాంతంగా నిద్రపొమ్మని చెప్పు', అన్నాడు మేధావియైన బ్రాహ్మణుడు.

'పెర్సిపోలిస్ కాలిపోవడం వల్ల అలెగ్జాండర్ కత్తికే మాత్రం పదును తగ్గలేదు, అయినా కేకయ ప్రధానికి అబద్ధం చెప్పమని ఎందుకు చెప్పారు ఆచార్యా?' ఇంద్రదత్ వెళ్ళగానే మిహిర్ ప్రశ్నించాడు.

'మిహిర్, నేను నిన్నడిగే ప్రశ్నలకి జవాబిచ్చే ముందు జాగ్రత్తగా ఆలోచించాలి నువ్వు. భారతదేశంలో బలమైన రాజ్యమేది?'

'సందేహం లేదు మగధ'.

'మగధనెవరు పాలిస్తున్నారు?'

'ధననందుడు'.

'మగధను ధననందుడి నుంచి లాక్కోవాలంటే మనకు దాని తర్వాత బలమైన రాజ్యం సాయం అవసరం. నీ అభిప్రాయంలో ఆ రాజ్యమేది?

'కేకయ'.

'కేకయను ఎవరు పాలిస్తున్నారు?'

'పురుషోత్తముడు'.

'అవసరం లేకుండా మనం మగధని జయించడానికి పురుషోత్తముడు సాయమెందుకు చేస్తాడు మనకి? ఏ పరిస్థితుల్లో తప్పనిసరిగా మనకి అతను సాయం చేయాల్సి వస్తుంది?'

'అతని మీద దాడి జరిగితే'.

'అతని అగర్భశత్రువెవరు?'

'గాంధారరాజు అంభి'.

'అంభి ఒక్కడే పురుషోత్తముడిని ఎదిరించగలడా?'

'ఎదిరించలేడు. అతని రాజధానినే కేకయ సునాయాసంగా స్వాధీనం చేసుకుంది'.

'మరి కేకయపై దాడి చేసేంత బలంగా అంభినెవరు తయారుచేస్తారు?'

'అలెగ్జాండర్!'

'ఖచ్చితంగా'.

'కాని, ఆచార్యా, మాసిడోనియా వాళ్ళు విషమని, ఈ విషం వ్యాపించకుండా జాగ్రత్తపడాలని మీరే చెప్పారుగా'.

'రోగాలను తగ్గించడానికి తరచుగా చిన్న మోతాదుల్లో విషాన్ని వాడతాం కదా. వాడమా? సరైన మోతాదులో వాడితే ఆ విషమే మనిషిని రక్షిస్తుంది. మాసిడోనియా వాళ్ళను కూడ మనం ఖచ్చితంగా అవసరమైన మోతాదు వరకు వాడుకోవాలి'.

'ఒకవేళ అలెగ్జాండరు, అంభి స్నేహితులై, కలిసి పురుషోత్తముడిపై యుద్ధానికి వస్తే, భారతదేశానికి అలెగ్జాండర్ చక్రవర్తి అయ్యే అవకాశం ఉంటుంది!'

'మిహిర్, దీనికి నువ్వు మరోసారి జాగ్రత్తగా ఆలోచించి సమాధానం చెప్పు. భారతదేశంపై దాడి చేయాలనుకోవడానికి ముందు అలెగ్జాండర్ ఏయే దేశాలను జయించాడు'?

'పర్షియా,సిరియా, ఈజిప్టు, అస్సీరియా, బాబిలోనియా–'

'అవునవును. నాకు తెలుసు. కాని అక్కడెందరు అలెగ్జాండరులున్నారు? ఒకరా? ఇద్దరా? పదిమందా?'

'ఒకే ఒక్కడు', అన్నాడు మిహిర్ నవ్వుతూ.

'ఒకే అలెగ్జాండరు పదులకొద్దీ జయించిన రాజ్యాలు. అతను యుద్ధం చేసి వెళ్ళిపోతాడు. ఒకేసారి పదిచోట్ల ఉండడు కదా!'

'అతని సేనానులుండిపోతారు, తన ప్రతినిధులను కూడా నియమించవచ్చు'.

'దండయాత్రకు బయలుదేరేముందు అలెగ్జాండర్‌కి ఎంత సైన్యం ఉంది?'

'నా వేగుల ద్వారా మాసిడోనియా నుంచి బయలుదేరినపుడు నలభై రెండు వేల దళాలున్నాయి అతని దగ్గర అని తెలిసింది'.

'అతని దగ్గర ఇప్పుడెంతమంది ఉన్నారో నీ వేగులు చెప్పారా?'

'ఇప్పుడూ అంతమందే'

'వింతగా లేదూ. తన సొంత సేనలను పర్షియా, సిరియా, ఈజిప్టు, అస్సీరియా, బాబిలోనియా, బాక్ట్రియా, మిగిలిన జయించిన దేశాలలో వదిలివస్తే అతని దగ్గరుండే సైన్యం ఇప్పుడు తగ్గదా? దీనివల్ల నీకేమర్థమవుతుంది?'

'జయించిన రాజ్యాల్లో నియంత్రణ కోసం ఎక్కువగా సైన్యాన్ని వదలడం లేదని?'

'జయించిన రాజ్యాలను రక్షించే బాధ్యతను స్థానికంగా ఉన్న స్నేహితులకు అప్పగిస్తున్నాడు'.

'అయితే ఆచార్యా, అంభి, అలెగ్జాండర్ సేనలు రెండూ కలిసి పురుషోత్తముడిని జయించడం చూస్తూ వూరికే ఉందామనా మీరనేది? దీనికన్న నా దేశం కోసం నేను చావడమే మంచిది'.

'బుద్ధి హీనులు తమ దేశం కోసం చస్తారు. బుద్ధిమంతులు 'తమ దేశం కోసం ఇతరులు చచ్చేలా చేస్తారు. గుర్తుంచుకో, ప్రణాళిక వేసి పారిపోయేవాడు, మరొక రోజు యుద్ధం చేయడానికి బ్రతికి ఉంటాడు. ఇది పిరికితనం కాదు, ఇది చదరంగం - బల్లనాది! అలెగ్జాండర్ దండయాత్ర పురుషోత్తముడినీ, అంభినీ ఇద్దరినీ బలహీనులుగా చేస్తుంది. వాళ్ళని బలహీనపరచాక తన సేనానుల్లో ఒకడిని, బహుశా సెల్యూకస్‌ని ప్రతినిధిగా ఉంచి వెళ్ళిపోతాడు. అప్పుడు మనకు సరైన అవకాశం! చంద్రగుప్తుడి అవకాశం! భారతదేశ అవకాశం!'

'పురుషోత్తముడు ఓడిపోకుండా నివారించడానికి మనమేమీ చెయ్యమా?'

'యుద్ధాలు జరగకముందే గెలుపో, ఓటమో తేలుతుంది. పురుషోత్తముడు ఇప్పటికే ఓడిపోయాడు'.

'అప్పటివరకు మనమేం చేద్దాం?' గురువు గారిని తదేకంగా చూస్తూ అడిగాడు మిహిర్.

'మన సైన్యాలు సిద్ధం చేసుకుందాం. నిరీక్షిద్దాం-సహనంతో'.

'మరి ఇంద్రదత్?'

'ఈ రోజు అతనితో అబద్ధమాడి ఆ వంతెనను నేనిప్పటికే కాల్చేశాను'.

## ఎనిమిదో అధ్యాయం

# వర్తమానం

కోర్టు అమీను మాట్లాడుతున్నాడు. 'కాన్పూర్ సబ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు గారి కోర్టు ఇప్పుడు జరుగుతూ ఉంది. గౌరవనీయులైన న్యాయమూర్తి ఎస్.సి.పాండేగారు నిర్వహిస్తున్నారు. ఆర్డర్ అండ్ సైలెన్స్. దేవుడు గౌరవమైన న్యాయస్థానాన్ని కాపాడుగాక!'

గౌరవనీయులైన సబ్ జ్యుడీషియల్ జిల్లా మేజిస్ట్రేటు ఎస్.సి. పాండే తన ముందు నిలబడ్డ లాయరును చూశాడు. 'క్లయింటు ఎక్కడ?' అని అడిగాడు. కోర్టు రూం బల్లల కింద క్లయింటు కనిపిస్తాడన్నట్లుగా లాయరు గదంతా చూశాడొకసారి. మేజిస్ట్రేటు నిట్టూర్చాడు. అతనికి కోర్టులో ఉండాలని లేదు. నగర శివారులోని హొటలు గదిలో హామీద్ శరీరమిచ్చే ఆనందాలను అనుభవించాలని ఉంది. అతనిని తలచుకోగానే పెదవులపైకి చిరునవ్వు నచ్చింది.

పాండేగారి పగటికలను భగ్నం చేస్తూ, 'సర్, పది నిముషాలు ముందుగానే వస్తానన్నాడు, 'లాయర్ ఇబ్బంది పడుతూ అన్నాడు'. అయితే నేనతని అరెస్టుకు ఆదేశాలు జారీచేస్తున్నాను. అమీన్, అరెస్టు వారెంటు జారీచేసి, మిస్టర్ ఇక్రంషేక్‌ను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నా ముందు ప్రవేశపెట్టండి.

'ఆ నీచపు లంజాకొడుక్కి నాకు అరెస్టు వారెంటు జారీచేసే దమ్మొచ్చింది', అన్నాడు ఇక్రం కోపంగా.

'ఇక్రం–ఇక్రం–శాంతంగా ఉండు! ఏమైంది?' తనకేమీ తెలియనట్లుగా అడిగాడు గంగాసాగర్.

'మీకు తెలుసుగా హోంమంత్రి పోలీసుకమీషనర్‌ని వెళ్ళగొట్టాడు. అతనెళ్ళిపోగానే నేనింక విఐపిని కాను. నాగురించి, నా వ్యాపారాల గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు, ఈ నికృష్టపు ఊరికి మేయర్‌నైనా గాని!'

'దానితో నీకేం సమస్య. ఇట్లాంటి దర్యాప్తులు చాలానే చూసుంటావు అనుకుంటాను. దర్యాప్తు చేసేవాళ్ళకి ధర ఉంటుంది', సూచించాడు గంగాసాగర్.

'ఈసారి అలా కుదరదు. వాళ్ళు అహ్మద్‌ని కొట్టారు – డబ్బులు వసూలు చేస్తాడు వాడు – వాడితో నాకు వ్యతిరేకంగా చాలా అబద్ధాలు ఒప్పించారు', భయపడుతున్నట్లుగా ఉన్న ఇక్రం చెప్పాడు.

'అయినా గాని – మేజిస్ట్రేటు ముందుకు విషయం వచ్చినపుడు, దీన్ని సరిగ్గా హ్యాండిల్ చెయ్యవచ్చు అనుకుంటాను, రైటేనా?' గంగాసాగర్ తెలివిగా అడిగాడు.

'ఈ లంజాకొడుకుతో అన్ని ప్రయత్నాలు చేశాను. వినడం లేదంతే. లమ్డీకొడుక్కి ఏ ఆశ చూపించినా సరే నన్ను వదలడానికి ఇష్టపడడం లేదు. వాణ్ణి తన్నించడానిక్కూడా కుదరడం లేదు నా మనుషులందరిపైన పోలీసులు కన్నేసి ఉంచారు!' ఫిర్యాదు చేస్తూనే ఈ అన్యాయానికంతటికీ విచారిస్తూ ఇక్రం అన్నాడు.

'ఇక్రం నువ్వు నా ఆప్తమిత్రుడివి. అందుకని సలహా ఇస్తున్నాను. వీటికి దూరంగా ఉండు. మేయర్‌గా – ముఖ్యమంత్రి అభ్యర్థిగా – అందరికీ నీ మీద అక్కసు ఉంటుంది', నచ్చచెబుతున్నట్లు అన్నాడు గంగాసాగర్ శాంతంగా, 'అందరికీ' అనే దాంట్లో తనని చేర్చకుండా.

'రాష్ట్ర ఎన్నికలు దగ్గర పడ్డాయికదా' అన్నాడు ఇక్రం. 'నేను కాకపోతే పార్టీకెవరు ప్రాతినిధ్యం వహిస్తారు? **అభానస**ను పైకి తేవాలని ఎంత కష్టపడ్డాం. ఇది నా వ్యక్తిగతం కాదు – నిజంగా – మీకు, **అభానస**కు నేను చేయాల్సిన బాధ్యత' వేడుకున్నాడు ఇక్రం.

'నిన్ను పోగొట్టుకోడం నాకస్సలు ఇష్టం లేదు, ఇక్రం', అన్నాడు గంగాసాగర్' నిన్ను పూర్తిగా పోగొట్టుకోలేను, మన స్నేహం విలువైంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకొని, నీ బలాన్నంతా ఎవరికోసమైనా ఉపయోగించు'.

'మీ సలహా అర్థం కాలేదు' అన్నాడు ఇక్రం.

'మేజిస్ట్రేటుతో మనక్కావలసిన విధంగా చేయించగల వ్యక్తి నాకు తెలుసు. కాని ఇంక నువ్వు ఈ గొడవల్లోకి రాకుండా తగ్గి ఉండు. ప్రభుత్వ యంత్రాంగం నీ జోలికి

రాదు. చాందిని తిరిగి వచ్చింది. నీ రాజకీయ వారసురాలిగా ఆమెనెందుకు చేయకూడదు? నిస్సహాయురాలైన బీద ఆడపిల్ల – నీ చెప్పు చేతల్లోనే ఉంటుంది', అని సలహా ఇచ్చాడు గంగాసాగర్.

'అతను పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాడు', అన్నాడు గంగాసాగర్, అగర్వాల్ గారితో. 'ఇక్రం తన దత్తపుత్రికకు మద్దతు ఇవ్వాలనుకుంటున్నాడు.'

'ఎలా ఒప్పుకున్నాడు?' అగర్వాల్ అడిగాడు.

'ఆయువుపట్టు నొక్కితే మనసు, బుద్ధి రెండూ వింటాయి', అన్నాడు నవ్వుతూ గంగాసాగర్, హమీద్‌ని తన దగ్గరికి తీసుకొని వచ్చినందుకు తన సెక్రటరీ మీనన్‌కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ.

'చాందినీ, కొందరు ఉత్తమ విద్యార్థులను నీకు పరిచయం చేయాలనుకుంటున్నాను. ఉపేంద్ర కాశ్యప్ లక్నో యూనివర్సిటీ; బ్రిజ్‌మోహన్‌రాయ్, అలహాబాద్ యూనివర్సిటీ; ఇక్బాల్ అజ్మీ, ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ; గిరీష్ బాజ్‌పాయ్ బనారస్ హిందూ యూనివర్సిటీ–'

ఉత్తరప్రదేశ్‌లోని వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన ముప్ఫయి మందిని చాందిని చూసింది. వాళ్ళు విద్యార్థుల్లా అనిపించలేదు. వాళ్ళలో చాలామంది ముప్ఫయి, నలభై ఏళ్ళు పైబడ్డవారు. మొదటి వ్యక్తి ఉపేంద్ర కాశ్యప్ ముందుకు వచ్చి గౌరవంగా చేతులు జోడించాడు. 'మీరేమనుకుంటున్నారో నాకు తెలుసు చాందినిగారూ. విద్యార్థులని చెప్పేంత చిన్న వయసు వాళ్ళం కాదు మేము! కాని పండిట్ గంగాసాగర్ గారి శిక్షణలో మేము జీవితకాలమంతా విద్యార్థుల్లా డిగ్రీలు సంపాదిస్తూ ఉండడానికి అంకితం చేశాం'.

'ఏ సబ్జెక్టు చదువుతున్నారు?' చాందిని కుతూహలంగా అడిగింది.

'ఓ, నేను యూనివర్సిటీలో చేరి పదిహేనేళ్ళయింది. ముందు ఫిలాసఫీలో బి.ఏ. చేశాను. తర్వాత ఇంగ్లీషులో బి.ఏ. ఆనర్స్ చేశాను. బాచిలర్స్‌లో రెండు మౌలిక డిగ్రీలు చేశాను గనుక ఎం.ఏ.లో యాంత్రోపాలజీ (నృశాస్త్రం) తీసుకున్నాను. ప్రస్తుతం భాషాశాస్త్రంలో పిఎచ్.డి. చేస్తున్నాను'.

'ఎందుకు ఇంతమంది యువకులు యూనివర్సిటీల్లోనే ఉంటూ ఇన్ని డిగ్రీలు చేస్తున్నారు – అదీ మానవీయ శాస్త్రాలలో?' గంగాసాగర్‌ని గుసగుసగా అడిగింది చాందిని.

'అలాగైతే విద్యార్థులుగా క్యాంపస్‌లోనే ఉండవచ్చని', వివరించాడు గంగాసాగర్.

'వాళ్ళు అక్కడుండడం వల్ల మీకేమీ ఉపయోగం?' అడిగింది చాందిని.

'అలా ఉంటే ఎన్నికలలో పోటీ చేయగలుగుతారు', గంగాసాగర్ చెప్పాడు.

'ఏ ఎన్నికలు?'

'విద్యార్థి యూనియన్ ఎన్నికలు'.

'ఉత్తరప్రదేశ్‌లోని ముప్ఫయి యూనివర్సిటీల్లో విద్యార్థి యూనియన్ల కార్యకలాపాల్లో **అభానస** జోక్యం ఎందుకు?'

'ఎందుకంటే మన యువకులు విద్యార్థి యూనియన్‌లను నియంత్రిస్తే, మనం – అంటే **అభానస** – మొత్తంగా యువకులను నియంత్రిస్తుంది. రాష్ట్రంలో అధికారానికి వారి పాత్రే కీలకం'.

'వాళ్ళేం చేస్తారు?'

'మానవీయ శాస్త్రాలలో డిగ్రీ ఉంటే ఐఎఎస్– ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు లేదా ఐఆర్ఎస్ – ఇండియన్ రెవెన్యూ సర్వీసుకు చాలు'.

'అంటే వాళ్ళు ప్రభుత్వ అధికారులవుతారా?' అడిగింది చాందిని.

'వాళ్ళలో కొందరు ట్రేడ్ యూనియన్ నాయకులవుతారు. కొందరు ఆదాయ పన్ను కమీషనర్లు, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సెక్రటరీలు అవుతారు – మన సొంత మనుషులుండాల్సిన ఉద్యోగాలెన్నో ఉన్నాయి!'

కొంచెం దూరంలో రైఫిళ్ళు పట్టుకొన్న ముప్ఫయి మంది పోలీసులు, జీపులు, పోలీసు వేన్‌ల దగ్గర నిలబడి ఉన్నారు.

'మన విద్యార్థి యూనియన్ ప్రెసిడెంట్ల చుట్టూ పోలీసులున్నారెందుకు?' చాందిని అడిగింది.

'రక్షణ కోసం', ఆమె గురువు సమాధానమిచ్చాడు.

'రక్షణా?' అయోమయంగా అడిగింది చాందిని.

'మన విద్యార్థి యూనియన్ ప్రెసిడెంట్లలో సగం మందికి ఇతర పార్టీల అభ్యర్థుల నుంచి రక్షణ అవసరం. వాళ్ళు తీవ్రంగా వీళ్ళని దించాలనుకుంటున్నారు!'

'మరి మిగిలి సగం మంది?'

'ఇతరులకి వీళ్ళ నుంచి రక్షణ కావాలి' అతను అట్టహాసంగా నవ్వాడు.

చాందిని రావడం చూసి, 'నీకు పెద్ద విజయం అవసరం', అన్నాడు గంగాసాగర్.

'కాని ఎన్నికలలో పోరాటం గురించి నాకు అ ఆ లు కూడా తెలియదు' అన్నదామె.

'నేననేది ఎన్నికల్లో విజయం కాదు తల్లీ. నీకు పెద్ద ప్రజాభిమాన కుట్ర కావాలని. దానివల్ల నీకు తక్షణమే పేరు రావాలి. దాంతో ఇక్రంకు సరైన వారసురాలివి నువ్వేననిపించాలి'.

అతను నవ్వాడు. తను సరైన ఎంపికే చేశానని అతనికి తెలుసు.

'నగర శివార్లలో రంగ్తా అండ్ సోమాని పెద్ద ఉక్కు కర్మాగారం పెడుతున్నారని నీకు తెలుసా?' అతనడిగాడు.

'ఆc. దాని గురించి చదివాను. చిన్న పెద్ద కలిపి ఇరవై వేల ఉద్యోగాలు వస్తాయి. ప్రాజెక్టుని జపాను బహుళజాతి కంపెనీతో కలిపి పెడుతున్నారు. దేశంలోనే పెద్ద ఉక్కు కర్మాగారం. ఇప్పుడున్న అన్నిటికన్నా పెద్దది' అంది చాందిని.

'వాళ్ళకి ఎంత భూమి కావాలో తెలుసా?' గంగాసాగర్ అడిగాడు.

'వెయ్యి ఎకరాలని చెప్పారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉచితంగా ఇస్తానంది. ఆర్ అండ్ ఎస్‌ని తమ వైపు తిప్పుకోవాలని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. తక్షణ జిడిపి బూస్టర్ డోసు' అంది చాందిని సైగతో చూపిస్తూ.

'ప్లాంటు కట్టే చోటుకి యజమానులెవరు?'

'చాలావరకు వ్యవసాయ భూమి. చిన్న చిన్న రైతులది. ఆర్ అండ్ ఎస్ వాళ్ళకి ఉద్యోగాలిస్తానని హామీ ఇవ్వడంతో వాళ్ళు సంతోషంగా భూమినివ్వడానికి ఒప్పేసుకున్నారు'.

'ఒకవేళ రైతులు తిరగబడితే? తమకున్న కొద్దిపాటి భూమిని మోసంతో లాగేసుకుంటున్నారని అంటే?'

'పత్రికల వాళ్ళకి పండగే', అంది సమాధానంగా. 'కాని ఆర్ అండ్ ఎస్ వెళ్ళిపోతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అంతమంచిది కాదు'.

'నువ్వెళ్ళి కొంతమంది రైతుల్ని కలువు. వాళ్ళ తరఫున నువ్వు ప్రతినిధిలా ఉండేలా ఒప్పించు. ప్లాంట్ కట్టబోయే చోట గేటు ముందు కూర్చుని ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని ప్రకటించు – దురదృష్టవంతులైన బీదరైతుల స్థితి చక్కదిద్దేవరకూ!'

'అమ్మో నాకు ఆకలి వేస్తుంది!' అంది ఆశ్చర్యంగా.

'త్యాగానికున్న శక్తి, చాందినీ. మన చరిత్ర పాఠాలని, మహాత్మాగాంధీని గుర్తు చేసుకో?'

'కాని తినకుండా ఉండడం అలవాటులేదు నాకు. నా చక్కెరస్థాయులు ఇరవై నాలుగ్గంటల లోపే పడిపోతాయి' అంది గునుస్తూ, తనకిచ్చిన యాలకుల టీని కృతజ్ఞతతో తీసుకుంటూ. చాందిని ప్రపంచంలో తియ్యటి యాలకుల టీ కన్నా ఉత్తమ పానీయం లేదు.

'ఒక్క రోజులో నీకు విజయం తథ్యం! నన్ను నమ్ము'.

'ఎలా? మేనేజ్‌మెంట్‌తో ఇంతవరకు మనం మాట్లాడను కూడా లేదు'.

'ఓ! నేను నీకు చెప్పడం మర్చేపోయాను. ఆర్ అండ్ ఎస్ వైస్‌ఛైర్మన్‌తో నేను మాట్లాడాను – ఇంక...'

'ఏమిటి?'

'–రైతుల పరిహారాన్ని పెంచడానికి అతను ఒప్పుకున్నాడు'.

'ఖచ్చితంగా ఒప్పుకున్నాడా?'

'దురదృష్టవశాత్తు అతని భాగస్వామి, ఛైర్మన్ రంగ్తా అంగీకరించలేదు. అంతకన్న ఎక్కువ చెల్లించలేమన్నాడు.'

'అయితే మీరేం చెప్పారు వాళ్ళకి?'

'ఉత్తరప్రదేశ్‌లో **అభానస** అధికారంలోకి వస్తే – ఇరవై ఏళ్ళపాటు అమ్మకం పన్ను కట్టనవసరం లేదని చెప్పాను – ఆఫర్‌కి వాళ్ళు చాలా సంతోషించారు'.

'ఇరవైయ్యేళ్ళపాటు అమ్మకం పన్నుకి హాలిడే అంటే ఎంత?' తీక్షణంగా అడిగింది.

'ఎన్నో వేల కోట్లు' సమాధానమిచ్చాడు.

'అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన దాన్ని, ఇంకా పెంచుతానని సంప్రదింపులు జరిపారా?, నమ్మలేనట్టుగా అడిగింది.

'అవును. వాళ్ళు ఈ డబ్బుని మళ్ళీ రైతులకు భూమికి పరిహారంగా ఇవ్వడానికి ఒప్పుకున్నారు.'

'అయితే వాళ్ళు ఒక్క పైసా అదనంగా ఖర్చు పెట్టకుండా, మీరు చెప్పిన దానికి ఒప్పుకున్నట్టు, భూమికి చాలా పరిహారం చెల్లించినట్టు చూపించుకోవచ్చునన్నమాట?'

'ఖచ్చితంగా. అందరికీ సంతోషం. మనకి ఎన్నికల విజయం!'

'అయితే – మరి – నేనెందుకు నిరాహారదీక్ష చేయడం? వాళ్ళు ఒప్పుకున్నారు గనుక మనం సింపుల్‌గా పత్రికలకు ప్రకటన విడుదల చేయొచ్చుకదా' – చాందిని సూచించింది.

'నా బంగారు తల్లీ, ముందుగానే పరిష్కారమైన సమస్యపైన ప్రెస్‌కి ఆసక్తి ఉండదు! వాళ్ళకి ముందు నాటకీయమైన సమస్య కావాలి లెక్కలేనన్ని చిక్కులతో. అటువంటి దాని గురించి వాళ్ళు మాట్లాడాలనుకుంటారు. దాన్ని నెత్తిన పెట్టుకుంటారు! ముందు పరిష్కరించలేని సమస్యను వాళ్ళకి ఇచ్చాక, అద్భుతమైన పరిష్కారాన్ని ఇస్తాం. నువ్వు తక్షణమే నాయకురాలివైపోతావ్!'

చాందిని ఆశ్చర్యంగా గంగా అంకుల్‌ని చూసింది. ఇంకా తను చాలా నేర్చుకోవాలని ఆమెకనిపించింది. ఆమె వెళ్ళడానికి లేస్తుండగా 'వెళ్ళు. చక్కగా భోంచెయ్యి. రేపు నీకు భోజనం లేదు' అన్నాడు గంగాసాగర్.

బిర్హణ రోడ్‌లోని చిన్న ఫ్లాట్‌లో గంగాసాగర్‌తో పోలీసు కమీషనరు మాట్లాడుతున్నాడు. 'మీరు చెప్పినందుకు హోంమంత్రికి, రజ్జోభయ్యాకి మధ్య చిచ్చు పెట్టటానికి ఇక్రంకి సాయం చేశాను. నన్నిప్పుడు తప్పించారు. మీరు నాకు సాయం చెయ్యాలి' అన్నాడు.

'సరే' అన్నాడు గంగాసాగర్. 'ఇంకా మంచి పోస్టు ఇప్పిస్తాను– న్యూఢిల్లీలో నా పరపతిని ఉపయోగిస్తాను. కాని దానికి ముందు నువ్వు నా కోసం మరో పని చెయ్యాలి'.

'ఏమిటి?' పోలీసు కమీషనర్ కుతూహలంగా అడిగాడు.

'చాందినిని షూట్ చెయ్యి' గంగాసాగర్ తేలిగ్గా అనేశాడు.

ప్లాంటు బయట నిరాహారదీక్ష చేస్తూ ఎండలో కూర్చున్న యువతి ప్రెస్ వాళ్ళకి వెంటనే నచ్చేసింది. 'ఛాంపియన్ చాందిని' అంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా, 'ఒప్పందాన్ని మార్చిన చాందిని' అని దైనిక్; 'చాందిని ఛాన్సు తీసుకొంది – గెలిచింది!' అని లోక్‌భారతి రాశాయి.

గుల్‌బదన్ కోఠా బయట నిలబడి, మాజీ ముఖ్యమంత్రిని గద్దెదించిన రిపోర్టర్ ప్రధాన శీర్షికలు చదువుతున్నాడు. చూడముచ్చటగా, తెల్లని నూలు చీరలో మెరిసిపోతూ వందలాది మంది రైతులతో కలిసి నిశ్శబ్దంగా నిరాహారదీక్ష చేస్తున్న యువతి ఫోటోలు చూశాడు. ప్రెస్ వాళ్ళు చాందిని గురించి ఎంతకాలం బాగా రాస్తారో అనుకున్నాడు. *కొంచెం పౌడరు, కొంచెం పెయింటు, వేస్తే అమ్మాయి రూపమే మారిపోతుంది* అనుకున్నాడు. బురద ఎక్కడుంది? శోధించాలనుకున్నాడు.

'మీ అమ్మాయి అద్భుతం చేసింది', ఆయన వరండాలో ఐసువేసిన నిమ్మటీ తాగుతూ ఇక్రం భాయ్‌తో అన్నాడు గంగాసాగర్.

'టెక్నికల్‌గా ఆమె నా కూతురు కాదు. నేనామెను దత్తు తీసుకోలేకపోయాను. ముస్లిం పర్సనల్‌లా దాన్ని గుర్తించలేదు. కోర్టులు దాన్ని ధ్రువపరచడానికిష్టపడడం లేదు మీకు తెలుసుగా', అన్యమనస్కంగా సమాధానమిచ్చాడు ఇక్రం.

'చట్టానిదేముంది. ఆలోచన కదా లెక్కలోకొచ్చేది. అందరూ ఆమెను నీ వారసురాలిగా చూస్తున్నారు – నీ వారసత్వం' గంగాసాగర్ ప్రత్యేకించి చెప్పాడు'.

'అదే వింత', అన్నాడు ఇక్రం.

'ఏమిటి' తన ముందున్న టేబుల్ మీద గ్లాసుపెడుతూ అడిగాడు గంగాసాగర్.

'విజయం సాధించకుండానే వారసులు రావడం!' అంటూ దుర్గగా అన్నాడు. గంగాసాగర్ నవ్వాడు.

'అయితే నేనేం చేయాలని చెబుతున్నారు?' ఇద్దరి గ్లాసులు ఖాళీ అవుతుండగా అడిగాడు ఇక్రం.

'నేను ఓట్లు పోగుపడేలా చూస్తాను. నువ్వు లెక్కింపు చూడు' అన్నాడు గంగాసాగర్.

'లెక్కింపు ఎన్నికల సంఘం చేస్తుంది నేను కాదు!'

'రిగ్గింగు జరిగితే? ఎన్నికల్లో అవకతవకలు ఎక్కువయ్యాయి ఇక్రం. దాని సంగతి నువ్వు చూడాలి'.

'అంటే నేను ఎస్‌యువిలో పోలింగు స్టేషన్లు ఆక్రమిస్తూ తిరిగి, **అభానస**కు ఓట్లు వేయాలా?' అడిగాడు ఇక్రం, గతంలో బాహుబలాన్ని గుర్తుచేసుకుంటూ.

'కాదు. నీలాంటి వాళ్ళని ప్రతి పోలింగ్ స్టేషను దగ్గర పెట్టు. ఏ కొంచెం అవకతవక జరిగిందనిపించినా నాకు ఫోను చెయ్యి'.

'సూపర్‌మేన్‌లా మీరు ఎగురుకుంటూ వచ్చి, పోలింగు స్టేషను ఆక్రమించుకోకుండా చూస్తారా?' వెక్కిరిస్తూ అడిగాడు ఇక్రం.

'లేదు. కనీసం దానికి పూరకంగా మనం కూడా మరో పోలింగు స్టేషన్‌ని ఆక్రమించుకోవాలేమో మనకి తెలుస్తుందని!'

'పిలిభిత్ నియోజకవర్గంలో ప్రతిపక్ష అభ్యర్థి ఎవరు?' అడిగాడు గంగాసాగర్.

'రాం ప్రసాద్ త్రివేది', సమాధానమిచ్చింది చాందిని

'అదే పేరుతో మరొకరిని వెతకండి. బిశాల్‌పూర్‌లో ప్రాథమిక పోటీ ఎవరితో?'

'రఫీక్ అహ్మద్ హుసేన్'.

'ఇది పెద్ద కష్టం కాదు. బిశాల్‌పూర్‌లో ఇలాంటి పేరున్న వాళ్ళని పోటీ చేయించండి. పురాన్‌పూర్లో బలమైన అభ్యర్థి ఎవరు?'

'ప్రకాశయాదవ్'.

'మరో ప్రకాశ్ యాదవ్‌ని చూడండి'

'**అభానస** టిక్కెట్లు ఏ అర్హతలు, అనుభవం, ఓట్లు రానివాళ్ళకి ఇవ్వమంటున్నారా. ప్రత్యర్థుల పేర్లు లాంటి పేర్లుంటే చాలనా మీరనేది?'

'కాదు. **అభానస** టిక్కెట్లు కాదు. వాళ్ళకి డబ్బిచ్చి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయిద్దాం'.

'ఇలా ఎందుకు చేస్తాం?'

'ఎందుకంటే ప్రధాన ప్రత్యర్థి ఓట్లు చీలిపోతాయి. ఒకేలాంటి పేర్లుంటే, వాళ్ళకి రావాల్సిన ఓట్లు కొన్నయినా మనం పోటీ చేయించిన స్వతంత్ర అభ్యర్థులకి పడతాయి'.

'పనికొచ్చే ప్రయాసేనా ఇది? ప్రతిపక్షానికి వ్యతిరేకంగా పోటీ చేయించడానికి వందలాది స్వతంత్ర అభ్యర్థులను వెతకడం?'

'గెలవడమంటే నిన్ను నువ్వు బలపరచుకోవడం మాత్రమే కాదు; శత్రువుని కూడా బలహీనపరచాలి. మనం గెలవాలంటే ప్రతిపక్ష ఓట్లను తగ్గించేదేదైనా చెయ్యాలి'.

'ప్రతిపక్షాలు కూడా మనపై ఇట్లాంటి వ్యూహాలే పన్నవచ్చుగా' వాదించింది చాందిని.

'ఎన్నికల సంఘం ఎన్నికల ప్రకటన ఎప్పుడిస్తుంది?'

'ఏప్రిల్ ఇరవై ఒకటి'.

'నామినేషన్లు వేయడానికి చివరి తేదీ వారం తర్వాత ఉంటుంది – ఏప్రిల్ ఇరవై ఎనిమిది, రైట్?

'అవును'.

'ఏప్రిల్ ఇరవై ఎనిమిదిన ఎన్ని గంటల్లోపు నామినేషన్ వెయ్యాలి?'

'సాయంత్రం 6.30 లోపు'.

'అయితే మన స్వతంత్ర అభ్యర్థులందరూ వాళ్ళ నియోజకవర్గాల్లో ఏప్రిల్ ఇరవై ఎనిమిదిన సాయంత్రం ఆరుగంటలకు నామినేషన్లు వెయ్యాలి. ప్రతిపక్షానికి స్పందించే అవకాశం ఇవ్వొద్దు మనం'.

ఫోను బిల్లు చాలా అవుతుంది. ఎడిటర్‌కు కోపం వస్తుంది. కాని ముందు పేజీలో ప్రధాన శీర్షికగా వార్త వేస్తే అన్నీ సమసిపోతాయి. 'చాందిని ప్రణయ చిహ్నం కొడుకు'

అని రాస్తే సంచలనాత్మకంగా ఉంటుంది. ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ తనకి వాసన పట్టగల ముక్కునిచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పాడు – మైలుదూరంలో ఉన్నా రహస్యాన్ని పసికట్టెయ్యగలడు.

ప్రతి ఒక్కరికీ గతం ఉంటుంది అనుకున్నాడు. ఈ యువ ఆదర్శమూర్తి, కొత్త సంచలనం చాందిని దీనికి భిన్నం కాదు. ఈ ఊహతోనే కొన్నేళ్ళ క్రితం ఇంగ్లండుకు వలస వెళ్ళిన తన కజిన్‌కు ఫోను చేశాడు. అతను టీచర్. ఆక్స్‌ఫర్డ్‌లో రహస్యంగా ఆరా తీస్తానని చెప్పాడతను. కజిన్ స్నేహితుడు – ఒక డాక్టరు – నేషనల్ హెల్త్ సర్వీసులో ఆరా తీశాడు. కొన్ని రోజుల తర్వాత ఫోను చేసి చాందినికి సెయింట్ హిల్డాలో సెలవు కోసం ఆక్స్‌ఫర్డ్‌లో ఆమె జిపి మెడికల్ సర్టిపికెట్ ఇచ్చారని చెప్పాడు. సర్టిఫికెట్‌లో 'తీవ్రమైన బహిష్టు నొప్పి' కారణంగా పేర్కొన్నారు. ఎవరూ ఈ నొప్పి కోసం ఎనిమిది వారాలు సెలవు తీసుకోరని కుతూహలం గల డాక్టరు అన్నాడు. స్థానిక జిపితో మాట్లాడితే స్థానికంగా అబార్షను చేసే మేట్రన్ గురించి, ఆమె నుంచి గ్రాస్మియర్‌లోని మదర్ అండ్ బేబీహెూం గురించి తెలిసింది.

తన ముందున్న స్టోరీ మొదటి డ్రాఫ్టుని చూశాడు. 'ఉత్తరప్రదేశ్ అంతటా, వాస్తవానికి భారతదేశంలోని కొన్నిచోట్లా దేవాలయాల్లో పూజించే పవిత్ర దేవత లక్ష్మి కాదు, సరస్వతి కాదు, దుర్గ కాదు కొత్త సంచలనం చాందిని. యౌవనంలో ఉన్న యువతి, ఆకర్షణీయమైన రాజకీయ నాయకురాలు ఓటర్ల మనసులను, బుద్ధిని గెలుచుకుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవికి పోటీ పడబోతోంది. ఆమె రైతుల కోసం నిరాహారదీక్ష చేస్తుంది. నిజాయితీ, న్యాయవర్తన, ఉదాత్త నైతిక విలువలను గురించి బోధిస్తుంది. ఈ కొత్త నాయకురాలి నేపథ్యం గురించి ఎందరికి తెలుసు? ఎవరికీ తెలియదు. ఆమె గురించి తెలిసిందల్లా తెల్ల చీరలు కట్టుకుంటుంది వాటిలో ఆమె బాగుంటుంది. కొంచెం పరిశోధిస్తే ఈ రిపోర్టర్‌కి ఆమె పవిత్రమైన, మచ్చలేని ప్రతిష్టలో మచ్చలు కనిపించాయి. తను కనిపెట్టిన నిజం చూసి షాక్ అయ్యాడు'.

ఆరంభం బాగుంది. స్వయంగా రెమింగ్టన్ ఎలక్ట్రానిక్ టైప్‌రైటర్లో టైప్ చేసిన తరువాత కథనాన్ని కూడా చదివాడు. తర్వాత ఎడిటర్ డెస్క్ దగ్గరికి వెళ్ళాడు. 'నేనిప్పుడు మీకిచ్చినది చదివితే, నేను పెట్టిన ఖర్చు ఎక్కువ కాదని ఒప్పుకుంటారు' అని తన డెస్క్ దగ్గరికి వచ్చి టైప్‌రైటర్‌ను బూడిదరంగు ప్లాస్టిక్ కవర్‌తో కప్పాడు.

'నువ్వు ఇంగ్లండు వెళ్ళి వాస్తవాలు నిర్ధారణ చేసుకోవాలి' అన్నాడు ఎడిటర్ కథనం చదివి.

'ఏ-ఏమిటి? నిర్ధారణ కోసం రిపోర్టరు ఖండాంతరాలు దాటి వెళ్ళడానికి బడ్జెట్ ఎక్కడిది?' అనడిగాడు. 'క్యాబ్ ఎక్కితేనే మీరు గొణుగుతారు!'

'ఆమె దత్తు తండ్రి ఇక్రంభాయ్ చమ్డాలు ఒలుస్తాడని, ఆవిడ గాడ్‌ఫాదర్-గంగాసాగర్ కోర్టుకీడ్చి నానాగడ్డి కరిపిస్తాడని అలా జరక్కూడదు అనిపించగానే బడ్జెట్ కనిపించింది'.

'గంగాసాగర్ నన్నేం చేయలేడు. మాజీ ముఖ్యమంత్రిని బయటపెట్టటానికి నేనతనికి సాయం చేశాను. గత ముఖ్యమంత్రిని నా కథనమే గద్దెదించింది లేకపోతే తన శిష్యురాలిని గద్దెనెక్కించడానికి మార్గాలు వెతికేవాడా అతను!'

'మనం కూడా ప్రతి ముఖ్యమంత్రి మీదా, లేకపోతే ముఖ్యమంత్రి అవుదామని అనుకున్న వాళ్ళ మీదా నైతిక యుద్ధం చేసే చచ్చు మొహాల్లా కనిపించకూడదు. అందుకని స్వయంగా వెళ్ళి నిజానిజాలు తెలుసుకో. ఒక్క కజిన్ చెప్పినదాన్ని విని వార్త రాసేంత చిన్న విషయం కాదిది!'

కైరో, జెనీవాల మీద నుంచి లండన్ వెళ్ళే విమానం న్యూఢిల్లీ నుంచి మరో రెండు గంటల తర్వాత బైల్దేరుతుంది. ఎకానమీ క్లాసు టికెట్, కొంచెం ప్రయాణ భత్యం ఇచ్చారతనికి. దానితో ఎలుక కలుగుల్లాంటి చోట ఉండాలతను. సూట్‌కేస్ చెక్ ఇన్ అయిన తర్వాత, పాస్‌పోర్టు కంట్రోలుకి వెళ్ళాడు. ఆఫీసరు ప్రయాణ కాగితాలు ఒక సారలా చూసి స్టాంప్ వేశాడు. అతను పాస్‌పోర్టు తీసుకొని భుజానికి తగిలించుకున్న డఫెల్ బ్యాగ్‌లో పెట్టాడు. డిపార్చర్ ఏరియా కొచ్చి సెక్యూరిటీలోంచి నడిచాడు.

డఫెల్ బ్యాగ్ జిప్ తెరచి చూస్తూ 'ఏమిటి, సర్ ఇది?' అనడిగాడు సెక్యూరిటీ ఆఫీసర్. బ్యాగ్ అడుగున బూడిదరంగు ప్లాస్టిక్ కవరు ఉన్న చిన్న పార్శిల్ ఉంది. చుట్టూ టేప్ ఉంది. 'అది నాది కాదు' అన్నాడు రిపోర్టర్ అసలది ఎలా తన బ్యాగ్‌లోకి వచ్చిందా అని ఆలోచిస్తూ. హర్యానా జాట్ జాతీయుడు ఆ సెక్యూరిటీ ఆఫీసర్ సమాధానం వినిపించుకోనట్లుగా చిన్న కత్తితో పార్శిల్‌ను పొడిచి చూశాడు.

తెల్లగా, చిన్న పలుకులున్న పొడి బయటికి వచ్చింది. చూపుడువేలితో దానిని అంటుకుని, నాలుక మీద కొద్దిగా రాశాడు. అది వాసనలేని చేదు రుచిలోఉంది. తప్పనిసరిగా అది హెరాయిన్. 'సర్, మీకు ప్రమాదకరమైన మత్తుమందుల చట్టం, 1930, దానికి సంబంధించిన నల్లమందు చట్టం 1878 గురించి తెలుసా?' అని అడుగుతూ తన సహచరులలో ఒకరిని పిలిచి అరెస్టు చేయమని చెప్పాడు సెక్యూరిటీ ఆఫీసరు.

'అది నాదు కాదు! అదెలా వచ్చిందో నాకు తెలియదంటున్నాగా–' అంటూ అడ్డు చెప్పాడు కాని లాభం లేకపోయింది. కండలు తిరిగిన జాట్ అప్పటికే అతడిని కౌంటర్ పైకి వంగదీసి చేతులు వెనక్కి విరిచిపట్టుకున్నాడు. రెండు మణికట్టులకు రెండు సంకెళ్ళు వేశాడు. 'ఇది నీ పార్శిల్ కాకపోతే దీని మీద నీ వేలి ముద్రలు ఎందుకున్నాయి? ఏం?' అని అరిచాడు. మెడపట్టుకుని లాగి, గోడకి ఆనేలా తోసి కాళ్ళు దూరంగా పెట్టమన్నాడు. తొందరగా కిందకి తోసి ఒక తన్ను తన్నాడు రెండుకాళ్ళ మధ్య. 'జైల్లో ఇచ్చే ట్రీట్‌మెంట్ తట్టుకోగలదో లేదో అని చూస్తున్నా', అన్నాడు.

విమానాశ్రయం బయట పోలీసు జీపులోకి ఎక్కించి లాకప్‌కు తీసుకుని వెళుతుండగా 'ప్లాస్టిక్ మీద పరీక్ష చేయకుండానే నా వేలి ముద్రలున్నాయని సెక్యూరిటీ అధికారికెలా తెలిసింది?' అని ఆలోచించాడు. తర్వాత పత్రికాపీసులో రెమింగ్టన్ ఎలక్ట్రానిక్ టైప్ రైటర్ మీద బూడిరంగు ప్లాస్టిక్ కవరు గుర్తొచ్చింది.

గంగాసాగర్‌ని, అతని ఎడిటర్‌ని, దురదృష్టాన్ని వరసగా తిట్టుకున్నాడు.

అంజలి నిమ్మపండురంగు నూలు చీర కట్టుకొని సిల్వర్ జాగ్వార్ ఎక్స్‌జెఎస్‌లో వచ్చింది. బాలీవుడ్ సెక్స్ సింబల్ తన పొడవైన జుట్టుని హెర్మ్స్ స్కార్ఫ్‌తో వెనక్కి తోసి కట్టింది. కళ్ళని ఖరీదైన వెర్సేస్ చలువ కళ్ళద్దాల వెనుక దాచింది. సున్నితంగా కళ్ళద్దాల కింద చేతి రుమాలతో తుడిచింది. ఉడుకెత్తిస్తున్న దేవతలా. డిజైనర్ ఎలక్షన్ డ్రస్సులో సామరస్యంగా సానుకూలంగా అనిపిస్తున్న ఆమెని వెంటనే ఫ్లాష్‌లు క్లిక్ మనిపిస్తూ పత్రికల వాళ్ళు చకచకా ఫోటోలు తీశారు – ఏ ఆశా లేని, కుతూహలంగల జనానికి మంచి బ్రేక్‌ఫాస్ట్.

ర్యాలీ జరిగే చోటుకి వెళ్ళే దారులన్నీ జెండాలతో అలంకరించారు. ఇద్దరు ఆడదేవతలను ఒకరు రాజకీయ దేవత, మరొకరు సినిమా దేవత – ఒక్కసారి చూడడానికి

లక్షమందికి పైగా జనం నిరీక్షిస్తున్నారు. ర్యాలీ జరిగే మైదానంలో అంతటా కాషాయం, ఆకుపచ్చ, ఎరుపు – **అభానస** జెండాలోని మూడు రంగులు కనిపిస్తున్నాయి. కాషాయం హిందువుల కోసం, ఆకుపచ్చ ముస్లింల కోసం, ఎరుపు దళితుల కోసం. పెద్ద మైదానంలో ఒక మూల వేదికను కట్టి బ్యానర్లు, పూలతో అలంకరించారు. అంజలి వేదిక వైపు, చాందిని నిరీక్షిస్తున్న చోటికి నడిచింది. ఎంతో ఆత్మీయ స్నేహితుల్లా వారిద్దరూ ఒకరినొకరు కౌగలించుకున్నారు. నిజానికి వాళ్ళిద్దరూ మొదటిసారిగా ఇప్పుడే కలుసుకుంటున్నారు. వాళ్ళ వెనకాల పదిహేను అడుగుల ఎత్తులో గులాబీరంగులో ఉన్న వారి కటౌట్లు ఉన్నాయి – బాలీవుడ్ సినిమా పోస్టర్‌లా. చాందిని బొమ్మలో ఆమె ముఖంలో దైవిక శోభ వెల్లివిరుస్తోంది. ఒక చేతిలో తులాదండాన్ని, మరో చేతిలో కత్తిని పట్టుకొని ఉందామె. అంజలి పోస్టరులో స్టాట్యూ ఆఫ్ లిబర్టీని స్ఫూర్తిగా చేసుకున్నట్లుగా ఆమె చేతిలో మండుతున్న కాగడా ఉంది.

పార్టీ రంగులను గుర్తు చేసే బంతిపూలు, ఆకుపచ్చ రిబ్బన్లతో తయారుచేసి ఆరంగుళాల మందం ఉన్న దండలను వేదిక మీద నిలబడిన ఆ స్త్రీలిద్దరికీ పార్టీ కార్యకర్తలు వేశారు – వాళ్ళు నిజంగానే దేవతల అవతారాలని భావిస్తున్నట్లుగా ఉంది. ఇద్దరూ అలాగే నిలబడి అభిమానంగా చూస్తున్న జనానికి చేతులూపుతూ ఉండిపోయారు.

'నా ప్రియమైన ప్రజలారా, నేను మీకు స్వచ్ఛమైన, కల్తీలేని న్యాయాన్ని అందిస్తాను. న్యాయం చేయడానికి ఈ చెయ్యి కత్తిని ఎత్తవలసి వస్తే బీదలను దళితులను కాపాడడానికే – ఆ ఒక్క పనికే ఈ చేయి పైకి లేస్తుంది' చాందిని ఉద్వేగంతో గట్టిగా చెప్పింది. ఆమె మాటలు ర్యాలీ మైదానంలోని మైక్రోఫోన్ల నుంచి స్పీకర్ల ద్వారా అంతటా ప్రతిధ్వనించాయి. ఆమె మద్దతుదారులు వేలాదిమంది సంతోషంగా కేరింతలు కొడుతూ, 'సూర్యచంద్రులున్నంతవరకు చాందిని పేరు చిరస్థాయిగా ఉంటుంది!' అంటూ అరిచారు.

'మీ ప్రేమ నన్ను వివశురాలిని చేస్తున్నది. మీరు చూపించిన గౌరవానికి గర్వంగా ఉంది. మీ మద్దతు నాకు ఆశీస్సులు. మీ ఉత్సాహం నాకు శక్తినిస్తోంది. నా పట్ల మీకున్న విశ్వాసం నాకు ప్రేరణ నిస్తోంది. నేను మీ నమ్మకం ఎప్పుడూ వమ్ము చేయను – ఎప్పుడూ చేయను!' ఆమె ఉద్వేగభరితంగా గట్టిగా చెప్పింది. జనం చెవులు చిల్లులు పడేలా చప్పట్లు కొట్టారు. ఆ మహిళలిద్దరూ నిలబడిన వేదిక చుట్టూ పోలీసులు నిలబడ్డారు. వందలాదిమంది ఖాకీదుస్తులు ధరించి లాఠీలు, హెల్మెట్లు పెట్టుకొన్న పోలీసులు జనం వేదిక మీదకు రాకుండా ఆపుతున్నారు.

చాందిని కూర్చుంది. అంజలి మాట్లాడడానికి లేచి నిలబడింది. ఆమె భయపడుతోంది. మూవీకెమెరా ముందు రాసిచ్చిన మాటలు చెప్పడం వేరు, వందలు వేలాదిగా అరుస్తున్న రాజకీయ కార్యకర్తల ముందు మాట్లాడడం వేరు. ఆమె కేవలం చాందినికి మద్దతు పలకడం ముఖ్యమని తన రాత్రి సహచరుడు సోమాని ఒత్తిడి చెయ్యడం వల్లే ఇక్కడికొచ్చింది.

'బీదరికం, వ్యాధి, నిరక్షరాస్యత, భూస్వామ్య వ్యవస్థలతో సతమతమవుతున్న రాష్ట్రంలో ఒక దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది! నాకు ఆ వెలుగు కనిపిస్తోంది! మీకు కనిపిస్తోందా?' ఆమె గట్టిగా అడిగింది. మైదానం ఆమోదంతో మారుమోగింది. 'వెలుగు తీవ్రమైంది. ఉజ్వలమైంది. నేను చూసిన దేదీప్యమానమైన వెలుగు ఇదే ఇప్పటివరకూ. ఈ వెలుగు మరింత జాజ్వల్యమానం అవుతుంది. ఇది స్వచ్ఛమైనది. కల్తీలేని శక్తి, ఇది ఉత్తరప్రదేశ్ అంతటా వ్యాపించే వెలుగు – చాందిని!'

జనం గందరగోళంగా తమ ఆమోదం తెలిపి గోల చేస్తుండగా తుపాకి పేలింది. మైక్రోఫోను దగ్గరగా తుపాకి పెట్టి కాల్చి ఉండకపోతే అసలు శబ్దమే వినిపించేది కాదు. చాందిని తన కుడి భుజం పట్టుకొని నేలమీద పడిపోయింది. ఆమె చేతి వేళ్ళ మధ్య నుంచి రక్తం కారుతోంది. ఆమె కోరా చీర, జాకెట్టుల నిండా పెద్దగా రక్తం మరకలు. అంజలి కింద కూర్చుని చాందిని తలను తన ఒడిలోపెట్టుకుంది. వాళ్ళ దగ్గరికి జనం తోసుకుని రాకుండా నివారించడానికి అధికారులు గబగబా వచ్చారు. ఆ క్షణంలో దూరదర్శన్ టీవీ కెమేరా, వందలాది మంది ప్రెస్ ఫోటోగ్రాఫర్లు సెంటిమెంటుని జాగ్రత్తగా ఒడిసిపట్టారు.

*'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'* అంటూ దూరం నుంచి అక్కడ జరుగతున్నది గంగాసాగర్ చూశాడు.

వాళ్ళు హాస్పిటల్ వరండాలో ఆమె గది బయట నిలబడ్డారు. ప్రెస్ సభ్యులను ఆవరణలోకి రాకుండా కట్టుదిట్టం చేశారు. వాళ్ళు ఆసుపత్రి బయట చిన్న శిబిరం వేసుకుని ప్రతి ఒక్కరిని ఫోటో తీస్తున్నారు. చివరికి వచ్చేపోయే రోగులను కూడా.

'ఎలా ఉంది ఆమె?' అడిగాడు గంగాసాగర్.

'బాగానే ఉంది' అన్నాడు మీనన్. 'బుల్లెట్ కుడి భుజాన్ని రాసుకుంటూ పోయింది. కొన్ని కుట్లు వేసి, డ్రస్సింగ్ చేసి, యాంటిబయోటిక్స్ ఇస్తే, వెళ్ళిపోవచ్చు'.

'మాజీ పోలీస్ కమీషనర్‌ని కలిశావా?' అడిగాడు గంగాసాగర్.

'కలిశాను. అతనిదో క్రాక్‌షాట్ – కుడివైపు తగలాలి, ఎడమవైపు కాదు అని చెప్పాను. గుండె దగ్గరయితే ప్రమాదమని', వివరించాడు మీనన్.

'కొన్నిసార్లు ఆమెకసలు గుండె ఉందా అని ఆశ్చర్యపోతాను, అని గొణిగాడు గంగాసాగర్. 'ఆమెని చూస్తే చాలాసార్లు నన్ను నేను చూసుకుంటున్నట్టు ఉంటుంది బుల్లెట్ ఆమెకి తగలకూడదని, రాసుకంటూ వెళ్ళాలని కూడా చెప్పావా?'

'చెప్పాను. కాని దానికి గ్యారంటీ ఇవ్వలేనని చెప్పాడు. మైక్రోఫోన్ సమీపంలో కాల్చమని చెప్పాం. అలా అయితే శబ్దం వినిపిస్తుందని. బాగా కాల్చాడు – న్యూఢిల్లీ కొత్త ఎసైన్‌మెంట్ గురించి మాట్లాడతారని మీ కోసం నిరీక్షిస్తున్నాడు'.

'అవును. మాటిచ్చాను. దీని గురించి ఆమెకేమీ తెలియదు కదా?'

'తెలియదు'.

'దూరదర్శన్‌లో ఈ సీను ఎన్నిసార్లు చూపించారు?'

'దాదాపు ఏభై సార్లు'.

అంజలి ఒడిలో చాందిని తల ఉన్న ఫోటోలు తెప్పించు. ఫోటోని పోస్టర్‌గా తయారుచేసి పోస్టర్లలో – ***నా ప్రజల కోసం నా రక్తంలోని ప్రతి బొట్టుని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను*** అనే నినాదాన్ని రాయించు. వేలాది పోస్టర్లు ప్రింటు చేయించి, నగరమంతా పెట్టించు. చనిపోకుండానే ఆమె అమరవీరురాలవ్వాలి!'

'కాని డాక్టరు ఆమెని తొందరగానే పంపేస్తాడు. ఆసుపత్రిలో ఉండనవసరం లేదు – పైపైన తగిలిన గాయమే', మీనన్ వాదించాడు, డాక్టరుని ఇక్కడకు తీసుకురా. ఆమెని రాత్రంతా అబ్జర్వేషన్లో ఉంచాలని చెప్పమంటాను'.

'తర్వాత?'

'తర్వాతేమీ లేదు. తప్పనిసరైతే తప్ప అబద్ధం చెప్పకూడదు'.

'ఆమెకేమీ ప్రమాదం లేదని చెప్పెయ్యాలా అతను?'

'ఆమెకు ప్రమాదం లేదని, రేపు ఉదయం వరకు అబ్జర్వేషన్లో ఉంచాలని చెప్పాలి. అబద్ధానికి, ఆలస్యంగా నిజం చెప్పడానికి చాలా తేడా ఉంది!'

'గంగా అంకుల్, నాకేం కాలేదు. నేను లేచి ఈ ఆసుపత్రి నుంచి బైటపడాలి. ఎలక్షన్ ర్యాలీలకి వెళ్ళాలి' ఆమె అడ్డుకుంది.

'చాందినీ, నువ్వింకే ఎన్నికల ర్యాలీకి వెళ్ళడం లేదు. యుద్ధాల్లో పోరాటానికి ముందే జయమో, అపజయమో తేలిపోతుంది. దీని గెలిచాం ఇప్పటికే.'

'ఎన్నికల రోజు వరకూ ఇంక నేనేం చెయ్యవద్దా?'

'ఆఁ! నువ్వు బిజీగా ఉంటావు. ఇక్కణ్ణించి తిరుమల వెళ్ళడానికి నీకు ఎయిర్ క్రాఫ్ట్ ఏర్పాటు చేశాను. తిరుమల నుంచి గోవాకి, అక్కణ్ణించి అజ్మీర్. అదే విమానంలో అమృత్సర్ వెళ్ళి మళ్ళీ మూడు రోజుల్లో ఇక్కడికి వచ్చెయ్యాలి'.

'ఈ ఊళ్ళన్నీ నేనెందుకు తిరగాలి? వాటిలో ఎన్నికలు లేవు కదా?' ఆమె వాదించింది.

'తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వరుడికి నమస్కరించి హిందువులను సంతోష పెడతావు. గోవాలో ఏసుక్రీస్తు ముందు కొవ్వొత్తి వెలిగించి క్రైస్తవులను సంతోషపెడతావు. తర్వాత అజ్మీర్ వెళ్ళి మొయినుద్దీన్ చిస్తీ దర్గాలో చాదర్ సమర్పించి ముస్లింలను సంతోషపెడతావు. చివరగా అమృత్సర్ వెళ్ళి స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేసి సిక్కులను సంతోషపెడతావు. నువ్వు అందరినీ సంతోషపెట్టాక, నీ పార్టీని ప్రభుత్వంలోకి రప్పించి వాళ్ళు నిన్ను సంతోషపెడతారు'.

ముంబయి బాంద్రా శివారులో బాలీవుడ్లో ప్రసిద్ధులు, సంపన్నుల ఇళ్ళున్నాయి. బాలీవుడ్ సైరన్ అంజలి ఇల్లు సముద్రం ఎదురుగా ఉండే అందమైన పెద్ద ఇల్లు. పెద్ద ఇనుపగేటు, కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఉంటుంది.

ఆమెకి భయం ఉందని కాదు కాని ఆమె కోసం వచ్చే ప్రత్యేక స్నేహితుడు సోమానీ కోసం. అతను చాలా రాత్రులు ఇక్కడికి వస్తాడు. ర్యాలీలో చాందినికి మద్దతుగా ఆమె ఉద్వేగంగా ఉపన్యాసమిచ్చాక గంగాసాగర్ ఆమెని పక్కకు తీసికెళ్ళాడు. 'మీకు ప్రత్యేకమైన ప్రతిభలున్నాయి' అన్నాడు.

'నాకు తెలుసు' అందామె. 'చాలామంది చెప్పారు రెండూ చాలా బాగుంటాయని'.

పెద్ద మనిషి ఏమాత్రం తొణకలేదు. 'అవును. నాకావిషయం అర్థమైంది. నేను చెప్పేది మీ మాట్లాడే సామర్థ్యం గురించి - ప్రజలను వారి ఉద్వేగాలను ప్రభావితం చేయడం గురించి, రాజకీయాల్లో చేరాలని అనుకున్నారా ఎప్పుడైనా?'

'పార్లమెంటులో కూర్చోవాలంటే ఇష్టం. కాని ఎన్నికల్లో పాల్గొనేంత ఓపిక లేదు. చివరికి బాలీవుడ్ సెక్స్ సింబల్‌గా నా అదృష్టాన్ని అంగీకరించాను'.

'అలా అనుకోవద్దు. మీ మూలంగా వచ్చిన ప్రజల మద్దతుతో మేము త్వరలోనే ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. రాజ్యసభకు మిమ్మల్ని నామినేట్ చేస్తాం. మీరు పార్లమెంట్‌లో కూర్చోవచ్చు. అది కూడా ఎన్నికలలో పోటీ చెయ్యకుండా!'

'మరి మీకేం కావాలి? మీరా కంపు ముసలోళ్ళ లాంటి వాళ్ళు కాదు కదా?' ఆమె చిరునవ్వు నవ్వింది.

'మైడియర్ అంజలీ, నేను చెడ్డమనిషినే - కాని ప్రేమ విషయంలో కాదు. రాజకీయాల్లో. రాజకీయాలే కంపు. స్వచ్ఛమైన రాజకీయాలుండవు. అవి రెండూ పరస్పర విరుద్ధం.'

'అయితే కౌగిలింత కాకుండా నానుంచి ఏం ఆశిస్తున్నారు?' కళ్ళు మిలమిల లాడిస్తూ అడిగింది.

'నేను అవసరమైనపుడు సాయమడుగుతాను. అప్పటివరకు నీ ప్రత్యేక రాత్రి స్నేహితుడితోనే ఉండు'.

'ఇప్పుడు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికీ స్పష్టమైన మెజారిటీ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఏ ఒక్క పార్టీ కూడా తనంతట తాను ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థితిలో లేదు'. న్యూస్ యాంకర్ నసపెడుతోంది. అగర్వాల్‌గారు, ఇక్రంభాయ్, మీనన్, గంగాసాగర్ నలుగురూ అగర్వాల్‌గారి లివింగ్ రూంలో కూర్చుని ఎన్నికల ఫలితాలు చూస్తున్నారు.

'చాందిని ముఖ్యమంత్రి అవుతుందని అన్నావుగా' ఆందోళన చెందుతున్నట్లుగా ఉన్న అగర్వాల్ అన్నారు. **అభానస**కు లక్షల కొద్దీ డబ్బిచ్చారు ఆయన. ఇప్పుడదంతా కాలవలో కొట్టుకుపోతున్నట్టుగా ఉంది ఆయనకు.

'చాందిని ముఖ్యమంత్రి అవుతుందని నేనెన్నడూ అనలేదు. **అభానస**కు అధికారం చేజిక్కుతుందని అన్నాను'.

'ఇటువంటి విషయాలు కూడా మీరంత తేలికగా ఎలా మాట్లాడేస్తారు, గంగాసాగర్ గారూ?' ఇక్రం ఆశ్చర్యపోయాడు.

'మీనన్ ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ఎన్ని సీట్లున్నాయి?' గంగాసాగర్ అడిగాడు.

'నాలుగొందల మూడు' మీనన్ సమాధానమిచ్చాడు.

'**అభానస**కు ఎన్ని వచ్చాయి?'

'నూట అరవై'

'మెజారిటీకి ఇంకా మనకు నలభై రెండు తక్కువున్నాయి అవునా?'

'అవును'.

'**అభానస** కన్న ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీ ఏదైనా ఉందా?'

'దేనికీ రాలేదు' తర్వాత ఎక్కువొచ్చిన పార్టీకి తొంభై తొమ్మిది వచ్చాయి'.

'దేశ రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర గవర్నర్ అసెంబ్లీలో ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీ నాయకుణ్ణి ప్రభుత్వం ఏర్పాటు చేయమని పిలవాలి', అవునా?

'అవును'.

'సమస్యేమిటంటే, **అభానస**ను ప్రభుత్వం ఏర్పాటు చేయమని గవర్నర్ ఆహ్వానిస్తే, మనం ప్రతిపక్ష **ఎంఎల్ఏ**లను మనవైపు తిప్పుకోవాల్సి ఉంటుంది.'

'అయితే ఏంటి?'

'వాళ్ళందరికీ కేబినెట్ పదవులు అడుగుతారు. మన సభ్యులకు పదవులు రావు. మనకి క్రమశిక్షణ సమస్యలొస్తాయి.'

'అయితే గవర్నర్ మనల్ని పిలవాలనుకోవడంలేదా నువ్వు?' ఏం చేయాలో తోచని అగర్వాల్ అడిగారు.

'మనం ఇతర పార్టీల **ఎంఎల్ఏ**ల నుంచి తగినన్ని మద్దతు లేఖలు ఇవ్వకపోతే, ఆయన తర్వాతి పెద్ద పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని అడుగుతాడు'.

'అవును. కాని వాళ్ళకి వాళ్ళ తొంభై తొమ్మిది **ఎంఎల్ఏ**లతో పాటు, మరో నూటమూడు మంది మద్దతు కావాలి. సభలో వర్కింగ్ మెజారిటీ కావాలంటే మన **అభానస ఎంఎల్ఏ**లు వాళ్ళకి అవసరం.'

'మన బలాన్నంతా వాళ్ళకి ఆఫర్ చేస్తే, అప్పుడు?' గంగాసాగర్ శాంతంగా అడిగాడు.

'ఏంటి?' మతేమైనా పోయిందా?' కోపంగా అన్నాడు ఇక్రం.

'**అభానస** మద్దతివ్వాలంటే నా **ఎంఎల్ఏ**లకి కేబినెట్ పదవులన్నీ ఇవ్వాలని అడుగుతాను. అది నా ధర. అన్ని పోర్టు ఫోలియోలు – హోం, ఫైనాన్స్, రెవెన్యూ, పరిశ్రమలు, మానవ వనరులు – అన్నిటినీ మనకు కేటాయించాలి. వాళ్ళ ముఖ్యమంత్రిని పెట్టుకోవచ్చు'.

'మరి చాందిని సంగతేంటి?'

'ప్రభుత్వానికి పక్షవాతం వచ్చేవరకు వేచి చూస్తుంది'.

'పక్షవాతమా?'

'తను తీసుకున్న ప్రతి నిర్ణయమూ ఆగిపోతూ ఉంటే వాళ్ళ ముఖ్యమంత్రేం చేస్తాడు? పోర్ట్‌ఫోలియోలన్నీ మనవే కదా.'

'ఒకవేళ పక్షవాతం వల్ల గవర్నర్ ఢిల్లీ జోక్యం కోరి రాష్ట్రపతి పాలన పెట్టమంటే?' అగర్వాల్ అడిగారు.

'రాష్ట్రపతి పాలన కావాలని గవర్నర్ అడగడు'.

'ఎందుకని?'

'ఎందుకంటే రాష్ట్రపతి దానికి వ్యతిరేకంగా మాట్లాడతాడు'.

'ఎందుకు?'

'రాష్ట్రపతిని అలా చేయమని ప్రధాని కోరడు'.

'భారత ప్రధానితో నువ్వు నేరుగా మాట్లాడగలవా?'

'ఆఁ దాదాపు.'

సాధ్వి సాదా లేత కాషాయ రంగు చీర కట్టుకొంది. పాదాలకు చెప్పులు లేవు. మెడలో రుద్రాక్షమాల వేసుకొంది. ఆమె అందమైన స్త్రీ, కేవలం ఆకారంలోనే కాదు. నిజమే, ఆమె తెల్లని శరీరఛాయతో చూడచక్కగా ఉంది. నవ్వుతూ ఉన్న ముఖం. భుజాల వరకు వేలాడే జుట్టుతో అందంగా ఉంది. ఇవన్నీ పక్కనపెడితే ఆమె ముఖంలో గాఢమైన ఆధ్యాత్మిక సంతృప్తి ఉంది. ఆమె సమక్షం ఇంద్రజాలంలా ఉంది - ప్రశాంతమైన ఆత్మవిశ్వాసాన్ని, దివ్యమైన నిర్మలత్వాన్ని కలిగిస్తోంది.

సౌకర్యంగా ఉన్న సోఫాలో కిటికీకి ఎదురుగా కూర్చుని ఉంది. అది వేసవి కాలం. న్యూఢిల్లీ వేడిని ఎయిర్ కండిషనింగ్ దరికి రానివ్వలేదు. ఆమె ఎడమవైపున సాధ్వి సోఫా కన్న కొంచెం ఎత్తు తక్కువున్న పడకకుర్చీలో భారత ప్రధాని కూర్చుని ఉన్నాడు - జ్ఞానోదయం పొందిన సాధ్వి ఆత్మకు పూర్తిగా భిన్నంగా ఉన్నాడు.

'బిడ్డా, దేని గురించి బాధపడుతున్నావు?' ఆమె ప్రశ్నించింది.

'నేను భయపడుతున్నాను తల్లీ', అతను సమాధానమిచ్చాడు. చూడడానికి వింతగా ఉంది. ఆయనకు అరవై ఏళ్ళు. ఆమెకు ముప్ఫయ్యేళ్ళు కూడా ఉండవు. కాని ఆమె అతనిని బిడ్డా అనే పిలుస్తుంది, ఆమెని అతను తల్లీ అనే పిలవాలని చెప్పింది. వాళ్ళ సంభాషణ విన్న ఎవరైనా నవ్వుతారు కాని, వాళ్ళు ఎప్పుడూ పూర్తిగా ఏకాంతంగానే మాట్లాడుకొంటారు. ప్రధాని కార్యదర్శి దీనిని అధికారికంగా కాని, ప్రధాని డైరీలో కాని నమోదు చేయడానికి వీలులేదు.

'నాకు తెలుసు - నేను చెప్పగలను. బిడ్డకు సమస్య వస్తే తల్లికి ఎప్పుడూ తెలిసిపోతుంది' ఆమె మృదువుగా వ్యాఖ్యానించింది.

'ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి అయోమయంగా ఉంది. **అభానస** ఏకైక పెద్ద పార్టీగా వచ్చింది. గవర్నర్ మమ్మల్ని అడిగారు - అనధికారికంగా - ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి వాళ్ళని పిలవాలా అని. వాళ్ళని పిలవకుండా ఉండడానికి చాలా వీలుందని మాకు అనిపిస్తోంది'.

'ఎలాంటివీలు?'

'వాళ్ళకి స్పష్టమైన మెజారిటీ లేదు'

'మీ పార్టీకి లేదు - వాళ్ళ కన్న తక్కువ సంఖ్య మీది'.

'అయినా వాళ్ళు వేరే పార్టీల శాసనసభ్యుల నుంచి మద్దతు లేఖలు కూడా సంపాదించడానికి ప్రయత్నించలేదు. రెండో పెద్ద పార్టీ అయిన మా పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని ఆహ్వానించడం తేలికనిపించేలా చేశారు గవర్నర్‌కి'.

'మరింక సమస్యేమిటి? ఉత్తరప్రదేశ్‌లో మీ పార్టీ ప్రభుత్వంలోఉన్నందుకు మీకు సంతోషంగా లేదా?'

'ఎంత పెద్ద మూల్యమో తెలుసా? మా సొంత శాసనసభ్యులు తొంభై తొమ్మిది మందే. వర్కింగ్ మెజారిటీక్కావలసిన మిగిలిన నూట మూడు మందిని **అభానస** నుంచి తెచ్చుకోవాలి. వాళ్ళెవరికీ డబ్బులు వద్దంట. అందరికీ మంత్రి పదవులే కావాలి'.

'మరి నువ్వు ఒప్పుకున్నావా?'

'ఒప్పుకున్నాను. క్యాబినెట్ చాలా పెద్దది – అరవైమంది! క్యాబినెట్ మొత్తం – ఒక్క ముఖ్యమంత్రి తప్ప అందరూ **అభానస** సభ్యులే. తోక కుక్కని ఊపుతోంది!

'ఇది ఇబ్బందిగా ఉందా?'

'తల్లీ, ఉత్తరప్రదేశ్‌లో మా పార్టీలో తిరుగుబాటు వస్తుంది త్వరలోనే. **అభానస**కు క్యాబినెట్ పదవులు ఇచ్చి వాళ్ళకి ఇవ్వనందుకు మా సొంత **ఎంఎల్ఏ**లు తిరుగుబాటుకి సిద్ధంగా ఉన్నారు'.

'ఉత్తరప్రదేశ్‌లో మీ రాష్ట్ర ప్రభుత్వం పడిపోతుందని అనుకుంటున్నావా బిడ్డా?'

'అవును తల్లీ, అలాగే అనుకుంటున్నాను.'

'దీని ప్రభావం దేశంలో మిగిలిన చోట్ల ఎలా ఉంటుంది?'

'వచ్చే ఏడాది చాలా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో సమస్య మిగిలిన భారతదేశానికి వ్యతిరేక సంకేతాలు పంపుతుంది. మా పార్టీ పరిస్థితులను అదుపు చేయలేకపోతుందని ఈ పరిస్థితి సూచిస్తుంది'.

'రాజకీయంగా నీకున్న అవకాశాలేమిటి, బిడ్డా?'

'ముందు నుయ్యి, వెనుక గొయ్యి, ఏమీ చెయ్యకపోతే తిరుగుబాటు వస్తుంది, ప్రభుత్వం పడిపోతుంది, ప్రతిపక్షం సునాయాసంగా అధికారం చేజిక్కించుకుంటుంది. ఒకవేళ రాష్ట్రపతి పాలన – కేంద్ర పాలన పెట్టమని రాష్ట్రపతిని కోరితే – రాజ్యాంగానికి ద్రోహం చేసిన వాడినవుతాను. దొడ్డిదారిన పనులు చక్కబెట్టిన వాణ్ణవుతాను'.

'ఇటురా, బిడ్డా' ఆమె హఠాత్తుగా ఆజ్ఞాపించింది. ఆయన లేచి ఆమె దగ్గరకు వెళ్ళి ఆమె ముందు తల వంచి కూర్చున్నాడు. ఆమె ఆయన తలపైన చేయి ఉంచి కళ్ళు మూసుకుని తీవ్రంగా ప్రార్థించింది. ఒక నిముషం తర్వాత కళ్ళు తెరిచి 'రేపటికల్లా నీకు ఏం చేయాలో తెలుస్తుంది' అంది.

'కాని తల్లీ –' ఆయన మొదలుపెట్టాడు.

'ష్‌ష్! ఆయన పెదాల మీద వేలుపెట్టి మాట్లాడనీయలేదు ఆమె. ఆమె స్పర్శ విద్యుత్తులా ఉంది. 'గతంలో నీకు దారిచూపలేదా నేను?' ఆమె ప్రశ్నించింది. మౌనంగా తలూపాడాయన.

'అయితే నేను చెప్పినట్టు చెయ్!' ఆమె ఆదేశించింది.

# తొమ్మిదో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

**గాం**ధార సరిహద్దులో ప్రత్యేక విడిది ఏర్పాటైంది. విలాసమైన గుడారాలు, ఆహారం, మద్యం, సుగంధ పరిమళాలు కుప్పలు తిప్పలుగా ఉన్నాయి. గాయకులు, నాట్యగత్తెలు పనితో సతమతమవుతున్నారు. అంభి కోరికలతో నిర్వాహకులు సతమతమవుతున్నారు. విందు ఇవ్వడమెలాగో అతనికి తెలుసు ఖచ్చితంగా. 'దెయ్యం లాంటి పురుషోత్తముడిని నాశనం చెయ్యడానికి సాయం చేసే అలెగ్జాండర్ దేవుడికన్న తక్కువవాడేం కాదు! గాంధార దేశానికి వచ్చే అలెగ్జాండరు హోదాకి తులతూగే విధంగా ఆహ్వానం పలకాలి' అన్నాడు అంభి తన కొత్త మంత్రులతో – చనిపోయిన తండ్రితో ఏ సంబంధం లేని నమ్మకస్థులైన కొద్దిమంది వారు.

తబలా మోత, ఈలలు, వేలాది అడుగుల చప్పుడు చెవులు చిల్లులు పడేలా ఉంది. ఆహారం కోసం పరుగులు పెడుతున్న హంతక చీమల బారులా ఉంది అలెగ్జాండర్‌సైన్యం. కాల్బలం అడుగులు నేల మీద మోపుతున్నప్పుడు వచ్చే కంపనం దగ్గరకి వచ్చే వారిని భయపెడుతున్నట్లుగా ఉంది. సైన్యంలో ప్రధాన భాగం ఖైబర్ కనుమ దాటింది. అలెగ్జాండర్ చిన్న దళాన్ని తనతో చుట్టు తిరిగి ఉత్తర దిశగా నడిపిస్తూ వచ్చి, దారిలో పీర్‌సార్ కోటను జయించాడు. హెరాక్లిస్ అతను రాకముందే ఎలాగో తప్పించుకున్నాడు.

గ్రీకు మాసిడోనియా రాక్షసుడు వస్తున్నాడని తెలియగానే అంభి శిబిరాల్లో నిశ్శబ్దం అలముకొంది. తబలా వాద్యాలు, బాకాలు ఆగిపోయాయి. నాట్యగత్తెలు గానం ఆగిపోవడంతో వళ్ళు, నడుము ఊపడం ఆపేశారు. వస్తున్న మాసిడోనియా సైన్యం చేస్తున్న శబ్దం భారంగా ఉంది. ఏదో బృహదాకారం అడుగు మోపగానే భూమి కంపించినట్టు ఒకదాని తర్వాత మరో అడుగు వేసి వస్తున్నట్టు ఉంది.

'ఒకవేళ మనం మోసపోయామేమో' ఒక మంత్రి మరోమంత్రి చెవిలో ఉద్విగ్నంగా గుసగుసలాడాడు. 'మనం నమస్కరించడానికని వినయంగా ధోతీలు కిందపడేసి నిలబడింది మానభంగం చేయించుకోడానికి కాదు కదా?" సహచరులు నోరు మూసుకోమన్నట్టుగా సైగ చేశారు. ఒకవేళ అంభి గనుక వాళ్ళ మాటలు వింటే ఇద్దరినీ మాంసం కాల్చే పెనాల మీద వేసి కాల్చేవాడు. రాజుగారి సంతోషం కోసం ముఖానికి నవ్వు పులుముకుని నిశ్శబ్దంగా తిట్టుకుంటూ నిలబడ్డాడు అతను.

ఎత్తుగా ఉన్న చోట పెద్ద వేదికను ఏర్పాటు చేశారు. ఇద్దరు నాయకులు ఒకరినొకరు కౌగిలించుకొనడం అందరూ చూసే విధంగా పరస్పర స్నేహ సంకేతాన్ని పంపడానికి దాన్ని వినియోగిస్తారు. అంభి వేదిక దగ్గర మెట్లెక్కి, దగ్గరగా వస్తున్న బృహజ్జంతువుని చూసి కొంచెం స్థాణువయ్యాడు. అతని కళ్ళు అతిగా మద్యం తాగడంతో బాగా ఎర్రగా ఉన్నాయి, శరీరం ధృఢంగానే ఉంది. ముఖంలో శాశ్వతంగా కోపం కనిపిస్తుంటుంది. అతను నవ్వినపుడు గాని, పళ్ళు బైటికి కనిపించినపుడుగాని అదింకా ఘోరంగా ఉంటుంది. ఎప్పుడూ చక్కగా అలంకరించుకుంటాడు, తలపాగ, ధోతి, ఉత్తరీయం, చెప్పులు, నగలు అన్నీ ఒకే రంగువి వేసుకుంటాడు. వస్త్రాలు ఎరుపురంగువైతే నగలు కెంపులో, గులాబీరంగు వజ్రాలో అయి ఉంటాయి; బట్టలు ఆకుపచ్చ రంగువైతే ఆభరణాలు పచ్చలతో ఉంటాయి; నీలం రంగు వస్త్రాలయితే నీలాలు ధరిస్తాడు; ఏ బట్టల మీదకైనా వజ్రాలు ధరించితే బాగానే ఉంటుంది. కళ్ళు చికిలించి దూరంగా చూశాడు. ఏదో పెద్ద తుఫాను కదులుతున్నట్లుగా అనిపించింది అతనికి. నిజానికది డోలు వాద్యానికనుగుణంగా కదులుతున్న అలెగ్జాండర్ సైన్యాలు రేపుతున్న దుమ్ము.

ఎడతెగని నిరీక్షణ తర్వాత అంభికి ఇత్తడి కవచాలు, కాళ్ళ తొడుగులు, శిరస్త్రాణాలు, బుగ్గలకు రక్షలు ధరించి గుర్రపు వెంట్రుకలతో తయారుచేసిన తురాయిలు అలంకరించుకున్న కాల్బలం కనిపించింది. అందరు ఇత్తడి, తోలు డాళ్ళు, పొడవైన ఈటెలు, పొట్టి కత్తులు పట్టుకొని ఉన్నారు. కాల్బలానికి ఇరువైపుల మూడువేలమంది అశ్వికదళం, ఒక్కొక్క సమూహంలో రెండు వందల చొప్పున విభజించారు. గుర్రాలు పెద్దగా, తిండిపుష్టితో ఉన్నాయి. ప్రతి గుర్రానికి రెండుపక్కల మందపాటి ఊలుబట్ట కప్పారు. వాటికి తలకి, ఛాతీకి రక్షక కవచాలున్నాయి. వాటి రౌతులు వీపుకి ఛాతికి కలిపికట్టిన కవచం, భుజకవచాలు, బొయేషియా శిరస్త్రాణాలు ధరించి ఉన్నారు. వారివద్ద వంపు తిరిగిన కరవాలాలున్నాయి.

అలెగ్జాండర్ సేన చూసి తీరాల్సిన దృశ్యం. అంభి భయంతో గుటక మింగాడు. తనేమన్నా మోయలేని భారాన్ని తలకెత్తుకున్నానా అని తర్కించుకున్నాడు.

అనుకోకుండా, అక్కడంతా నిశ్శబ్దం అలముకుంది. డోళ్ళు, ఈలలు ఆగిపోయాయి. అలెగ్జాండర్ తన దళాలను ఆపి, తానొక్కడే అంభి విడిదికి వచ్చాడు. 'ఛఛ! ఇవన్నీ ముందే ఎందుకు ఆలోచించలేదు, అనుకుంటూ అంభి గబగబా మెట్లు దిగి గుర్రాన్నెక్కి మాసిడోనియా దేవుడివైపు వెళ్ళాడు. రెండు గుర్రాలు కలుసుకొనే చోటికి వచ్చేసరికి నిదానించాయి. రౌతులిద్దరూ ఆత్రుత లేనట్టుగా కనిపించడానికి ప్రయత్నించారు. అలెగ్జాండర్ తనతోఏమంటాడు అని అంభి ఆలోచిస్తున్నాడు *'అంభీ, నువ్వు రక్తం పీల్చే పెద్ద జలగవి. నువ్వు నా కోసం యుద్ధాలు చేయనవసరం లేదు. ఇంకెవడినైనా ఆశ్రయించు? అంటాడా.*

ప్రతి రౌతు వెనకాల నలుగురైదుగురు గుర్రాల మీద వస్తున్నారు - అంగరక్షకులు, వ్యాఖ్యానించేవారు, రాతగాళ్ళు, సలహాదార్లు. చివరికి వాళ్ళు ఒకరికొకరు ఎదురవగానే అలెగ్జాండరే ముందు మాట్లాడాడు. 'అంభీ, మీరో గొప్ప–' అంభికి చెమటలు పట్టాయి. అలెగ్జాండర్ తనని అవమానిస్తాడా?

'– స్నేహితులు అలెగ్జాండర్‌కి. నేను కూడా స్నేహహస్తం చాస్తున్నాను. మనిద్దరం కలిసి మంచి బంధం ఏర్పాటు చేసుకుందాం!' అని వ్యాఖ్యాతగా ఉన్న తన ఆఫ్ఘన్ సేనా నాయకుడు శశిగుప్తుడి ద్వారా అలెగ్జాండర్ చెప్పాడు. అంభి భారం దిగినట్టుగా ఊపిరి పీల్చుకున్నాడు. తను అనుకొన్నట్టుగానే జరుగుతోంది. తను సాధించిన విజయం. ప్రపంచ విజేతతో గొప్ప ఒప్పందం!

అంభి ఎంతో వినయంగా అన్నాడు. 'మనిద్దరం ఒకరితో ఒకరు ఎందుకు పోరాడాలి అలెగ్జాండర్? మీరు మా ఆహారాన్ని గాని, నీటిని గాని దోచుకోవాలనుకోవడం లేదు. ఇవే కదా జీవనాధారాలు. తెలివైన వాళ్ళు వీటి కోసమే పోరాడాలని భావిస్తారు. అదృష్టవంతుడా, సంపద అంటారా, నాకు చాలా ఉంది. మీకు దానిలో భాగం ఇవ్వడానికి నాకేం అభ్యంతరం లేదు!'

ఇద్దరూ గుర్రాలు దిగారు, అలెగ్జాండర్ అంభిని కౌగిలించుకుని సరదాగా అన్నాడు, 'నీ మర్యాద, ఆనందం, మన్ననలు మనిద్దరి మధ్య యుద్ధాన్ని ఆపుతాయని భావిస్తున్నావా? నువ్వు పొరపాటు పడినట్టే. ఎవరు మంచి స్నేహితులో నిర్ణయించడానికి నేను నీతో పోరాడతాను'.

జీలం నదికి వరద వచ్చింది. రుతుపవనాల గాలులు పంజాబ్‌ని అల్లకల్లోలం చేశాయి. మనుషులు, సామానులు నానిపోయాయి. కొండల మీద నుంచి బురదనీరు ప్రవహిస్తూ జారిపోకుండా నడవడం అసాధ్యం చేసింది. ఎక్కడ చూసినా నీరే – నదిలో, వర్షంలో, మాసిడోనియా సైన్యం ఆహారంలో, గుడారాల్లో చివరికి వాళ్ళు వంట చేసుకొనే మంటల్లో కూడా. అబ్బ ఏం నీళ్ళు!

పరిస్థితిని మరింత జటిలం చేస్తూ, నదీతీరం పొడవునా మైళ్ళకొద్దీ ముందుకు, వెనుకకు నడవమని చెబుతూ అలెగ్జాండర్ మరింత కష్టపెట్టాడు. అలా చేస్తే ఎక్కడ నదిని దాటుతారోనని ప్రత్యర్థి ఊహిస్తూ ఉండాలని. తన దళాలు జీలం నదికి కుడి తీరంలో వేసే ప్రతి అడుగూ, ఎడమ తీరంలోని పురుషోత్తముడి దళాలు గమనిస్తుంటాయని తెలివైన యుద్ధ వ్యూహకర్త అలెగ్జాండర్‌కు తెలుసు. కేకయ దళాలు పెద్దవని – ఏభై వేల కాల్బలం. అయిదు వేల అశ్వికదళం, మూడొందల రథబలం, రెండు వందలకు పైగా యుద్ధ ఏనుగులు – తన బలగం కన్న ఎన్నో రెట్లు ఎక్కువని అతనికి తెలుసు.

ఈ ఆటని శ్రద్ధగా ఆడాలి. 'సెల్యూకస్!' నమ్మకస్థుడైన తన సేనానిని పిలిచాడు.

'చెప్పండి, ప్రభూ', అన్నాడు సెల్యూకస్ గబగబా అలెగ్జాండర్ దగ్గరకు వస్తూ, తన కవచాన్ని శుభ్రం చేస్తున్న సహాయకుడిని పట్టించుకోకుండా.

'నువ్వు నాలా అనిపిస్తావా?' నిజాయితీగా అడిగాడు అలెగ్జాండర్.

'మీలా ఎవరూ అనిపించలేరు. ప్రభూ మీరు దివ్యులు!' అన్నాడు వెన్నరాసినట్టు బాగా పొగుడుతూ. అలెగ్జాండర్ తనని చూసి చిరునవ్వు నవ్వగానే తన ప్రశంస పని చేసిందని అర్థమైంది. ప్రశంస మనిషిని ఎక్కడికైనా తీసుకెళుతుంది, అనుకున్నాడు సెల్యూకస్.

'నేననేది అది కాదు. దూరం నుంచి. మనం రాజశిబిరాన్ని అలాగే ఉంచి, కాల్బలాన్ని ఇక్కడే ఉంచి రాజుడేరాని కూడా ఉంచి నాలాగే ఉండే ఎవరికైనా నా బట్టలు వేసి అప్పుడప్పుడు బయటికి, లోపలికి తిరిగేలా చేయాలి. అప్పుడు ప్రత్యర్థులు మనం ఇక్కడ ఉన్నామనుకుంటారా?' యుద్ధకళా నిపుణుడు అడిగాడు. సెల్యూకస్ చిరునవ్వు నవ్వాడు. అలెగ్జాండర్ ఏమనుకుంటున్నాడో అతనికి తెలుసు. అతను వేసే నిపుణమైన అడుగు అదే – శత్రువుపై రెండు వైపుల నుంచి దాడి చేయడం.

'నా కన్న ఫిలిప్పోస్ నయం. అతని ఆకారం కొంచెం మీలాగా ఉంటుంది ప్రభూ. పురుషోత్తముడి సేనలకు మనం కదలినట్టు తెలియదు. క్లిష్టమైన ప్రశ్న ఏమిటంటే,

తరువాతేం చేస్తాం? జీలంని ఎక్కడ, ఎలా దాటుతాం?' సమాధానం తన యజమానికి తెలుసని గ్రహించినా అడిగాడు.

'సింధునది మీద బల్లకట్టులతో వంతెన కట్టేవాళ్ళం గుర్తుందా? వాటిని మనం ముక్కలు చేసి ఎగువకు వెళ్ళి నిర్జనంగా ఉన్న చోట వాటిని అతికించితే? నదిని దాటటానికి ఆ బల్లకట్టులని మనం ఉపయోగించవచ్చు'.

'నలభై వేల మంది మనుషులకి, మూడు వేల గుర్రాలకి బల్లకట్టులను ముక్కలు చేసి మళ్ళీ కట్టటం అంటే? అసాధ్యం!' సెల్యూకస్ నమ్మలేనట్టుగా నత్తుతూ అన్నాడు. అప్పటికే అతని సైన్యం తడిసి ముద్దయి, అలసిపోయి ఉన్నారు.

'అహ! మనమిద్దరం మూడువేల అశ్వికదళాన్ని, పదివేల కాల్బలాన్ని తీసుకెళదాం. మిగిలిన సైన్యమంతా ఫిలిప్పోస్‌తో ఇక్కడే ఉంటుంది. మనం రహస్యంగా నది దాటి పురుషోత్తముడిని వెనుక నుంచి ముట్టడిద్దాం,' ఉత్సాహంగా అన్నాడు అలెగ్జాండర్.

'అతను మొత్తం సైన్యంతో మనల్నెదిరించవచ్చు', వాదించాడు సెల్యూకస్. 'మనకి చాలా తక్కువసైన్యం ఉంది. అతనికి వందలాది ఏనుగులున్నాయి ప్రభూ' అన్నాడు అధైర్యంగా.

'అప్పుడే ఫిలిప్పోస్ నదిని దాటుతాడు, మిత్రుడా!' తర్కించాడు అలెగ్జాండర్.

'ఎలాగైనా పురుషోత్తముడు రెండు వైపుల నుంచి పోట్లాడాల్సి ఉంటుంది', తన యజమాని వ్యూహం ఇప్పుడు పూర్తిగా అర్థమై అన్నాడు సెల్యూకస్.

'మనల్ని ముట్టడిస్తున్నారు' కేకయ సేనలో మొదటి వరుస నాయకుడు కేక పెట్టాడు ప్రతిధ్వనిలా ఆ సందేశం కేకల ద్వారా పురుషోత్తముడికి చేరింది. పురుషోత్తముడు అంటే అత్యుత్తమ మానవుడు – అని అర్థం. అతను అలాంటివాడే కూడ. ఆరున్నర అడుగుల ఎత్తు, దీప్తిమంతమైన ముఖం, ఆ దీప్తిని మరింతగా శోభాయమానం చేసే మెలితిరిగిన మీసాలు, అచ్చమైన రాజపుత్ర యోధునిలా ఉన్నాడతడు.

తన రాచరిక వ్యక్తిత్వంలో భాగమన్నట్లుగా సైనిక కవచాన్ని, రాజ లాంఛనాలను ధరించి ఉన్నాడు. అతను కదిలినప్పుడల్లా కండరాలు అలల్లా కదులుతున్నాయి. ఛాతీ ఉప్పొంగి ఉంది. తెల్లని శరీరం వర్షానికి తడిసింది. కాని శరీరం మీద పడిన ప్రతిబిందువూ

అతన్ని ప్రేమిస్తున్నట్టుగా శరీరానికి అంటిపెట్టుకునే ఉంది వదలడం ఇష్టం లేనట్టుగా. అతని నల్లనిజుట్టు భుజాల వరకు వేలాడుతూ ఉంది. కెంపు తాపడం చేసిన శిరస్త్రాణం సగం ముఖాన్ని కప్పేసి ఉంది. అతను శక్తిశాలి పురుషోత్తముడు. పర్వత రాజ్యాలైన కాశ్మీరు, మాళవరాజ్యం, కులూట, సింధు దేశాలను జయించి పర్వతేశ్వరుడని బిరుదు పొందాడు.

'ఇదెలా సాధ్యం?' పురుషోత్తముడు తన ప్రధాని ఇంద్రదత్‌ని అడిగాడు. 'మీ వేగులు చెప్పారు కదా. అలెగ్జాండర్ సైన్యం జీలం ఆవలితీరంలో మన కళ్ళముందే ఉందని చెప్పారు కదా?'

'అవును ప్రభూ. వాస్తవానికి అభయ పంపిన చారులు స్థానిక రైతులతో కూడా మాట్లాడారు. నిన్న అలెగ్జాండర్ ఆ ప్రాంతమంతా తిరిగి చూశాడని, నది దాటడానికి సాధ్యం కాదని చాలా లోతుగా ఉందని కూడా అన్నాడని వాళ్ళు చెప్పారని చారులు చెప్పారు'. ఇంద్రదత్ సమాధానమిచ్చాడు.

'ఇంద్రదత్, నా నమ్మకమైన సలహాదారూ, మనం మోసపోయాం. రథికులను, విలుకాళ్ళను వెనుతిరిగి అలెగ్జాండర్‌కి మరువలేని గుణపాఠం నేర్పమను!' అని గర్జించాడు పురుషోత్తముడు రుతుపవన వర్షం తనపైన కురుస్తుండగా. ఇంద్రదత్ తల వూపి, పూర్తిగా కాలూ చెయ్యి ఆడకుండా ఉన్న సర్వసేనానికి ఈ సందేశమివ్వడానికి వెళ్ళాడు అతని రథాలు బంకమట్టిలో జారిపోతున్నాయి. ఇప్పటికే చాలా పోయాయి. రెండు మీటర్ల ఎత్తున్న విల్లులు - బాణాలకు బదులుగా ఈటెలను వేసేవి - వాటికి దృఢమైన నేల కావాలి స్థిరంగా ఉండడానికి. ఇప్పుడటువంటి నేల సాధ్యం కాదు.

కేకయ ఏనుగులే వారి అసలైన బలం. వెనుక నుంచి దాడిని ఎదుర్కొనడానికి గత్యంతరం లేక పురుషోత్తముడు ఏనుగులను రంగంలోకి దించమన్నాడు. ఏనుగులు భయపడుతున్న మాసిడోనియా దళాలపైకి లంఘించగానే, వాటిపై గొడ్డళ్ళు, ఈటెలు ప్రయోగించారు. గొడ్డళ్ళు, ఈటెలు సూటిగా వచ్చి తగలగానే, ఏనుగులు కకావికలైపోయి కేకయ దళాలనే తొక్కివేశాయి. పరిస్థితి ఇంత ఘోరంగా ఉండగానే, వెనుక నుంచి దాడి చేసినది అలెగ్జాండర్ దగ్గరున్న చిన్న దళమని, మిగిలిన దళాలు ఫిలిప్పోస్ నాయకత్వంలో జీలం నది దాటి ముందు నుంచి దాడి జరుపుతున్నాయని వార్త వచ్చింది.

తన ఏనుగు మీద కూర్చుని యుద్ధరంగం మధ్యలో ఉన్న పురుషోత్తముడికి దుర్వార్త తెలిసింది. అతని కొడుకులిద్దరూ మరణించారు. ఒకరు వెనుక ఉన్న దళాన్ని రక్షిస్తూ,

మరొకరు ముందున్న కేకయ సైన్యాన్ని రక్షిస్తూ. ఇంక పోగొట్టుకోడానికి ఏమీ లేక, పురుషోత్తముడు తన మావటితో నేరుగా అలెగ్జాండర్ దగ్గరికి తీసుకొని వెళ్ళమన్నాడు. దండయాత్రికుడి గుండెలో ఈటె గుచ్చాలి అని భావించాడు. అలెగ్జాండర్ కూడా ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు. తన సేనలను పురుషోత్తముణ్ణి, అతన్ని వ్యక్తిగత దళాన్ని చుట్టుముట్టమని చెప్పాడు. అక్కడ మారణకాండ జరిగింది. వేలాదిమంది కేకయ సైనికులు చంపబడ్డారు. రక్తం ప్రవాహంలా జీలం నదిలో కలిసింది.

కుడి భుజానికి గాయం చేసిన బరిశెను బయటికిలాగిన సాహసి పురుషోత్తముడు, రక్తం పోయినందువల్ల నీరసంతో ఏనుగు మీద నుంచి కిందకు జారిపడ్డాడు. వెంటనే అలెగ్జాండర్ మనుషులతనిని చుట్టుముట్టి బందీగా పట్టుకున్నారు. ఈ అసమాన యోధుడిని అంభితో ఉన్న అలెగ్జాండర్ ముందుకు తీసుకొని వచ్చారు. ఆ యోధుడిలో రాజసం ఏమాత్రం తగ్గలేదు. 'నిన్నెలా చూడాలి పురుషోత్తమా', అని అడిగాడు విజయగర్వంతో అలెగ్జాండర్. అంభి తృప్తిగా నవ్వుకున్నాడు – ఇది వినోదం కలిగిస్తుందని.

'రాజునెలా చూస్తావో అలా చూడు నన్ను అలెగ్జాండర్', ఓడిపోయి సంకెలలతో బంధింపబడి తనను జయించిన వాడి ముందు నిలబడినా, ఓడిపోయినా, నిరుత్సాహం లేదు, గాయపడినా ఓడిపోలేదు. బంధింపబడినా రాజసం తగ్గలేదు.

హుందాగా ఇచ్చిన సమాధానంతో అలెగ్జాండర్ ముఖంలో నవ్వు కనిపించింది. 'నా కోసం నేనలాగే చేస్తాను పురుషోత్తమా', అన్నాడు అలెగ్జాండర్. అంభి ముఖంలో నవ్వు మాయమైంది'. 'ఏదైనా వరం కోరుకో ఇస్తాను' అన్నాడు అలెగ్జాండర్ డాబుగా. 'నేను కోరేదంతా ఆ అభ్యర్థనలోనే ఉంది', సమాధానం చెప్పాడు పురుషోత్తముడు. అలెగ్జాండర్‌కి వీరత్వం, పరాక్రమం, రాజసాల పట్ల నిరాదరణ లేదు. పురుషోత్తముడి దగ్గరకు వచ్చి కౌగిలించుకున్నాడు. 'ఈ రోజునుంచి నువ్వు నా స్నేహితుడివి. నా వాడివి. నీ రాజ్యాన్ని భూములను నీకిచ్చేస్తున్నాను. అంభితో సంధి చేసుకుని నా పేరు మీద పాలించు!'

తన రాజసావశేషాలను విడిచిపెట్టి కన్నీళ్ళ పర్యంతమైన పురుషోత్తముడు అలెగ్జాండర్‌తో, అంభితో సంధి చేసుకున్నాడు.

చాణక్యుడు తన కుటీరంలో నేల మీద చంద్రగుప్తుడితో కలిసి కూర్చుని అటుకులతో చేసిన పోహను తింటున్నాడు. 'వివేకి అయిన ఆచార్యా, మనమేం సాధించాం?' హటాత్తుగా మారిన పరిస్థితులను చూసి గాభరాపడి చంద్రగుప్తుడు అడిగాడు.

ఆకులో నుంచి గుప్పెడు పోహను తీసుకుంటూ 'మనం ఏం కావాలనుకున్నామో అదంతా అయింది' అన్నాడా బ్రాహ్మణుడు.

కుటీరం వెలుపల ఉదయపు వ్యాయామం చేస్తున్న మనుషుల శబ్దాలు వినిపిస్తున్నాయి. వారిని పర్యవేక్షిస్తున్న అధికారి వారు వేగంగా పరిగెత్తడం లేదని, బాగా కొట్టడం లేదని, దూరంగా విసరడం లేదని కోప్పడుతున్నాడు. ప్రతిరోజూ మరింత కఠినంగా వ్యవహరిస్తాడు వారితో. చిన్న సైన్యమైనా అత్యంత సమర్థమూ, శక్తిమంతమైన బలగం కావాలని అతను భావిస్తున్నాడు – బలం, వేగం, చురుకుదనం, హఠాత్పరిణామాలను తట్టుకోగల సైన్యం కావాలని అనుకుంటున్నాడు.

బయట శిక్షకుడు మాట్లాడే పరుషమైన మాటలు, ఒక్కోసారి తిట్లు వింటూ పట్టించుకోకుండా, చాణక్యుడు ప్రశాంతంగా ఇలా అన్నాడు. 'అలెగ్జాండర్ పురుషోత్తముడిని ఓడించాడు. పురుషోత్తముడు ఇరవైమూడు వేల దళాలను కోల్పోయాడు. ఇప్పుడతను అలెగ్జాండరుకు సామంతుడు. మనంతట మనం ఇదెన్నటికీ సాధించలేకపోయేవాళ్ళం', అంటూ వివరించాడు చాణక్యుడు.

'కాని అలెగ్జాండర్‌ని మనం మరింత బలవంతుణ్ణి చేశాం', ఆశ్చర్యంగా అన్నాడు చంద్రగుప్తుడు మసాలా అటుకులను నీళ్ళూరుతున్న నోట్లో వేసుకుంటూ.

'ఖచ్చితంగా దానికి వ్యతిరేకంగా జరిగింది చంద్రగుప్తా. పురుషోత్తముడితో యుద్ధం జరగకముందే అలెగ్జాండర్ సేనలు అలసి, విసిగి ఉన్నాయి. జీలం విజయానికి భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. అలెగ్జాండర్ సైన్యం ముందుకు వెళ్ళడానికి ఇష్టపడడం లేదని మన చారులు చెబుతున్నారు. వాళ్ళ మాటతో అలెగ్జాండర్ ఆగిపోడు కాని సాహసి, బుద్ధిహీనుడైన పురుషోత్తముడితో జరిపిన ఒక్క యుద్ధం వల్ల అతను ఆగుతాడు!' నవ్వాడు చాణక్యుడు.

'మనం చేసినది నాకింకా నచ్చలేదు. మనం న్యాయంగా ఏది చేయాలో అది చేసి ఉండాల్సింది!'

'నాయనా చంద్రగుప్తా, యుద్ధం న్యాయంగా ఉండేవాళ్ళ కోసం కాదు. చాలావరకు అది అన్యాయంగా ఉండేవాళ్ళ కోసం!'

'ఇప్పుడేం జరుగుతుంది ఆచార్యా?'

'అలెగ్జాండర్ వెనుతిరుగుతాడు... భారతదేశం నుంచి త్వరలోనే వెళ్ళిపోతాడు.

తను జయించిన ప్రాంతాలకు ప్రతినిధిగా సెల్యూకస్‌ని పెడతాడు బహుశా. అప్పుడు మనం చేయాల్సింది చేద్దాం', అన్నాడు చాణక్యుడు.

వందలాది వెదుర్లు ఒకదానినొకటి కొట్టుకుంటున్న శబ్దం చాణక్యుడి స్వరాన్ని పెంచాయి. సిలంబం – వెదురు బొంగులతో పోరాటం జరుగుతూ ఉంది. శిక్షకుడు భారతదేశంలో ఉన్న ప్రాచీన యుద్ధ విద్యలను అన్నిటినీ నేర్చుకున్నాడు. వాటిని తన సైన్యం వ్యాయామంలో భాగం చేశాడు. వెదురు బొంగులు ఒకదానితో ఒకటి కొట్టుకునే శబ్దం వినిపించి 'అతను మనతో ఉండడం మన అదృష్టం', అన్నాడు చంద్రగుప్తుడు.

'అతను మైనిక చేతులలో పడనంతవరకు బాగానే ఉంటుంది మనకు', అని కుటిలంగా నవ్వుతూ అన్నాడు చాణక్యుడు.

'అంభి సేనాధిపతిని మనశిక్షకుడిగా ఉండడానికి ఎలా ఒప్పించారో నేనెప్పటికీ అర్థం చేసుకోలేను', చంద్రగుప్తుడు అన్నాడు.

'అతనికి వేరే మార్గం లేదు. కేకయ సేనలు తక్షశిలపై దాడి చేసినప్పుడు అతను తన ఉంపుడుగత్తె పడగ్గదిలో హాయిగా నిద్రపోయాడు. గాంధార రాజుగాని, అంభిగాని తనని మళ్ళీ ఆహ్వానిస్తారనుకోలేదు కదా. అతను చేసిన తప్పుకి కొరతవేసి, అందరికీ చూపించేవారు! నేనతనికి ఈ అవకాశం ఇచ్చాను'.

'హా! అతనికింకో మార్గమేలేదు!'

'నిజమే. మాయ చేసేవాడు చాలా అవకాశాలు చూపిస్తాడు ఎంచుకోమని. కాని చివరికి మనం అతడికి కావలసిన దాన్నే ఎంచుకుంటాం!'

'నాకర్థం కాలేదు. మీరు కొన్నిసార్లు పొడుపుకథల్లా మాట్లాడతారు', ఫిర్యాదు చేశాడు చంద్రగుప్తుడు.

'మైనిక ఎవరు? సేనాని కోసం జలక్రీడ ఎందుకు ఏర్పాటు చేసింది? ఇంద్రదత్ రహస్యవేగు అభయకు దీని గురించి ఉప్పెలా అందింది. దీనిని కేకయకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకున్నాడు?' కుశలుడైన గురువు ప్రశాంతంగా అడిగాడు.

చంద్రగుప్తుడు గురువు ముందు మోకరిల్లి నమస్కరించాడు. ప్రపంచంలో అత్యుత్తమ గురువు సమక్షంలోఉన్నానని అతనికి అర్థమైంది. – బయట యుద్ధ క్రీడలు నేర్పుతున్న గురువు సమక్షంలో కాదు. లోపల నేర్పుతున్న క్రీడాగురువు సమక్షంలో.

'ఆచార్యా, నన్ను రక్షించండి నేను తప్పు చేశాను' చాణక్యుడి ముందు సాష్టాంగపడి వేడుకున్నాడు అంభి.

'గాంధార రాజా, లే. నువ్వు తప్పు చేశావని నాకు తెలియదు. నేను సర్వాంతర్యామి నని, సర్వజ్ఞుణ్ణని పొరబడుతున్నావు!' చాణక్యుడు వేళాకోళంగా అన్నాడు. యువకుడైన రాజు లేచి నిలబడ్డాడు. వినయంగా చేతులు జోడించి ఇలా అన్నాడు, 'నేను అస్సలు అలెగ్జాండర్‌కి స్నేహహస్తాన్ని అందించకుండా ఉండాల్సింది. దాని మూలంగా నాకు లాభించింది నా వాళ్ళ ఆగ్రహం. పురుషోత్తముణ్ణి ఓడించినా ఫలితం లేకపోయింది. పురుషోత్తముడిని సామంతుడిగా చేసుకున్నాడు అలెగ్జాండర్. తన రాజ్యాన్ని నాకీయకుండా'.

'గాంధార అంభి ఆశలకు సరిపడేంత పెద్దది కాదా?' చాణక్యుడు ధూర్తంగా, మెరిసేకళ్ళతో అడిగాడు.

'సరిపోతుంది. కాని పురుషోత్తముడు, నేను, అలెగ్జాండర్ ముందు సమానమంటే నాకు మండుతోంది. మేమిద్దరం అతని సామంతులం. నా ప్రజలు చుక్క రక్తం ధారపోయకుండా నేను సంపాదించిన బిరుదు, వేలాది మంది ప్రజలు చనిపోయిన తరువాత పురుషోత్తముడు పొందిన బిరుదు ఒకటే. అయినాగాని, చరిత్ర అతడిని సాహసి అంటుంది నన్ను పిరికివాణ్ణని అంటుంది!' నిస్సహాయంగా అన్నాడు అంభి.

చాణక్యుడు దొంగ చిరునవ్వు నవ్వుతూ, 'రాజా, చాణక్యుడు నీకేం చేయగలడు?'

'మీ సలహా కావాలి ఆచార్యా, మీరు నా పక్షాన ఉండాలి. మాసిడోనియాకు వ్యతిరేకంగా మీరు తయారుచేస్తున్న బలగాలకు నా మాజీ సేనాని శిక్షణ నిస్తున్నాడని నాకు తెలుసు. దానికి నేనేమీ అనుకోవడం లేదు. చంద్రగుప్తుణ్ణి మగధకు రాజుని చేయాలని శిక్షణ ఇస్తున్నారని కూడా నాకు తెలుసు. దానిక్కూడా నాకేమీ అభ్యంతరం లేదు. నాక్కావలసినదల్లా మీ మార్గదర్శకత్వం, వివేకపూర్ణమైన మీ సలహా, వాటితో గాంధారను ఆర్థికంగా, రాజకీయంగా బలంగా, స్థిరంగా ఉంచగలను', అని వేడుకున్నాడు అంభి.

'దానికి ఏం చేయాల్సి ఉంటుంది?' చాణక్యుడు జాగ్రత్తగా అడిగాడు.

'మీరు నా రాజగురువుగా – రాజ సలహాదారుగా ఉండాలి. నా ప్రాసాదం పక్కనే నివసించాలి. రాజగురువు కోసం మంచి భవనాన్ని నిర్మించాను. మీరు; మీ శిష్యులు అక్కడుండాలని నేను కోరుతున్నాను. మీకు కోరినవన్నీ ఇస్తాను. జాగ్రత్తగా చూసుకుంటాను. ఆచార్యా, మీరా ఇంటిని పావనం చెయ్యాలి. మీరక్కడ ఉంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు నేను మీ సలహా తీసుకోగలుగుతాను' అంభి వేడుకున్నాడు.

'రాజా, నేను బీద బ్రాహ్మణుణ్ణి. ప్రాసాదాలు, భవనాలు నాకెందుకు? అటువంటి విశాల భవనాలు నాకు అసౌకర్యంగా ఉంటాయి!' పేదరికాన్ని అనుభవించడానికి ఒక కాలు, చెయ్యి పోగొట్టుకొనాల్సి వచ్చిందని తెలిసినా ఆయన నిరాసక్తంగా వ్యాఖ్యానించాడు. కన్నీళ్ళతో అంభి మళ్ళీ చాణక్యుడి ముందు సాష్టాంగ పడ్డాడు.

'ఆచార్యా, దయచేసి ఒప్పుకోండి. రాజకీయారణ్యంలో నన్నొక్కడినే వదిలి వేయవద్దు. నా గురువుగా ఉండండి. మీరంగీకరించే వరకు నేను వెళ్ళను!'

'అంభీ, నిజంగా నువ్వు బాగా నచ్చచెప్పగలవు. నేను అంగీకరిస్తాను గాని, ఒక షరతు', అన్నాడు చాణక్యుడు.

సాష్టాంగపడి ఉన్న తలను విచిత్రంగా పైకెత్తి 'ఏమిటది?' అనడిగాడు. 'ఒకవేళ మంచి నక్షత్రాలు లేకపోతే, ఆ హెూదా విడిచిపెట్టడానికి నువ్వు అనుమతించాలి', అన్నాడు బ్రాహ్మణుడు. కొత్త రాజగురువుని వాస్తు నిపుణుడితో వచ్చి తన అధికారిక నివాసాన్ని చూసుకొని వ్యక్తిగత అవసరాలకు తగిన విధంగా మార్పులు చేయించుకొమ్మని అంభి వేడుకున్నాడు. చాణక్యుడి కోసం అంభి నిర్మించిన భవంతి గాలి, వెలుతురు వచ్చే గదులు, ఎత్తైన పై కప్పు, నున్నని రాళ్ళు, బలమైన దూలాలతో చాలా విశాలంగా ఉంది. విశాలమైన ఆవరణలో సెలయేటి ఒడ్డున నిర్మించారు. ఉద్యానవనం నిండా అడవిపూల చెట్లు, పండ్ల వృక్షాలున్నాయి. గాలితో పాటుగా పూల సుగంధం కిటికీలు, తలుపులుగుండా భవనంలోకి వ్యాపిస్తుంది.

చాణక్యుడు ఆవరణంతా తన శిష్యులు చంద్రగుప్తుడు, సింహారణ్, మిహిర్, శారంగరావులను తీసుకొని తిరిగాడు. శిష్యులకి విసుగు వచ్చింది. ఆ ధూర్తుడు అంభి చూపించిన ప్రలోభాలకి తమ గురువు ఎందుకు లొంగాలి? తన ఆత్మని అలెగ్జాండర్‌కు అమ్మేసిన ద్రోహితో కలిసి ఉండాలని ఎలా అనుకున్నాడు? వాస్తు నిపుణుడు ఒక గది నుంచి మరొక గదికి వారిని తీసుకొని వెళుతూ చూపిస్తున్నాడు. కాని వాళ్ళు మాత్రం తామిక్కడేం చేస్తున్నామని లోలోన ఆశ్చర్యపోతున్నారు. చాణక్యుడు మాత్రం ఆ భవంతి వైభవానికి బాగానే ముగ్ధుడైనట్లు కనిపించాడు. చెక్క తలుపులపైన, కిటికీలపైన చేతితో తడుముతూ, కిందపరచిన బండల నునుపుదనానికి ఆశ్చర్యపడుతూ వాటి మీద పడుకుని మేస్త్రీల నిపుణతను కొనియాడాడు. అంతా తిరిగి చూసిన తర్వాత, తన శిష్యులతో మరుసటి రోజు వచ్చి ఉంటానని చెప్పాడు వాస్తు నిపుణుడికి. అంభి పంపిన రాచరథాలను ఎక్కి ఆశ్రమానికి బయలుదేరారు.

'ఆచార్యా, ఏం చేస్తున్నారు మీరు? మనం ఇక్కడ ఉండలేం – అని మొదలుపెట్టాడు చంద్రగుప్తుడు. ఒంటరిగా మాట్లాడే అవకాశం వచ్చేవరకూ నోరు మెదపద్దు అన్నట్లుగా చాణక్యుడు సైగ చేయడంతో ఆగిపోయాడు.

చాణక్యుడి నిరాడంబరమైన కుటీరంలో అనాకారి బ్రాహ్మణుడిలా అన్నాడు. 'సింహరణ్, నువ్వీరోజు రాత్రి ఆ ఇంటిని తగలబెట్టాలి జాగ్రత్త. తగలబెట్టింది నువ్వని ఎవరికీ తెలియకూడదు'.

'కాని ఎందుకు –' సింహరణ్ ఏదో అనబోయాడు.

చంద్రగుప్తుడు మధ్యలో కల్పించుకొని, 'ఆచార్యా, మీరలా అనడానికి కారణముందని నాకర్థమైంది. ఆ పని చేస్తాం. కాని ఎందుకలా చేయాలో చెప్పండి' అన్నాడు.

'నాయనా చంద్రగుప్తా, పాములాంటి అంభి అబద్ధాలకు నేను మోసపోలేదు. ఆ ధూర్తుడు నన్ను నాశనం చేయగలననుకుంటున్నాడు. వాస్తవమేమిటంటే, తన మాజీ సేనానితో శిక్షణ ఇప్పిస్తూ సైన్యాన్ని తన రాజ్యంలోనే ఉంచుతూ దాన్ని పోషిస్తూ నేనిక్కడ ఉండడం వాడికిష్టం లేదు' అని బుసకొట్టాడు చాణక్యుడు.

'మరి రాజగురువుగా ఉండడం ఇష్టంలేదని చెప్పేస్తే పోలా? నివాసం మార్చకండి. తగలబెట్టడం ఎందుకు?' మిహిర్ అడిగాడు.

'ఆ చోటు మందుగుండు పాతర. అక్కడ పడుకోగానే రాతి పనితనం బాగా నచ్చిందనుకున్నారు కదా? నిజానికి నేను నేల సందుల్లోంచి అన్నాన్ని తీసికెళుతున్న చీమల బారుని అక్కడ చూశాను. తలుపులు, కిటికీలు పట్టుకొని చూస్తుంటే వాటి నునుపుదనాన్ని చూస్తున్నాననుకొన్నారు మీరు కాని నేను లక్కని చూస్తున్నాను', నవ్వాడు బ్రాహ్మణుడు, వాళ్ళ ముఖాల్లో అయోమయాన్ని చూస్తూ.

చివరికి 'వివరణ కావాలా?' అని అడిగాడు. వాళ్ల సమాధానం వినకుండానే ఇవ్వడం మొదలుపెట్టాడు. 'ఎవరూ నివసించని ఇంట్లో నేల పగుళ్ళలో నుంచి చీమలు అన్నాన్ని తీసుకెళుతున్నాయంటే నేల కింద ఉడికిన ఆహారం ఉందని అర్థం. ఆహారం ఉందంటే మనుషులున్నట్లే కదా. ఆ ఇంటిలో రహస్యంగా నేల కింద గది ఉంది. దానిలో సైన్యం ఉందని నాకర్థమైంది. వాళ్ళు మన రాకకోసం నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్నారు. మనం నిద్రపోతున్నపుడు దాడి చేస్తారు. అంభి ఆకస్మికంగా దాడి చేసి మనల్ని చంపేసేవాడు!'

చంద్రగుప్తుడు ఆశ్చర్యపోయాడు. 'తలుపులు, కిటికీలను అంత శ్రద్ధగా ఎందుకు పరిశీలించారు?' అని అడిగాడు.

అతని గురువు సమాధానమిచ్చాడు, 'అవి లక్కతో చేసినవి' తన సమాధానం వాళ్ళ సందేహం తీర్చలేదని గ్రహించి, మళ్ళీ చెప్పసాగాడు. 'చిన్న పురుగు స్రవించే స్రావం లక్క. చిన్నగా గుండ్రంగా ఉండే ఆడ పురుగు చెట్ల కొమ్మలు, రెమ్మల మీద ఉంటుంది. తన స్రావాలతో కట్టిన గూడులో. ఇవి సాధారణంగా కుసుమ చెట్లపై ఉంటాయి. రెమ్మలతో పాటుగా వీటిని సేకరించి వేడినీటిలో వేస్తే లక్క వస్తుంది. దీన్ని లక్క అని ఎందుకంటారంటే లక్షలాది - వందలవేల పురుగుల్ని పోగుచేస్తే తప్ప ఒక్క పౌండు లక్క రాదు. దీన్ని తలుపులకు, కిటికీలకు రాస్తే నునుపుగా ఉంటాయి - నాకు చాలా నచ్చాయని మీరనుకున్నది! లక్కతో సమస్యేమిటంటే ఇది త్వరగా మండుతుంది. ఆ ఇంటికి యాదృచ్ఛికంగా కొంచెం వేడి తగిలిందంటే అగ్ని గుండం అవుతుంది. బహుశా అంభి ఉద్దేశం ఇదే కావచ్చు - దాగి ఉన్న సైనికులతో మనల్ని చంపి, ఇంటికి నిప్పంటిస్తే మనం అగ్నిప్రమాదం జరిగి చనిపోయామనుకుంటారని భావించి ఉంటాడు. అందుకే సింహరణ్, అంభి మనుషులు దానిలో ఉండగానే దాన్ని కాల్చెయ్యమంటున్నాను ఇవాళ రాత్రికే!'

చాణక్యుడు దండాయన ఋషి కుటీరంలో ఉన్నాడు. తనని అక్కడ ఉండనీయమని ఆచార్యుడు ఋషిని కోరాడు. ఋషి కూడా తనకు తోడు దొరికిందని సంతోషించాడు. కొన్నాళ్ళ తర్వాత అంభి వచ్చాడు ఆయనను చూడడానికి. 'అంభీ, కుమారా, నా కోసం కట్టిన అధికారిక నివాసం కాలిపోవడం వల్ల నా నక్షత్రాలు బాగా లేవని దైవిక సందేశం అందింది. నేను నీకు రాజగురువుగా ఉండకూడదు. నా జాతకం బాగా లేదు, నాతో పాటు గాంధారకు చెడు జరగరాదని నేననుకుంటున్నాను. నాకన్న సమర్థులైన మరెవరినైనా నువ్వు పొందగలవని నాకనిపిస్తోంది', అన్నాడు మృదువుగా.

అంభి స్పందిస్తాడమోనని చూశాడు. అంభి లోలోపల రేగుతున్న ఆగ్రహాన్ని ఆయన గ్రహించాడు. అంభి తన ఆగ్రహాన్ని ఏమాత్రం పైకి కనిపించనీయలేదు. 'ఆచార్యా, ఇది నాకు జరిగిన నష్టం. మీరు తక్షశిలలోనే ఉంటారని ఆశిస్తాను. నేను ఎప్పటికప్పుడు మీ సలహా తీసుకొంటాను' అన్నాడు అంభి.

'తరవాతెప్పుడో నన్ను చంపుతావు', అనుకున్నాడు చాణక్యుడు. 'తప్పకుండా.

నీకు సాయం చేయడానికి నేనెప్పుడూ అందుబాటులో ఉంటాను, రాజా. నన్ను పిలిపించడానికి ఎన్నడూ సంకోచించవద్దు' అబద్ధమాడాడు చాణక్యుడు.

అంభి వెళ్ళగానే, చంద్రగుప్తుడడిగాడు 'ఇప్పుడేం చేద్దాం ఆచార్యా? అలెగ్జాండర్ సేనలు తిరుగుముఖం పట్టాయి. యుద్ధం చేయడానికి ప్రణాళిక వేద్దామా?' చాణక్యుడు ఒక క్షణం ఆగి, కుటిలంగా, యుద్ధం చేసే పని నాకొదిలిపెట్టు, చంద్రగుప్తా. నువ్వు నీ దృష్టినంతా ప్రేమించడం మీద పెట్టాలి!' అన్నాడు.

ఆమె ఎల్లప్పుడూ నిరాడంబరంగా, హుందాగా ఉండే వస్త్రాలు ధరిస్తుంది - పాదాల వరకూ వేలాడే, చేతులు లేని గౌను వేసుకుంది. తేలికపాటి చెప్పులు, బంగారు వర్ణంలోని పొడవైన జుట్టును నలుచదరపు రంధ్రాలున్న వలతో పైకి కట్టింది. వజ్రాల కిరీటం ఉంది దానిపైన. కిరీటం, చెవిదుద్దులు తప్ప ఆమె మరే నగలు పెట్టుకోలేదు. రాచరిక ఆభరణాలు లేకపోవడం కూడా ఆమె అందాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. శరీరఛాయ బంగారు కాంతులీనే తెలుపు. మృదువైన చేతులు, అందమైన భుజాలు చేతులు లేని గౌనులోంచి అందంగా కనిపిస్తున్నాయి. కళ్ళు స్వచ్ఛమైన నీలి సముద్రాల్లా, ఆ నీటిలా గాఢంగా ఉన్నాయి. నాజూకైన ముఖం, పెదవులు, సూటిగా ఉన్న ముక్కు, తీరైన బుగ్గలు ప్రలోభమూ, అమాయకత్వాలు చక్కగా మేళవించినట్టుగా ఉన్నాయి. ఆమె పేరు కార్నీలియా, భారతదేశంలో శక్తిమంతమైన రెండోవ్యక్తి సెల్యూకస్ కూతురు ఆమె.

అత్యంత శక్తిమంతుడు అలెగ్జాండర్, నమ్మకస్థుడైన సేనాని సెల్యూకస్‌ను తన ప్రతినిధిగా ఆసియా ప్రాంతాల్లో ఉంచి ఇంటికి వెళ్ళిపోవాలనుకుంటున్నాడు. ఉత్తర మాసిడోనియాలో జన్మించిన సెల్యూకస్‌కు అతని తల్లి అతని కన్నతండ్రి అపోలో దేవుడని చెప్పింది. అతను లంగరు గుర్తు ఉన్న ఉంగరాన్ని', ఇచ్చి దానిని కొడుకు యుక్త వయస్కుడైన తర్వాత ఇమ్మని చెప్పాడని చెప్పింది. అదే లంగరు గుర్తు సెల్యూకస్ తొడ మీద కూడా పుట్టుమచ్చలా ఉంది. అతనికి ఉంగరమిస్తూ' అలెగ్జాండర్‌తో వెళ్ళి పర్షియన్లతో పోరాడు. నిన్ను నికెటర్ - విజేత అంటారు!' అని చెప్పింది.

అతడు యుద్ధంలోనే కాక, ప్రేమలోనూ విజేత అయ్యాడు. అలెగ్జాండర్ పర్షియాను గెలవడానికి సాయం చేసి, సెల్యూకస్ పర్షియా కులీనుడి కూతురైన అపామను వివాహం చేసుకున్నాడు.

అలెగ్జాండరు కూడా దరియస్-3 కూతురుని వివాహం చేసుకున్నాడు. వివాహం కాకముందు అపామకు, సెల్యూకస్‌కు పుట్టిన అక్రమ సంతానం కొడుకు. వాళ్ళ పెళ్ళి తర్వాత కూతురు పుట్టింది. తన తల్లిదండ్రులకు సక్రమ సంతానంగా పుట్టినందుకు కార్నీలియా కృతజ్ఞురాలిగా భావించింది.

రాజుగారి అతిథిగా కార్నీలియా తక్షశిలలో ఉంటోంది. ఆమె గ్రీకు దేశంలో పుట్టినా తక్షశిలలోనే ఆమెకు బాగుంది. రోజూ ఉదయమే ఆమె దండాయనముని ఆశ్రమానికి యోగ నేర్చుకోవడానికి వస్తుంది. మాసిడోనియా భటులు భయంతో ఆమెను అనుసరించి వెంటే వస్తారు. ఆమెకేమైనా జరిగితే సెల్యూకస్ తమ వృషణాలను కత్తిరించి పారేస్తాడని వారి భయం.

నిరాడంబరంగా జీవించే ఆ మహాయోగిని చూసి, ఆయనతో పాటు నివసిస్తున్న చాణక్యుడిని ఇలా అడిగింది, 'భారతదేశంలో సన్యాసానికి ఎందుకంత ప్రాముఖ్యం? దండాయన ఋషి ఎండకి, చలికి, వానకి రక్షణ లేకుండా అడవిలో ఉంటారు. అయినా ప్రశాంతంగా ఉంటారు. మాసిడోనియా వాసులమైన మేము విలువనిచ్చే అధికారాన్ని, సంపదని త్యాగం చేశారు.'

చాణక్యుడు హృదయపూర్వకంగా నవ్వాడు, అయోమయంలో ఉన్న కార్నీలియాను వికృతంగా ఉన్న తన పళ్ళతో భయపెడుతున్నట్టుగా. ఆయన నవ్వు ఆగగానే ఇలా అన్నాడు. 'శ్రీరాముడు తన రాజ్యాన్ని పరిత్యజించి దేశంలోనే శక్తిమంతుడైన రాజయ్యాడు. బుద్ధుడు రాజ్యాన్ని త్యజించాడు. ప్రపంచం మొత్తం ఆయనకు పాదాక్రాంతమైంది. కార్నీలియా, అమాయక బాలికా, పరిత్యజించడం అంటే అధికారాన్ని వద్దనుకోవడం కాదు. అదే అధికారానికి దారి!"

చంద్రగుప్తుడు దండాయనుడి కుటీరం వైపు వేగంగా వస్తూ ఆమె చాణక్యుడితో మాట్లాడడం చూశాడు. ఆమె దేవతలా ఉంది అనుకున్నాడు తనలో తాను. ఆ అమ్మాయిని ప్రేమలో పడెయ్యమని గురువుగారు చెప్పినపుడు అతనికి చాలా కోపం వచ్చింది. తనేంటి? అమ్మాయిల వెంటపడేవాడా? జీవితమంతా రాచరికం కోసం ఎందుకు శిక్షణ పొందాడు? గౌనులో ఉన్న మాసిడోనియా అమ్మాయి వెంట పడడానికా? కాని ఇప్పుడు అతను ఆకర్షితుడయ్యాడు బాగా. ఈ రాకుమారి కన్న అందమైన వారెవరూ ఉండరు అనుకున్నాడు.

'ఓ! చంద్రగుప్తా వచ్చావా, రా' అని పిలిచాడు చాణక్యుడు కావాలని చంద్రగుప్తుణ్ణి సంభాషణలోకి లాగుతూ. 'ఈమె కార్నీలియా. గౌరవనీయులైన సెల్యూకస్ గారి కుమార్తె.

దండాయన మహర్షి దగ్గర యోగ నేర్చుకోవాలని వచ్చింది. దురదృష్టవశాత్తు ఆమె పాఠాలకు మేము పరిత్యాగం గురించి చేసే చర్చల వల్ల అంతరాయం కలుగుతూ ఉంటుంది', అన్నాడు.

చంద్రగుప్తుడు ఆత్మవిశ్వాసంతో వారి దగ్గరకు వెళ్ళాడు 'కార్నీలియా అధికార త్యాగం గురించి చెప్పేవారు కాదు నా గురువు. కాని ఆయన పరిత్యాగానికున్న శక్తిని గురించి చెప్పగలరు ఖచ్చితంగా!' అన్నాడు. చాణక్యుడు కావాలనే చంద్రగుప్తుడి కోసం ఈ చమత్కార వాక్యాన్ని తయారుచేశాడు ముందుగానే. అలాగైతే చంద్రగుప్తుడు మొదటిసారే మంచి అభిప్రాయం కలిగిస్తాడని.

చంద్రగుప్తుడు మంచి వస్త్రాలు ధరించి వచ్చాడు, కొన్నిటిని సింహరణ్ దగ్గర కూడా తీసుకున్నాడు. మంచి వంకాయరంగు ధోతి కట్టుకున్నాడు. నీలం పట్టు ఉత్తరీయాన్ని భుజాలపై వేసుకున్నాడు. మెడలో పెద్ద ముత్యాలహారం వేసుకున్నాడు. బంగారు చెవిరింగులు అతని చెంపలను మించి, అతని దయాహృదయాన్ని, మృదువైన ముఖాన్ని, వ్యక్తం చేస్తున్నాయి. యోధుడి మీసాలు మినహా గడ్డం శుభ్రంగా ఉంది. నల్లని పొడవైన జుట్టు భుజాల మీదకు వాలి ఉంది. బంగారు భుజకీర్తులు ధరించి ఉన్నాడు. రాజ్యం లేకపోయినా అచ్చం రాజకుమారుడిలా ఉన్నాడతడు.

కార్నీలియా చిరునవ్వు నవ్వింది. చంద్రగుప్తుడు పులకించిపోయాడు. చాణక్యుడు భుజాలెగరేశాడు. బండిపట్టాలపై కెక్కిందని అతను గ్రహించాడు. ప్రేమ అన్నిటినీ జయిస్తుంది. తన బాల్య ప్రేమికురాలు సువాసిని గుర్తు వచ్చింది. సమయం వచ్చిందని నిర్ణయించుకున్నాడు.

దండాయనుడి ఆశ్రమం బయట తన శిష్యులు వెదురుతో అటకల్లా కట్టిన ఎత్తైన జాలీలవైపు నడిచాడు. అక్కడికి వెళ్ళగానే రెక్కల చప్పుడు, పక్షుల అరుపులు ఆహ్వానించాయతడిని. వాటి శిక్షకుడు పరిగెత్తుకుంటూ వచ్చి ఆచార్యుడికి నమస్కరించాడు.

'సిద్ధార్థకా, పావురాలు ఈ రోజు బాగున్నాయా?' మామూలుగా అడిగాడు చాణక్యుడు.

'బాగున్నాయి, అయ్యా. వాటికి మేత వేసి నీళ్ళు పెట్టాను. వ్యాయామం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాయి' అని సమాధానమిచ్చాడు సిద్ధార్థకుడు ఆచార్యుడి నుంచి

దారానికి కట్టిన చిన్న గొట్టాన్ని తీసుకుంటూ. అతను ద్వారం దగ్గర వేలాడుతున్న తాడుని కొంచెం లాగగానే ఒక గూడు తలుపు తెరుచుకుంది. తెల్లని అందమైన పావురం వచ్చి తోలు కప్పి ఉన్న అతని చేతి మీద వాలింది. ఆ పక్షి నూటపదకొండు యోజనాల దూరం ప్రయాణం చేసింది. దాని వేగం ముహూర్తానికి అయిదు యోజనాలపైనే. విశ్రాంతి లేకుండా చాలా యోజనాలు ఎగురుతూ వెళ్ళగలదు.

శిక్షణనివ్వడం కీలకమైనది. ఈ శాస్త్రంలో సిద్ధార్థకుడు నిష్ణాతుడు. ప్రతి పక్షిని వెదురు పంజరంలో పెట్టి ఇంటికి దూరంగా తీసుకెళ్ళి విడిచిపెడతారు రోజూ. పక్షి భూ అయస్కాంత శక్తిని గుర్తిస్తూ మళ్ళీ ఇంటికి ఎగురుతూ వచ్చేస్తుంది. వీటిని 'పెంపుడు పావురాలు' అంటారు - ఎందుకంటే వాటిని ఎంత దూరంలో వదిలిపెట్టినా వెళ్ళిన దారిలో మళ్ళీ వచ్చేస్తాయి. మార్గంలో శిక్షకులని ఉంచుతూ రోజూ దూరం పెంచుతూ పోతారు. దీనితో పక్షులకు ఎగిరేశక్తి, ప్రయాణించే దూరం పెరుగుతూంటాయి. సిద్ధార్థకుడి పావురాలు బలంగా ఎగరగలవు, ఎదురుగాలిలో కూడా. అతని పక్షులు మనుషుల కన్నా స్పష్టంగా ఎక్కువ దూరం వరకూ చూడగలుగుతాయి. అవి సున్నితంగా కనిపించినా, వాటికి సహనం ఎక్కువ. ఆకాశంలో సుదూరం ప్రయాణించగలిగే విధంగా వాటికి శిక్షణనిచ్చాడు.

సిద్ధార్థకుడు నిపుణంగా పక్షి ఎడమ కాలికి చాణక్యుడు ఇచ్చిన గొట్టాన్ని కట్టి ఈల వేశాడు. బలంగా రెక్కలల్లారుస్తూ పక్షి గాల్లోకి ఎగిరింది, కొంతసేపు గాలిలో చుట్టూ తిరుగుతూ ఉండి తర్వాత తన గమ్యం వేపు ప్రయాణించడం మొదలుపెట్టింది - ఇప్పుడు పాటలీపుత్రానికి, అక్కడ జీవసిద్ధి నిరీక్షిస్తున్నాడు.

## పదో అధ్యాయం

# వర్తమానం

దుర్గంధం వస్తున్న జైలు గదిలో రిపోర్టర్ నెలపైగా ఉన్నాడు. అతని బెయిలు దరఖాస్తులు సబ్‌జ్యుడీషియల్ డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు ముందుకొస్తున్నాయి కాని వాటిని కనీసం వినకుండా తిరస్కరించడం జరుగుతూ ఉంది.

అతని తలనిండా పేలుపడ్డాయి. రాత్రంతా కుట్టే పురుగులవల్ల చర్మం ఎర్రబడి దద్దుర్లెక్కింది. ఎడమ చెవిని ఎలుక కొరకడంతో జైలు డాక్టరు కట్టుకట్టాడు. అతను బాగా బరువు తగ్గాడు. బుగ్గలు పీక్కుపోయాయి. ముఖంలో కళాకాంతీ లేకుండా అలసట. కళ్ళు నిర్జీవంగా ఉన్నాయి. ఘోరంగా ఉన్న జైలు ఆహారం వల్ల డయేరియా వచ్చి శరీరంలో నీరు తగ్గిపోయింది. పప్పులో బొద్దింక వచ్చింది. ఫిర్యాదు చేస్తే, వార్డెన్ జోక్ చేశాడు, 'ష్! బిగ్గరగా అనకు. నీ సెల్‌లో వాళ్ళు విన్నారంటే, వాళ్ళూ మాంసాహారం కావాలని గోల చేస్తారు'.

నల్లగా, జుట్టుకి బాగా నూనె రాసుకుని తనని చూడడానికి వచ్చిన సందర్శకుడిని చూస్తే కుతూహలం కలిగింది. అతని సమక్షంతోనే ద్వారాలు తెరుచుకున్నట్టుగా, గౌరవం లభిస్తున్నట్టుగా అనిపించింది. వార్డెన్ ఆఫీసులో ఎదురెదురుగా కూర్చున్నారిద్దరూ. చక్కెర వేసిన టీ ఇచ్చారు. టీ బోయ్ వచ్చి రెండు గ్లాసుల్లో వాళ్ళ ముందు టీ పెట్టి వెళ్ళిపోయాడు.

'నేను నీ సమస్యలన్నీ పోగొట్టేయగలను', చెప్పాడు మీనన్.

'మీరెవరు?' ఖైదీ అడిగాడు.

'అదంత ముఖ్యం కాదు. నువ్వు చాలా తెలివైన వాడివి. ఇక్కడెందుకున్నావో నీకు తెలుసు – నువ్వు చాలా అల్లరివాడివి!' అతను మందలించాడు. అల్లరి పిల్లవాడిని చూపుడు వేలు చూపిస్తూ మందలించే హెడ్‌మాస్టరులా.

'ఆ లంజాకొడుకు గంగాసాగర్ నన్ను ఆపాలనుకుంటున్నాడు కదా? తన పవిత్రమైన చిన్న బార్బీ బొమ్మని అంటుకోవద్దంటున్నాడా? ఆమేమీ అంత పవిత్రురాలేం కాదు!' ఎర్రటి కళ్ళు తిరస్కారంతో మండుతుండగా గట్టిగా అన్నాడు.

మీనన్ శాంతంగా అన్నాడు, 'అబ్బాయ్, నువ్వు నాతో మర్యాదగా ఉంటే, నీతో అంతకన్న ఉదారంగా ఉంటాను. నువ్వు మీడియా వేట నుంచి తప్పుకోవాలి. అంతకన్న రంజుగా ఉండే కథ నీకు నేను చెప్పాననుకో అప్పుడేం చేస్తావు'?

'చెప్పు. వింటున్నాను', రిపోర్టర్ అంతగా కుతూహలం కనపరచకుండా అన్నాడు కాని అతను శ్రద్ధగా వింటాడని మీనన్‌కి అర్థమైంది.

'ఈ దేశ ప్రధానికి అత్యంత సన్నిహితమైన సలహాదారు ఉన్నారని నీకు తెలుసా?'

'ఆయన పార్టీలో జనరల్ సెక్రటరీనా?'

'కాదు'

'భారతదేశ ఆర్థికమంత్రా?'

'కాదు'.

'భారతదేశ హోం మినిస్టరా?'

'కాదు'

'అయితే మరెవరు?'

'ఆమె ప్రతినెలా ఆయనింటికి వస్తుంది. ఆమె సందర్శన రికార్డులో నమోదు అవదు. – సందర్శకుల పుస్తకంలో కాని ప్రధాని డైరీలో కాని రాయరు'.

'ఆయనకి ఉంపుడుగత్తె ఉందా?'

'నా తెలివైన స్నేహితుడా, మెదడుపయోగించు. ఒకవేళ ఉంపుడుగత్తె ఉన్నా, అధికారిక నివాసంలో ఆమెతో పడుకుంటాడా?'

'అయితే ఎవరు?'

'ఆమెని అందరూ సాధ్వి అంటారు. అన్ని ప్రధాన నిర్ణయాలలో ఆమెని సంప్రదిస్తాడు'.

'మీరు నన్నేం చేయమంటున్నారు?'

'ఆమె గురించి నాకు సమాచారం కావాలి'.

'నా ముక్కు పోలీసుకుక్క లాంటిది. అది ఎక్కడున్నా, దేన్నైనా వాసన పట్టగలదు. అయినా నేనెందుకు సాయం చెయ్యాలి?'

'మరో పది నిముషాలలో నువ్వు విడుదలైపోవచ్చు. చక్కటి స్నానం, మంచి భోజనం, పక్కలో ఆడది ఉంటే ఎట్లా ఉంటుందో ఆలోచించుకో!'

'సరిపోదు. ఇంకా ఇవ్వాలి' గొణిగాడు రిపోర్టర్, ఇంకా బేరమాడుతూనే కాని ఒప్పుకున్నట్టుగా ఉన్నాడు, అయినా ఇంకా ఏం దొరుకుతుందో అన్నట్టుగా.

'నీ జీవితంలోనే అతి పెద్ద స్టింగ్ ఆపరేషన్‌కి నేనేర్పాటు చేస్తే?' మీనన్ శాంతంగా సూచించాడు.

'ఆమెకి చాలా ఆశలున్నాయి–' అతను ఆరంభించాడు.

'భవిష్యత్తు గురించి ఆసక్తి లేదు' చెప్పాడు మీనన్.

'సాధ్వి దాదాపుగా వారానికోసారి అతన్ని కలుస్తుంది–' అతను చెప్పాడు.

'వర్తమానంపై ఆసక్తి లేదు' చెప్పాడు మీనన్.

'మరి నీకు దేనిమీద ఆసక్తి?' అడిగాడు రిపోర్టర్.

'ఆమె గతం'.

'తీగలాగితే డొంక కదిలింది', రిపోర్టర్ ఉత్తేజంగా అన్నాడు.

'చెప్పు', అన్నాడు మీనన్ శాంతంగా.

'మన ప్రధాని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒకావిడ ఆయన దగ్గరకి వచ్చేది. తరచుగా అర్ధరాత్రులు'.

'పెద్దపనే వ్యాపారస్థులతో, రాజకీయ నాయకులతో పడుకున్న ఆడాళ్ళని వెతకాలంటే ప్రపంచమంతా చుట్టి రావాల్సిందే'.

'ఈ చివర్నుంచి ఆ చివరికి వెతికితే చాలా అలసిపోతావు' జోక్ చేశాడు రిపోర్టర్.

మీనన్ జోక్‌ని పట్టించుకోలేదు. రిపోర్టర్ గొంతు సవరించుకొని కొనసాగించాడు. 'ఈవిడ చాలా అందగత్తె అతన్ని కలుస్తూండేది, ఒక రోజు అదృశ్యమైపోయింది. పుఫ్! కనిపించలేదు'.

'అయితే?'

'ఆవిడే మళ్ళీ రెండు నెలల తరువాత గర్భవతిగా హిందూ ఆశ్రమంలో కనిపించింది'.

'నీకెలా తెలుసు?'

'ముఖ్యమంత్రి – అంటే ఇప్పటి మన ప్రధాని – సిఫారసు మీద అనాథాశ్రమం ఆ గర్భవతిని చేర్చుకుంది'.

'మరి ఆమె ప్రసవించిందా?'

'ఆఁ ఆడపిల్లని'.

'తల్లీ బిడ్డలు ఏమయ్యారు?' హఠాత్తుగా మీనన్ చాలా కుతూహలం కనబరిచాడు.

'తల్లి బిడ్డని వదిలి వెళ్ళిపోయింది. పిల్లని ఆశ్రమానికి అనుబంధంగా ఉన్న సన్యాసినుల మఠం వాళ్ళు పెంచారు.'

'ఆ పిల్లకి, ప్రధానికి సంబంధం ఉందని చెప్పడానికేం ఆధారముంది?'

'వెళ్ళిపోయే హడావిడిలో తల్లి ఒక పోస్టుకార్డుని వదిలేసి వెళ్ళింది. అది తల్లీబిడ్డలు ఎలా ఉన్నారని అడుగుతూ తండ్రి రాసిన ఉత్తరం. తన కొడుక్కి మెడికల్ కాలేజీలో ప్రవేశానికి ఏర్పాట్లు చేయిస్తానని చెప్పగానే సంతోషంగా పురోహితుడు నాకీ విషయం చెప్పాడు.'

'మీనన్ మనసులో గుర్తుంచుకున్నాడు. ఏదైనా లాభం చేస్తామంటే చెయ్యాల్సిందే.'

'మరి?'

'ప్రధానమంత్రి. ఆయనే తండ్రి'

'అయితే సాధ్వి ఆయన అక్రమ సంతానమా?' గంగాసాగర్ నమ్మలేనట్లు అడిగాడు.

'ఆయనకి అప్పటికే పెళ్ళయింది. ముగ్గురు పిల్లలు, ముందంతా బంగారం లాంటి రాజకీయ భవిష్యత్తు – ఆమెని అంగీకరించలేకపోయాడు', సమాధానమిచ్చాడు మీనన్-

'కాని సాక్ష్యమెక్కడుంది?' అడిగాడు గంగాసాగర్.

'ఆ ముచ్చుమొహం రిపోర్టరు దగ్గర. తల్లీ బిడ్డల గురించి ఆరా తీస్తూ ప్రధాని రాసిన పోస్టు కార్డుంది'.

'కాని అదేం నమ్మదగిన సాక్ష్యం అనిపించదు', చెప్పాడు గంగాసాగర్, తర్వాత మళ్ళీ ఆలోచిస్తున్నట్లుగా, సంచలనానికి సరిపోతుంది. మరి ఈ పిల్ల – ఆమె సన్యాసిని అవ్వాలని తనంతట తనే అనుకుందా?'

'అవును. తండ్రీ కూతుర్లిద్దరూ ఎప్పుడూ తమ బంధుత్వం గురించి మాట్లాడరు. ఆమె అతన్ని 'బిడ్డా' అని పిలుస్తుంది. అదే జోక్'.

'మరి ఆయనేమని పిలుస్తాడామెని – తల్లీ అనా?'

'నిజంగానే, అలాగే పిలుస్తాడు'.

'నేనామెని కలవాల్సిన సమయం వచ్చింది', పేపరు కింద పెడుతూ గంగాసాగర్ అన్నాడు.

'ఆమెకేం చెబుతారు?' అడిగాడు మీనన్.

'ఢిల్లీలో అమ్మ పాలన ఉండాలంటే, ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన ఉండకూడదని చెబుతాను'.

'నీకు ఆదేశాలు వచ్చాయి, బిడ్డా', అంటూ ఆమె తన చేతిని అతని తలపై ఉంచి కళ్ళు మూసుకుని ప్రార్థించసాగింది. ఒక నిముషం తర్వాత కళ్ళు తెరిచి, 'ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించవద్దు'.

'కాని పూజ్యురాలైన తల్లీ –' ప్రధాని చెప్పబోయాడు.

ష్ష్! తన చేతిని ముందుకు చాచి ఆగమన్నట్టుగా సైగ చేసింది. 'నా దివ్య సందేశాలెప్పుడైనా తప్పయ్యాయా?' అడిగిందామె.

'లేదు', అతను ఏమనకుండా అంగీకరించాడు.

'అయితే నేను చెప్పినట్లు చెయ్యి!' ఆమె ఆదేశించింది.

'బాగుంది. పరిస్థితులు చేజారకుండా చేసి, రాష్ట్రపతి పాలన నివారించావు. మరి ఇప్పుడేం చేస్తావు?' అడిగారు అగర్వాల్.

'ముఖ్యమంత్రిని దిగిపొమ్మని, చాందినిని ముఖ్యమంత్రిగా అవనీయమని చెబుదాం', అన్నాడు గంగాసాగర్.

'మన ముఖ్యమంత్రికి మద్దతివ్వడానికి వాళ్ళు మనం అడిగినట్టుగానే, పోర్టుఫోలియోలు అడుగుతారు. ఒప్పందం ఏమీ లేకుండా ముఖ్యమంత్రి ఎలా దిగిపోతాడు?'

మాట్లాడే విషయాన్ని పూర్తిగా మార్చేస్తూ, 'మీనన్, నువ్వు ఆ పత్రికా పురుగుకి స్టింగ్ ఆపరేషన్ ఏదో ఇస్తానన్నావు కదా?' అడిగాడు గంగాసాగర్.

మీనన్ నవ్వాడు. 'ముఖ్యమంత్రిని సాగనంపాలనుకుంటున్నారు కాదా? అడిగాడతను. 'అలాగైతే కేబినెట్ పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉండదనా?'

'నాకు సుదీర్ఘ ప్రయాణాలు ఇష్టం – ప్రత్యేకించి నన్ను విసిగించేవాళ్ళు అలా చేస్తే మరీ ఇష్టం', చెప్పాడు గంగాసాగర్.

ముంబయి నుంచి వచ్చిన మనిషి మంచి బట్టలు వేసుకుని నీట్‌గా ఉన్నాడు. సౌమ్యంగా మృదువుగా మాట్లాడాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ చీఫ్ ఇంజనీరు ఇంటికి నల్లటి మెర్సిడెజ్ బెంజ్ కారులో వచ్చాడు. ఒక చేతిలో ఇంజనీరుగారి భార్య కోసం లిల్లీపూలు, మరోచేతిలో ఆయన పిల్లల కోసం స్విస్ చాక్లెట్లు, ఇంజనీరు కోసం ఖరీదైన మూంట్ బ్లాంక్ పెన్ తీసుకొచ్చాడు. చీఫ్ ఇంజనీర్ మేనల్లుడు కోరడంతో వారం ముందుగానే అపాయింట్‌మెంట్ నిర్ధారింపబడింది.

పరిచయాలు పూర్తవగానే, ముంబయి నుంచి వచ్చిన మనిషి ఇలా చెప్పాడు. 'ఇది చాలా బృహత్తరమైన ప్రాజెక్టు – ముఖ్యమైన రాష్ట్ర రహదారులను బాగుచేయడం, వెడల్పు చేయడం, నాలుగు కొత్త బైపాస్‌లు నిర్మించడం, మూడు ప్రధాన వంతెనలు కట్టడం. డబ్బెవరు పెడతారు?'

చీఫ్ ఇంజనీరు సమాధానమిచ్చాడు, 'సివిల్ వర్క్, సూపర్విజన్, ప్రాజెక్టు యాజమాన్య మద్దతు, కాంట్రాక్టుల సంప్రదింపు, భూసేకరణ, నగదు పరిహారాల మొత్తాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భరిస్తుంది. మిగతా రీసెటిల్మెంటు, పునరావాస ఖర్చులకు ప్రపంచ బ్యాంకు అప్పు తీసుకోవచ్చు'.

'అంటే మొత్తం ఖర్చంతా రాష్ట్ర ప్రభుత్వం గాని, ప్రపంచబ్యాంకుగాని భరిస్తుంది, రైట్?'

'అవును. కరెక్టే' చీఫ్ ఇంజనీర్ సమాధానమిచ్చాడు.

'మేము మా సొంతంగా లెక్కలు వేసి చూశాం. మొత్తం ఖర్చు దాదాపుగా ఒకటి పాయింట్ అయిదు బిలియన్లు ఉంటుంది', అన్నాడు ముంబయి మనిషి.

'ఓహెూ!'

'కాని దాన్ని మేం కావలిస్తే పెంచగలం లేదా తగ్గించగలం' మృదువుగా చెప్పాడు ముంబయి మనిషి. 'అందుకే నేనిక్కడకి వచ్చాను. ఖచ్చితంగా మీక్కావలసిన విధంగా మా బిడ్లు సమర్పించాలని మేమనుకుంటున్నాం.'

'దానికి మీరు ప్రధాన కార్యదర్శిని కలవాలి', చీఫ్ ఇంజనీర్ అన్నాడు.

'మీటింగ్ ఎప్పుడు పెట్టుకోగలం?' అడిగాడు చిరునవ్వుతో ముంబయి మనిషి.

మంచి బట్టలు వేసుకుని, నీట్‌గా ఉన్న, సౌమ్యంగా, మృదువుగా మాట్లాడే ముంబయి నుంచి వచ్చిన మనిషి లక్నో నిర్మాణ్ భవన్ ఆఫీసులో ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి నల్లటి మెర్సిడజ్ బెంజ్‌లో వచ్చాడు.

ఒక చేతిలో ప్రధాన కార్యదర్శి కోసం ట్యులిప్‌ల గుత్తి, ప్రధాన కార్యదర్శి ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కోసం మరోచేతిలో ప్లెయిన్ వెనిలా మాంట్‌బ్లాంక్ పెన్ ఉన్నాయి. చీఫ్ ఇంజనీర్ అభ్యర్థన మేరకు రెండు రోజుల ముందే అపాయింట్‌మెంట్ తీసుకున్నారు.

'మీకు తెలిసిందేగా – టెండరు ప్రక్రియ మూడు రకాలుగా జరుగుతుంది – పర్సంటేజిరేటుగాని, ఐటం రేటుగాని ఏకమొత్తంగా గాని. మొదటి పద్ధతిలో మేము ఖర్చులు అంచనా వేస్తాం మీరు మా అంచనాలకు పైన గాని, తక్కువగా కాని కోట్ చేస్తారు. రెండో విధానంలో మేం పరిమాణాల షెడ్యూలు ఇస్తాం. మీరు ఒక్కో ఐటం విడివిడిగా కోట్ చేస్తారు. మూడో పద్ధతిలో మేము నిర్దేశించిన పని చేయడానికి మొత్తం ప్రాజెక్టుకి ఎంత ఖర్చవుతుందో ఏకమొత్తంగా మీరు కోట్ చేస్తారు.

'మాకు వచ్చేలా మీరు దాన్ని ఎలా మారుస్తారు?' అడిగాడు ముంబయి మనిషి.

'మీకు ఆధారిత, అనుబంధ కంపెనీలున్నాయా?' ప్రధాన కార్యదర్శి అడిగాడు.

ఆ మనిషి తలూపాడు. 'చాలా'.

'అయితే ఈ రకంగా చేద్దాం. ప్రిక్వాలిఫికేషన్ బిడ్లు మీ నేపథ్యం, సాంకేతిక నిపుణత, ట్రాక్ రికార్డుల గురించి అడుగుతాయి. మీ ఆధారిత పరిశ్రమలు, అనుబంధ కంపెనీలు విడివిడిగా బిడ్ వేసేలా చూడండి?

'అదెలా ఉపయోగిస్తుంది?'

'ఈ దశలో మిగిలిన బిడ్డర్లను తీసేయడానికి గుణాత్మక కారణాలు చూస్తాం. ఒకే పార్టీని ఉంచితే వింతగా అనిపిస్తుంది. అందుకని మీరు అయిదారు ప్రిక్వాలిఫికేషన్ బిడ్లు వెయ్యండి'

'అంటే కమర్షియల్ బిడ్స్ వరకూ వచ్చేసరికి మేం ఒక్కళ్ళమే బిడ్డర్‌గా ఉంటామా?'

'అవును'

'దానికి మాకెంత ఖర్చవుతుంది?'

'మీరు మా ముఖ్యమంత్రిని కలవాలి దానికోసం' చెప్పాడు ప్రధాన కార్యదర్శి.

'మీటింగ్ ఎప్పుడు ఏర్పాటు చేసుకోగలం?' చిరునవ్వు నవ్వాడు ముంబయి మనిషి.

మంచి బట్టలు వేసుకున్న ముంబయి మనిషి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అధికారిక నివాసం కాళిదాస్ మార్గ్‌కి తన నల్లటి మెర్సిడజ్ బెంజ్‌లో వచ్చాడు. ఒక చేతిలో ముఖ్యమంత్రి కోసం ఆర్కిడ్లు, మరోచేతిలో ముఖ్యమంత్రి వ్యక్తిగత సహాయకుడి కోసం పదితులాలు – నూటపదహారు గ్రాములు–బంగారపు బిళ్ళ తెచ్చాడు.

ప్రధాన కార్యదర్శి కోరడంతో రెండు గంటల ముందే అపాయింట్‌మెంట్ ఖరారైంది.

'ప్రధాన కార్యదర్శితో అన్ని విషయాలు మాట్లాడారని తెలిసింది', అన్నాడు ముఖ్యమంత్రి కరచాలనం చేస్తూ.

'అవును. మీ ఆశీస్సుల కోసమే ఇక్కడికి వచ్చాను'.

'నా ఆశీస్సులు చాలా ఖరీదైనవి'.

'ఎంత ఖరీదైనవి?'

'పదిహేను శాతం'.

'ఒక ఆశీస్సు కేన్సిల్ చేయండి. రెండు నాకివ్వండి'.

'పది శాతం?'

'అవును'

'మామూలు పరిస్థితుల్లో నేనలా చేయనుగాని, మీరు నాకు ఆర్కిడ్లు తెచ్చారు'. ముఖ్యమంత్రి నవ్వాడు, ముంబయి మనిషితో ఒప్పందం పూర్తయిందన్నట్లుగా లేస్తూ.

మంచి బట్టలు వేసుకున్న ముంబయి మనిషి తన నల్లటి మెర్సిడజ్ బిర్హణ రోడ్‌లో ఉన్న పండిట్ గంగాసాగర్ మిశ్ర నివాసానికి వచ్చాడు. ఒక చేతిలో ఫోటోగ్రాఫిక్ ఫిల్మ్‌రోల్ ఉంది. మరో చేతిలో పోకెట్ రికార్డింగ్ ఉపకరణం ఉంది. దానిలో టేప్ ఉంది ఇంకా. తన రిపోర్టరు ఫ్రెండును గంగాసాగర్ మిశ్ర దగ్గరకి తీసుకెళుతూ మీనన్ నవ్వాడు.

'ఈ స్కూప్‌తో నువ్వు అడవి పిల్లినుంచి గద్దలా గ్రాడ్యుయేట్ అవుతావు', అన్నాడు మీనన్ రిపోర్టర్ని గంగాసాగర్ లివింగ్ రూంకి తీసుకెళుతూ.

'నేను అడవి పిల్లిలా ఉండటానికే ఇష్టపడతాను' అన్నాడు రిపోర్టర్.

'ఎందుకని?' అడిగాడు మీనన్.

'గద్దలు ఎగరగలవు గాని అడవి పిల్లుల్ని జెట్ ఇంజన్లు పీల్చెయ్యలేవు గదా!'

కాన్పూర్‌లోని దుమ్ముకొట్టుకున్న బిర్హణరోడ్డుకు ఆనుకుని వున్న వీధుల్లో ఒకదానిలో పాతబడిన భవనం రెండో అంతస్తులో గంగాసాగర్ మిశ్ర ఉండే ఫ్లాట్‌కి వెళ్ళే మెట్లు

వందలాది పాదాల భారంతో ఊగుతున్నాయి. ఉదయం పదకొండు గంటలైంది. చాందిని గుప్త పండిట్‌జీ నివాసానికి వచ్చింది. ఆమెతో ఫిరాయించడానికి సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష **ఎంఎల్ఏ**లు వచ్చారు.

స్టింగ్ ఆపరేషన్ ముఖ్యమంత్రి కుర్చీ వదలకూడదనే నిర్ణయాన్ని పునరాలోచించేలా బలవంతం చేసింది. మంచి సలహా పాటించడం తప్పలేదు. అతను రాజీనామా చేశాడు. 'అతను వెళ్ళిపోయినందుకు మీకు సంతోషంగా ఉందా?' అని అడిగాడు అలసిపోయిన మీనన్.

'మైడియర్ మీనన్, కొంతమంది తాము ఎక్కడికి వెళితే అక్కడికి సంతోషం తీసుకువెళతారు. కొందరు వెళ్ళిపోతే సంతోషంగా ఉంటుంది.'

'ప్రణామాలు, గంగా అంకుల్' గౌరవంగా చేతులు జోడిస్తూ రాజప్రతిష్ఠాపకుడికి నమస్కరించింది. 'దేవుడు నిన్ను చల్లగా చూడాలి తల్లీ' ఆశీర్వదించాడా వృద్ధుడు ఆమె తన పక్కనున్న కుర్చీలో కూర్చుంటుండగా. తన చేతిని ఆమె తలపై ఉంచి, క్షణం ఆగి కళ్ళు మూసుకుని మనసులో ఇలా ధ్యానించాడు. ***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'.***

'రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని చెప్పడానికి గవర్నర్ నివాసానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నావా?' కళ్ళు తెరుస్తూ అడిగాడు.

ఆమె చిరునవ్వుతో తలూపింది. ముఖ్యమంత్రి **ఎంఎల్ఏ**లు బయట ఉన్నారు. వాళ్ళు కేబినెట్ హోదాలు ఇవ్వకపోయినా మద్దతివ్వడానికి సిద్ధంగా ఉన్నారు – వాళ్ళకి వేరే మార్గం లేదు' ఆమె నవ్వింది.

'ముఖ్యమంత్రిగా నువ్వు చెయ్యాల్సిన మొదటి పని– ఆయన చెప్పసాగాడు.

'ఏమిటి?'

'ప్రపంచబ్యాంకు కాంట్రాక్టుని అగర్వాల్‌గారు చెప్పినవాళ్ళకి ఇవ్వు, ఓపెన్ మైక్రోఫోనులు లేకుండా చూసుకో జాగ్రత్తగా! ఈ ఎన్నికలకు ఉన్నదంతా ఆయన ఖర్చుపెట్టేశాడు. ఆయన ప్రశాంతంగా ఉండడానికి ఏదో ఒకటి ఇవ్వడం అవసరం'.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం లక్నోలో శాస్త్రి భవన్ అయిదో అంతస్తులో ఉంది. రిసెప్షన్ ప్రాంతం చాలా విశాలంగా ఉంటుంది – సందర్శకులు పెద్ద సంఖ్యలో ఉంటారని. రిసెప్షన్‌లో ఇద్దరు కార్యదర్శులుంటారు కేవలం వచ్చేవారిని మేనేజ్ చేయడానికి.

లోపలి కార్యాలయం రిసెప్షన్ కన్న చిన్నది. కాని చాలా అందంగా ఉంటుంది. చెక్క గోడలు, పెద్ద సైజు మహాగని డెస్క్, దాని వెనుక వెలిసిన మెరూన్ తోలు కవరున్న స్వివెల్ కుర్చీ – రాష్ట్రంలో అత్యంత శక్తిమంతమైన కుర్చీ. డెస్క్ వెనక గోడ మీద మహాత్మాగాంధీ చిత్రం ఉంది. సందర్శకుల కుర్చీలు కూడా మెరూన్ రంగులో ఉన్నాయి. కొంచెం చిన్నగా, కొంచెం కిందికి, కూర్చున్న ఏ అతిథి అయినా తక్కువస్థాయి వారని సూచించేలా. డెస్క్ కుడివైపున కిటికీ, అక్కడ అద్దంలా మెరిసే అలమర ఉంది. కొత్త కార్యాలయం లోపలికి అడుగుపెడుతూ అలమర మీద ఫ్లవర్‌వేజ్‌లో గులాబీరంగు చేమంతులు ఉండడం చూసింది చాందిని.

'గుడ్ మార్నింగ్, మేడమ్' చెప్పాడామె సహాయకుడు హుషారుగా ఉన్న యువకుడు. 'నేను మీ ప్రధాన వ్యక్తిగత కార్యదర్శిని – మీ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌ని. నా పేరు శంకర్'.

'శంకర్ గులాబీ చేమంతులు పెట్టినది మీరేనా?' అడిగింది చాందిని.

'అవును', కొంచెం సిగ్గుపడుతూ చెప్పాడా యువకుడు, 'మీకు నచ్చాయను కుంటాను'.

'గులాబీ చేమంతులు నాకు ఇష్టమని మీకెలా తెలుసు?' చాందిని అడిగింది.

మేడమ్, నేను మీ కార్యదర్శిని – మీ ఇష్టాలేమిటోతెలుసుకోవడం నా పని', మాట మార్చాడు. 'మీ డైరీని చూద్దామా?'

సందర్శకులు, ఫోన్ కాల్స్, ఉత్తరాలు, సమావేశాలు, ఫైల్సు అనంతం. సాయంత్రం అయిదు గంటలు దాటింది గాని కనీసం భోజనానికి కూడా డెస్క్ దగ్గర్నుంచి కదల్లేకపోయింది చాందిని.

'బిల్డర్స్ ఫెడరేషన్ వాళ్ళ డెలిగేషన్‌ని పంపించు' అని శంకర్‌కు ఇంటర్‌కంలో చెప్పింది. ఒక నిముషం తర్వాత అతను చేతిలో ట్రేతో అడుగుపెట్టాడు. 'వాళ్ళెక్కడ?' ఆమె అడిగింది తన ముందున్న ఫైల్లోంచి తలెత్తకుండా. ఆమె కార్యదర్శి ట్రేని ఆమె

ముందుంచాడు. అభిమానంగా 'మేడమ్, చాలా అలసిపోయారు. వాళ్ళని రీషెడ్యూల్ చేసుకోమన్నాను. మీరు కొంచెం విశ్రాంతి తీసుకోవాలి'. చాందిని అతను చెప్పేది నిజమేనన్నట్లుగా చూసింది – నిజంగానే తనకి బాగా ఆకలి వేస్తోంది. తన కిష్టమైన ఏలకుల టీ, నిమ్మరసం చల్లిన, వేయించిన పల్లీలు ట్రేలో చూసి చిరునవ్వు నవ్వింది.

'ఆమెకి నీపై నమ్మకం కలుగుతోందా?' అడిగాడు గంగాసాగర్.

'మీరు చెప్పిన సమాచారం వల్ల అది చాలా సులువైంది' అంగీకరించాడు శంకర్. 'ఆమె దాదాపు అన్ని విషయాలకు నా మీద ఆధారపడుతుంది'.

'గుడ్. ఆమె కార్యకలాపాల గురించి నాకు చెపుతుండు. పురుషాధిపత్య సమాజంలో ఒంటరి స్త్రీ ఆమె. మగస్నేహితుల గురించి నిజమైనా గాని, అబద్ధమైనా గాని చెడు ప్రచారం రావడం నేను భరించేస్థితిలో లేను!' గుర్రుమన్నాడు గంగాసాగర్.

'అప్పుడే సమస్య మొదలైనట్టుంది', అన్నాడు మీనన్.

'ఏమిటి? ఆమె ముఖ్యమంత్రి అయి కొన్ని వారాలు కూడా కాలేదు', అన్నాడు గంగాసాగర్.

'ర్యాంకుల్లో తిరుగుబాటు వస్తోంది. మన మిత్రుడు రామశంకర్ ద్వివేది నాయకుడనుకుంటాను. రహస్య సమావేశాలు, ప్రతిపక్షంతో చర్చలు జరుగుతున్నాయి'.

'ఇక్రంభాయ్‌ని వచ్చి నన్ను కలవమను. ఈ పరిస్థితుల్లో తన బ్రాండ్ సాయం అవసరం' అన్నాడు గంగాసాగర్.

కుటుంబాలకి కుటుంబాలే కొంచెం కూడా స్థలం లేకుండా ఆక్రమించేశారు. ఒక ఆవు రైల్వేప్లాట్‌ఫాం మధ్యలో కూర్చొని మేత నెమరు వేస్తోంది. ఒక మనిషి, భార్య, ముగ్గురు పిల్లలు – అప్పుడే పుట్టిన బిడ్డతో సహా తన సామానుకు చోటు చేసుకొనడానికి ప్రయత్నిస్తున్నాడు; ట్రాక్‌ల మీద పేరుకున్న చెత్తవల్ల ఈగలు, దోమలు ముసురుతున్నాయి. వ్యాపారం బాగున్న టీ స్టాల్ యజమాని పెట్టుకున్న చిన్న పిల్లలు చాయ్! గరం చాయ్! అని కేక పెడుతూ తిరుగుతున్నా, వేడిగా తీయగా, పాలలా తెల్లగా ఉన్న టీ ని గ్లాసులో

పోసి ఇస్తున్నారు. కొందరు నాసిరకం ప్లాస్టిక్ బొమ్మలు, వార్తాపత్రికలు, పళ్ళు, వేయించిన సమోసాలు, టూత్‌బ్రష్‌లు, మూలికాఓషధులు, చిన్నపిల్లల బట్టలు అమ్ముతూ, రైలు కోసం ఎదురుచూస్తున్న వారిని ఊదరగొడుతున్నారు. ఎట్టకేలకు అరుస్తూ, పొగలు కక్కుతూ ఇనుపరాక్షసి వచ్చింది. దాంతో అందరూ ఒక్కసారిగా లేచి రైలెక్కడానికి తయారైపోయారు.

ఇక్రం భాయ్ మనిషి రైలెక్కడానికి నిరీక్షించడం లేదు. అతను ఒక ప్రత్యేకమైన స్త్రీ కోసం నిరీక్షిస్తున్నాడు. ఆమెని అతను దర్బార్ క్లబ్‌కు తీసుకెళ్ళాలి.

లక్నో రైల్వేస్టేషను ఎదురుగా ఉన్న దర్బార్ క్లబ్‌లో ఉష్ణోగ్రత కనీసం పది డిగ్రీలు తక్కువుంది. గాలిలో తాజా మల్లెల పరిమళం వ్యాపించింది. లోపలంతా నల్లటి చెక్క ముదురు ఎరుపు వెల్వెట్‌తో అలంకరించారు. గది మధ్యలో నృత్యవేదిక ఉంది. అక్కడ ఖరీదైన లంగాలు వేసుకుని పదిహేనుమంది ఆడపిల్లలు బాగా హిట్టయిన బాలీవుడ్ పాటలకి డాన్సులు వేస్తున్నారు.

ఆ చుట్టూ కొంతమంది విటులు కూర్చుని విస్కీ తాగుతున్నారు. ఆకర్షణకు లోనైన వాళ్ళు అమ్మాయిలపై నోట్లు విసురుతున్నారు. ఆ నోట్లను అక్కడున్న వెయిటర్ లాఘవంగా ఏరేస్తాడు. ఏభై శాతం యజమానికి, యాభై శాతం ఎవరికోసం నగదు వేశారో ఆ పిల్లకి ఇస్తారు.

ఈష తన లోకంలో తానుంది – క్లబ్‌లో ఉన్న మగవాళ్ళెవరినీ మనసులోకి రానీయలేదు – సంగీతంలో లీనమైపోయింది. మెరిసే గాజులు, గొలుసులు, దుద్దులు, ముక్కుపుడక ఆమెకి నగలంటే ఉన్న మోజును చెబుతున్నాయి. చాలా నిపుణంగా మేకప్ వేసుకుంది. అతిగా కాదు. ఆమెకి ఇరవై ఒక్కేళ్ళు. సెక్సప్పీలు పొంగిపొర్లుతోంది. మూడుగంటల్నుంచి డాన్సు చేస్తోంది గాని, అలసిపోలేదు. గంజాయి సిగరెట్ మాహాత్మ్యం అది. రైలు ప్రయాణం చాలా సేపు పట్టింది. కాని మత్తుమందులుండడంతో అలసట, విసుగు రాలేదు. ఈ ఒక్క పని కోసమే ఇక్కడకు రావాల్సి వచ్చింది. థాంక్‌గాడ్. నగరం పెద్ద చెత్తకుండీ!

ఆమె డాన్సు చేసే చోటికి దగ్గర్లో కూర్చున్న ఒకతను ఆమెపైన నోట్లు చల్లాడు, ఆమెకి కన్ను గీటాడు అప్పటికే. బయట కలిస్తే కూడా నగదు ఇస్తానన్నట్లు సూచించాడు. ఆమె అతన్ని అంచనా వేస్తున్నట్టు చూసి చిరునవ్వు నవ్వింది. బాగా తాగి ఉన్నాడు.

బార్‌లో కోక్ తాగుతున్న ఇక్రంభాయ్ మనిషి వైపు చూసింది అతను తలూపాడు. చేప గాలానికి చిక్కింది.

వాళ్ళు పైన ఉన్న గదుల్లో ఒక చిన్న గదిలోకి వెళ్ళగానే, రామశంకర్ ద్వివేది ఆమెని లాలసగా చూశాడు, ఎముక కోసం చొంగ కారుస్తూ నాలుక బయటపెట్టి చూసే కుక్కలా. ఈష అతనిక్కావలసిన ఎముకనివ్వగలదు, అయినా, వాడి ప్యాంటులో ఉన్న ఉబ్బును చూస్తే, వాడికి సొంతంగానే ఒకటి ఉన్నట్టుంది.

ఆ గది 12×12 గది చిన్నది కిటికీలు లేవు. గది మధ్యలో పెద్ద మంచం, పూల దుప్పటి. దాని మీద మరకలు, మచ్చలు డిజైనులోవి కావు. ఒక మూల ఒకే ఒక కుర్చీ అద్దానికి ఎదురుగా ఉంది – చిన్న గదిలో అదుండడం విచిత్రం. అదృష్టవశాత్తు కిటికీలు లేనందుకేమో, ఎయిర్ కండిషనర్ పనిచేస్తోంది. గది చల్లగా ఉంది.'

'అయితే మెనూలో ఏముందో చెప్పనా?' అంటూ ఈష మంచం చివరన కూర్చుని పక్కన ఉన్న చోటులో చేత్తో కొట్టింది. ఆమె మాటల మత్తులో పడి అతను మౌనంగా తలూపాడు.

'బిబిబిజె, బిడిఎస్ఎం, నగ్నంగా ఉన్న నడుము, జిఎఫ్ఇ, డిటి, హెచ్‌జె– 'నాకివేవీ అర్థం కావడం లేదు–' అతను చెప్పబోయాడు.

'హుష్. నువ్వర్థం చేసుకోనవసరం లేదు. అన్నీ నేను చూపిస్తానుగా' అంటూ అతని బట్టలు తీసేయడానికి సాయం చేసింది.

ఇక్రం మనిషి ఏర్పాటు చేసిన ఫోటోగ్రాఫర్ పడగ్గదికి అవతలివైపు నున్న చీకటి గదిలో రెండు వైపుల నుంచి కనిపించే అద్దం వెనకాల ఉన్నాడు. కెమేరాని మాన్యువల్ మోడ్‌లో పెట్టి, షట్టర్‌ని ముప్ఫయి సెకన్లకు సెట్ చేశాడు. మూడు కాళ్ళ బల్లమీదున్న కెమేరా మీటపై ఫోటోగ్రాఫర్ వేలుంది నిశ్చలంగా. ఈష చూపించిన విస్తృతమైన మెనూలోంచి రామశంకర్ ద్వివేది ఐటంలు ఎంపిక చేసుకుంటుండగా షట్టర్ క్లిక్ క్లిక్ మంటూ మోగుతూనే ఉంది.

'అగర్వాల్‌గారు చెప్పినతనికి రోడ్డు కాంట్రాక్టు ఇచ్చాం –' చాందిని చెప్పబోయింది.

'అయితే?' గంగాసాగర్ అడిగాడు.

'ఆయన చెప్పినది రంగ్తా అండ్ సోమాని, మనం రైతుల భూముల గురించి సంప్రదించాం చూడండి వాళ్ళిద్దరు.'

'నీకోసం ప్రచారం చేయడానికి బాలీవుడ్ బింబో –అంజలిని పంపి మనకు మద్దతిచ్చింది సోమానీయే' గుర్తుచేశాడు గంగాసాగర్.

'చేశాడు' అని ఒప్పుకుంది చాందిని. 'కాని ఇప్పుడు మనకో సమస్య వచ్చింది'.

'ఏమిటి?'

'ఆర్ అండ్ ఎస్ అదృష్టం వివాదంలో ఉంది. ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టుని సీనియర్ పార్ట్నర్ రంగ్తాకి చెందిన ప్రయివేటు కంపెనీకి ఇచ్చాం'.

'అయితే?'

'జూనియర్ పార్ట్నర్ సోమానీ దాన్ని తనక్కూడా సమాన భాగం ఉన్న పేరెంట్ కంపెనీకి ఇవ్వాల్సింది అంటున్నాడు.'

'దానితో మనకేం సంబంధం? నువ్వు కావాల్సిన అన్ని అర్హతలతో పారదర్శకంగా, న్యాయంగా ఉన్న బహిరంగ టెండర్నే పిలిచావుగా, కాదా?' అడిగాడామె కుటిల గురువు.

'అదే చేశాను. కాని ఇప్పుడు సోమాని కోర్టుకు వెళతానంటున్నాడు. అలా చేస్తే, రంగ్తా మీద దాడి రాష్ట్ర ప్రభుత్వాన్ని రొచ్చులో పడేస్తుంది'.

'వాళ్ళిద్దరిలో ఎవరికీ కోపం తెప్పించలేం మనం. సోమానితో మాట్లాడి సర్దుబాటు చేయగలమేమో చూద్దాం. మీటింగ్ ఏర్పాటు చేద్దాం.'

'మీరు మీటింగ్ ఏర్పాటు చేయనవసరం లేదు'.

'ఎందుకు?'

'మనల్ని కలవడానికి అతను బయట ఎదురుచూస్తున్నాడు'.

'ఇద్దరు భాగస్వాములకి న్యాయంగా సమానంగా రావాల్సింది రాకుండా నన్ను మోసం చేశారు. ఇట్లా నాకెందుకు అన్యాయం జరగనిచ్చారు?', అన్నాడు సోమాని అన్ని మర్యాదలు వదిలిపెట్టి లోపలికి వస్తూ.

'మిమ్మల్ని కలిసినందుకు నాకూ చాలా సంతోషంగా ఉంది', అన్నాడు గంగాసాగర్ వ్యంగ్యంగా.

'మేడమ్, నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను. ఈ పొరపాటు సరిదిద్దండి. ఈ సమస్యని కోర్టుకు లాగను', బతిమాలాడు చాందినీని సోమాని.

'ఇద్దరు భాగస్వాముల మధ్య తగాదాలో మేమెట్లా జోక్యం చేసుకుంటాం?' అడిగింది చాందిని.

'మీకు మరోమార్గం లేదు. ఈ వివాదం కోర్టుకెక్కితే, కంట్రాక్టు ఎలా వచ్చిందో ఆ అవినీతి వివరాలన్నీ జనాలకి బహిరంగంగా తెలుస్తాయి', అన్నాడు సోమాని.

'ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని మీరు బెదిరిస్తున్నారా?' చాందిని కోపంగా అడిగింది.

'నేను బెదిరించడం లేదు మేడమ్, మీరేమీ చెయ్యకపోతే, ఈ అవినీతి అంతటినీ ప్రజల ముందుకు తేవడం తప్ప నాకు మరోమార్గం లేదు', అన్నాడు సోమాని.

'అయితే రాష్ట్ర ప్రభుత్వం తన శక్తులన్నీ మీ మీద ప్రయోగిస్తుంది దానికి సిద్ధంగా ఉండండి! తినే కంచంలో ఊయకూడదు సోమానీ!' చాందిని విసురుగా అంది స్వరం పెంచుతూ.

'అరెరే. ఇప్పుడు మనం ఒకళ్ళతో ఒకళ్ళు వాదించుకోవద్దు. మర్యాదస్తుల్లా మాట్లాడుకొని పరస్పరం అంగీకారమయ్యే పరిష్కారానికి వద్దాం సరేనా?' అడిగాడు గంగాసాగర్, చాందినిని శాంతంగా ఉండమని సైగ చేస్తూ. 'ఈ విషయాన్ని పక్కకు పెట్టి, సోమానీ మీకు మేజెస్టిక్ మ్యూనిషన్స్ పిఎల్‌సిలో వ్యక్తిగత షేరు ఉందన్నారు. నిజమేనా?'

'మీకెలా–ఎలా తెలుసు?' అడిగాడు ఖంగుతిన్న వ్యాపార దిగ్గజం.

'అన్ని విషయాలు తెలుసుకొనడమే నా పని', చెప్పాడు గంగాసాగర్.

'నాకు తెలిసిందేమిటంటే మేజెస్టిక్ మ్యూనిషన్స్ పిఎల్‌సిలో పెద్ద మొత్తంలో షేర్లు – లండన్ స్టాక్ ఎక్స్ఛేంజిలో కోట్ అయిన కంపెనీవని – దాన్ని దుబాయిలో ఉన్న ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ కొందని – దానిలో మీకు వాటా ఉందని నా వర్గాల ద్వారా తెలిసింది'.

'ఒకవేళ ఉందనుకుందాం. ఉంటే ఏమిటి?' తొట్రుపడిన వ్యాపారి అడిగాడు.

'ఉందనుకుని మాట్లాడుదాం, ఉందనుకున్న ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లో ఉందనుకున్నవాటా, ఆ బ్యాంక్ కొన్న ఆయుధ కంపెనీలో ఉందనుకొందాం. ఆ వాటా విలువ ఆరు రెట్లు పెరిగితే ఎలా ఉంటుంది?'

'ఎలా?'

'ఇంకా ఉందనుకొనే మాట్లాడుతున్నామా?' అపహాస్యం చేశాడు గంగాసాగర్.

'మేజెస్టిక్ మ్యూనిషన్స్‌కి సెమి-ఆటోమేటిక్ రైఫిల్స్ కోసం పెద్ద ఆర్డరు రాబోతోందని, ప్రధాని కార్యాలయంలో ఆ ఫైలు ఆగిందని నాకు తెలిసింది. ఈ ప్రతిపాదన అంగీకరింపబడితే, మేజెస్టిక్‌లో మీ వాటా విలువ దాదాపు ఆరు రెట్లు పెరుగుతుంది'.

'కాని మేం అన్ని రకాలుగా ప్రయత్నించాం–' చెప్పబోయాడు సోమానీ.

'నాకొదిలెయ్ దాన్ని. నీ ఆరు రెట్ల లాభానికి నువ్వు ఆరు పనులు చెయ్యాలి'.

'ఆ ఆరు పనులేమిటి?'

'మొదటి పని రెండు శాతం షేర్లని ఒక ఛారిటబుల్ ట్రస్టుకి కేటాయించు. అది ఒక నిరాడంబర సాధ్విది – మంచి ఆమె!' రాష్ట్రపతి పాలన రాకుండా ఆపినందుకు నేనామెకు బహుమతి నివ్వాల్సి ఉంది.

'సరే. తర్వాతేం చెయ్యాలి?'

'రెండోది. కాంట్రాక్టు రాగానే మేజిస్టిక్‌లో నీకున్న షేర్లన్నీ అమ్మేసి లాభం పొందు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో నేను హామీ ఇవ్వలేను'.

'మంచిది. తర్వాత?'

'మూడోది. బీద కుటుంబం నుంచి వచ్చిన పిల్లవాడున్నాడు. హిందూ ఆశ్రమంలోని పురోహితుడి కొడుకు. నువ్వు ట్రస్టీగా ఉన్న మెడికల్ కాలేజీలో అతనికి సీటు ఇప్పించు', రుణాన్ని పూర్తిగా తీర్చెయ్యాలి.

'సులభంగా చేయొచ్చు. తర్వాత?'

'న్యూఢిల్లీలో నీ స్నేహితుడు – మేజెస్టిక్ మ్యూనిషన్స్ కోసం నీ తరఫున లాబీయింగ్ చేస్తున్న రక్షణమంత్రిని – భవిష్యత్తులో నాకు అవసరమైనపుడు అందుబాటులో ఉండేలా స్నేహితుడిని చెయ్యి'.

'నేనతనితో మాట్లాడతాను. అయిదోది?'

'మేజెస్టిక్ మ్యూనిషన్స్‌కి **సార్డ్**‌లో – (స్ట్రేటెజిక్ ఏసియా రిసెర్చ్ డిఫెన్స్)లో షేర్లున్నాయి – ఆసియా మిలటరీ వ్యవహారాల గురించి ఆలోచించే మేధావుల సమూహమది. నాకు వాళ్ళతో పని బడవచ్చు'.

'మంచిది. చివరిదేమిటి?'

'నీ భాగస్వామి రంగ్తాపై కేసు వేయకు. మనందరం కలిసి ఈ ప్రభుత్వాన్ని నడపగలుగుతాం! ఇంక ఇప్పుడు నేను మాట్లాడినదంతా ఊహించి మాట్లాడుతున్నది కాదు!'

'సోమానీకి సర్దిచెప్పినందుకు థ్యాంక్‌యూ', అంది చాందిని.

'ఫరవాలేదు. నా సలహా పాటించి అతని మీద అరచినందుకు నాకు సంతోషంగా ఉంది', అన్నాడు గంగాసాగర్.

'ఎందుకంత గట్టిగా మాట్లాడమన్నారు?'

'చెడ్డపోలీసు లేకుండా మంచి పోలీసు పనెట్లా చేస్తాడు?' అడిగాడు గంగాసాగర్.

లక్నోకి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న కుగ్రామం నత్‌పూర్వలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి వెళుతోంది. వాళ్ళు మధ్యాహ్నం ఒంటిగంట కల్లా బయల్దేరాల్సింది కాని మీటింగుల మూలంగా రెండు మూడు గంటలు ఆలస్యమైంది. శంకర్ ఈ పర్యటన రద్దు చేద్దామన్నాడు. ప్రభుత్వ హెలికాప్టర్ పాడైనా చాందిని వెళ్ళడానికి నిర్ణయించుకుంది. వ్యాపారులు, అధికారులతో సమావేశాలు అత్యవసరమే కాని చిన్న ప్రాథమిక పాఠశాలే తమ ప్రపంచం అనుకున్న గ్రామస్థులు, పిల్లల కన్న ముఖ్యమైనవి కావు.

చలికాలం ఆరంభమైంది. త్వరగా సూర్యాస్తమయం అయింది. అధికారిక అంబాసిడర్ కారులో వెనకసీట్లో కూర్చుంది. మామూలుగా తన ట్రేడ్‌మార్క్ కోరాచీర కట్టుకొని, రంగులేని ఉన్నితో తయారైన శ్రేష్ఠమైన శాలువా భుజాల మీద కప్పుకొంది.

శంకర్ ఆమె పక్కనే కూర్చుని వెంట తెచ్చిన ఫైళ్ళు చూడడంలో ఆమెకు సాయం చేస్తున్నాడు. వాళ్ళ కారు ముందు ఇద్దరు పైలెట్ పోలీసులు మోటార్ బైక్‌ల మీద, వెనక ముఖ్యమంత్రి అంగరక్షకులతో ఒక పోలీసు జీపు ఉంది. లక్నో, నత్‌పూర్వ దారి గతుకులమయం. కాన్వాయ్ నిదానంగా వెళుతోంది.

చీకటి పడుతుండగా గేదెల మంద రోడ్డు మీద అడ్డు రావడంతో కాన్వాయ్ కొంచెమాగింది. ఆ బద్ధకపు పశువులు నిదానంగా రోడ్డుని దాటుతున్నాయి. పోలీసులు డెప్యూట్ చేసిన చాందిని డ్రైవరు హారన్ ఎంతగా మోగిస్తున్నా పట్టించుకోకుండా. ఆ మంద చాలా పెద్దగా ఉంది. హఠాత్తుగా కారులో ఉన్నవాళ్ళు తమ కారు చుట్టూ వందలాది గేదెలు చుట్టిముట్టినట్లు గమనించారు. అయిదు నిముషాల తర్వాత గేదెలు వెళ్ళిపోయాయి, పోలీసు జీపు కాని, బైక్‌ల మీదున్న పోలీసులు గాని అక్కడ కనిపించలేదు.

పశువులు వెళ్ళిపోయేసరికి చీకటి పడింది, ముగ్గురు రౌతులు వచ్చి కారుని చుట్టుముట్టారు. ఒక రౌతు తన గుర్రాన్ని డ్రైవరు కిటికీ దగ్గరకి నడిపించి. 303 కాలిబర్ రైఫిల్‌తో గ్లాసులోంచి అతన్ని కాల్చేశాడు. అద్దం ముక్కలైంది డ్రైవర్ చనిపోయాడు. 'అతను రజ్జోభయ్యా' అని చాందినికి గుసగుసగా చెప్పాడు శంకర్.

'మనం పారిపోకపోతే మనల్ని చంపేస్తాడు'. చాందిని భయంతో కదల్లేకపోయింది. శంకర్ మాటలకు మౌనంగా తలూపుతూండగా తెల్లని ఆమె శరీరఛాయ పూర్తిగా పాలిపోయింది. మరో రౌతు శంకర్ వైపు వచ్చి కిటికీలోంచి రైఫిల్‌ని శంకర్‌కి గురిపెట్టాడు.

'ఆ లంజాకొడుకు గంగాసాగర్ నాతో రాజకీయాలాడొచ్చు అనుకున్నాడు. ఏం? అందమైన అమ్మాయిని గద్దెనెక్కించి వెనుక నుంచి పాలిద్దామనుకున్నాడా? వాడు నన్ను చెరిచాడు, నేనిప్పుడు ఈ అందమైన ఆడదాన్ని చెరిచి సరదా పడతాను. బోయ్స్, అందరం కలిసి సరదా చేసుకోడానికి రెడీనా మీరు?' నవ్వాడు రజ్జోభయ్యా, అతని మనుషులు కూడా అతనితో కలిసి క్రూరంగా, వికటంగా నవ్వారు.

చాందిని, శంకర్ కూర్చునే ఉన్నారు, వాళ్ళ కిటికీలు ముక్కలైపోయాయి. అద్దాలు సీట్ల మీద కిందపడిపోయాయి. .303 రైఫిళ్ళు చెరోవైపు నుంచి వాళ్ళిద్దరికీ గురిపెట్టి ఉన్నాయి. వాళ్ళని కారులోంచి దించటానికి రజ్జో మనుషులు హడావిడి పడడం లేదు. వెనుక ఉన్న అంగరక్షకులని, ముందున్న బైక్‌ల మీది పోలీసుల్ని, డ్రైవర్ని చంపేశారు గనుక చాందిని, శంకర్ నిస్సహాయమైన వేటలని వాళ్ళకి తెలుసు.

'మూడు అనగానే, అంటూ శంకర్ ఆమె పక్కనున్న అద్దం ముక్కవైపు చూస్తూ దాన్ని చేతిలోకి తీసుకోమన్నట్టుగా సైగ చేశాడు. అతనప్పటికే ఒక అద్దం ముక్కని పట్టుకున్నాడు – అతని చేతి నుంచి రక్తం కారి సీటు మీద పడుతోంది. 'ఒకటి–రెండు–మూడు' అతను గుసగుసగా అన్నాడు, ఒకేసారి చాందిని, శంకర్ చేతుల్లోని అద్దం ముక్కలతో వాళ్ళవైపున్న గుర్రాలని పొడిచారు బలంగా.

గుర్రాలు అదుపు తప్పి, బాధతో సకిలిస్తూ నాలుగు కాళ్ళతో గాల్లోకి లేచాయి. 'దొంగనాకొడకా!' అంటూ రజ్జోభాయ్ చిరాగ్గా అరిచాడు. అతను, అతనితోటివారు గుర్రాలని అదుపులోకి తెచ్చుకోవాలని ప్రయత్నించారు. కారులోపలి నుంచి క్షణకాలం రైఫిల్ బ్యారెల్స్ వెనక్కి వచ్చేశాయి. 'ఇప్పుడే!' అని గుసగుసగా చెప్పి తనవైపున తలుపు తెరిచి, తనతోపాటు చాందినిని బయటికి లాగాడు శంకర్. అదుపు తప్పి గాల్లోకి లేచిన గుర్రాలు నిముషం సేపు కూడా వెసలుబాటివ్వవని అతనికి తెలుసు. వాళ్ళు బయటికి రాగానే శంకర్ అద్దం ముక్కతో తన పక్కనున్న గుర్రాన్ని మరోసారి పొడిచాడు. గుర్రం అటూ ఇటూ కదిలింది కోపంగా. కిందపడిన తుపాకిని తీసుకొని గూండా తలకి గురిపెట్టి కాల్చాడు. తనేం చేస్తున్నాడో తనకి తెలియదు కాని మనసు, శరీరం ఆటోపైలెట్‌లో ఉన్నట్టు పనిచేశాయి. రౌతు శరీరం గుర్రం మీద నుంచి పడుతుండగా తానొక మనిషిని చంపానని అతనికి అర్థమైంది, శవం కాలు ఒకటి ఇంకా రికాబులోనే ఉంది. గుర్రం పిచ్చిగా పరుగు తీస్తూ, శవాన్ని కూడా తనతో పాటు దూరంగా లాక్కుపోయింది.

చేతులు, మోకాళ్ళతో నేల మీద దేకుతూ చాందినిని కూడా శంకర్ కారు కిందికి లాగాడు. మంత్రులు, అధికారులు ఆధికారిక విధులకు అంబాసిడర్ కారు వాడాలని ఆదేశించిన భారత ప్రభుత్వానికి మౌనంగా కృతజ్ఞతలర్పించాడు. 1956 నాటి మోరిస్ ఆక్స్‌ఫర్డ్-IIIలా చేసిన అంబాసిడర్ కొంచెమే మార్పు చెందింది. పాసింజర్ కార్లలో నేల నుంచి ఎత్తుగా ఉండడంతో దీనికింద దూరడం తేలికైంది. 'దొంగనాయాలా, మగాడిలా బైటకొచ్చి దెబ్బతీయొచ్చుగా?' రజ్జోభయ్యా అరిచాడు.

'నువ్వు మాకు తుపాకులు గురిపెట్టినట్టుగానా?' వెక్కిరించాడు శంకర్. గుర్రం గిట్టలు కనిపించాయి శంకర్‌కి. రజ్జోభయ్యా గుర్రం దిగకముందే ఏదో ఒకటి చెయ్యాలని అర్థమైందతనికి. చాందినిని దగ్గరగా లాక్కుని, ఆమెకి ధైర్యం చెబుతున్నట్టుగా చేతిని నొక్కి వదిలాడు. కారుకు ఎడమవైపునున్న వెనుక తలుపు వైపు తుపాకిని గురిపెట్టి, చాందినిని టైర్లవేపు కాల్చకుండా కొన్నిసార్లు కాల్చమన్నాడు. రజ్జో, అతని మనిషి దృష్టి

మరల్చడం అతని ఉద్దేశ్యం – ఆ లోపు కుడివైపు ముందు తలుపు దగ్గరికి డ్రైవరు సీట్లోకి వెళ్ళాలి.

చాందిని షాట్లు ఆ ఇద్దరినీ ఎడమవైపు వెనక్కి రప్పించాయి. ఆ క్షణంలో శంకర్ తలుపు తీసి డ్రైవర్ శరీరాన్ని బయటికి లాగేశాడు, ఆ పోలీసు హెూల్‌స్టర్లోంచి ఐఒఎఫ్‌బి మార్క్1 రివాల్వర్‌ని తీశాడు. నిలబడి రివాల్వర్‌ని రజ్జో భయ్యాకి గురిపెట్టాడు – రజ్జో ఇంకా వెనకి నుంచి వచ్చిన షాట్స్ వైపే దృష్టి కేంద్రీకరించి ఉన్నాడు – కాల్చాడు. రజ్జో చేతిలో రైఫిల్ కిందపడేసి రక్తం కారుతున్న గుండెని పట్టుకున్నాడు. రెండో తూటా భ్రుకుటికి తగులుతుండగా అతని ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

మూడో రౌతు, యజమాని చనిపోయాడని గ్రహించగానే, గుర్రాన్ని కారుకు దూరంగా తీసుకుపోయి కొండల్లోకి పరిగెత్తించాడు. శంకర్ కారు కిందకి పాకి చాందినిని పట్టుకొన్నాడు. తూటాలు అయిపోయినా ఆమె యాంత్రికంగా రైఫిల్‌తో కాలుస్తూనే ఉంది. తుపాకి పట్టుకుని వణుకుతోంది. ట్రిగ్గర్‌ని నొక్కుతున్న ఆమె చేతిని విడదీసి, నిదానంగా ఆమెని కారు కింద నించి బయటికి తీసుకొచ్చాడు. భుజాల చుట్టూ చేతులేసి ఆమెని కార్లో ఫ్రంట్ పాసెంజర్ సీట్లో కూర్చోబెట్టాడు. వెంటనే పరిగెత్తుతూ వెళ్ళి డ్రైవర్ సీట్లో కూర్చున్నాడు. ఇంజన్ స్టార్ట్ చేసి, గేరు మార్చి పాదంతో యాక్సిలరేటర్ నొక్కాడు. నత్‌పూర్వ శివార్లలో ఉన్న ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కి వచ్చేవరకూ యాక్సిలరేటర్ మీద నించి పాదం తీయలేదు.

వాళ్ళు సర్క్యూట్ హౌస్‌కి వచ్చేసరికి రాత్రి పదిగంటలు దాటింది. అది జిల్లా కలెక్టరు నిర్మించిన రెండు పడక గదులున్న బంగ్లా. కేర్‌టేకర్ – సౌమ్యంగా ఉన్న, బోసినోటి వృద్ధుడు – ముఖ్యమంత్రి నంబరు ప్లేటున్న కారు చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చాడు. 'ఏం జరిగింది?' అని ఆందోళనగా అడిగాడు కారు తలుపు తీసి రక్తంతో తడిసిన బట్టలతో దిగుతున్న శంకర్‌ని చూసి, 'ముఖ్యమంత్రిపై దాడి జరిగింది. ఆమెని లోపలికి తీసుకెళదాం, సాయం చెయ్యి– ఆమె షాక్‌లో ఉన్నారు', చెప్పాడు శంకర్.

ఆ మగవాళ్ళిద్దరు చాందిని చేతులను తమ భుజాల మీద వేసుకుని సర్క్యూట్ హౌస్ మెట్లు ఎక్కించి ఒక గదిలోకి చేర్చారు.

ప్రభుత్వ వసతి ప్రమాణాలతో చూస్తే, ఆ హౌస్ బాగా ఉన్నట్టే లెక్క. బెడ్ మీద

చాందినిని కూర్చోబెట్టి, కేర్‌టేకర్ వైపు తిరిగి, 'కొంచెం టీ పెట్టు మాకు. నిద్ర మాత్ర ఏమైనా ఉందా? నేనొక ఫోను చెయ్యాలి', అన్నాడు.

ఆందోళనలో ఉన్న కేర్‌టేకర్ తల వూపి టీ, నిద్ర మాత్ర తేవడానికి వెళుతూ, 'ఇవాళ ప్రొద్దున్నుంచి ఫోను లైన్లు పనిచేయడం లేదు. మరో ఫోను అయిదు మైళ్ళు వెళితేగాని లేదు!' అని చెప్పాడు.

శంకర్ చాందినిని దిళ్ళకు ఆన్చి కూర్చోబెట్టి ఆమె పక్కన కూర్చున్నాడు. కేర్‌టేకర్ తెచ్చిన వేడి టీ తాగమని బలవంతపెట్టి, నిద్రమాత్ర మింగించాడు. 'మిమ్మల్ని ఈ స్థితిలో లక్నోకు తీసుకెళ్ళలేను', నెమ్మదిగా ఆమెతో అన్నాడు. 'పోలీసు ఎస్కార్టు ఉండాలనిపిస్తోంది. మీకు ఆకలిగా ఉంటే ఊళ్ళోకి వెళ్ళి తింటానికి ఏమైనా తెస్తాను'.

ఆమె తల అడ్డంగా ఊపింది. 'నాకాకలి లేదు. ఉదయం వెళదాం- అప్పటికి లక్నోలో ఉన్న కంట్రోల్ రూంకి ఇక్కడికో టీంని పంపాలని తెలుస్తుంది'.

'మంచిది. కేర్‌టేకర్‌ని మెలకువగా ముందు తలుపు దగ్గర కూర్చోమని చెబుతాను. నేను పక్క గదిలో ఉంటాను - అంటున్నాడు లేస్తూ.

'శంకర్' అంది చాందిని అతని చేతిని పట్టుకొని సూటిగా కళ్ళలోకి చూస్తూ 'నన్ను వదిలి వెళ్ళకు, ఉండు దయచేసి'. అది చాలా చిన్న అభ్యర్థనే కాని దానిలో చాలా అర్థముంది. అందంగా, బలహీనంగా ఉన్న ఆమెతో ప్రేమలో పడుతున్నట్లుగా అనిపించింది అతనికి.

'ఆమె ఏం చేస్తుందో జాగ్రత్తగా గమనించమని చెప్పాను. ఆమెతో పడుకోమని కాదు', గర్జించాడు గంగాసాగర్. ముఖ్యమంత్రి కాన్వయ్‌పై దాడి జరిగిన విషయం వార్తల్లోకెక్కింది. ఉదయమే సాయుధ ఎస్కార్టుతో జాగ్రత్తగా లక్నో తీసుకువచ్చారు వాళ్ళని. శంకర్ స్నానం చేసి, కొంచెమేదో తిని గంగాసాగర్‌ని కలవాలని పరిగెత్తాడు. గంగాసాగర్ నుంచి రహస్యాలు దాచడంలో అర్థం లేదు - ఆయనెలాగైనా కనుక్కుంటాడు.

శంకర్ మనసు గందరగోళంగా ఉంది. అతను చిక్కుల్లో పడ్డాడు.

'నేనలా జరుగుతుందనుకోలేదు ఎన్నడూ. హఠాత్తుగా అయిపోయింది. ఆమెకి నా అవసరం ఉంది అందుకని-'

'-అందుకని ఆమె పక్కలో పడుకుని జిమ్నాస్టిక్స్ చేశావా?' కోప్పడ్డాడు గంగాసాగర్.

'అలా జరగలేదది. అది తీవ్రమైన, ఉద్వేగభరితమైన క్షణికావేశంలో – శంకర్ అంటున్నాడు.

'ప్లీజ్! వివరాలేమీ చెప్పకు నాకు!' లివింగ్ రూంలో చేతులు వెనక్కి కట్టుకుని పచార్లు చేస్తూ అన్నాడు గంగాసాగర్.

'నేను– నేను – నేనామెని ప్రేమిస్తున్నాను', నత్తుతూ చెప్పాడు శంకర్. 'మీరు చెప్పింది చేయగలనని నాకనిపించడం లేదు. నేను ప్రేమించే స్త్రీని గమనిస్తూ, రిపోర్ట్ చేయడం ఎలా చేయగలను?'

గంగాసాగర్ నవ్వాడు. అది మృదువుగా, భయపడవద్దన్నట్లుగా ఉంది. శంకర్ కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చాడు. ఆప్యాయంగా ఆ యువకుడి భుజం మీద చెయ్యి వేసి ఇలా అన్నాడు. 'నువ్వు ధైర్యశాలివి. నిజాయితీపరుడివి శంకర్. నిజం చెప్పినందుకు నిన్ను చూసి నేను గర్విస్తున్నాను'.

శంకర్ అమ్మయ్య అని ఊపిరి పీల్చాడు. 'నువ్వింటికెళ్ళి కొంచెం రెస్టు తీసుకో. కొన్నాళ్ళ తర్వాత ఈ పనిలోంచి నిన్నెలా బయటికి తీసుకురావాలో ఆలోచిద్దాం!'

గంగాసాగర్ కాళ్ళ మీద పడి పాదాలకు నమస్కరించాడు శంకర్.

'మీరు నాకు చేసిన వాటికి – కార్యదర్శిగా వేసినందుకు కూడా నా కృతజ్ఞతలు. సర్, మీరు నా గురువు. నేను మీకెప్పటికీ కృతజ్ఞుడిగా ఉంటాను!'

'సంతోషంగా ఉండు శంకర్. ప్రేమించడం చెడ్డ విషయం కాదు కదా', గంగాసాగర్ భుజాలెగరేశాడు. 'అదే లేకపోతే నువ్వు, నేను పుట్టి ఉండేవాళ్ళం కాదు!

శంకర్ ఉదయాన్నే లేచి, గడ్డం చేసుకుని, స్నానం చేసి, బట్టలేసుకున్నాడు. బ్రహ్మచారి ఫ్లాట్ కాఫీ వాసన వేస్తోంది. రోజూ గింజలు తాజాగా పొడిచేసి కాఫీ పెట్టుకుంటాడు. ఇవాళ కాఫీ తాక్కుండా, బ్రీఫ్ కేసు పట్టుకుని మెట్లు దిగి బస్టాప్‌వైపు నడిచాడు. ముందు రోజు రాత్రి చాందినితో ఫోనులో జరిగిన సంభాషణ గురించి ఆలోచిస్తుంటే అడుగుల్లో స్ప్రింగున్నట్లు అనిపించిందతనికి.

'నీకెలా కృతజ్ఞత చెప్పాలో నాకు తెలియడం లేదు' ఆమె అంది.

'హుష్! కృతజ్ఞతలవసరం లేదని మీకు తెలుసు' అతను మందలించాడు.

'నాకు తెలుసు. విను మన మధ్య జరిగినది–'

'యస్?'

'ఎలా చెప్పాలో తెలియడం లేదు. నీకు ఇది క్షణికావేశంలో జరిగింది అనిపిస్తే నేనర్థం చేసుకోగలను–'.

'ఏం మాట్లాడుతున్నారు మీరు? క్షణికమేమిటి? నేను–'

'ఇది నీకు ప్రత్యేకమని తెలిసి నాకు సంతోషంగా ఉంది. ఇప్పటికీ ఇది నాకెంతో ప్రియమైందని నీకు చెబుతున్నాను'.

'మీతో ప్రేమలో పడుతున్నాననిపిస్తోంది', అతనన్నాడు.

'ఆ భావం నీ ఒక్కడిదే కాదు' ఆమె మామూలుగా చెప్పింది.

వీధికవతల వున్న బస్టాపు కొచ్చాడు శంకర్. రోడ్డు దాటే ముందు అటూ ఇటూ చూశాడు. ఏమాత్రం హెచ్చరిక లేకుండా టాటా ట్రక్ వచ్చేసింది. డ్రైవర్ బండిని అదుపు చేయలేకపోయాడు. ఇరవై అయిదు టన్నుల బ్రహ్మరాక్షసి శంకర్ మీదకి వచ్చి అతని ఎముకలు నుగ్గు నుగ్గు చేసింది. ముద్దయిన శంకర్ శరీరం రక్తపు మడుగులో ఉండడం అద్దంలో చూస్తూ ట్రక్ డ్రైవర్ బండి నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

## పదకొండో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

'మీరంటే నాకిష్టం' అంది చాణక్యుడి బాల్యప్రేయసి సువాసిని రాక్షసుడితో. అతను మగధ ప్రధాని, ఆమె అతని మెడ, భుజాలు నొక్కుతూ ఉంది.

మగధలో సరైన దహనకాండ సృష్టించగల అగ్గిపుల్ల సువాసిని అని చాణక్యుడు నిర్ణయించాడు. ఒక కారణం ఆమె కామాన్ని రేకెత్తిస్తున్నట్టుగా ఉంటుంది. మరొకటి ఆమెకు ఆటలాడడమంటే ఇష్టం. మగధ రాజకీయ రంగంలో కామవాంఛలే కీలకనేతలను ఆడిస్తున్నాయి – రాజు ధననందుడు లాలసుడు, అతని ప్రధాని రాక్షసుడు వ్యభిచారి.

సువాసిని చర్మం నల్లగా ఉంటుంది, అది ఆమెని రహస్యమైనదిగాను, కోరుకోదగినది గాను చేసింది. సాంప్రదాయిక అర్థంలో ఆమె అందమైనదని అనలేం. కాని మగవాడిలో కోరికను రగిలించి పిచ్చివాణ్ణి చేసే శక్తి ఏదో ఆమెలో ఉంది. శరీరంలో అవసరమైన చోట్ల ఒంపులున్నాయి. మట్టిరంగు ఛాయ, నిండు పెదవులు, గాఢమైన నల్లని కళ్ళు, నల్లని ఒత్తైన జుట్టు, రసరంజక రూపం ఆమెది.

'నాకు మీరంటే ఇష్టం' అంది సువాసిని రాక్షసుడితో, 'కాని ప్రియా, రాజు నన్ను చాలా ఇరుకున పెట్టేశాడు. నన్ను తన రాణి కమ్మంటున్నాడు'.

రాక్షసుడి మెడ కండరాలు గట్టిగా అయి అతను బిగుసుకుపోయినట్టనిపించిందామెకి. 'నీకూ అలాగే కావాలని ఉందా?' అడిగాడు జాగ్రత్తగా.

ఆమె అతని మెడ చుట్టూ చేతులు వేసింది, ముందుకు వంగి అతని చెవిలో, 'మనిద్దరం పడక మీద ఉన్నపుడేం జరుగుతుందో మీకు తెలుసు. అతను నన్ను తృప్తిపరచగలడని మీరనుకుంటున్నారా నిజంగా?' అంది.

'ఒకసారి ఒక ఆడదాని మీద కన్నేశాడంటే ఏమైనా సరే ఆమెని పొంది తీరతాడతను. ఎవరూ అతనికి చెప్పలేరు - వాడు రాజు! మనం దీనినెలా తప్పించుకుంటాం?', అడిగాడు రాక్షసుడు, ఆమె ఊపిరి చెవిలోకి వెళ్ళి అతని ముఖం ఉబ్బింది.

'నా తల తీసినా సరే అతనికి స్పష్టంగా చెప్పేస్తాను', అంది సువాసిని.

'నా భయమేమిటంటే అతనిక్కావలసింది నీతల కాదు', ఆలోచిస్తూ అన్నాడు రాక్షసుడు'.

'మీరంటే నాకిష్టం' ధననందుడితో అంది సువాసిని, తన ఒడిలో ఉన్న అతని తలలో చేతివేళ్ళు పోనిస్తూ, 'మీ ప్రధాని నన్ను ఇరకాటంలో పెట్టేశాడు ప్రియా. నేనతనికి భార్యనవ్వాలని ఆయన కోరిక', అతని కణతలు ఎగిరిపడడం ఆమెకు తెలిసింది.

'రాక్షసుడు నేనివ్వలేనిది నీకేమిస్తాడు, నేను మగధకి చక్రవర్తిని?' కోపంగా అన్నాడు.

తన వేళ్ళని అతని ఛాతీ మీదకి పోనిచ్చి చనుమొనల చుట్టూ గుండ్రంగా గీతలు గీస్తూ, అతని మీదకి వంగింది, 'మీకు తెలుసుగా మనిద్దరి మధ్య జరిగేది నాకెంతిష్టమో. మీ అధికారానికిగాని, సంపదకు గాని నేను విలువనివ్వనని మీకు తెలుసుగా. నేను మిమ్మల్ని ఆరాధిస్తున్నాను, ప్రభూ.'

'నువ్వంటే నాకెందుకిష్టమంటే సువాసినీ, నువ్వు పొద్దునే తల్లిలా సంరక్షించగలవు, మధ్యాహ్నం అభిమానంగా చూసే సోదరిలా, రాత్రివేళ వేశ్యలా మురిపించగలవ్!' అతను మొరటుగా గొణిగాడు.

ఆమె లోలోన వణికిపోయింది, కళ్ళు మూసుకుంది. విష్ణుగుప్తుడెందుకు ఈ త్రిముఖ ప్రేమని సృష్టించాడు?

'నేనతనికి స్పష్టంగా చెప్పేస్తాను. అతని గుండె పగిలితే పగలనీండి' అంది సువాసిని.

'అతని గుండె కాదు పగిలేది. దానికి బాగా కిందున్నది పగులుతుంది', నవ్వాడు ధననందుడు.

అర్థరాత్రికి ముందున్న ముహూర్తం. ప్రాసాదం నిశ్శబ్దంగా ఉంది. మంత్రిమండలి కార్యాలయంలో ధననందుడు తన ప్రధాని రాక్షసుడితో సమావేశమై ఉన్నాడు. స్తంభాలకు కాగడాలు వెలుగుతున్నాయి. గది నిండా నీడలు నాట్యం చేస్తున్నాయి.

'రాక్షసా, నా రహస్యదూతగా వెళ్ళి అలెగ్జాండర్‌ని కలువు. అతను పర్షియాకి వెళ్ళకముందే వెళ్ళికలువు. ధననందుడు అతనికి స్నేహితుడు కావాలనుకుంటున్నాడని, మాననీయ అతిథిగా మగధ ఆయనను ఆహ్వానించాలనుకుంటున్నదని చెప్పు', చెప్పాడు ధననందుడు.

'మహారాజా, గాంధారకు సుదీర్ఘప్రయాణం. అందుకు తగిన ఫలితముంటుందని మీకనిపిస్తోందా? నేను దూరంగా వెళితే మీకు పరిపాలనలో ఎవరు సాయం చేస్తారు?' రాక్షసుడు అడిగాడు.

'నువ్వు లేకపోవడం నాకు లోటే, మిత్రుడా. కాని ఇంత సున్నితమైన వ్యవహారాన్ని నేనితరులకి అప్పగించలేను. అలెగ్జాండర్ ధననందుడికి స్నేహితుడు కాకుండా, అంభికి, పురుషోత్తముడికి స్నేహితుడవడం వల్ల చాలా నష్టం జరుగుతుంది. ఒకవేళ వాళ్ళందరూ నాకు వ్యతిరేకంగా ముఠా కడితే?' అడిగాడు ధననందుడు.

'నాకు సాయుధ బలగం కావాలి నాతో రావడానికి – మన పొరుగు రాజ్యాలన్నీ అల్లకల్లోలంగా ఉన్నాయి', రాక్షసుడు కోరాడు. 'అంతే కాకుండా అలెగ్జాండర్ దగ్గరికి మీ తరఫున స్నేహహస్తం చాస్తూ రాయబారిగా వెళితే విలువైన బహుమతులు కూడా తీసుకొని వెళ్ళాలి'.

'తప్పకుండా ఏర్పాట్లు చెయ్యి రాక్షసా. నీ ప్రయత్నం ఫలిస్తుందని నా నమ్మకం. నీ ఆత్మీయుల కోసం దిగులు పడకు. వాళ్ళకి ఏ లోటూ రాకుండా ధననందుడు తనతోనే ఉంచుకుంటాడు' అన్నాడు ధననందుడు నక్కలా.

'*నువ్వలాగే చేస్తావని నాకు కచ్చితంగా తెలుసు లంజాకొడకా*' అనుకుంటూ వంగి రాజుకు నమస్కరించాడు రాక్షసుడు.

సువాసిని నగరంలోని ఒక శిథిలాలయంలో రహస్యంగా మరొక వ్యక్తిని కలిసింది. అతని పేరు జీవసిద్ధి. కాత్యాయనగారి సేనానాయకుడు, చాణక్యుడిని పులి బారి నుంచి కాపాడినవాడు. ఇప్పుడతను పాటలీపుత్రంలో చాణక్యుడికి నమ్మకస్థుడైన గూఢచారి.

శిథిలాలయం ఎన్నో తరాల నుంచి ఒంటరిగా ఉంది. స్తంభాలు కూలిపోయి గుట్టలుగా పడిపోయాయి. ఏళ్ళ తరబడి జరిగిన దోపిడి, నిర్లక్ష్యం కారణంగా విలువైనదేదీ అక్కడ లేదు. పౌర్ణమి రాత్రివేళ శిథిలాలు వెండి గిన్నెల్లా మెరుస్తున్నాయి. విరిగిపోయి పడిపోయిన గుడి శిథిలాలు చంద్రమండలం మీద దృశ్యంలా కనిపిస్తున్నాయి. జీవసిద్ధి పట్టుకొచ్చిన కాగడా అవసరం లేదు నిజానికి. ఎవ్వరూ రాని ఆ దేవాలయం ఎన్నో తరాలుగా శాపానికి గురై ఉంది– స్థానిక పూజారులు గుడి ఆవరణలో ఒక ఋషిని నిద్రించకుండా ఆపినందుకు ఆయన కోపంగా శాపమిచ్చాడు.

'నా కోసం ఏమైనా తెచ్చారా?' అడిగాడు జీవసిద్ధి. ఆమె తల వూపి రెండు పట్టు సంచులను అతనికి ఇచ్చింది. ఒక దానిలో ధననందుడి రాజముద్ర ఉన్న ఉంగరం ఉంది. రెండోదానిలో రాక్షసుడికి అతడి తండ్రి ఇచ్చిన ఉంగరం ఉంది. దాని మీద వాళ్ళ కుటుంబ చిహ్నం ఉంది.

'విష్ణు గుప్తుడు నరకంలో పడి నాశనం కావాలని నా కోరిక', ఆమె జీవసిద్ధితో కోపంగా అంది. 'తన రాజకీయ ఆశలు తీర్చుకొనడానికి నన్ను నేనే వేశ్యలా మార్చుకొనేలా చేశాడు'.

'మనం చేసే ప్రతి పని వెనక ఒక ఉన్నతాశయం ఉంటుంది సువాసినిగారూ', అన్నాడు జీవసిద్ధి. 'ఆచార్య చాణక్యుడు ఈ సందేశాన్ని మీకు వినిపించి, తరువాత ఈ కాగితాన్ని నాశనం చెయ్యమన్నారు'.

'ఏమిటి? విష్ణు సందేశం పంపాడా? ముందే ఎందుకు చెప్పలేదు? ఏముంది దానిలో నాకు చెప్పు' బతిమాలింది సువాసిని. జీవసిద్ధి తన నడుముకి కట్టుకొన్న కాగితపు చుట్టని తీశాడు. దాన్ని విప్పి చదవసాగాడు.

'నా ప్రియమైన సువాసినీ, నేను నిన్ను ప్రేమించానన్నది రహస్యమేమీ కాదు. కాని నువ్వు నాకందనంత దూరంలో ఉన్నావని నాకెప్పుడూ తెలుసు. కాని నువ్వే నా అసలైన ప్రేమవి. నిన్నే నేను ప్రేమించాను. కాని నేనిప్పుడున్న అధికార రాజకీయ ప్రపంచంలో – భారతదేశ ఐక్యతను భద్రతను కాపాడడానికి – నా జీవితంలో ఏ స్త్రీకీ చోటులేదని నాకు తెలుసు. భారతదేశాన్ని బలమైన సంఘటిత దేశంగా చేయాలనే నా కల నెరవేరేవరకూ నేను బ్రహ్మచర్యం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేశాను. నాకల నెరవేరేసరికి నేను వృద్ధుణ్ణి కావచ్చు, నిజానికి నా ప్రతిజ్ఞ తీరినా దాని వలన ఫలితముంటుందో, లేదో ఎవరికి తెలుసు! నాకోసం నువ్వు చేసిన దానికి నేను కృతజ్ఞుణ్ణి – నిన్నలా చేయమని

అడగడం చాలా కష్టంతో తీసుకున్న నిర్ణయం. ఎంతో ఉదాత్త ప్రయోజనం కోసం నువ్వు ఈ పని చేశావని గుర్తుంచుకోమని చెబుతున్నాను. నేను కూడా మర్చిపోనని వాగ్దానం చేస్తున్నాను. చాణక్యుడు నీకు కృతజ్ఞతలు చెబుతున్నాడు. విష్ణుగుప్తుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. దేవుడు నిన్ను చల్లగా చూడాలి'.

ఆ మాటలు వింటున్నప్పుడు ఆమె కళ్ళు చమర్చాయి. మళ్ళీ ఒకసారి చదవమని అడుగుదామనుకొనేలోపే జీవసిద్ధి ఆ కాగితాన్ని కాగడా దగ్గర పెట్టి కాల్చేశాడు. చీకటి రాత్రిలో వెళ్ళడాని కుద్యుక్తుడై వెనుతిరిగి 'శుభరాత్రి సువాసినిగారూ' అంటూ వెళ్ళిపోయాడు. కాగడా పొగ ఆనవాలుగా వదులుతూ. సువాసిని వణికిపోయింది. చాణక్యుడు విజయం సాధించాలని ఆమె ఎంతగానో కోరుకుంది. అతనికి విజయం చేకూర్చమని ఆమె శివుణ్ణి ప్రార్థించింది. ***'ఓం త్రయంబకం యజామహే, సుగన్ధిం పుష్టివర్ధనమ్; ఉర్వారు కమివ బన్ధనామ్, మృత్యోర్ముక్షీయ మామృతాత్'*** అని జపించింది. అది ఋగ్వేదంలోని ప్రాచీన మంత్రం. దాని అర్థం *'ఓ త్రినేత్రుడా నీకు వందనం, సమృద్ధిని పెంపొందించేవాడా, సుగంధం కలవాడా, లోకాన్ని వ్యాధులనుంచి మృత్యువు నుంచి రక్షించేవాడా! పండు నుంచి రసాన్ని తీసినట్టుగా ముక్తి కలిగించు. శివా, అమరత్వాన్ని ప్రసాదించు!'* తన ప్రియుడు విష్ణుగుప్తుని కోసం సువాసిని ఆ మంత్రాన్ని వేలసార్లు జపిస్తుండగా మగధలో భవిష్యత్తు సంఘటనలు జరుగుతూపోయాయి.

ధననందుడి ముందు నిలబడిన గూఢచారుల ప్రధానాధికారి భయపడుతున్నాడు. ఈ కపట క్రీడలో తానెలా ఇరుక్కున్నాడా అని ఆశ్చర్యపోయాడు. రాక్షసుడి శిబిరం నుంచి కేకయకు వెళుతున్న సందేశకుడి నుంచి లాక్కున్న సందేశాన్ని ధననందుడు చదవడం పూర్తవడానికి ఎదురుచూస్తూ వ్యాకులంగా తన ఉత్తరీయాన్ని సర్దుకుంటూ నిలబడ్డాడు. ధననందుడి ముఖంలో ఆగ్రహం నిండుగా ఉంది. అవి నిజమని నమ్మాలని అనుకోవడానికి పెదాలతో కాగితం మీద రాసిన పదాలను చదువుతున్నాడు.

'ఓ మహారాజా పురుషోత్తమా, మగధ ప్రధాని రాక్షసుడు అభినందనలు తెలుపుతున్నాడు. నేను మీ రాజ్యానికి వస్తున్నాను. నేను మగధ ప్రభుత్వ ప్రధానాధికారిగా రావడం లేదు. నా వ్యక్తిగతంగా వస్తున్నాను. మీ సాహసం, వివేకం, గౌరవాలను గురించి అద్భుతంగా చెప్పుకొనడం విన్నాను. మీకు ఉచితమనిపిస్తే, మనిద్దరికీ పరస్పరం ప్రయోజనకరంగా ఉండే ఒప్పందం గురించి చర్చించాలనుకుంటున్నాను. ఇది నా

హెూదాను పెంచడమే కాకుండా, మీ సరిహద్దులను బాగా విశాలం చేస్తుంది. ఈ సంభాషణ రహస్యంగా జరగడం అత్యవసరం. త్వరలో సమావేశానికి ఆహ్వానిస్తారని ఆశిస్తాను. మీ విధేయుడైన సేవకుడు, రాక్షసుడు'.

'ఈ లేఖ అతనే రాశాడని ఎలా తెలుస్తుంది మనకు?' అడిగాడు ధననందుడు, ఇది నకిలీదని తేలుతుందనే ఆశతో.

'ఇది అసలైనదేననడంలో ఏమాత్రం సందేహించనవసరం లేదు ప్రభూ' అన్నాడు గూఢచారుల అధికారి. అతను ముందుకు వచ్చి రాక్షసుడి ఉంగరాన్ని ఇచ్చాడు. 'కేకయ రాజుకు తన పరిచయం తెలిపే విధంగా ఆ లేఖతోపాటు ఈ ఉంగరం జత చేశాడు'.

'ద్రోహ పిశాచి!' ధననందుడు అరిచాడు. 'ఆ వెధవని పట్టుకుని ఇక్కడకు లాక్కురండి విచారించడానికి. నా నమ్మకాని, స్నేహాన్ని మోసం చేశాడు. రాజ్యంలోనే ఉన్నతాధికారిని చేశాను వాణ్ణి. వాడిలా బదులు తీర్చాడు. కృతఘ్నుడు! వాణ్ణి తీసుకురావడానికి సైన్యాన్ని పంపవలసి వచ్చినా, పంపండి!' ఆదేశించాడు.

'నా ప్రియమైన సువాసినీ, రాక్షసుణ్ణి మగధ నుంచి పంపించెయ్యడంలో సఫలం చెందాను. వాడు చాలా నెలలపాటు తిరిగిరాడు. ఇప్పుడు మన మధుర సమాగమానికి ఏ అడ్డంకీ లేదు. నిన్ను ముద్దుపెట్టుకోవాలని, కౌగిలించుకోవాలని ఆరాటపడుతున్నాను. భయపడకు. రాక్షసుడు ఇంక తన ప్రయాణం నుంచి వెనక్కి రాడు. మగధకి తిరిగి వచ్చేలోపు వాడిని చంపెయ్యమని నా మనుషులకు ఆదేశాలిచ్చాను. దేనికోసం నిరీక్షిస్తున్నావు? త్వరగా రా. నీ ప్రేమదాసుడు, ధననందుడు'

సందేశం స్పష్టంగా ఉంది. ధననందుడి రాజముద్ర ఉన్న ఉంగరాన్ని చూశాడు రాక్షసుడు, అది చుట్టి ఉన్న కాగితంలో ఉంది. అది అతనికి తెలుసు! ఆ విశృంఖల కాముక లంజాకొడుకు తనని చంపాలనుకున్నాడు, సువాసినిని తానొక్కడే సొంతం చేసుకోవాలని. రాజ్యంలో అందమైన ఆడాళ్ళనెందరినో వాడికి బహుమతిగా ఇచ్చాడు కాని ఆ కామపిశాచికి రాక్షసుడు కోరుకున్న ఆడదే – తన సువాసినే కావాల్సి వచ్చింది.

ఇంక చాలు! జీవితమంతా ధననందుడికి తార్చుతూ బతికాడు. అభినందించడానికి బదులు, క్రూరమృగాన్ని వేటాడినట్టు వేటాడుతున్నారు. దీన్ని సమర్థంగా ఎలా ఎదుర్కోవాలి అని ఆలోచించాడు తళుక్కున మెరిసింది ఆలోచన – చాణక్యుడు!

'బుద్ధి లేదు నీకు! వేడి జావని పైపైన తినాలి మొదట, చల్లగా ఉంటుంది, మధ్యలోనుంచి కాదు. వేడిగా ఉంటుంది. పిల్లవాడి కాలిన వేళ్ళను ఊదుతూ అంది తల్లి. దండాయనుడి కుటీరం బయట కూర్చున్న చాణక్యుడు దండాయనుడి పరిచారిక తన బిడ్డను కోప్పడుతున్న దృశ్యాన్ని చూస్తున్నాడు.

ప్రకృతి సంపదకు నిశ్శబ్దోదాహరణ దండాయనుడి ఆశ్రమం దట్టమైన చెట్ల మధ్య ఉన్న ఆశ్రమం, సెలయేటి ఒడ్డున ఉంది. అక్కడి గాలి మహిమాన్వితంగా ఉంటుంది. వర్ణించనలవి కాదు. స్వచ్ఛమైన గాలి, దేవదారు, యూకలిప్టస్ చెట్ల సుగంధం, హోమాగ్నుల పవిత్రమైన పొగ అన్నీ కలిసిన గాలి. రోజూ జరిగే ఈ సంఘటనను చూసి ముగ్ధుడవుతున్న చంద్రగుప్తుడు చాణక్యుని పక్కనే కూర్చుని ఉన్నాడు. దూరంగా చూస్తున్నప్పుడు, చాణక్యుడు తనని చూసి నవ్వుతున్నట్టుగా అనిపించింది అతనికి. 'ఏమిటిది ఆచార్యా?' అనడిగాడు చంద్రగుప్తుడు, చాణక్యుడు చిరునవ్వు నవ్వాడంటే అతడేదో తంత్రం పన్నుతున్నట్టే. అది చంద్రగుప్తుణ్ణి స్థిమితంగా ఉండనీయలేదు.

'నేను ఇంతకాలం పొరపాటుగా వ్యూహం పన్నాను,' చివరికి చాణక్యుడు అన్నాడు. చదువుకోని, నిరక్షరాస్యురాలైన ఈ తల్లి నాకంటె ఎంతో తెలివైనది. వివేకి, జ్ఞాని అయిన చాణక్యుడు నిర్వచించలేనిది సరైన యుద్ధవ్యూహాన్ని తెలిపింది ఆమె'. చంద్రగుప్తుడికి అయోమయంగా అనిపించింది కాని మౌనంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఎలాగూ తరచి తరచి అడక్కుండానే గురువుగారు తనంతటతానే వివరిస్తాడు.

'ఈ రోజు వరకూ, నా దృష్టి అంతా మగధ మీద, చక్రవర్తిగా నీ పట్టాభిషేకం మీద మాత్రమే ఉంది. నేను పొరబడ్డానని నాకిప్పుడనిపిస్తోంది. జావ మధ్యలో ఉన్నది మగధ. దాని చుట్టూ ఉన్న సరిహద్దులని జయించాలి. మగధ సులభంగా చిక్కుతుంది', వివరించాడు చాణక్యుడు. 'మగధను సవాలు చేయగల రెండు రాజ్యాలు కేకయ, గాంధార రాజ్యాలు. మన విభజించు-పాలించు విధానంతో రెండూ నిర్వీర్యమయ్యాయి. మగధలో ధననందుడికి, రాక్షసుడికి మధ్య అగాధాన్ని సృష్టించడంలో సువాసిని సఫలమైంది. కొద్ది రోజుల్లోనే రాక్షసుడు ఇక్కడికొస్తాడు. కొన్నాళ్ళు కిందటే తాను తప్పనిసరిగా వస్తానని సమాచారం పంపాడు. కపటియైన రాక్షసుడు మనకు మిత్రుడవుతాడని ఎవరనుకున్నారు? రాజకీయాలు గిట్టని వాళ్ళతో పడుకునేలాచేస్తాయి!' నవ్వాడు చాణక్యుడు.

'కాని ఆచార్యా, మగధ ఈనాటికీ ఉత్తర భారతంలో బలమైన రాజ్యమే, రెండు లక్షల కాల్బలం, ఎనభై వేల అశ్వికదళం, ఎనిమిదివేల రథబలం, ఆరు వేల గజబలం,

మగధని జయించడం కష్టం. అలెగ్జాండర్ సైనికులే గంగను దాటడానికి సాహసించలేక పోయారు!' అబ్బురంగా ఉన్నాడు చంద్రగుప్తుడు.

'తెలివిగా నడిపిస్తే పదిమంది సైనికులే తలలేని వందమందిని ఓడిస్తారు,' అన్నాడు చాణక్యుడు. యుద్ధం అంటే మోసగించడమే. ప్రత్యక్షంగా బలాన్ని ఉపయోగించడం ఏ సమస్యకీ పరిష్కారం కాదు. చిన్న పిల్లలే అలా చేస్తారు!'

భేరీ నినాదాలు వినిపించడంతో వాళ్ళ చర్చలకు అంతరాయం కలిగింది. సైనికులు కవాతు చేస్తూ వస్తున్న శబ్దం వినిపించింది.

'సింహరణ్!' కేకవేశాడు చాణక్యుడు. 'చూడు ఎవరో. త్వరగా!' గుసగుసగా అన్నాడు దగ్గరికొస్తున్న సింహరణ్‌తో.

'అలెగ్జాండరే వస్తున్నాడు' చెట్టు దిగుతూ అన్నాడు సింహరణ్' దండాయన మహర్షికి నమస్కరించడానికి వస్తున్నాడు' అలెగ్జాండర్ తనకి ప్రియమైన గుర్రం బ్యూసెఫలస్‌పైన ఉన్నాడు. గుర్రాలను పెంచే థెసాలియా వ్యక్తి అలెగ్జాండర్ తండ్రైన 2వ ఫిలిప్‌రాజుకు మూడు వేల టాలెంట్లకు అమ్మాడు. కాని అశ్వశిక్షకులెవ్వరూ దానిని ఎక్కి మచ్చిక చేసుకోలేకపోయారు. ఎక్కాలని ప్రయత్నించిన ప్రతి ఒక్కరినీ అది పైకెగిరి పడేసేది. అలెగ్జాండర్ ఒక్కడే విజయం సాధించాడు. అప్పటినుంచీ దాన్ని తన వద్దే ఉంచుకున్నాడు. అలెగ్జాండర్ సేనానాయకులకన్న బ్యూసెఫలస్ చాలా దేశాలు, చాలా యుద్ధాలు చూసింది.

అలెగ్జాండర్ పరిజనంతో ఆశ్రమం చేరగానే గుర్రం దిగాడు. వారిని దండా యనుడు, యోగవ్యాయామాలు చేస్తున్న ఆయన శిష్యగణం వద్దకు తీసుకెళ్ళారు. ఒక వ్యాయమంలో పాదంతో నేలను గట్టిగా కొడతారు. వాళ్లు దేవుడులాంటి అలెగ్జాండర్ రాకని పట్టించుకొనకుండా వ్యాయామం చేస్తూనే ఉన్నారు. దూరంగా కూర్చున్న చాణక్యుడు ఇది చూసి భుజాలెగరేశాడు. ఇప్పుడు తమాషా చూడాలి.

అలెగ్జాండర్ సిసీలియను శైలిలో ఉన్న పొట్టి చేతుల జుబ్బాను వేసుకున్నాడు. తోలుబెల్టుతో ఛాతీకున్న నూలు తొడుగుని కట్టాడు. శిరస్త్రాణం బాగా మెరుస్తూ, తెల్లని తురాయితో ఉంది. మెడచుట్టూ రత్నాలతో చేసిన నగ ఉంది. సైప్రసు చక్రవర్తి బహుమతిగా ఇచ్చిన అతని కత్తి కఠినమైనదైనా వేగం కలది. పక్కన వేలాడుతూ ఉంది. ఆఫ్ఘను గిరిజన నాయకుడు ఇప్పుడు మాసిడోనియా సైన్యంలో కీలక సేనాని శశిగుప్తుణ్ణి వ్యాఖ్యాతగా

చేసుకుని నేల మీద పాదాలను గట్టిగా కొట్టడం ప్రాముఖ్యం ఏమిటో చెప్పమని దండాయనుడిని అడిగాడు అలెగ్జాండర్. దండాయనుడి సమాధానం స్పష్టంగా ఉంది. 'రాజాధిరాజా, మనిషితను పాదం మోపినంత స్థలాన్నే పొందగలడు, కాని ఇంకా ఇంకా భూమి సొంతం చేసుకోవాలని చూస్తాడు. కాని మనిషి త్వరగా చనిపోతాడు, ఆ స్థితిలో పాతిపెట్టటానికి తగినంత భూమే తనకు కావలసింది'.

అలెగ్జాండర్ తెల్లబోయాడు. ఋషి సాహసానికి అతని సేనానులు ఊపిరి బిగ్గబట్టి ఏం జరుగుతుందోనని చూస్తున్నారు. అయితే ఒక క్షణం తర్వాత అలెగ్జాండర్ తేరుకున్నాడు. ఆ మాటలు పట్టించుకోలేదు. నగ్నంగా పద్మాసనం వేసుకుని కూర్చున్న ఋషి ముందు మోకరిల్లాడు. 'నాతో రండి ఋషి వర్యా, నా వ్యక్తిగత సలహాదారుగా ఉండండి. మిమ్మల్ని సువర్ణంలో ముంచెత్తుతాను. మీకే లోటూ రాకుండా చూస్తాను', అతను వేడుకున్నాడు. జ్ఞానులైన గురువుల ప్రాముఖ్యం అలెగ్జాండరుకు తెలుసు. అతని తల్లి ఒలింపియా తన బంధువు లియోనైడస్‌ను అతనికి ట్యూటర్‌గా నియమించింది. తండ్రి ఫిలిప్ కౌమారుడైన యువరాజుని గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ శిష్యునిగా పంపాడు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే, లియోనైడస్, అరిస్టాటిల్ ఇద్దరూ జీవించడమెలాగో నేర్పారని అలెగ్జాండర్ చెప్పేవాడు.

'అలెగ్జాండర్, నువ్వెలా దైవపుత్రుడివో నేను కూడా అలాగే దైవపుత్రుడిని. నీ నుంచి నాకేమీ వద్దు. నాకున్నది నాకు చాలు. నువ్విచ్చేదేదీ నాకు అవసరం లేదు; ఆ ఆశీర్వచనాలు నాకు అందుతాయి. అవి నీకూ అందుతాయేమో బహుశా. భారతదేశం రుతువులకనుగుణంగా తన నేలలో పండించే పండ్లు నేను జీవించి ఉన్నంతకాలం నాకు చాలు. నేను చనిపోతే, ఈ బీద శరీరం వదిలేస్తాను - నాది కాని నివాసాన్ని!' సమాధానమిచ్చాడు ఋషి. ఎట్టకేలకు అలెగ్జాండర్‌కు సమ ఉజ్జీ దొరికాడు.

దండాయనుడికి నమస్కారం చేస్తూ జోడించిన చేతులను అలాగే ఉంచి లేచాడు. 'అయినా నాకు మీ ఆశీర్వాదాలు కావాలి మహాయోగీ. నేను యుద్ధంలో విజయం సాధించాలని ఆశీర్వదించండి', అడిగాడు అలెగ్జాండర్.

'నాయనా, నీకు నా ఆశీస్సులు. నీలో రేగే యుద్ధంలో నువ్వు విజయం సాధించు!' అలెగ్జాండర్ కోరిన ఆశీస్సు అది కాదని తెలిసీ ఆశీర్వదించాడు ఋషి.

అంతర్గతంగా రేగిన యుద్ధం అతని దళాల ధైర్యాన్ని తగ్గించి వేసింది. పర్షియాకు గుణపాఠం చెప్పడానికి అలెగ్జాండర్ మనుషులు మాసిడోనియా వదిలిపెట్టారు. వాళ్ళు

దానిని జయించడమే కాకుండా స్వాధీనం చేసుకున్నారు. వాళ్ళు అలెగ్జాండర్‌ను పర్షియా షాహెన్‌షాగా మౌనంగా అంగీకరించారు. అతని చలచిత్తాన్ని, చాపల్యాలను సహించారు. భారతదేశంలోకి చొచ్చుకొని వచ్చారు. గాంధారను, కేకయను దాటి వచ్చారు. ఇప్పుడు వాళ్ళ రాజు మగధతో యుద్ధం చేయమంటున్నాడు. అది ఆర్కిమెనిడియా సామ్రాజ్యంలో భాగమే కాదు, భరించలేని వర్షాలు, దుర్భరమైన ఎండలో ప్రయాణించాల్సి వస్తోంది. అలెగ్జాండర్ భారతదేశం నుంచి వెనుదిరగడం ఎంత తథ్యమో తిరుగుబాటు కూడా అంతే తథ్యం.

'చాణక్యా, నా మిత్రుడా, మళ్ళీ నిన్ను చూడడం ఎంత బాగుంది' అబద్ధమాడుతూ రాక్షసుడు తన శిక్షాదేవతని ఆలింగనం చేసుకున్నాడు.

'రాక్షసా, నీ సమక్షమే నాకు ఆత్మవిశ్వాసాన్ని, ఆనందాన్నిస్తోంది', బ్రాహ్మణుడు కూడా అబద్ధమాడాడు తిరిగి.

'ధననందుడు అన్ని మర్యాదల పరిధులను అతిక్రమించాడు', ఫిర్యాదు చేశాడు రాక్షసుడు.

నువ్వో పెద్ద మర్యాదస్తుడివి, నీ నైతికతకు విరుద్ధంగా ఉంది ఇది, అనుకున్నాడు చాణక్యుడు తనలో వ్యంగ్యంగా. 'ధననందుడి ఆస్థానం నీలాంటి మర్యాదస్తులు ఉండాల్సిన చోటు కాదు – మర్యాదగా, సుఖప్రదంగా జీవించాలనుకొనేవారికి', చాణక్యుడు పైకి అన్నాడు మృదువుగా.

'కాని జీవితంలో సుఖాన్నిచ్చే చాలా విషయాలు సాధారణంగా అక్రమం, అనైతికం లేదా లావయ్యేలా చేస్తాయి అదే సమస్య', అంటూ హాస్యమాడుతూ, తన కోసం వేసిన చాప మీద కూర్చున్నాడు రాక్షసుడు.

'ఈ రోజు నేను చెప్పే పాఠమేమిటంటే, రాక్షసా, ఇద్దరు చెడ్డ మనుషులలో మనకు తెలియని మనిషిని ముందు ఎంచుకోవాలి. నేనే ఆ ప్రత్యేక చెడ్డ మనిషిని' అన్నాడు చాణక్యుడు చిరునవ్వుతో. 'ఇప్పుడు నీకోసం నేనేం చేయగలనో, నా కోసం నువ్వేం చేయగలవో ఆలోచించు చూద్దాం'.

'ఎప్పుడూ అధ్యాపకుడివే!' నవ్వాడు రాక్షసుడు.

'ఎప్పుడూ సరైనదే చెబుతాను', అన్నాడు చాణక్యుడు కల్పించుకుని గంభీరంగా. 'ధననందుడు నీ ప్రేయసిని లాక్కున్నాడు', అని మొదలుపెట్టాడు.

'నీ ప్రేయసి అని కూడా తెలిసింది నాకు', జాగ్రత్తగా అన్నాడు రాక్షసుడు.

'నేను నీకు పోటీ కాదు, రాక్షసా, నన్ను చూడు. నల్లగా, అనాకారిగా, మచ్చలతో వంకర టింకరపళ్ళతో, మోటుగా ఉన్న నేను - బ్రాహ్మణుణ్ణి. నీతో-మచ్చలేని, మనోహరమైన సంస్కారం గల ప్రధానితో పోటీ పడగలనా? నేను సువాసినిని కోరనని నీకు వాగ్దానం చేస్తున్నాను. ఆమె నీదే, మధ్యలో ధననందుడు రాకపోతే'.

'అదెలా సాధ్యం? అతను స్థిరంగా సింహాసనం మీద కూర్చున్నాడు. అతని ఆధీనంలో భారతదేశంలోని పెద్ద సాయుధ బలగం ఉంది - అలెగ్జాండర్నే భయపెట్టి వెనుదిరిగేలా చేసిన బలగం'.

'మిత్రమా, యుద్ధాలను యుద్ధరంగంలోనే చేయనవసరం లేదు. సైనికులు, రక్తపాతం లేకుండా యుద్ధాలు చేయవచ్చని నేనెప్పుడూ అనుకుంటాను', చెప్పాడు చాణక్యుడు మృదువుగా.

'ఆచార్యా, అన్ని యుద్ధాలను అంతం చేయగల ప్రణాళిక ఏదైనా నీ దగ్గరుందా?' అడిగాడు రాక్షసుడు.

'రాక్షసా, ప్రతదీ చివరికి సక్రమంగానే అనిపిస్తుంది. ఒకవేళ అది సక్రమంగా లేకపోతే అది ముగింపు కాదు' తన కొత్త మిత్రుడి కళ్ళలోకి చూస్తూ మృదువుగా మామూలుగా చెప్పాడు చాణక్యుడు.

పాటలీపుత్రం తూర్పు జిల్లాలో శివవీధిలో అంతగా ప్రాముఖ్యం లేని ఇల్లుంది. ఆ ఇంట్లో ఒకప్పటి రాజ నర్తకి నృత్య పాఠశాల నడుపుతోందని తెలుసు పొరుగువారికి. ఒక అంతస్తున్న భవనం బయటికి కనిపించని ఆవరణలో ఉంది. అక్కడే ఉండి బాలికలు కళను అభ్యసిస్తారు. ఆ సంస్థకు ఏభై ఏళ్ళ వయసున్న హుందాగా ఉన్న స్త్రీ ప్రధానాధ్యాపకురాలు. ఆమె ఒకప్పుడు ధననందుడి ఆస్థాన నర్తకి. రాజోద్యోగం నుంచి ఆమెని విడిపించడానికి సంపన్నుడైన దాత ఒకరు ఇరవై నాలుగువేల పణాలు చెల్లించాడని అంటారు.

విద్యార్థినులు బీద కుటుంబాల నుంచి వచ్చినవారు. తమ కుటుంబాన్ని, తమను పోషించుకొనడానికి వారికి ఏదో ఒక వృత్తి అవసరం ఉంది. వాళ్ళు ఆరు నుంచి ఎనిమిదేళ్ళ వయసులో సంస్థలో చేరతారు. చిత్రకళ, కవిత్వం, సంగీతం, నృత్యం, పాటలు పాడడం, వంట చేయడం, నటించడం వంటి కళలు నేర్పుతారు. వారి శిక్షణలో కాని, పోషణలో కాని ఏలోటూ రానీయరు. వారికి ఉత్తమ వసతి, వస్త్రాలు, ఆహారం, సౌకర్యాలు కల్పిస్తారు. వారి ప్రధానాధ్యాపకురాలు, ఉపాధ్యాయులు దయగలవారు, సహృదయులు.

అయితే అక్కడ అతిక్రమించడానికి వీలులేని ఒక నియమం ఉంది. వాళ్ళు ప్రతి రోజూ సాయంత్రం తప్పనిసరిగా గ్లాసు పాలు తాగాలి. పాలు రకరకాల రంగులు, సాంద్రత, రుచులు కలిగి ఉంటాయి. ప్రతి ఒక్క బాలికకు నిర్దిష్ట పరిమాణంలో ప్రత్యేకంగా పాలు కలుపుతారు. ప్రధానాధ్యాపకురాలే ఏ బాలిక ఏం తాగింది అనే వివరాలతో రికార్డులో నమోదు చేస్తుంది. బాలికలు గారాబంగా, నిశ్చింతగా ఉండవచ్చు, కాని పాఠశాలలో అడుగుపెట్టగానే ఈ ఒక్క నియమాన్ని పాటిస్తూ, ప్రశ్నించకుండా ఉంటే చాలు.

ఆరు నుంచి ఎనిమిదేళ్ళ బాలికల్లో స్త్రీ సహజ లక్షణాల ఎదుగుదల కనిపించకపోతే వారికి కుడుబ పొడిని – నీలిరంగు పాలను రోజూ ఇస్తారు. వారికి ఎనిమిది నుంచి పదేళ్ళ వయసులో చనుమొనలు కనిపిస్తాయి, వారికి కాషాయం – నారింజ రంగులోని ద్రవాన్ని రెండు కుడుబలు ఇస్తారు. పన్నెండు నుంచి పధ్నాలుగేళ్ళ వయసులో వారికి జననాంగాల దగ్గర వెంట్రుకలు రాగానే రోజూ సాయంత్రం ఇచ్చే కషాయం మూడు కుడుబలు అవుతుంది. అది లేత ఆకుపచ్చరంగులో ఉంటుంది. ఇదే వయసులో చంకల్లో వెంట్రుకలు పెరుగుతూ, వారి ఛాతీ, పిర్రలు పెరుగుతున్నప్పుడు, వారికి రోజూ చెర్రీ–గులాబీ పాల పానీయాన్ని ఒక ప్రస్థను ఇస్తారు. పధ్నాలుగు నుంచి పదహారేళ్ళ వయసులో వారు పుష్పవతులై అండోత్పత్తి దశరాగానే రోజూ వారికి రెండు అధకాలు అల్మండ్ గోధుమ రంగులోని పాలకషాయాన్ని రోజూ ఇస్తారు.

సంస్థను గురించి బాగా అధ్యయనం చేసే వారికెవరికైనా కుతూహలం కలిగించే విషయం తెలిసేది! బాలికలందరూ చంద్రుడు విశాఖ నక్షత్రంలో ఉన్నప్పుడు, శుక్లపక్షంలో సప్తమితిథి, మంగళవారం రోజున జన్మించిన వారే. వారి జాతకాల్లో, వారితో సంగమించిన ఏ వ్యక్తి అయినా మరణిస్తాడని ఉంటుంది దురదృష్టవశాత్తు. వారిని విషకన్యలు అంటారు.

ఈ సంస్థకు నిధులెవరిస్తున్నారనేది గనుక పరిశోధిస్తే, మరింత కుతూహలం కలిగించే నిజం తెలిసేది. నెమలి ధర్మకర్తృత్వ సంఘం దీనికి మొత్తం మూలధనాన్ని

ఇచ్చింది. దీని వ్యవస్థాపకులు చాణక్యుడు, సేనాపతి మౌర్యుడు. మౌర్యుడు తన పేరు మోర్‌ను దీనికి తగ్గట్టుగా పెట్టాడు.

'మాళవ రాజ్యంపై మనకు నియంత్రణ కావాలి', చెప్పాడు చాణక్యుడు. మనకి సరిగ్గా సరిపోయే అభ్యర్థి సింహరణ్ – అతని తండ్రి – న్యాయంగా దాని రాజు. అతన్ని సోదరుడు హత్య చేశాడు, అలా చేస్తే పురుషోత్తముడితో స్నేహం చేయవచ్చని. సింహరణ్ గనుక అధికారంలో ఉంటే మన దళాలను అక్కడ ఉంచే అవకాశం ఉంటుంది'.

'మనకి చాలినంత సైన్యం ఉంది. దాడి చేద్దాం' చంద్రగుప్తుడు సూచించాడు అనుకున్నట్లుగానే.

'అది తెలివితక్కువతనం. శత్రువు తప్పు చేస్తుండగా మధ్యలో ఆటంకం కలిగించకూడదు', సలహా చెప్పాడు కుటిల బ్రాహ్మణుడు.

'మాళవ రాజ్యం ఏ తప్పు చేస్తోంది?' అర్థం కాని చంద్రగుప్తుడడిగాడు.

'చేయడం లేదు. చేయబోతోంది'.

'చేయబోతోందా? మళ్ళీ మీరు పొడుపు కథల్లోలా మాట్లాడుతున్నారు.'

'మాళవ రాజ్యం తనంతట తాను మనకు లొంగిపోతున్నది', అన్నాడు చాణక్యుడు, చంద్రగుప్తుణ్ణి నిశ్చేష్టుడిని చేసి వదులుతూ.

నిపుణకుడి కుటీరం భయం పుట్టించేలా ఉంది. అది నిర్మానుష్యంగా ఉన్న స్మశానం చివర ఉండడం ఒక కారణం. రెండోది భయంకరమైన మర్రిచెట్లు దాని చుట్టూ ఉన్నాయి. వాటి నుంచి క్షుద్ర విద్యలకు సంబంధించిన గుర్తులు వేలాడుతూ ఉన్నాయి – పుర్రెలు, చచ్చిన జంతువులు, కుండల్లో మద్యం, సిందూరం పూసిన కత్తులు, నిపుణకుని క్షుద్ర సామ్రాజ్యాన్ని పాలించే దుష్టశక్తులకు సమర్పించే నైవేద్యాలు ఎన్నో వేలాడుతున్నాయి. నిగూఢవైద్యం, ఔషధ విద్య, ఇంద్రజాలం, జ్యోతిషం, మానసిక శాస్త్రాలను విపరీత ధోరణిలో ఉపయోగించే నిపుణకుడు నల్లటి బట్టలు వేసుకుని, మెడలో చిన్నపిల్లల పుర్రెల దండ వేసుకున్నాడు. అతను చేసే పూజల్లో మానవ బలులు, తాంత్రికమైన లైంగిక సంపర్కం ఉంటాయి.

చాణక్యుడు ఇంద్రజాలాన్ని ఏమాత్రం నమ్మడు, అర్థరాత్రి నిపుణకుడు శవం మీద నిలబడి అగ్నిలో మద్యం పోస్తూ నృత్యం చేసినా చాణక్యుడు ఏమాత్రం పట్టించుకోడు. ప్రతి విషయాన్ని కారణాలతో విశ్లేషిస్తాడు. అతను నమ్మేది తెలివి తక్కువ వారి శక్తిని, మూక మనస్తత్వం చేసే పొరబాటుని.

'యశోవంతులైన చాణక్యులవారు నా బీద నివాసానికి వేంచేశారు దేనికి?' అడిగాడు నిపుణకుడు, కిందికి వంగి.

'వినయం ప్రదర్శించకు నిపుణకా. నువ్వంతటి గొప్పవాడివి కావు. వినయాన్ని రాజులకు వదిలిపెట్టు!' చాణక్యుడతనికి సలహా ఇచ్చాడు.

నిపుణకుడు నవ్వాడు. చీకటి అరణ్యంలో దుష్టబుద్ధిని, వినాశాలను సూచిస్తూ ప్రతిధ్వనించిందా నవ్వు. 'మీరు ఖచ్చితంగా మనసులో ఏదో ప్రణాళిక వేసుకున్నారని పిస్తోంది', అన్నాడు నిపుణకుడు. 'కన్యని ఎవరినైనా బలి ఇవ్వాలా?'

'ఎవరూ కన్యగా ఉండరు నిపుణకా. జీవితం అందరినీ అనుభవించేస్తుంది', అన్నాడు చాణక్యుడు సరదాగా. నిపుణకుడు మళ్ళీ నవ్వాడు. భూతశాస్త్రాల మాంత్రిక వైద్యుడు హాస్యాన్ని వినోదిస్తూ నవ్విన నవ్వు మరింత భయంకరగా ఉంది. మానవ మేధలోని నిమ్నాతినిమ్నలోతుల్లోకి చొచ్చుకు పోగల అసాధారణ నిపుణత చాణక్యుడికి ఉంది. అది అతడి కున్న ఉత్తమ ఆస్తి.

'ఇతను నా శిష్యుడు సింహరణ్', తనతో వచ్చిన వ్యక్తిని చూపిస్తూ చెప్పాడు చాణక్యుడు. 'మాళవ రాజ్యానికి అసలైన వారసుడు. అతనికి మళ్ళీ రాజ్యం ఇప్పించడానికి నీ సహాయం కావాలి'.

'నేను మామూలు తాంత్రికుణ్ణి ఆచార్యా, ఏదో ఒక పూజచేసి అతన్ని సింహాసనం ఎక్కించగలను', నిపుణకుడు సూచించాడు.

'చవటలను మోసం చేసి నువ్వు చేసే వికృత పూజలకు నేను వీసమెత్తు విలువ ఇవ్వను' విమర్శించాడు చాణక్యుడు. 'మానసిక శాస్త్రం, నాటకం, నటనలలో నీ నిపుణతలు నాకు పనికొస్తాయి. నువ్వు చేసే క్షుద్రపూజలు, మంత్రాలు కావు', అంటూ పిచ్చి శాస్త్రవేత్త ముందు బంగారు నాణేలున్న సంచిని పెట్టాడు.

ఈసారి నిపుణకుడు నిశ్శబ్దంగా చిరునవ్వు నవ్వాడు. 'మీరు ఏం చెప్పాలనుకుంటు న్నారో చెప్పండి, ఆచార్యా,' అంటూ నాణేల సంచిని అలవాటైనట్టుగా తీసుకొని త్వరగా దాచాడు.

'మాళవ రాజ్యానికి సంబంధించిన కొన్ని రహస్యాలు సింహరణ్ నీకు చెబుతాడు. అతను చెప్పేది జాగ్రత్తగా విను. అతను చెప్పినదంతా బాగా గుర్తుపెట్టుకో', బోధించాడు వివేకి అయిన బ్రాహ్మణుడు.

'తరువాతేం చేయాలి?' అడిగాడు నిపుణకుడు.

'ఆహా! ఆ తరువాత మాళవ రాజ్యానికి వెళ్ళు. నీ అద్భుత శక్తులను ఉపయోగించి, పురాతన పద్ధతిలో జోస్యం చెప్పు!'

మాళవ రాజ్య ఆస్థానం అత్యంత నిశ్శబ్దంగా ఉంది. మనుషుల పుర్రెలు మెడలో దండగా వేసుకుని, నల్లబట్టలు కట్టుకుని సభ మధ్యలో నిలబడి ఉన్న వింత తాంత్రిక యోగి మీదే ఉన్నాయి అందరికళ్ళు. కుడిచేతిలో పైన పుర్రె ఉన్న దండం ఉంది. మరో చేతిలో ఎర్రగా ఉన్న కుండ ఉంది, బహుశా దానిలో పేరిన నెత్తురు ఉండి ఉంటుంది.

'ఓ రాజా, సర్వజ్ఞుడైన నిపుణకుడి మాటలు విను!' అంటూ ఆ పిచ్చి పండితమాని సింహరణ్ చెప్పిన వివరాలను గుర్తు చేసుకుంటూ గట్టిగా అన్నాడు. 'నీ ప్రాసాదంలో ఒక గది ఉంది – చీకటిగా, వాడుకలో లేని గది ఒకటి ఉంది. దాన్ని ఎక్కువకాలం తాళం వేసి ఉంచుతారు. ఆ గది నేలలో ఒక బ్రాహ్మణుణ్ణి చంపి పాతిపెట్టారు. ఆ శవాన్ని తీసి, నీ రాజ్య సరిహద్దులలో దహనం చెయ్యి. ఆ బ్రాహ్మణుడి ఆత్మ నీ వంశాన్ని శపిస్తోంది. అది నీ వంశాభివృద్ధికి అడ్డంకిగా ఉంది!'

తన పిన తల్లి ప్రాసాద రక్షకుడైన ఒక బ్రాహ్మణుడితో అక్రమ సంబంధం పెట్టుకుందని, వారిద్దరూ కలిసి ఉండగా చూసిన సింహరణ్ సోదరుడు తన తల్లి రాచ వ్యభిచారాన్ని చూసి సహించలేక రక్షకుడిని చంపేశాడు. ఆ శవాన్ని ఆమె కొడుకు పారవేసే వీలులేక వాడుకలో లేని ఒక గదిలో సమాధి చేశాడు. అతను సింహరణ్ సానుభూతిని, నైతిక మద్దతుని పొందినవాడై అతని సాయాన్ని తీసుకున్నాడు. రహస్యం తెలిసిన ఇద్దరు – సింహరణ్ పినతల్లి, ఆమెపై ఆగ్రహించిన ఆమె కొడుకు, మాళవ రాజ్యంపై పురుషోత్తముడు దండెత్తినపుడు చనిపోయారు. ఆ పాతిపెట్టిన శవం రహస్యం వారితోనే అంతమైంది.

రాజు, అతని ఆస్థానంలోని వారు తమ ముందు ధైర్యంగా నిల్చున్న మతిలేని మనిషిని చూసి మంత్రముగ్ధులయ్యారు. రాజు మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ

'శక్తిసంపన్నులైన గురువుగారూ, ఈ బ్రాహ్మణుడి శవం ఎక్కడుందో చెప్పగలరా? ప్రాసాదం వంద ఎకరాలకు పైగా ఉంది. దైవికమైన, జోక్యం లేకుండా కనుగొనడం అసాధ్యం' సగం పిచ్చితోఉన్న నిపుణకుడు కళ్ళు మూసుకుని ఉచ్చరించడం మొదలుపెట్టాడు – ఆ స్థానంలో ఉన్న అందరికీ వినిపించేలా – 'వైరోచనుడి కుమారుడైన బలికి సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. నికుంభ, నరక, కుంభ, శక్తిమంతమైన మృగం తంతుకచ్ఛకు మోకరిల్లుతున్నాను. ఓ చండాలి, కుంభి, తుంబ, కటుక, సరాగా, ఆ ఎముకలు ఎక్కడున్నాయో నాకు చెప్పండి!' హఠాత్తుగా కళ్లు తెరిచి మూర్ఛ వచ్చినట్టుగా 'నాకు తెలిసింది! రండి నాతో!' అని బిగ్గరగా అరిచాడు.

సింహరణ్ చెప్పిన గది ఉన్న వైపుకు పిచ్చిగా పరిగెత్తాడు. రెండో అంతస్తులో దక్షిణం వైపున ఉన్న ఏడో గది దగ్గర ఆగాడు. మళ్ళీ కళ్ళు మూసుకుని తను కూడగట్టగలిగిన అన్ని శక్తులనీ కూడగట్టినట్టుగా, 'ఇక్కడ బ్రాహ్మణుడి దెయ్యం దుష్టశక్తి ఇక్కడ ఉంది. నేను తప్పు చెప్పను! చండాలిశక్తి, నిపుణకుడు తప్పు చెప్పడు! ఆ గదిని తవ్వి మాళవ రాజ్య బాధలు పోగొట్టుకోండి!

నేలలో తవ్విన తరువాత ఎముకలు కనిపించగానే, రాజు నిపుణకుడి దగ్గరకి వెళ్ళి నమస్కరించాడు, తాంత్రికశక్తికి లొంగిపోయి. నిపుణకుడు రాజునుదుటి మీద విభూది చల్లి రాజు నాశీర్వదించాడు. రాజు తన నీలాల కంఠహారాన్ని నిపుణకుడికి ఇచ్చాడు, అతడు దాన్ని అందుకుని, తవ్విన గుంటలో వేశాడు. 'నాకెందుకు రాజా ఈ విలువైన రత్నాలు? నేను కోరుకుంటే ప్రపంచ సంపదలన్నీ నావి అవుతాయి. కాని నాకు ఈ ప్రాపంచిక సంపదలు వద్దు. నేను కోరుకోను' అన్నాడు ఇష్టం లేకపోయినా నీతిమంతుడిగా కనిపించమన్న చాణక్యుడి ఆదేశాలు తుచ తప్పక పాటిస్తూ, ఈ జ్ఞాని స్వార్థరహిత దృక్పథానికి అక్కడున్న వారందరూ గౌరవంగా మౌనంగా ఉండిపోయారు.

ఒక రోజు తర్వాత రాజు అనారోగ్యం పాలయ్యాడు. చలి, వణుకులతో తీవ్రమైన జ్వరం వచ్చింది. బలహీనంగా అయిపోవడంతో సభకు రాలేకపోయాడు. జ్వర తీవ్రత వల్ల భ్రాంతికి గురై తన చుట్టూ ఉన్న వారందరిని బూతులు తిట్టసాగాడు. తాను రాజునుదుట రాసిన విభూది పని చేసిందని నిపుణకుడికి అర్థమైంది. దానిలో ధత్తూర గింజల పొడి ఉంది. దాన్ని రాస్తే సంధి ప్రేలాపనలు వస్తాయి. భయపడిన రాణి నిపుణకుడిని ప్రాసాదానికి పిలిపించింది. రాజుగారి అనారోగ్యానికి చికిత్స చేయ'మని కోరింది.

'ఓ రాణీ, భయపడకండి, రాజుగారికి నేనిచ్చిన విశిష్టమైన మందు కలిపి గ్లాసు పాలు తాగించండి. ఉదయానికల్లా ఆయన ఆరోగ్యవంతుడవుతారు', కుహనా కళాకారుడు

హామీ ఇచ్చాడామెకి. అతనిచ్చిన విరుగుడులో చాణక్యుడు ముందుగానే ఇచ్చిన చిత్రిక వేర్లు, నల్లమిరియాలు కలిపిన పొడి ఉంది.

మర్నాటికల్లా రాజు కోలుకోవడంతో నిపుణకుడిని మహిమాన్వితుడుగా గుర్తించారు. ఇది రెండు రోజుల్లో ఆయన సాధించిన అసాధారణ విజయం. కాని దానికి వేడుక చేసుకొనే సమయం లేకపోయింది. చంద్రగుప్తుడనే యువకుడి నాయకత్వంలో, మాళవ రాజ్య సింహాసనానికి వారసుడని భావించే సింహరణ్ సేనలతో నగరాన్ని ముట్టడించాడు. రాజధాని అధికారికంగా ముట్టడింపబడింది. శుక్లపక్షమంతా ముట్టడి కొనసాగడంతో నగరంలో అత్యవసర వస్తువులకు కొరత ఏర్పడింది. హడావిడిగా ఏర్పాటు చేసిన మంత్రిమండలి సమావేశంలో ఎదురు నిలబడి యుద్ధం చెయ్యాలని ఆలోచిస్తుండగా, మళ్ళీ నిపుణకుడు అట్టహాసంగా ప్రవేశించాడు.

'రాజా! మీ కో ముఖ్య సందేశం తీసుకుని వచ్చాను', అన్నాడా మోసగాడు. తెలివి తక్కువ మంత్రులందరూ తన ప్రతిమాటనీ నమ్ముతున్నారని తెలిసి ఆనందిస్తూ. 'ప్రాసాదంలోని గుడిలో కుబేరుడి విగ్రహం ఉంది. మీ పూజారులు రోజూ చేసే పూజల్లో తప్పులు జరిగాయి. అందువల్లే మీకు సింహాసనం దూరమయ్యే పరిస్థితి కలిగింది. తప్పుని సరిదిద్దండి, శత్రువు వెంటనే వెనుదిరుగుతాడు?, అతని ఆదేశాల ప్రకారం ఎన్నో పూజలు, మంత్రాలతో మట్టితో చేసిన కుబేరుని విగ్రహాన్ని తీసి రాచసరస్సులో నిమజ్జనం చేశారు. కరిగిపోయే విధంగా నిపుణకుడు సూచించిన మంత్రాలు, ప్రార్థనలు కొనసాగిస్తూనే ఉన్నారు. అదే క్షణంలో సింహరణ్‌ను, చంద్రగుప్తుణ్ణి దళాలను వెనక్కి తీసుకుపోయి రాజధానికి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న రహస్య ప్రదేశంలోఉండమని చాణక్యుడు ఆదేశించాడు. ఏదో మహిమ జరిగినట్టుగా ముట్టడించిన సైనికులు వెనుదిరగడంతో ఉత్సవాలు మొదలైనాయి, గొప్పవాళ్ళు, సామాన్యులు అందరూ వీధుల్లో సంబరాలు చేసుకున్నారు. నృత్యగానాలు, మద్యం, మగువలతో అందరూ తాగి తుళ్ళుతూ ఉండగా, చాణక్యుడి భాగ్యశాలులైన సైనికులు కోటలోకి, ఆదమరచిన నగరంలోకి ప్రవేశించారు. రక్తపాతం లేకుండా జరిగిన ఆక్రమణ– హఠాత్తుగా, నాటకీయంగా, గొడవ లేకుండా, ప్రణాళిక వేసిన బ్రాహ్మణుడిలా విశిష్టంగా జరిగింది.

మాళవ రాజ్యానికి రాజుగా సింహరణ్ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. 'ఎప్పుడూ నీ మాటలు మృదువుగా, తీయగా ఉండాలి, సింహరణ్, ఎప్పుడైనా వాటిని వెనక్కి

తీసుకోవాల్సిన అవసరం రావచ్చు', కొత్త సార్వభౌముణ్ణి ఆశీర్వదిస్తూ గురువు సలహా ఇచ్చాడు.

సింహరణ్ గురువుగారి ముందు మోకరిల్లి 'ఆచార్యా, మా బాబాయికి, ఆయన కుటుంబానికి జరిగిన దాని గురించి అపరాధం చేసినట్టుగా అనిపిస్తున్నది. మీరు చెప్పినట్టుగానే మనం ఆక్రమించగానే ఆయనని, ఆయన కుటుంబాన్ని దేశం నుంచి పంపించేశాను. ఆయనని, ఆయన కుటుంబాన్ని బందిపోట్లు చంపేశారని విని బాధగా ఉంది. ఆయన చావు నన్ను జీవితాంతం బాధపెడుతుందని భయపడుతున్నాను', అన్నాడు.

ప్రతివారూ ప్రపంచాన్ని వీడి మెరుగైన చోటికి వెళతారు. కొందరు వెళ్ళిపోతే ప్రపంచం బాగుంటుంది. మీ బాబాయి కూడా అటువంటివాళ్ళలో ఒకడు!' అన్నాడు విజయుడైన చాణక్యుడు నగరంలోని ప్రజలు నిన్న లొంగిపోయిన దృశ్యం కళ్ళముందు మెదులుతుండగా.

'సింహాసనం కోసం సవాలు చేసే వారిని చంపడానికి సింహరణ్ కష్టపడడం నాకిష్టం లేదు', అని మిహిర్‌తో చెప్పాడు. 'అతని బాబాయిని మాళవ రాజ్యం నుంచి బహిష్కరించమని సింహరణ్‌కి చెబుతాను. దేశం నుంచి ఏ హానీ జరక్కుండా మాజీ రాజుని సరిహద్దులు దాటించడానికి ప్రయత్నించండి'.

'అతన్ని దేశం నుంచి బహిష్కరించడం తెలివైన పనా? అతను పురుషోత్తముడికి మిత్రుడు, కేకయకు పారిపోయి సైన్యాలు కూడగట్టాలనుకుంటాడు. అతని ప్రయత్నానికి పురుషోత్తముడు సంతోషంగా మద్దతిస్తాడు. సింహరణ్ మాళవ రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించాడంటే, ఇంక అది కేకయకు సామంత రాజ్యం కాదనేగా అర్థం!' మిహిర్ చెప్పాడు.

'నువ్వన్నది పూర్తిగా నిజమే, మిహిర్. అందుకే నేనతన్ని చంపెయ్యాలనేది – కాని అధికారికంగా కాదు. మాళవ రాజ్య ప్రజలు తమ కొత్తరాజు సింహరణ్‌ని ప్రేమించాలి. అతను దయగలవాడుగా, న్యాయపరుడుగా, సత్యవాదిగా, ఉదారుడుగా కనిపించాలి. సింహరణ్ బాబాయి ఏ హానీ జరక్కుండా, ఏ అడ్డంకీ లేకుండా తన కుటుంబంతో, మద్దతుదారులతో రాజ్యం నుంచి వెళ్ళిపోవడం అందరూ చూడాలి'.

'తరువాత?' మిహిర్ అడిగాడు, సమాధానం తెలిసినాగాని, ఆ సమాధానం మాటలలో చెప్పరని తెలిసీ.

# పన్నెండో అధ్యాయం

## వర్తమానం

**ల**క్నోలో హొటల్ గది చల్లగా, చీకటిగా ఉంది. మధ్యాహ్నపు ఎండ లోపలికి రాకుండా కర్టెన్లు సగం వేసి వున్నాయి. ఎయిర్ కండిషనింగ్ ఉష్ణోగ్రత కూడా వీలైనంతవరకు తగ్గించి ఉంది. లోపల ఇద్దరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు– పండిట్ గంగాసాగర్ మిశ్ర, రామశంకర్ద్వివేది. ద్వివేది అధైర్యంగా ఉన్నాడు. కళ్ళజోడు సరిచేసుకుంటూ, జుట్టు సవరించుకుంటున్నాడు అదే పనిగా. భారతదేశ రాజకీయ నాయకులందరిలానే వేషం వేసుకున్నాడు – తెల్లఖద్దరు కుర్తా, పైజమా, కాని అతని గాంధీ అవతారానికి తగిన విధంగా అలంకరణ వస్తువులు లేవు. కళ్ళజోడు ఫ్రేము గుచ్చి, జేబులో ఉన్న కలం వెండి మాంట్‌బ్లాంక్, రిస్టువాచ్ గోల్డ్ రోలెక్స్, పాదాలకు బాలీలోఫర్స్ వేసుకున్నాడు.

ఇంత విలాసంగా ఉన్న గదిలో ముఖాముఖి కలవాలని పార్టీ పెద్దాయన తననెందుకు పిలిపించాడని లోలోపల అనుకుంటున్నాడతను. చల్లగా ఉన్న గదిలో కూడా వెన్నులోంచి చెమటకారి కిందికి దిగిందతనికి. దాంతో వణుకు వచ్చింది. ఇది మంచిది కాదు. రాజకీయాల విషయానికొస్తే పండిట్ గంగాసాగర్ మిశ్ర తడి గుడ్డతో గొంతు కోసే రకం అనుకున్నాడు ద్వివేది. అతనికేం తెలుసు? **అభానస** పెద్దాయన తనని ఉతికి ఆరేయడానికి పిలవలేదు కదా?

గంగాసాగర్ అతన్ని నిశ్శబ్దంగా చూస్తూండిపోయాడు. తొందరగా మాట్లాడరా, అనుకున్నాడు ద్వివేది తనలో. గంగాసాగర్ కుర్తా లోపల ఊలు బనీను వేసుకున్నాడని, అందుకనే అంత చలిలోను హాయిగా కూర్చున్నాడని ద్వివేదికి తెలియదు. ‘వణికి చావనీ వాణ్ణి’, అనుకున్నాడు గంగాసాగర్. *‘చలిగా ఉంటే మూత్రం వస్తుంది అతణ్ణి అదింకా భయపెడుతుంది’.*

'ఇటీవల మీరు అందరితో బాగా కలుస్తున్నారని విన్నాను ద్వివేదీగారూ', అన్నాడు గంగాసాగర్ చివరికెప్పటికో. 'నేను కలుసుకున్న వాళ్ళందరూ మీ ఇంటికి వెళ్ళామని చెప్పారు'.

'మీరు నా అతిథిగా రాకపోవడం నా దురదృష్టం పండిట్‌జీ. మీరు మా ఇంటికి డిన్నర్‌కి రావాలని నా కోరిక', సమాధానమిచ్చాడు ద్వివేది ఆత్రంగా.

'నన్ను మరో విధంగా చెప్పనీయండి. కచ్చితంగా చెప్పాలంటే, **అభానస ఎంఎల్‌ఏ**లు ఇరవై నాలుగు మంది రోజూ మీ ఇంటికి వస్తున్నారని తెలిసింది-వాళ్ళు మీ ఇంటికి విస్కీ తాగి, సమోసాలు తినడానికి వస్తున్నారని చెప్పకండి!'

ద్వివేది కొంత తత్తరపడ్డాడు. దీర్ఘంగా శ్వాసించి, చెప్పాడు, 'నేను విధేయుడైన పార్టీ కార్యకర్తని పండిట్‌జీ. కొంతమంది అసమ్మతీయులు తిరుగుబాటు తేవాలని ప్రయత్నిస్తున్నారు. వాళ్ళని సముదాయించవలసిన బృహత్తర బాధ్యత నామీద ఉందని నేను భావించాను'.

'మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాను ద్వివేదీజీ. ఈ ఫోటోలు నకిలీవని నేను తెలుసుకొని ఉండాల్సింది' అంటూ గంగాసాగర్ 4×6 అంగుళాల ఫోటోల బొత్తిని తన ముందున్న గాజు బల్ల మీద పడేశాడు. తాను ఈషతో కలిసి కామసూత్ర భంగిమలలో ఉన్న అశ్లీలమైన ఫోటోలను చూడగానే ద్వివేదీ ముఖం పాలిపోయింది. ఏదో గొణిగాడు అర్థం కాకుండా, మాటలు పెగల్లేదు.

'రిలాక్స్, ద్వివేదీజీ, భయపడకండి. మీతో పడక సుఖం బాగుందని తను చెప్పింది', గంగాసాగర్ అన్నాడు అనుకున్నది సాధించాననే ఆనందం కలగలిపిన నవ్వుతో.

'నా దగ్గర 49 నెగిటివ్‌లున్నాయి – ఈ ప్రభుత్వం ఉండే అన్ని నెలలకూ సరిపడా. నలభై తొమ్మిదో నెల చివరి వరకూ చాందిని ముఖ్యమంత్రిగా ఉంటే, నెగిటివ్‌లు అన్నీ మీకు ఇచ్చేస్తాను తిరిగి, సరేనా?'

ద్వివేదీ జీవం లేక మొద్దుబారినట్టుగా తలూపాడు. పండిట్ గంగాసాగర్ మిశ్ర కుర్చీలోంచి లేచాడు.

'ఆс! మరో అభ్యర్థన. ఈ ప్రభుత్వం పడిపోకుండా చూసే బాధ్యత మీదే ఇప్పుడు. ఎవరైనా అసమ్మతిని వెలిబుచ్చితే, నాకు చెప్పాల్సిన బాధ్యత మీది వ్యక్తిగతంగా. ఆ

విషయం అర్థమైందనుకుంటాను?' అంటూ హెచ్చరించి హోటల్ గదిలోంచి బయటికి వెళ్ళాడు. వెళుతూ వెళుతూ ఎయిర్ కండిషనింగ్ ఆపి వెళ్ళాడు.

*'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'* లోలోపల జపించాడు.

చాందిని కుప్పకూలిపోయింది. శంకర్ ఆమెకు కొంచెం ఊరటనిచ్చాడు, జాఫ్రీ తర్వాత ఆమె అతనితోనే సన్నిహితంగా ఉంది. కళ్ళలోంచి ఉబికి రావడానికి సిద్ధంగా ఉన్న కన్నీళ్ళను బయటికి రానీయకుండా, తనను తాను అద్దంలో చూసుకుంది. తను ఏడ్వదు. ప్రేమించడం గాని, ప్రేమించబడడం గాని తన జాతకంలో లేదనుకుంది. కళ్ళకింద టిష్యూతో అద్దుకుని ఎయిర్‌క్రాఫ్ట్ టాయ్‌లెట్‌లోంచి దాన్ని కిందపడేసింది. గంగాసాగర్‌ని కలవడానికి బయటకు వచ్చింది.

లక్నో నుంచి ఢిల్లీ ప్రయాణం తక్కువసేపే కాని చాలా అసౌకర్యంగా ఉంది. ఆక్సిలరీ పవర్ సప్లయ్ సరిగ్గా లేదని టేకాఫ్‌కి గంట ఆలస్యమైంది. తర్వాత వాతావరణం బాగా లేదని వెళ్ళడానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతినీయలేదు. బయల్దేరడానికి అనుమతించమని చెప్పమని గంగాసాగర్ ఢిల్లీలో ఉన్న విమానయాన మంత్రికి ఫోన్ చేశాడు. విమానంలో ఉన్న మిగిలిన ప్రయాణికులకి తెలియదు. తాము రాజకీయ వితరణ పొందామని – గంగాసాగర్ లేకపోతే విమానం బయలుదేరేదే కాదని. చాందిని, ఇక్రం, గంగాసాగర్, మీనన్ విమానంలో మొదటివరుసలో కూర్చున్నారు. సాధారణంగా చిరచిరలాడుతూ ఉండే ఎయిర్‌హోస్టెస్ ఒక్కసారిగా నవ్వు పులుముకొని, తన విఐపి అతిథులతో ఎంతో మర్యాదగా, జాగ్రత్తగా మాట్లాడడానికి ప్రయత్నించింది. రెండో వరుసలోకి రాగానే మళ్ళీ ఆమె యథాప్రకారం తన నిర్లక్ష్య ధోరణిలోకి మారిపోయింది.

'న్యూఢిల్లీలో మనమేం సాధించాలి?' ఇక్రం అడిగాడు.

'నువ్వు మేయర్ కాగానే మనిద్దరి సంభాషణ గుర్తుందా ఇక్రం?' గంగాసాగర్ అడిగాడు.

'ఏ సంభాషణ? బోలెడన్ని సంభాషణలు జరిగాయి', జోక్ చేశాడు ఇక్రం. వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే మనం మంచి చేయాలని చెప్పాను చూడు అది. నిజమైన అధికారం రాష్ట్రస్థాయిలో ఉంటుందని, స్థానిక ప్రభుత్వంలో ఉండదని'.

'ఆఁ! గుర్తుంది'.

'సరే అది తప్పని ఇప్పుడు నీకు చెబుతున్నాను'.

'మీరనేదేమిటి? ఉత్తరప్రదేశ్‌లో అధికారం మనదే. మన ప్రియమైన చాందిని ముఖ్యమంత్రి. నేను ఇక్రంభాయ్‌ని కాన్పూర్ మేయర్‌ని.'

'అవును. కాని నిజమైన అధికారం కేంద్రంలో ఢిల్లీలో ఉంది. ఇప్పటి నుంచి కొన్నేళ్ళ తర్వాత మనం అక్కడుంటాం. ఇది ఓరియంటేషన్ వారం'.

'ఈ చర్చ మనం లక్నోలో కూడా చేసి ఉండవచ్చు. ఈ విషయాలు చర్చించడానికి మనం ఢిల్లీ ఎందుకు వెళుతున్నాం?' చాందిని అడిగింది.

'మేజర్ జస్‌పాల్ సింగ్ బేడీని కలవడానికి', సమాధానమిచ్చాడు గంగాసాగర్.

'అతనెవరు?' అడిగాడు ఇక్రం.

'ఉత్తరప్రదేశ్‌లో ఎనభై అయిదు లోక్‌సభ స్థానాల్లో అరవై అయిదు లోక్‌సభ స్థానాలు మనం గెలిచేలా హామీ ఇచ్చే వ్యక్తి'.

ఆ అందమైన, నీట్‌గా ఉన్న సిక్కు వ్యక్తి ఆరడుగులపైగా ఉంటాడు. నేవీ బ్లూ సూట్ వేసుకున్నాడు. ముదురు ఎరుపు తలపాగా, అదే రంగు రుమాలు, టై వేసుకున్నాడు. ఈజిప్షియన్ కాటన్ షర్టు రెండు చేతులు సూట్ చేతులతో సమంగా ఉన్నాయి. వెండి కఫ్‌లింక్‌లు వాటిపై భారత సాయుధ దళాల చిహ్నం ఉంది. సగం నెరిసిన గడ్డం, మీసాలు, కనుబొమలు వెంట్రుకలు చక్కగా దువ్వి ఉన్నాయి. ఒక్క వెంట్రుక కూడా అటూ ఇటూ కదలకుండా.

మేజర్ జస్‌పాల్ సింగ్ బేడీ పంజాబ్‌లో మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. బాల్యంలోను, యువకుడిగా ఉన్నపుడు అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. మిఠాయిలు దొంగిలించే ముఠానాయకుడతను. ప్రసిద్ధమైన మిఠాయి దుకాణాలలో మిఠాయిలు కొనుక్కుని బయటికి వచ్చేవారి నుంచి సునాయాసంగా మిఠాయిలు దొంగిలించేవారు. జస్‌పాల్ ముఠాలో వారు తమలో తాము పోట్లాడుకుని గందరగోళం సృష్టించేవారు. షాపింగ్ బ్యాగులు పట్టుకొని వచ్చే దురదృష్టవంతులైన కస్టమర్లు జోక్యం చేసుకుని వారిని సముదాయించాలని చూస్తుండగా, వారి చేతిలో పార్శిళ్ళు పట్టుకుంటానని జస్‌పాల్ మర్యాదగా పట్టుకునేవాడు.

అయిదు నిమిషాల తర్వాత కస్టమర్లు గొడవను సర్దుబాటు చేసి చూస్తే – జస్‌పాల్ మాయమవుతాడు – వాళ్ళ పార్శిళ్లతో సహా.

జస్‌పాల్ గురించి బాధపడిన అతని తండ్రి భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేస్తున్న తన కజిన్‌ని జస్‌పాల్‌ని సైన్యంలో చేరేలా పదేళ్ళ కమీషన్‌కి ఒప్పించమని కోరాడు. జస్‌పాల్ తిరస్కరించాడు.

మిఠాయిలు దొంగిలించడం అతనికి సరదాగా ఉంది. ఆ అధికారి ఈ అబ్బాయిని తన గొడ్లపాకలోకి పిలిచి బాగా దంచి వదిలాడు. మరో అవకాశమేమీ ఇవ్వలేదు. మర్నాటి ఉదయమే చెన్నైలో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి ఏభై వారాల శిక్షణ తీసుకొనడానికి జస్‌పాల్ వెళ్ళాడు. సైనిక శిక్షణ వల్ల నిర్లక్ష్యంగా ఉండే యువకుడికి క్రమశిక్షణ, జీవితానికో పరమార్థమూ ఉంటుందని అతని తండ్రి ఆశించాడు.

అలాగే జరిగింది. సైనిక జీవితంలోని క్రమశిక్షణ అతనికి బాగా నచ్చింది. సైన్యంలో పనిచేస్తున్నప్పుడు విశ్లేషణాత్మక ఆలోచన, ప్రణాళికారచనా నైపుణ్యాలు, అందరితో కలిసి పనిచేసే సామర్థ్యాలు పెరిగాయి. అతను త్వరితంగా లెఫ్టినెంట్ నుంచి కెప్టెన్‌గా, తర్వాత మేజర్‌గా అయ్యాడు. తన పదేళ్ళ కమిషన్‌ను పూర్తి చేసి చిన్న మార్కెట్ రీసెర్చ్ ఏజన్సీలో చేరాడు. దానిని భారత ప్రభుత్వం పదేళ్ళ జనాభా లెక్కల సర్వే కోసం నియోగించింది. తర్వాత పదేళ్ళు జస్‌పాల్ భారతదేశ జనాభా లెక్కల మ్యాపులను తయారుచేస్తూ గడిపాడు. అది చాలా పెద్ద పని. తనలోని సైనిక క్రమశిక్షణతో ఆ పనిని క్రమపద్ధతిలో పూర్తిచేశాడు. తర్వాత ఆ కంపెనీలో గ్రామీణ పరిశోధనకు దేశానికంతటికీ అధికారి అయి – సొంత కన్సల్టెన్సీ పెట్టుకోవాలని ఆ పదవిని వదలి బయటికి వచ్చాడు. తన కన్సల్టెన్సీ సహజీవనం చేసే ఎన్నికలు, రాజకీయాలు అనే రెండు శాస్త్రాలను కలుపుతుంది.

'లోక్‌సభ భారతదేశ పార్లమెంటులో ప్రత్యక్షంగా ఎన్నుకొనే దిగువసభ. ఏడొందల మిలియన్ల ఓటర్లు అయిదు వందల యాభై రెండు మంది సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. అమెరికా, యూరప్‌ల్లోని మొత్తం ఓటర్లకన్నా ఎక్కువమంది ఓటర్లు.' మేజర్ బేడి చెప్పసాగాడు. 'ఈ రోజు నేనెందుకు ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలుస్తున్నానంటే – మీ రాష్ట్రం – ఉత్తరప్రదేశ్ లోక్‌సభకు ఎనభై అయిదుమంది సభ్యులను పంపుతుంది. గుర్తించదగిన సంఖ్య. ఎందుకు? ఈ సంఖ్యను గనుక ఒకే పార్టీ నియంత్రించగలిగిందంటే, ఆ పార్టీ – అది ప్రాంతీయ పార్టీ అయినాగాని, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తుంది'.

'కాని ఆ కల నెరవేరడం కష్టం మేజర్ బేడి. ఉత్తరప్రదేశ్ సజాతీయ ఏకశిల కాదు. మతం, కులం, లింగం, ఆర్థిక అంతరాలను పరిగణిస్తూ ఓటు వేసే ప్రజలతో కూడిన రాష్ట్రం. అందరికీ ఒకే సైజు పట్టదు!' మీనన్ చెప్పాడు.

'మీరన్నది నిజమే. మీనన్. అందుకనే ఉత్తరప్రదేశ్‌లో సింగిల్ ఫార్ములా ఎన్నడూ పనిచేయదు. ఇక్కడ సింగిల్ ఫార్ములా లేకపోవడమే సింగిల్ ఫార్ములా. కొన్ని సీట్లను కుల ప్రాతిపదికన గెలవచ్చు దళితులకు ప్రతిగా బ్రాహ్మణులు లేదా యాదవులకు ప్రతిగా బనియాలు; ఇతర సీట్లను మత భేదాలను బట్టి – హిందువులకు ప్రతిగా ముస్లింలు, ఇంకా మిగిలిన వాటిని ఆర్థిక కారణాల ద్వారా – బీదలకు ప్రతిగా ధనవంతులు – ఈ రకంగా **అభానస** ఓట్లు సంపాదించవచ్చు', అని మేజర్ వివరించాడు, గొంతు తడుపుకొనడానికి ఒక గుక్క నీళ్ళు తాగుతూ.

'ఎలా?' సుగర్ కోటెడ్ బిస్కట్‌ని టీలో ముంచుకుంటూ ఆశ్చర్యంగా అడిగాడు ఇక్రం.

'ఉత్తరప్రదేశ్‌లో ఇతర పార్టీలకు ముఖ్య నియోజకవర్గం ఉంది. **అభానస**కు అటువంటిదేదీ లేదు' జస్‌పాల్ దృఢంగా సమాధానమిచ్చాడు.

'అంటే మేము గెలవం అనా?' ఇక్రం తన టీని శబ్దమొచ్చేలా చప్పరిస్తూ అడిగాడు.

'గెలుస్తారు. ముఖ్య నియోజకవర్గం లేకపోవడంలోనే మీ బలం ఉంది. ఒక ప్రాంతంలో బలం అనిపించిన లక్షణమే, మరో ప్రాంతంలో లోపం అనిపించవచ్చు. ఉదాహరణకి **అభానస**ను దళితుల పార్టీ అనుకుంటే, దళితులెక్కువగా ఉన్న చోట పార్టీకి ఉపయోగం, కాని బ్రాహ్మణాధిక్యం ఉన్నచోట అది నష్టకారకం అవుతుంది', బేడీ విడమరిచి చెప్పాడు.

'అయితే మేము హిందువులు, ముస్లిములు, బ్రాహ్మణులు, దళితులు, యాదవులు, ఠాకూర్లు, భూస్వాములు, రైతులు, ధనిక, బీద, ఆడ, మగ, వృద్ధులు, యువకులు – అందరితో స్నేహంగా ఉండాలంటారా... ఇలా ఉంటే ఏ ఒక్క ప్రముఖ లక్షణం కనిపించకుండా ఖిచిడీలా కనిపించమా?' చాందిని అడిగింది.

'మిగిలిన పార్టీల్లో ఏళ్ళ తరబడి ఈ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించిన అభ్యర్థులు ఇప్పటికే ఉన్నారు. మీ పలక శుభ్రంగా ఉంది. ఆ నియోజకవర్గానికున్న

నిర్దిష్టమైన అవసరాన్ని బట్టి మీరు అభ్యర్థిని ఎంపిక చేసుకొనే అవకాశం మీకుంటుంది' చెప్పాడు బేడి. 'అక్కడే నా అవసరం మీకుంటుంది'.

'మీరేం చేస్తారు?' చాందిని అడిగింది.

'చేశాను', సవరించాడు బేడి. ఉత్తరప్రదేశ్‌లోని ఎనభై అయిదు నియోజకవర్గాల్లో, ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి నిలబెట్టదగిన అభ్యర్థి ప్రొఫైల్‌ను నిర్ణయించమని ఏడాది కిందట గంగాసాగర్ గారు నాకు పని అప్పగించారు. నేను కనుక్కున్న విషయాలను ఇప్పుడు మీకు చెప్పటానికి వచ్చాను'.

'మీకు ఎనభై అయిదు నియోజకవర్గాలున్నాయి – ఖేరీ, ధౌరాహ్రా, బిజ్నోర్, అమ్రోహా, మొరాదాబాద్, రాంపూర్, సంభల్, బుదౌన్ – అంటూ తన లిస్టులో ఉన్న అన్ని పేర్లు పద్ధతిగా చదివాడు. ప్రతి పేరుతో పాటు దాని జనాభా, అక్షరాస్యతా రేటు, జనాభా వయస్సు వివరాలు, ఏ లింగం వారెందరున్నారు, కులాల, మతాల, జాతుల శాతం, జనాభా మౌలిక వృత్తులు ఏమిటి అన్నీ చెప్పాడు. మానవ కంప్యూటర్‌లా లెక్కలు, విషయాలు సునాయాసంగా వాళ్ళ ముందుంచాడు.

చివరి నియోజకవర్గానికి వచ్చినపుడు అతను ఇలా చెప్పాడు. 'ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల్లో పోటీ చేయడమనేది సామాజిక ఆధిపత్యం సమస్యపై ఆధారపడి వుంటుంది మౌలికంగా. ఎనభై ఐదు నియోజకవర్గాల్లో ప్రతి ఒక్కదాన్ని ఈ ప్రమాణాలతో విశ్లేషించి చూశాను నేను'.

'సామాజిక ఆధిపత్యమా? మీరనేది కులం గురించా?' ఆశ్చర్యపోయాడు ఇక్రం.

'కేవలం కులమే కాదు. సామాజిక ఆధిపత్యాన్ని కులం, లింగం, మతం, వయస్సు, ఆర్థిక స్థోమత ప్రభావితం చేస్తాయి. ఏ ఒక్క నియోజకవర్గంలోను ఒకే ఆధిపత్య వర్గం ఎన్నికల్లో ఎప్పుడూ గెలవలేదని అర్థం చేసుకోండి! ఉదాహరణకి, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో మీరట్ – అక్కడ జాట్లు ఎక్కువ. ఆ ప్రాంతాన్నే జాట్ భూమి అంటారు. మీరట్‌లో జాట్‌లెందరున్నారు? పదిశాతం! పదిశాతంతో ఎన్నికలు గెలవగలరా?' అడిగాడు బేడి.

'అయితే ఉదాహరణకి మీరట్‌లో ఎలా గెలవాలి?' గంగాసాగర్ అడిగాడు.

'కుల సమీకరణాలను దాటి ఆలోచించండి గంగాసాగర్‌గారూ', సూచించాడు బేడి. 'మీరట్‌లో అయిదు లక్షలమంది జనాభా ఉన్నారు. అరవై రెండు శాతం హిందువులు,

ముప్ఫయి అయిదు శాతం ముస్లిములు, మూడు శాతం సిక్కులు, అర శాతం క్రైస్తవులు, అరశాతం జైనులు, జనాబాలో ఏభై మూడు శాతం పురుషులు. సగటు అక్షరాస్యత డెబ్భయి రెండు శాతం. ఉత్తరప్రదేశ్‌లో చాలా ఎక్కువ.

'అయితే మనం నిలబెట్టాల్సిన అభ్యర్థి హిందువైన మగవాడు అవునా?' అడిగింది చాందిని.

'కాదు. హిందువులు సామూహికంగా ఒక్కళ్ళకే ఓటు వెయ్యరు. వాళ్ళ ఓట్లు కులాన్ని బట్టో మరోవిధంగానో చీలిపోతాయి. బదులుగా జాట్లు, మహమ్మదీయులతో కలిస్తే సిద్ధాంతపరంగా నలభై అయిదు శాతం ఓట్లు లభిస్తాయి', సమాధానమిచ్చాడు బేడి.

'కాని జాట్లు, ముస్లిములు ఒకే అభ్యర్థికి ఎందుకు ఓట్లేస్తారు?' అడిగింది చాందిని.

'మంచి ప్రశ్న. చారిత్రకంగా ఈ రెండు వర్గాలు పరస్పర వ్యతిరేకమని మీరు అనుకుంటారు. రెండు వర్గాలకీ సమ్మతమైన వ్యక్తిని కనుక్కోవడం అసాధ్యం. కాని నేను గెలిచే అభ్యర్థిని ఛఛర్ కమ్యూనిటీలో గుర్తించగలిగాను', అన్నాడు మేజర్ బేడి గర్వంగా.

'ఛఛర్ ఎందుకు?' అయోమయానికి లోనైన మీనన్ అడిగాడు.

'ఛఛర్లు జాట్లలో ఒక తెగ. చాలా ఏళ్ళ క్రిందట ముస్లిములుగా మతం మార్చుకున్నారు. వాళ్ళ సంతతే ముస్లిం జాట్లు. ఈ నియోజకవర్గాన్ని గెలవాలంటే మీక్కావలసింది ముస్లింజాట్', నీట్‌గా ఉన్న సర్దార్ చెప్పాడు.

'ఇంకా అతను గెలిచే అవకాశాలు బలపరచే అంశాలేమిటి?' గంగాసాగర్ ప్రశాంతంగా అడిగాడు.

'మీరట్ ముఖ్యమైన పారిశ్రామిక పట్టణం. పదకొండు చక్కెర మిల్లులున్నాయి. డెబ్భయి శాతం పైగ చెరకు వ్యవసాయంలో ఉన్నారు. మన ఛఛర్ అభ్యర్థి చెరకు రైతు అయితే ఎక్కువ మందికి సమ్మతమవుతాడు – ఇతర కులాలకి, కమ్యూనిటీలకి – ఆర్థిక కారణాల దృష్ట్యా కూడా'.

'ఇవన్నీ చేస్తే కూడా మాకు నలభై అయిదు శాతం ఓట్లు వస్తాయన్నారు. ఇంకా యాభై అయిదు శాతం మిగిలి ఉంటాయి కదా!' అన్నాడు మీనన్.

'ఒకే ప్రతిపక్ష అభ్యర్థి చేతిలోనే యాభై అయిదు శాతం ఓట్లు ఉంటే ప్రమాదం.

తరువాత నా వ్యూహంలో తరువాతి భాగం', తన నోట్సు పేజీలు తిప్పుతూ అన్నాడు బేడి.

'అదేమిటి?' అడిగాడు గంగాసాగర్.

'వ్యూహంలో రెండో భాగం యాభై అయిదు శాతం ఓట్లు చీలేలా చేయడం'.

'మరి దీన్నెలా సాధిస్తారు?' ఇక్రం అడిగాడు.

'సింపుల్. సిట్టింగ్ ఎంపితో సమానంగా ప్రొఫైల్ ఉన్న అభ్యర్థిని ప్రతిచోట వెదికి స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టడం'.

'ఈ అభ్యర్థి పనేమిటంటే చెడగొట్టడం. పోటీదారు ఓటుబ్యాంకును చీల్చడం.'

'అంటే మనం ముస్లిం జాట్ చెరకు రైతుని వెతుక్కోవాలి? తర్వాత మీరట్ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎంపితో సరిపోలే ప్రొఫైల్ ఉన్న అభ్యర్థిని చెడగొట్టే అభ్యర్థిగా మనం వెతుక్కోవాలి?' ఇక్రం వేగంగా అన్నాడు.

'మొదటి అభ్యర్థిని నేను వెతికి ఉంచాను. అతని పేరు దౌలాహసన్ భట్టి. అతనికి యాభై మూడేళ్ళు. ముస్లిం జాట్. అతని కుటుంబం మూడు తరాల క్రితం మీరట్‌కి వలస వెళ్ళింది - అయిదెకరాల చెరకుతోట, చెరకు గానుగ ఉంది. అతను సరైన ఎంపిక' బేడి వివరించాడు.

'మనం ప్రతి వ్యక్తి దగ్గరకు వెళ్ళి మన టికెట్‌పై పోటీ చేయమని అడుక్కుంటూ తిరగాలా? మన పార్టీ కార్యకర్తలే లోక్‌సభ టికెట్ కోసం క్యూ కట్టి ఉన్నారు. వాళ్ళలోంచి ఎంపిక చేసుకుంటే సులభంగా అయిపోతుంది కదా?' ఇక్రం అడిగాడు.

'గెలవాలనుకుంటున్నారా? లేదా? తక్కువమంది నుంచి ఎంపిక చేసుకొనే తప్పు చేయవద్దు ఎప్పుడూ. నియోజకవర్గాన్ని బట్టి సరైన అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలి. ఇప్పుడు మిగిలిన ఎనభై నాలుగు నియోజకవర్గాల అభ్యర్థుల గురించి చెప్పాలా?' అడిగాడు బేడి. వాళ్ళ సంభాషణను గంగాసాగర్ చిరునవ్వుతో వింటుండగా.

'ఉత్తరప్రదేశ్ వ్యాపారులు సమ్మె చేయబోతున్నారు', చెప్పింది చాందిని.

'దేనికి?' గంగాసాగర్ అడిగాడు.

'ఉత్తరప్రదేశ్‌లో అమ్మకం పన్ను రేటు చాలా ఎక్కువుందట. దాన్ని తగ్గించ మంటున్నారు'.

'ఎవరికో కావాలని పన్ను రెవెన్యూని ఇచ్చేస్తూ పోతావా! తాగుబోతు కావాలన్నాడని వాడికి విస్కీ ఇస్తావా?'

'నేనొప్పుకుంటాను. కాని ఏం చెయ్యాలి. సమ్మెవల్ల ఆర్థిక కార్యకలాపాలన్నీ ఆగిపోతాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతాయి. ప్రజలు ఆగ్రహిస్తారు'.

'అమ్మకం పన్ను మరో అయిదు శాతం పెంచు!'

'అలా చేయలేం. ఇప్పటికే వాళ్ళు పోరాటం చేయాలనుకుంటున్నారు'

'వాళ్ళు ఎలాగూ సమ్మె చేయిస్తున్నారు. రైట్? అంతకన్న వాళ్ళేం చేస్తారు?'

'వాళ్ళు సమ్మెని విరమించాలంటే మనం ఏం చెయ్యాలి?'

'మూడు శాతం రాయితీ ఇవ్వు సమ్మెనాపటానికి. అప్పటికీ నీకు రెండు శాతం లాభిస్తుంది' పండిట్ భుజాలెగరేశాడు.

'రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు డ్రైవర్లు తాగి బస్సులు వేగంగా నడుపుతున్నారు – పక్షం రోజుల్లో ఇది నాలుగో రోడ్డు ప్రమాదం', న్యూస్ పేపర్ రిపోర్టును గంగాసాగర్‌కి చూపించి ఫిర్యాదు చేసింది చాందిని.

'డ్రైవర్లు తప్పు చేస్తే ఎందుకు తీసేయకూడదు?' గంగాసాగర్ అడిగాడు.

'ముందువాళ్ళ నేరం రుజువు చెయ్యాలి. కోర్టు కేసులు పూర్తవడానికి ఏళ్ళూ పూళ్ళూ పుడతాయి'.

'ఈ సమస్యకు సరైన పరిష్కారం ఉంది'.

'ఏమిటది?'

'డ్రైవర్ల జీతాలు వాళ్ళ పెళ్ళాలకి నేరుగా ఇవ్వండి. వాళ్ళు తాగటానికి ఒక్కపైసా ఇవ్వరు! రవాణా కమిషనరుకి చెప్పు, జీతాల చెల్లింపులన్నీ వాళ్ళ పెళ్ళాలకి ఇవ్వమని. తాగి నడిపే వాళ్ళ సంఖ్య తగ్గుతుంది!'

'అప్పులు తీసుకొని ఎగ్గొట్టే వాళ్ళ వల్ల ప్రాంతీయ బ్యాంకులు నష్టపోతున్నాయి', రాష్ట్ర కంట్రోలర్ తయారుచేసిన ఆర్థిక స్టేట్‌మెంట్లు పక్కన పెడుతూ చెప్పింది చాందిని.

'చెల్లించని వాళ్ళెవరు?'

'రైతులు, వ్యాపారులు, బిజినెస్ చేసేవాళ్ళు. ఇళ్ళ యజమానులు, క్రెడిట్ కార్డుల మీద పెద్ద మొత్తాల్లో ఖర్చులు చేసేవారు. డబ్బుని వసూలు చెయ్యకపోతే ఏదో ఒకనాడు ఉత్తరప్రదేశ్ బ్యాంకులు కుప్పకూలుతాయి'.

'రైతులని వదిలిపెట్టు. వర్షాలు లేక పంటలు పండలేదు. చెల్లింపుకి వాళ్ళకి ఇంకొంత కాలం ఇవ్వండి. రుణాలపై వడ్డీ కూడా తీసేయండి'.

'మిగిలినవాళ్ళ మాటేమిటి?'

'తీర్చడానికి వాళ్ళకేమీ కష్టం ఉండదు. మన రాష్ట్ర బ్యాంకుల్లో యంత్రాంగం రుణ వసూలు సమర్థంగా చేయడం లేదు. వాళ్ళు దానిని అలుసుగా తీసుకుంటున్నారు'.

'మేము తీసుకోగలిగే ఒకే ఒక చర్య కోర్టుకెళ్ళడం. కాని దానివల్ల చాలా ఆలస్యం, బోలెడంత ఖర్చు. ఫలితాలు వచ్చేసరికి ఏళ్ళు గడుస్తాయి'.

'రుణాలు వసూలు చేయమని సచ్లాదేవికి చెప్పు'.

'ఎవరావిడ?'

'సచ్లాదేవి. లక్నోలో ప్రసిద్ధురాలైన కొజ్జా. నీకు సాయం చేయమని నేనావిడని అడగగలను.'

'నేను కొజ్జా సాయం తీసుకోవడం దేనికి?'

'ఆవిడ దగ్గర ఇళ్ళముందు, షాపుల ముందు నిలబడి చప్పట్లు చరుస్తూ, అరుస్తూ ఉంటూ పనీ పాటా లేకుండా తిరిగే కొజ్జాలు చాలామంది ఉంటారు'.

'సంతోష సమయాల్లో – పెళ్ళిళ్ళకి, జనాలకి, ప్రారంభోత్సవాలకి వాళ్ళలా చేస్తారు. వాళ్ళకి డబ్బులిస్తే మంచి జరుగుతుందని భావిస్తారు!'

'మంచి జరగాలని జనం కొజ్జాలకి డబ్బులివ్వరు. వాళ్ళకి కావలసింది ఆ పీడ విరగడవడం!'

'అయితే?'

'రుణాలు చెల్లించని వాళ్ళ ఇళ్ళ ముందు నిలబడి కొజ్జాలు గోల చేసేలా సచ్లాదేవి చేయగలదు. వాళ్ళు గట్టిగా చప్పట్లు చరుస్తూ స్నేహితుల ముందు, ఇరుగు పొరుగు ముందు వాళ్ళు సిగ్గుపడేలా ప్రవర్తిస్తారు. వాళ్ళు విసిగిపోయి రుణం తీరుస్తారు. కొజ్జాలు వసూలు చేసిన రుణాల్లో పదిశాతం ఇస్తానని సచ్లాదేవికి చెప్పు.'

మంత్రిమండలి సమావేశం చాలాసేపు జరిగింది. టీ గోరువెచ్చగా, చిరుతిండి రుచిలేకుండా అయిపోయింది. ఎజెండా కూడా కఠినంగా ఉంది. పిఎంవో- ప్రధానమంత్రి కార్యాలయం -సౌత్‌బ్లాక్‌లో రైజినాహిల్‌లో ఉంది. ప్రతిరోజూ తాజాపూలు ఉంచుతారు లోపల. రోజూ కొన్ని గంటలకోసారి పోలీసుకుక్కలు మూలమూలలా వెతుకుతాయి పేలుడు పదార్థాల కోసం. పిఎంవోలో కింది అంతస్తులో ఆరుగురు సంయుక్త కార్యదర్శులుంటారు. ప్రధానితో పాటు, ముఖ్య సహాయకులు మొదటి అంతస్తులో ఉంటారు. పిఎంవోలో ముఖ్యంగా కనిపించేది ప్రతిగదిలోను ఖచ్చితంగా ఒక పేపర్ ష్రెడ్డర్ – కాగితాలు ముక్కలు చేసే మిషను ఉంటుంది. తప్పనిసరిగా . ప్రధానికి రహస్యంగా ఉండడం అలవాటు. అలా ఉండాలి కూడా. వాళ్ళక్కడ అంతసేపు కూర్చోడానికి కారణం ఎవరో మందబుద్ధి ష్రెడ్డర్‌ను ఉపయోగించడం మర్చిపోయాడు. కోపం తెప్పించే పేరాని పదే పదే చదివారు. 'రాజ్యాంగంలోని 15, 16 నిబంధనలు దేశంలోని పౌరులందరు చట్టం దృష్టిలో సమానమైన స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని కలిగి ఉంటారని హామీ ఇస్తున్నాయి. భారతీయ సమాజం వెనక్కి నెట్టేసిన వారికి రిజర్వేషన్ కల్పించడం భారత రాజ్యాంగంలో భాగం. 1950లోనే దీన్ని రూపొందించి అమలు చేశారు. రాజ్యాంగాన్ని రూపొందించినవారు ఇది తాత్కాలిక చర్య అని, ఒక పదేళ్ళపాటు కొనసాగుతుందని భావించారు. ఎన్నో దశాబ్దాలు గడిచినా రిజర్వేషన్ అలాగే ఉంది. దీనివల్ల షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాల వారిని ప్రధాన స్రవంతిలోకి తేవడానికి భారతదేశంలో అంతగా కృషి జరగలేదనిపించడం లేదా? ఈ విధానాన్ని పునరాలోచించి, ఇది నిజంగా పనిచేస్తోందా లేదా అని నిర్ణయించుకోవాల్సిన అవసరం లేదా?'

రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాలనే ఉద్దేశం ప్రధానికి ఎన్నడూ లేదు. అది మందుగుండు పీపా లాంటిది ఎటు వెళ్ళినా పేలుతుంది. రిజర్వేషన్లు ఆపెయ్యాలని అంటే నిరసనకారులతో వీధులు నిండిపోతాయి – రిజర్వేషన్ వల్ల లబ్ధి పొందేవాళ్ళతో. ఒకవేళ రిజర్వేషన్ కొనసాగించాలంటే అప్పుడు కూడా వీధులు నిరసనకారులతో

నిండిపోతాయి - ఈసారి విధానం వల్ల వివక్షకులోనైన వాళ్ళతో. ఇది అస్సలు ఉపయోగంలేని పరిస్థితి. ఈ ప్రధానమంత్రి విధానమేమిటంటే ఈ విషయంలో ఏ విధానాన్ని అనుసరించకపోవటమే.

ఈ పీడాకర పత్రాన్ని ఆయన విధాన సహాయకులు తయారుచేశారు. ప్రతిపక్షం లోక్‌సభ ఈ విషయంపై ప్రకటన చేయమంటుందనే ఉద్దేశంతో వారు దీనిని తయారు చేశారు. ముందుగానే సంసిద్ధులై ఉండాలనుకున్నారు. కాని తర్వాత వాళ్ళు దాన్ని ష్రెడ్డర్లో ఎందుకు వేయలేదు? కోపం తెప్పించే పేరా సౌత్ బ్లాక్ నుంచి నార్త్ బ్లాక్‌కి, తర్వాత హిందుస్థాన్ టైమ్స్ ఎడిటోరియల్ కార్యాలయానికి వెళ్ళింది. మర్నాటి ఉదయం ప్రధానిని దేశ ప్రజలందరూ వేయించుకుని ఉపాహారంలా తిన్నారు.

'ప్రెస్‌వాళ్ళు ఈ వార్త గురించి మన అభిప్రాయం అడుగుతున్నారు', క్యాబినెట్ సెక్రటరీ చెప్పాడు.

'అడుగుతారు. కొత్త ఆసుపత్రులకు శంఖుస్థాపనలు చేసిన వార్తలు పంపుతాను - వాళ్ళు పట్టించుకోరు. నూతన విద్యావిధానాన్ని సంస్కరించడం గురించి సమాచారం పంపుతాను - పట్టించుకోరు. శాంతి స్థిరత్వాలలో నూతన శకారంభానికి సంబంధించి విదేశీ ప్రతినిధులతో చర్చలు ఫోటోలు పంపుతాను - పట్టించుకోరు. కాని కోపం తెప్పించే ఒక పేరాగ్రాఫు మెమోలోంచి దొరికితే, అసలది రాసి ఉండకూడదు అసలు, దాని కోసం రక్తం వాసన పట్టిన రాబందుల్లా మనవెంట పడతారు!' కోపంగా అన్నాడు ప్రధాని.

'ఇది... అసలు...' ఆర్థిక మంత్రి ఏదో చెప్పబోయాడు.

'అవును. ఏమిటి? చెప్పాలనుకున్నదేదో చెప్పండి. ఎంతసేపు గొంత సవరించు కుంటారు', కోపంగా ఉన్న ప్రధాని డిమాండ్ చేశాడు.

'ఇది - అహ! అవును. దీనికన్న పెద్ద వార్తను వాళ్ళకిస్తే వాళ్ళు దీనిని వదిలేస్తారు అదొక్కటే మార్గం - దీన్ని దృష్టిలోకి రానీకుండా చేసేది' చెప్పాడు వృద్ధుడవుతున్న ఆర్థికమంత్రి.

'ఆ వార్తేమిటి?' ప్రధాని అడిగాడు.

'బహుశా పాకిస్థాన్‌తో యుద్ధం?' మధ్యలో కల్పించుకుని అన్నాడు విదేశీ వ్యవహారాల మంత్రి.

'పత్రికలో వచ్చిన వార్తని మర్చిపోవడానికి పాకిస్థాన్‌తో యుద్ధం ప్రకటించమంటున్నారా నన్ను. మీ అందరికీ మతేమైనా పోయిందా?', ప్రధాని కోపంగా అన్నాడు. కొంచెంసేపటి తర్వాత హెూంమంత్రి మాట్లాడాడు. 'మనం యుద్ధం ప్రకటించనవసరం లేదు. భారత పాక్ సరిహద్దుల్లో కవ్వింపు చర్యలు జరుగుతున్నాయంటే చాలు, ప్రెస్ దాన్ని తలకెత్తుకుంటుంది'.

'రెండు చేతులూ కలిస్తే చప్పట్లే' అన్నాడు ప్రధాని. పాకిస్థాన్ దీన్ని సమర్థిస్తుందని మీరెలా అనుకుంటున్నారు?'

'పాకిస్తాన్ దీనికి ఏమీ అనదు. వాళ్ళ అంతర్గత రాజకీయాలే చాలా గందరగోళంగా ఉన్నాయి. వాళ్ళు బాగా చేయగలిగింది చేయడానికి వాళ్ళు ఏమాత్రం వెనుకాడరు. అమాయకులైన సామాన్యులకు పాకిస్థాన్ యుద్ధోన్మాదం కలిగిస్తుంది' చెప్పాడు విదేశాంగ మంత్రి.

'మరి మన పౌరులతో అదేవిధంగా మనం చేస్తే ప్రెస్ మనని వేలెత్తి చూపదా?' ప్రధాని అడిగాడు.

'సర్, అంత కచ్చితంగా ఉండకపోవడం వల్ల కొన్నిసార్లు బోలెడంత వివరణ ఇవ్వకుండా తప్పించుకోవచ్చు', చెప్పాడు క్యాబినెట్ సెక్రటరీ. ఆర్థికమంత్రి, హెూంమంత్రి, విదేశాంగమంత్రి అదేమంచిదన్నట్లుగా తలలూపారు రక్షణమంత్రి మాత్రం మౌనంగా ఉన్నాడు.

'యుద్ధం వచ్చే పరిస్థితి ఉంటే, పబ్లిక్ సెంటిమెంటు ప్రభుత్వంతోనే ఉంటుంది. ఎప్పుడూ జరిగేది ఇదే. ప్రభుత్వాన్ని విమర్శించాలనుకునే ప్రజలు హఠాత్తుగా దేశభక్తులవుతారు!' అన్నారు అగర్వాల్‌గారు గంగాసాగర్‌తో. ఆయన తోటలో కూర్చుని వాళ్ళు లంచ్ చేస్తున్నారు. ఇతర ఆహ్వానితులు చాందిని, ఇక్రం మాత్రమే.

'వాడు మానం కాపాడుకుంటున్నాడు. అంతకన్న ఏం లేదు', ఇక్రం అన్నాడు గోబీ పరాటా నోట్లో పెట్టుకుంటూ.

'తెలివైన వాడు మానం కాపాడుకుంటాడు. అంతకంటె తెలివైనవాడు ప్యాంటు వేసుకునే ఉంటాడు', అన్నాడు గంగాసాగర్.

'హు!'

'రిజర్వేషన్ విషయం బయటకు పొక్కేలా మనం చేసిన ఏర్పాటు పనిచేసింది. యుద్ధోన్మాదాన్ని కలిగించి ప్రధాని మన చేతికి చిక్కాడు. ఇప్పటి నుంచి ప్రతి రక్షణ కాంట్రాక్టును నిశితంగా పరిశీలిస్తారు – ముఖ్యంగా మేజిస్టిక్ మ్యూనిషన్స్‌ని'.

'ఎందుకు?'

'ఎందుకంటే రైఫిళ్ళకు సంబంధించి చాలా పెద్ద కాంట్రాక్టు మేజిస్టిక్ మ్యూనిషన్స్‌కి వచ్చింది. కంపెనీలో రెండుశాతం సాధ్వికి ఉంటుంది సోమానీకి మనం చెప్పిన విధంగా. సాధ్వి ప్రధానికి అక్రమ సంతానం. అనౌచిత్యం ఉన్న కేసు. కాదా?' ఉప్పేసిన లస్సీ తాగుతూ అన్నాడు గంగాసాగర్.

'కాని సోమానీని బాధపెడతాం మనం. అతనికి మేజెస్టిక్‌లో షేర్లున్నాయి కదా', వాదించింది చాందిని. 'మళ్ళీ వచ్చి తన నష్టాన్ని భర్తీ చేయమంటాడు'.

'ఒప్పందంపై సంతకం కాగానే తన షేర్లు అమ్మెయ్యమని చెప్పానతనికి. అతను తన షేర్లని మూడురోజుల కిందటే అమ్మేశాడని తెలిసింది', చెప్పాడు పండిట్, అగర్వాల్ గారింట్లో రుచికరమైన భోజనం చేసినందువల్ల వచ్చిన తేన్పును అణచుకుంటూ.

'దీన్ని మనమెలా ఉపయోగించుకుందాం?' అడిగాడు ఇక్రం, అగర్వాల్ గారింటి ప్రసిద్ధమైన పాయసం తినబోతూ.

'మన అడివిపిల్లి రిపోర్టర్‌ని పిలవండి. ప్రధాని పీఠాన్ని కదిల్చే అవకాశం ఇవ్వండి వాడికి. సాధ్వి సమాచారాన్ని బయటపెట్టటానికి మన అంగీకారం కోసం అసహనంగా ఎదురుచూస్తున్నాడుకదా, రైట్?

'రైట్'.

'కాని ఆమె అతని అక్రమ సంతానమని ఎత్తకూడదు ఎక్కడా', గంగాసాగర్ చెప్పాడు.

'ఎందుకని గంగా, ఆమె మీద నీకు సానుభూతి ఉందని నేను గుర్తించలేదు', అన్నారు అగర్వాల్ నిజాయితీగా.

'నాకు లేదు. ఆ సమచారం డబ్బులాంటిది. దాన్ని బ్యాంకు బ్యాలెన్సులా నిలవ ఉంచుకోవాలి. తెలివి తక్కువగా ఖర్చుపెట్టెయ్యకూడదు', అన్నాడు గంగాసాగర్. 'చాందినీ!

మనం అనుకున్న దానికన్న ముందే లోక్‌సభ ఎన్నికలు వస్తాయేమో!' గంగాసాగర్ నవ్వాడు. నవ్వుతున్నప్పుడు గొంతులో ఏదో అడ్డుపడి దగ్గాడు. నీళ్ళు తాగి మళ్ళీ ఆపుకోలేక నవ్వుతూనే ఉన్నాడు. అగర్వాల్, చాందిని, ఇక్రం ఆయన వైపు కుతూహలంగా చూశారు. పండిట్ నియంత్రణ తప్పి కనిపించడం వింతగా ఉంది.

'జోక్ ఏమిటి?' ఇక్రం అడిగాడు.

'ప్రధాని. ప్యాంటు లేకుండా అతన్ని ఊహించుకుంటున్నాను'.

'ఆమె మిమ్మల్ని రోజూ కలుస్తారంటారు! మీరేమంటారు సర్!

'నోకామెంట్'.

'ఆవిడ షేర్ హోల్డర్ కనుక మీరు మేజిస్టిక్ మ్యూనిషన్స్‌కి రక్షణ కంట్రాక్టులు ఇచ్చారంటున్నారు. నిజమేనా?'

'నో కామెంట్'.

'ఆవిడకి దివ్యశక్తులున్నాయని, వాటినుపయోగించి మిమ్మల్ని ప్రధాని చేశారని అంటారు?'

'నో కామెంట్'.

'మీరు ఇద్దరూ ఒంటరిగా తాంత్రిక పూజలు చేస్తారా?'

'నో కామెంట్'.

'నిర్ణయాలను ప్రభావితం చేసేందుకు ఆమె మంత్రిమండలి సమావేశాలకు హాజరవుతారా?'

'నో కామెంట్'.

'ఆమె మీ మిస్ట్రెసా?'

'నో కామెంట్'

ప్రధాని లేచి నిరీక్షిస్తున్న కారులో కూర్చుని నిట్టూర్చాడు. ఇది అంత మంచిరోజు కాదు.

'ప్రధానికి రాజీనామా చేయడం తప్ప గత్యంతరం లేదు. ఆర్థికమంత్రి, హోంమంత్రి, విదేశాంగమంత్రి ఆ పదవి కోసం కొట్టుకు చస్తారు', చెప్పాడు గంగాసాగర్.

'ఎవరు గెలుస్తారు?' చాందిని అడిగింది.

'ఎవరూ కాదు. సింహాలు మేకకోసం పోట్లాడుకుంటే, నక్కకి కదా ఎప్పుడూ మాంసం దొరికేది?'

'నక్కెవరు?'

'రక్షణమంత్రి',

'వాడు చవట!' వెంటనే అంది చాందిని.

'అయితే నాకేంటి. నాకు వాడు చేయాల్సిందల్లా ఉత్తరప్రదేశ్‌లో వాళ్ల పార్టీ అభ్యర్థుల్ని వాడు ఖరారు చెయ్యడం.'

'లిస్టులో ఎవరుండాలని అనుకుంటున్నారు?'

'ఇప్పుడున్న వాడి ఎంపీలు అందరూ'.

'ఎందుకు?'

'రాజకీయ నాయకులు ముడ్డిగుడ్డల్లాంటివాళ్ళు – వాళ్ళని తరచుగా మార్చాలి! వాళ్ళకి వ్యతిరేకంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు బాగా పనిచేస్తుంది'.

'న్యూఢిల్లీ పాలక పార్టీతో ఎన్నికల ముందు **అభానస** ఒప్పందం ఏమీ చేసుకోదా?' చాందిని అడిగింది.

'లేదు, చేసుకోదు!' గంగాసాగర్ అన్నాడు.

'ఎందుకని? రక్షణమంత్రికి వద్దా?'

'అతనిక్కావాలి. మనం తర్వాత నిర్ణయిస్తాం.'

'ఎందుకు? మనం ఏ వైపు ఉంటామో నిర్ణయించుకోలేదా?'

'నిర్ణయించుకున్నాం.'

'ఏ వైపు?'

'గెలిచే వైపు తల్లీ, గెలిచే వైపు'

'అతని కేదైనా విజయం కావాలి. అందరి దృష్టి అతనిపై పడేలా చేసే దేదైనా', చెప్పాడు గంగాసాగర్.

'రక్షణమంత్రికా? ప్రధాని కావాలనే ఆశ తనకు లేదని చెబుతున్నాడు కదా ఆయన', చాందిని అంది.

'తన శ్రేయోభిలాషులు నచ్చ చెబితే తన పేరును పంపవద్దని చెబుతాననడం లేదు అతను! ఆశ లేదనడం, ఇది ఒకటి కాదు.

'ప్రధాని, ఆర్థిక మంత్రి, రక్షణమంత్రి, హోంమంత్రీ అందరూ న్యూఢిల్లీలో పాలక పక్షానికి చెందినవాళ్ళు. ఎవరు గెలిస్తే మనకేమిటి?'

'ముఖ్యమైన కారణముంది, చాందినీ'.

'ఏమిటది?'

'మన యువ వ్యాపారవేత్త, సోమానీకి రక్షణమంత్రితో మంచి సంబంధాలున్నాయి. మేజెస్టిక్ మ్యూనిషన్స్ గుర్తుందా? అందుకనే మన మనిషికి పదవి రావాలనేది.'

'అయితే ప్రధాని పదవిని రక్షణమంత్రికి ఇప్పించగలననుకుంటున్నారా?'

'అవును, కాని అతను పెద్ద పదవికి గట్టి పోటీదారుగా కనిపించడంలేదు. అతను ప్రత్యామ్నాయంగా కనిపించాలంటే నాటకీయంగా ఉండేలా ఏదైనా చెయ్యాలి, తక్షణమే గుర్తింపును, విశ్వసనీయతను ఇచ్చేది.'

'ఎలాంటిది?'

'యుద్ధం గెలవమని చెప్పవచ్చు.'

'ఎక్కడ?'

'ఎన్ జె 9842'

'ఎప్పుడూ వినలేదు'

'అందుకే అది సరైన ప్రాంతం'

భారత పాకిస్థాన్‌ల మధ్య ఎత్తైన యుద్ధరంగం, సరిహద్దు వివాదం ఏర్పడిన ప్రదేశం కోఆర్డినేట్ ఎన్ జె 9842. సముద్ర మట్టానికి ఇరవై వేల అడుగుల ఎత్తులో, సబ్‌జీరో లెవల్ ఉష్ణోగ్రతలో ఇరు దేశాల దళాలు ఎదురెదురుగా ఉంటాయక్కడ. కారకోరం పర్వతశ్రేణుల్లో ప్రపంచంలోనే అత్యున్నత శిఖరాల్లో ఒకటి – ప్రపంచంలోనే అత్యంత విరోధ ప్రాంతం. సియాచిన్ గ్లేసియర్. ఉష్ణోగ్రతలు మైనస్ నలభై డిగ్రీ సెంటీగ్రేడ్ వరకు పోతాయి. చర్మం గనుక లోహానికి పొరపాటున అంటుకుంటే విడదీయలేని జిగురుతో అతికించినట్టుగా అతుక్కుపోతుంది వెంటనే. గ్లేసియర్ మీద ఏడాదికి పదిమీటర్ల ఎత్తున మంచు కురుస్తుంది. నూట ఏభై నాట్‌ల వేగంతో మంచు తుఫానులు వస్తాయి.

లే నుంచి వచ్చిన ప్రత్యేక ఎ ఎన్–32 ఎ సైనిక విమానం నుంచి దిగిన రక్షణమంత్రి అయిదు పొరల బట్టలు వేసుకున్నా వణికిపోతున్నాడు. భారతసైన్యం నిర్మించిన ప్రపంచంలో ఎత్తైన హెలిపాడ్ పాయింట్ సోనమ్‌కు అతనిని తీసుకెళ్ళడానికి మిలటరీ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ నిరీక్షిస్తోంది. చాపర్ పైలెట్ మౌనంగా ఉండిపోయాడు. పాయింట్ సోనమ్‌లో చాపర్‌ని దింపడం వెంట్రుకలు నిక్కబొడుచుకునే అనుభవమని అతను మంత్రికి చెప్పి భయపెట్టాలనుకోలేదు.

కదులుతున్న యంత్రభూతం కోసుగా ఉన్న మంచుమీద చిన్నగా ఉన్న హెలిపాడ్‌పై దిగుతోంది. గాలి అందక కొద్దిగా కూడా ఎగరలేక సతమతమవుతోంది. అవసరం లేకుండా తాళ్ళనిచ్చెనతో మంత్రిని దింపాలనుకోవడం అర్థం లేనిదని పైలెట్ అనుకున్నాడు. కాని రక్షణశాఖ ప్రధాన కార్యాలయం సేనాభవన్లోని మేధావులైన అధికారులతో వాదించటానికి తనెవరు అనుకున్నాడు.

వెనక్కి చూడడానికి పక్కకి తిరిగాడు. పళ్ళు టకటకలాడిస్తూ భయంతో, వణికి పోతూ ముడుచుకుని కూర్చున్న రక్షణ మంత్రిని చూశాడు.

నిచ్చెనతో దిగడానికి లేస్తూ రక్షణమంత్రి తన స్నేహితుడిని, సోమానీని తిట్టుకుంటు న్నాడని అతనికి తెలియదు. ఈ ఆలోచన సోమానీది కాదని, గంగాసాగర్‌దనీ మంత్రికి తెలియదు.

'అక్కడ గెలవడానికి యుద్ధమేమీ లేదు', అంది చాందిని.

'దగ్గర్నించి చూస్తే అక్కడెప్పుడూ యుద్ధం ఉంటుంది', చెప్పాడు గంగాసాగర్.

'దాని కోసం ఎక్కడ వెతుకుతున్నారు?'

'వార్తా పత్రికలలో' చెప్పాడు గంగాసాగర్.

'హు?'

'గెలవాల్సిన యుద్ధం కాగితం మీద – మాటల యుద్ధం! సైనికుల పోరాటం కాదు! అంత గందరగోళం మనకవసరం లేదు'

'నాకింకా అర్థం కాలేదు'.

'సియాచిన్లో భారత, పాకిస్థాన్ సైన్యాలు పరస్పరం కాల్పులు జరిపాయని పత్రికలకి వార్తని లీక్ చేద్దాం'.

'వాళ్ళలా చేశారా?' అడిగింది చాందిని.

'వాళ్ళు చేసి ఉండొచ్చు', గంగాసాగర్ సమాధానమిచ్చాడు. 'వాళ్ళు అలా చేయలేదని చెప్పలేం. సియాచిన్లో రోజూ కాల్పులు జరుగుతూనే ఉంటాయి'.

'ఏదైనా జరగవచ్చు అని చెబుతారు మీరు ఆ సిద్ధాంతం ఉపయోగించి!'

'ఖచ్చితంగా. వాళ్ళు చేసి ఉండొచ్చు. చేసి ఉండకపోవచ్చు. నిజమేమిటో ఎవరు చెబుతారు?'

'తర్వాత?'

'సోమానీకి చెబుదాం – రక్షణమంత్రిని వెళ్ళి సియాచిన్లో భారత సైన్యాన్ని చూసిరమ్మని. చాపర్ నించి నిచ్చెన మీదుగా దిగే రక్షణమంత్రి. మంచి ప్రచారం. భారత సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడే వ్యక్తి! సూపర్‌మేన్, స్పైడర్‌మేన్ కలగలిసిన వ్యక్తి!'

'తర్వాత?'

'మరోలీక్. రక్షణమంత్రి వ్యక్తిగత చొరవతో దళాలను సందర్శించడం వల్ల వాళ్ళ నైతిక బలం పెరిగి పరిస్థితి వేగంగా అదుపులోకి వచ్చిందని'.

'పత్రికలు ఇదంతా నమ్ముతాయా– పబ్లిసిటీ స్టంట్ అంటాయి'.

'అమెరికా రక్షణశాఖ మేధావుల సమూహం ఇచ్చిన రహస్య నివేదిక అంటే వాళ్ళు నమ్ముతారు'.

'మీరనుకొనే విధంగా అమెరికా రక్షణ శాఖ మేధావులు ఎందుకు చెబుతారు?'

'మేజెస్టిక్ మ్యూనిషన్స్‌కి స్ట్రాటజిక్ ఏసియా రీసెర్చి డిఫెన్స్ - సార్డ్ - ఆసియా సైనిక విషయాలపై అమెరికా మేధావుల సమూహంలో భాగముంది.

'సోమాని నేనడిగినప్పుడు వాళ్ళ రిపోర్టు ఇప్పిస్తాని వాగ్దానం చేశాడు.'

'రిపోర్టు నిజమవుతుందా?'

'అవ్వచ్చు. ఎవరనగలరు పాకిస్థాన్ సైన్యం వెనక్కి వెళ్ళలేదని!'

'కాని అస్సలు వాళ్ళు దాడి చెయ్యలేదుగా!'

'నిజంగా? నాకు తెలియదు. చేసి ఉండొచ్చు'.

'అయితే ఇదంతా పెద్ద అబద్ధం అన్నమాట?'

'అవ్వచ్చు. కాకపోవచ్చు కూడా!'

'ప్రధాని పదవిని రక్షణమంత్రికి వచ్చేలా చేసినందుకు సోమానీ ఏం కోరాడు?' చాందిని అడిగింది.

'ఏమీ అడగలా. సౌత్‌బ్లాక్‌లో తన స్నేహితుడుండడం లాభమే కదా. ఇప్పుడు కొత్తగా వచ్చిన హెూదాతో సీనియర్ పార్టనర్ - రంగ్తాకి - గుణపాఠం చెబుతాడు', సమాధానమిచ్చాడు గంగాసాగర్.

'మనకి అది బాగుంటుందా?'

'రాజకీయాల్లో శాశ్వత స్నేహితులుగాని, శత్రువులు గాని ఉండరు'

'గంగా అంకుల్, మీరు చనిపోయాక తప్పనిసరిగా నరకానికి పోతారు!'

'తల్లీ, నేను దానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. నన్ను సృష్టించిన వాణ్ణి కలుసుకోవడానికి వెళ్ళడం నాకూ ఆనందమే. నా అదృష్టవశాత్తు సృష్టికర్త నన్ను కలుసుకోవాలని తొందరపడడం లేదు!'

లాల్‌బహదూర్‌శాస్త్రి భవన్‌లో తన కార్యాలయంలో కూర్చుని ఉంది చాందిని. ఆమె గదిలో ఒక మూల సోఫాలో గంగాసాగర్ కూర్చుని ఉన్నాడు. వార్తలు వింటున్నారిద్దరూ. యాంకర్ ఇలా అంటున్నాడు:

'భారత రాష్ట్రపతి బుధవారం నాడు లోక్‌సభను రద్దుచేశారు. కొత్త సభను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేస్తూ. మాజీ రక్షణమంత్రి, కొత్త ప్రధాని సిఫారసుతో ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేశారు. యూనియన్ క్యాబినెట్‌తో సమావేశం జరిపిన వెంటనే ప్రధాని రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళారు తన మంత్రిమండలి రాజీనామాను సమర్పించడానికి. కొత్తమంత్రివర్గం ఏర్పడేవరకు పదవిలో ఉండమని రాష్ట్రపతి ఆయనను కోరారు. రాష్ట్రపతికి, ప్రధానికి మధ్య జరిగిన సమావేశం ముప్ఫయి నిముషాలు....'

గంగాసాగర్ యాంకర్ మాట పూర్తికాకుండానే టీవి కట్టేశాడు.

'లంజాకొడుకు, సియాచిన్‌వల్ల కొత్తగా దేశవ్యాప్తంగా వచ్చిన పేరు తనకు వ్యక్తిగతంగా ఉపయోగిస్తుందనుకొని ఎన్నికలు పెట్టేస్తున్నాడు', అన్నాడు గంగాసాగర్.

'బ్యాలెట్‌కు మనం రెడీ', అంది చాందిని. తేదీ ఆరు నెలలు ముందుకు జరిగితే ఏం కాదు. గత రెండేళ్ళుగా దీనికి సిద్ధం కావడం తప్ప మనమేం చెయ్యలేదు'.

'అయినాగాని ముందస్తుగా జరిగే ఒపీనియన్ పోల్స్‌లో ఉత్తరప్రదేశ్‌లో మనం ముందుండడం అవసరం', అన్నాడు గంగాసాగర్.

'ప్రజాభిప్రాయాన్ని మనం నియంత్రించడం లేదు', చెప్పింది చాందిని.

'ప్రజాభిప్రాయమనేదేమీ లేదు. పబ్లిష్ అయిన అభిప్రాయమే ఉంది. అది మన వైపుండేలా చూసుకోవాలి'.

'దాన్ని అలా ఎలా చేయగలం మనం?' చాందిని అడిగింది. 'పోల్స్‌ని పత్రికలు, మ్యాగజైన్లు నిర్వహిస్తాయి. మనం వాటి యజమానులం కాము!'

'నీ ప్రైవేటు ఏజన్సీతో పోల్ నిర్వహింపచెయ్యి. తామే అధ్యయనం జరిపామని చెప్పుకోనిస్తే, విషయం కోసం అర్రులు చాచే పత్రికలు ఫలితాలు ప్రకటిస్తాయి సంతోషంగా.'

'అయినా ఫలితాన్ని మనం నియంత్రించలేంగా!'

'మాంత్రికుడి నాలుగో కార్డు (మానాకా) ఉపయోగించు'.

**'హు? అదేమిటి?'**

'మాంత్రికుడు కార్డులు కలిపేస్తాడు. నిన్నొక కార్డు తీయమంటాడు. నువ్వే కార్డు తీయాలనుకుంటావో అతనికి తెలుసు – నువ్వు కూడా అలాగే అతను కోరుకున్న కార్డు తీస్తావు. అభిప్రాయం కోసం జరిపే ఒపీనియన్ పోల్స్ అలాంటివే. ప్రతిస్పందించే వాళ్ళు ఏం చెప్పాలో ముందే నువ్వు నిర్ణయించుకుని వాళ్ళని అడుగుతావు'.

'నాలుగో కార్డు ఏమిటి?'

'సర్వేలకు ఏ విషయం మీద ఇంటర్వ్యూ చేస్తారో ఆ విషయానికి సంబంధించి నాలుగుప్రశ్నలు తయారుచేసుకుంటారు. ఎప్పుడూ ముందు అడిగిన మూడు ప్రశ్నలు ప్రచురించకూడదు – నాలుగో ప్రశ్న ఫలితమే ప్రచురించాలి. ఆ సమాధానాలే లెక్కలోకి తీసుకోవాలి!'

అభిప్రాయం సేకరిస్తున్న మహిళ కూరగాయల దుకాణంలో నుంచి బయటికొస్తున్న మహిళను ఆపింది.

'ఒకటో ప్రశ్న : స్త్రీగా మీరు పురుషులకన్న స్త్రీలను తక్కువగా, వివక్షతో చూస్తున్నారనుకుంటున్నారా?'

'అవును'

'రెండో ప్రశ్న : స్త్రీలను బాధించే విధంగా పురుషులే ఏకచ్ఛత్రాధిపత్యంగా అధికారాన్ని కొనసాగిస్తున్నారనుకుంటున్నారా?'

'అవును'.

'మూడో ప్రశ్న : దృఢంగా ఉండే స్త్రీ రాష్ట్రంలోనే కాక, కేంద్రంలో కూడా అధికారంలో ఉండాలనుకుంటున్నారా?'

'అవును'.

'నాలుగో ప్రశ్న : మహిళలకు అధిక ప్రాతినిధ్యం ఇచ్చేలా చాందిని గుప్తకు మీరు మద్దతిస్తారా?

'ఇస్తాను'.

బ్రాహ్మణ ఉపాధ్యాయుడిని ఇంటర్వ్యూ చేయడానికొచ్చిన బ్రాహ్మణుడు అడుగుతున్నాడు.

'ఒకటో ప్రశ్న : అగ్రవర్ణాలను రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదని ఒక బ్రాహ్మణుడిగా మీరు అనుకుంటున్నారా'.

'అవును'.

'రెండో ప్రశ్న : విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ల వల్ల బ్రాహ్మణులకు మంచి అవకాశాలు రావడం లేదని భావిస్తున్నారా?'

'అవును'.

'మూడో ప్రశ్న: బ్రాహ్మణుల హక్కుల కోసం పోరాడడం కోసం ఎవరైనా ఉండాలి అనుకుంటున్నారా?

'అవును'

'నాలుగో ప్రశ్న : బ్రాహ్మణుల వాణిని వినిపింపచేయడానికి చాందిని గుప్తకు మద్దతిస్తారా?

'ఇస్తాను'

దళిత సర్వే ఏజెంటు మురికివాడలో ఉన్నాడు. తానెంచుకున్న దళితుడిని ఇలా అడిగాడు:

'ఒకటో ప్రశ్న : దళితుడిగా, ఎన్నో ఏళ్ళుగా వివక్ష, అస్పృశ్యతలు దళితులకు సరైన రక్షణ కల్పించడం లేదని భావిస్తున్నారా?'

'అవును'.

'రెండో ప్రశ్న : షెడ్యూల్డ్ కులాలు తెగలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచాలని మీరనుకుంటున్నారా?'

'అవును'.

'మూడో ప్రశ్న : దళితులకు బాగా ప్రాతినిధ్యం డిమాండ్ చేసే వాళ్ళు రావాల్సిన సమయం ఆసన్నమైందని అనుకుంటున్నారా?'

'అవును'.

'నాలుగో ప్రశ్న : దళితుల ప్రగతికి మరింత పాటుపడడానికి చాందిని గుప్తకు మీరు మద్దతిస్తారా?

'ఇస్తాను'.

యువ అభిప్రాయసేకర్త విశ్వవిద్యాలయ విద్యార్థి దగ్గరికొచ్చాడు.

'ఒకటో ప్రశ్న : యువకుడిగా, మనదేశ భవిష్యత్తుకు సంబంధించి ఈ దేశ యువత తనవాణిని వినిపించడానికి తగినంత అవకాశం లేదని భావిస్తున్నారా?'

'అవును'.

'రెండో ప్రశ్న : మన యువత ఆర్థిక భద్రత వృద్ధ రాజకీయ నాయకులు పెట్టే బృహత్తర లోటు బడ్జెట్‌ల వల్ల తాకట్టు పెట్టబడుతోందని మీరు భావిస్తున్నారా?

'అవును'.

'మూడో ప్రశ్న : యువతరం నాయకత్వం చేపట్టాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నారా?'

'అవును'.

'నాలుగో ప్రశ్న : ఈ దేశ యువతకు అధికారం వచ్చేలా చాందిని గుప్తకు మీరు మద్దతిస్తారా?'

'ఇస్తాను'.

ఇంటర్వ్యూ చేసే ముస్లిం వ్యక్తి మసీదు బయట ఉన్నాడు. అప్పుడే శుక్రవార ప్రార్థనలు ముగిశాయి.

'ఒకటో ప్రశ్న : ఒక ముస్లింగా హిందూ మెజారిటీ దేశంలో మీరు మైనార్టీ అని భయపడుతున్నారా?'

'అవును'.

'రెండో ప్రశ్న : ముస్లింల ప్రగతిని ప్రభుత్వాలన్నీ నిర్లక్ష్యం చేశాయని భావిస్తున్నారా?

'అవును'.

'మూడో ప్రశ్న : తమ కోసం మాట్లాడేవారిని ముస్లింలు ఎన్నుకోవాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నారా?'

'అవును'.

'నాలుగో ప్రశ్న : ముస్లిం సమస్యలను చర్చించడానికి చాందిని గుప్తకు మీరు మద్దతిస్తారా?'

'ఇస్తాను'.

సాయంత్రం వార్తలు చూస్తూ చాందిని చిరునవ్వు నవ్వింది. ఈ వారం ఆరంభంలో లోక్‌సభ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్ ఓటర్ల అభిప్రాయాన్ని సేకరిస్తూ సర్వే చేసిన మానాకా ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాలు అబ్జర్వర్ ప్రకటించింది. మెజారిటీ ప్రజలు న్యూఢిల్లీ ప్రభుత్వ అలసత్వంతో అసంతృప్తిగా ఉన్నారని సర్వే తెలుసుకుంది. కేంద్రంలో **అభానస**, చాందిని గుప్తలకు పాత్ర పోషించే విధంగా మద్దతివ్వాలని చాలామంది అభిప్రాయపడ్డారు. కులాలు, కమ్యూనిటీలు, లింగాలు, వయస్సులతో సంబంధం లేకుండా అందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. 'ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులకు చాందిని గుప్త నేతృత్వంలో **అభానస** కేంద్రంలో మెరుగైన ఫలితాలు సాధించగలదని భావించారని' నిన్న ఒపీనియన్ పోల్ ఫలితాలు విడుదల చేస్తూ 'మానాకా' అధికార ప్రతినిధి అన్నారు.

'మానాకా ఏ ఏజెన్సీ?' చాందిని తన సెక్రటరీని అడిగింది.

'నాకు తెలియదు. మీనన్‌ను అడగనా?'

'అడుగు. తనకి తెలుస్తుంది. గంగాసాగర్ గారే ఈ ప్రయత్నం మొదలుపెట్టారు', చెప్పింది చాందిని.

కొన్ని నిముషాల తర్వాత సెక్రటరీ నవ్వుకుంటూ చాందిని కార్యాలయంలోకి వచ్చాడు.

'మానాకా పూర్తి పేరు కనుక్కున్నాను. మీనన్‌కి తెలుసు'

'ఏమిటి?'

'మాంత్రికుడి నాలుగో కార్డు'.

'మా పార్టీకి బృహత్తర విజయం అని మీలాంటి వారు జోస్యం చెప్పాలి', అన్నాడు గంగాసాగర్ ఆశ్చర్యచకితుడైన మనిషితో. పేవ్‌మెంట్ మీద కూర్చుని అంతులేని సంపదలు, అదృష్టం, కీర్తి అన్నీ దార్లోనే ఉన్నాయని చెప్పి జనాల్ని మోసం చేసే అతన్ని తీసుకొచ్చారు.

'నేనంత ప్రసిద్ధుణ్ణి కాదు సర్. నన్నెవరూ నమ్మరు', వేడుకున్నాడు జ్యోతిష్కుడు.

'దాన్ని నాకొదిలెయ్. లక్నోలో ప్రముఖ వార్తాపత్రిక వాళ్ళతో ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాను. ఉత్తరప్రదేశ్‌లో మంత్రి మండలిలో మార్పులు జరుగుతాయని చెప్పు'.

'కాని నాకా విషయం తెలియదు!'

'ఇప్పుడు తెలుసుగా. నేనీ రోజు ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నాను. రేపు చిన్న మార్పు జరుగుతుందని ఆమె చెబుతుంది. మీలాగా కాకుండా, ముందుగా నేనెప్పుడూ జోస్యం చెప్పను. తప్పకుండా జరుగుతుందని తెలిశాక జోస్యం చెప్పడం మంచిది. ఇంక మంత్రిమండలిలో మార్పులు జరిగాక నువ్వు మరో ఇంటర్వ్యూ ఇవ్వాలి'.

'అప్పుడేం చెప్పాలి?' ఆశ్చర్యపోయిన ఆ మనిషి అడిగాడు.

'ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని జోస్యం చెప్పాలి'.

'కాని నాకా విషయం తెలియదు!'

'ఇప్పుడు తెలుసుగా, వ్యవసాయ శాఖ నుంచి నాకు రహస్య నివేదిక అందింది. నీ ఇంటర్వ్యూ అయిన మర్నాడు నివేదిక బయటికొస్తుంది. అప్పుడు నువ్వు మూడో ఇంటర్వ్యూ ఇవ్వాలి'.

'అప్పుడేం చెప్పాలి?' అనుకున్నట్టుగానే అడిగాడు.

'అలహాబాద్‌లో అనుకోకుండా వర్షాలు వస్తాయని జోస్యం చెప్పాలి'.

'కాని నాకా విషయం తెలియదు!'

'నీకు తెలుసు. గంగానది మీద సిల్వర్ అయొడైడ్‌తో మేఘమధనం చేయడానికి ఎయిర్‌క్రాఫ్ట్ ఏర్పాటు చేశాను. నువ్వు జోస్యం చెప్పిన మర్నాడు జల్లులు పడతాయి. అప్పటికి ప్రజలు, పత్రికలు కూడా నువ్వేం చెప్పినా నమ్ముతాయి', అప్పుడు నువ్వు నాలుగో ఇంటర్వ్యూ ఇవ్వాలి'.

'ఈ నాలుగో ఇంటర్వ్యూలో నేనేం చెప్పాలి'.

'**అభానస**కు, చాందినికి బ్రహ్మాండమైన విజయం లభిస్తుందని జోస్యం చెప్పాలి'.

'కాని నాకా విషయం తెలియదు!'

'నాకూ తెలియదు. నీ జోస్యం నిజమవుతుందని ఆశిస్తాను'.

అలహాబాదు గంగా యమునల సంగమం దగ్గరుంది. ప్రస్తుతం ఉద్రిక్తంగా ఉంది. ఓల్డ్‌సిటీలో ఆకతాయి హిందూ పిల్లలు ముస్లింలపై మద్యం చల్లారు. కోపంతో కొందరు ముస్లిం పిల్లలు గంగా తీరంలో మెట్ల మీద ఎద్దు మాంసం ముక్కలు వేశారు. అగ్గి రగులుకొంది. అలహాబాదులో హింస చెలరేగింది.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చాందిని గుప్త కొత్త పోలీసు చీఫ్‌ని పిలిచింది. ఇక ముందు గొడవలు జరగకుండా పోలీసులు తీసుకున్న నివారణ చర్యలు కనుక్కోవడానికి చాందిని ఆయనని పిలిపించింది. సందర్శకుల కుర్చీల్లో ఒకదానిలో గంగాసాగర్ కూర్చుని ఉన్నాడు. మరోదానిలో పోలీసు చీఫ్ ఉన్నాడు.

'పరిస్థితి అదుపులోనే ఉంది మేడమ్', చెప్పాడు పోలీస్ చీఫ్. 'మూడు బెటాలియన్ల రయత్ పోలీసులు, రయత్‌గేర్ ధరించి నగరంలో ప్రవేశించారు. అల్లరి మూకల్ని చెదరగొట్టటానికి బాష్పవాయువుని ప్రయోగించారు. అల్లరిమూక వాళ్ళపైకి రాళ్ళు ఇటుకలతో దాడి చేశారు కాని నగరంలోని ముఖ్యప్రదేశాల్లో పోలీసులు పట్టుసాధించారు. ఓల్డ్‌సిటీ తప్పమిగిలిన అన్నిచోట్ల పోలీసులు అదుపు చేశారు. అక్కడ మరికొన్ని రోజుల్లో సాధారణ పరిస్థితి నెలకొంటుంది'.

'చనిపోయారా లేక గాయపడ్డారా?'

'ఎవరూ చనిపోలేదు, కొందరు గాయపడ్డారు. అజ్ఞాతవ్యక్తులెవరో టిప్ ఆఫ్ ఇచ్చి ఉండకపోతే ఈ సంఖ్య బాగా పెరిగేది. ముందుగానే ఓల్డ్ సిటీలోకి బలగాలను పంపగలిగాం'.

'భయం', అన్నాడు గంగాసాగర్ హఠాత్తుగా సంభాషణ విషయాన్ని మారుస్తూ.

'అదేమిటి సర్?' అడిగాడు చీఫ్.

'భయం! ఈ రోజే సాధారణ స్థితికి రావాలి - రేపో - ఎల్లుండో కాదు. భయపెట్టండి. చట్టానికి భయపడేలా చేయండి', అన్నాడు గంగాసాగర్ నొక్కి చెబుతూ.

'కాని సర్. కర్ఫ్యూ విధించాం. ఆంక్షలు ఎత్తెయ్యడానికి మీ ఆదేశాల కోసం చూస్తున్నాం. తీవ్రమైన చర్యలు తీసుకోకుండానే ఫలితాలు సాధించగలం'.

'నేను చెప్పింది చెయ్యండి. రేపటికల్లా ముఖ్యమంత్రి అలహాబాదులో బహిరంగ సభలో మాట్లాడాలి'.

'కాని సర్–'

'కొత్త పోలీస్ చీఫ్ శ్లాఘించదగిన పనిచేశారనుకుంటున్నాను, ముఖ్యమంత్రిగారూ' అన్నాడు గంగాసాగర్ మృదువుగా, 'కాని కొన్నిసార్లు ఇలాంటప్పుడు ఉద్వేగాలను వాడుకోవాలి. బలగాలు, బాష్పవాయువులు కాదు'.

'ఇప్పటికిప్పుడు అలహాబాద్ సందర్శన చేయడం తగిన పని కాదు. అది మందు గుండు పీపాలా పేలడానికి సిద్ధంగా ఉంది', త్వరితంగా చెప్పాడు చీఫ్.

'ముఖ్యమంత్రిని రక్షించడానికి అక్కడ మీరున్నారు. కాదా? చీఫ్? లేకపోతే తన ప్రియమైన పౌరులను కలుసుకొనడానికి వెళ్ళేటప్పుడు ముఖ్యమంత్రి రక్షణకు, భద్రతకు హామీ ఇచ్చే కొత్తవ్యక్తిని వెతుక్కోవాలా?' దాదాపుగా గుసగుసగా అంటున్నట్టు అన్నాడు గంగాసాగర్.

'మేమావిడను రక్షిస్తాం సర్', అన్నాడు పోలీస్ చీఫ్, నిర్ణయం అప్పటికే జరిగిపోయిందని తెలిసి.

'ప్రియమైన ప్రయాగ ప్రజలారా - ప్రపంచాన్ని సృష్టించిన తర్వాత బ్రహ్మ ఇక్కడే బలి ఇచ్చాడు - ప్రియమైన అలహాబాదు ప్రజలారా - అక్బరు తను సృష్టించిన కొత్త మతం దిన్-ఇ-ఇల్లాహి పేరు మీద ఈ నగరానికి పునర్నామకరణం చేశాడు. బౌద్ధమత కేంద్రమైన కోశాంబిలోని మహాపురుషులు, మహిళామణులారా - ఈ రోజు ఇక్కడ ఉండడం నాకు ఎంతో గౌరవంగా ఉంది, తెలివిగా నగరంలోని హిందూ, ముస్లిం,

బౌద్ధులను సంబోధిస్తూ అంది. 'నేనీ రోజున ఇక్కడ ఒక హిందువుకి జన్మించిన కూతురిగా, ముస్లిం దత్తపుత్రికగా ఉజ్వలమైన లౌకిక దృక్పథానికి ఉదాహరణగా నిలబడి ఉన్నాను మీ ముందు. ఈ నేలలోని రెండు గొప్ప మతాలకు నేను ప్రతినిధిని. దేశాన్ని మతప్రాతిపదికలో ఎవరైనా విడదీయాలని చూస్తే దానికంటె ముందు నేను మరణిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను మీ ముందు' చాందిని గట్టిగా చెప్పింది. అలహాబాదు **అభానస** 'జిల్లా కమిటీ చీఫ్ ర్యాలీని ఏర్పాటు చేశాడు. వేదిక మీద ఇక్రం, గంగాసాగర్, అలహాబాదు **అభానస** లోక్‌సభ అభ్యర్థి, కొందరు ముఖ్యులు కూర్చున్నారు. స్థానిక గాయకులు బాలీవుడ్ దేశభక్తి గీతాలను ఆలపించారు. పార్టీ స్థానిక కార్యకర్తలు వేదిక మీదున్న పెద్దలందరికీ పూలదండలు వేశారు. వేలమంది మద్దతుదార్లు ఎండకు, అల్లర్లకు భయపడకుండా సభలో కూర్చుని తమ ప్రియతమ ప్రతినిధుల వాగ్దానాలు – వినడానికి వచ్చారు – వాగ్దానాలు బహుశా అన్నీ భంగం చేసేవే.

వేదికకు ఎదురుగా మరో వేదిక మీద ప్రధాన ప్రతిపక్షనాయకుల దిష్టి బొమ్మలున్నాయి. ఆ బొమ్మలను టపాసులతో చేశారని జనానికి తెలియదు. ఆహ్వాన వేడుకలు అవగానే, చాందిని వేదిక మధ్యకు నడిచింది. ఒక కార్యకర్త అందంగా అలంకరించిన విల్లుని, బాణాన్ని తెచ్చి ఆమెకిచ్చాడు. ఆమె అవతలి వేదిక పై ఉన్న బొమ్మలకు గురిపెట్టింది. ఆమె గురిపెట్టగానే టపాసుల బొమ్మలను వరుసగా కాల్చేశారు. మూక ఆనందంతో అరిచారు – చాందినికి చప్పట్లు కొడుతూ ఆమె చెప్పేదాన్ని అనుమతిస్తున్నట్లుగా. ఆమె బిగ్గరగా, 'మనల్ని విడగొట్టాలనుకునే వారిపై మనశక్తిని గురిపెట్టి నాశనం చేద్దాం. శాంతి సౌభ్రాత్రాల నూతన శకంలో ప్రవేశిద్దాం. గతానికీ, వర్తమానానికీ జరిగే వివాదం మనకొద్దు – అది భవిష్యత్తును నాశనం చేస్తుంది!'

గంగాసాగర్ ఆశావహ దృక్పథంతో వెలిగిపోయాడు. ఇక్రంని చూసి కన్నుగీటాడు. కొద్దిగా రమ్ము. ఒక పౌండు ఎద్దుమాంసంతో ఎంతో సాధించవచ్చు. జనం ఎన్నికలు చాలా ఖరీదైనవి అనుకుంటారు! దీర్ఘశ్వాస తీసుకుని నిదానంగా మంత్రాన్ని పఠించాడు, ***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'.***

## పదమూడో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

‘మాళవ రాజ్య గద్దెమీద సింహరణ్ ఉండడంతో మనం సైన్యాలను ఉంచడానికి రాజ్యం లభించింది’, అన్నాడు చాణక్యుడు.

‘అవును’ సమాధానమిచ్చాడు చంద్రగుప్తుడు విచారంగా, ‘పిప్పలివనంలో గతేడాది నా తండ్రి మరణించడంతో, అంభి మాజీసేనాని ఆధ్వర్యంలో సేనలను సంఘటితం చేయాలి మనం ఇప్పుడు’.

తండ్రిని కోల్పోయిన కొడుకు బాధ చాణక్యుడికి అర్థమైంది. చాణక్యుడు కనీసం తన తండ్రికి అంత్యక్రియలు చేయగలిగాడు. చంద్రగుప్తుడు చేయలేకపోయాడు. కాని బాధపడేంత సావకాశం వారికి లేదని చాణక్యుడికి తెలుసు.

‘చంద్రగుప్తా, పురుషోత్తముడిని మనం స్నేహితుడిగా కోల్పోలేము. ధననందుడితో యుద్ధం చెయ్యాలంటే అతని సాయం నీకు అవసరం’, అతను చెప్పాడు.

‘కాని పురుషోత్తముడు మనపై కోపంగా ఉన్నాడు. అతని సామంతరాజ్యాల్లో భాగమైన మాళవ రాజ్యాన్ని మనం లాక్కున్నాం. మనతో వ్యూహాత్మక ఒప్పందాన్ని అతను చర్చిస్తాడా?’ నమ్మలేనట్టుగా అడిగాడు చంద్రగుప్తుడు.

అతను ఉన్నత వంశస్థుడు, కోపం, గర్వం ఉన్నవాడు. పైగా విఫలం చెందాడు. ఈ లక్షణాలున్న వాళ్ళని త్వరగా మోసం చేయవచ్చు’, నిశ్చింతగా అన్నాడు చాణక్యుడు.

‘అంటే మనతో ఒప్పందానికి అతన్ని ఒప్పిస్తామా?’ చంద్రగుప్తుడు అడిగాడు.

‘మగవాడు ఆడదానితో నువ్వందంగా ఉన్నావని చెబితే, అతను చెప్పిన మిగిలిన అబద్ధాలని ఆమె పట్టించుకోదు! పురుషోత్తముడితో కూడా అందమైన స్త్రీతో ఎలా ఉంటామో అలా ఉంటే సరిపోతుంది’, నవ్వాడు చాణక్యుడు.

'ఒకవేళ అతను గాలానికి చిక్కకపోతే?' చంద్రగుప్తుడడిగాడు చాణక్యుణ్ణి వివరణ కోరుతున్నట్టుగా.

'అప్పుడు అధికారం, కీర్తి, వైభవం వంటి అతని ఆశయాలను అడ్డం పెట్టుకుంటాం – భారతదేశంలో అత్యంత శక్తిమంతుడైన పాలకుడు కావాలని కదా అతని ఆశ'.

'అదెలా చేస్తాం? అతనికి ఆశ చూపడానికి మన దగ్గర అంత గొప్పదేమీ లేదు కదా' నిరుత్సాహంగా చెప్పాడు చంద్రగుప్తుడు.

'ఏముంది. మగధ సింహాసనాన్ని నీకివ్వడానికి బదులుగా అతనికిస్తానని ఆశ పెడతాను', అన్నాడు చమత్కారంగా చాణక్యుడు.

చంద్రగుప్తుడు గురువు ముందు మోకరిల్లి, వినయంగా, చెప్పాడు, 'మీరు నన్ను ఎలా ఉంటూ పనిచేయమంటే అలా చేస్తాను. ఓడిపోయిన, అల్పుడైన పురుషోత్తముడి కింద నేను పనిచేయలేను'.

ఈ రకంగా సంయమనంతో మానసిక క్షోభను బయటపెట్టిన చంద్రగుప్తుణ్ణి చూసి చాణక్యుడు ఫక్కున నవ్వాడు. 'నేను కేవలం అతనికి ఆశ చూపుతానన్నాను. అతనికి ఇచ్చేస్తాననలేదు. నేను మాట్లాడే మాటల్ని నువ్వు శ్రద్ధగా వినాలి చంద్రగుప్తా. ఇది పురుషోత్తముడితో చేసుకొనే ఒప్పందం. దీన్ని నేను కావాలనే పాటించను!' అన్నాడు.

పూర్తిగా అయోమయానికి గురైన చంద్రగుప్తుడు సందేహిస్తూ అన్నాడు, 'మగధను జయించడానికి తన సహాయం మనకవసరమని నిజాయితీగా అడిగితే బాగుంటుంది కదా? అతనికి సింహాసనం కాకుండా కొన్ని ప్రాంతాలు ఇవ్వవచ్చు'.

'అతను నిన్నింకా చిన్నపిల్లవాడనుకుంటున్నాడు. అతను నీకు స్నేహితుడిగా విలువ ఇవ్వడు. అతనితో ఒప్పందం చేసుకొని, మగధను పాలించుతాననుకుంటూ గాలిలో మేడలు కట్టుకోనిద్దాం. ఒకసారి మనలక్ష్యం సాధించాక పురుషోత్తముడిని వదిలించు కోవచ్చు'.

'అతనికి చేసిన మోసానికి ఏం వివరణ ఇస్తారు?' అడిగాడు చంద్రగుప్తుడు.

'అనుమతి కన్న క్షమాపణ తరచుగా సులభంగా దొరుకుతుందని గుర్తుంచుకో!' అన్నాడు చాణక్యుడు, తన వికారమైన ముఖంలో నవ్వు కనిపిస్తుండగా. 'నా ఆత్మీయ స్నేహితుడు ఇంద్రదత్‌తో మాట్లాడతాను. పురుషోత్తముడి ప్రధాని అతను. నా తరఫున మహారాజుతో మాట్లాడి, చాణక్యుడితో స్నేహం చేయడం అతనికే మంచిదని చెప్పిస్తాను'.

'చాణక్యుడితో ఒప్పందం అంటే, చంద్రగుప్తుడితో ఒప్పందం అని అర్థం కాదా?' అర్థం కాని రాకుమారుడడిగాడు.

'అహఁ. మనం దాన్ని మార్చాలి. మనిద్దరం పోట్లాడుకొని ఎవరి దారిన వాళ్ళు పోవాలి', సమాధానమిచ్చాడు చాణక్యుడు.

'ఆచార్యా, నేను మీతో పోట్లాడలేను ఎన్నడూ. మీరు చెప్పినది నాకు ఆదేశం. మీరు నా ప్రాణాన్ని అడిగినా నేనిచ్చేస్తాను. మీరు చెప్పిన దానికి వ్యతిరేకంగా చెయ్యడానికి నేను కలలో కూడా అనుకోగలనా?'

'శాంతం, చంద్రగుప్తా, నేను భ్రాంతికున్న శక్తిని గురించి చెబుతున్నాను. మనిద్దరం విడిపోయామనే భ్రమ కల్పించాలి – అభిప్రాయభేదాలు వచ్చాయని. ఇలా చేస్తే పురుషోత్తముడిని ఒప్పించడం నాకు సులువవుతుంది. నేను నిజంగానే మగధ అధికార పీఠంపై తననే కూర్చోబెడతానని అనుకుంటాడు!'

'అప్పటివరకూ నేనేం చెయ్యాలి?' చంద్రగుప్తుడు ఇబ్బందిగా.

'తిరుగుబాటు ప్రేరేపించు!' చెప్పాడు చాణక్యుడు కూర్చున్న చోట పాదాన్ని నేల మీద కొట్టి, ఇసుక తుఫాను రేపాడు.

'తిరుగుబాటు ప్రేరేపించాలా? ఎక్కడ?' దురదృష్టవంతుడైన చంద్రగుప్తుడడిగాడు.

'మాసిడోనియా రాష్ట్రాలలో – అలెగ్జాండర్ సత్రపులు ప్రత్యక్షంగా పాలించేవి'.

'ఏవి?'

'అన్ని చోట్ల. నీకు తెలుసుగా ఉత్తర భారతంలో చాలా భాగం మగధ, కేకయ లేదా గాంధారాలలో ఉంది. కాని చిన్న రాష్ట్రాలు కొన్ని ఈ మూటిలో లేవు. అలెగ్జాండర్ సత్రపుడు ఫిలిప్పోస్, వాటినన్నిటినీ పాలిస్తున్నాడు. అలెగ్జాండర్ భారతదేశంలో తన వారసుడిగా నియమించిన సెల్యూకస్ అధీనంలో పనిచేస్తాడతను. ఒకవేళ ఫిలిప్పోస్ చనిపోతే ఆ రాష్ట్రాలన్నీ మన ప్రయత్నం లేకుండా మనకి దక్కుతాయి'.

'మీరు సూచించేది నేననుకునేదేనా ఆచార్యా?' చంద్రగుప్తుడు నిరుత్సాహంగా, జాగ్రత్తగా అడిగాడు. గురువుగారితో కూర్చుని వ్యూహరచనలు చేస్తూ ఉన్నపుడు అతనికి సత్తువ లాగేసినట్టు అవుతుంది.

'కాదు. కాదు. నాయనా చంద్రగుప్తా, మనం ఫిలిప్పోస్‌ని చంపం. అతనికి అత్యంత శత్రువులెవరో గుర్తించి, అతన్ని చంపడానికి వాళ్ళకి కారణం చూపిస్తాం అంతే!'

'మరి అతనికి అత్యంత శత్రువులెవరు?' అడిగాడు చంద్రగుప్తుడు, ప్రశ్న అడగడం అనవసరమైనా.

'అతనికి అత్యంత స్నేహితుడు, కావలసినవాడు'.

'అంభి?'

'కాదు'

'పురుషోత్తముడా?'

'కాదు'.

'అయితే ఎవరు?'

'శశిగుప్తుడు'.

'ఎవరు?'

'తూర్పు భారతంలో చాలా భాగం మగధలో ఉంది. పడమట కేకయ రాజ్యం ఉంది. కొంచెం అలాగే పడమటగా వెళితే గాంధార చేరుకుంటారు. కాని వాయవ్యంలో గాంధార అవతల ఎవరుంటారు? సింధు నదిని దాటి?' అడిగాడు చాణక్యుడు.

అశ్వకనులు – కాబూల్ నదీ ప్రాంతంలో ఉండే గిరిజన అశ్వకులు.

'సరిగ్గా చెప్పావ్. వాళ్ళు బలమైన పోరాటయోధులు. వాళ్ళ మౌలిక బలం ఆహారం, నీరు, విశ్రాంతి లేకుండా పోరాడగల వాళ్ళ అంతర్గత సామర్థ్యంపై కాకుండా, ఆ ప్రాంతంలో ఉత్తమ అశ్వాలను పెంచి, శిక్షణ నివ్వడంలో కూడా ఉంది. వాళ్ళ నాయకుడు శశిగుప్తుడు. దండాయన ఋషి ఆశ్రమానికి అలెగ్జాండర్ వచ్చిన రోజు గుర్తుందా? అతనితో శశిగుప్తుడున్నాడు – ఋషి మాటలు అతనికి తర్జుమా చేసి చెప్పాడు!'

'వెళ్ళి వాళ్ళ మద్దతును కూడగట్టమంటారా?' అమాయకంగా అడిగాడు చంద్రగుప్తుడు.

'లేదు, నా సాహసయోధుడా లేదు! అశ్వకనులు కిరాయి సైనికులు. ధర నచ్చితే వేలాది అశ్విక దళాన్ని రాజకీయ విశ్వాసాలతో ప్రమేయం లేకుండా ఏర్పాటు చేస్తారు.

వాళ్ళు పర్షియా వాళ్ళ తరఫున పోరాడారు. తర్వాత మాసిడోనియా వాళ్ళ తరఫున కూడా పోరాడారు. శాశ్వతంగా ఒక పక్షానికే వాళ్ళు విధేయులుగా ఉండరు. గుర్రాలకి శిక్షణ నివ్వడం, యుద్ధాలు చెయ్యడం వాళ్ళ వృత్తి. అంతే. అంతకన్న ఏం కాదు'.

'ప్రస్తుతం వాళ్ళెవరి పక్షాన పోరాడుతున్నారు?'

'మాసిడోనియా పక్షాన. అంతకు కొంతకాలం కిందటే వాళ్ళు పర్షియా వాళ్ళతో కలిసి పోరాడారు. మళ్ళీ పక్షాలు మార్చుకోవడానికి వాళ్ళెందుకు సందేహిస్తారు?' అడిగాడు చాణక్యుడు.

'కాని శశిగుప్తుడు ఏ కారణంతో తిరుగుబాటు చేస్తాడు? అలెగ్జాండరు పురుషోత్తముడిపై విజయం సాధించినపుడు అతనక్కడే ఉన్నాడు. యుద్ధమైపోయిన తర్వాత పురుషోత్తముడిని అలెగ్జాండర్ ముందుకు తేవడంలో అంభి విఫలమయ్యాడు, శశిగుప్తుడే తీసుకువచ్చాడు'.

'ఎవరి ఆదేశాలతో శశిగుప్తుడు అలెగ్జాండరు పక్షాన పోరాడాడు?' అడిగాడు చంద్రగుప్తుడు.

చంద్రగుప్తుడు అర్థం కాక అడిగాడు. చాణక్యుడు చిరునవ్వు నవ్వి మళ్ళీ చెప్పసాగాడు. 'అశ్వకనులు పోరాటయోధులు కాని వాళ్ళు స్త్రీల నుంచి ఆదేశాల తీసుకుంటారు! వాళ్ళ అధికారి ఎప్పుడూ రాణియే. ప్రస్తుతమున్న రాణి కలాపిని అనే సౌందర్యవతి. ఆమెకేమైనా ప్రమాదంగాని, ఆపదగాని వస్తే వేలాదిమంది తృటిలో ప్రాణాలర్పించేస్తారు!'

'వాళ్ళ రాణిని ఎత్తుకుని రమ్మంటారా నన్ను?' చంద్రగుప్తుడడిగాడు, అలాగే నంటాడనుకొని. తనను మగధ సింహాసనం మీద కూర్చోబెట్టడానికి తన కపటి ఆచార్యుడు ఏమైనా చేయగలడని అతనికి తెలుసు.

'అంతకన్న చాలా చెయ్యాలి! మాసిడోనియా సత్రపుడు పిలిప్పోస్‌తో ఆమె ప్రేమలో పడేలా చెయ్యాలి. ఒక మాసిడోనియా వ్యక్తితో తమ రాణి పడుకుంటుందనే ఆలోచన కన్న ఎక్కువగా మరేదీ అశ్వకనుల రక్తం మరిగేలా చేయదు!'

'అది నేనెలా ఏర్పాటు చెయ్యాలి? వాళ్ళిద్దరినీ ఎత్తుకొచ్చి ఒక శిబిరంలో బందీలుగా పడేయాలా?' అలసిపోయిన చంద్రగుప్తుడడిగాడు.

'ఒక్క మాటలో నీకు సమాధానం కావాలా?'

'అలా చెబితే ధన్యుణ్ణి'.

'కార్నీలియా'.

కార్నీలియా, చంద్రగుప్తుడు శింశుపావృక్షం కింద మెత్తని నూలుబట్ట పరుచుకుని పడుకుని ఉన్నారు. ఆ చుట్టూ అశోకం, భవ్య, చంపక, నగరచెట్లు విరగకాచి ఉన్నాయి. నేల మీద సుగంధాలు వెదజల్లే పుష్పాలు రాలిపడి ఉన్నాయి. చంద్రగుప్తుడు, కార్నీలియా పక్కపక్కన పడుకొని ఉన్నారు. కార్నీలియా అంగరక్షకులు ఆమె ఎక్కడికి వెళ్ళినా వెంట ఉంటారు. వాళ్ళకి చంద్రగుప్తుడి మనుషులు చల్లటి పాలలో తేనె కలిపి ఇచ్చారు. దానిలో కొంచెం భంగుకూడా కలిపారు. కొన్ని నిముషాల్లోనే మర్రిచెట్టు కింద పడుకొని ప్రశాంతంగా గుర్రుపెట్టి నిద్రపోయారు.

'నేను నిన్నెంతగానో ఆరాధిస్తున్నాను', ఆమె చెవిలో చెప్పాడు చంద్రగుప్తుడు అన్యమనస్కంగా తన వేళ్ళతో ఆమె బంగారు రంగు వెంట్రుకలను సవరిస్తూ.

అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది ఆమె. 'అబద్ధాల కోరు! నేనంటే నీకెందు కిష్టమంటే, నీ చిలిపి ఆటలు ఆడుకోవచ్చని నాతో', మందలించింది ఆమె.

చంద్రగుప్తుడు క్షణకాలం దాని గురించి ఆలోచించాడు, కుటిలంగా చిరునవ్వుతో అన్నాడు, 'అది కూడా!' ఆమె ఆటగా అతని చెంపమీద కొట్టింది ఉత్తుత్తి శిక్ష వేస్తున్నట్టు.

'ప్రియా, నేను ఒక్క క్షణం కూడా నిన్ను విడిచి ఉండలేను', అంది ఆమె అతనికి మరింత దగ్గరగా జరుగుతూ, 'మా నాన్నకు మన సంగతి తెలిసి నన్ను బాబిలోనియాకు రమ్మంటాడేమోనని భయంగా ఉంది. నువ్వు లేకుండా నేనెలా ఉండగలను?'

'సెల్యూకస్ దూరంగా ఉన్నాడు ప్రియా. భారతదేశంలో ప్రియమైన కూతురి ప్రేమ జీవితం గురించి అతనికి తెలియదు', సర్దిచెబుతున్నట్టుగా చెప్పాడు చంద్రగుప్తుడు.

'చంద్రగుప్తా - నిన్ను నేను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. నీకన్న ఎక్కువగా నేనే పురుషుణ్ణీ ప్రేమించలేదు. ప్రతిసారి ఒకరినొకరు కలవడానికి ఇంతరహస్యంగా ఎందుకుండాలి?'

'నిన్ను నాకిచ్చి పెళ్ళి చేయడం తప్ప మీ నాన్నకు వేరే మార్గం లేదు. అది నాకు ఖచ్చితంగా తెలుసు. కాని అలా జరగాలంటే, నేను మగధకు రాజుని కావాలి. నువ్వు ఒక రాజకీయ ఒప్పందంలో భాగం కావాలి – నా ప్రియమైన కార్నీలియాకు నేనివ్వాలనుకునే బహుమతి!'

'అదెలా జరుగుతుంది? నీ సహాధ్యాయి సింహరణ్‌ని చిన్న రాజ్యంలో గద్దె నెక్కించడం తప్ప నువ్వు, మీ ఆచార్యుడు వాస్తవానికి ఏం సాధించారు? నువ్వు చక్రవర్తివి కావడానికి చాలాకాలం పడుతుంది. అప్పటికి ఇంక నీకు సామర్థ్యం ఉండదు!' ఆమె ఆట పట్టించింది.

'ప్రియతమా, మనం ఇక్కడే, ఇప్పుడే పెళ్ళిచేసుకుందాం!' చంద్రగుప్తుడు హఠాత్తుగా గంభీరంగా అన్నాడు కార్నీలియాని ఆశ్చర్యచకితురాలిని చేస్తూ.

'ఎలా? అగ్ని లేదు? పురోహితుడు లేడు? అతిథులు లేరు?' ఆలోచిస్తూ అడిగింది కార్నీలియా.

'ప్రాచీన హిందూ ధర్మశాస్త్రాలలో ఎనిమిది రకాల వివాహాలున్నాయి. వాటిలో ఒకటి, చట్టసమ్మతమైనది. గాంధర్వ వివాహం. స్త్రీ పురుషుల మధ్య మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా జరిగే రహస్య వేడుక అది. దండలు మార్చుకుని, ప్రమాణం చేసి, ముద్దు పెట్టుకుంటే పెళ్ళి అయినట్టే'.

'కాని నేను వచ్చి నీతో ఉండలేనుగా, చంద్రగుప్తా. మా నాన్న మనిద్దరినీ నరికేస్తాడు. ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా నేను చేస్తున్నానని తెలిస్తే ఆయనకు చాలా కోపం వస్తుంది', వాదించింది కార్నీలియా.

'ఒప్పుకుంటాను. మన పెళ్ళి సంగతి రహస్యంగా ఉండాలి. అధికారికంగా మన పెళ్ళి జరిగేవరకు నువ్వు ఒంటరిగానే ఉండాలి. కనీసం మనిద్దరికీ పెళ్ళయిందని మనం ప్రశాంతంగా ఉంటాం', చెప్పాడు చంద్రగుప్తుడు కళ్ళు మెరుస్తుండగా. అతను త్వరగా తన పట్టు ఉత్తరీయాన్ని తీసి రెండు చిన్న ముక్కలు చింపాడు. కింద రాలిన పూలు ఏరి ఒక ముక్కతో మాల కట్టసాగాడు. రెండో ముక్కతో కార్నీలియా దండకట్టడం ఆరంభించింది. కొన్ని నిముషాల తర్వాత ఇద్దరూ వచ్చీ రాకుండా ప్రేమ పూరిత పూలదండలు కట్టేశారు. ఒకరి మెడలో ఒకరు వేయాలని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

ఇద్దరూ లేచి ఎదురెదురుగా నిలబడ్డారు. చంద్రగుప్తుడు కార్నీలియా మెడలో సున్నితంగా దండవేశాడు, ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని, 'నా ప్రియాతిప్రియమైన ప్రేయసీ, జీవితాంతం నిన్ను ఆరాధిస్తానని వాగ్దానం చేస్తున్నాను. నా ప్రాణంతో సమానంగా నిన్ను రక్షిస్తాను, నిన్ను గౌరవిస్తూ, మనసులో ఉంచుకుంటాను. ఈ రోజు నుంచి దైవం దృష్టిలో నువ్వు నా భార్యవి', అన్నాడు. ఆ క్షణంలో కంటనీరు తిరుగుతుండగా, కార్నీలియా తన చేతిలోని దండను చంద్రగుప్తుడికి వేసింది. చెవిలో చెప్పింది 'నా భర్తా, నా జీవితమా, నా ప్రేమ! నిన్ను పెళ్ళి చేసుకొనడం కంటె మించిన ఆనందం ఏదీ లేదు నాకు. ఎల్లప్పుడు నీకు విశ్వాసపాత్రంగా ఉంటానని, గౌరవిస్తానని, నీ మాట వింటానని వాగ్దానం చేస్తున్నాను. నువ్వే, ఎల్లప్పుడు నా ఒకే ఒక్క నిజమైన ప్రేమికుడివి!'

చంద్రగుప్తుడామెని దగ్గరకు లాక్కుని, చేతుల్లోకి తీసుకొని అత్యంత మోహంతో ముద్దుపెట్టాడు. ఆచార్యుడి మాటలు మన్నిస్తే ఇంత ఆనందం లభిస్తుందని అతనికి తెలియదు. ఆచార్యుడి ఆదేశాలు ఎక్కడ ముగిశాయో, కార్నీలియాపై తనకు ప్రేమ ఎప్పుడు చిగురించిందోనని ఆలోచించాడు.

భార్యాభర్తలుగా శింశుపావృక్షం కింద కౌగలించుకుని ఉండగా, కార్నీలియా అడిగింది, 'ఇప్పుడు మనం రహస్యంగా వివాహం చేసుకున్నాం కదా, దీనిని ఆధికారికం చేయాలంటే ఇప్పుడేం చెయ్యాలి?'

'చంద్రగుప్తుడికి, సెల్యూకస్‌కి మధ్య రాజకీయ ఒప్పందం కుదరాలి', సమాధాన మిచ్చాడు ఆమె భర్త.

'మా నాన్న నీతో అలాంటి ఒప్పందం ఎందుకు చేసుకుంటాడు?

'భారతదేశంలో రాష్ట్రాలపై తన ఆధిపత్యం పోతుందని అనిపిస్తే. ఆధిపత్యం ఉన్న రాజుకు శత్రువుగా కంటె మిత్రుడిగా ఉండడం నయమని'.

'భారతదేశంలో తన అధీనంలోని ప్రాంతాలపై మా నాన్న నియంత్రణ ఎలా పోతుంది?'

'అంభి భయం వలన, పురుషోత్తముడి దురాశవలన, శశిగుప్తుడి కోపం వలన'.

'అంభికి భయమా?'

'శశిగుప్తుడికి, పురుషోత్తముడికి మధ్య అంభి నలిగిపోతున్నాడు. మరో యుద్ధం వస్తుందని భయపడుతున్నాడు'.

'పురుషోత్తముడి దురాశ ఏమిటి?'

'తృప్తి చెందని అహంకారం. దానికి తృప్తి కావాలి. మగధ సింహాసనాన్ని ఆక్రమించాలనే దురాశ అతని పతనం'.

'శశిగుప్తుడి కోపం?'

'మోసగింపబడ్డానని తెలిసి'

'ఎవరు మోసం చేశారు?'

'మీ నాన్న నియమించిన మాసిడోనియా రాజ్య ప్రతినిధి ఫిలిప్పోస్'

'కాని ఫిలిప్పోస్ అతనిని మోసం చేయలేదు కదా'.

'చేస్తాడు'.

'ఎందుకు?'

'అశ్వకనుల రాణి కలాపినితో ఫిలిప్పోస్ ప్రేమలో పడితే, శశిగుప్తుడి అధీనంలో పనిచేసే అశ్వకనులు తిరుగుబాటు చేస్తారు. వాళ్ళు దీన్ని అత్యంత మోసంగా భావిస్తారు'.

'ప్రియతమా చంద్రగుప్తా, ఎవరో వాళ్ళని ప్రేమలో ఎలా పడేయగలరు? ప్రేమ పుడుతుంది అంతే. బలవంతం చేయలేం!'

'వాళ్ళు ఒకరినొకరు కలుసుకొనేలా చేసి మొదలుపెట్టవచ్చు'.

'ఫిలిప్పోస్‌కి చంచలమైన కళ్ళున్నాయని అంటారు. వాళ్ళు కలుసుకొనేలా చేస్తే తర్వాత సంగతి విధి చూసుకుంటుంది'.

'ఈ దుష్టపథకంలో నన్ను జోక్యం చేసుకోమంటున్నావా?'

'ఆహా! నువ్వు సరిగ్గా చెప్పావు. నేను నిన్ను ఉపయోగించుకుంటున్నాను. వాళ్ళిద్దరూ కలుసుకొనేలా నువ్వు చెయ్యాలి కార్నీలియా. సమాజంలో అందరూ నీకు తెలుసు. నీ స్నేహితురాలిగా కలాపినిని వెంట బెట్టుకుని ఫిలిప్పోస్ దగ్గరికి వెళ్ళు. ఆమె చాలా అందంగా ఉంటుందట', చెప్పాడు చంద్రగుప్తుడు.

'మనిద్దరం ఒకరికొకరం విశ్వాసపాత్రంగా ఉంటామని వాగ్దానాలు చేసుకున్నా మనుకున్నానే', ఆమె చమత్కరించింది, తన భర్త మరో స్త్రీ అందంగా ఉంటుందని చెబితే కొద్దిగా లోలోన ఆందోళన చెందుతూ.

'అందుకనే ఆమె ప్రదానాన్ని నువ్వు ఏర్పాటు చేయడం మంచిది. అప్పుడామె నాకు దొరకదు', కొంటెగా అన్నాడు చంద్రగుప్తుడు.

'ఫో వెంటనే! నీకు గురువుగా నా జీవితాన్ని వ్యర్థం చేసుకుని ఉండాల్సింది కాదు – కృతజ్ఞతనేది లేని దౌర్భాగ్యుడివి నువ్వు!' అరిచాడు చాణక్యుడు, చంద్రగుప్తుణ్ణి చూసి చిరునవ్వు నవ్వుతూ.

'నన్ను బాగా తీర్చిదిద్దారు గురువర్యా, వాస్తవానికి నా శిక్షణ అంతటినీ మీ పతనం కోసమే ఆ ఒక్క ప్రయోజనం కోసమే ఉపయోగిస్తాను', తిరిగి అరిచాడు చంద్రగుప్తుడు, కష్టమ్మీద నవ్వునాపుకుంటూ.

'నాతో ఇలా మాట్లాడడానికి నీకెంత ధైర్యం? నేను నీ గురువుని. కోపం తెచ్చుకునే హక్కుంది నాకు. సింహరణ్ నీ సోదరుడిలాంటివాడు. మాళవ రాజ్యంపై అతడి హక్కుని ప్రశ్నించేంత అహంకారమా నీకు?' చాణక్యుడు అంతకన్న కోపంగా అంటూ, ముందున్న కాగితంలో రాసింది చూసి చెప్పు అన్నట్టుగా చంద్రగుప్తుడి సైగ చేస్తూ.

'నన్ను రాజుని చేస్తానని నాకు వాగ్దానం చేశారు. మానేసింది కాకుండా పురుషోత్తముడికి, సింహరణ్‌కి మధ్య ఒప్పందం కోసం తాపత్రయ పడుతున్నారు. సిగ్గుపడాలి ఆచార్యా మీరు! ఇంత దిగజారిపోతారని నేనస్సలు అనుకోలేదు. మీరు దిగజారడానికి అంతూ దరీ లేదా? సొంత శిష్యుణ్ణి మోసం చేసి గర్విష్ఠి పురుషోత్తముడికి గద్దె నిస్తానంటారా? ఛీఛీ. శాపాల పాలబడతారు!' గర్జించాడు చంద్రగుప్తుడు తన గురువు తయారుచేసిన సంభాషణని జాగ్రత్తగా చూసుకుంటూ.

'తక్షణమే ఇక్కణ్ణించి వెళ్ళు. ఇక్కడ నీకు స్థానం లేదు. మగధ చక్రవర్తిని కావాలనుకునే కలలు మర్చిపో. నువ్వు దానికి తగవు. బుద్ధిహీనుడివి, మర్యాదలేని వాడివి, కృతఘ్నుడివి. ఫో బయటికి!' అరిచాడు చాణక్యుడు, చంద్రగుప్తుణ్ణి బయటికి వెళ్ళమని సైగ చేస్తూ.

అందరూ చూస్తుండగా చంద్రగుప్తుడు గురువుగారి గదిలోంచి విసురుగా బైటకి వెళ్ళిపోయాడు. తమ సైనిక నాయకుడు బయటికిపోవడం, వ్యూహకర్త ఒక పక్కన ఆగ్రహంతో ఉండడం చూసి ఆశావహమైన భాగస్వామ్యానికి ముగింపు అనుకున్నారు తమలో తాము.

కొన్ని నిముషాల్లోనే చాణక్యుడి శిబిరం నుంచి ఒక వ్యక్తి బయలుదేరి పురుషోత్తముడి ప్రధాన గూఢచారి అభయను కలుసుకోవడానికి వెళ్ళాడు. ఇది విస్మయం కలిగించే వార్త. ఇంత విశేష వార్త చెప్పినందుకు తనకి బాగా ముడుతుంది. చంద్రగుప్తుడు సైన్యాన్నంతటినీ తీసుకుని వెళ్ళడానికి ఆచార్యుడెలా అంగీకరించాడనేది అతనికి అర్థం కాని విషయం.

‘ఓ వైభవోన్నతుడవైన రాజా, చాణక్యుడు నీ సహాయం అర్థించడం కోసం వచ్చాడు’, అన్నాడు కపట బ్రాహ్మణుడు పురుషోత్తముడు చూపించిన ఆసనం మీద అతనికెదురుగా కూర్చుంటూ. ఇంద్రదత్ చాణక్యుడి పక్కన కూర్చున్నాడు.

‘ఆచార్యా, కత్తికన్న పదునైన మీ బుద్ధి చాతుర్యాన్ని గురించి విస్తృతమైన జ్ఞానాన్ని గురించి, ఫలితాలను ఊహించగల నిపుణమైన సామర్థ్యాన్ని గురించి, దేనికీ తలవొగ్గని దృఢ నిశ్చయం గురించి చాలా విన్నాను. కాని ఇప్పుడు మీరిక్కడికి వచ్చింది. మీకూ చంద్రగుప్తుడికి చెడిపోవడం వల్ల కాదా?’ అడిగాడు పురుషోత్తముడు తనకి అంత కీలక సమాచారం తెలిసిపోయిందన్న అహంకారంతో.

చాణక్యుడు ఎంతో నిస్సహాయంగా ఒంటరివాడైపోయినట్టు కనిపిస్తూ అన్నాడు, ‘శక్తిమంతుడవైన పురుషోత్తమా, నీ దగ్గర దాచాల్సింది లేదు, నీకు అన్నిచోట్లా వేగులున్నారు. చంద్రగుప్తుడితో నాకు అభిప్రాయ భేదం రావడం నిజమే. అయితే చంద్రగుప్తుడికీ నాకూ పడక నేనిక్కడికి రాలేదు, నిన్ను కలవాలనుకున్నాను కాబట్టి అతనితో విరోధం తెచ్చుకున్నాను’.

పురుషోత్తముడు అర్థం చేసుకున్నట్లుగా తలూపాడు. చాణక్యుడు నిజమే చెప్పినట్లుగా అతనికనిపించింది. మగధ సింహాసనాన్ని చంద్రగుప్తుడికి ఇవ్వనని తనకు – విఖ్యాతుడైన పురుషోత్తముడికి – ఇస్తానని చెప్పడంతో అతనికి, అతని ప్రియశిష్యుడు చంద్రగుప్తుడికీ మధ్య వివాదం తలెత్తిందని అభయ చెప్పాడు.

'మిమ్మల్ని నేనెందుకు నమ్మాలి ఆచార్యా? మీరు కుతంత్రాల వల్లే నా మిత్రుణ్ణి, మాళవ రాజ్యం రాజుని సింహాసన భ్రష్టుణ్ణి చేసి, సింహరణ్ రాజ్యం చేజిక్కించుకున్నాడు', ఎత్తి పొడిచాడు పురుషోత్తముడు సమాచారం రాబట్టాలనే ఉద్దేశ్యంతో.

'ఎదురులేనిరాజా అవును. సింహరణ్‌కి రావలసినది అతనికి తిరిగి ఇప్పించాను. నా స్థానంలో మీరున్నా అలాగే చేసేవారు. అయినా మీ ప్రశ్నకు సమాధానం – మీరు నన్నెందుకు నమ్మాలంటే, బయట నిరీక్షిస్తున్న సందర్శకుడిని లోపలికి పిలిపించండి' అన్నాడు చాణక్యుడు.

ఆచార్యుడి అతిథిని తీసుకుని రమ్మని సేవకుడిని ఆజ్ఞాపించాడు ఇంద్రదత్. కొన్ని క్షణాల్లోనే సేవకుడు పట్టువస్త్రాలు, రాజలాంఛనాలు ధరించిన యువకుడిని లోపలికి తీసుకువచ్చాడు. అతను కొత్తగా మాళవ రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించిన సింహరణ్. అతను పురుషోత్తముడి ముందు మోకరిల్లి నమస్కరించి ఇలా అన్నాడు. 'ఓ మహత్తరుడవైన చక్రవర్తీ, మీతో నాకు వివాదం లేదు. మాళవ రాజ్యం ఎప్పటికీ మీకు మిత్రరాజ్యమే. నా విరోధం క్రూరమైన పద్ధతిలో సింహాసనాన్ని చేజిక్కించుకున్న మా బాబాయితో. ఆ సమస్య పరిష్కారమైంది. వీరుడవైన రాజా, నన్ను ఆశీర్వదించండి'

పురుషోత్తముడు నిష్పక్షపాతంగా, అంతగా పట్టించుకోనట్లు ఉండాలని ప్రయత్నించాడు, కాని తాను రాజుని ఉబ్బేయడంలో కృతకృత్యుడినయ్యానని చాణక్యుడు గ్రహించాడు. పురుషోత్తముడు గనుక నెమలి అయి ఉంటే, మొత్తం ఈకలన్నీ రాల్చేసేవాడు! స్వాతిశయం, అహంకారం ఉన్న రాజులను త్వరగా మభ్యపెట్టవచ్చు. ఇవేవీ లేని వారిని మభ్యపెట్టలేం. 'సింహరణ్ లే! వచ్చినా పక్కన కూర్చో' అన్నాడు పురుషోత్తముడు పూర్తిగా పరిస్థితుల ప్రభావానికి లోబడిపోయి.

'మీ మనసులో ఏముంది, ఆచార్యా?' సింహరణ్ కూర్చున్నాక పురుషోత్తముడడిగాడు.

'రెండు లక్షల కాల్బలం, ఎనభైవేల అశ్వికదళం, ఎనిమిదివేల రథబలం, ఆరువేల గజబలంతో మగధ ప్రపంచంలోనే అత్యంత బలమైన సైన్యంగల రాజ్యం. మహారాజు పురుషోత్తముడు, సింహరణ్‌తో కూడా కలిపి అతని మిత్రులు కూడా మగధను ఓడించలేరు. మహత్వపూర్ణులైన పర్వతేశ్వరులు మగధ సింహాసనాన్ని ఆక్రమించాలంటే, మీ శక్తి, నా కుయుక్తి అవసరం', అని చెబుతున్నాడు చాణక్యుడు.

'కుయుక్తులతో నాకు పనిలేదు' మధ్యలోనే పురుషోత్తముడన్నాడు నిక్కుగా.

'అలెగ్జాండర్ ముందు మీ శక్తి ఎంత పనికొచ్చింది?' గుర్తుచేశాడు చాణక్యుడు మెత్తగా. 'నా సలహా వినండి, పర్వతేశ్వరా మీరు తప్పక మగధ చక్రవర్తి అవుతారు'.

'మరి చంద్రగుప్తుడు?'

'గురువులపై గౌరవంలేని శిష్యులతో నాకు పని లేదు. అతనికి తెలిసిందంతా నేను నేర్పిందే. నాకు లభించిన కృతజ్ఞత ఇది? వాణ్ణి నరకానికి పోనీండి!'

'సరే ఆచార్యా, మీ లక్ష్యసాధనకు కృషి చేస్తాను. మనం మగధను చేజిక్కించుకుందాం లేదా ఆ ప్రయత్నంలో వీరస్వర్గం చేరదాం', పురుషోత్తముడు ఆడంబరంగా ప్రకటించాడు.

'అందరూ స్వర్గానికి వెళ్ళాలనుకుంటారు, కాని ఎవరూ చనిపోవాలని కోరుకోరు', అన్నాడు చాణక్యుడు మామూలుగా.

'వాణ్ణి నరకానికి పోనీ!' అని అరిచాడు శశిగుప్తుడు వార్తానిర్ధారణ అవగానే. స్వాత్‌లోయ మధ్యలో ఉన్న పీర్‌సార్‌లో తన కోటలోని వైభవోపేతమైన హాలులో కూర్చుని ఉన్నాడతను. కోటను జయించడానికి అలెగ్జాండరుకు సాయం చేశాడు తను. దానికి మాసిడోనియా లంజాకొడుకులు చూపించిన కృతజ్ఞత ఇదా? వాళ్ళ రాణి కలాపిని, భారతదేశంలో అలెగ్జాండర్ సత్రపుడైన ఫిలిప్పోస్‌తో ఉండిపోవడానికి నిర్ణయించుకుందని తెలిసింది. వాళ్ళ కామకలాపాలు అతనికి కొన్ని వారాల క్రితమే తెలిశాయి. కాని కలాపిని లైంగిక సంతృప్తికోసం జరిపే తాత్కాలిక వ్యవహారమనుకొన్నాడు. కాని కలాపిని పిలిప్పోస్‌తోనే ఉండిపోవాలనుకోవడం పూర్తిగా భిన్నమైన విషయం.

వెండి మేజా దగ్గర కూర్చున్న కొత్త స్నేహితుడు, సహచరుడు చంద్రగుప్తుడి వైపు చూశాడు. వాళ్లిద్దరూ తమ గ్లాసుల్లోంచి ఒక గుక్క మైరేయ తాగారు. ఆ పానీయం శశిగుప్తుడి మాటలను ప్రభావితం చేయసాగింది అతని మాటలు తడబడుతున్నాయి.

'నీ –నీ –నీకు తెలుసా, చ–చంద్రగుప్తా–నీ–నీది–నాది ఒకే పేరు? శ్‌స్–శశి అంటే – చ–చ–చంద్రుడు. అలా–అలాగే చంద్ర కూడా. మనం –సో–సోదరులం!' అన్నాడు శశిగుప్తుడు, గ్లాసుని గట్టిగా వెండి బల్లపై విసురుగా పెడుతూ. ఆ విసురుకి

గ్లాసులో మైరేయ బల్లపై ఒలికింది. కొన్ని గుటకలే వేసిన చంద్రగుప్తుడు మామూలుగానే ఉన్నాడు. తిరుగుబాటుని ప్రేరేపించడానికి ఇది మంచి అవకాశం.

పీర్‌సార్ పాతకోట వైభవంగా సంపన్నంగా ఉంటుంది కాని నిస్తేజంగా ఉంటుంది. అలెగ్జాండర్ పీర్‌సార్‌ని జయించాలనుకొన్నపుడు మంచి శీతాకాలం. చిన్నపిల్లవాడుగా మాసిడోనియాలో ఉన్నపుడు, తన తాత హెరాక్లిస్ పీర్‌సార్ వరకు జయించాడని, పీర్‌సార్ కోటని ఆక్రమించలేకపోయాడని విన్నాడు. హెరాక్లిస్ సాధించలేనిది తాను సాధించి చారిత్రక మహావీరుడుగా నిలవాలని అలెగ్జాండర్ నిర్ణయించుకున్నాడు. అంతేకాకుండా పీర్‌సార్‌ని స్వాధీనం చేసుకుంటే సరఫరా మార్గాలకు బెడద ఉండదు. అవి హిందూకుష్ నుంచి బాల్కన్ వరకూ ఉన్నాయి. పీర్‌సార్ కోట పంజాబులో అటాక్‌కు ఉత్తరంగా సింధునదికి ఎగువ మలుపులో ఇరుకైన పర్వతం మధ్య ఉంటుంది. పర్వతంపైన చదునైన ప్రదేశంలో పంటలు పండించడానికి అనువుగా సెలయేళ్ళున్నాయి. పీర్‌సార్‌కి ఆహారం దొరక్కుండా చేసి లొంగదీసుకోవడం అసాధ్యం. శశిగుప్తుడు లేకపోతే అలెగ్జాండర్ కోటని ఆక్రమించలేకపోయేవాడు. అతని సలహాపై పడమటి వైపు ప్రయాణించాడు అలెగ్జాండర్. అక్కడ కోటకి ఉత్తరముఖంగా - ఇక్కడ దాడి చేయడం అనువుగా ఉంటుందని శశిగుప్తుడు చెప్పాడతనికి, నిట్టనిలువుగా ఉన్న శిఖరాల మధ్య దారి చేసుకొని వెళ్ళమని తన మనుషులకు చెప్పాడు. మూడు రోజుల పాటు జరిగిన తీవ్రయుద్ధం తర్వాత, ఈ యుద్ధంలో కోటలోని వాళ్ళు అలెగ్జాండర్ సైనికులపై బండరాళ్ళ వర్షం కురిపించారు కూడా, ఎట్టకేలకు శశిగుప్తుడు, అలెగ్జాండర్ కోటలోకి చేరగలిగారు. మిగిలిన మాసిడోనియా సైన్యం శరణార్థులను చంపేసింది. ఎథెనా, నైకెలకు విజయద్వారాలు ఏర్పాటు చేసిన అలెగ్జాండర్, పురుషోత్తముడితో యుద్ధానికి ముందుకు నడిచాడు.

పీర్‌సార్ అతని విజయానికి కీలకం. ఎదురులేని వీరుడిగా ఇది అతనికి కీర్తిని తెచ్చింది. తరచుగా అతని గట్టిపట్టుదల, మృత్యువును జయించడం వంటివి అతనికంటె ముందుగా వచ్చి తెలిసి ప్రజలను ఆశ్చర్యంలో ముంచి భారతదేశంలో విజయాలను సాధ్యం చేశాయి.

శశిగుప్తుడు నత్తుతూ 'ఈ కో-కోటని-మిగిలిన-భారతదేశాన్ని మాసిడోనియా వాళ్ళకు పళ్ళెంలో పెట్టి ఇచ్చాను. బ-బ-బహుమతిగా - అశ్వకనుల రాణిని పక్కలో పడుకోబెట్టుకున్నారు?' అశ్వకనుల రాణి, సజీవ స్త్రీ దేవత. పోరాట యోధులైన గిరిజనులకు స్ఫూర్తి, మార్గదర్శకత్వం ఆమె నుంచే లభిస్తాయి. శశిగుప్తుడు వాళ్ళ సేనాని, కాని బలానికి మూలం కలాపిని.

*వివేకులు ఆలోచించి మాట్లాడతారు, చవటలు ఆలోచించినదంతా మాట్లాడేస్తారు.* చాణక్యుడు ఈ మాటలు తన చెవిలో చెబుతున్నట్టుగా అనిపించింది చంద్రగుప్తుడికి. చంద్రగుప్తుడు తన మాటలు జాగ్రత్తగా పేర్చుకుని. కొంచెంసేపటి తర్వాత మాట్లాడాడు. 'శశిగుప్తా, నీవు నా స్నేహితుడివి. నీకాసక్తి ఉంటే నా దగ్గరో ప్రణాళిక ఉంది'. ఉగ్రంగా, స్వతంత్రంగా, బలంగా, హుషారుగా ఉండే ఆఫ్గనులు కాబూల్ నదీ తీరంలోని, రాళ్ళ పర్వతాలపై నివసిస్తారు. వీరికి అక్కడ నివసించిన తమ పూర్వీకులు అశ్వకనుల నుంచి ఆ పేరు సంక్రమించింది. వాళ్ళు అశ్వాల పెంపకం, శిక్షణనివ్వడంలో నిపుణులైన ఇండో ఆర్యనులు. సంస్కృతంలో అశ్వం అంటే గుర్రం. యుద్ధంలో వారు చూపే శౌర్యం, గుర్రాలు నడపడంలో వారి నిపుణతకు పర్షియా, గ్రీసు, భారతదేశాలలో గిరాకీ ఉంది. శశిగుప్తుడు వారి నాయకుడు. ముందు అతను పర్షియా దరియస్ పక్షంలో పోరాడి తర్వాత అలెగ్జాండరు పక్షం చేరి భారతదేశంలో అతని దండయాత్ర తీరునే మార్చేశాడు.

శశిగుప్తుడు బలంగా అందంగా ఉంటాడు. పొడవుగా, కండరాలతో దృఢమైన పొట్ట, తెల్లటి శరీరఛాయ, ఆకుపచ్చని కళ్ళు అతనివి. పొడవైన రాగిరంగు జుట్టును పట్టుకుచ్చుతో కట్టి శంఖంలా తలపైన ముడివేశాడు. అతని గడ్డము, మీసాలు యోధుడని చెబుతాయి. కెంపులు పొదిగిన తలపాగా ముదురు నీలం రంగులో ఉండి జుట్టుముడిని కప్పేసింది. ఒంటి మీద వేలాడే ఊలు వస్త్రం కూడా అదే రంగులో ఉంది. మెడలో ముత్యాల దండలున్నాయి. నడుముచుట్టూ ఎర్రని మందపాటి బట్ట కట్టుకున్నాడు. దానికి వజ్రాల పిడి ఉన్న బాకు ఉంది. పురుషుల అందానికి ఉదాహరణలా ఉన్నాడతను.

ఈ పురుషత్వం అతనికి అశ్వమేధయాగం చేసిన అతని పూర్వీకుల నుంచి లభించింది. బలమైన గుర్రాన్ని పూజించి రాజు దాన్ని స్వేచ్ఛగా వదులుతాడు. అది వివిధ ప్రదేశాల్లో సంచరిస్తూ వెళుతుంది. రాజు సేనలు దాని వెన్నంటి వెళతాయి. ఆ గుర్రం ఏ చోటుకి వెళితే ఆ ప్రదేశానికి అధిపతులు రాజుకి లొంగవచ్చు, లేదా యుద్ధం చేయవచ్చు. ఓడిపోతే రాజు సార్వభౌమత్వాన్ని వారు అంగీకరించవలసి ఉంటుంది.

శశిగుప్తుణ్ణి, అతని సాహసయోధులను జయించాలని అలెగ్జాండరు మొదట భావించినపుడు, తనకి సమ ఉజ్జీ దొరికాడని భావించాడు. తన తల్లికి రాసిన లేఖలో 'నేను సింహాల్లా ధైర్యవంతులైన వారి దేశంలో ఉన్నాను. భూమి మీద ప్రతి అడుగు ఉక్కులా నా సైనికులతో పోరాడుతోంది. నువ్వు ఒక్క అలెగ్జాండరునే పుట్టించావు ఈ ప్రపంచంలో. కాని ఈ ప్రదేశంలో ప్రతి మనిషీ ఒక అలెగ్జాండరే' అని అలెగ్జాండర్

రాశాడు. శశిగుప్తుడితోను, లొంగని అతని సహచరులతోను యుద్ధం చేయడం కన్న స్నేహంతో వారిని దగ్గరకు చేర్చుకొనడం మంచిదని నిర్ణయించుకున్నాడు. అతని నిర్ణయం తప్పు కాలేదు. శశిగుప్తుడు పీర్‌సార్‌ను జయించడానికి తోడ్పడడమే కాక, వేలాదిమంది అశ్వికదళాలను మాసిడోనియా సైన్యంలో పనిచేయడానికి డబ్బు తీసుకొని అయినా పంపించాడు.

'ఫిలిప్పోస్ కింద నీ అశ్వికదళం చాలామంది ఉన్నారు. వాళ్ళని తిరుగుబాటు చేయమను. తమ దేవతను పాడుచేసిన యజమానికి సేవ చేయం అని తిరస్కరించమను', సూచించాడు చంద్రగుప్తుడు. ఆలోచన చాణక్యునిదే కాని, చంద్రగుప్తుడు తన ఆలోచనే అన్నట్లుగా సంతోషంగా అతనికి చెప్పాడు.

'కాని క్రమశిక్షణలో పెట్టటానికి ఫిలిప్పోస్ వారిని ఉరితీయించవచ్చుగా', అన్నాడు శశిగుప్తుడు.

'అలా అతను చేయాలనే మనం అనుకునేది', తన కొత్త స్నేహితుణ్ణి చూసి నవ్వుతూ వ్యాఖ్యానించాడు చంద్రగుప్తుడు.

ఈ సమయంలో ఫిలిప్పోస్ కోటలో సైనిక శిబిరం నిశ్శబ్దంగా ఉంది. దీర్ఘ చతురస్రాకారంలోని ఈ పెద్ద శిబిరం నాలుగు గేట్లు రాత్రివేళ మూసి ఉన్నాయి. శిబిరం చుట్టూ మూడు మీటర్ల వెడల్పున రెండు మీటర్ల లోతున గొయ్యి ఉంది. ఆ గోతి చుట్టూ కర్రలను బాగా సూదిగా చెక్కి వరుసగా గుంజలుగా పాతి ఉంచారు ఎత్తుగా.

కంచె చుట్టూ కాపలా వాళ్ళు అక్కడక్కడ నిలబడి ఉన్నారు. విధుల్లో ఉన్న సైనికులు కాపలా వాళ్ళు నిద్రపోతున్నారేమోనని తనిఖీ చేస్తూ తిరిగే ప్రధాన ద్వారం రెండు చిన్న గోడల మధ్య ఉంది. అది శిబిరం మధ్య రోడ్డులోకి వెళుతుంది. శిబిరాన్ని రెండుగా విడదీస్తూ పద్దెనిమిది మీటర్ల వెడల్పున ఉంది. దీనికి తొంభై డిగ్రీల కోణంలో మరో అనుబంధ రోడ్డు ఉంది. దాని వెడల్పు పదిహేను మీటర్లు వెడల్పు. ఈ రెండు దార్లకు మధ్యలో శిబిరం మధ్య పెద్ద గుడారం ఉంది– సేనా నాయకుడు ఫిలిప్పోస్‌ది. అతని గుడారానికి సమీపంలోనే అతని కింది అధికారుల గుడారాలున్నాయి. తరువాత బ్యారక్‌ల వరుసల్లో సైనికులు, ఎకరానికి రెండు వందల ఇరవై మంది ఉన్నారు.

ఫిలిప్పోస్ గుడారం ముందు ద్వారం దగ్గర రెండు పెద్ద కాగడాలు వెలుగుతున్నాయి. ఇద్దరు సాయుధులైన గ్రీకు సైనికులు భావరహితంగా గుడారం ముందు నిలబడి

ఉన్నారు. వాళ్ళ చేతిలో ఆరడుగుల పదునైన ఈటెలున్నాయి. వాళ్ళ ముఖాలలో గుడారం లోపల తాను కొత్తగా జయించిన అశ్వకనుల రాణి కలాపినిని అనుభవిస్తూ ఫిలిప్పోస్ చేస్తున్న శబ్దాలకు ఏ ప్రతిస్పందనా లేదు.

విధేయులైన మాసిడోనియా అంగరక్షకులు దూరంగా వినిపిస్తున్న గొడవను విన్నారు. ప్రతి కొద్ది నిముషాలకు ఆ గొడవ పెద్దదవడం వింటున్నారు. దూరంగా వినిపిస్తున్న గొడవ ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం వారికి ఉన్నా విధి నిర్వహణ చేయాల్సిన ప్రదేశం నుంచి కదలకుండా వారు పొందిన శిక్షణ వారిని నివారించింది. ప్రతి కొన్ని నిముషాలకోసారి వాళ్ళ దృష్టి గుడారంలోనుంచి వస్తున్న పారవశ్యపు మూలుగులపైన, గుడారానికి దూరంగా కనిపించకుండా వినిపిస్తున్న గొడవపైన – రెంటిమధ్యా మారుతోంది.

ఫిలిప్పోస్ గుడారం పడమటి ద్వారం దగ్గరున్న కావలివాళ్ళు, మెడ మీది వెంట్రుకలకు సెగ తగిలినప్పుడు యజమాని గుడారం కాలుతోందని గుర్తించారు. లోపలి నుంచి వినిపిస్తున్న కేకలకు ప్రతిస్పందించుతూ వారు వెనుతిరగ్గానే వారి వీపులో లెక్కలేనన్ని బాణాలు గుచ్చుకున్నాయి. భయపడిన ఫిలిప్పోస్ నగ్నంగా బైటకి పరిగెత్తుతూ వచ్చాడు, అతని వెంటే దిగంబరంగా కలాపిని పరిగెత్తుతూ వచ్చింది. అశ్వకనుల అశ్వికదళం మాసిడోనియా సత్రపుణ్ణి చుట్టుముట్టి, అతన్ని పట్టుకొని చేతులు వెనక్కి కట్టి, కళ్ళకు గంతలు కట్టారు. ఈ లోపు మరికొంతమంది కలాపిని మానం కాపాడేందుకు వస్త్రాలు కప్పి ఆమెను గుర్రం మీదున్న రౌతు చేతుల్లోకి విసిరారు. అతను వెంటనే గుర్రాన్ని శిబిర ద్వారం వైపు పరిగెత్తించాడు.

'దొంగలంజాకొడకా!' ఫిలిప్పోస్‌ని వాళ్ళు కోపంగా తిట్టారు. 'మా రాణిని పడుకోబెట్టుకొని, మా సహచరులని ఉరితీసి తప్పించుకుపోదామనుకున్నావా? ఇలా చేసినందుకు నీకు చావు తప్పదు'. చేతులకు కట్టిన తాళ్ళను విడిపించుకోవాలని ఫిలిప్పోస్ విశ్వప్రయత్నం చేశాడు కాని అవి అతని మణికట్టులను కోసేశాయి. కలాపినికి తనకు ఉన్నది పరస్పర ప్రేమ సంబంధమని వారికి చెప్పాలని ప్రయత్నించాడు కాని కోపంగా ఉన్న అశ్వకను యోధులు అత్యాచారానికి, అవివాహితుల మధ్య సంభోగానికి ఉన్న సున్నితమైన తేడాలను గురించి వినడానికి సిద్ధంగా లేరు. శశిగుప్తుడి కిరాయి సైనికులు ఫిలిప్పోస్‌పై దాడి చేశారనే వార్త మాసిడోనియా సైన్యంలో కార్చిచ్చులా వ్యాపించింది. వాళ్ళు తమ నాయకుడిని రక్షించడానికి యత్నించారు కాని గిరిజన యోధులకు వాళ్లు సమఉజ్జీలు కారు. మాసిడోనియా సేనానాయకుడొకరు ఎలాగో ఫిలిప్పోస్ చుట్టూ ఉన్న

అశ్వకనుల వలయాన్ని ఛేదించుకుని వచ్చి, అతన్ని విడిపించాలని, అతని చుట్టూ చేతులు వేసి, అతని బంధనాలను తెంచడం మొదలుపెట్టాడు. ఫిలిప్పోస్‌ని విడిపించే లోగానే అతని గుండెల్లో ఈటె దిగబడింది. అతని నోట్లోంచి రక్తం వచ్చి సత్రపుడి ముఖం మీద పడింది.

శిబిరమంతా గుర్రాలు పరుగెడుతున్న చప్పుడు, అశ్వకనుల అశ్వికులు ప్రధాన ద్వారం నుంచి ఎండుగడ్డి బంతులకు నిప్పంటించి గుడారాల పైకి విసురుతున్నారు. చాలా గుడారాలకు అప్పటికే నిప్పంటుకోవడంతో మాసిడోనియా సైనికులు బయటకు పరుగులు తీశారు. అలా బైటికి వచ్చినవారిని బయట ఉన్నవారు నిర్దాక్షిణ్యంగా చంపేశారు. కొన్ని గజాలకవతల చిన్న కొండపైన కొందరాశ్వికులు మాసిడోనియా శిబిరంలో మంటలను, చనిపోతున్న మనుషుల కేకలను విన్నారు. బలంగా ఉన్న బూడిదరంగు కాంభోజ గుర్రం మీద ఉన్న శశిగుప్తుడు, తెల్లగా బలంగా అందంగా ఉన్న ఉచ్ఛైశ్రవం గుర్రం మీదున్న చంద్రగుప్తుడి వైపు చూశాడు. 'మనం సరైన పని చేశామని నాకు అనిపించడం లేదు చంద్రగుప్తా', అన్నాడు శశిగుప్తుడు ఆలోచనగా గడ్డం నిమురుకుంటూ. 'అశ్వకనులు ఇలా యుద్ధం చెయ్యరు. ఇది అప్రతిష్ఠ కలిగించే రక్తపాతం!'

'ప్రియమిత్రుడా, శశిగుప్తా, దరియస్ కోసం యుద్ధం చేసినపుడు ఈ గౌరవం సంగతి ఏమైంది? నిన్ను నువ్వు అలెగ్జాండర్‌కి అమ్ముకున్నప్పుడు ఈ గౌరవం ఏమైంది? నిజాన్ని అర్థం చేసుకో. అశ్వకనుల ధైర్యసాహసాలను గౌరవం కోసం కన్న సంపాదనకు ఎక్కువగా ఉపయోగించారు. ఇప్పుడు జరిగినది అత్యంత ప్రతిష్ఠాకరమైన పని. ఇంతకు ముందెన్నడూ జరగనిది – మీ రాణి గౌరవాన్ని కాపాడడం కోసం విదేశీ దండయాత్రికుడిపై కత్తి దూయడం', చెప్పాడు చంద్రగుప్తుడు చివరి నిముషంలో మనసు మార్చుకుంటే ఏం చెప్పాలో చాణక్యుడు ముందే చెప్పినది గుర్తుచేసుకుంటూ.

చంద్రగుప్తుడు తన నిపుణుడైన విలుకాడికి సైగ చేశాడు. అతను కొన్ని నిముషాలుగా తన లోహపు బాణం పట్టుకుని ఫిలిప్పోస్ కదలికలను గమనిస్తూ ఉన్నాడు. చంద్రగుప్తుడు తల ఊపగానే తన వెదురు విల్లుని సవరించి తన లక్ష్యానికి గురిపెట్టి బాణం వదిలాడు. అది చంద్రగుప్తుణ్ణి, అసంఖ్యాకమైన చెట్లని, శిబిరం పరిధిని, మాసిడోనియా సైనికులని, అశ్వకనుల అశ్విక దళాన్ని దాటి లక్ష్యం చేరుకుంది. పదునుగా ఉన్న కొన ఎవరికి గురిపెట్టబడిందో అతనికి గుచ్చుకుని రక్తం కారింది. అదింకా దాహంగా లోపలికి చొచ్చుకునిపోయి కొట్టుకుంటున్న గుండెనో, ఊపిరితిత్తులనో చేరుకుంది. బాణం

ఊపిరితిత్తులలో గుచ్చుకుని గాయం చేయడంతో రక్తంతో తడిసిపోయాడతను. గుండె ఇంకా కొట్టుకుంటూ ఉండగానే, అతని శ్వాస నాళాల్లోంచి రక్తంపైకి వచ్చి నోట్లోంచి, ముక్కులోంచి బైటికి వచ్చింది. అతని కళ్ళు మూసుకుపోయాయి, అతను వెనక్కి పడ్డాడు ప్రాణం పోతే బాగుండునని కోరుకుంటూ, అలాగే పోయింది. ఫిలిప్పోస్ చనిపోయాడు.

## పద్నాలుగో అధ్యాయం

# వర్తమానం

ఇక్రంభాయ్‌కి వార్తాపత్రిక చదివి వినిపిస్తున్నాడు మీనన్. ఆరు నెలల పాటు ఎడతెగకుండా ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన బేడి విశ్రాంతిగా కూర్చుని గంగాసాగర్ లివింగ్ రూంలో టీ తాగుతున్నాడు.

'లోక్‌సభలో వర్కింగ్ మెజారిటీ ఉన్న కూటమి ఛైర్మన్ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు భారత రాష్ట్రపతిని కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతారు. కూటమి భాగస్వాముల సమావేశంలో దీనిని ఏకగ్రీవంగా అంగీకరించారు. ఛైర్మన్ పేరును పాలకపక్షం ప్రతిపాదించింది, పాలకపక్ష కూటమిలో అతిపెద్ద భాగస్వామి **అభానస** అధ్యక్షుడు పండిట్ గంగాసాగర్ మిశ్ర బలపరిచారు.

'హా! అతి పెద్ద, అతి పెద్ద వాటిలో ఒకటి కాదు!' ఆశ్చర్యంగా అన్నాడు ఇక్రం, మేజర్ బేడి చిరునవ్వు నవ్వుతుండగా, ఏ ఫార్ములా లేకుండా ఉండటాన్ని ఫార్ములాగా పెట్టుకొనాలని అతను చెప్పిన విషయం పనిచేసింది. అతను మీనన్ దగ్గర్నుంచి పేపర్ చదవడం కొనసాగించాడు. 'ఉత్తరప్రదేశ్ నుంచి అరవై అయిదు ఎంపీసీట్లు గెలిచిన **అభానస** సంకీర్ణ కూటమిలో పాలకపక్షం తరువాత అతి పెద్ద పార్టీ. పాలకపక్షానికి రెండు వందల సీట్లు వచ్చాయి. సంకీర్ణ కూటమికి చిన్న పార్టీలు చాలా మద్దతు లేఖలు ఇచ్చాయి. ఇప్పుడు కూటమికి లోక్‌సభలో కావలసిన ప్రాథమిక మెజారిటీ రెండు వందల డెబ్బయిరెండు కన్న మించి, దాదాపు మూడొందల మంది ఎంపీల మద్దతు ఉంది. కూటమి అధ్యక్షుడు – మాజీ రక్షణ మంత్రి – ప్రధాని రీఎలక్షన్ వివరాలను పాలకపార్టీ పార్లమెంటరీ ప్రతినిధిగా రాష్ట్రపతికి అందజేస్తారు. తమ పార్టీకి ఇతర పార్టీలవారు ఇచ్చిన మద్దతు లేఖలను కూడ రాష్ట్రపతికి ఇస్తారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు

చేయమని కూటమిని రాష్ట్రపతి ఆహ్వానిస్తారని భావిస్తున్నారు. ప్రమాణస్వీకారం శుక్రవారం నాడు రాష్ట్రపతి భవన్‌లో జరుగుతుంది.

'ఈ ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీలు మూడొందల మంది ఉండడం మంచిదే' అన్నాడు ఇక్రం.'

'ఎందుకని? సగం కన్న దాటి మరో ఇరవై ఎనిమిది మంది ఉంటారనా?' అడిగాడు మీనన్.

'కాదు. ఒకవేళ **అభానస** మద్దతు ఉపసంహరించుకోవాలంటే వాళ్ళకి ముప్ఫయి ఏడు సీట్లు తగ్గుతాయని!' చెప్పాడు ఇక్రం, తృప్తిగా పాన్ నములుతూ, బేడీ భుజాలెగరేశాడు.

అతను మొదటి వరుసలో – సోమానీ గెలిపించిన ప్రధానమంత్రి పక్కన రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్నది చూస్తూ. రాష్ట్రపతి చాందినితో ప్రమాణస్వీకారం చేయిస్తున్నాడు. ఆమె అంటోంది. 'చాందినిగుప్త అనే నేను దైవసాక్షిగా ప్రమాణం చేసి – భారతదేశ రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసాన్ని, భక్తిని కలిగి ఉంటానని, చట్టప్రకారం భారత సార్వభౌమాధికారాన్ని సమైక్యతను కాపాడతానని, కేబినెట్ మంత్రిగా నా విధులను విశ్వాసంతో, చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, రాజ్యాంగం ప్రకారం, చట్టప్రకారం ప్రజలందరికీ నిష్పక్షపాతంగా, నిర్భయంగా దుశ్చింత లేకుండా న్యాయం చేస్తానని చెబుతున్నాను'.

ఆమె రాష్ట్రం నుంచి కేంద్ర రాజకీయాల్లోకి, వెళ్లడంతో ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఖాళీ ఏర్పడింది. అగర్వాల్ గారడిగారు', మనమెవరిని ముఖ్యమంత్రిని చేద్దాం? ఇక్రం ఆ పదవిని తనకి ఇస్తారని ఇంకా ఆశపడుతున్నాడు'

గంగాసాగర్ సమాధానం చెప్పాడు, '**అభానస**కు హోం పోర్ట్‌ఫోలియో కోసం ప్రయత్నిస్తున్నానని ఇక్రంకు తెలుసు – అది కూడా తన కోసం. కొంతకాలం మాట్లాడకుండా ఉండమని చెప్పాను. ఉత్తరప్రదేశ్‌లో **అభానస** నుంచి మరెవరు ముఖ్యమంత్రి అయినా ఒప్పుకుంటాడు'.

'మరి రాష్ట్ర ప్రభుత్వంలో మిగిలిన సమయానికి ముఖ్యమంత్రిగా ఎవరిని నియమిద్దాం?' అగర్వాల్‌గారు అడిగారు.

'రామశంకర్ ద్వివేది', గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

'అంత మూర్ఖంగానా! ఆ దుష్టవెధవ చాందిని మీద తిరుగుబాటును తేవాలను కున్నాడు. అతన్ని నమ్మలేం!'

'అగర్వాల్‌గారూ, నేనతన్ని పూర్తిగా నమ్ముతాను. మీలాగ కాదు'.

'ఎందుకు?'

'అతనికివ్వాల్సిన ఫోటోలు నా దగ్గర ఇంకా ఇరవైకిపైగా ఉన్నాయి', నవ్వాడు గంగాసాగర్.

'గంగాసాగర్‌గారూ, ఏమాలోచిస్తున్నారు?' మాజీ రక్షణమంత్రి, ఇప్పటి ప్రధాని గుసగుసగా అడిగాడు. తనెక్కడో ఆలోచిస్తున్నానని గంగాసాగర్‌కి అర్థమైంది. 'రంగ్తా ఎక్కడ దాక్కున్నాడా అని ఆలోచిస్తున్నాను. ప్రేక్షకుల్లో మన స్నేహితుడు సోమానీ ఉన్నాడు. ఈ వేడుకకి రంగ్తాని మీరు ఆహ్వానించలేదా?' ప్రధానిని అడిగాడు.

'పిలిచాను. తీరికలేదేమో'.

'దేనితో?'

'మరోమంత్రి ఎవరినైనా తాళ్ళనిచ్చెనతో కిందికి పంపాలని వెదుకుతున్నాడేమో, సోమాని నాతోచేయించగలిగినప్పుడు రంగ్తా కూడా ఎవరితోనో ఒకరితో చేయించగలడు', ప్రధాని చిరునవ్వుతో, సియాచిన్లో తనని చాపర్ నిచ్చెనలో క్రిందికి దింపిన వృద్ధుడితో అన్నాడు. గంగాసాగర్ గట్టిగా నవ్వాడు. అందరూ తిరిగి చూశారు నవ్విందెవరో చూడడానికి. అతను పట్టించుకోలేదు. ఇంకొంతసేపు నవ్వాడు.

'ఆ చెత్త నాకొడుకు కీలకమైన ఆర్థిక, విదేశాంగ, రక్షణ; హోం ఫోర్ట్‌ఫోలియోలు వదలడానికి సిద్ధంగా లేడు. ప్రధాని పదవితోపాటు ఈ నాలుగు పదవులు కూటమిలోని సీనియర్ పార్టనర్‌కే ఉంటాయని అతనంటున్నాడు' **అభానస** మద్దతు లేకపోతే తను ప్రభుత్వంలో ఉండేవాడినే కాదని వాడికి తెలియదా? సోమాని మనిషిని ప్రధానిగా చేసినందుకు శాస్తి బాగానే జరిగింది', కుర్చీలోంచి లేచి పచార్లు చేస్తూ ఫిర్యాదు చేస్తున్నట్లుగా అన్నాడు గంగాసాగర్.

'మీకేం కావాలి?' ఇక్రం అడిగాడు.

'చాందిని విదేశాంగ వ్యవహారాల మంత్రి కావాలి. ప్రపంచం ఎక్కువగా తెలిస్తే, జాతీయ, అంతర్జాతీయ స్థాయులలో ఉన్నతి ఉంటుంది ఆమెకి', చెప్పాడు గంగాసాగర్.

'అది సాధించడానికి ఒకే ఒక మార్గం ఉంది. విదేశాంగ శాఖలో సంక్షోభం సృష్టించండి. ఆ మంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితి తప్పనిసరయ్యే సంక్షోభం', ఇక్రం సూచించాడు.

'అది సాధ్యం కాదు. విదేశాంగమంత్రి ఢక్కాముక్కీలు తిన్న అనుభవజ్ఞుడు – జాగ్రత్తగా ఉంటాడు దగ్గడానికి కూడా చుట్టూ చూసి ఎవరూ లేరనుకున్నాకే దగ్గుతాడు ఎవరూ వినకుండా. అంతేకాకుండా నిజాయితీగలవాడు. నిజాయితీ అత్యంత భయంకరమైన గుణం – వాళ్ళని మోసం చేయడం కష్టం'– అలసిపోయినట్టుగా అన్నాడు గంగాసాగర్. మళ్ళీ కూర్చొని కుర్చీచేతుల మీద వేళ్ళతో మృదంగం వాయించడం మొదలుపెట్టాడు.

'మరో మార్గముంది', అన్నాడు క్షణం తరవాత' కొన్నిసార్లు గోల్ చేయడానికి బంతిని గోల్‌పోస్ట్ నుంచి కొంచెం దూరంగా కొట్టాలి. ఒకవేళ ఆర్థికమంత్రి గనక హఠాత్తుగా రాజీనామా చేయాల్సి వస్తే, ఇప్పుడున్న విదేశాంగమంత్రి మాత్రమే దానిని చేపట్టగలిగే వ్యక్తి'.

'ఆర్థికమంత్రి అలా ఎందుకు చేస్తాడు?' అడిగాడు ఇక్రం.

'నీకు తెలుసా! విదేశాంగమంత్రిలా అతనేమీ నిజాయితీపరుడుగాడు. మన మిత్రుడు సోమాని మాజీ రక్షణమంత్రికి మద్దతిస్తే, రంగ్తా ఆర్థికమంత్రికి మద్దతిచ్చాడు. మన ప్రస్తుత ప్రధానికి ఆర్థికమంత్రి అంటే గిట్టదు. కేబినెట్ నుంచి అతన్ని తీసేయడానికి బాగా సంతోషిస్తాడు. అతనికా అవకాశం ఇస్తే చాలు మనం. ఇక్రం నీ మనుషుల్లో సమర్థులైన వాళ్ళకి ఈ పని అప్పగించు – రహస్యంగా. ఆర్థికమంత్రితో గొడవ ప్రమాదం. వాడికి తెలిసిందంటే మనల్ని మొసళ్ళకి ఆహారంగా పడేస్తాడు!'

మిగిలిన మంత్రి పదవుల కేటాయింపు కూడా పోటాపోటీగా జరిగింది. **అభానస**కు పది మంత్రి పదవులడిగాడు గంగాసాగర్. చాందిని కోసం విదేశాంగ శాఖను అడిగాడు. ఆమెకి పదవి కేటాయించేవరకూ ఏ శాఖ లేకుండా మంత్రిగా ఉండేందుకు అంగీకరించాడు. వాణిజ్యం, టెలికాం, పెట్రోలియం, వ్యవసాయ శాఖల్లో కేబినెట్

హోదాలు అడిగాడు. మిగిలిన అయిదుగురు **అభానస** ఎంపీలకు రాష్ట్రమంత్రి హోదాలు ఇచ్చినా అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు.

మీనన్ అతనిని అడిగాడు. 'మంత్రులలో యాభై శాతానికి రాష్ట్ర హోదాలతో ఎందుకు సరిపెడుతున్నారు? పది కేబినెట్ హోదాలు ఇవ్వాల్సిందేనని అనండి'

'ప్రాముఖ్యమున్న హోదాలను అడగాలి. అయిదు అడిగి, మన వాళ్ళకి మరికొంత మందికి కేబినెట్లో కాకపోయినా, మరికొన్ని శక్తిమంతమైన పదవుల్ని ఇప్పించగలుగుతాను', అన్నాడు గంగాసాగర్.

'ఎటువంటివి?'

'ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టరు; రిజర్వు బ్యాంకు గవర్నరు; సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ఛైర్మన్, మన విద్యార్థి నాయకులలో చాలామంది ప్రభుత్వాధికారులుగా సీనియర్లుగా ఉన్నారు – అలహాబాదు యూనివర్సిటీ నుంచి బ్రిజ్‌మోహన్‌రాయ్, ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నుంచి ఇక్బాల్ అజ్మీ, బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి గిరీశ్ వాజ్‌పాయ్... కానీ మరీ ముఖ్యంగా, చాందిని విదేశాంగమంత్రి కావడానికి పరిస్థితులు అనుకూలించే విధంగా వ్యవహరించాలనుకుంటున్నాను'.

'వాణిజ్యం, టెలికాం, పెట్రోలియం, వ్యవసాయాలలో కేబినెట్ హోదాలని ఎందుకు అడుగుతున్నారు?'

ఎందుకంటే, మన మంత్రులు రాబోయే రెండు వారాల్లో ఆ శాఖల్లో జరిగిన ఒప్పందాల గురించి ఆరా తీసి, ఆర్థికమంత్రికి వ్యతిరేకంగా నాకు ఆయుధాలు సమకూరుస్తారు!'

వాణిజ్య శాఖ ప్రధాన కార్యాలయమైన ఉద్యోగ భవన్‌లో ఉన్నారు గంగాసాగర్, చాందిని. అభానస మనిషి కేబినెట్ మంత్రిగా ఉన్నాడా శాఖకి.

'ప్రత్యేక ఆర్థికమండళ్లకు భూమిని చాలా తక్కువ ధరకి ప్రయివేటు కంపెనీలకు ఇచ్చారు' వాణిజ్యమంత్రి చెప్పాడు.

'అయితే ఏంటి? గంగాసాగర్ అడిగాడు, 'అది ప్రభుత్వ విధానమే కదా, కాదా?

'పరిమాణాత్మకంగా అవును. గుణాత్మకంగా కాదు'.

'అర్థం కాలేదు' చాందిని అంది.

'సేకరించిన భూమి, ఇచ్చిన భూమి ప్రభుత్వ విధానం ప్రకారమే ఇచ్చారు పరిమాణం ప్రకారం'.

'కాని?' కుతూహలంగా అడిగాడు గంగాసాగర్.

'నీటి వనరులు లేని మెట్టభూముల అభివృద్ధి కోసం సెజ్ విధానాన్ని రూపొందించారు. రవాణా సంబంధాల ఏర్పాటు, విద్యుత్తు ప్లాంట్లు, నీటి సరఫరా వ్యవస్థలు, అదనపు పారిశ్రామిక అభివృద్ధితోపాటు వాణిజ్య సదుపాయాలు కూడా కల్పించి భూమి విలువను పెంచడం. అయితే దీనికి బదులుగా వాణిజ్యపరంగా అభివృద్ధి చెంది అన్ని సదుపాయాలున్న భూములని వాణిజ్య మంత్రిత్వశాఖ వాటి విలువను గుర్తించకుండా ఇచ్చేసింది. వేలాది ఎకరాలున్న భూమిని ఒకే కంపెనీకి ఇచ్చేశారు', చెప్పాడు వాణిజ్యమంత్రి.

టెలికాం శాఖ ప్రధాన కార్యాలయం సంచార భవన్లో గంగాసాగర్, చాందిని ఉన్నారు. 'టెలికాం లైసెన్సులని పదేళ్ళ కిందటి బెంచ్‌మార్కుల కన్నా తక్కువ రేటుకి ఏకపక్షంగా ఇచ్చేశారు', **అభానస** పాత కాపు టెలికాం మంత్రి చెప్పాడు.

'పెద్ద ఒప్పందం. విలువని చూడడంలో దృష్టి భేదాలుండవచ్చు', వాదించాడు గంగాసాగర్.

'కాని కొత్త స్పెక్ట్రమ్ కేటాయింపులు పొందిన కంపెనీ బయటి పెట్టుబడిదార్లకు పెద్దలాభాలకు అమ్మేసింది' టెలికాంమంత్రి చెప్పాడు.

'వాళ్ళు ఇంటెరిం బిజినెస్‌తో షేర్‌హోల్డర్ విలువని పెంచడం సాధ్యం కాదా?' చాందిని సూచించింది.

'ఇరవై నాలుగ్గంటల్లోనా?' అడిగాడు టెలికాం మంత్రి ప్రశ్నిస్తున్నట్లుగా.

పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ ప్రధాన కార్యాలయం శాస్త్రి భవన్‌లో గంగాసాగర్, చాందిని ఉన్నారు. 'ఆయిల్ అన్వేషణ హక్కులు ఒకే కంపెనీకి చట్ట ప్రకారం నిర్దేశించిన విలువకి ఇచ్చారు', చెప్పాడు. పెట్రోలియం మంత్రి, బిజ్నోర్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన **అభానస** అభ్యర్థి.

'అయితే తప్పేంటి?' అడిగాడు గంగాసాగర్?

'అన్వేషణ హక్కులు జులై 24న ఇచ్చారు'

'అయితే?'

'పబ్లిక్ సెక్టర్ ఆయిల్ కార్పొరేషన్ అంతకుముందే అక్కడ డ్రిల్లింగ్ చేసిందని, ఇంటర్నల్ మెమోలో కనిపించింది'.

'అయితే?'

'వాళ్ళు జులై 23న అక్కడ ఆయిల్ కనుక్కున్నారు'.

వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రధాన కార్యాలయం కృషిభవన్‌లో గంగాసాగర్, చాందిని ఉన్నారు. మంత్రి దౌలా హసన్ భట్టి, మీరట్లో మేజర్ బేడి సూచించిన ముస్లిం – జాట్. రెండు లక్షలకు పైగా మెజారిటీతో గెలిచాడు మీరట్‌లో.

'గత ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పశువుల మేత, ఎరువులను సేకరించారు', తన సెక్రటరీ వింటాడేమోని భయంతో, నెమ్మదిగా చెప్పాడు.

'అది ఊహించవచ్చు', చాందిని అంది. ఓట్లు పోగొట్టుకోకుండా ఉండాలంటే ప్రభుత్వం పశువుల మేతకు, ఎరువులకు రాయితీలు ఇచ్చి రైతులను సంతోషపెడుతుంది.

'కాని అమెరికా, యూరప్‌లలో పశువులకు కూడా రాయితీలు ఇస్తామా?' వ్యవసాయ మంత్రి అడిగాడు.

'నువ్వు చెప్పేదేమిటి?'

'ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ మొత్తం చూస్తే, ఇండియా, అమెరికా, పడమటి యూరప్‌లలో ఉన్న మొత్తం పశువులకు ఇచ్చేంత సబ్సిడీ! లేని రైతులకు, పశువులకు రాయితీ ఇచ్చారు!' చెప్పాడు వ్యవసాయ మంత్రి.

'ఈ ఒప్పందాల్లో ఏదైనా ఆర్థికమంత్రికి తెలియకుండా జరిగే అవకాశముందా?' చాందిని అడిగింది. ఇక్రం, అగర్వాల్‌గారు అడ్డంగా తల ఊపారు. అలా జరగడం అసాధ్యం. చాందిని, గంగాసాగర్ ఈ విషయాలను గురించి నిశ్శబ్దంగా మనసులో

ఆలోచిస్తున్నారు. కొంచెంసేపటి తర్వాత, 'ఈ సమాచారంతో ఏం చెయ్యాలనుకుంటున్నారు? ప్రెస్‌కి చెప్పి ప్రభుత్వాన్ని దించాలనుకుంటున్నారా?' చాందిని అడిగింది.

'అలా చేయనస్సలు. మనం ప్రభుత్వంలో ఉన్నపుడు దానిని దించేస్తే మనకేం లాభం? అదీ ఇంత తొందరగా. పబ్లిక్‌కి తెలియనపుడే సమాచారానికి విలువ. దాన్ని భద్రంగా ఉంచి బేరం జరుపుతాను', వ్యవహారదక్షుడైన పండిట్ చెప్పాడు.

'అంటే నాలుగు కుంభకోణాల నుంచి గురించి ప్రధానితో మాట్లాడి ఆర్థిక మంత్రి రాజీనామా కోసం అడుగుతారా?' చాందిని అడిగింది'.

'లేదు, నాలుగు కుంభకోణాల వల్ల ఆర్థికమంత్రి రాజీనామా కోరను', గంగాసాగర్ అన్నాడు.

'ఎందుకడగరు?' ఉపయోగించుకోనప్పుడు పదిహేను రోజులు కష్టపడి ఈ కుంభకోణాలు బయటికి తీయడం దేనికి?, అనుకుంది చాందిని.

'నాలుగు కుంభకోణాలు ఉపయోగించను. ఒకదాన్ని ఉపయోగించి ఆర్థికమంత్రి రాజీనామా అడుగుతాను! మిగిలిన సమాచారం అవసరమనుకున్నపుడు ఉపయోగిస్తాను. ఒక బాణంతో పనైతే, మిగిలినవెందుకు వృథంగా ఉపయోగించడం?'

'విదేశాంగమంత్రిగా బాధ్యతలు తీసుకున్నందుకు అభినందనలు చాందినీజీ. మీరు కష్టపడి పనిచేసి ఇంకా పైకి వెళతారని నాకు తెలుసు', అన్నాడు అందరికీ కరచాలనం చేస్తున్న చాందినీతో ఒక శ్రేయోభిలాషి.

గంగాసాగర్ ఆ దగ్గర్లోనే ఉన్నాడు. పక్కకు తిరిగి స్టఫ్ చేసిన ఆలూ తింటున్న నమ్మకస్థుడైన తన పోషకుడు అగర్వాల్ గారితో 'విచిత్రంగా లేదూ?' అన్నాడు.

'ఈ అణకువ గల అమ్మాయిని భారతదేశ విదేశాంగమంత్రిని చెయ్యాలనుకున్న నీ కల నెరవేరడంలో వింత ఏముంది?' అడిగాడు అగర్వాల్.

'వింత ఏమిటో చూడండి, మిత్రమా. ఆమె చదువుకొనడానికి విదేశానికి వెళ్ళింది. ప్రేమ వ్యవహారంలో పడింది, గర్భవతి అయింది, బహుమతిగా నేనామెను విదేశాంగ వ్యవహారాల మంత్రిని చేశాను'.

'గౌరవనీయులైన విదేశాంగమంత్రిగారికి పోలెండులోని భారత రాయబార కార్యాలయంలో సూర్యాస్తమయం తర్వాత కూడా జాతీయజెండాను అవనతం చేయలేదని ఇది భారత జెండా స్మృతి 2.2 భాగానికి చెందిన ఉప విభాగాన్ని (xi) ఉల్లంఘించడం అనీ తెలుసా? దీన్ని గురించి సరైన చర్య తీసుకుంటానని సభకు హామీ ఇస్తారా మంత్రిగారూ?'

'మిస్టర్ స్పీకర్, సర్, నేను తప్పనిసరిగా ఈ విషయంలో చర్య తీసుకుంటానని హామీ ఇస్తున్నాను'

'మిస్టర్ స్పీకర్ సర్, జెనీవాలో ఇటీవల జరిగిన కార్యదర్శుల స్థాయి చర్చలలో పాకిస్థాన్‌దే పై చేయి అయేలా మనం వ్యవహరించామని గౌరవనీయులైన విదేశాంగమంత్రి అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారా? అక్కడ చేసిన తప్పుల నుంచి మంత్రిగారు పాఠాలు నేర్చుకున్నారా?'

'మిస్టర్ స్పీకర్, సర్, గౌరవనీయుడైన సభ్యుడు వాటి నుంచి నేర్చుకుంటానంటే, మరికొన్ని తప్పులు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని నేను తెలియజేస్తున్నాను'.

'అధ్యక్షా మీ అనుమతితో, డ్రై డే రోజున విదేశాంగ శాఖ సౌత్‌బ్లాక్‌లోని ఆవరణలో మద్యం సరఫరా చేశారని గౌరవనీయులైన మంత్రిగారికి తెలుసా?'

'మిస్టర్ స్పీకర్, దేనికీ మద్యం సమాధానం కాదని నా అభిప్రాయం. కేవలం ప్రశ్నను మర్చిపోవడానికి పనికొస్తుందది. గౌరవనీయులైన మంత్రిగారి ప్రశ్న ఏమిటో చెబుతారా?'

'మిస్టర్ స్పీకర్, అంతర్జాతీయ దౌత్యరంగంలో విదేశాంగ వ్యవహారాలశాఖ మందుపాతర మీద నడుస్తున్నట్లుంది. దురదృష్టవశాత్తు గౌరవనీయులైన మంత్రిగారికి అనుభవం లేక చీకటిలో చిన్నపాపలా తడబడుతున్నారు'.

'మిస్టర్ స్పీకర్, చీకటిలో చిన్నపిల్లలు ప్రమాదాలు చేస్తారు. చీకటిలో జరిగిన ప్రమాదాలు చిన్నపిల్లలను పుట్టిస్తాయి. మనందరం ఇక్కడికి అలాగే వచ్చామని అనుకుంటాను!'

లోక్‌సభ మొత్తం నవ్వులతో దద్దరిల్లుతుండగా చాందిని కూర్చుంది. కొత్తమ్మాయి జోలికి వెళితే అంత సులభంగా బైటపడమని అందరికీ అర్థమైంది. జాఫ్రీ హెమింగ్‌ఫోర్డ్ ప్రయత్నించాడు, విచారించవలసి వచ్చింది.

ఆర్థికమంత్రి రాజీనామా చేయకముందు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ – సిబిడిటి – రెండు ఫైళ్ళు పంపాడాయనకి. ఈ విషయాలు అందరి దృష్టినీ ఆకర్షించేవి. కాబట్టి వాటిపై మంత్రి చేత సంతకం పెట్టించాలని అనుకున్నాడు.

మొదటిది ఆర్ అండ్ ఎస్‌కు సంబంధించినది. మంత్రికి, రంగ్తాకు ఉన్న సాన్నిహిత్యం వల్ల నేరుగా ఆర్థికమంత్రి చేతే సంతకం పెట్టించాలని సిబిడిటి ఛైర్మన్ భావించాడు.

*గౌరవనీయులైన ఆర్థికమంత్రి. ఆర్ అండ్ ఎస్ కార్యకలాపాలను పరిశోధించిన మీదట చాలా సందర్భాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు రుజువైంది. తాము కొన్న చాలా వస్తువుల ధరలను బాగా పెంచినట్లు, ఆదాయంపై పన్ను తగ్గించుకునే ఉద్దేశ్యంతో ఈ విధంగా చేసినట్లు స్పష్టమైంది. అంతేకాక లాభాలు పంచుకొనే ఉద్దేశ్యంతో ప్రయివేటు భాగస్వామ్యాలను సృష్టించారు. ఆదాయం వచ్చే చాలా అంశాలను డిఫర్ చేశారు, పన్ను సేకరణ అధికారులకు రెవెన్యూ చెల్లించనవసరం లేకుండా. కొన్ని లావాదేవీలు – ముఖ్యంగా ఆస్తుల కొనుగోలు, అమ్మకం – మూల్యాంకనం ప్రశ్నించదగిన విధంగా ఉంది, పన్ను భారాన్ని మరింత తగ్గించే విధంగా ఉంది, కనీసం పేపరు మీద.*

మెమోని దూరం దూరంగా రాశారు. తరువాతి పేజీలో కూడా కొనసాగించారు.

*పై పరిస్థితుల దృష్ట్యా, ఈ విషయంలో తీసుకోవలసిన చర్య గురించి మీ సలహా కోరుతున్నాను. కృతజ్ఞతలతో ఛైర్మన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్.*

రెండో ఫైలు కూడా సామాన్యులపై విధించే పన్ను రేట్లకు సంబంధించినది – రాజకీయ నిర్ణయం – మరోసారి సిబిడిటి ఛైర్మన్ మంత్రిగారి నిర్ణయం ప్రకారమే చేయడం సముచితమైందని నిర్ణయించాడు.

*గౌరవనీయులైన ఆర్థిక మంత్రి. గత ఆర్థిక సంవత్సరంలో దాఖలైన ఆదాయపు పన్ను రిటర్నులు అతి తక్కువ ఆదాయ వర్గాలపై భారం అధికంగా ఉన్నట్లు తెలుపుతున్నాయి. గత ఏడాది ఆర్థికమాంద్యం వల్ల పన్ను చెల్లించే చాలా మంది దివాలా తీశారు. ఉద్యోగుల విషయంలో బాగా నిజమైంది – వారికి ఇంటి రుణాల చెల్లింపు, రుణ చెల్లింపులుంటాయి. ఇన్‌కంటాక్స్ కమిషనర్లతో అంతర్గత చర్చలు జరుగుతున్నపుడు, సాధారణ జీతం తీసుకునే వారిపట్ల ఉదారంగా వ్యవహరించాలని అనుకున్నారు.*

అంతకుముందులానే మెమోను దూరంగా రాసి, తరువాత పేజీలో కొనసాగించారు.

*పై పరిస్థితుల దృష్ట్యా ఈ విషయంలో తీసుకోవలసిన చర్య గురించి మీ సలహా కోరుతున్నాను. కృతజ్ఞతలతో, ఛైర్మన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్.*

ఫైళ్ళు ఒక గంట తర్వాత నార్త్ బ్లాక్‌కి వచ్చాయి. ఆర్థికమంత్రి పద్నాలుగు కేరట్ల వాటర్‌మేన్ కలాన్ని, ఖద్దరు చొక్కాలోంచి తీసి మొదటి మెమో మీద కింద నోట్ రాశాడు. ఆర్ అండ్ ఎస్‌ని అధికారికంగా రక్షించలేనని అతనికి తెలుసు. కనీసం కాగితం మీదైనా నిష్పాక్షికంగా ఉన్నట్లు కనిపించాలి. మెమో కింద ఇలా రాశాడు :

*వాటి గురించి క్షుణ్ణంగా పరిశోధించి, ప్రభుత్వానికి న్యాయంగా రావాల్సిన పన్నులు రాబట్టటానికి తగిన విధానాన్ని అవలంబించండి. శుభాకాంక్షలు. ఆర్థికమంత్రి.*

రెండోది కొంచెం సులువైనది. ప్రధానితో ఈ విషయాన్ని గురించి చర్చించాడు. ఉద్యోగస్థులకు కొన్ని రాయితీలు, టాక్స్‌బ్రేక్‌లు ఇవ్వవలసిన అవసరం ఉందని భావించారు. రెండో మెమో కింద ఇలా రాశాడు :

*వారితో మనం దయగా, మృదువుగా ప్రవర్తించాలి. వారి మద్దతు లేకుండా ఏ ప్రభుత్వమూ అధికారంలో ఉండలేదు. తగినంత సరళంగా వ్యవహరించాలని సూచిస్తున్నాను. శుభాకాంక్షలు. ఆర్థికమంత్రి.*

కొన్ని గంటల తర్వాత రెండు మెమోలు గంగాసాగర్ చేతికి వచ్చాయి. ఆయన శిష్యుడు సిబిడిటి ఛైర్మన్ వాటిని ఆయనకు పంపాడు.

మొదటి మెమోలోని రెండు పేజీలకు ఉన్న పిన్‌ని జాగ్రత్తగా తీసేశాడు. అదే విధంగా రెండో మెమోలోని రెండు పేజీలను కూడా జాగ్రత్తగా విడదీశాడు.

తర్వాత ఆర్ అండ్ ఎస్ మెమో మొదటి పేజీకి సాధారణ ఉద్యోగస్థులకు పన్ను రాయితీలకు సంబంధించి రాసిన నోట్‌ను కలిపాడు. తను చేసిన పని ఫలితాన్ని తృప్తిగా చూసుకున్నాడు.

*గౌరవనీయులైన ఆర్థికమంత్రి. ఆర్ అండ్ ఎస్ కార్యకలాపాలను పరిశోధించిన మీదట చాలా సందర్భాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు రుజువైంది. తాము కొన్న చాలా వస్తువుల ధరలను బాగా పెంచినట్లు, ఆదాయంపై పన్ను తగ్గించుకునే ఉద్దేశ్యంతో ఈ విధంగా చేసినట్లు స్పష్టమైంది. అంతేకాక లాభాలు పంచుకునే ఉద్దేశ్యంతో*

ప్రయివేటు భాగస్వామ్యాలను సృష్టించి, ఆదాయం వచ్చే చాలా అంశాలను డిఫర్ చేశారు, పన్ను సేకరణ అధికారులకు రెవెన్యూ చెల్లించనవసరం లేకుండా కొన్ని లావాదేవీలు - ముఖ్యంగా ఆస్తుల కొనుగోలు అమ్మకం - మూల్యాంకనం ప్రశ్నించదగిన విధంగా ఉంది. పన్ను భారాన్ని మరింత తగ్గించే విధంగా ఉంది, కనీసం పేపరు మీద. పై పరిస్థితుల దృష్ట్యా, ఈ విషయంలో తీసుకోవలసిన చర్య గురించి మీ సలహా కోరుతున్నాను. కృతజ్ఞతలతో. ఛైర్మన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్.

మెమో తర్వాత ఆర్థికమంత్రి చేతి రాతతో రిమార్కు ఉంది.

*వారితో మనం దయగా, మృదువుగా ప్రవర్తించాలి. వారి మద్దతు లేకుండా ఏ ప్రభుత్వమూ అధికారంలో ఉండలేదు. తగినంత సరళంగా వ్యవహరించాలని సూచిస్తు న్నాను. శుభాకాంక్షలు, ఆర్థికమంత్రి.*

గంగాసాగర్ అగర్వాల్ గారికి మెమో చూపించాడు. ఆయన చకితుడయ్యాడు. 'దీనితో ఏం చేయాలనుకుంటున్నావు?'అడిగాడాయన.

'ఏమీ చెయ్యను'. సమాధానం చెప్పాడు గంగాసాగర్. 'కుంభకోణాలతో అతన్ని నాశనం చెయ్యడానికి కావలసినన్ని ఆయుధాలున్నాయి నా దగ్గర'.

'అయితే నువ్వు నియమించిన సిబిడిటి ఛైర్మన్‌తో ఇంత తతంగం ఎందుకు చేయించావు మరి?' అగర్వాల్‌గారడిగారు.

'బీమా పాలసీ తీసుకుంటే వెంటనే అగ్ని ప్రమాదం జరగాలనుకుంటారా?' గంగాసాగర్ అడిగాడు.

'చైనా రాయబారి మిమ్మల్ని కలవాలనుకుంటున్నాడు మేడం' విదేశాంగ శాఖ సెక్రటరీ చెప్పాడు.

'కాని ఇప్పుడే పాకిస్థాన్‌ని సమర్థించి ప్రకటన చేశాడు కదా. కాశ్మీర్లో నియంత్రణరేఖను దాటే తీవ్రవాదులు స్వతంత్రమైన నాన్‌స్టేట్ యాక్టర్లని అన్నాడు. పాకిస్థాను నిఘా విభాగానికి దీనితో సంబంధం ఉందని మనకు తెలుసు. కాని చైనా వాళ్ళు మరో రకంగా అనుకుంటున్నారు. నేనెందుకు అతన్ని కలవాలి?' చాందిని కోపంగా అడిగింది.

'చైనాతో పోట్లాట మనకు మంచిది కాదు మేడం. 1962లో మనపై దాడి చేసినప్పటి నుంచి ఇప్పటివరకు వాళ్ళు దాదాపు పదిహేను వేల చదరపు మైళ్ళు మన భూమిని ఆక్రమించారు. బీజింగ్ మన ఈశాన్య రాష్ట్రమైన అరుణాచలప్రదేశ్ తమదే అంటోంది. ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు కీలకమైనవి.'

'నేను రాయబారిని కలుస్తాను కాని నా షరతుల ప్రకారం... నా పర్యటన పూర్తయిన తర్వాత' అంది చాందిని.

'మీ పర్యటనా? రాబోయే రెండు రోజుల ఎజెండాలో అలాంటిదేమీ లేదు'.

'ముందు లేదు. ఇప్పుడుంది. నన్ను గగ్గల్‌కి తీసుకెళ్ళడానికి ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఏర్పాటు చేయండి.'

'గగ్గల్?'

'ధర్మశాల దగ్గరున్న ఎయిర్‌పోర్ట్. హిమాచలప్రదేశ్‌లో'.

'ధర్మశాల? మీరెళ్ళి దలైలామాని కలవకూడదు. చైనా రాయబారి ఆందోళన చెందుతాడు.'

కలుస్తాను. ఒకసారి అతను బాగా కలవరపడ్డాక, అతనితో సమావేశమవుతాను.

లుతీయన్స్ మధ్యలో ఉన్న లోఢీరోడ్‌లో ప్రసిద్ధమైన లోఢీ ఉద్యానవనం ఉంది. మొఘల్ చక్రవర్తులు హుమయూన్, సఫ్దర్‌జంగ్‌ల సమాధులు తూర్పు, పడమర హద్దులో ఉంటాయి దీనికి. రీసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్ –**రా**– ప్రధాన కార్యాలయంలో ఒక భాగం. దీనివల్ల పార్లమెంటు బడ్జెట్ కేటాయింపుల పరిధిలో ఇది ఉండదు. దీనిలో పన్నెండు వేలమంది ఏజంట్లున్నారని అంటారు. **రా** ప్రధానాధికారి నేరుగా ప్రధానమంత్రికి రిపోర్ట్ చేస్తాడు.

ఉదయమే ప్రధానాధికారి – సెక్రటరీ (రీసెర్చి) అంటారు – తన కార్యాలయం నుంచి సౌత్‌బ్లాక్‌కు తెల్ల అంబాసిడర్ కారులో వచ్చాడు. ఒక పని గురించి ప్రధానికి, విదేశాంగమంత్రికి వివరించవలసి ఉంది. ఆ పని చాందిని మానసపుత్రిక.

'మనం ఏమైనా ప్రగతి సాధించామా?' **రా** అధికారి ప్రధానికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోగానే చాందిని ఉత్సుకంగా అడిగింది.

'మఖ్మద్‌ని అరెస్టు చేశారని చెప్పడానికి సంతోషంగా ఉంది' **రా** ప్రధానాధికారి చెప్పాడు చాందినికి.

'అరెస్టు చేశారా? ఎవరు?' ప్రధాని అడిగాడు.

'జిన్ జియాంగ్‌లో చైనా అధికారులు', అతను సమాధానంగా చెప్పాడు.

'మఖ్మద్ పాకిస్థాన్‌లో పనిచేస్తున్న మన ఏజెంటు అనుకున్నాను', ప్రధాని అన్నాడు.

'నిజమే సర్', వివరించాడు **రా** అధికారి,' కాని చాందినీజీ సూచన ప్రకారం మఖ్మద్‌ని సిద్ధం చేసి, చెప్పాల్సింది చెప్పి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో జిన్‌జియాంగ్ యుఘిర్ స్వతంత్ర ప్రాంతానికి బదిలీ చేశాం'.

'అతను అరెస్టయినందుకు మీకు సంతోషంగా ఉందా?' ప్రధాని అడిగాడు. **రా** అధికారి చాందినీని చూసి చిరునవ్వు నవ్వాడు. తర్వాత ప్రధాని వైపు చూసి శాంతంగా' అతను అరెస్టవుతాడని అతనికి తెలియదు. యుఘిర్‌లతో మాట్లాడతాడని పంపించాం, కాని చైనా వాళ్ళకి అతని గురించి తెలిసేలా చేశాం' అన్నాడు.

'ఈ అరెస్టువల్ల మనమేం సాధించాం?' అర్థం కాని ప్రధాని అడిగాడు, చాందినికి నేరుగా **రా** తో కలిసి పనిచేయడానికి అనుమతినిచ్చి తప్పు చేశానా? అనుకుంటూ.

'మీకు తెలుసుగా మఖ్మద్ పాకిస్థానీ. కరాచీలో మన సీక్రెట్ ఎస్సెట్. తీవ్రవాదుల గురువుగా ఉంటూ, కాశ్మీరులో పనిచేసే జీహాదీలకు శిక్షణ ఇస్తాడు' **రా** అధికారి చెప్పాడు.

'కాశ్మీరులోకి దొంగతనంగా వచ్చే దొంగలకు శిక్షణ నిచ్చే ఏజెంట్లకు డబ్బిచ్చి చావుని, నాశనాన్ని కలిగిస్తున్నామా?' ప్రధాని బోళాగా అడిగాడు.

**రా** మనిషి చెప్పాడు. 'మీరడిగిన వాటికి నేను సమాధానం చెప్పడానికి అనుమతించండి. చాలా ఏళ్ళుగా భారత, పాకిస్థానుల మధ్య వివాదాస్పద సరిహద్దులు దాటటానికి పాకిస్థాను ఉగ్రవాదులకు డబ్బులిచ్చి, శిక్షణనిస్తున్నది. ఈ శిక్షణ పొందిన కిరాయి సైనికులు కాశ్మీరులో ప్రవేశించి ఉగ్రవాద చర్యలు జరుపుతారు. మఖ్మద్ – అతనిలాంటి మరికొందరు, జీహాదీ సమూహాల్లో భారత గూఢచారులు. ఈ జీహాదీలను పాకిస్థాను పంపుతూనే ఉంటుందని మనకెలాగూ తెలుసు. వాళ్ళ సంస్థల్లో మన గూఢచారులుండడం వల్ల ఉపయోగం'.

'కాని దీనికి జిన్‌జియాంగ్‌కి ఏం సంబంధం?' ప్రధాని అడిగాడు.

'జిన్‌జియాంగ్ యుఘిర్ స్వతంత్ర ప్రాంతాన్ని పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా తనలో భాగం అనుకుంటుంది. యుఘిర్‌లు స్థానికంగా ఉన్న ముస్లిం జనాభా. వాళ్ళు చైనా నుంచి విడిపోవాలని పోరాటం చేస్తున్నారు. వాళ్ళు స్వతంత్రం కోరుతున్నారు', వివరించింది చాందిని.

'కీలకమైన వ్యక్తిని జిన్‌జియాంగ్‌కు పంపి అరెస్టు చేయించి, మనమేం సాధించాం?' ప్రధాని అడిగాడు.

'వాస్తవానికి ఇటీవల చైనావాళ్ళు పాకిస్థాను ప్రదర్శిస్తున్న భారత వ్యతిరేక ధోరణికి చాలా మద్దతిస్తున్నారు భారత్‌కు వ్యతిరేకంగా. పాకిస్థానును చైనా భారతదేశానికి శత్రువుగా భావిస్తోంది. "శత్రువుకి శత్రువు మిత్రుడు కదా". కాశ్మీరు చర్చలో కూడా చైనా పాకిస్థానుకు మద్దతిస్తోంది. కాశ్మీరులో సమస్య స్వాతంత్ర్యం కోసం స్థానికులు జరిపే పోరాటమని, దానికి పాకిస్థాను ఆర్థిక సాయం చేయడం లేదని పాకిస్థాను చెప్పేదాన్ని చైనా సమర్థిస్తోంది!' చెప్పింది చాందిని.

'ఇతర ఇస్లామిక్ ఉద్యమాలకు కూడా పాకిస్థాను ఆర్థిక సాయం అందిస్తోందని ప్రత్యేకించి జిన్‌జియాంగ్‌లో అనే విషయం చైనాకు తెలిస్తే ఈ సంకుచితాభిప్రాయం దెబ్బతో మారుతుంది' సంభాషణలో పాలుపంచుకోవాలనే ఉత్సుకతతో **రా** అధికారి చెప్పాడు.

'మనమెందుకు మఖ్మద్‌ని అరెస్టు చేయించాం?' ప్రధాని అడిగాడు.

'అండర్ కవర్ **రా** ఏజెంటుగా, అతను జీహాదీ అనే అనుకుంటారు. పాకిస్థాను గూఢచారి విభాగం నుంచి నిధులు అందుకున్నట్లుగా అతని వ్యక్తిగత వివరాలలో ఉంటుంది. అతనిని జిన్‌జియాంగ్‌కి ఇస్లామిక్ తీవ్రవాదులతో మాట్లాడమని పంపాం, **రా** అధికారి వివరించాడు. 'తను అరెస్టవుతానని అతనికి తెలియదు. అరెస్టయ్యాడు గనుక చైనా ఎంఎస్ఎస్ –మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ అతన్ని ప్రశ్నిస్తుంది. పాకిస్థానీ సంస్థతో అతనికి ఉన్న సంబంధాలు చైనావాళ్ళకు తెలుస్తాయి. అప్పుడు పాకిస్థానుకు చైనావాళ్ళు అంతగా మద్దతు నివ్వరు'.

'కాని మఖ్మద్‌ని చంపేస్తే ఒకవేళ?' అడిగాడు ప్రధాని.

'కాశ్మీరు కోసం మనం చెల్లించే మూల్యం' వివరించాడు సెక్రటరీ (రీసెర్చి)

'వచ్చేవారంలో చైనా రాయబారితో నా సమావేశం, తర్వాత వారంలో జరిపే చైనా పర్యటన సుహృద్భావ వాతావరణంలో జరుగుతాయని అనుకుంటాను. రెండు దేశాలకి ఒకేలాంటి సమస్యలున్నాయి కదా!' చాందిని సంతోషంగా అంది.

తియాన్మన్ స్క్వేర్‌కి పడమటి దిశలో చివర ఉన్న ద గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్ ఒకటి పాయింట్ ఎనిమిది మిలియన్ల చదరపు అడుగుల్లో ఉంది. బీజింగ్‌లో రాజకీయాల కేంద్రమది. ఎన్నో చారిత్రక సమావేశాలకు అది వేదిక అయింది. ప్రసిద్ధుడైన అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ కూడా ఇక్కడ సమావేశమయ్యాడు. ఆ భవనంలో ఉత్తర భాగంలో ప్రభుత్వ బాంక్వెట్ హాల్ ఉంది. అక్కడ ఏడు వేల మందికి పైగా అతిథులకు ఆతిథ్యమివ్వవచ్చు.

గౌరవనీయురాలైన చాందిని గుప్త, భారత విదేశాంగమంత్రి మూడు రోజుల అధికారిక పర్యటన కోసం ఆదివారం ఉదయం బీజింగ్ వచ్చింది. చాందిని మొదటిసారి చైనా వచ్చింది. ఇక్కడ ఉన్నప్పుడు చైనా ప్రధానితోను, ప్రముఖులైన శాసనసభ్యులతోను సమావేశమవుతారు – చైనా విదేశాంగ మంత్రితో కూడా చర్చలు జరుపుతారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పనిచేసే చైనా ఇండియా వైద్య బృందాన్ని ఏర్పాటుచేసే వేడుకలో కూడా ఆమె పాల్గొంటుంది. బీజింగ్‌లో ఉన్న ప్రభుత్వ మేధావులకు చెందిన చైనీస్ అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఆమె ఒక ప్రసంగం చేస్తుంది. జిన్‌హు ఆ న్యూస్‌తో మాట్లాడుతూ, 'తాను నిష్కపట హృదయంతో స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా ఇరుదేశాలకీ సంబంధించిన సమస్యలను గురించి ఇద్దరికీ ఆమోదయోగ్యంగా ఉండే, భవిష్యత్తరాలకు ఉపయోగపడే సంబంధాలను ఏర్పరచుకోవడానికి ఇక్కడకు వచ్చానని' ఆమె చెప్పింది.

ఆమె తిరిగి బయలుదేరే ముందు రోజు రాత్రి ఆమె గౌరవార్థం విదేశాంగమంత్రి విందు ఇచ్చాడు. ఆ విందుకు చైనా పార్టీ, ప్రభుత్వ నాయకులు అందరూ హాజరయ్యారు. హాలులో చైనా, భారత జెండాలు ఉంచారు. మిలిటరీ బ్యాండు ఇరుదేశాల జాతీయ గీతాలను ఆలపిస్తుండగా విందు మొదలైంది. చైనా మంత్రి తన కుర్చీలోంచి లేచి చాందినిని, ఆమె అధికార బృందాన్ని ఆహ్వానించాడు. తర్వాత ఇలా అన్నాడు, 'భారత, చైనాల మధ్య కావలసినన్ని విభేదాలున్నా, భారత విదేశాంగ మంత్రి సూక్ష్మగ్రాహ్యత, వివేకం వల్ల

ఇరుదేశాలకీ సంబంధించిన సమస్యలను గురించి, మన రెండు దేశాల మధ్య అవగాహనకు కావలసినంత కృషి జరిగింది'.

చాందిని హుందాగా చిరునవ్వు నవ్వింది. ఆమె తన ప్రశంసలకు మురిసిపోతుంది అనుకున్నాడు చైనా మంత్రి. కాని ఆమె మఖ్మద్‌ను గురించి, సరైన సమయానికి అతను అరెస్టవడం గురించి ఆలోచిస్తోంది. అతని ప్రశంసలకు సమాధానంగా ఆమె శుభాకాంక్షలు చెప్పింది. అతని గౌరవార్థం ఇంగ్లీషు కవి జాన్ డ్రైడన్ కవిత్వంలోని రెండు పంక్తులను ఉట్టంకించింది 'మనిషి ఎంత వైవిధ్యంగా కనిపించినా అతడు మానవాళి సంక్షిప్త రూపం.'

ఆమె సహృదయానికి మంత్రి కృతజ్ఞతలు చెప్పాడు. అయితే చాందిని చెప్పని పంక్తులను చదివి ఉంటే అంత హుందాతనాన్ని ప్రదర్శించేవాడు కాదేమో.

ఇలా ఉంటాయి ఆ పంక్తులు, 'మనిషి ఎంత వైవిధ్యంగా కనిపించినా మానవాళికి సంక్షిప్త రూపం; అభిప్రాయాల్లో స్థిరత్వం, ఎప్పుడూ తప్పు వైపే ఉండడం; అన్నిటినీ మొదలుపెట్టి, ఏదీ కొనసాగించడు; చంద్రుడి కళలను బట్టి రసాయన శాస్త్రజ్ఞుడు, ఫిడేలు వాయించేవాడు, రాజనీతిజ్ఞుడు, హాస్యగాడు అవుతాడు!'

'ప్రతిపక్ష నేత అభ్యంతరం చెబుతున్నారా?' స్పీకర్ అడిగారు.

'అవును, మిస్టర్ స్పీకర్ సర్. సంబంధం. నేను విదేశాంగమంత్రిగారిని అడిగిన ప్రశ్న భారత చైనాల మధ్య సామరస్యం గురించి. గౌరవనీయులైన ప్రధానమంత్రిగారిచ్చిన సమాధానం దానికి సంబంధించినది కాదు–' ప్రతిపక్షనేత చెబుతున్నాడు.

'ప్రతిపక్షనేతను కూర్చోవలసిందిగా కోరుతున్నాను. ప్రధాని ఇప్పుడే తన ప్రసంగాన్ని ఆరంభించారు. ఆయన దానికి సంబంధించిన సమాధానమే చెబుతున్నారు' అంటూ స్పీకర్ మధ్యలో మాట్లాడనీయకుండా ఆపాడు.

'అభ్యంతరానికి సంబంధించి మిస్టర్ స్పీకర్. ప్రతిపక్షనేత ప్రశ్నను సరిగా వేయలేదని–' వాదించింది చాందిని.

'విదేశాంగమంత్రిగారు సమస్యను చర్చిస్తున్నారు. గౌరవనీయులైన మంత్రిగారికి అభ్యంతరం ఉందా?' స్పీకర్ అడిగాడు.

'నా అభ్యంతరమేమిటంటే ప్రతిపక్షనేత అర్థం లేని అభ్యంతరాలను లేవనెత్తుతున్నారని' చెప్పింది చాందిని ప్రతిపక్ష బెంచీలు కూడా ఆమె జోక్‌తో ఏకీభవిస్తుండగా.

'దయచేసి మంత్రిగారిని కూర్చోమని కోరుతున్నాను' అన్నాడు స్పీకర్ ఆమె అన్నది నచ్చినట్లుగా. ఆ అమ్మాయి ఒక తార.

లోక్‌సభ టెలివిజన్‌లో రికార్డు చేసిన చర్చను చూస్తూ అతని భార్య 'ఆ అమ్మాయి ఒక తార' అంది. 'మీరు జాగ్రత్తగా గమనించుకోవాలి. మీ కంటె ఎక్కువ పేరు వస్తుందామెకి. చైనాతో సాధించిన దౌత్య విజయంతో ఆమె ప్రతిష్ట పెరిగింది!' చేతిలో గ్లాసులో బుడగల యాంటాసిడ్‌ని తాగుతూ ప్రధాని తల ఊపాడు. లోక్‌సభ సమావేశాలు ఎప్పుడూ అజీర్ణం కలిగిస్తాయి ఆయనకి. దానితో కడుపులో అల్సర్లు మండుతుంటాయి. ఎప్పటిలానే అతని భార్య చెప్పింది రైటే. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో గంగాసాగర్ ఘన విజయం, చైనాలో చాందినీ గుప్త అదేవిధంగా సాధించిన విజయం, ఆ ఇద్దరిదీ సమర్థమైన కలయికగా చేశాయి. తను జాగ్రత్తగా వ్యవహరించాలి.

'సర్, సమస్యొకటి వచ్చింది' చెప్పాడు మీనన్ ఇబ్బందిగా.

'ఏమిటది మీనన్?' ఉదయపు పేపర్లలోంచి తలెత్తి అడిగాడు గంగాసాగర్.

'హమీద్ – వెయిటర్ – మీకు తెలుసుగా మేజిస్ట్రేటు దగ్గరికి మనల్ని తీసుకెళ్ళాడు. వాడికి ఇంకా డబ్బ కావాలంట.'

'అదేమిటి, ఇక్రంకు అరెస్టు వారెంటు ఇచ్చినందుకు మేజిస్ట్రేటుకు చెల్లించాంగా?'

'ఇచ్చాం. అయినా ఎక్కువ అడుగుతున్నాడు'.

'ఇక్రం ముఖ్యమంత్రి పదవి వదులుకోగానే వారెంటు ఉపసంహరించినందుకు మనం డబ్బులిచ్చాంగా అతనికి?'

'ఇచ్చాం. కాని మేజిస్ట్రేటుకి వీడంటే విసుగొచ్చి మరొక అందమైన అబ్బాయిని కుదుర్చుకున్నాడు. అందుకని, హమీద్‌కు డబ్బవసరమవుతోంది'.

'ఖచ్చితంగా దేనికోసం డబ్బడుగుతున్నాడు?'

'రహస్యం బయటికి చెప్పకుండా ఉండడానికి'.

లక్నోలోని పెద్ద మసీదైన జామై మసీదులో ఇక్రం అప్పుడే ప్రార్థన ముగించాడు. ఈ ప్రాంతంలో ఇక్రంని అందరూ హీరోలా చూస్తారు. వందలాది మందికి చిన్న చిన్న సాయాలు చాలా చేశాడు – ఉద్యోగానికి సిఫారసు చేయడం, బళ్ళో చేర్పించడం, ఆస్తి వివాదం పరిష్కరించడం, ఎవరి కూతురి వివాహానికో కట్నం ఇవ్వడం వంటివి. జామై మసీదులో శుక్రవారం ప్రార్థనలు చేసేవాళ్ళకు ఇక్రం రాబిన్‌హుడ్ కంటె తక్కువ కాదు.

ప్రార్థనలు పూర్తయ్యాక, పసుపు పచ్చ ఇసకరాతి మసీదు పదిహేను గుమ్మటాల కమానుల్లో ఒక దాని నుంచి ఇక్రం బయటకు వచ్చాడు. ఇది లక్నో మధ్యలో ఏభై వేల చదరపు అడుగులలో పెద్ద ఆవరణలో ఉంది. అతను బయటికి రాగానే తక్షణమే అభిమానులు చుట్టుముట్టారతన్ని. ఒక నల్లటి యువకుడు తనను పరిశీలించడం గమనించాడు. అతను మసీదులోకి తనని వెన్నంటి వచ్చాడని అతనికి రూఢిగా అనిపించింది. ఇక్రం ఇంకేమీ ఆలోచించకుండా అతణ్ణి పిలిచాడు. 'అబ్బాయ్! నన్ను కలవాలనుకుంటున్నావా? ఏమిటి చెప్పు!' ఆ యువకుడు భయంగా చుట్టూ చూశాడు. పిల్లిని చూసి భయపడుతున్న ఎలుకలాగ. తనతో ఉన్న వాళ్ళని ఒక క్షణం వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదిలెయ్యమని చెప్పాడు ఇక్రం.

'సర్, మీ గురించి ఎన్నో మంచి విషయాలు విన్నాను. మీరు దయగలవారని, న్యాయంగా ఉంటారని తెలిసి మీ దగ్గరికి రావడానికి ధైర్యం చేశాను. మీకు ఆసక్తి కలిగించే సమాచారం నా దగ్గరుంది' ఆ యువకుడన్నాడు.

'సమాచారమా? ఎలాంటి సమాచారం?, అడిగాడు ఇక్రం.

'సర్, నేను చెప్పిన తరువాత నన్ను కొట్టనని నాకు మాటివ్వండి దయచేసి', అన్నాడు.

'నీలాంటి అందమైన అబ్బాయిని నేనేందుకు కొడతాను?' ఇక్రం వ్యంగ్యంగా అడిగాడు.

'సర్, నాకు డబ్బవసరం. దానికోసం మీకు నష్టం కలిగించే పనులు చేశాను. అల్లామీద ప్రమాణం చేసి చెబుతున్నాను నేను మీకు–'

అతను భోరున ఏడ్వడం మొదలుపెట్టాడు.

'అబ్బాయ్, మొదట్నించీ చెప్పు ఏం? నీ పేరేంటి? నువ్వేం చేస్తావ్?' ఆ అబ్బాయి భుజాల చుట్టూ చేయి వేసి అడిగాడు ఇక్రం.

'నా పేరు హమీద్, నేను కాన్పూర్ గోల్డెన్ గేట్ బార్లో వెయిటర్ని...'

'నాతో నీకేం సంబంధం?'

'మీ మీద అరెస్టు వారెంటు జారీచేసిన మేజిస్ట్రేటుతో స్వలింగ సంపర్కం చేసేవాణ్ణి.

'ఓహో. అలాగా' ఇక్రం గడ్డం గోక్కుంటూ అన్నాడు.

'గంగాసాగర్గారి సెక్రటరీ మీనన్ వచ్చి మీ మీద అరెస్టు వారెంటు జారీ చేయించమన్నాడు. తర్వాత రద్దు చేయించమన్నాడు – అతనడిగిన విధంగా చేశాను'.

'మరి అంత పరపతి ఉన్నవాడివైతే, ఇంత దయనీయంగా ఉన్నావేంటి? కష్టకాలంలో ఉన్నట్లున్నావ్?'

'వెయిటర్గా ఉద్యోగం వదిలేశాను – కేసులని ఫిక్స్ చేయడం లాభసాటిగా ఉండేది. కాని పాండే – మేజిస్ట్రేటు నాతో విసిగిపోయి, నన్నొదిలేశాడు'.

'నేను నీకేం చెయ్యాలిప్పుడు?' అడిగాడు ఇక్రం.

'మీరు ఇటీవల రషీద్కి – మీ శుక్రవార ప్రార్థనల సభ్యుడికి ఆర్ అండ్ ఎస్ విమాన సంస్థలో ఉద్యోగమిప్పించారని విన్నాను. నాక్కూడా ఏదైనా ఇప్పిస్తారా అక్కడ?'

'నేనెందుకు ఇప్పిస్తాను? నన్ను ముఖ్యమంత్రిని కానీయకుండా చేయడానికి నువ్వా బ్రాహ్మణ గుంటనక్కకి సాయం చేశావు!'

'కాని సర్, నేను కీలకమైన నాయకులందరికీ దగ్గరగా ఉంటాను – చాందినీగారికి కూడా. ఆర్ అండ్ ఎస్ విమాన సంస్థ విమానాలను, హెలికాప్టర్ చార్టర్లను ప్రభుత్వ శాఖలన్నిటికీ సరఫరా చేస్తుంది. మీ కళ్ళు, చెవులుగా పనిచేస్తాన్నేను, మీకు తెలుసుగా రాజకీయాల్లో పనికొచ్చే డబ్బు సమాచారమే', వేడుకున్నాడు హమీద్.

ఇక్రం కొంచెంసేపు గడ్డం నిమురుకుంటూ ఆలోచించాడు హమీద్ చెప్పిన దాని గురించి. తర్వాత కొంతసేపటికి వెళ్ళి రషీద్ని కలువు. నేను పంపించానని చెప్పు' అన్నాడు.

ముదురు బూడిదరంగు యూనిఫాం వేసుకున్న స్టీవార్డ్ రెస్టారెంట్‌కి వెళుతున్నాడు. ప్రభుత్వం తీసుకొనే విమానాల్లో ఫ్లయిట్ అటెండెంట్‌గా ఉండడం పెద్ద లాభమొచ్చే ఉద్యోగం కాదు – విధులు సరిగా నిర్వర్తిస్తే ఎవరికీ తెలియదు. సరిగా చేయకపోతే మాత్రం అవమానకరంగా చూస్తారు. విదేశాంగ మంత్రిత్వశాఖకు విమానాలు సరఫరా చేసే కంపెనీలో పనిచేయడం అతనికింకా బాధగా ఉంది. ఆ శాఖ చాలామంది ప్రముఖులకు విమానాలు ఏర్పాటు చేస్తుంది – విదేశీయులకు, స్వదేశీయులకి, ప్రముఖులు తమ విలువైన సమయంలో అరక్షణం కూడా వృథాగా పోనివ్వరు. అందుకని చెడిపోయిన పిల్లల పుట్టిన రోజు పార్టీలకి కూడా మిలియన్ డాలర్ల యంత్రాలలో ప్రయాణించి సరిగ్గా సమయానికి చేరుకుంటారు. ఆడంబరంగా ఉండే ఆ పెద్దలు ఎప్పుడూ కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పరు – అతను కేవలం పేరులేని, గుర్తింపులేని, వాళ్ళు వాడేసిన టిష్యూలు, చాక్లెట్ రేపర్లు ఏరిపారేసే చెత్తమనిషి అంతే. అయినాగాని స్వలింగ సంపర్కం చేసే మేజిస్ట్రేటుకి ప్రియుడిగా ఉండడం కన్నా మేలు.

ఇంక్రంభాయ్‌కి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తల్లి దృష్టిలో కొంచెం గౌరవం దక్కుతుంది. ఆమెని సంతోష పెట్టడం చాలాకష్టం. తన చిన్న ఉద్యోగం, చిన్న జీతం గురించి అవమానిస్తుంటుంది ఎప్పుడూ. మిగిలిన వాళ్ళతో పోల్చి వాళ్ళలా సంపాదించడం లేదని, ముందుకు పోవడం లేదని సతాయిస్తూ ఉంటుంది. చాలా భరించాడు. జీవితాన్ని ఇంక కొంచెమైనా ప్రశాంతంగా జీవించాలనుకున్నాడు. ఆర్ అండ్ ఎస్ విమాన యాన సంస్థ – ప్రయివేట్ ఎయిర్ చార్టర్ కంపెనీ విదేశాంగ మంత్రిత్వశాఖకు సేవలందిస్తోంది – సరైన సమయంలో సరైన అవకాశం.

'మళ్ళీ నిన్ను చూసినందుకు సంతోషంగా ఉంది ఫ్రెండ్' అన్నాడు మంచిమనిషి రషీద్. అతనే ఇక్రం భాయ్ సూచనల మేరకు హమీద్‌ను ఇంటర్వ్యూ చేసి నియమించాడు. ఇద్దరూ కూర్చుని టీ ఆర్డరు చేశారు. 'నీ నియామకం లేఖ సిద్ధంగా నిరీక్షిస్తూ ఉంది', టీ తాగుతూ చెప్పసాగాడా మనిషి. 'నాకు నువ్వో చిన్న సాయం చేయాలి, మనం ఇంకా ముందుకెళ్ళబోయే ముందు'.

విదేశాంగమంత్రి ఆగ్రాలోని తాజ్‌మహల్ దగ్గరున్న హోటల్‌లో రష్యా వ్యాపారవేత్తల ప్రతినిధి బృందాన్ని కలుసుకోవలసి ఉంది. బెల్ 400 ట్విన్ రేంజర్ హెలికాప్టర్ సిద్ధంగా ఉంది. టేకాఫ్‌కు ముందు చేయాల్సిన తనిఖీలు పూర్తయ్యాయి.

ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ పైలెట్‌కు క్లియరెన్స్ ఇచ్చింది. ఎర్రబల్బు వెలుగుతుండగా ఆమె అంబాసిడర్ కారు రావడానికి కొన్ని నిముషాల ముందుగా పోలీసు కార్లు లైట్లు వెలుగుతూ, సైరన్లు మోగిస్తూ చాపర్‌ను చుట్టుముట్టాయి. పోలీసులు వాహనాల్లోంచి దూకి, త్వరగా నిలబడి ఉన్న హమీదును కస్టడీలోకి తీసుకొన్నారు. ఆశ్చర్యపోయిన పైలెట్ విమానంలోంచి దిగి ఈ గొడవ అర్థం కాక ఆశ్చర్యపోయాడు.

ఒక పోలీస్ పైలెట్ దృష్టిని ఫిల్లర్ క్యాప్ వైపు మరల్చాడు. పైలెట్ వెళ్ళి క్యాప్‌ను తీసి మళ్ళీ గట్టిగా బిగించాలని యత్నించాడు. ఇదంతా ఏమిటో అప్పటికీ అతనికి అర్థం కాలేదు. మూత ఊడి చేతిలోకి వచ్చినప్పుడే అతనికి అర్థమైంది. ఫిల్లర్ మూతిలో గులక రాళ్ళు, కంకర ఉంది. అది అత్యంత ప్రమాదకరం. అది చాపర్ టేకాఫ్ అయ్యేలా చేసేది కాని క్రమంగా గేర్‌బాక్స్‌లో చేరి పవర్ అందకుండా చేసి చాపర్‌ని దానిలో ఉన్న మంత్రిని కూలిపోయేలా చేసేది. లైట్లు వెలుగుతుండగా, సైరెన్లు మోగుతుండగా పోలీసులు హమీదును అరెస్టు చేసి ఒక జీపులో ఎక్కించుకుని వెళ్ళిపోయారు. పోలీసు కార్ల నెంబరు ప్లేట్లపై ప్రభుత్వ నెంబర్లు లేవని, వాళ్ళు పట్టుకున్న రైఫిళ్ళు పోలీసులకు ఇచ్చేవి కావని పైలెట్ గమనించలేదు.

హమీద్‌ని నియమించిన మనిషి – రషీద్ సురక్షితంగా దూరం నుంచి బైనాక్యులర్స్ ద్వారా జరుగుతున్నదంతా చూశాడు. ఇంక వెళ్ళిపోవాల్సిన సమయం.

'హమీద్ తనంతట తానుగా ఈ కుట్రకు పాల్పడి ఉండడు. ఎవరో అతనికి చెప్పి చేయించారు దీన్నెవరు చేయించారో మనం కనుక్కోవాల్సిందే', అన్నారు అగర్వాల్ ఆందోళనగా.

'చాందినికి హాని తలపెట్టేవాడు తప్పించుకోకూడదు మీనన్!' గంగాసాగర్ తన సెక్రటరీ వైపు చూసి బుసకొట్టాడు. 'ఎవడైనా నన్ను దెబ్బతీసే దమ్ముందని అనుకుంటే, వాడి బీర్జాలు నేను తీసేస్తాను!'

'హమీద్‌ని ఆ పనిలో పెట్టింది ఇక్రం సిఫారసు మీదట', అన్నారు అగర్వాల్.

'ఇంటలిజెన్స్ బ్యూరో మనుషుల్ని హమీద్‌ని తీసుకురావడానికి పంపారు. ఈ పాటికి హమీద్ మాట్లాడి ఉంటాడు – చాందిని గారినెవరు చంపాలనుకున్నారో అతను మనకు చెబుతాడు. ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌తో చెప్పనా అతన్ని మాట్లాడించమని?' మీనన్ అడిగాడు.

'వద్దు. హమీద్‌ని సచ్లాదేవికి అప్పగించమని నేను డైరెక్టర్‌కి చెప్పాను - అవసరమైనదంతా ఆమె చేస్తుంది' అన్నాడు గంగాసాగర్.

'సచ్లాదేవా? ఆమె హిజ్రా. ఆమేం చేస్తుంది?' అగర్వాల్ అడిగారు.

'వాడి వట్టలు కావాలి నాకు. నా కోసం వాటిని తెస్తుంది'.

తన చుట్టూ ఉగ్రంగా ఉన్న హిజ్రాలను చూసి హమీద్ భయపడ్డాడు. పాలు, నల్లమందు కలిపి తాగించారు, కొంచెం మాట్లాడించడానికి, భయం పోకుండా ఉండడానికి. చెక్కమంచం మీద నగ్నంగా పడుకోబెట్టి కాళ్ళు చేతులు కట్టేశారు. వృషణాల చుట్టూ తాడు కట్టారు మర్మాంగానికి రక్తం సరఫరా జరగకుండా కొన్ని గంటలకోసారి హిజ్రా నాయకురాలు తాడుని బిగదీస్తోంది అతను స్పృహ తప్పేలా. మళ్ళీ నీళ్ళు చల్లి మెలకువ తెప్పించుతున్నారు. తాడు వల్ల మర్మాంగాల్లో భరించలేని నొప్పి పుడుతోంది.

అతని చుట్టూ ఉన్న హిజ్రాలు దుర్గా అవతారాల్లో ఒకటైన బహుచర మాతను ప్రార్థిస్తున్నారు. వాళ్ళతనిని కిందికి పట్టుకొని ఉండగా వాళ్ళ నాయకురాలు సచ్లాదేవి పదునైన మెరిసే శస్త్ర చికిత్స కత్తిని పట్టుకొని ఉంది. కత్తి అంచులు లైటు వెలుతురులో మెరుస్తున్నాయి. ఆమె చేతులు చాచి కళ్లు మూసుకుని ప్రార్థించింది. మూసిన చేతుల్లో కత్తి ఉంది. ఆ కత్తిని ఏదో ఉన్నత శక్తికి నివేదిస్తున్నట్లుగా ఉంది. తర్వాత కళ్ళు తెరిచి అతనితో అంది 'నువ్విప్పుడు మగవాడివి కావు. నీ వట్టలు నీకంటె అవసరమైనవాడికి ఇవ్వమని నాకు పని అప్పగించారు!'

హమీద్ గుండెలవిసేలా అరిచాడు. కన్నీళ్ళు జలజలా కారుతుండగా వేడుకున్నాడు 'ప్లీజ్, మీకేం కావాలంటే అది చెబుతాను! నా దగ్గరున్న డబ్బంతా తీసుకోండి! నన్ను బాధించకండి! ప్లీజ్! కనికరించండి!'

'హుష్. పిల్లాడా హుష్' సచ్లాదేవి అంది తన రుమాలుతో అతని కన్నీళ్లు తుడుస్తూ. 'ఇది నీ జీవితంలో అత్యంత సంతోషించదగిన రోజు. జీవితకాలం బహుచరమాతకు సేవ చేసే అదృష్టం అందరికీ దొరకదు. నిజంగానే నువ్వు అదృష్టవంతుడివి. ఏడవకు. అదృష్టవంతుడా'.

'నన్నెందుకిలా చేస్తున్నారు?' హమీద్ గొంతు చించుకున్నాడు. కొంచెం బాగా బతకాలనుకున్నాను. చాపర్ కూల్చాలని అనుకోలేదు. నేను మంచి వాణ్ణి, మర్యాదస్తుడిని, నిజాయితీపరుడిని-"

'నువ్వు మగవాడివి కాదు! నువ్వెప్పటికీ మగవాడివి కాలేవు! నా దయ కావాలంటే నిజం చెప్పు. ఈ నీచపు పని చేయమని నీకు పురమాయించిన వెధవ ఎవడో చెప్పు. దేవీ అవతారాన్నే అంతమొందించమని చెప్పిందెవరు!'

'నేను మీకు అంతా చెబుతాను! నా విత్తుకొట్టొద్దు! ప్లీజ్! ఓ దేవుడా ప్లీజ్! నాకీ పని చెప్పిన వ్యక్తి రషీద్ – ఆర్ అండ్ ఎస్ విమాన సంస్థలో పనిచేస్తాడు. నేను ఇక్రంభాయ్‌కి కూడా చెప్పాను. నేను మీకంతా చెప్పాను. ప్లీజ్ నన్ను వదలండి!'

'నువ్వు నిజం చెప్పినందుకు సంతోషంగా ఉంది నాకు, అదృష్టవంతుడా. ఈ ప్రయాణాన్ని పరిశుద్ధమైన హృదయంతో చేయడం ముఖ్యం'. సచ్లాదేవి అంది కత్తితో ఒక్క వేటుతో అతడి వృషణాలు కత్తిరించి. భరించలేని బాధతో హమీద్ కనీసం అరవను కూడా అరవలేకపోయాడు. స్పృహ తప్పాడు. అతని మర్మావయవాల స్థానంలో చెక్క ప్లగ్‌ని పెట్టి వేడి నూనె పోస్తున్నారు గాయం మొద్దుబారడానికి అప్పుడు మళ్ళీ అతనికి మెలకువ వచ్చింది.

## పదిహేనో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

బాబిలోన్‌లోని నెభూఛాడ్రెజార్-2 భవనం అత్యంత సంపన్నమైంది. దేవదారు కలప, ఇత్తడి, బంగారం, వెండి, విలువైన రత్నాలు వేటినీ వదలకుండా అన్నిటినీ ఉపయోగించాడు. యుఫ్రేట్స్ నది విభజించిన నగరపు రెండు భాగాలను భూగర్భ మార్గం కలుపుతుంది. రాజప్రాసాదానికి కొంచెం దూరంలో తన భార్య అమితిస్ అనారోగ్యానికి చికిత్సగా రాజు నిర్మించిన వేలాడే ఉద్యానవనం ఉంది. నెబూఛాడ్రెజర్ మహా నిర్మాత. నగరంలో బాబిలోనియన్ పాంథియన్ శైలిలో వివిధ దేవతలకు పెద్దపెద్ద దేవాలయాలు నిర్మించాడు. యుఫ్రేట్స్ నదిపైన బ్రహ్మాండమైన వంతెన కట్టాడు. నదిలో వచ్చే కల్లోలాన్ని తట్టుకుని నిరోధించి నిలబడేవిధంగా పైన తారు పూసిన ఇటుకలతో వంతెన నిర్మించాడు. మూడు పొరల గోడ రక్షణ వ్యవస్థగా ఉన్న ఆ నగరం ఎవరూ జొరబడలేనిది.

ఆ రోజు జూన్ పదకొండో తేదీ. నెబూఛాడ్రెజర్ ప్రాసాదంలోపల ప్రపంచ విజేత అనారోగ్యంతో మరణశయ్యపై ఉన్నాడు. ముప్ఫయి మూడేళ్ళు నిండడానికి ఇంకా నెల ఉంది, ఆ ముందు రోజు రాత్రి అలెగ్జాండర్ తన ఆప్తమిత్రుడు లారిసాకు చెందిన మెడియస్ ఇచ్చిన విందులో అతిగా తాగాడు. తెల్లవారేసరికి అలెగ్జాండరు మలేరియా జ్వరంతో వణుకుతున్నాడు. అలెగ్జాండరు సేవకుడు ఐమోలాస్ అలెగ్జాండర్ పక్కనే ఉండి మందు కలిపిన ద్రవాన్ని తాగిస్తున్నాడు. అలెగ్జాండర్ యూరోపుదళాలకు అత్యున్నత సేనాని అయిన యాంటిపేటర్ ప్రత్యేకంగా ఆ ద్రవాన్ని పంపాడు. అతనికి జ్వరం తగ్గడానికి. ఆ దేవుడికి తెలియనిదేమిటంటే యాంటిపేటర్ కొడుకు అతనిని చంపడానికి ఆ ద్రవంలో కలపడానికి కటకరోహిణి, ముసిడి సత్తు కలిపి గుర్రం గిట్టల్లో రహస్యంగా ఉంచి పంపాడని.

అలెగ్జాండర్ అనారోగ్యంగా ఉన్న విషయం సైన్యానికి తెలిసి ఆందోళనగా ఉంది. చివరికి సేనానాయకులకు అలెగ్జాండర్ని చివరిసారిగా చూడడానికి సైన్యానికి అనుమతి నివ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. అందరినీ ఒక్కొక్కరిగా అలెగ్జాండర్ పడక గదిలోకి వదిలారు. ఏమాత్రం మాట్లాడలేని అలెగ్జాండర్ వారొచ్చినప్పుడు బలహీనంగా చేతులెత్తాడు కొంచెంగా. ఒకరోజు తర్వాత ఆ అమరజీవి మరణించాడు.

'అలెగ్జాండర్ బాబిలోన్‌లో చనిపోయాడు!' కాల్బలం అరిచింది.

'ఫిలిప్పోస్ భారత్‌లో చనిపోయాడు', అశ్వికదళం కేకపెట్టింది.

'ఇప్పుడే దాడి చెయ్యాలి!' అర్థించాడు చంద్రగుప్తుడు.

'మనం దేనికోసం నిరీక్షిస్తున్నాం?' శశిగుప్తుడడిగాడు.

చంద్రగుప్తుడి, శశిగుప్తుడి సైన్యాలు తమ తాత్కాలిక శిబిరం నుంచి బయటి కొచ్చేశాయి. వాటి గిట్టల నుంచి ఎగసిన దుమ్ము పెద్ద తుఫానులా ఉంది. ఆ గిట్టలు, అరపుల శబ్దం భయంకరంగా మృత్యుయంత్రం కదులుతున్నట్లుగా ఉంది.

మాసిడోనియా వాళ్ళు పాలిస్తున్న రాష్ట్రాల్ని జయిస్తూ పోతారు కొన్నిరోజుల వరకు. ఫిలిప్పోస్ హత్యతో ఇది సులభమే అవుతుంది. మాసిడోనియా దళాలను నడిపించే అధికారులు కరువవడంతో. అలెగ్జాండర్ చనిపోవడం కూడా దీనికి తోడ్పడింది. సెల్యూకస్ హోదాతో పాటు మాసిడోనియా వారసత్వం గురించి, అధికారం కోసం పై స్థాయిలో పోరాటాలు జరుగుతున్నాయి.

'ఒక్క అలెగ్జాండర్ మృతిని అత్యంత విషాదంగా మాసిడోనియా వాళ్ళు భావిస్తు న్నారు కాని అతని సామ్రాజ్య ఆకాంక్షల వల్ల చనిపోయిన వేలాదిమంది చావులు కేవలం గణాంకాలుగా మిగిలిపోయాయి', చంద్రగుప్తుడు కోపంగా శశిగుప్తుడితో అన్నాడు. ఇది అతని రక్తాన్ని మరగించింది.

మగధ నుంచి వచ్చేసిన తర్వాత రాక్షసుడు తన కొత్త పరిసరాల్లో సుఖంగా ఉన్నాడు. తక్షశిలలో తన కొత్త నివాసంలోని ఆవరణలో కుర్చీలో కూర్చున్నాడు. అతను పెట్టుకున్న పాల మీగడ రంగు తలపాగా వజ్రాలతో మెరుస్తోంది. ఛత్రధారులు ఎండ

తగలకుండా అతనికి బంగారు గొడుగు పట్టారు. మరొకరు నీలాలు, కెంపులు పొదిగిన కత్తిని పట్టుకుని ఉన్నారు. పాదరక్షలు లేకుండా కూర్చుని ఉన్నాడు. పంది చర్మంతో చేసినవి, వెండి చెప్పులు పక్కన ఉన్నాయి. తాటాకులు, ఉసిరగడ్డి, నెమలి ఈకలతో చేసిన విసనకర్రతో మరో పరిచారిక విసురుతోంది. అతని చుట్టూ ఉన్న ఆడ పరిచారికలు పారదర్శకమైన అంతరీయాలు, మధ్యలో ముడివేసిన కాయబంధ్‌లు కట్టుకున్నారు. మొత్తానికి వళ్ళంతా కనిపింపచేసే బట్టలున్నాయి వారి ఒంటి మీద.

చాణక్యుడు చెప్పాపెట్టకుండా లోపలికి వచ్చాడు, రాక్షసుడు త్వరగా కుర్చీలోంచి లేచి తన చుట్టూ ఉన్న పరిచారికలను దూరంగా పంపేశాడు. 'రాక్షసా, సుఖంగా ఉన్నట్టున్నావు' చాణక్యుడు నవ్వుతూ అన్నాడు మగధ మాజీ ప్రధాని చుట్టూ పరివేష్టించి ఉన్న ఆడంబరాలను చూస్తూ. 'ధననందుడు అలెగ్జాండరు కోసం ఇచ్చిన బహుమతులను కూడా బాగా ఉపయోగిస్తున్నావ్', అన్నాడు చాణక్యుడు మృదువుగా. రాక్షసుడు బెదిరాడు. వికారపు ముండాకొడుకు కళ్ళ నుంచి ఏదీ తప్పించుకోలేదు అనుకున్నాడు.

'మనిషి తప్పనిసరిగా తినాలి' అన్నాడు రాక్షసుడు మర్యాదగా. 'ధననందుడి సంపదని నేను ఖర్చు చేయడం నీకు ఆనందంగా ఉందనుకుంటాను'.

'అలాగే దురదృష్టవంతులైన మగధ పౌరులది కూడా', అన్నాడు చాణక్యుడు, చివరి మాట తనదేనని రాక్షసుడిని సంతోషపడనీయకుండా. 'మిత్రమా రాక్షసా, నేనిక్కడికి నీచుట్టూ ఉన్న లేమిని గురించి చర్చించడానికి రాలేదు. ఒక ముఖ్య విషయం గురించి మాట్లాడాలని వచ్చాను – ధననందుడిని గద్దె దించడానికి నువ్వు ఏం చేస్తావు?'

'ఆచార్యా, నేను మీతో ఉన్నాను. నేను నిజంగా ప్రేమించిన ఒక్కగానొక్క స్త్రీని ఆ దుష్టుడు లాగేసుకున్నాడు' అన్నాడు తన కత్తి పట్టుకున్న అప్సరసను ఇటు తీసుకురా అన్నట్లుగా సైగ చేస్తూ. ఆ భరువైన కత్తిని పిడితో పట్టుకొని, నాటకీయంగా ప్రకటించాడు, 'చివరి వరకూ పోరాడతాను! మాలో ఒక్కరే – ధననందుడు లేదా నేను – బ్రతుకుతాం!'

చాణక్యుడు సకిలించాడు. 'ఓ వద్దు, ప్రియమైన రాక్షసా, కత్తితో యుద్ధం చేసేంతటి పిచ్చి పని చెయ్యమని నేననడం లేదు. నీ మృదువైన చేతులు, విలువైన ప్రాణం నేను పణంగా పెట్టలేను'.

'ఆచార్యా, నా శౌర్యాన్ని అనుమానిస్తున్నావా?' అడిగాడు రాక్షసుడు విసురుగా.

'స్నేహితుడా, మనం మాట్లాడే సాహసం ఏమిటి? నీకు భయముందని తెలుసుకొనడమే సాహసం! ఛఛ! నీ విలువ పథక రచన చేసే నీ మెదడులో ఉంది,

సాహసంలో లేదు. నాక్కావలసింది నీ మెదడు - నువ్వెలా చేస్తావనేది - నీ ప్రత్యేక నిపుణత, ముఖ్యంగా - నీకు తెలిసినవాళ్ళు!'

'నేను నీ సేవలో ఉన్నాను, ఆచార్యా, ధననందుడితో పోరాటానికి ఏ రకంగా సాయం చేయమన్నా చేస్తాను,' రాక్షసుడు డాంబికంగా అన్నాడు. 'లేదు, లేదు, రాక్షసా, ధననందుడితో పోరాటానికి నీసాయం నాకవసరం లేదు. పోరాటం లేకుండా గెలవడానికి నాకు నీసాయం కావాలి. నీకు బాగా తెలిసిన వ్యక్తి దగ్గర పరిష్కారం ఉంది. అతని పేరు భద్రశాలుడు'.

మగధలో రంగోపజీవి ప్రాంతంలో యమరోడ్డులో మూలన ఉన్న మదిరాలయం ప్రసిద్ధమైంది. మిగిలిన వాటిలా కాకుండా ఇక్కడ మద్యపానానికి పెద్ద చోటు, దానితో పాటు బాగా తాగేవారికోసం ప్రత్యేక గదులు ఉన్నాయి. ప్రతి గదిలోను సౌకర్యంగా ఉండే పరుపు, రోమనుల వలె విశ్రాంతిగా కూర్చోవడానికి గుండ్రని దిళ్ళు, చిన్న బల్లలు, విశాలమైన కిటికీలు, తాజాపూలు, పరిమళభరితమైన జలం ఉన్నాయి. చాలా అందమైన పరిచారికలు - గణికలు రకరకాల మద్యాలను వినియోగదారులకు అందిస్తూంటారు - బియ్యం, పిండి, చిక్కుడు, ద్రాక్ష, బెల్లం, మామిడి, తేనె, వెలగపండు, మిరియాలు, ఇతర సుగంధద్రవ్యాలు వేసి కాచి, మురగబెట్టిన మద్యం.

ఈ మద్యశాల నానుకునే జూదగృహం ఉంది. అది కూడా ఇంత లాభసాటిగానే నడుస్తుంది. ఇది పాచికలకు, ద్వంద్వయుద్ధాలకు ప్రసిద్ధి. ఆ ఇంటిని బాగా ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషి చూస్తుంటాడు. వచ్చేవాళ్ళు అందరూ అతను చెప్పిన నియమాలు పాటించాలి. సరైన పాచికలనే వాడాలి. అతను ఒక తప్పు చేశాడు. అందువల్ల జూదం, పందేల నియంత్రణాధికారి దగ్గర అతని లైసెన్సు పునస్సమీక్షలో ఉంది. ఇంక తప్పులు చేయడానికి కుదరదు. వచ్చిన లాభంలో సగటున అయిదుశాతం మగధ ప్రభుత్వానికి పన్ను కడతాడు. అనధికారికంగా ప్రభుత్వాధికారులు పీడించకుండా అదనంగా కొంత మొత్తం చెల్లిస్తాడు.

ఆరో నెంబరు బల్ల దగ్గరున్న పోషకుడంటే జూదగృహ యజమానికి ఇష్టం. పాచికలు వేస్తూ ఓడిపోతూ ఉన్నాడు కొన్ని గంటలుగా. ఎప్పుడూ ఇలాగే జరుగుతుంది. అతని అప్పులు బాగా పెరిగిపోతున్నాయి కాని, ఇంక అప్పు ఇవ్వడం కుదరదని జూదగృహ యజమాని చెప్పడానికి ధైర్యం చెయ్యలేకపోతున్నాడు.

రాత్రి పొద్దుపోయింది. పోషకుడు లేచి మద్యశాలపైన తన గదికి వెళ్ళి, తను మామూలుగా తాగుతూ, తన కోసం వేచి వుండే గణిక దగ్గరకు వెళ్ళే సమయం అయింది. అతనేమీ మామూలు మనిషి కాడు. అతను వేసుకున్న బట్టలు, పెట్టుకున్న ఆభరణాలు, నడవడి చూస్తే సామాన్యపౌరుడిలా అనిపించడం లేదు. మామూలు వాళ్ళకి తెలియని విషయమేమిటంటే, రాక్షసుడు మగధ నుంచి వెళ్లిపోయిన తర్వాత, అతనంతటి అధికారం కలిగిన వ్యక్తిగా అయ్యాడు. అతను మగధ సైన్యాధిపతి భద్రశాలుడు.

మద్యశాలకు వెళుతూ 'నా పద్దులో రాయి', అని మామూలుగా చెప్పాడతను జూదశాల యజమానికి. అతను గబగబా కాగితాలు తీసుకుని లెక్కగట్టి, ఎర్రబట్ట అట్ట వున్న బహీఖాథా – లెక్కల పుస్తకంలో రాశాడు. అప్పటికే అతని ఖాతా అంతా ఎర్ర ఇంకుతో రాసి ఉంది.

రోజూ మామూలుగా తానుండే గదిలో వేరెవరో ఉండడం చూసి భద్రశాలుడికి కోపం వచ్చింది. 'గణికా, నా గదిలో కొత్త మనిషి కూర్చున్నాడేమిటి?' అనడిగాడు భయపడుతున్న గణికని విసుగ్గా భద్రశాలుడు. 'నేనాయనను ఆపాలని ప్రయత్నించాను, ప్రభూ. కాని ఆయనకు మీరు తెలుసునట. ఆయన మీ అతిథిని అని చెప్పాడు' సమాధానమిచ్చింది గణిక. భద్రశాలుడికి మరింతగా కోపం వచ్చి విసురుగా గదిలోకి వెళ్ళాడు.

'నీ గదిని నాతో పంచుకో. లేకపోతే ఆధికారికంగా దివాలా తీసినందుకు చెరసాల గదిలో ఉండాల్సి వస్తుంది' చెప్పాడు జీవసిద్ధి – మగధలో చాణక్యుడి తరఫున పనిచేసే వ్యక్తి – భద్రశాలుడు లోపలికి వస్తుండగా శాంతంగా.

'ముందు నేను వెళ్ళగొట్టేలోగా బైటకి నడువు' హుంకరించాడు భద్రశాలుడు కోపంగా మొహమంతా కందిపోగా. 'నువ్వెవరో నాకు తెలియదు. తెలుసుకోవాలనీ లేదు నాకు'.

'భద్రశాలగారూ, శాంతించండి' అన్నాడు జీవసిద్ధి. 'మీ పాతమిత్రుడు రాక్షసుడు మీ సమస్యలు పరిష్కరించమని నన్నడిగాడు. మీ గురించి ఆందోళన చెందుతున్నాడాయన. అందుకని నన్ను సాయం చెయ్యమన్నాడు'.

'కాని రాక్షసుడు తక్షశిలలో ఉన్నాడు గదా. ఆయన నీకెలా చెప్పాడు?' భద్రశాలుడడిగాడు.

'ఆకాశం ద్వారా చూడగలిగే దూరదృష్టి ఉందనుకుందాం మాకు' అన్నాడు జీవసిద్ధి. పావురాల టపాను గుర్తుచేసుకుంటూ. అది ఈ రోజు ఉదయమే చాణక్యుడు, రాక్షసుడు పంపారు.

'రాక్షసుడెందుకు నాకు సాయం చేయాలనుకుంటున్నాడు? ఆ ధూర్తుడి గురించి నాకు బాగా తెలుసు, తనకేమీ ప్రయోజనం లేకుండా వాడేం చేయడు'.

'మీరు తనకు మిత్రుడిగా తనవైపు ఉండాలనుకుంటున్నాడు. ధననందుడి ఆస్థానానికి రావడానికి అతనికి సాయం చేసేవాళ్ళు ఉండాలిగా' జీవసిద్ధి వివరించాడు, భద్రశాలుడికి విషయం అర్థమైంది.

'అయితే నువ్వెవరు?' భద్రశాలుడు అనుమానంగా అడిగాడు. జీవసిద్ధి తన మద్యపాత్రని బల్లమీద పెట్టి, కావాలని పరుపు మీద కాళ్లు జాచుకుని, చాలా మామూలుగా, 'నేను నీ ఆర్థిక సమస్యలకు పరిష్కారాన్ని' అన్నాడు.

'ఎలా? నువ్వు చెప్పినట్టుగా నీకంతా తెలిస్తే నా జూదం అప్పులు కూడా నీకు తెలిసే ఉంటాయి'.

'మ్మ్. తెలుసు. నీ ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంది. బుద్ధి ఉన్నవాళ్ళెవరూ నీ వ్యక్తిగత ఆస్తుల, అప్పుల ఖాతాని చూస్తే నీకు అప్పు ఇవ్వరు', జీవసిద్ధి వేళాకోళం చేస్తున్నట్టుగా అన్నాడు.

'అయినా నా ఆర్థిక బాధలు అన్నీ పోగొట్టే పరిష్కారం నీ దగ్గరుంది అని చెప్పావుగా', భద్రశాలుడు వంకరగా అడిగాడు.

'ఎలా చెప్పగలిగావ్?' నాలుకతో వెక్కిరిస్తున్నట్టు అన్నాడు జీవసిద్ధి. 'నిజంగానే చెబుతున్నాను. విను. ఇది ప్రణాళిక. నేను కాంభోజ నుంచి వచ్చిన గుర్రాల వ్యాపారిని. పాటలీపుత్ర ద్వారాల దగ్గర కొన్ని వందల గుర్రాలున్నాయి. అశ్వికుడివి కదా, నీకు తెలిసే ఉంటుంది ఉత్తమజాతి గుర్రాలు సింధునది కవతల అశ్వకనుల దగ్గరుంటాయని'.

'వ్యాపారం గురించి చెప్పినందుకు కృతజ్ఞతలు' అన్నాడు. భద్రశాలుడు తిరస్కారంగా. కాని జీవసిద్ధి చెప్పేది వినడానికి సిద్ధంగా ఉన్నాడని అర్థమైంది అతని వాలకం చూస్తే.

'ఫరవాలేదు', అన్నాడు జీవసిద్ధి అతని వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా.

'నా దగ్గరున్న గుర్రాలు అంత ఉత్తమజాతివి కావు, మగధలో నా ఖాతాదార్లు అడిగేంత మంచి జాతివి కావు అది నేను చెప్పే విషయం'.

'నా కాలం ఎందుకు వ్యర్థం చేస్తున్నావు ఈ పనికిరాని వ్యాపారపు మాటలు చెప్పి?' నేనేమైనా గుర్రాలు పెంచేవాణ్ణా?' తిరస్కారంగా అన్నాడు భద్రశాలుడు.

'నాకు తెలుసు. నువ్వే గనక అలాంటి వాడివైయ్యుంటే ధనవంతుడిగా ఉండేవాడివి. దివాలా తీసేవాడివి కావు!' అన్నాడు జీవసిద్ధి మృదువుగా.

నేను చెప్పే ప్రణాళిక ప్రకారం నడుచుకుంటే మనిద్దరం బాగా ధనవంతుల మవుతాం. నీ అప్పులు పూర్తిగా తీరిపోతాయి. తరువాత కూడా నీ దగ్గర ఏడుతరాలకు సరిపడా డబ్బుంటుంది!'

'చెప్పు.... వింటున్నాను', చెప్పాడు భద్రశాలుడు.

తన దిప్పుడు పైచెయ్యి అయిందని జీవసిద్ధికి అర్థమైంది. 'మీ అశ్వికదళంలో వేలాది ఉత్తమజాతి అశ్వాలున్నాయి. వాటిని అమ్మేద్దామంటున్నాను' చెప్పాడు జీవసిద్ధి.

'నీకేమైనా మతిపోయిందా?' భద్రశాలుడరిచాడు. ఈ తెలివితక్కువ సలహాకు మళ్ళీ కోపం వచ్చి. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తుల్ని నేనమ్మెయ్యలేను పిచ్చిముండా కొడకా. గణాంకాధికారి ప్రతినెలా లెక్క చూస్తాడు. ఆ వెధవలు సైనిక శాలల్లో ఉన్న గుర్రాలను వచ్చి చూసి లెక్కేస్తారు. డబ్బు సంపాదించడానికి నువ్వేసిన చెత్తపథకమిదా? ఫో ముందిక్కడి నుంచి, బుద్ధిహీనుడా!'

'చెప్పేది వినవయ్యా బాబూ, వాళ్ళు లెక్కేసేది గుర్రాలు ఎన్ని ఉన్నాయనా? లేకపోతే ఉన్న గుర్రాల నాణ్యతని కూడా లెక్కేస్తారా?' జీవసిద్ధి అమాయకంగా అడిగాడు.

ఆ రాత్రి మొదటిసారిగా భద్రశాలుడు నవ్వాడు. 'వాటిని మార్చేయమంటున్నావా?' బుర్రలో దీపం వెలిగినట్టుగా అడిగాడు.

'మామూలు గుర్రాలను వందలకొద్దీ తెచ్చివ్వగలను. వాటిని 'అశ్విక దళంలోని ఉత్తమ జాతి గుర్రాలతో మార్చేయ్. నాకున్న వ్యాపార పరిచయాల ద్వారా ఉత్తమజాతి అశ్వాలను నేను అమ్మెయ్యగలను. లాభాన్ని ఇద్దరం పంచుకోవచ్చు' వివరించాడు జీవసిద్ధి తన ప్రయోజనం దెబ్బతినకుండా.

'లాభాలు మనమెలా పంచుకుందాం?' అడిగాడు భద్రశాలుడు.

'డెబ్బయి – ముప్ఫయి. ఎక్కువ పనిచేసేది నేను', అన్నాడు జీవసిద్ధి. బాగా గీచి గీచి బేరమాడమని చాణక్యుడు చెప్పాడు. లేకపోతే భద్రశాలుడికి అనుమానమొస్తుందని.

'ఫో పోవయ్యా! నా ఉత్తమ జాతి అశ్వాలు లేకుండా నీకు వ్యాపారమే లేదు. నాకు యాభై కావాలి, అంతకి తక్కువ కుదరదు!' భద్రశాలుడు వాదానికి దిగాడు, అక్రమ వ్యాపారం ద్వారా ఎంత సంపాదించగలడో మనసులో లెక్కలు వేసుకుంటూ.

'అరవై – నలభై' జీవసిద్ధి బేరమాడాడు. అంతకంటె ఎక్కువంటే నాకేం మిగలదు. ఇష్టమైతే ఒప్పుకో. లేకపోతే లేదు.'

'సరే' అన్నాడు భద్రశాలుడు నీరసంగా.

'మార్చడానికి నీకు ఎన్ని గుర్రాలు పంపాలి?' అడిగాడు జీవసిద్ధి.

'మార్చడానికి నీదగ్గరెన్ని అందుబాటులో ఉన్నాయి?' నవ్వుతూ అడిగాడు భద్రశాలుడు తన కొత్త వ్యాపార భాగస్వామిని చూస్తూ.

'మగధను మనం పొందడానికి సాయం చేసే శక్తి పురుషోత్తముడే. తరువాత అతను బరువవుతాడు అదే సమస్య', చెప్పాడు సింహరణ్‌తో చాణక్యుడు. వాళ్ళిద్దరూ కేకయ రాజప్రాసాదంలో వాళ్ళ గదిలో కూర్చుని ఉన్నారు. 'వ్యాధిని నిర్మూలం చేసే ఔషధం అతనే. కాని కొత్త వ్యాధికి కారణమవుతాడు!'

సింహరణ్ అన్నాడు. 'ఆచార్యా, సందేశకులు శుభవార్త తెచ్చారు. అలెగ్జాండరు చనిపోవడం, ఫిలిప్పోస్ చంపబడడం వల్ల చంద్రగుప్తుడికి, శశిగుప్తుడికి లాభించింది. అశ్వకనులను జయించిన తర్వాత, సింధుపై దాడి చేశారు. క్షుద్రక, సైంధవ రాజ్యాల అశ్వికులు వారితో కలిశారు. సింధుని పూర్తిగా జయించేశారు. అదే సమయంలో ఆలోర్, సైంధవవన, మహోఊర్థ, బ్రహ్మస్థల, పాటల సేనలు మాసిడోనియా వాళ్ళకు వ్యతిరేకంగా తిరగబడడానికి, చంద్రగుప్తుడి సార్వభౌమత్వాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాయి. మీ సూచనల ప్రకారం చంద్రగుప్తుడికి సింహపుర రాజుగా పట్టాభిషేకం జరిగింది. పదివేలమంది జాట్ సైనికులున్నారతనికి – బలమైన, ఉగ్రమైన యోధులు – అతని ఆధీనంలో ఉన్నారు. అదనంగా శశిగుప్తుడి సైన్యం, నా మాళవరాజ్య సైన్యం, మనం శిక్షణ ఇచ్చిన కిరాయి సైనికులున్నారు. నిజంగా మనకి పురుషోత్తముడి సాయం అవసరమా?'

'కావాలి, సింహరణ్, పురుషోత్తముడి దగ్గర మూడువందల ఏనుగులు, అయిదు వందల రథాలు, పదివేల గుర్రాలు, ఏభై వేల పదాతిదళం ఉంది. ఇదికాక మాసిడోనియా, శక, కిరాత, కాంభోజ, పారశీక, బాహ్లిక, అశ్వకనుల కిరాయి సైనికులు డెబ్బయి వేల మంది ఉన్నారు. అతన్ని నిర్లక్ష్యం చేయలేం. ప్రపంచంలోనే శక్తివంతమైన సైన్యం మగధది. అలెగ్జాండరే యుద్ధం చెయ్యడానికి వెనుకాడిన సైన్యమది. పురుషోత్తముడు లేకుండా విజయం అసాధ్యం', అన్నాడు చాణక్యుడు ఆలోచిస్తూ.

'మగధను జయించిన తర్వాత దానిని తీసుకోకుండా పురుషోత్తముడిని ఆపగలిగే దేమిటి?' అడిగాడు సింహరణ్. చాణక్యుడి ఆలోచనలనే ప్రతిబింబింపచేస్తూ. 'యుద్ధం చేసి, గెలిచిన దాన్ని ఎందుకు వదులుకుంటాడు?'

'పురుషోత్తముడిని నిలువరించడానికి ఒకే ఒక మార్గం ఉంది. మగధ చక్రవర్తి కావడానికి మరో బలమైన పోటీదారుని మనం సృష్టిద్దాం. అప్పుడు చంద్రగుప్తుడు మధ్యేమార్గ అభ్యర్థిగా వస్తాడు', అన్నాడు చాణక్యుడు నిపుణంగా.

'ఆ పోటీదారుడెవరు?' ఆలోచిస్తూ అన్నాడు సింహరణ్.

'అరవై ఏళ్ళుగా కళింగ రాజ్యం మగధకు సామంతరాజ్యంగా ఉంది. మహానంది వాళ్ళని జయించి అణచి ఉంచాడు. అప్పటి నుంచి మగధకు వందల వేల బంగారు పణాలను ప్రతి ఏటా యుద్ధ పరిహారంగా చెల్లిస్తున్నారు. రాజు, అతని ప్రజలు మగధకు పాఠం చెప్పే అవకాశం వదలుకోరు', చాణక్యుడు మృదువుగా సూచించాడు.

'అంటే కళింగ రాజుకు మగధ సింహాసనాన్ని ఎరవేస్తారా?' అడిగాడు సింహరణ్.

'లేదు. అంత పెద్ద అబద్ధం ఎందుకు? చిన్నమాటతో పని జరిగిపోతే? ధననందుడిని గద్దె దించితే, అరవై ఏళ్ళుగా ఉన్న అన్యాయమైన యుద్ధ ఒడంబడిక నుంచి కళింగ విముక్తమవుతుందని చెబుతాను. అంతకుమించిగాని, అంతకు తక్కువగాని అనను. తర్వాత దురాశ, అత్యాశలు వాటి పని అవి చేస్తాయి!'

'మనకో సమస్య వచ్చింది' చెప్పాడు జీవసిద్ధి.

'ఇప్పుడేమిటి?' భద్రశాలుడడిగాడు చిరాగ్గా, పానపాత్రలోని మద్యం తాగేసి మూతి తుడుచుకుంటూ.

రెండు వేలకు పైగా గుర్రాలను రహస్యంగా మార్చేశారు. జీవసిద్ధి అతనికి నాసిరకం, దేశవాళి గుర్రాలను పంపుతాడు; అర్థరాత్రి వేళ మగధ అశ్విక దళంలోని ఉత్తమ జాతి అశ్వాలను అమ్మకానికి ఏర్పాటు చేస్తాడు. ఈ ఏర్పాటు వల్ల భద్రశాలుడి అప్పులు తీరిపోయాయి. ఇప్పుడతను మగధ జూదగృహాలు, మద్యశాలల్లో ఆహ్వానితుడైన పోషకుడు.

'నీకు నేనిచ్చిన సగం గుర్రాలకు వీపుల మీద చిన్న పచ్చబొట్టులున్నాయి. గుర్రం మీద జీను కప్పి ఉండడంతో నేను అవి గమనించలేకపోయాను', చెప్పాడు జీవసిద్ధి.

'ఎలాంటి పచ్చబొట్టు?' భద్రశాలుడు భయంగా అడిగాడు.

'రాచముద్ర – చాలా చిన్నది, చంద్రగుప్త మౌర్యుడిది', చెప్పాడు జీవసిద్ధి.

'ముండనాయాలా! నీ బీర్జాలు కోస్తాను', భద్రశాలుడు బుసకొట్టాడు. 'మగధ అశ్వికదళంలో చంద్రగుప్త మౌర్యుడి గుర్రాలున్నాయని తెలిస్తే నన్నేం చేస్తారో తెలుసా?'

'నిన్ను ఉరితీస్తారా?' జీవసిద్ధి అడిగాడు రెట్టిస్తున్నట్లుగా.

'నాకేమైనా అయితే, నాతో పాటు నీకూ అవుతుంది!' వెంటనే అన్నాడు భద్రశాలుడు.

'భద్రశాలగారూ, మీ ఇబ్బంది నాకు అర్థమైంది. నిజంగానే అర్థమైంది. ఈ రహస్యం మనిద్దరి మధ్యే ఉంటుంది. మిమ్మల్ని ఇబ్బందిలో పెట్టేదేదీ నేను చేయను', హామీ ఇచ్చాడు జీవసిద్ధి, 'అయితే అప్పుడప్పుడు నేనడిగే చిన్న చిన్న అవసరాలు తీర్చాలి మీరు'.

అతని కడుపులో రగులుతూంది! రాక్షసుడు పారిపోయాడు. ఆ లంజాకొడుకులు చాణక్యుడు, చంద్రగుప్తుడు స్వేచ్ఛగా భారతదేశమంతా తిరుగుతూ ఎదురులేని ధననందుడిని గద్దె దింపడానికి తిరుగుబాటు లేవదీయాలని చూస్తున్నారు.

అజేయుడైన ధననందుడు సింహాసనంపైన ఇబ్బందిగా కదిలాడు. ప్రాసాదంలోని వంటమనిషి సరిగా వండడం లేదు, అజీర్ణంతో పొట్టంతా ఉబ్బరంగా ఉంది. బలశాలి ధననందుడికి చెత్త వండి పెట్టినందుకు వంటవాడిని ఉరితీయాలి – ఆ సభలో అతని మంత్రిమండలి కూర్చుని ఉంది. తందానగాళ్ళు. నన్ను చూసి భయపడేవాళ్ళు కావాలి, అనుకున్నాడు ధననందుడు. దీనివల్ల విప్లవాలు, తిరుగుబాట్లు అస్సలు లేవు. షక్తర్

ఉన్నప్పటి పరిస్థితిని తలుచుకున్నాడు. అప్పుడప్పుడు రాజుకు తప్పొప్పులు చెప్పడం తన విధి అనుకునే ప్రధానమంత్రి. తరువాత రాక్షసుడు – ఇష్టుడైన తార్పుడుగాడు. ఆహా! వాడు తక్షశిలకు పారిపోయినా ఆ వెధవ లేని లోటు కనిపిస్తోంది. ధననందుడి రాత్రులన్నీ నిషేధిత ఆనందాలు జుర్రుకొనే విధంగా, ప్రతిరాత్రినీ మరింత విశిష్టంగా చేసేవాడు. సువాసినిని పొందడం ప్రయోజన శూన్యం. మరొకరి దగ్గరున్నపుడే కోరిక పుట్టించే ఆడాళ్ళ కోవలోది ఆమె. ఒకసారి పొందగానే విలువ కోల్పోతారు ఆడాళ్ళు. ఎంత వింత కదా అనుకున్నాడు ధననందుడు. ఒక బుద్ధిలేని ఈగ అతని తల చుట్టూ తిరుగుతూ ఉంది. అతని వెనకాల విసురుతూ నిలబడ్డ పరిచారిక దానిని తోలేసింది.

'మగధకు తగిన విధంగా రక్షణ కల్పించారా?' అడిగాడు ధననందుడు.

గౌరవనీయుడైన కాత్యాయనుడు లేచాడు. 'ప్రభూ, మనకి రక్షణ ఉందా లేదా అన్నది ప్రశ్న కాదు. మన శత్రువులు మగధకు రక్షణ ఉంది అనుకొనేలా చేయగలమా అనేది అడగాల్సిన ప్రశ్న'.

ధననందుడు వచ్చే నవ్వునాపుకున్నాడు. ఈ చెత్తమేధావులని ఎందుకు భరించాలి? 'కాత్యాయనగారూ, నేను సైన్యాధిపతి భద్రశాలుడిని ప్రశ్నించాను. ఈ ప్రశ్నకు అతను సమాధానం చెబితే బాగుంటుందనుకుంటాను'. కాత్యాయన కూర్చుంటూ ఉండగా, భద్రశాలుడు ఒకసారి చుట్టూ నీరసంగా చూశాడు. ఈ మంత్రి మండలి సమావేశాలు అతనికస్సలు ఇష్టం ఉండదు. మిగిలిన మంత్రులందరూ తనని శల్యపరీక్ష చేస్తున్నట్టుగా ఉంటుంది అతనికి. మరీ కాత్యాయనుడు తనని జీవశాస్త్ర ప్రయోగానికి పెట్టిన నమూనాని చూసినట్టు చాలాసేపు చూస్తాడు.

'ప్రభూ, మన సైన్యం పూర్తిగా అప్రమత్తంగా ఉంది. అయితే మన సైన్యం పాటలీపుత్రం కోటలోనే ఉండాలని నా సూచన. శత్రువులు దాడి చేసినపుడు, వాళ్ళని కోటలోకి రప్పించి, చంపుదాం. మన దగ్గరున్న బలగం ఎక్కువ కాబట్టి ఇది చాలా సులభం'.

'ఇంద్రప్రస్థాన్ని, సరిహద్దు పట్టణాలని రక్షణ లేకుండా వదిలేద్దామా?' నమ్మలేనట్లుగా అడిగాడు ధననందుడు. భద్రశాలుడు గుటకలు మింగాడు ఇబ్బందిగా. చెత్త నాకొడుకు జీవసిద్ధికి తనెందుకింత లోకువైపోయి ఈ సమావేశాల్లో వాడేం చెప్పమంటే అది చెప్పే స్థితికి చేరుకున్నాడు? తాగడం జూదమాడడం చేశాడు ఎందుకని? అనుకున్నాడు.

'భద్రశాలుడు చెప్పినది బాగుంది' అన్నాడు కాత్యాయనుడు, భద్రశాలుడు నుదుటి చెమట నేలమీద రాలుతండగా లేచి. కాత్యాయనుడికి తెలుసు భద్రశాలుడు చెప్పిన మాటలు చాణక్యుడివని. భద్రశాలుడు ఆశ్చర్యచకితుడయ్యాడు కాత్యాయన తన మాటలు సమర్థించడం చూసి. 'మహారాజా, కోశాగారం పాటలీపుత్ర కోట లోపల ఉంది. ఇంద్రప్రస్థాన్ని, మిగిలిన సరిహద్దు నగరాలని రక్షించడం వల్ల ఉపయోగమేంటి? ధనాగారం ఇక్కడే ఉంటే. అంతేకాకుండా మనల్ని వివిధ దిక్కుల నుంచి ముట్టడించే అవకాశం ఉంది. పురుషోత్తముడు పడమర నుంచి, కళింగరాజు దక్షిణం నుంచి, నేపాలరాజు ఉత్తరం నుంచి దాడి చేయవచ్చు. ఎన్ని యుద్ధరంగాల కోసం సైన్యాన్ని విభజిస్తాం? భద్రశాలుడు మంచివ్యూహమే చెప్పాడనిపిస్తోంది. శత్రువుని మాయజేసి మగధలో ప్రవేశించనిద్దాం. పాటలీపుత్రానికి రాగానే చిత్తుచేద్దాం'.

ధననందుడు కాత్యాయనుడిని చూశాడు. ఆందోళన తగ్గినట్టున్న భద్రశాలుడిపై దృష్టి నిలిపాడు. తర్వాత ఫక్కున నవ్వాడు. 'నేను బుద్ధిహీనులని సంతోషంగా భరిస్తాను. మేధావులని చంకనెక్కించుకుంటాను. బలశాలి ధననందుడు డాంబికంగా తన సలహాదార్ల సలహాలు పాటించలేదని ఎవరూ అనుకోకూడదు. మీరు చెప్పినట్టే చేద్దాం- శత్రువు కోసం ఇక్కడే ఎదురుచూద్దాం!'

'పురుషోత్తముడు మగధపై దండెత్తుతున్నాడని అంభికి తెలుసు' అన్నాడు మిహిరుడు, పురుషోత్తముడి దృష్టి మళ్ళింది కనుక. పురుషోత్తముడి రాజ్యం కేకయను ముట్టడించడానికి ఇదే అవకాశంగా భావిస్తున్నాడు. మనం అలా చేయకుండా ఆపగలమా?'

'అంభి ఈ విషయంపై శ్రద్ధపెట్టే అవకాశం ఇవ్వకూడదు. తన సరిహద్దులను దాటి ఆలోచించకుండా చూడాలి', సలహా ఇచ్చాడు చాణక్యుడు.

'ఎలా?'

'అంతర్గత అలజడులు సృష్టించాలి. శాంతి భద్రతలు కాపాడడంలో తీరిక లేకుండా చేయాలి'.

'చేయడం కన్న చెప్పడం సులువు. ప్రజలు సుఖంగా ఉన్నారు. వాళ్ళు దేనికి తిరగబడతారు?'

'వాళ్ళకి సంతోషం లేకుండా చెయ్యండి. ఆలోచించు మిహిర్, గాంధార రాజ్యంలో శక్తిమంతమైన కులం ఏది?'

'బ్రాహ్మణులు'

'వాళ్ళ శక్తికి మూలమైనదేమిటి?'

'దైవానుమతి. వేదాల్లో ఉంది. సామాన్యుల తరఫున వాళ్ళు దేవునితో మాట్లాడాల్సి ఉంది'.

'బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని అందరూ అంగీకరిస్తారా?'

'లేదు. బ్రాహ్మణులు చేసే పూజలన్నీ కంటితుడుపు చర్యలని బౌద్ధులనుకుంటారు'

'అయితే, అంభి బౌద్ధులను ప్రోత్సహించి పెంచుతున్నట్లుగా కనిపిస్తే ఏమవుతుంది?'

'బ్రాహ్మణులు తిరగబడతారు!'

'అప్పుడు కూడా రాజ్యంలో సంతోషంగా, తృప్తిగా ఉండే ప్రజలుంటారా, నాయనా మిహిర్?

మిహిర్ ఓడినట్లుగా చిరునవ్వు నవ్వాడు. 'కాని తన రాజ్యంలో బౌద్ధమతాన్ని ప్రోత్సహించేలా అంభిని ఎలా పురిగొల్ప గలన్నేను?'

"సమాధానం తక్షశిల విశ్వవిద్యాలయంలో ఉంది. ఇక్కడ నాలాంటి బ్రాహ్మణుల సామ్రాజ్యం ఉంది. విశ్వవిద్యాలయంలో కొంతభాగాన్ని బౌద్ధ అధ్యయన కేంద్రంగా మారిస్తే బ్రాహ్మణులు తమకి ఆపద వస్తున్నట్లుగా భయపడతారు.'

'కాని అంభి తన సొంత డబ్బుని బౌద్ధం కోసం ఖర్చుపెట్టడు'.

'నేనొప్పుకుంటాను. ఈ పథకం కోసం అంభి తన సమయాన్ని, ధనాన్ని ఖర్చు చేయకుండా, అంభికి పేరు మాత్రం వచ్చేలా మనం రూపొందించాలి'.

'కాని, ఆచార్యా, ఆర్థిక సాయం చేసేవాళ్ళు దొరికినా, మత విభేదాలు ఉపయోగించుకొనడం తెలివైన పనా?'

'చంద్రగుప్తుడి నేతృత్వంలో భారత్‌ని ఏకీకరించాలని నా ధర్మం నాకు చెబుతోంది. ఏకీకరణకు నేను మత విభేదాలు సృష్టించవలసి వస్తే అలాగే కానీ. ఏ మార్గాన్ని అనుసరించినా లక్ష్యం సాధన ముఖ్యం'.

'ఇది మీ అంతరాత్మకు విరుద్ధం కాదా?' మిహిర్ అడిగాడు.

'మిహిర్, స్వచ్ఛమైన అంతరాత్మ సాధారణంగా పాడైపోయిన జ్ఞాపకశక్తికి చిహ్నం. ఏమైనా గాని, రాజకీయ ప్రపంచంలో స్వచ్ఛమైన అంతరాత్మ వంటివి మనం భరించలేని విలాసాలు!'

'ఆచార్యా, మీరు బ్రాహ్మణులైయ్యుండీ, ఆ కులానికి విపత్కర పరిణామాలు కలిగించే వ్యూహాన్ని పాటించమని సలహా ఇస్తున్నారా?'

'నా కులం భారతదేశమొక్కటే. నేనింక ఏ కులానికీ చెందను. నేను విధేయంగా ఉండే భావన ఏకీకృత భారతదేశం'.

'మీరే పక్షం?'

'గెలిచే పక్షం'. సమాధానమిచ్చాడు చాణక్యుడు.

'చంద్రగుప్తుడు, శశిగుప్తుడు కలిసి అంభి మీద దండెత్తేలా చేయొచ్చుకదా మనం?' సందిగ్ధంలో ఉన్న మిహిర్ వదల్లేదు.

'మన పొరుగున ఉన్న చైనావాళ్ళు బాగా ఘోరమైన నేరాలకు పాల్పడినవాళ్ళని ఉరితీసే పద్ధతి ఒకటుంది. ఆ పద్ధతిని వెయ్యిసార్లు కోసి చంపడం అంటారు. శిక్షించే వ్యక్తి శరీర భాగాలను చాలా చోట్ల కత్తితో కోస్తారు. నేరం చేసిన వ్యక్తి రక్తం అంతా కారి చస్తాడు. అంభిని కూడా రక్తం మొత్తం కారిపోయి చచ్చేలా చేయాలనుకుంటున్నాను.'

'ఎందుకు?' మిహిర్ అడిగాడు.

'నేరుగా దాడి చేయడం మంచిపని కాదు. మనం స్నేహితులం కాకపోయినా, పైకి స్నేహితులమన్నట్లుగా నటించాలి. తన వెనుక మనముండడానికి అతను సంకోచించకుండా ఉండాలి'.

'ఆచార్యా, ఎందుకు?'

'ఎందుకంటే ఎవరికైనా వెనక ఉంటేనే కదా వెన్నులో పొడవగలం. అందుకే మిహిర్!'

తక్షశిల బయట ఉన్న అడవులలో ఉన్న సంఘారామం, *బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి* అనే మంత్రోచ్చాటన మినహా నిశ్శబ్దంగా

ఉంది. గడ్డి కప్పిన గుడిసెలు నిరాడంబరంగా ఉన్నాయి. వాటి చుట్టూ చాలా శుభ్రంగా ఉంది. సంఘారామం నిరాడంబరంగా, శుభ్రంగా నిశ్శబ్దంగా ఉంది. వందమంది బౌద్ధ భిక్షువులు, భిక్షుణులు ఒకే వరుసలో నడుస్తున్నారు. వారి గుండ్లు ఎండలో చెమటతో తడుస్తున్నాయి. భిక్షువులు, భిక్షుణులు వేర్వేరుగా ఉన్నారు. మామూలుగా అంతరవాసకాన్ని (స్కర్టు), ఉత్తరసంగాన్ని (షర్టు), సంఘుతిని (పై నుంచి కిందికి వేలాడే వస్త్రం), కుశలకాన్ని కలిపికుట్టిన బట్టలు ముదురు ఎరుపురంగులోవి వేసుకుని ఉన్నారు. అరిగిపోయిన పావుకోళ్ళు ధరించి ఉన్నారు. ఒక్కొక్కరి దగ్గర ఉన్న వస్తువులు- భిక్షాపాత్ర, కత్తి, పళ్ళుతోమే పుల్ల, సూది, చేతికర్ర, వాళ్ళు నడుస్తూ 'బుద్ధుణ్ణి శరణు వేడుతున్నాను, ధర్మాన్ని శరణు వేడుతున్నాను, సంఘాన్ని శరణు వేడుతున్నాను'.

హిందూమతం కింది కులాల వారిని తక్కువగా చూస్తూ, బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ అనవసరమైన ప్రాధాన్యతనిస్తూ సమాజంలోని అట్టడుగు కులాల వారిని హింసిస్తూ ఉంది. వీళ్ళే సార్వత్రిక సమానత్వాన్ని బోధించిన బౌద్ధమతంలోనికి ముందుగా మారినవారు.

చెట్టుపైన కూర్చుని చూస్తున్న వ్యక్తి చేతులు లేని చొక్కా, తలపైన తలపాగా, ముఖానికి, చెవులకి ముసుగు వేసుకున్నాడు. నడుముకి ఒక పక్క కొడవలి, ఒక పక్క గొడ్డలి వేలాడుతున్నాయి. ఎడమ భుజంపై పెద్ద వస్త్రాన్ని వేలాడదీసుకున్నాడు. బంగారు చెవి కమ్మలు, రాగిలో తక్కువ విలువైన రత్నాలు పొదిగిన దండకడియాలు బాజు బంధులు మాత్రం ధరించాడు. నుదుటి మీద మూడో నేత్రంలా సింధూరపు తిలకం ఉంది. అతనికి అదృష్టం తెచ్చేదది. క్షత్రియుడిలా యుద్ధానికి వెళుతున్నట్లు వేషం వేసుకున్నాడు కాని నిజానికి అతను బ్రాహ్మణ బందిపోటు దొంగ. అతనితో మరో ఏభై మంది బందిపోటులున్నారు. సంఘారామాన్ని చుట్టుముట్టి గమనిస్తున్నారు అందరూ. బందిపోటు నాయకుడు కోపంగా ఉన్నాడు. ఈ చిల్లర నాయాళ్లు - బౌద్ధులు- హిందూ అస్పృశ్యులని మతం మార్చేసి తమలో కలుపుకుంటున్నారు, దైవారాధనకి బ్రాహ్మణులు చెప్పే క్రతువులు ఆచరించ నవసరం లేదని సామాన్యులకి బోధిస్తున్నారు. పవిత్రమైన సంస్కృతంలో కాకుండా ప్రాకృతంలో తమ ధర్మశాస్త్రాలను రాయడానికి తెగించారు. వాళ్ళకి ఎంత ధైర్యం లేకుంటే కుహనా సమానత్వాన్ని బోధించే కొత్త మతంలోకి హిందువులను మారుస్తారు! వాళ్ళకి ఇప్పుడు పవిత్రమైన తక్షశిల విశ్వవిద్యాలయంలో కూడా హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయి. వాళ్ళకి పాఠం చెప్పాలి. అప్పుడే వాళ్ళు తోకముడుచుకుని పారిపోతారు. కుక్కల్లా పరిగెడతారు! పర్షియను తెల్లతోలు మిహిర్ బందిపోట్ల దాడికి అయ్యే ఖర్చంతా

పెడతానన‌డం కొంత సాయపడింది. తన కింద కొమ్మ మీదకూర్చున్న అనుచరుడిని చూసి నిశ్శబ్దంగా తలూపాడు. ఆకాశం నల్లగా అయింది. హత్యాకాండ మొదలవడంతో మాంసం కోసం పక్షులు పైన తిరగ సాగాయి.

≡⊃⊂≡

అంభి రగిలిపోతున్నాడు. వాళ్ళకెంత ధైర్యం? ఎవడిష్టమొచ్చినట్టు వాడు చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే చట్టం సంగతేంటి? బౌద్ధ సన్యాసులను చంపి తప్పించుకుపోవచ్చని ఈ బ్రాహ్మణ బందిపోట్లు అనుకున్నారా? తమ రాజులోని కర్కశకోణాన్ని వాళ్ళిప్పుడు చూస్తారు!

అతని ఆజ్ఞపై దుర్మార్గంగా హత్యాకాండ జరిపిన బందిపోటులను అతని ప్రదేష్ట – శాంతి భద్రతల న్యాయమూర్తి పట్టుకున్నాడు. ఇది శిక్షించడానికి కాదు, ప్రతిఫలం అనుభవింపజేయడానికి. నరహంతకులు రక్తదాహం తీర్చుకొనడానికి వందమంది అమాయక బౌద్ధులను నరికి చంపారు. వాళ్ళని శిక్షించకుండా న్యాయమెలా చేయగలడు?

'విచక్షణ వీధిలో వారిని నగ్నంగా నిలబెట్టండి. ఒక మనిషిని ఎంత హీనంగా చూడగలమో అంతహీనంగా చూడమనండి అందరినీ. బాగా కాల్చిన ఇనుపమేకుని వాళ్ళ నాలుకలపై కొట్టండి. కుడి చేతిని సలసలకాగే నూనెలో ముంచండి. వేడి మైనాన్ని ఎడమ కంటిలో పోయండి. ఎడమకాలి బొటన వేళ్ళు కోసెయ్యండి. ఇలా చేసిన వాళ్ళ ముఖాలకు నల్లరంగు పూసి, గాడిదల మీద కూర్చోబెట్టి వీధుల్లో తిప్పండి అవమానంతో చచ్చేలా! చనిపోయిన బౌద్ధ సన్యాసులలా కాకుండా వాళ్ళు బ్రతుకుతారు కాని సజీవనరకాన్ని అనుభవిస్తారు వాళ్ళు!' విసుగ్గా ఉన్న అంభి ఆదేశించాడు. తానొక అగ్నిపర్వతం మీద కూర్చున్నానని అతనికి తెలియదు.

≡⊃⊂≡

'తన రాజ్యంలోని బ్రాహ్మణులని బాగా ఆదరంగా చూడమని చంద్రగుప్తుడికి చెప్పు. బ్రాహ్మణ కులానికి గొప్ప రక్షకుడిగా అతను కనిపించాలి', సిద్ధార్థకుడి పావురాలలో ఒకదాన్ని పంపుతూ సూచించాడు చాణక్యుడు.

'గురువర్యా, అమాయకులైన వాళ్ళని చంపిన బ్రాహ్మణ బందిపోట్లను అంభి శిక్షించడం న్యాయం కాదా?' సిద్ధార్థకుడు నిష్కపటంగా అడిగాడు.

'మంచు తుఫాను వచ్చినప్పుడు ప్రతి మంచుముక్క తన తప్పులేదంటుంది, సిద్ధార్థకా. ఏ మంచుముక్కని నువ్వు శిక్షిస్తావు?' కళ్ళు చిన్నవి చేస్తూ అడిగాడు చాణక్యుడు.

'మత రక్షకుడిగా చంద్రగుప్తుడు కనిపించవలసిన సమయమిది'.

అసహనంగా రెక్కలు కొట్టుకుంటున్న ఆ తెల్ల పావురానికి కట్టిన లేఖలో బ్రాహ్మణ ప్రయోజనాన్ని కాపాడేవాడుగా, రక్షకుడిగా, ఆపదల నుంచి కాపాడేవాడుగా, బ్రాహ్మణ జీవిత విధానాన్ని కాపాడేవాడుగా ఎలా ఉండాలో ఉంది. చంద్రగుప్తుడు వెయ్యిమంది బ్రాహ్మణులతో మహా యజ్ఞాన్ని చేయించాలి. వేదంలో చెప్పిన విధంగా వెన్న, పాలు, ధాన్యాలు, తేనె, సోమరసం వంటి విలువైన పదార్థాలను పవిత్రమైన అగ్నికి ఆహుతి చెయ్యాలి. తర్వాత ధర్మశాస్త్రాలను చర్చించడానికి గొప్ప బ్రాహ్మణ మండలిని నిర్వహించాలి. దానిలో పాల్గొన్న వారందరికీ ప్రవేశ బహుమతి ఇవ్వాలి. తర్వాత వెయ్యి మంది బ్రాహ్మణులకు విందు ఇవ్వాలి. ప్రతి బ్రాహ్మణుడికి బంగారు నాణేలు, వస్త్రాలు, ధాన్యం, ఆవును దానం చెయ్యాలి.

'చంద్రగుప్తుడు ఈ యజ్ఞాలు చెయ్యకుండా అంభిమీద దండెత్తి ఒక్కసారే చంపెయ్యవచ్చుగా?' సిద్ధార్థకుడడిగాడు.

'అలా వద్దు. అలా శశిగుప్తుడితో చేయిస్తాను', సమాధానమిచ్చాడు చాణక్యుడు.

'శశిగుప్తుడు గాంధారని తానే తీసుకుంటానంటాడేమో? అతను కూడా చంద్రగుప్తుడిలా శక్తిమంతుడే కదా. చంద్రగుప్తుడిప్పుడు, సింహపురరాజు. మాళవరాజ్యాన్ని సింహగుప్తుడి ద్వారా నియంత్రిస్తున్నాడు, క్షుద్రక, సైంధవ, ఆలోర్, బ్రహ్మస్థల, పాటల మహాఊర్ధలపై నియంత్రణ ఉంది – కాని శశిగుప్తుడు అశ్వకనులను, సింధుప్రాంతాన్ని పాలిస్తున్నాడు పెద్దవి, వ్యూహపరంగా చూసినా ముఖ్యరాజ్యాలు', అన్నాడు సిద్ధార్థకుడు.

'అతను ఖచ్చితంగా గాంధారను జయిస్తాడు. అతనలా చేయాలనే నా కోరిక. అతనలా చేస్తుండగా, చంద్రగుప్తుడు బ్రాహ్మణులను, వారి దేవుళ్ళను ప్రార్థించాలని నేను భావిస్తున్నాను!' చెప్పాడు చాణక్యుడు.

'ఎందుకు?' ఆశ్చర్యంగా అడిగాడు సిద్ధార్థకుడు.

'త్వరగా లేచిన పక్షికి ఆహారం దొరుకుతుంది కాని రెండో దానికే వెన్న లభిస్తుంది' అన్నాడు చాణక్యుడు గూఢంగా.

'మీకు తెలుసా అంభి గాంధారలో వెయ్యిమంది బ్రాహ్మణులను గొంతుకోసి చంపాడంట? 'స్థానిక మంగలి అడిగాడు. అతని పోషకుడు కంసాలి అతనివైపు చూశాడు. కంసాలి మీసాన్ని సరిచేయడంలో నిమగ్నమయ్యాడు మంగలి. మీసం పని పూర్తయ్యేవరకు ఆగి కంసాలి అన్నాడు.

'అంతే కాదు, శశిగుప్తుడు అశ్వకనులకు, సింధుకు మహారాజు. గాంధారపై దండెత్తి బ్రాహ్మణులకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకుంటాడని కూడా విన్నాను'.

'హా!' వేచి వున్న వ్యక్తి అన్నాడు. కంసాలికి, మంగలికి అతనెవరో తెలియదు. ఈ ప్రాంతాలకి కొత్తవాడిలా అనిపించాడు.

'మీరెవరు? మా వ్యక్తిగత సంభాషణలో కల్పించుకుని ఏం మాట్లాడాలనుకుంటున్నారు?' మంగలి అడిగాడు. కొత్త మనిషి త్రేన్చాడు, అప్పుడే తీపి, పులుపు కలిసిన యాపిల్ తిన్నదానికి గుర్తుగా.

'నాపేరు తున్నవయ, సింధులో దర్జీని. ఇక్కడికి నేను కుట్టిన బట్టలు అమ్మడానికి వచ్చాను. మీరు గొప్పవాడని చెప్పే శశిగుప్తుడు నాకు తెలుసు. శశిగుప్తుడు గొడ్డు మాంసం తింటాడని తెలుసా మీకు?'

'పవిత్రమైన ఆవుమాంసం తింటాడా?' అడిగాడు కంసాలి నిందాత్మకంగా. 'అటువంటివాడు బ్రాహ్మణులకు ఏం మేలు చేస్తాడు?

'తక్షశిల పక్కనే బౌద్ధ విశ్వవిద్యాలయం పెట్టడానికి అంభి వేలాది బంగారు నాణేలు విరాళమిచ్చాడు. ఇప్పుడున్న బ్రాహ్మణ పాఠశాలల స్థాయిని పెంచాలని అతనెన్నడైనా అనుకున్నాడా?' స్థానిక బడిపంతులు లస్సీ తాగుతూ తన స్నేహితుడైన ఆయుర్వేద వైద్యుడిని అడిగాడు.

వృద్ధుడవుతున్న అతని స్నేహితుడైన వైద్యుడు తన లస్సీ ఒక గుక్క తాగి చెప్పాడు.

'నేను విన్నది అది మాత్రమే కాదు, గాంధారను జయించి బ్రాహ్మణ ప్రతిష్ఠను నిలపడానికి అశ్వకనుల నాయకుడు ప్రయత్నిస్తున్నాడట?'

'హా!' వాళ్ళ పక్క బల్ల దగ్గర కూర్చున్న వ్యక్తి అన్నాడు. బడిపంతులుకి కాని, వైద్యుడికి కాని అతను తెలియదు. ఆ ప్రాంతానికి కొత్తవాడిలా కనిపించాడతను.

'మీరెవరు? మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా?' బడిపంతులు అడిగాడు. మసాల అన్నం తిన్నందుకు గుర్తుగా ఆ కొత్తమనిషి త్రేన్చాడు.

'నేను చరణుడిని. సంచారం చేస్తూ తిరిగే గాయకుడిని. సింధు నుంచి వచ్చాను. గొప్పవాడని మీరనే శశిగుప్తుడు నాకు తెలుసు. అతని భార్య శూద్రురాలని మీకు తెలుసా?'

'ఏమిటి? తక్కువ కులం స్త్రీతో కలసి ఉంటాడా?' వైద్యుడు నిర్ఘాంతపోయి గుసగుసగా అన్నాడు. 'అట్లాంటి మనిషి బ్రాహ్మణ రక్షకుడెలా అవుతాడు?'

'అంభి మొదట మాసిడోనియన్లకు, తర్వాత బౌద్ధులకు అమ్ముడుపోయాడు! ఆ మనిషికి సిగ్గులేదా?' ఒక గణకుడి చేతిని చూస్తూ జ్యోతిష్యుడు క్రోధంగా అడిగాడు.

చేయి చూపించుకోవడానికి వచ్చిన వ్యక్తి జ్యోతిష్యుడు తనకు మంచి సఫలత, సంపదలు వస్తాయని చెబుతాడని ఆశిస్తూ ఆ వృద్ధుడికిష్టమైన సంభాషణలో పాలుపంచుకున్నాడు తన జీవిత విషయానికి దూరంగా ఉన్నా.

'నేనింకా చాలా విన్నాను. అంభి బ్రాహ్మణుల అధికారం తగ్గించడానికి బౌద్ధులను ప్రోత్సహించాడనే కాకుండా, ఇద్దరి మధ్యా అధికార సమతౌల్యం పాటించమని శశిగుప్తుడు అంభికి హెచ్చరిక పంపాడని కూడా విన్నాను' అన్నాడు గణకుడు, జ్యోతిష్యుడి చేతిలో ఉన్న తన చేతిని చూస్తూ.

రావి చెట్టు కింద నిద్రపోతున్న మనిషి 'హా!' అన్నాడు. అందరూ మిట్టమధ్యాహ్నపు ఎండ నుంచి తప్పించుకోడానికి ఆ చెట్టు నాశ్రయించారు. గణకుడికి గాని, జ్యోతిష్యుడికి గాని అతనెవరో తెలియదు. ఆ ప్రాంతానికి కొత్తవాడుగా అనిపించాడు.

'ఎక్కణ్ణుంచి వచ్చావు మిత్రుడా? మాకు తెలియని విషయమేదైనా నీకు తెలుసా?' గణకుడడిగాడు అతన్ని చూస్తూ. నిద్రపోతున్న ఆ మనిషి త్రేన్చాడు జీర్ణశక్తికి తోడ్పడిన వక్క పలుకుకి కృతజ్ఞతగా.

'నేను అశ్వమాధకుడిని. సింధు నుంచి వచ్చిన అశ్వశిక్షకుడిని. నా గుర్రాలను అమ్మడానికి వచ్చాను. మీరు గొప్పవాడని అంటున్న శశిగుప్తుడు నాకు తెలుసు. కాని రథమార్గానికి అడ్డుగా ఉందని అతను కుబేరుడి ఆలయాన్ని కూలగొట్టాడు తెలుసా?'

'కావాలని గుడులు కూలగొడతాడా?' విస్మయంగా అడిగాడు జ్యోతిష్యుడు. 'అట్లాంటి మనిషి బ్రాహ్మణరక్షకుడెలా అవుతాడు?'

'రాజనీతిలో కూడా వైద్యంలోలాగా, మాటలే శక్తిమంతమైన మందులా పనిచేస్తాయి. ప్రచారానికున్న శక్తిని తక్కువగా అంచనా వెయ్యకూడదు ఎప్పుడూ', అన్నాడు చాణక్యుడు తన సేవకుడిని రాణికన్న రెండు గడులు ముందుకు జరుపుతూ. ఆ ఎత్తు చాణక్యుడి రాణికి ఆపద తెచ్చేదిగా మిహిర్ భావించాడు. అతను చిరునవ్వుతో పైఎత్తు వేశాడు. చాణక్యుడు సునాయాసంగా తన శకటాన్ని మూలగా మూడుగడులు కదిలించాడు. మిహిర్ తర్వాత వేసిన ఎత్తు తర్వాత, అతను తన రాణిని మూలగా రెండు గడులు కదిపి సేవకుడి ముందుంచాడు. ఆ గదిలో ఉన్న మూడో వ్యక్తి ఎత్తుల మధ్యలో నిద్రమత్తుతో ఊగుతూ విసుగ్గా ఆటను చూడసాగాడు.

చాణక్యుడు నవ్వాడు. మిహిర్ తర్వాత ఎత్తు ఏదైనా ఫరవాలేదు. ప్రత్యర్థి సైనికుడి వరకూ చాణక్యుడు తన రాణిని తీసికెళ్ళి చంపగలడు. రాజుకి ఆటకట్టు అని చెప్పగలడు. రాజు రాణిని చంపలేడు. చాణక్యుడి శకటం రాజుకి అడ్డు వస్తుంది. రాణి నుంచి దూరంగా వెళ్ళడానికి ఆయన పావులే అడ్డువస్తాయి. తన పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చూసి మిహిర్ నిస్పృహతో గొణుక్కున్నాడు. ఆచార్యుడితో చదరంగం ఆడడంలో వినోదం ఏమీ ఉండదు. ఆయన మిహిర్ బుర్రలో దూరి అతను వేసే ఎత్తులన్నీ ముందే పసిగట్టేస్తాడు.

'మిహిర్, నా ప్రియశిష్యుడా, ఈ ఆటలో కీలకమైన పావులను పోగొట్టుకొనడం కష్టం, కాని గెలవడానికి కొన్నిసార్లు కీలకమైన పావును పోగొట్టుకోవాల్సి వస్తుంది. నీ ప్రత్యర్థిని మాయ చెయ్యడానికి ఏదో ఒక ఎర వెయ్యాలి. నువ్వు చేసే త్యాగం వల్ల నీక్కావలసింది తప్పక దొరుకుతుంది!' ఆట ముగిస్తూ చాణక్యుడు అన్నాడు. చాణక్యుడు, మిహిర్ ఆడే ఆటను శారంగరావు గమనిస్తూ ఉన్నాడు ఆయనకు ప్రియశిష్యుడు, నల్లబ్రాహ్మణుడి కోసం రహస్యంగా పనిచేస్తాడు. వాళ్ళ సంభాషణని శ్రద్ధగా విని త్రేన్చాడు – ఇప్పుడే తెలుసుకున్న జ్ఞానం అర్థమైందని కృతజ్ఞతగా.

'ఓడిపోయినవాళ్ళకి బిందువులేమీ ఉండవు! చాణక్యుడు భుజాలెగరేశాడు,

'అయితే మనం ఇక్కడ కూర్చుని చదరంగం ఆడుకుందామా, శశిగుప్తుడు గాంధారని జయిస్తుంటే', మిహిర్ మళ్ళీ ఓడిపోయినందుకు బాగా చిరాకు పడుతూ అన్నాడు.

'మిహిర్, అతను గాంధారను జయించవచ్చునేమో కాని మనం ధనసహాయం చేసిన బ్రాహ్మణ గొరిల్లాల చేతిలో చావక తప్పదు. అది వెయ్యి చోట్ల కోసి చంపే మృత్యువు. గొరిల్లా యుద్ధం పెద్దగా డబ్బు ఖర్చుకాని సాయుధ యుద్ధం. మనకున్న కొద్దిమంది

యోధులే మాటువేసి దాడి చేసి పెద్ద శత్రువుకి కూడా బాగా హాని చేయగలరు. గాంధార మీద శశిగుప్తుడు చేసే యుద్ధంతో అతని వనరులన్నీ అయిపోతాయి. అశ్వకనులపై, సింధుపై అతని పాలన అస్థిరమవుతుంది, గాంధార పౌరులలో ముఖ్యవర్గమైన బ్రాహ్మణులకు శత్రువుని చేస్తుంది. అప్పుడే చంద్రగుప్తుడు సునాయాసంగా వెన్నను వేడికత్తితో కోయగలడు. చంద్రగుప్తుడికి గాంధారను ఇవ్వడం మాత్రమే నా ప్రణాళిక కాదు. అశ్వకను, సింధు ప్రాంతాలు, శశిగుప్తుడి సొంత ప్రాంతాలు కూడా అతనికి లభించేలా చేస్తాను. శశిగుప్తుడిని మొదటి ఎలుక కానివ్వండి... బోనులో ఇరుక్కుని చస్తాడు. చంద్రగుప్తుడు రెండో ఎలుక ముందుగా వచ్చిన పక్షికి ఆహారం దొరుకుతుంది కాని రెండో ఎలుకకే జున్ను దొరుకుతుంది!'

'నిన్నందరూ ప్రేమిస్తారు. నన్నందరూ మోసం చేస్తారెందుకని?' భద్రశాలుడడిగాడు. తన చేతులలో ఉన్న గణికని వదులుతూ జీవసిద్ధి తలెత్తి చూశాడు. ఆమె నవ్వి అతన్ని మళ్ళీ తనవైపు లాక్కోబోయింది, అతను మందలించాడు. ఆమె మూతివిరుస్తూ గదిలోనుంచి బయటికి పోయింది. జీవసిద్ధి తన తలపాగాను, బట్టలను సర్దుకొని తన పానపాత్రలోని ప్రసన్న ద్రవాన్ని తాగేశాడు. మీసాలు తుడుచుకుని, వేళాకోళంగా అడిగాడు, 'దేవుడికి మనమంటే ఇష్టమని, మనం సంతోషంగా ఉండాలనుకుంటాడనడానికి ఈ ప్రసన్నయే సాక్ష్యం! నువ్వెందుకంత నీరసంగా ఉన్నావు?' భద్రశాలుడు మౌనంగా ఉన్నాడు. జీవసిద్ధి ఆరాగా అడిగాడు, 'మంత్రిమండలి మా సేనలను ప్రతిఘటించకుండా మగధలో ప్రవేశించనీయడానికి, పాటలీపుత్రం వరకూ రానీయడానికి అంగీకరింపజేశావా?'

భద్రశాలుడు తలూపాడు. 'వాళ్ళని ఎవరూ ప్రతిఘటించరు. కాని పాటలీపుత్రానికి వచ్చాక భయంకర యుద్ధానికి సిద్ధంగా ఉండు'. భద్రశాలుడు మరికొంత మద్యం తాగి, తన ఇంద్రియాలు మొద్దుబారడానికి తోడ్పడ్డాడు.

'పాటలీపుత్రం కోసం మేము యుద్ధం చేస్తామని ఎందుకనుకుటున్నావు?' జీవసిద్ధి అమాయకంగా అడిగాడు.

'ఓహో వినండి, వినండి, వినండహో! వివేకి, ఉదారుడైన చంద్రగుప్త మౌర్య మహారాజు, గాంధార, అశ్వకనుల, సింధు, సింహపుర, చక్రవర్తి మాళవరాజ్య, క్షుద్రక,

సైంధవ, ఆలోర్, బ్రహ్మస్థల, పాటల, మహాఊర్ధ ప్రభువు కొలువు తీరి ఉన్నారు. వచ్చి విన్నపాలు చేసుకోండి!' చంద్రగుప్తుడు మండలి మందిరంలోకి ప్రవేశిస్తుండగా వందిమాగధుడు అరిచాడు. ఆ పట్టికలో మగధ ఒక్కటే చేరాల్సి ఉంది. బాల్యంలో ఊహా ప్రపంచంలో నాటకాలు వేస్తున్నపుడు తన స్నేహితులు కూడా ఇలాగే అనేవారని చంద్రగుప్తుడు గుర్తు చేసుకున్నాడు. తన తండ్రి సేనాపతి తన పట్టాభిషేకాన్ని చూడలేక పోయాడని అతను బాధపడ్డాడు.

అంభిని యుద్ధరంగంలో శశిగుప్తుడు చంపేశాడు. మిహిర్ పంపిన బ్రాహ్మణగొరిల్లా శశిగుప్తుణ్ణి హత్యచేశాడు. ఒకే దెబ్బతో చాణక్యుడు రెండు పిట్టల్ని కొట్టాడు. చంద్రగుప్తుడు గాంధారకి వచ్చి సింహాసనం ఆక్రమించాడు. ప్రజలు అతన్ని హృదయపూర్వకంగా ఆహ్వానించారు. చంద్రగుప్తుడిప్పుడు కళింగరాజుకన్న, పురుషోత్తముడికన్న శక్తిమంతుడు. కాని ధననందుడికన్న కొంచెం తక్కువ శక్తిమంతుడు. అది కూడా త్వరలో మారిపోతుంది.

సింహాసనాన్ని చేరుకోకముందు, అతను కొంచెం కుడిప్రక్కకు వెళ్ళి చుట్టూ తిరిగి చాణక్యుడు నిలబడిన చోటికి వచ్చాడు. వంగి, గౌరవంతో గురువుగారి పాదాలు స్పృశించాడు. చాణక్యుడతన్ని ఆశీర్వదించాడు.

'ప్రతిభతో అలరారు విజయం, వైభవం నీకు లభించుగాక!'

చంద్రగుప్తుడు లేచి ఖాళీగా ఉన్న పీఠం మీద ఉన్న సామాన్యమైన పాదుకలున్న చోటికి వచ్చాడు. అవి అతని తండ్రివి. వంగి వాటికి నమస్కరించి ఆత్మలోకం నుంచి ఆశీస్సులు పొంది తల్లిదగ్గరకు వచ్చాడు. ఆమె పాదాలకు నమస్కరించడానికి చంద్రగుప్తుడు వంగగానే నిరాడంబరంగా, నాజూకుగా ఉన్న ఆమె కళ్ళలో నీరు తిరిగాయి. అతని తలపై చేతిని ఉంచి ఇలా అంది, 'నీ ప్రపంచం సుందరంగా నీ చర్యలు విధి నిర్వహించేలా, నీ స్వభావం దయాపూరితంగా, నీ రాజ్యం సౌభాగ్యంతో వర్ధిల్లాలి నాయనా!'

చంద్రగుప్తుడు రాజోచితమైన వస్త్రాలు ధరించాడు. చైనా నుంచి వచ్చిన పట్టు చినంసుకతో తయారుచేసినవి. అంతరీయ ధోతి లేత బంగారురంగులో, ఉత్తరీయం సిందూర ఎరుపుతో, కాయబంధ ఒడ్డాణం పాలనురుగులా ఉంది. అతని మెడలో డెబ్బయి అయిదు కేరట్ల వజ్రం ఉన్న నెక్లెసు ఉంది. బాజు బంధాలకు స్వచ్ఛమైన నీలాలు ఒక్కొక్కటి ఆరు కేరట్లు పొదిగి ఉన్నాయి. మోచేతి కడియాలకు నలభై కేరట్ల హృదయాకారంలో ఉన్న బర్మా కెంపు ఉంది. తల మీద బంగారు తలపాగ, దానిలో నూటయాభై కేరట్ల విలువైన స్వచ్ఛమైన పచ్చలు పొదిగి ఉన్నాయి. అతను ప్రతి అంగుళంలోను ప్రపంచ చక్రవర్తిలా ఉన్నాడు.

కూర్చున్న చంద్రగుప్తుడి సింహాసనం వద్దకు వచ్చి చాణక్యుడిలా అన్నాడు, 'నువ్వు పవిత్ర ప్రమాణం చేసి గాంధార, అశ్వకనులు, సింధు, సింహపుర, మాళవరాజ్య, క్షుద్రక, సైంధవ, ఆలోర్, బ్రహ్మస్థల, పాటల, మహాఊర్ధ రాజ్యాల ప్రజలను ఇక ముందు నువ్వు జయించబోయే రాజ్యాల ప్రజలను మన పూర్వీకులు వేదాలలో చెప్పిన విధంగా రాజధర్మానుసారంగా పరిపాలిస్తావా?'

చంద్రగుప్తుడు ప్రార్థిస్తున్నట్లుగా చేతులు జోడించి, కళ్ళు మూసుకుని, చెప్పాడు.

'నేను అదేవిధంగా చేస్తానని పవిత్ర ప్రమాణం చేస్తున్నాను'.

చాణక్యుడు అడిగాడు, 'నీ తీర్పులు చట్టం, న్యాయం దయ కలిగి ఉంటాయని హామీ ఇస్తావా?'

'హామీ ఇస్తున్నాను', చంద్రగుప్తుడు సమాధానమిచ్చాడు.

'నీ అత్యున్నతాధికారంతో, దైవ శాసనాలను, క్షత్రియ రక్త గౌరవాన్ని, బ్రాహ్మణ పరిరక్షణ, పీడితుల రక్షణ చేస్తావా, నీ మంత్రులు, వారికింద పనిచేసే అధికారులను చట్టబద్ధంగా వారి హక్కులు అవకాశాలను రక్షిస్తావా? చాణక్యుడు అడిగాడు.

చంద్రగుప్తుడు గంభీరంగా సమాధానం చెప్పాడు. 'ఇప్పుడు చెప్పినదంతా చేస్తానని ప్రమాణం చేస్తున్నాను'. తర్వాత పవిత్ర వేదాలపై తన కుడిచేతిని ఉంచి, 'నేను చేస్తానని ప్రమాణం చేసినవన్నీ, నేను చేస్తాను, భగవంతుడా నాకు సాయం చెయ్యి' అన్నాడు. సభా భవనం సంతోషంతో ఊగింది.

## పదహారో అధ్యాయం

# వర్తమానం

'ఇక్కడేం జరుగుతుందో నాకు తెలియడం లేదు. ఆర్ అండ్ ఎస్ విమాన సంస్థ రంగ్తా అండ్ సోమానీ సామ్రాజ్యంలో భాగమే కదా. వాళ్ళు చాందినిని ఎందుకు చంపాలనుకుంటారు? వాళ్ళు మన పక్షమే కదా!' అన్నాడు మీనన్.

'కనిపించేదాన్ని దాటి చూడు మీనన్. అన్నీ మనకు కనిపించే విధంగా ఉండవు', చెప్పాడు గంగాసాగర్ తర్వాతి సందర్శకుడిని లోపలికి పంపమని సైగ చేస్తూ.

అగర్వాల్ గారు లోపలికి వచ్చారు. గంజిపెట్టిన ధోతి, కుర్తా వేసుకున్నారు. ఇద్దరినీ పలకరించి గంగాసాగర్ కెదురుగా కూర్చున్నారు.

'చాందిని బాగుందా?' ఆయన అడిగాడు.

గంగాసాగర్ తలూపాడు. 'ఆమె యోధురాలు. భయపడలేదు. తన ప్రాణం గురించి తనకంటె నాకే ఎక్కువ భయం వేస్తున్నట్టుగా ఉంది!'

'నేనేమైనా చేయగలనా?' అగర్వాల్ అడిగారు.

'ఆర్ అండ్ ఎస్ భాగస్వాముల మధ్య వివాదం,' గంగాసాగర్ చెప్పసాగాడు. 'అసలేం జరుగుతుందో మనం కొంచెం బాగా తెలుసుకోవాలి. ఈ విషయంలో ఇక్రం పాత్ర ఏమిటో కూడా నాకు తెలియాలి – ఇక్రంకి తెలియకుండా'.

'దీనిలో అర్థం కానిదేముంది సర్. హమీద్‌కి డబ్బు కావాలి. మనం ఇవ్వకపోయే సరికి ఇక్రం భాయ్ దగ్గరికి వెళ్ళి మేజిస్ట్రేటుతో మనం చేసిన ఏర్పాట్లు గురించి చెప్పి ఉంటాడు. ఇక్రం అతన్ని ఉపయోగించి చాందిని గారిని చంపాలనుకుని ఉంటాడు ప్రతీకారంగా' వివరించాడు మీనన్.

'నేను ఒప్పుకోలేను, మీనన్. ఇక్రం గురించి అంత తొందరపడి నిర్ణయం తీసుకోవద్దు. అతను చాందినిని దత్తత తీసుకున్నాడు, మర్చిపోవద్దు. మరో విషయం నన్ను సందిగ్ధంలో పడేస్తోంది', అన్నాడు గంగాసాగర్ తలగోక్కుంటూ.

'ఏమిటి?' అడిగాడు మీనన్.

'రంగ్తా అండ్ సోమానీ మన ఆశీస్సులతో ప్రపంచ స్థాయి ఉక్కు కర్మాగారం పెట్టాలని ఉత్తరప్రదేశ్‌కి వచ్చారు. ఒక భాగస్వామి రైతులకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించడానికి ఒప్పుకున్నాడు. ఇంకొకడు ఒప్పుకోకుండా అమ్మకం పన్ను రాయితీ ఇప్పించుకున్నాడు నాచేత'.

'అయితే?'

ప్రపంచబ్యాంకు సాయం చేసిన రోడ్డు మార్గాల ప్రాజెక్టు విషయంలో కూడా ఇదే పద్ధతిలో ప్రవర్తించారు. జూనియర్ పార్టనర్ – సోమానీ– వచ్చి తన వంతు ఇవ్వకుండా రంగ్తా మోసం చేశాడని ఫిర్యాదు చేశాడు. ఈ ప్రక్రియలో మనతో ఆయుధాల కాంట్రాక్టు ఇప్పించుకున్నాడు. ఇప్పుడిదంతా ఆలోచిస్తుంటే, మొత్తమంతా మోసమనిపిస్తోంది!' చెప్పాడు గంగాసాగర్ మెటికలు విరుస్తూ.

గంగాసాగర్ ఆగాడు. అగర్వాల్ గారిని క్షణం సేపు చూసి, మళ్ళీ మామూలుగా అయ్యాడు. 'ఒక భాగస్వామి – సోమానీ –రక్షణమంత్రిని ప్రధానిని చేయాలని మద్దతు పలికాడు. మరొకడు – రంగ్తా – ఆర్థికమంత్రికి మద్దతిచ్చాడు. ఫలితం ఏమైనా వాళ్ళ మనుషుల్లో ఒకడు అత్యున్నత పదవిలో ఉంటాడని ఇద్దరికీ తెలుసు'.

'గంగాసాగర్ నువ్వు దేని గురించి ఫిర్యాదు చేస్తున్నావో నాకు అర్థం కావడం లేదు! వాళ్ళ మధ్య ఉన్న శత్రుత్వం వల్లే కదా ఇప్పుడున్న ప్రభుత్వం – చాందిని, మిగిలిన **అభానస** మంత్రులు తొమ్మిదిమంది – అధికారంలోకి వచ్చారు. దీనికోసం నీలో నువ్వే ఇంత యాతనపడి ఆలోచిస్తున్నావెందుకు?'

'ఇది పెంటలా కనిపిస్తూ, పెంట వాసన వస్తూ, పెంటలా అనిపిస్తే బహుశా పెంటే! మనం మోసపోయాం – ఇప్పుడర్థమైంది', అన్నాడు గంగాసాగర్ కుర్చీలోంచి లేస్తూ.

'ఆర్ అండ్ ఎస్‌తో వ్యాపారలావాదేవీలున్నాయి గదా మీకు, అవునా? అడిగాడు గంగాసాగర్ లంచ్ చేస్తున్నప్పుడు. అతనిప్పుడు ప్రశాంతంగా ఉన్నాడు.

'ఉన్నాయి. నువ్వు నాకు బహుమతిగా ఇచ్చిన రోడ్ల కాంట్రాక్టు రంగ్తాకి ఇచ్చాను. గుర్తుందా?' అడిగారు అగర్వాల్ గారు మిగిలిన అన్నాన్ని, చిక్కుళ్ళని తన ప్లేటులో వేసుకుని, నచ్చినట్లుగా తలూపాడు.

'మీ ఆర్థిక వేట కుక్కల్లో ఒకరిని వాళ్ళని గమనించమని చెప్పండి' చెప్పాడు గంగాసాగర్, తాజాపెరుగు గిన్నెని ఆయన ముందుకి తోస్తూ.

'ఏం చెయ్యమంటున్నావు?' అడిగాడు అగర్వాల్.

'ఆర్ అండ్ ఎస్ కొన్న ప్రతి షేరునీ విశ్లేషించాలి. ఎవరు కొన్నారు? ఎవరు అమ్మారు? ఎప్పుడు? వాటికీ వాళ్ళు చేసే బహిరంగ ప్రకటనలకీ మధ్య ఉన్న సంబంధం! కావాలి నాకు', తన చేతిలో చెంచాని ఎత్తి చూపుతూ అన్నాడు గంగాసాగర్.

'ఏం కనుక్కోవాలనుకుంటున్నావు, గంగా?' అగర్వాల్ అడిగారు.

'ఏమీ అనుకోవడం లేదు. నేనేం కనుక్కుంటానో నాకు ఇప్పటికే తెలుసు. అందుకే వెతుకుతున్నాను.'

'ఏమిటది?'

'ఇద్దరు భాగస్వాములు కుమ్మక్కై పైకి విరోధుల్లా కనిపిస్తూ ప్రభుత్వం నుంచి ఎక్కువ వ్యాపారం లాక్కుంటున్నారు – ఆ పద్ధతిని గురించి కనుక్కోవాలి. మరీ ముఖ్యంగా వాళ్ళు బహిరంగంగా పోట్లాడుకోవడం, వాళ్ళ కంపెనీ షేర్లు కొనుక్కోవడం, మళ్ళీ కలిసిపోయి అమ్మెయ్యడం. ప్రజల్ని, మనల్ని వాళ్ళు ఆవుపాలు పిండుకున్నట్లు పిండేస్తున్నారు'.

'కాని చాందినిని చంపడానికి ఆర్ అండ్ ఎస్ ఇక్రంతో ఎందుకు కలుస్తుంది?' నాప్‌కిన్‌తో మూతి తుడుచుకుంటూ అగర్వాల్ అడిగారు.

'బహుశా న్యూఢిల్లీ ప్రభుత్వానికి **అభానస** మద్దతివ్వడం ఆర్ అండ్ ఎస్‌కి ఇష్టమే కాని న్యూఢిల్లీలో **అభానస** ప్రభుత్వం నడపడం వాళ్ళకిష్టం లేదేమో. ప్రస్తుతానికి పెద్ద పదవికి పోటీదారు చాందిని ఒక్కతే. అందుకే ఇక్రంకి కూడా బాధ కలిగి ఉండొచ్చు' అన్నాడు గంగాసాగర్.

'చాందిని ప్యాకేజీ డీల్‌లా గంగాసాగర్‌తో కలిసి వస్తుందని కూడా వాళ్ళకి తెలుసు, భయపెట్టే లాభం' అగర్వాల్ జోక్ చేశారు.

'అగర్వాల్ గారి చార్టర్డ్ అకౌంటెంట్ తన హోంవర్క్ చేశాడు. ఒక్క రోజులో ఆర్ అండ్ ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు ధర 1,178 నుంచి 900 రూపాయలకు పడిపోయింది, భాగస్వాములు ప్రపంచబ్యాంకు ప్రాజెక్టు గురించి కోర్టుకు వెళతామని బహిరంగ ప్రకటనలు చేసినప్పుడు. అదే రోజున భాగస్వాములిద్దరూ తెలిసిన ఇన్వెస్టుమెంటు కంపెనీల ద్వారా పెద్ద మొత్తాల్లో షేర్లు కొన్నారు. ఒక వారం తర్వాత కోర్టు బయట రాజీపడ్డామని చెప్పి షేర్లను 1200 రూపాయలకు అమ్మారు!' చెప్పాడు మీనన్ అగర్వాల్ గారి మనుషులు పంపిన రీముల కొద్దీ విశ్లేషణని చూసి.

'వాళ్ళు చాందినికి, **అభానస**కు హాని చేయగలమనుకుంటే పండిట్ గంగాసాగర్ మిశ్రాతో పెట్టుకుంటే ఏమవుతుందో వాళ్ళ'కి వెంటనే తెలుస్తుంది. ఆర్ అండ్ ఎస్‌లో ఎంతమంది ఉద్యోగులుంటారు!' అడిగాడు గంగాసాగర్.

'నాకు గుర్తున్నంతవరకు లక్షమంది', సమాధానమిచ్చాడు మీనన్.

'వాళ్ళలో ఎంతమంది కార్మికులు **అభానస** – అనుబంధ కార్మిక సంఘాలలో సభ్యులుగా ఉన్నారు?' అడిగాడు పండిట్.

'ఆ విషయం మీకోసం కనుక్కున్నాను సర్. మన లక్నో విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘ అధ్యక్షుడు – ఉపేంద్ర కాశ్యప్ – **ఎబిఎన్‌కెయు** మన కార్మిక సంఘానికి అధ్యక్షుడుగా ఉన్నాడు. అతను చెప్పడం ఆర్ అండ్ ఎస్‌లో ఇరవైవేల మంది కార్మికులు **ఎబిఎన్‌కెయు**లో సభ్యులు'.

'ఆర్ అండ్ ఎస్‌లో మిగిలిన ఎనభై వేలమంది?'

'వాళ్ళు రెండు సంఘాలలో సమానంగా చీలారు. **ఎబిఎన్‌కెయు** – చాలా చిన్నది ఇరవై శాతం. మిగిలిన రెండు యూనియన్లకు చెరొక నలభై శాతం'.

'ఆ రెండు సంఘాల పేర్లేమిటి?'

'**సిపియుకె** – విక్రమసింగ్ త్యాగి అధ్యక్షుడు. **ఐఎన్‌డబ్ల్యుఎఫ్** – లాల్జి గార్గ్ అధ్యక్షుడు.

'మీనన్, ప్లీజ్ రెండు డిక్టేషన్లు తీసుకుంటావా?'

'యస్ సర్?'

డియర్ కామ్రేడ్. **సిపియుకె** అవిశ్రాంతంగా ఆర్ అండ్ ఎస్ ఉద్యోగులకు సాయం చేయాలని కృషి చేస్తోందని మీకు తెలుసు. సమస్యేమిటంటే **ఐఎన్‌డబ్ల్యుఎఫ్** అధ్యక్షులు లాల్‌జిగార్గ్ మిమ్మల్ని మోసం చేశాడు. మీ ప్రయోజనాల కోసం పనిచేస్తానని చెప్పిన గార్గ్, మీ ప్రయోజనాలను రంగ్తాకు అమ్మేశాడు. వేతనాలలో పెరుగుదలను అందుకోవడానికి సాధ్యంకాని లక్ష్యాలతో ముడిపెడతారు. దీనివల్ల జీతాల ఒప్పందంలో ఎక్కువగా నోషనల్ పెరుగుదలే తప్ప నిజానికి వేతనాల్లో అంతగా పెరుగుదల ఉండదు. మీలో ప్రతి ఒక్కరికి స్నేహితుడిగా **ఐఎన్‌డబ్ల్యుఎఫ్‌**ని వదిలి **సిపియుకె**లో చేరమని కోరుతున్నాను. ఆర్ అండ్ ఎస్ కార్మికుల స్వరాన్ని వినిపించేది మేమే. వచ్చే శుక్రవారం జరిగే వార సమావేశానికి మీరు వస్తారని ఆశిస్తాను. శుభాకాంక్షల్తో విక్రంసింగ్ త్యాగి, అధ్యక్షుడు, **సిపియుకె.**

'మరో డిక్టేషన్?' అడిగాడు మీనన్, షార్ట్‌హాండ్ నోట్స్ నుంచి పైకి చూస్తూ.

సహకార్మికులారా **ఐఎన్‌డబ్ల్యుఎఫ్** వేతనం పెంచాలని ఆర్ అండ్ ఎస్ మేనేజ్‌మెంట్‌తో తత్పరతతో సంప్రదిస్తున్నది. ఈ ప్రయత్నంలో మీ సంఘం **సిపియుకె** అధ్యక్షుడు విక్రమసింగ్ త్యాగి అవరోధంగా ఉన్నారు. సంప్రదింపులు తప్పుదోవ పట్టడానికి ఆయన చేయాల్సిందంతా చేశాడు. శ్రీ సోమానితో ఆయన చేసుకున్న రహస్య ఒప్పందం వల్ల ఆయనకి వ్యక్తిగతంగా పెద్ద మొత్తం ముడుతుంది కొత్త వేతన ఒప్పందం అమలు కాదు. **సిపియుకె** సభ్యులు మోసం చేసే తమ యూనియన్‌ను వదలి తమ కోసం మాట్లాడే సంస్థలో చేరాల్సిన సమయం ఆసన్నమైంది. **ఐఎన్‌డబ్ల్యుఎఫ్‌**లో చేరండి. మంగళవారం జరిగే వారపు సమావేశానికి వస్తారని ఆశిస్తాను. మీ లాల్‌జీ గార్గ్, అధ్యక్షుడు, **ఐఎన్‌డబ్ల్యుఎఫ్.**

'వీటిని నేనెవరికి పంపాలి?'

**ఎబిఎన్‌కెయు** అధ్యక్షుడు ఉపేంద్ర కాశ్యప్‌తో **సిపియుకె, ఐఎన్‌డబ్ల్యుఎఫ్** లెటర్‌హెడ్‌లు రహస్యంగా ముద్రించమని చెప్పు. ఈ రెండు లేఖలు అతనికి పంపి ఎక్కువ కాపీలు సైక్లోస్టైల్ చేయించమని చెప్పు. **సిపియుకె** లేఖని **ఐఎన్‌డబ్ల్యుఎఫ్** సభ్యులకి, **ఐఎన్‌డబ్ల్యుఎఫ్** లేఖని **సిపియుకె** సభ్యులకి పంపాలి'.

'ఇద్దరు భాగస్వాముల వ్యవహారాల్లో రెండు యూనియన్లను దూరుస్తున్నాం. ఇలా చేయడం తెలివైన పనా?' అడిగాడు మీనన్.

'భాగస్వాములు యుద్ధం లేకుండానే ఉందని చెప్పుకున్నారు. ఇలా నటించి ప్రభుత్వాలు దించడం, కొత్తవి ఏర్పాటు చెయ్యడం, కంట్రాక్టులు తెప్పించుకొనడం కోసం నటించారువాళ్ళు. ఇప్పుడు కుట్రలు చేస్తూ చాందినిని, **అభానస**ను దించాలనుకుంటు న్నారు. వాళ్ళకి పోట్లాటే కావాలనుకుంటే నేను వాళ్ళకి ఒకటిస్తాను!' గర్జించాడు గంగాసాగర్.

'కాని ఇది యూనియన్ల మధ్య గొడవకి దారితీస్తుంది. హింసాత్మకంగా మారవచ్చు', మీనన్ ఆశ్చర్యంగా అన్నాడు.

'రెండు ఏనుగులు పోట్లాడుకుంటే వాటి కాళ్ళ కింది గడ్డి నలిగిపోతుంది. మీనన్'.

అల్లర్లు నియంత్రించే పోలీసులు హెల్మెట్లు, షీల్డులు, గ్యాస్ మాస్క్‌లు పట్టుకుని రెండు యూనియన్ల మధ్య ఉన్న సన్నని రేఖ మధ్య నిలబడ్డారు. ఇరుపక్షాలు ఆ రేఖ దగ్గరకు రాకూడదని చెప్పారు. సాయుధ పోలీసు వాహనాలు, మొబైల్ స్టోరేజి ట్యాంకులు రేఖ దగ్గర నిలిపారు. అన్ని పరిస్థితులను ఎదుర్కోవడానికి పోలీసులు షాట్‌గన్‌లు, బాష్పవాయుగోళాలు, పెప్పర్‌స్ప్రేలు, లాఠీలు తెచ్చారు. పోలీసులు గీచిన విభజన రేఖకు అటూ ఇటూ వేలాదిమంది యూనియన్ కార్మికులు తమ సంస్థల ఎరుపు, నలుపు జెండాలు, తమ యూనియన్ల బ్యానర్లు పట్టుకొని ఊపుతూ ఉన్నారు. రెండు వైపుల నుంచి గట్టిగా మాట్లాడే నాయకులు మెగాఫోన్లు పట్టుకొని ప్రత్యర్థి పక్షాన్ని, మేనేజ్‌మెంట్‌ని పెట్టుబడిదారీ పందులని నాశనం చెయ్యమని కోరుతున్నారు.

**ఆర్ అండ్ ఎస్** సామ్రాజ్యంలోని అన్ని చోట్ల – **ఆర్ అండ్ ఎస్** స్టీల్, **ఆర్ అండ్ ఎస్** ఆగ్రో, **ఆర్ అండ్ ఎస్** సిమెంట్, **ఆర్ అండ్ ఎస్** టెలికాం, **ఆర్ అండ్ ఎస్** పెట్రోలియం, **ఆర్ అండ్ ఎస్** ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, **ఆర్ అండ్ ఎస్** టెక్స్‌టైల్స్, **ఆర్ అండ్ ఎస్** ఫార్మా, **ఆర్ అండ్ ఎస్** ఏవియేషన్ అన్నిచోట్ల ఇదే దృశ్యం.

మాజీ ఆర్థికమంత్రిని గంగాసాగర్ కుతంత్రాల వల్ల తప్పనిసరిగా పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిన వ్యక్తి – టీవీలో ఇంటర్వ్యూ చేశారు. ఆయనంటున్నాడు, 'పరిస్థితి చాలా గంభీరంగా ఉంది. చాలా దురదృష్టకరమని భావిస్తున్నాను. ఆర్ అండ్

ఎస్ సంస్థలో కార్మికులకు బాగా ఎక్కువ జీతాలు ఇస్తారు! బయటి వారెవరో ఈ సమస్యని సృష్టిస్తున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ జరగాలి. వారి హక్కులను కాలరాయడం కుదరదు. అయితే మేనేజ్‌మెంట్‌కు, కార్మికులకు మధ్య సమస్యలను పరిష్కరించుకొనడానికి న్యాయమైన విధానాన్ని అనుసరించాలి. పరిస్థితిని అదుపు చేయకపోతే, మరింత దిగజారుతుందని నేను భయపడుతున్నాను'.

'వీడు వలలో పడ్డాడు. బుద్ధి తక్కువవాడు. వీడిని నాశనం చేయడానికే కాదు, నన్ను ఆటలో నుంచి తప్పించాలనుకున్న ప్రతివాడికి సీక్వెన్సులో ముక్కలు చూపించి మరీ నాశనం చేస్తాను' ఇంటర్వ్యూ చూస్తున్న గంగాసాగర్ అనుకున్నాడు.

'సర్, సెజ్‌లకు – ప్రత్యేక ఆర్థిక ప్రాంతాలకు – వాటి అసలు విలువను గమనించకుండా వాణిజ్యమంత్రిత్వశాఖ భూములను కేటాయించింది. వేలాది ఎకరాల భూమిని ఒకే కంపెనీకి ఆర్ అండ్ ఎస్ రియాల్టీకి కేటాయించారు. దీనికి మీరేం చెబుతారు?' న్యూస్ యాంకర్ అడిగింది.

'నో కామెంట్' చిర్రెత్తిన ప్రధాని అన్నాడు, 'అప్పుడు నేను రక్షణమంత్రిని' అప్పుడున్న వాణిజ్యమంత్రిని అడగండి'.

సర్, టెలికాం లైసెన్సులని పదేళ్ళ కిందటి బెంచ్ మార్కులను కూడా పట్టించుకోకుండా ఏకపక్షంగా ఫీజులు నిర్ణయించి ఇచ్చేశారు. ఈ కొత్త స్పెక్ట్రమ్ కేటాయింపులు పొందిన కంపెనీ, తన వాటాని పెద్ద లాభానికి బయటి పెట్టుబడిదార్లకు అమ్మేసింది. లైసెన్సు పొందిన కంపెనీ ఆర్ అండ్ ఎస్ టెలికాం, చెప్పింది యాంకర్. 'దీని గురించి మీరేమైనా చెప్పగలరా?'

'నో కామెంట్' అన్నాడు కోపంగా ఉన్న ప్రధాని. 'నేనా సమయంలో రక్షణమంత్రిని, అప్పటి టెలికమ్యూనికేషన్స్ మంత్రిని అడగండి'.

'సర్, ఆయిల్ కనుక్కున్న తరువాత ఆర్ అండ్ ఎస్‌కు ఆయిల్ అన్వేషణ హక్కులు ఇచ్చారు', చెప్పింది న్యూస్ యాంకర్. 'మీరెందుకు జోక్యం చేసుకోలేదో చెబుతారా?'

'నో కామెంట్' తత్తరపడిన ప్రధాని అన్నాడు. 'అప్పుడు నేను రక్షణమంత్రిని, అప్పటి పెట్రోలియం మంత్రిని అడగండి',

'సర్, లేని రైతులు, పశువుల కోసం ఆర్ అండ్ ఎస్ ఆగ్రో నుంచి ఎక్కువ పరిమాణాల్లో మేతను, ఎరువులను కొన్నారు చెప్పింది యాంకర్. 'ఇటువంటి ఒప్పందాలను మస్తరులో ఎలా అంగీకరిస్తారు?'

'నో కామెంట్', నిస్సహాయుడైన ప్రధాని చెప్పాడు. 'నేను అప్పుడు కేవలం రక్షణ మంత్రిని. అప్పటి వ్యవసాయమంత్రిని అడగండి.

'మాజీ ఆర్థికమంత్రి ప్రధానిని కూడా తనతోపాటు దించేశాడు. ప్రధాని రాజీనామా చేశాడని వార్తలు హోరెత్తుతున్నాయి', అన్నాడు అగర్వాల్.

'ఆయన రాజీనామా చేయకపోతే, మొత్తం ప్రభుత్వమే పడిపోయేది– మన ఎంపీల మద్దతు ఉపసంహరించుకోవలసి వచ్చేది, హఠాత్తుగా తగినంతగా ఉన్న మెజారిటీ అదృశ్యమైపోయేది', నవ్వాడు గంగాసాగర్.

'ఇప్పుడేమిటి?' అడిగాడు మీనన్.

'ఆర్థికమంత్రిని దింపితే విదేశాంగ మంత్రి ఆయన చోటులోకి వస్తాడని, ఆ చోటు ఖాళీ అయితే చాందినికి విదేశాంగమంత్రి పదవి వస్తుందని అలా చేశాం. ఇప్పుడు ప్రధానిని దించేశాం – బహుశా హోంమంత్రి ఆయన స్థానాన్ని భర్తీ చేస్తాడు. అన్ని వైపుల నుంచి మద్దతు ఉన్న వ్యక్తి అతనే', అన్నాడు గంగాసాగర్.

'అయితే ఇప్పుడు హోంమంత్రి పదవి ఖాళీ అవుతుందా?' అగర్వాల్ అడిగారు.

'ఖచ్చితంగా. మీకు తెలుసా, పరిస్థితులు గందరగోళంగా ఉన్నపుడు అదుపు చెయ్యడానికి దోపిడి దొంగని ఉంచాలి', గంగాసాగర్ అన్నాడు.

'ఇక్రం? నీకేమైనా పిచ్చా గంగా? చాందిని విమానం కూలిపోవడానికి చేసిన కుట్రలో అతని ప్రమేయం ఉందో లేదో కూడా మనకు తెలియదు. అతణ్ణి నువ్వు హోంమంత్రిగా చెయ్యాలంటావా?' అగర్వాల్ అన్నారు'.

'అవును. స్నేహితులని దగ్గరగా ఉంచుకోవాలి. శత్రువులని మరీ దగ్గరగా ఉంచుకోవాలి' సమాధానమిచ్చాడు గంగాసాగర్. తర్వాత బాగా గట్టిగా నవ్వాడు.

'ఇందులో నవ్వడానికేముంది' అడిగారు అగర్వాల్.

కాన్పూర్లో జరిగే నేరాల్లో చాలావాటికి ఇక్రం బాధ్యత ఉంది. ఇప్పుడు దేశమంతా జరిగే నేరాలకు బాధ్యత వహించాల్సి ఉంది!'

---

'గతేడాది ఎంతమంది హత్య జరిగింది?'

'32,481.'

'ఏభై ఏళ్ళ క్రిందట ఎందరు?'

'9,802'

'గతేడాది ఎంతమంది కిడ్నాపయ్యారు?'

'23,991'.

'మరి ఏభై ఏళ్ళ కిందట?'

'5261'

'గతేడాది ఎన్ని దొంగతనాలు జరిగాయి?'

'91,666'

'మరి ఏభై ఏళ్ళ క్రితం?'

'147,379'

'మనం ఇంకా ఎక్కువ హత్యలు, కిడ్నాప్‌లు చేయించాలి!'

'ఎందుకు?'

'మీరు గమనించలేదా? మీ దొంగలు పెద్దనేరాలు చేయడానికి అంటే హత్యలు, కిడ్నాపులకు గ్రాడ్యుయేట్లయ్యారు. వాళ్ళలా వెళ్ళిపోగానే దొంగతనాలు తగ్గిపోయాయి. అభినందనలు!' చెప్పాడు ఇక్రం వ్యంగ్యంగా హోంసెక్రటరీకి.

---

'ఇండియా, బంగ్లాదేశ్ సరిహద్దు పొడవెంత?'

'4,096' కిలోమీటర్లు.

'ఇండియా, చైనా?'

'3,488 కిలోమీటర్లు'.

'ఇండియా, పాకిస్థాను?'

'3,323 కిలోమీటర్లు'.

'ఇండియా, నేపాల్?'

'1,751 కిలోమీటర్లు'.

'ఇండియా, మయన్మార్?'

'1,643 కిలోమీటర్లు'

'భూటాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో కలిపి మొత్తం మీద పదిహేను వేల కిలోమీటర్లు, అవునా?'

'అవును'.

'ఈ సరిహద్దుల ద్వారా ఉగ్రవాదులు రాకుండా ఎలా ఆపుతారు?'

'వైరు ఫెన్సింగులు నిర్మించి, సాధ్యమైన చోట్ల పెట్రోలింగ్ చేస్తూ.'

'పదిహేను వేల కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతాలని కాపాడడం ఎలా చేస్తారు. మీ పోలీసులకంటె సరిహద్దులెవరికి బాగా తెలుసో మీకు తెలుసా?'

'ఎవరికి?'

'స్మగ్లర్లు. వాళ్ళు సరుకుల్ని అక్రమంగా తేవడానికి సాయం చెయ్యండి. ఉగ్రవాదుల్ని పట్టుకోవడానికి మీకు వాళ్ళు సాయం చేస్తారు'.

ఇక్రం నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరోని – **ఎన్‌సిఆర్‌బి** – సందర్శిస్తున్నాడు. పదుల కొద్దీ హైస్పీడు ప్రింటర్లు రీములకొద్దీ పేపర్ల మీద ప్రింటు చేస్తున్నాయి. 'అదేమిటి?' అడిగాడు.

'రోజువారీ రిపోర్టులు, నేరగణాంకాలు, జాతీయ సంక్షిప్త సమాచారం – హోంమంత్రిత్వశాఖలో వివిధ స్థాయులలో ఇవి అవసరం. డేటాని ఇక్కడ ప్రాసెస్ చేసి శాఖల్లో వందలాదిగా ఉన్న అధికారులకు పంపుతాం', హోం సెక్రటరీ సమాధానమిచ్చాడు.

'ఒక వారం పాటు రిపోర్టులు ఆపెయ్యండి', చెప్పాడు ఇక్రం.

'ఏమిటి?' ఆందోళన చెందిన హోం సెక్రటరీ అడిగాడు. 'అంతా పక్షవాతం వచ్చినట్లు కదలిక ఉండదు. సమాచారం లేకుండా సీనియర్ అధికారులెలా పని చేయగలరు?'

ఎవరైనా ఫోన్ చేసి అడిగితే నోట్ చేయమని **ఎన్‌సిఆర్‌బి**కి చెప్పండి. అడిగిన వాళ్ళకే ఆ సమాచారం అవసరం. మిగిలినవాళ్ళు దాన్ని తీసి ఎక్కడో ఫైల్ చేసి పడేస్తారు. అవసరమైన వాళ్ళకి మాత్రమే రిపోర్టులు పంపి సమయాన్ని, ఖర్చుని ఆదా చెయ్యండి!' ఇక్రం సూచించాడు.

---

వాళ్ళు ఇంటలిజెన్స్ బ్యూరో కార్యాలయాలు దగ్గరున్నారు. డైరెక్టర్ హోం మినిస్టర్ని వెంటబెట్టుకుని తీసుకువెళ్ళి ప్రపంచంలోనే పాతదైన ఇంటలిజెన్స్ ఏజెన్సీ ఎలా పనిచేస్తుందో చెబుతున్నాడు. గత అవతారాలలో వాళ్ళిద్దరూ స్నేహితులే – కాన్పూరు, మేయరు, పోలీసు కమీషనరుగా. కాని కొత్తగా వచ్చిన పదవుల వల్ల వాళ్ళిద్దరి మధ్య సంభాషణ కొంచెం ఇబ్బందిగా మారింది.

'ఏజెన్సీని ఎప్పుడు స్థాపించారు?' ఇక్రం అడిగాడు.

'1885లో', సమాధానం వచ్చింది. బ్రిటిష్ సైన్యం కోసం సిమ్లాలో ఇంటలిజెన్స్ శాఖను ఏర్పాటు చేశారు. ఆఫ్ఘనిస్థాన్లో సైన్యం కదలికలు కనిపెట్టడానికి దానిని ఏర్పాటు చేశారు'.

'తరువాత?' అడిగాడు ఇక్రం.

'1909లో ఇండియన్ పొలిటికల్ ఇంటలిజెన్స్‌గా అయి భారతదేశంలో అరాచక కార్యకలాపాలు జరక్కుండా పర్యవేక్షించేవాళ్ళం. ఉద్యోగులకు స్కాట్లాండు యార్డు, ఎమ్15 శిక్షణనిచ్చేవి'.

'ఆ తరువాత'.

'1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పుడున్న రూపం వచ్చింది'.

'మనిషి ముసలివాడవుతున్నపుడు తెలివి తగ్గుతుంది. మీరు చాలా వృద్ధులై పోయారు', ఇక్రం జోక్ చేశాడు, ఈ సంస్థని ఎలా బాగుచెయ్యాలా అని ఆలోచిస్తూ. 'మీ విజయాలని ఎలా తెలుసుకుంటారు?' అతనడిగాడు.

'మా కేసులు చాలావరకు రహస్యమైనవి. అందుకని విజయాలను గురించి చర్చించుకోలేం' డైరెక్టర్ ఫిర్యాదు చేశాడు.

'అలాగే మీ అపజయాలు కూడా చర్చించనవసరం లేదు కదా' రకీమని ఇక్రం అన్నాడు. మీరేం చేస్తున్నారో పౌరులకు తెలియదు కనుక మీరేం తప్పు చేస్తున్నారో వాళ్ళు చెప్పలేరు! మీరు ఒక ఉగ్రవాద చర్యను గురించి గాని, ఒక దాడిని గురించి గాని ఖచ్చితంగా చెప్పి ఎన్నాళ్ళయింది?'

'మేము చేయగలిగే పనులకు ఆచరణలో కొన్ని పరిమితులుంటాయి', డైరెక్టర్ చెప్పబోయాడు.

'ఇరవై అయిదు వేల మంది ఉద్యోగులు, ఏజెంట్లతోనా?' ఆశ్చర్యంగా అన్నాడు ఇక్రం. ఒక క్షణం ఆగి నేరుగా డైరెక్టర్ ముఖంలోకి చూశాడు. 'నీకోసం సంగతి చెప్పనా? కాన్పూర్ నీకు బాగా తెలుసుగా, అవునా? రణబీర్ గిల్‌తో ఒక సమావేశం ఎందుకు పెట్టుకోకూడదు?'

'అతనెవరు?' డైరెక్టర్ అడిగాడు.

'భారతదేశంలో బార్ ఓనర్ల అసోసియేషన్‌కి ప్రెసిడెంట్. గుర్తుచేసుకో. నీ చిన్నతనంలో కాన్పూర్లో ఉన్న బార్‌కి ప్రొప్రయిటరు - దాన్ని దర్బార్ క్లబ్ అంటారు'.

'అతన్ని నేనెందుకు కలవాలి?'

'జనం తాగినపుడు మాట్లాడని విషయం ఉండదు. మీ ఇంటలిజెన్స్‌ని పునశ్శక్తిమంతం చేయాలనుకుంటున్నావా? తాగి వదరేవాళ్ళతో సమయం గడిపే తాగని వాళ్ళతో మాట్లాడాలి!'

---

'అతను చాలాకోపంగా ఉన్నాడు', ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ చెప్పాడు.

'అయితే చల్లబరుచు', చెప్పాడు గంగాసాగర్.

'ఇంకా వివరాలడుగుతూ పోయాడంటే, మనకి సమస్య ఎదురైనట్లే' చెప్పాడు డైరెక్టర్.

'అయితే అప్పుడు నీకు మరో పరిష్కారం అవసరం' గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

---

ఇక్రం, ఇంటలిజన్స్ బ్యూరో డైరెక్టరు ఢిల్లీలో పాతబస్తీలో ఇరుగ్గా ఉన్న చాందినీ చౌక్‌లో నడుస్తున్నారు. హోం మినిస్టర్ని రావద్దని ఆ ప్రాంతం కల్లోలంగా ఉందని, ఇక్రం భద్రతకు హామీ ఇవ్వలేనని చెప్పాడు డైరెక్టర్. మంత్రి పట్టుబట్టాడు. పాత బస్తీలో హిందూ, ముస్లిం కలహాలు రేగాయి. చాందినీ చౌక్ వీధులు పోలీసు జీపు వెళ్ళేంత వెడల్పుగా లేకపోవడంతో అందరూ వాహనం దిగి నడవసాగారు. మురిగ్గా, ఇరుగ్గా, వెళ్ళడానికి వీల్లేకుండా ఉన్న ఇరుకు వీధిలో చీకటి, భయం పుట్టించే నిశ్శబ్దం, చిన్న మలుపులు ఉన్నాయి. యుద్ధం జరిగిన తర్వాత ఉన్నట్లుగా ఉంది చాందినీ చౌక్. వీధి నిండా రాళ్ళు, పగిలిన సీసాలు పడి ఉన్నాయి. దుకాణాలన్నీ మూసేసి ఉన్నాయి, వీధి కుక్కలు తప్ప మరే ప్రాణీ లేదు.

ఇక్రం ఆ వీధిని చూసి విచారించాడు. భారతదేశం మతం పేరెత్తగానే ఎందుకు ఉద్వేగభరితంగా మారుతుంది? పారిశుధ్యం లేకపోయినా, దయనీయమైన ఆసుపత్రులున్నా, బడులు లేకపోయినా, గుంటలు పడ్డ రోడ్లున్నా, విద్యుత్తు సరిగా రాకపోయినా, నీరు శుభ్రంగా లేకపోయినా, బ్రతకడం దుర్భరమైనా భారతీయులు భరిస్తారు. కాని ఒక మనిషి మతం గురించి ఏ కొంచెం తేడాగా మాట్లాడినా పెద్ద విస్ఫోటం జరుగుతుంది.

'హిందూ, ముస్లింల మధ్య నేను హోం మినిస్టరుగా ఉండగా జరిగే ఆఖరి కలహమిది. అర్థమైందా?' వీధిలో నడుస్తూ డైరెక్టర్‌కి చెప్పాడు. 'దేనికీ రాజీపడవద్దు. నేరం చేసినవాళ్ళకి మనతో పెట్టుకోవడం మంచిది కాదని తెలియాలి!'

వాళ్ళు మరికొన్ని అడుగులు నడిచారో లేదో వెనకాల ఏదో పడింది. వెనుతిరిగి చూస్తే యాసిడ్ మడుగులో పగిలిన గాజుముక్కలున్నాయి. ఎత్తుగా ఉన్న బిల్డింగు పై అంతస్తులోంచి ఎవరో మినిస్టర్ మీద యాసిడ్ బాంబు విసిరారు. 'ఆ బిల్డింగ్ సోదా చెయ్యటానికి నీ మనుషుల్ని పంపు. ఆడ, మగ, పిల్లలు అందరూ ఇక్కడ వరుసగా నిలబడాలి వెంటనే!' అరిచాడు ఇక్రం. అప్పుడే అతని ఆదేశాలు పోలీసులకి అందాయి. పది నిముషాలలో యాభై మందిని పట్టుకున్నారు. 'బిల్డింగులో ఇంకా ఎవరైనా ఉన్నారా?' ఇక్రం అడిగాడు. 'లేరు సర్, అందరూ ఇక్కడే ఉన్నారు', సమాధానం వచ్చింది.

'ఆడవాళ్ళని, పిల్లల్ని లోపలికి వెళ్ళమనండి', ఆదేశించాడు ఇక్రం. భయపడుతున్న స్త్రీలు పిల్లల్ని తీసుకుని లోపలికి వెళుతుంటే వారి పాదాల చప్పుడు వినిపించింది అంతటా. వరుసలో సుమారు పదిహేను మంది మగవాళ్ళున్నారు. ఇక్రం ఆ మనుషులందర్నీ గమనిస్తూ, అనుమానం వస్తే వాళ్ళ చేతులు వాసన చూస్తూ వరస పొడవునా నడిచాడు.

మళ్ళీ వెనక్కి వచ్చాడు అలాగే చేస్తూ, ఏడో మనిషి దగ్గర ఆగి వాసన చూశాడు. 'ముందుకురా' అన్నాడు మృదువుగా. భయపడిన మనిషి ముందుకొచ్చి బెదురుగా అటూ ఇటూ చూశాడు.

'ఇక్కడికి రా, బాబూ' అని పిలిచాడు ఇక్రం ఒక కానిస్టేబుల్ని.

'నీ చేతిలో ఉన్నదిలా ఇవ్వు'. ముందుకు వచ్చిన వ్యక్తి కంగారుపడ్డాడు. 'ఆగండి, మీరలా చేయకూడదు. ఇంకా ఏమీ రుజువు కాలేదు–'

ఇక్రం చేతిలో ఉన్న తుపాకి పేలింది. తూటా నిందితుడి తలలోంచి దూసుకెళ్ళింది. అతను కింద పడ్డాడు. మెదడు ఛిద్రమై బయటికి వచ్చింది. వీధిలో సూదిపడితే వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది. 'మీ కొత్త హోం మినిస్టర్ మీకిచ్చే సలహా ఇది. ఎప్పుడూ, అసలెప్పుడూ నాతో పెట్టుకోకండి! అర్థమైందా? నేనెప్పుడూ – ఎప్పుడూ మొదట కాల్చి, తర్వాత ప్రశ్నలడుగుతాను. కాల్పించుకోవాలని ఉంటేనే, నా జోలికి రండి!' రివాల్వర్ మీదున్న తన వేలి ముద్రలు రుమాలుతో తుడిచేసి, కానిస్టేబుల్‌కి తిరిగి ఇచ్చేశాడు. డైరెక్టర్‌తో, 'ఎన్‌కౌంటర్ అని రాయండి. ఎదురుకాల్పుల్లో చచ్చిపోయాడు'.

మిగిలిన పద్నాలుగు మంది వైపు తిరిగి వాళ్ళతో మాట్లాడాడు.

'ఎవరికైనా తలనొప్పి వెంటనే పోగొట్టుకోవాలని ఉందా?' ఆ రోజు సాయంత్రం అయిదింటికల్లా చాందిని చౌక్ సాధారణ స్థితికి వచ్చేసింది. గంగాసాగర్ సరైన హోంమంత్రిని ఎంపిక చేశాడు.

'రెప్పవెయ్యకుండా ఒక పౌరుణ్ణి కాల్చి చంపాడు' ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ చెప్పాడు.

'ఇక్రం అంతే', చెప్పాడు గంగాసాగర్ శాంతంగా.

'ఇదే అలవాటు చేసుకుంటే, మనకి సమస్య', చెప్పాడు డైరెక్టర్.

'ఇక్రంని హోంమంత్రిగా ఎందుకు చేశానంటే, అతన్ని హద్దుల్లో ఉంచడానికి నువ్వు పక్కనే ఉంటావని. నీ పని నువ్వు చెయ్యి', గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

నాగపూర్ వెళ్ళే ఇండియన్ ఎయిర్‌లైన్స్‌విమానం ముంబయి నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరింది. నూట డెబ్భయిమంది ప్రయాణికులు, పన్నెండు మంది సిబ్బంది ఉన్నారు దానిలో. విమానం నాసిక్ నగరాన్ని దాటగానే, బయల్దేరిన అరగంటకు కోపంగా కనిపిస్తున్న ఒక మనిషి సెమి ఆటోమేటిక్ పట్టుకొని కాక్‌పిట్ తలుపు తెరిచాడు. పైలెట్‌ని లేచి విమానంలో వెనుక, ప్రయాణికులతో ఉండమన్నాడు. భయభ్రాంతుడైన కోపైలెట్‌ని విమానం నడపమన్నాడు. ముగ్గురు తోడుదొంగలు – అందరి చేతుల్లోను హ్యాండ్‌గన్లున్నాయి – ప్రయాణికులని, సిబ్బందిని తమ అదుపులోకి తీసుకున్నారు. వాళ్ళ నాయకుడు ముప్ఫయి నాలుగేళ్ళ పాకిస్థానీయుడు – పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీరులో ముజఫరాబాదుకు విమానాన్ని తీసుకువెళ్ళమన్నాడు. భయపడుతున్న కోపైలెట్ భోపాల్ వరకు వెళ్ళడానికి మాత్రం ఇంధనం ఉందని, అక్కడ మళ్ళీ ఇంధనం పోయించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.

ఎయిర్‌క్రాఫ్ట్‌నుంచి విమానం హైజాక్ అయిందనే సమాచారం కంట్రోల్ టవర్‌కు, అక్కడి నుంచి హోంమంత్రిత్వశాఖకు అందగానే, ఇక్రం న్యూఢిల్లీలో సంక్షోభ నిర్వహణ గ్రూప్ కంట్రోల్ రూంకు చేరుకున్నాడు. ఇటువంటి దురదృష్టకర సంఘటనలు జరిగినప్పుడు ఉన్నతాధికారులతో పనిచేయగల గ్రూప్ అది. అప్పటికే భోపాల్ చేరిన జాతీయ భద్రతా సిబ్బంది – ఎన్‌ఎస్‌జి కమాండర్‌కి 'టైర్లను షూట్ చెయ్యండి' అని ఆదేశాలిచ్చాడు. విమానం భోపాల్ విమానాశ్రయంలో మధ్యలో నిలబడి ఉంది. వేగంగా షూట్ చెయ్యగల షూటర్లకు టైర్లు కనిపిస్తున్నాయి. ముప్ఫయి నిముషాల నుంచి ఇంధనం కోసం చూస్తోంది విమానం. ఒక్క టాంకరు కూడా విమానం దగ్గరకు రాలేదు.

హైజాకర్ పశుబుద్ధికి ఏదో ప్రమాదం తోచింది. 'టేకాఫ్!' అని కోపైలెట్‌ను ఆదేశించాడు. 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి అనుమతి అవసరం' అభ్యంతరం చెప్పాడు భయపడుతున్న కోపైలెట్. కాని అతని తలకి గురిపెట్టిన తుపాకి అతనిక్కావలసిన అనుమతి ఇచ్చింది. 'టేకాఫ్ ఇప్పుడే! ఎవడి అనుమతి అవసరం లేదు!' హైజాకర్ గుర్రుమన్నాడు.

'టైర్లను షూట్ చెయ్యడానికి ఆలస్యం దేనికి? ఇంధనంతో ట్యాంకర్ పంపండి. మనక్కొంత సమయం దొరుకుతుంది ఈలోపు!' న్యూఢిల్లీ నుంచి ఫోన్‌లో ఎన్‌ఎస్‌జికి చెప్పాడు ఇక్రం. 'సర్, ఇంధనం ట్యాంకర్ని విమానం దగ్గరకు తీసికెళితే, టైర్లను కాల్చలేం. చిన్నమంట అయినా సరే విమానాన్ని, ఇంధనం ట్యాంకుని అగ్నిగుండం చేస్తుంది', చెప్పాడు

ఎన్ఎస్‌జి కమాండర్. 'అయితే విమానంలో అసలెంత ఇంధనం ఉందో కనుక్కోండి', అరిచాడు ఇక్రం. 'వాడు ముజఫరాబాద్ వెళ్లడానికి చాలేంత' సమాధానం వచ్చింది. ముంబయిలో ఫైల్ చేసిన ఫ్యూయల్ లాగ్ చూసి, అక్కడి నుంచి భోపాల్‌కు ఎంతవుతుందో లెక్కలేశారు.

'పైలెట్‌ని టేకాఫ్ చేసి, గాలిలో తెలియకుండా ఇంధనం పారబొయ్యమనండి- పైలెట్ గోబుల్డ్‌గూక్‌లో చెప్పండి!' చెప్పాడు ఇక్రం.

'న్యూఢిల్లీకి రావడానికి క్లియరెన్స్ ఇవ్వండి. అతనిక్కడ దిగగలిగితే మనం అదృష్టవంతులం - రాజధానిలో కొంచెం మెరుగ్గా పరిస్థితిని చక్కదిద్దగలం', అన్నాడు ఇక్రం.

భోపాల్ గ్రౌండ్, ఐసి 617 రిక్వెస్ట్ రేడియో చెక్' అడిగాడు కోపైలెట్.

'ఐసి-617 రీడ్ యు ఫైవ్ బై ఫైవ్' గ్రౌండ్ కంట్రోల్ సమాధానమిచ్చింది.

'ఐసి-617 గేట్ సిక్స్, రిక్వెస్ట్ ఐఎఫ్ఆర్ క్లియరెన్స్ టు ముజఫరాబాద్ యాజ్ ఫైల్డ్'.

'ఐసి-617 క్లియర్డ్ ఐఎఫ్ఆర్ ఢిల్లీ నాట్ ముజఫరాబాద్ యాజ్ ఫైల్డ్, లాంబోర్న్ ఫోర్ మైక్ డిపార్చర్ రన్‌వే ట్వంటీ సిక్స్ లెఫ్ట్, ఇనీషియల్ ఫైవ్ థవుజండ్ ఫీట్, స్క్వాక్ ఫోర్ - ఫోర్ - ఫైవ్ -ఫైవ్'.

'ఐసి-617 రిక్వెస్ట్ పుష్ అండ్ స్టార్ట్'.

'ఐసి-617 పుష్ అండ్ స్టార్ట్ అప్రూవ్డ్, కాల్ ఫర్ టేక్సి'.

విమానం నడుస్తూ టేకాఫ్‌కి సిద్ధమైంది. ట్రిగ్గర్ మీదున్న హైజాకర్ వేలి మీద తన ప్రాణం ఆధారపడి ఉందని కోపైలెట్‌కు తెలుసు.

'ఫ్లయిట్ ప్లాన్ ఢిల్లీకెందుకు ఫైల్ చేశావ్?' హైజాకర్ అరిచాడు కోపైలెట్ మీద. 'నేను ముజఫరాబాద్ అడిగాను. బదులుగా వాళ్ళు న్యూఢిల్లీకి అనుమతినిచ్చారు. ముజఫరాబాద్ వెళ్ళేందుకు కావలసినంత ఇంధనం లేదని వాళ్ళకి తెలుసు', సమాధాన మిచ్చాడు కోపైలెట్ చెమటలు కక్కుతూ. 'ఐ డోంట్ కేర్. మనం ముజఫరాబాద్ వెళ్తున్నాం' అరిచాడు హైజాకర్.

'ముజఫరాబాద్ విమానాశ్రయం వాడుకలో లేదు – అక్కడ రాత్రిపూట దిగడం కుదరదు' విమానాన్ని టేకాఫ్ చేస్తూ, వివరించాడు కోపైలెట్. అయిదువేల అడుగుల ఎత్తులోకి రాగానే, రహస్యంగా విమాన ఇంధనం వెయ్యిగ్యాలన్లు వదిలేశాడు. విమానం రెక్కలపై ఉన్న ప్రత్యేక కవాటాలు ఇంధనాన్ని గాల్లోకి వదిలేశాయి. అది భోపాల్ వాతావరణంలో ఆవిరైపోయింది.

'మనం న్యూఢిల్లీలో దిగడం లేదు', కోపైలెట్ మెడకు పిస్టల్ నొక్కుతూ గుర్రుమన్నాడు హైజాకర్. 'ఢిల్లీ వెళ్ళడానికి సరిపడా ఇంధనం ఉంటే, కరాచీకి సరిపోతుంది – అది ఢిల్లీ కన్న దగ్గర!'

'పాకిస్థాన్‌కి చెప్పు విమానం దిగడానికి అనుమతి ఇవ్వద్దని!' ఇక్రం చాందినికి చెప్పాడు. ఇద్దరూ కంట్రోల్‌రూంలో హెూంసెక్రటరీతో ఉన్నారు. చాందిని తల ఊపి ఇస్లామాబాద్ విదేశాంగమంత్రితో మాట్లాడడానికి హాట్‌లైన్ తీసుకుంది.

గౌరవనీయులైన విదేశాంగమంత్రిగారూ, ఐసి–617ని కరాచీలో దిగడానికి మీరు అనుమతిస్తే, పాకిస్థాను ప్రభుత్వం ఈ ఉగ్రవాద చర్యను ప్లాన్ చేసి, ఆర్థిక సాయమిచ్చి ప్రోత్సహించిందని ప్రపంచానికి తెలియజెప్పే అవకాశంగా భావించి, ఉపయోగించుకుంటాం. వేలాది టివి స్టేషన్లు, కరాచీ విమానాశ్రయంలో దిగిన విమానాన్ని చూపిస్తాయి', చాందిని ఫోన్‌లో అంది. 'పాకిస్థాన్‌కి ఈ విధమైన ప్రచారం కావాలా, మీరు నిర్ణయించుకోండి!'

'మేము అనుమతి ఇవ్వకపోయినా, వాళ్లు విమానాన్ని దింపే అవకాశం ఉంది', పాకిస్థాను మంత్రి అర్థించాడు.

'మీరు మీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మూసెయ్యండి. లాండింగ్ లైట్లు తీసెయ్యండి! కమ్యూనికేషన్, నేవిగేషన్ లేకుండా చేస్తే ఐసి–617 కరాచీ నుంచి వెనుతిరుగుతుంది', చాందిని చెప్పి ఫోన్ పెట్టేసింది.

'కమ్యూనికేషన్ షట్‌డౌన్ చేశారు' కోపైలెట్ హైజాకర్‌కి చెప్పాడు.

'ఇప్పుడున్న ఇంధనంతో కరాచీ నుంచి న్యూఢిల్లీ వరకు వెళ్ళగలను నన్నేం చేయమంటారు?'

'నాకు కింద రన్‌వే కనిపిస్తోంది – దింపు!' హైజాకర్ అరిచాడు. ఆశ్చర్యపడిన కోపైలెట్, కేవలం కంటికి కనిపించే దానిపై ఆధారపడి రన్‌వేలా కనిపించిన దానిపై దిగటానికి ఆరంభించాడు, అయితే రన్‌వేలా కనిపించినది రోడ్డు అని గ్రహించి, మళ్ళీ విమానాన్ని పైకి లేపి, పెద్ద ప్రమాదాన్ని తప్పించాడు. 'మంచిది, న్యూఢిల్లీకే వెళదాం పద!' పరిస్థితిలోని నిస్సహాయతను గుర్తించి గొణిగాడు ఉగ్రవాది.

ఢిల్లీ వైపు వెళుతుండగా, అదే దిశలో వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం పైలెట్ న్యూఢిల్లీ విమానాశ్రయం విమానాలు దిగకుండా మూసేశారని చెప్పాడు. నగరంలోకి వస్తుండగా రన్‌వేపైన ట్రక్కులు, ఫైరింజన్లు ఉండడం చూశారు. ఆ గందరగోళం పైన తిరుగుతూ కోపైలెట్ న్యూఢిల్లీ ఫ్లయిట్ కంట్రోల్‌కి తమ ఇంధనం అయిపోతోందని చెప్పాడు. 'వాళ్ళకి దిగడానికి అనుమతినివ్వండి. ఈ పాటికి వాళ్ళ రిజర్వ్ ఇంధనం కూడా అయిపోతుండవచ్చు', చెప్పాడు ఇక్రం.

కోపైలెట్‌కు విచిత్రంగా ఆటోమేటిక్ లాండింగ్ ఫ్రీక్వెన్సీ దొరికింది. నిముషంలోనే ఫైర్‌ట్రక్‌లు, సైన్యం జీపులు, అంబులెన్స్‌లు వెళ్ళిపోయాయి. రాత్రి పదిగంటలకి విమానం న్యూఢిల్లీలో దిగింది. వెంటనే **ఎన్ఎస్‌జి** సాయుధ బలగాలు దాన్ని చుట్టుముట్టాయి.

'టవర్లో దొంగనాయాళ్ళతో మాట్లాడాలి!' అరిచాడు హైజాకర్. **ఎన్ఎస్‌జి** వాళ్ళని వెనక్కి పిలవకపోతే బంధితులను ఒక్కొక్కరిగా చంపేస్తానని కోపైలెట్‌తో కంట్రోల్ టవర్‌కి చెప్పించాడు. పది నిముషాల వరకూ టైమిచ్చి కోపైలెట్ తలకి తుపాకి గురిపెట్టాడు.

'**ఎన్ఎస్‌జి**ని అక్కణ్ణించి వెనక్కి రమ్మనండి' ఇక్రం హోం సెక్రటరీకి ఆదేశాలిచ్చాడు. 'అమాయకులను చంపించామనే నిందను మోయలేం'. తర్వాత ఏం చేయాలో చెప్పాడు. 'ఇంధనం నింపడం ఆలస్యం చేయండి – కొంచెం సమయం కావాలి!' ఆదేశాలిచ్చి హోంసెక్రటరీతోను, ఎన్ఎస్‌జి చీఫ్‌తోను ప్రత్యామ్నాయ మార్గాల గురించి మాట్లాడాడు.

ఇక్రం ఆలస్యం చేస్తూ, సమయం తీసుకొనడంతో మరోసారి హైజాకర్ ప్రయాణికులను, సిబ్బందిని చంపేస్తానని, తొందరగా ఇంధనం నింపమని బెదిరించాడు, ముప్ఫయి నిముషాల తర్వాత, సీనియర్ పైలెట్‌ని విమానం తలుపు తీసి, మోకాళ్ళ పై కూర్చోబెట్టి వందలాది టివి కెమేరాలు చూస్తుండగా కాల్చేశాడు. పైలెట్ నిర్జీవ శరీరం విమానం కింద టర్మాక్‌లో పడింది. 'దొంగనాయాళ్ళారా! మాతో పెట్టుకుంటే ఏమవుతుందో చూడండి!' అంటూ రేడియోలో అరిచాడు.

టీవీ తెరపైన హైజాకర్ ముఖం కనిపించగానే, తనకి పేరు తెచ్చే క్షణం ఆసన్నమైందని ఇక్రం గ్రహించాడు. 'హోం మినిస్టర్ అతనితో మాట్లాడాలనుకుంటున్నాడని చెప్పండి' అంటూ కంట్రోల్ టవర్ ఆపరేటర్‌ని ఆదేశించాడు.

కొన్నిసార్లు బర్‌మన్నాక, హైజాకర్ రేడియో తీసుకున్నాడు.

'నేను విమానంలోకి రావాలనుకుంటున్నాను', ఇక్రం అతనికి చెప్పాడు. నీకు నష్టమేమీ రాదు. లాభమే. మనకి ఒప్పందం కుదిరితే నువ్వు గెలుస్తావు. కుదరకపోతే హైప్రొఫైల్ బందీ – భారత హోం మినిస్టర్ నీకు దొరుకుతాడు'.

'నువ్వు రావచ్చు. ఎవరూ నీతో రాకూడదు. అహంకారమంత్రులెవరూ రాకూడదు!' సమాధానమిచ్చాడు హైజాకర్.

'రెండు చేతుల వేళ్ళూ సమానంగా ఉన్నట్టే, మనుషులు కూడా ఒకరితో ఒకరు సమానమని ప్రవక్త చెప్పాడు. విమానం ప్రవేశద్వారం దగ్గర నా కోసం నిరీక్షించు – నన్ను సోదా చేయవచ్చు. నేను శాంతంగా వస్తాను – మనం ముస్లిం సోదరులం!' చెప్పాడు ఇక్రం.

హైజాకర్ అనుమతించగానే ఇక్రం ఒంటరిగా విమానం వేపు నడిచాడు. కంట్రోల్ రూంతోను, **ఎన్ఎస్‌జి** కమాండర్‌తోను మాట్లాడ్డానికి వీలుగా చెవిలో మిషను ఉంది. **ఎన్ఎస్‌జి** షార్ప్ షూటర్లు విమాన ద్వారాన్ని టెలిస్కోపులో చూస్తూ, ఉగ్రవాది కాని, అతని సహచరులు కాని హోంమంత్రిని కాల్చాలని ప్రయత్నిస్తే నివారించడానికి సిద్ధంగా ఉన్నారు.

**ఎన్ఎస్‌జి** కమాండోస్ విమానం వెనుక నుంచి కనిపించకుండా వచ్చారు. నల్ల అల్యూమినియం నిచ్చెనలతో అయిదు బృందాలు విమానం కింది ద్వారాల నుంచి విమానంలోకి వెళ్ళడానికి పైకి ఎక్కుతున్నారు. హైజాకర్‌తో ఇక్రం విమానంలోకి ఎలా వెళతాడో ప్రోటోకాల్ వివరంగా చర్చిస్తూ కంట్రోల్ టవర్ హైజాకర్ దృష్టిని మరల్చింది. పది నిముషాల తర్వాత విమానం మెట్ల దగ్గరకు వచ్చాడు. అతన్ని సోదా చెయ్యడానికి హైజాకర్ ద్వారం దగ్గర నిలుచున్నాడు.

ఈలోగా **ఎన్ఎస్‌జి** కమాండోలు అత్యవసర ద్వారాలను పేల్చి తెరిచారు. విమానంలోకి ప్రవేశించి సిబ్బందిని, ప్రయాణికులను కిందపడుకోమని అరిచారు. ముగ్గురు

హైజాకర్లను వెంటనే కాల్చేశారు. నాలుగోవాడు - వాళ్ళ నాయకుడు ఇక్రం కోసం ద్వారం దగ్గర నిరీక్షిస్తున్నాడు. కింది నుంచి హోంమంత్రి స్నైపర్‌హాండ్ గన్ తీసి తన వైపు టర్మాక్ లోంచి గురిపెట్టడం చూశాడు.

అత్యవసర ద్వారాలను తెరచి ప్రయాణికులను సిబ్బందిని కిందికి దించేశారు. విమానానికేమైనా అనుకోని ప్రమాదం ఎదురవుతుందనే భయంతో. అయిదు నిముషాల తర్వాత కమాండోలు 'గ్రాండ్‌స్లామ్' అని చెప్పారు రేడియోలో. ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని చెప్పే కోడ్ అది. ఆ సమాచారాన్ని ఇక్రం చెవిలో మిషన్‌కి అందించారు కాని దానిని వినడానికి ఎవరూ లేరు.

కొన్ని నిముషాల తర్వాత ప్రధానికి రేడియో సిగ్నల్ పంపారు. నలుగురు హైజాకర్లు చనిపోయారు; బందీలు విడుదలయ్యారు; ఆరుగురు గాయపడ్డారు; ఒక హోంమంత్రి అమరుడయ్యాడు.

గంగాసాగర్ లివింగ్ రూంలో కూర్చుని మీనన్ వార్తను గట్టిగా చదివి వినిపిస్తున్నాడు. 'శుక్రవారం రాష్ట్రమంతా భారత హోంమంత్రి ఇక్రంషేక్ మరణానికి సంతాపాన్ని పాటిస్తుండడంతో ఉత్తరప్రదేశ్ అంతటా విషాదం అలముకొంది. ఆయన భౌతిక కాయాన్ని ఎయిర్‌ఫోర్స్ విమానంలో న్యూఢిల్లీ నుంచి ఆయన సొంతూరు కాన్పూర్‌కు శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలకు తీసుకొని వచ్చారు. అంతకుముందు వేలాదిమంది ప్రజలు రాజధానిలో ఐసి-617 బందీలను కాపాడడానికి తన ప్రాణాలను అర్పించిన వీరుడికి శ్రద్ధాంజలి ఘటించారు', చదివాడు మీనన్. గంగాసాగర్ వైపు చూశాడు ప్రతిస్పందిస్తాడేమోనని, అదేమీ కనిపించలేదు.

మళ్ళీ చదవడం మొదలుపెట్టాడు. 'బుధవారం హైజాకర్ల బులెట్‌కు బలైన ఇక్రం షేక్‌ను, ఆయన తల్లిదండ్రుల సమాధుల పక్కనే కాన్పూర్ స్మశాన వాటికలో సమాధి చేశారు. హోంమంత్రి అంతిమయాత్ర కాన్పూర్‌లోని పెద్ద మురికివాడలోని ఆయన స్వగృహం నుంచి గ్రీన్‌పార్క్ స్టేడియంకు జనసందోహం మధ్య నిదానంగా చేరింది. అక్కడ వేలాదిమంది ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. వీరిలో ఆయన దత్తపుత్రిక విదేశాంగమంత్రి చాందినీగుప్త, వందలాది రాష్ట్ర కేంద్ర నాయకులు భారతదేశ

హోంమంత్రులలోనే ఉత్తముడైన హోంమంత్రికి శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత భారత సైన్యానికి చెందిన వాహనంలో వేలాదిమంది మద్దతుదారులు అంతిమ నివాళులు అర్పిస్తుండగా భౌతికకాయాన్ని స్మశాన వాటికకు చేర్చారు. భౌతిక కాయాన్ని చూడాలని చాలాచోట్ల బారికేడ్లు తొలగించి ముందుకు వచ్చిన ప్రజలను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. పలు కేంద్రమంత్రులు వెంటరాగా, ప్రధాని పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఇక్రం రాజకీయ వారసురాలు, దత్తపుత్రిక చాందినీ గుప్తను, చనిపోయిన నాయకుడి రాజకీయ గురువు, మిత్రుడు, **అభానస** ముఖ్యుడు గంగాసాగర్ విశ్రను కూడా కలిశారు. నాయకుడు చనిపోయాడన్న బాధతో ఎవరూ ఆత్మహత్యకు పాల్పడవద్దని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు'.

గంగాసాగర్ దగ్గాడు. మీనన్ చదవడం ఆపి, చూశాడు. గంగాసాగర్ కళ్ళు చెమ్మగిల్లి ఉండడం చూశాడు. ఇబ్బందిగా మీనన్ చదవసాగాడు, 'స్టేడియం నుంచి, స్మశాన వాటికకు వెళ్ళే రోడ్లన్నీ సంతాపం ప్రకటించే వారితో నిండిపోయాయి. ఇళ్ళపై కప్పుల పైన జనం నిండిపోయారు. హఠాత్తుగా, మరణించిన మనిషికి వీడ్కోలు పలకడానికి స్టేడియం అంతా జనంతో కిటకిటలాడింది. ప్రజలు ఇంకా ఆయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. అంతిమయాత్ర ర్యాలీ నిదానంగా స్టేడియంను చేరింది. అక్కడ అన్ని రాజకీయ పక్షాల నాయకులు నివాళులర్పించారు. జాతీయ జెండా కప్పిన భౌతిక కాయం ఉన్న పూలతో అలంకరించిన ట్రక్కు వెనకే వందలాది వాహనాలు అనుసరించాయి. తన దత్తు తండ్రి భౌతికకాయం పక్కనే నిలబడిన చాందిని గుప్త వాహనాన్ని ముందుకు వెళ్ళనివ్వమని ప్రజలను కోరుతున్నారు. కొందరు జాతీయ జెండాలు పట్టుకొని ట్రక్కువైపు పరుగు తీసి దగ్గరగా భౌతికకాయాన్ని చూడాలని ప్రయత్నిస్తూ, చాందినిని ఓదార్చారు. ఉత్తరప్రదేశ్‌లో మిగిలిన చోట్లంతా నిశ్శబ్దం అలముకుంది. జనజీవనం స్తంభించింది. నాయకుడి గౌరవార్థం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, దుకాణాలు, వ్యాపారాలు అన్నీ మూసి వుంచారు. ప్రభుత్వం రెండు రోజుల సెలవు ప్రకటించడంతో ఉదయం పూట కనిపించే హడావిడి ఏమీ కన్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. కేబుల్ టి.వి. ఆపరేటర్లు వినోద కార్యక్రమాల ఛానళ్ళు నిలిపివేశారు'.

మీనన్ వ్యాసం చివరకు వచ్చేశాడు. గంగాసాగర్ అని కళ్ళలోకి చూస్తూ చెప్పాడు. 'నేను దయగా ప్రవర్తించడానికే క్రూరంగా ఉండాలి. చెడు మొదలవుతుంది, నాశనం వెనుక మిగిలిపోతుంది, మీనన్ షేక్స్పియర్‌ని చదవలేడు. లేకపోతే తన యజమాని

హేమ్లెట్ నుంచి ఉట్టంకించాడని తెలిసేది. 'ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ని పిలువు. నేను అతనితో మాట్లాడాలి' తన పడకగదిలోకి నడుస్తూ చెప్పాడు గంగాసాగర్.

అతను మృదువుగా ఉచ్చరిస్తున్నాడు, ***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'***

'మాట్లాడే ప్రతిమాట బాధ కలిగిస్తోంది. నేను మాట్లాడలేకపోతున్నాను. నిద్రపోలేకపోతున్నాను, ఆయనని కోల్పోయినట్టుగా పదే పదే కలలు వస్తున్నాయి. ఆలోచించలేకపోతున్నాను జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. తినలేకపోతున్నాను, ఆకలి లేదు. ఏడ్వలేకపోతున్నాను, కన్నీళ్ళు మిగల్లేదు. చూడలేకపోతున్నాను, నా కళ్ళు ఒక చిత్రం మీదే – నా పెంపుడు తండ్రి మీదే నిలిచి ఉన్నాయి. సంతాపం వ్యక్తీకరించలేను, ఆయన నా హృదయంలోనే ఉన్నాడు' సంతాపాన్ని ప్రకటించిన వారినుద్దేశించి చాందిని ప్రసంగించింది.

'ఈరోజు మీ ముందు నిలబడి ఈ మహనీయుడైన మనిషి, నా పెంపుడు తండ్రి అని చెప్పుకొనడం గర్వంగా భావిస్తున్నాను. ఆయన చేసిన త్యాగం గుర్తించమని వేడుకుంటున్నాను. ఆయన మనతో లేకపోయినా ఆయన రాజకీయ, సాంఘిక వారసత్వం మనతో ఉంటుంది. ఆయన మార్గంలో సమర్థంగా పనిచేయడానికి నా జీవితాన్ని అంకితం చేస్తున్నాను – కన్నీళ్ళు తుడవడం, ఆకలి తీర్చడం, జనం చిరునవ్వు చిందించేలా చేయడం కోసం కృషి చేస్తాను', ఇక్రం మాఫియా డాన్ అని, ఎప్పుడూ ట్రిగ్గర్ మీద వేలుంచడానికి ఇష్టపడే మనిషని చెప్పకుండా వదిలేసింది.

'మనదేశంలోని గొప్పమతాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని సృష్టించి భారతదేశాన్ని రూపొందించాయి. నేను హిందువుగా పుట్టాను. ముస్లిం వ్యక్తి నాకు పెంపుడు తండ్రి. దైవం నాకిచ్చిన అత్యున్నత వరమిది – నేను ఏ ఒక్క వర్గానికీ చెందనని దైవం ఇలా నాకు చెప్పాడు – నేను భారతమాత పుత్రికని. నేను మీ అందరి మనిషిని!' కన్నీళ్ళు అందమైన ముఖం మీంచి జారుతుండగా ఆమె చెప్పింది.

'మృత్యువు అందమైంది – గొప్పగా సాధిస్తుంది' చివరి వరుసలో మీనన్‌తో పాటు కూర్చున్న గంగాసాగర్ అన్నాడు. 'ఇక్రం బతికున్నప్పుడు చేసినదానికన్న, చనిపోయి చాందినికి చాలా సాధించి పెట్టాడు'.

హమీదా – గతంలో హమీద్ – ఒక షాపు ముందు నిలబడి నాలుక ఆడిస్తోంది. 'షాపుకి మా ఆశీస్సులు వద్దా?' అంటూ అరుస్తూ, తన పెట్టుడు జడను ఊపుతోంది. షాపతను ఆమెవైపుగాని, ఆమెతో ఉన్న సచ్లాదేవి గ్యాంగు వైపుగాని చూడలేదు. వాళ్ళు అసహ్యమైన మేకప్‌తోను, మగశరీరాలకు చీరలు చుట్టుకొని వచ్చారు. తన బెదిరింపు పనిచేయలేదని గమనించి మిగిలిన కొజ్జాలు గట్టిగా చప్పట్లు చరుస్తూ, అరుస్తూ కస్టమర్లను లోనికి రానీయకుండా గోల చేశారు. షాపతను వెంటనే తన పరిస్థితి గమనించుకొని వాళ్ళకి డబ్బులిచ్చి, ఆశీస్సులు తీసుకున్నాడు. హమీదా మనసులో తన అదృష్టాన్ని నిందించుకుంది – హమీద్‌గా ఉన్నప్పుడు ఇక్రంని మసీదులో కలుసుకున్న దురదృష్టమైన రోజుని తలచుకుంది. 'అబ్బాయ్! నన్ను కలవాలనుకుంటున్నావా? చెప్పు ఏమిటో!' అన్నాడు ఇక్రం. తొలిసారి కలిసిన కొన్ని వారాల తర్వాత హమీదు మసీదు దగ్గర మళ్ళీ ఇక్రంను కలిశాడు.

'నేను రషీద్‌ని ఆర్ అండ్ ఎస్ విమాన సంస్థలో కలిశాను. నాకు ఉద్యోగం ఇచ్చాడు. కాని నన్నో పని చేయమన్నాడు... నాకు భయం వేస్తోంది' హమీద్ చెప్పసాగాడు.

'భయం దేనికి?' అడిగాడు ఇక్రం కుతూహలం రేకెత్తగా.

'ఒక హెలికాప్టర్ ఫ్యూయల్ ట్యాంకులో గులకరాళ్ళు వేయమంటున్నాడు. అది మీ పెంపుడు కూతురు చాందిని గారు వెళ్ళే విమానం. దాన్ని కూల్చడానికి. ప్లీజ్ సర్, సాయం చెయ్యండి!'

'భయపడకు, అబ్బాయ్, రషీద్ చెప్పినట్టు చెయ్ మిగతాది నేను చూసుకుంటా'.

'కాని నాకే సమస్యలో ఇరుక్కోవాలని లేదు...'

హమీద్ వెళ్ళిపోయాక, ఇక్రం ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌కి ఫోన్ చేసి మాట్లాడాడు.

'చాందిని చాపర్‌ని కూల్చమని చెప్పాడతనికి' ఇక్రం చెప్పాడు.

'ఈ రషీద్‌ని వెంటనే అరెస్టు చేద్దాం', డైరెక్టర్ సూచించాడు.

'అది అతని అసలు పేరు కాకపోవచ్చు. వాడితో ఇంకా మనుషులు ఉండొచ్చు', చెప్పాడు ఇక్రం. 'వద్దు రషీద్ చెప్పినట్లుగా హమీద్‌ని చేయనిద్దాం. నీ మనుషులని సిద్ధంగా ఉంచి వాణ్ణి పట్టుకొని ఆర్భాటం చెయ్యి. హమీద్‌ని పోలీసు కస్టడీకి పంపకు. నీ కస్టడీలోనే ఉంచు. రషీద్ మీద కన్నేసి ఉంచు, వాడిని వాడితో ఉన్న అందర్నీ పట్టుకోవచ్చు'.

'హమీద్‌ని సచ్లాదేవికి అప్పజెప్పడానికెలా ఒప్పుకున్నావ్?' ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు మీద అరిచాడు ఇక్రం.

'నేనేం చెయ్యాలి? నేను అప్పజెప్పనని చెప్పాలా గంగాసాగర్‌కి?' డైరెక్టర్ అడిగాడు.

'అతన్ని వదిలిపెట్టేయాల్సింది నువ్వు!' ఇక్రం కోప్పడ్డాడు.

'గంగాసాగర్ నన్ను వేటాడేవాడు, హమీద్‌గాడి వట్టలు కాదు, నా వట్టలు పీకేవాడప్పుడు!' అలసిపోయిన డైరెక్టర్ వివరించాడు. గంగాసాగర్‌కి నిజం చెప్పేయాల్సింది – హమీద్ అమాయకుడని, వాణ్ణి అడ్డం పెట్టుకుని రషీద్‌ని పట్టుకోవాలనుకుంటున్నామని'.

'అప్పుడు ఆర్ అండ్ ఎస్ విమానయాన సంస్థలో రషీద్‌కి, హమీద్‌కి ఉద్యోగం ఇప్పించింది ముందు మీరేనని కూడా చెప్పాల్సి వచ్చేది అప్పుడు'.

'హైజాకర్ల నాయకుడికి తుపాకి గురిపెట్టాల్సిన అవసరం లేదు ఇక్రంకి. **ఎన్ఎస్‌జి** వాళ్ళకి వదిలేసి ఉంటే ఆయన బ్రతికేవాడు' చెప్పాడు ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు.

'నాకు తెలుసు. నాకు తెలుసు' చెప్పాడు గంగాసాగర్'. కాని టీవీలో హైజాకర్ ముఖం చూసి, రషీద్ అని గుర్తుపట్టాడు. రషీద్ చాందినిని చంపాలనుకున్నాడు అనే విషయం రక్తాన్ని ఉడుకెత్తించి ఉంటుంది. వాణ్ణి చంపెయ్యాలని నిశ్చయించుకుని ఉంటాడు'.

'ఇక్రంని రక్షించడానికి **ఎన్ఎస్‌జి** వాళ్ళు రషీద్‌ని కాల్చారు', చెప్పాడు డైరెక్టర్.

'ఇక్రం అంతే – ముందు కాల్చడం, తర్వాతే ప్రశ్నలు అడగడం. ఇక్రం ఉద్రేకం గల దొంగే కాని, బంగారంలాంటి గుండె. తొందరగా చంపేస్తాడు – అయితే న్యాయం చేస్తున్నాను అనుకుంటేనే. ముఖ్యమంత్రి పదవి వదలడానికి నేనతన్ని మోసం చేశానని హమీద్ చెప్పినపుడు మోసగింపబడ్డాననుకొని ఉంటాడు, కాని చాందిని మీద ఎన్నటికీ ప్రతీకారం తీర్చుకోడు', చెప్పాడు గంగాసాగర్.

'మీరింత దయగా ఎప్పట్నించి అయ్యారు, సర్?' డైరెక్టర్ అడిగాడు.

'నిర్దాక్షిణ్యంగా నిన్ను పోలీసు కమీషనర్‌గా తీసేసినప్పటినుంచి. నీమీద జాలి పడి, నిన్ను ఇంటలిజెన్స్ బ్యూరోగా వేయించాను. నువ్వు కూడా ఇక్రం స్నేహితుడవేగా, నీకు తెలుసు!'

అయ్యో, నా పనిలో శాశ్వత స్నేహితులుండరు – శాశ్వత ప్రయోజనాలు మాత్రమే'.

పాతఢిల్లీలో ఎర్రకోట ప్రాచీనమైన పెద్ద కట్టడం – ఇది కేవలం స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించే చోటే కాదు. దానిలో ఎన్నో గదులు, సొరంగాలు ఉన్నాయి. మొగలుల కాలంలో కోటలో మూడు వేల మందికి పైగా జనం నివసించేవారు. దానిలోపల ప్రత్యేకంగా కాపలా కాసే పది గదులున్నాయి. అవి భారత ఇంటలిజెన్సు బ్యూరోకి చెందినవి. నేరస్థులను ప్రశ్నించడానికి వాటిని వాడతారు.

ఈ గదుల్లో ఒకదానిలో రషీద్ ఆసుపత్రి పడకపై ఉన్నాడు. అత్యాధునిక వైద్య పరికరాలతో అతన్నిక్కడికి తీసుకువచ్చారు. ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌కి, గంగాసాగర్‌కి మాత్రమే రషీద్ బ్రతికి వున్నాడని తెలుసు.

'ఈ వ్యక్తిని మీరు మా కస్టడీకి విడుదల చెయ్యాలి!'

చాలా అధికారపూర్వకంగా ఆదేశం వినిపించింది. ఎవరింత మర్యాద లేకుండా మాట్లాడారో చూడాలని డైరెక్టర్ కుర్చీని వెనక్కి తిప్పి చూశాడు. **రా**(ఆర్ఎడబ్ల్యు) చీఫ్‌ని చూసి విస్మయం చెందాడు.

'మీరతన్ని విడుదల చెయ్యాలి' సెక్రటరీ (పరిశోధన) అన్నాడు మామూలుగా.

'కారణం చెబుతారా, నాకు?' ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు అడిగాడు.

'అతను **రా** ఏజంటు. చాలా?'

'రాస్కెల్స్, మీరేం చేయాలనుకుంటున్నారు? విదేశాంగమంత్రి వెళ్లే హెలికాప్టర్‌ని కూల్చాలనే కుట్రతో ఇతనికి సంబంధం ఉంది. నూట డెబ్భయ్యేడుమంది ప్రయాణికులున్న విమానాన్ని అతను హైజాక్ చేశాడు. **రా** ఏజెంటయితే భారత మంత్రులకు వ్యతిరేకంగా ఎందుకు పనిచేస్తాడు? పౌరులున్న విమానాన్ని ఎందుకు హైజాక్ చేస్తాడు?' ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు అడిగాడు.

'రషీద్ అలియాస్. అసలు పేరు మఖ్దూమ్. అతను పాకిస్థానీ డబుల్ ఏజెంటు. చైనా ఆపరేషన్ ఒకదానిలో మేమతన్ని ఉపయోగించాం. ఆపరేషన్ చివర్లో చైనా రక్షణ

మంత్రిత్వశాఖ **ఎంఎస్ఎస్** అతన్ని అరెస్టు చేస్తుంది, ముందుగా ఆ విషయాన్ని అతనికి మేము చెప్పలేదు' వివరించాడు రా అధికారి.

'కాని ప్లాన్ ఉద్దేశ్యం ఏమిటి?'

'ఈ ఆపరేషన్లో చైనాకి, పాకిస్థాన్‌కి మధ్య విభేదాలు తీసుకురావడంలో మఖ్మద్ సఫలుడయ్యాడు. దానివల్ల చైనాతో మన విదేశాంగమంత్రి ధైర్యంగా చర్చలు జరపగలిగారు'.

'ఎంఎస్ఎస్ అరెస్టు చేస్తే, మరి అతను భారతదేశానికెలా వచ్చాడు?' అడిగాడు డైరెక్టర్.

'జిన్‌జియాంగ్‌లో అరెస్టయిన జైలుపై యుఘిర్ కామ్రేడ్లు దాడి చేసి అతన్ని విడిపించారు. నేపాలీ స్మగ్లర్ల సాయంతో అతను భారతదేశంలోకి వచ్చి, లక్నో చేరాడు. మానవతా దృష్టితో సాయం చెయ్యమని ఇక్రం భాయ్‌ని అడిగాడు. అతని నేపథ్యం తెలియక ముస్లిం సోదరుడి పట్ల తనకు బాధ్యత ఉందని ఇక్రం అతనికి సాయం చేశాడు'.

*ఇక్రంకి ఎందుకు కోపం వచ్చిందో ఇప్పుడర్థమైంది. తాను జాలిపడి సాయం చేసిన ముస్లిం సోదరుడే చాందిని హెలికాప్టర్ని కూల్చాలనుకోవడంతో పాటు, పౌరులున్న విమానాన్ని హైజాక్ చేయడంతో ఇలా చేసి ఉంటాడు'* అనుకున్నాడు డైరెక్టర్.

ఇరవైమూడో అంతస్తులో ఉన్న ఎగ్జిక్యూటివ్ బోర్డురూంలోంచి నగరమంతా కనిపిస్తుంది. మేపుల్ చెక్కతో చేసిన సమావేశ బల్ల చుట్టూ మంచి లెదర్‌తో తయారుచేసిన ఎటుపడితే అటు తిరిగే కుర్చీలున్నాయి. గోడలకు వ్యవస్థాపకులు పెద్ద చిత్రాలు ఉన్నాయి. రూమంతా క్యూబన్ చుట్టల వాసనతో నిండిపోయింది. రంగ్తా, సోమానీ – భాగస్వాములిద్దరూ బల్లకి చెరోవైపున వేడిగా ఉన్న కామోమైల్ టీ చప్పరిస్తూ ఉన్నారు.

అన్యమనస్కంగా టీని కలుపుతూ, 'గంగాసాగర్‌తో మనమాడిన ఆట మననే ఎదురుదెబ్బకొట్టింది' అన్నాడు రంగ్తా. 'నీ మనిషి – మాజీ రక్షణ మంత్రి – ప్రధాని పదవి నుంచి అవమానకరంగా వెళ్ళగొట్టబడ్డాడు. నా మనిషి – ఆర్థికమంత్రి – యూనివర్సిటీల్లో ఉపన్యాసాలిస్తూ తృప్తి పడాల్సి వస్తోంది!'

'ఒప్పందాలన్నీ ఎక్కడివక్కడేవున్నాయి – టెలికాం, ఆయిల్, మేత, భూమి. వాటిని ముందుకు కదపడానికి ప్రభుత్వం భయపడుతోంది' చెప్పాడు సోమానీ. 'చివరికి మన

పోట్లాటలతో, రాజీలతో సమయం చూసి మనం కొన్న స్టాక్ అమ్మకాలు, కొనుగోళ్ళ పైన కూడా రెగ్యులేటర్ తనిఖీ జరుగుతూ ఉంది. కార్మిక సంఘాల వివాదం వారం నుంచి వ్యాపారాన్ని స్తంభింపజేసింది!'

పెద్ద ఓక్ డోర్ మీద చిన్నగా తట్టిన చప్పుడైంది. 'కమిన్' రంగ్తా అన్నాడు. మంచి బట్టలు వేసుకున్న సెక్రటరీ లోపలికి వచ్చాడు. 'మధ్యలో వచ్చినందుకు క్షమించండి, సర్స్. బయట ఒక పెద్దమనిషి ఉన్నారు. ఆయనకి మీతో అపాయింట్‌మెంట్ లేదు. కాని తన పేరు మీకు చెబితే మీరిద్దరూ ఆయనను తప్పక కలవాలనుకుంటారని చెబుతున్నాడాయన'.

'ఎవరాయన?' సోమానీ కుతూహలంగా అడిగాడు.

'తన పేరు పండిట్ గంగాసాగర్ మిశ్ర అని చెప్పాడాయన'.

'నేనేం చేయగలనో మీ ఇద్దరికీ అర్థమైందనుకుంటాను. నాదే పైచేయి అయినా, సంధి చేసుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను', ప్రకటించాడు గంగాసాగర్. రంగ్తా, సోమాని ముఖాలు చూసుకున్నారు, మోసం ఎక్కడుందోనని.

'మోసమేమీ లేదు' చెప్పాడు గంగాసాగర్ వాళ్ళ మనసులు చదువుతూ. 'పరపతి ఉన్న వ్యాపారస్థుల స్నేహం విలువని నిర్లక్ష్యం చేసేవాణ్ణి కాదు నేను'.

'ఆ స్నేహం మూలంగా మాకేం ఉపయోగం?' అడిగాడు రంగ్తా.

'ముందుగా ఒక ఉగ్రవాది. రషీద్‌కి మీ విమానసంస్థలో ఉద్యోగం ఇచ్చినందుకు విచారణ జరక్కుండా చూస్తాను. ఆ రషీదే గౌరవనీయురాలైన విదేశాంగమంత్రి హెలికాప్టర్ని కూల్చాలని యత్నించాడు. తరువాత అతనే, విమానాన్ని హైజాక్ చేసి గౌరవనీయుడైన హోంమంత్రి చనిపోయేలా చేశాడు', పిడుగులు కురిపించాడు గంగాసాగర్.

భాగస్వాములిద్దరూ భయపడి నిశ్శబ్దంగా ఉండిపోయారు. 'కాని నేనిక్కడకు మీకు పాఠం చెప్పడానికి రాలేదు', చరిత్ర అధ్యాపకుడు మృదువుగా అన్నాడు. 'స్నేహం చేద్దామని వచ్చాను', ఆయన జోక్ చేశాడు.

'దేవుడా నా స్నేహితుల నుంచి నన్ను రక్షించు. శత్రువుల నుంచి నన్ను నేను రక్షించుకుంటాను' రంగ్తా మనసులో అనుకున్నాడు గంగాసాగర్ తన ప్రతిపాదన చెబుతుండగా.

'వచ్చే సాధారణ ఎన్నికల తరువాత **అభానస** ఢిల్లీలో పాలకపక్షం కావాలనుకుంటోంది. దానికి మాకు డబ్బు కావాలి. చాలాకావాలి', గంగాసాగర్ వివరించాడు.

'మీకు అగర్వాల్ గారున్నారుగా' అన్నాడు సోమాని. **అభానస**కు పెద్ద పోషకుడాయన!

'అదే నా సమస్య. అగర్వాల్‌గారు మాకు ఉపకారే గాని ఆయనకే ఉపకారం అవసరమైంది'.

'ఏ రకంగా?' రంగ్తా అడిగాడు.

'మీ ఒప్పందాలు నాలుగూ స్తంభించి ఉన్నాయి. **అభానస** మంత్రుల చేతిలో వాటి జాతకం ఉంది. మనం స్నేహితులమైతే, మా మంత్రులని కూడా స్నేహంగా ఉండమని చెబుతాను' పండిట్ ప్రతిపాదించాడు.

'ఎలా?' రంగ్తా ఆశ్చర్యపోయాడు.

'ఆర్ అండ్ ఎస్‌కు కేటాయించిన వేలాది ఎకరాల్లో కొన్ని వందల ఎకరాల విలువే తగ్గించి చూపారని వాణిజ్యమంత్రిత్వశాఖ గుర్తిస్తుంది. మిగిలినవి మీకే ఉంటాయి. టెలికమ్యూనికేషన్ల మంత్రి టెలికాం లైసెన్సులు తక్కువస్థాయిలో జారీచేశారని, ఫీజు రెట్టింపు చేస్తాడు. ఆర్ అండ్ ఎస్ టెలికాంకి అప్పుడు కూడా లాభమొస్తుంది, మార్కెట్ రేటులో పదోవంతు చెల్లించినాగాని. ఆయిల్ అన్వేషణ హక్కులు ఆర్ అండ్ ఎస్ పెట్రోలియంకు ఇవ్వడానికి కారణం మరే సంస్థ పర్యావరణ బీమాకు హామీ ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో నీళ్ళకి హక్కులు ఇవ్వడం జరిగిందని పెట్రోలియం మంత్రి గమనిస్తాడు. చివరగా వ్యవసాయమంత్రి తమ శాఖ వేసిన పశువుల లెక్కల్లో పొరపాట్లున్నాయని గమనిస్తారు. ఆర్ అండ్ ఎస్ ఆగ్రోకి మేతకు, ఎరువులకు ఇచ్చిన ఆర్డరు సరిగానే ఉందని తెలుసుకుంటాడు. మనం స్నేహితులమైతే ఎంత చేయడానికి సిద్ధంగా ఉన్నానో చూడండి!' చెప్పాడు గంగాసాగర్.

'మరి మీరు రేపిన యూనియన్ వివాదం మాటేమిటి?' అడిగాడు రంగ్తా. 'మీరు అగ్గిపుల్ల గీశారు. నిప్పెవరు ఆర్పుతారు?'

'భయపడకండి. మా యూనియన్. **ఎబిఎన్‌కెయు** – మీ ప్రధాన ప్రత్యర్థి యూనియన్ల రెంటి సభ్యుల్ని ఈ రెండు వారాల్లో మావైపు తిప్పుకుంది. కార్మికులలో

యాభై శాతానికి పైగా మా **ఎబిఎన్‌కెయు**లో ఉన్నారు. మేము వెంటనే కొత్త వేతన, ఉత్పాదకతా ఒప్పందానికి సిద్ధంగా ఉన్నాం'.

'దీనికి మేమెంత ఖర్చు పెట్టాలి?' సోమాని పొడిగా అడిగాడు.

'పునరుద్ధరించిన నాలుగు ఒప్పందాల వల్ల వచ్చే ఆదాయంలో పదిశాతం అగర్వాల్ గారి కంపెనీకి చెందాలి', చెప్పాడు గంగాసాగర్.

'ఆయనతో మీరెందుకంత ఉదారంగా ఉంటారు?' అడిగాడు సోమాని.

'ఇటీవల పాయసం చాలా ఖరీదైంది', చెప్పాడు గంగాసాగర్ గూఢంగా.

## పదిహేడో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

తక్షశిల నానుకుని ఉన్న అడవిలో నిరాడంబరంగా ఉన్న కుటీరంలో వెలుతురు తక్కువగా ఉంది. చంద్రగుప్తుడు ప్రాసాదంలో ఉండమని ఎంతగా కోరినా వినకుండా చాణక్యుడు స్పార్టనుల చుట్టుపక్కలే ఉంటానని నిర్ణయించుకున్నాడు. చాణక్యుడు తన బల్ల దగ్గర నేల మీద కూర్చున్నాడు అతని ముందు రెండు దీపాలున్నాయి – ఒకటి వెలుగుతోంది. ఒకటి వెలగడం లేదు.

అతని ముందు నేల మీద గ్రీకు కులీనుడు కూర్చుని ఉన్నాడు. పొట్టిగా, ఉంగరాల జుట్టుతో, నున్నగా ఉన్న గడ్డం ఉన్న మనిషి.

'అతని బెల్టుమీద ఉన్న రత్నాలు తప్ప మరే ఆభరణాలు పెట్టుకోలేదు. అతని పేరు మెగస్తనీసు. చంద్రగుప్తుడి ఆస్థానానికి సెల్యూకస్ కొత్తగా పంపిన మాసిడోనియా రాయబారి అతను. 'నాతో స్పష్టంగా చెప్పండి' అర్థించాడు చాణక్యుడు. 'ఈ రోజు నాతో జరిపే సమావేశం వ్యక్తిగతమా? అధికారికమా?'

మెగస్తనీసు చిరునవ్వు నవ్వాడు. ముందుగానే అతనికి నిర్ద్వంద్వంగా మాట్లాడే బ్రాహ్మణుడి గురించి, తన ప్రయత్నాలతోనే చంద్రగుప్తుడికి సింహాసనం సాధించి పెట్టాడని చెప్పి పంపారు. 'తక్షశిలకు మా ప్రభువు సెల్యూకస్ ప్రతినిధిగా, చంద్రగుప్త మహారాజు కొలువుకు వచ్చాను. కాని ఈ రోజు నా వ్యక్తిగతంగా మిమ్మల్ని కలవాలని వచ్చాను ఆచార్యా. మీ సామర్థ్యాలను గురించి, మీ మాటలు, చేతల గురించిన కీర్తి ఎంతోదూరం వ్యాపించింది. దైవస్వరూపుడుగా భావింపబడే ఈ బ్రాహ్మణుని చూడాలని నేను వచ్చాను.'

'ఆహా! అయితే మీరొక క్షణం ఆగాలి', అన్నాడు చాణక్యుడు రెండో దీపం వెలిగిస్తూ, మొదటి దీపం కొండెక్కిస్తూ.

మెగస్తనీసు కర్థం కాలేదు. ఒక దీపం వెలిగించి, మరొకదాన్ని కొండెక్కించడం వల్ల ప్రయోజనమేమిటి? రెండూ ఒకేలా ఉన్నాయి అతను సంకోచిస్తూ అడిగాడు, 'ఆచార్యా, అలా ఎందుకు చేశారు? రెండు దీపాల వెలుతురు ఒకేలా ఉంది'.

'రెండూ ఒకే రకానివే, స్నేహితుడా. కాని మొదటి దీపంలో ప్రభుత్వ ధనాగారం నుంచి వచ్చిన నూనె, రెండో దీపంలో నా డబ్బుతో కొన్న నూనె ఉంది. మీరు అధికారిక సమావేశానికి రాలేద కనుక ప్రభుత్వ వనరులను నేనెందుకు ఖర్చు చెయ్యాలి?' అన్నాడు చాణక్యుడు. చంద్రగుప్తుడి విజయానికి మూలకారణమేమిటో ఆశ్చర్యపోయిన మెగస్తనీసు కర్థమైంది.

'నా ప్రభువు సెల్యూకస్ మీతో చెప్పమన్నారు – చంద్రగుప్త చక్రవర్తితో పరస్పర లాభదాయకమైన దౌత్యసంబంధాలు నెలకొల్పుకొంటానని, ఫిర్జియాకి, సింధుకి మధ్య ఉన్న ప్రదేశంపై మాసిడోనియా నియంత్రణ వదులుకోనని".

'ఇది వ్యక్తిగత సందర్భన అనుకున్నానే. అనవసరంగా నా వ్యక్తిగత డబ్బుని ఖర్చు చేయిస్తున్నారు', చాణక్యుడు వేళాకోళంగా ఉన్నాడు. 'స్నేహితుల మధ్య యుద్ధం గురించి మనం మాట్లాడుకోవద్దు. మంచి మనిషీ, బదులుగా ప్రేమ, పెళ్ళి, సంతోషాల గురించి మాట్లాడుకుందాం'.

విస్తుపోయిన రాయబారి ఈ కొత్త నిపుణత్వాన్ని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తుండగా చాణక్యుడు మళ్ళీ మట్లాడాడు.

మా రాజు చంద్రగుప్తుడు ఇప్పటికే సౌందర్యవతి, మీ ప్రభువు కుమార్తె కార్నీలియాను వివాహమాడాడు. వాళ్ళ రహస్య వివాహం – గాంధర్వ వివాహం – కొన్ని నెలల కిందటే జరిగింది. చూడండి మెగస్తనీసు మనిద్దరం వియ్యాలవారం అనుకోవచ్చు ఒకరకంగా!'

'కాని – కాని – రహస్య వివాహమేమిటి? ఎలా జరిగిందది?' భయంగా నత్తుతూ అడిగాడు మెగస్తనీసు.

చాణక్యుడు నవ్వాడు. 'పెద్దలు కుదిర్చిన పెళ్ళిలో, పెళ్ళయిన తర్వాత వరుడు, వధువుని అనుభవిస్తాడు. గాంధర్వవివాహంలో పెళ్ళిచేసుకోవాలని ఆమెని ముందుగా అనుభవిస్తాడు!' మొరటుగా చెప్పాడు. మెగస్తనీసు ఇబ్బందిగా కదిలాడు – అతని పురుషాంగం గోక్కోవాలనుకున్నాడు కాని ఈ శక్తిమంతుడైన మేధావి ముందు అసహ్యంగా గోక్కోలేక ఆగిపోయాడు.

'కాని సెల్యూకస్ ఈ వివాహానికి అనుమతించలేదు కదా' చెప్పాడు మెగస్తనీసు.

'కార్నీలియాకి అనుమతి అవసరం లేదనుకుంటాను. మారాజుకి ఆమె అంటే ఎనలేని ఇష్టం. కార్నీలియాలో తల్లి, చెల్లి, కూతురు, వేశ్య వంటి నాలుగు లక్షణాలు - పరిపూర్ణమైన స్త్రీకి కావలసిన లక్షణాలు అన్నీ ఉన్నాయి. మాకు నాలుగు అదృష్టసంఖ్య అని చెప్పానా?' అడిగాడు చాణక్యుడు.

మెగస్తనీసుకు నోట మాట రాలేదు. అతను తేరుకొనక ముందే చాణక్యుడన్నాడు, 'చూశారా, రాయబారీ, మీ సందర్శన నిజంగానే వ్యక్తిగతం. వధువుకివ్వాల్సిన కట్నం గురించి మాట్లాడుకుందామా ఇప్పుడు?' మెగస్తనీసు పురుషాంగం ఇంకా ఎక్కువగా దురదపెడుతోంది అతను నత్తుతూ 'క-క-కట్నమా?' అన్నాడు.

'అవును. సెల్యూకస్ వంటి రాజు కూతురికి ఇచ్చే కట్నం అతని అధికారానికి, వైభవానికి తగినట్లుగా ఉండాలి. కట్నంగా అరకేషియా, గెడ్రోషియా పరోపమిసాడే, అరియాలను మా సమర్థుడైన రాజుకి ఇవ్వాలని సూచిస్తున్నాను. భారతదేశంలో నాలుగు అదృష్టసంఖ్య అని నేను మీకు చెప్పలా?'

'అంతేనా?' అడిగాడు మెగస్తనీసు ఆలోచిస్తూ.

'చాలదు. మీ ప్రభువు సెల్యూకస్, ఇంకా అలెగ్జాండర్ సింహాసనాన్ని కోరేవారిని ఓడించాలి. ఇంకా ఆయన ఆంటిగోనస్, డిమిత్రియస్‌లతో పోరాడాలి. వాళ్ళు అలెగ్జాండర్ ప్రాంతాలు కోరుతున్నారు. మా చక్రవర్తి మీకు అయిదువందల ఒక్క ఏనుగులను ఇస్తారు. మీ శత్రువులని భయపెట్టి, జయించడానికి! అయిదువందల ఒకటి ఇంకా అదృష్టం కలిగించే సంఖ్య, ఏం?'

'ఈ ఏనుగులకి పరిహారంగా ఏమివ్వాల్సి ఉంటుంది?' మెగస్తనీసు వ్యాకులంగా అడిగాడు.

'మీ పాతమిత్రుడు పురుషోత్తముడితో అతడు మగధపై దండెత్తవచ్చని, ఒక్కరాత్రి మాత్రం ఆ సంతోషాలను అనుభవించవచ్చని, మర్నాటి ఉదయమే మగధను విడిచివెళ్ళాలని చెప్పాలి. మగధతో అతనికి ఒక్కరాత్రి సంబంధమే. ఆపై అతనికి మగధతో సంబంధముండ కూడదు' కళ్ళలో క్రూరమైన వెలుగు నిండగా చెప్పాడు చాణక్యుడు.

చాలా ఆలస్యమైపోయింది. తన మోసపోయాడు, పురుషోత్తముడు కోపంగా ఉన్నాడు. తక్షశిలలో చంద్రగుప్తుడి పట్టాభిషేకం జరిగిందని అతని గూఢచారుల ప్రధానాధికారి అభయ చెప్పాడు. ప్రమాణస్వీకారాన్ని ఆ ముసలి లంజాకొడుకు చాణక్యుడు చేయించాడట. అంటే గురు శిష్యుల మధ్య పొరపొచ్చాలేమీ లేవు. కాని దీని గురించి ఇప్పుడేమీ చేయలేడు. ఆలస్యం జరిగిపోయింది. అతని సైన్యం ఇప్పటికే కదులుతూ ఉంది. కదులుతున్న పెద్ద యుద్ధ యంత్రాన్ని ఆపడం కష్టం. పురుషోత్తముడు తనతో యుద్ధానికి వస్తున్నాడని ధననందుడికి ఇప్పటికే తెలుసు. ఒకవేళ పురుషోత్తముడు వెనుదిరిగినా, ధననందుడు తనపై దాడి చేయకుండా ఎవరాపగలరు? లేదు, ఇది స్పష్టం. అనుకున్న విధంగా ముందుకెళ్ళాల్సిందే. కాని నేను *యుద్ధలాభాన్ని* మాత్రం చాణక్యుడితోను, వాడి తోలుబొమ్మ చంద్రగుప్తుడితోను పంచుకోను, అనుకున్నాడు పురుషోత్తముడు. మగధ తనదే. మొత్తం తనదే.

మగధ సరిహద్దుకి కొన్ని యోజనాల దూరంలో అతని గుడారం వైభవంగా ఉంది. కల్లోల సముద్రం మధ్య ప్రశాంతంగా ఉన్నట్లుగా. లక్షమంది మనుషులు, నలభై వేల గుర్రాలు, నాలుగు వేల రథాలు, మూడు వేల యుద్ధ ఏనుగులు చేసే రొద చెవులు చిల్లులు పడేలా ఉంది. అతని గుడారం చెక్కతో చేసినది. ఎక్కడ విడిది చేస్తే అక్కడ దానిని నిర్మించవచ్చు. శబ్దం రాకుండా చెక్క గోడలని మందపాటి బట్టలతో కప్పారు. రాజుగారి గుడారంలో పెద్ద మంచం, బల్ల, కుర్చీ ఉన్నాయి. సిల్కు రగ్గులు, మృదువైన దుప్పట్లు ఆ గదిలో మృదుత్వం ఉన్నట్లుగా చాటుతున్నాయి, యుద్ధపరికరాలు – కవచం, శిరస్త్రాణం, కత్తులు, ఈటెలు అన్నీ ఉన్నా.

అభయ అతని ముందు నిలబడ్డాడు. తన బరువుని ఒక కాలి మీద నుంచి మరో కాలిపైకి మార్చుకుంటున్నాడు. వృద్ధరాజు అతడిని గంటకుపైగా నిలబెట్టాడు. మడమలకు ఉన్న పిన్నులు, సూదులు నొప్పి కలిగిస్తున్నాయి. 'చంద్రగుప్తుడు సెల్యూకస్ కూతురు కార్నీలియాను పెళ్ళాడాడు. కట్నంగా అరకేషియా, గెడ్రోషియా, పరోపమిసాడే, ఆరియాలను చంద్రగుప్తుడికి సెల్యూకస్ ఇచ్చాడు. చంద్రగుప్తుడి ఆస్థానంలో ఉన్న సెల్యూకస్ రాయబారి, మహావీరుడు పురుషోత్తముడికి మగధ సింహాసనంపై హక్కులేదని చాణక్యుడికి మాట ఇచ్చాడు', ప్రధాని ఇంద్రదత్ తన ముందున్న మగధ పటాన్ని పరిశీలిస్తుండగా చెప్పాడు అభయ.

'మెగస్తనీసు తన్ని తాను ఎవడనుకుంటున్నాడు?' కోపంగా అడిగాడు పురుషోత్తముడు. 'నా తరపున వాడు మాట ఇవ్వలేదు. నేను ఇప్పుడు మాసిడోనియా

సేవకుడిని కాదు! మగధ నాది! దాన్ని జయించడం, కేకయ రాజ్యంలో కలపడం నా దైవిక బాధ్యత. ఎవ్వరూ నన్నాపలేరు– ఆఖరుకి దేవుడు కూడా!'

అభయ మరికొంచెం కదిలాడు. కళ్ళని పాదాలవైపే ఉంచాడు. సున్నితమైన విషయాలను పురుషోత్తముడికి చెప్పేటపుడు ఎప్పుడూ అతను ఇబ్బంది పడతాడు. అతను తొందరగా కోపగిస్తాడు. 'ఇంత జరిగాక, చేసిన దానికన్న అన్నది ఎక్కువ రాజా', ఇంద్రదత్ వివేకంతో సూచించాడు. 'మెగస్తనీసుకి, అతని ప్రభువుకి బాగా తెలుసు మనతో బేరమాడేశక్తి వాళ్ళకి లేదని. మనం మగధను ముట్టడిద్దాం. దాన్నే బేరానికి వాడుకుందాం!'

తెలివైన ప్రధానీ, దుర్వార్త మరొకటి ఉంది. 'కళింగరాజు, మగధ సార్వభౌమత్వాన్ని ధిక్కరించుతూ యాభైవేల సైన్యంతో దాడి చేయడానికి ప్రమాణం చేశాడు. మనం పడమటి నుంచి వెళితే అతను తూర్పు నుంచి వస్తాడు. అతను కూడా సింహాసనం కోసం పోటీపడతాడు', అభయ నిదానంగా చెప్పాడు.

'ఆ పాకీ వెధవ పిరికిపందలా అరవై ఏళ్ళ నుంచి మగధకు ఊడిగం చేస్తున్నవాడు, అత్యంత శక్తిమంతమైన మగధ సింహాసనంపై కూర్చోవాలనుకుంటున్నాడా?' పురుషోత్తముడడిగాడు. అతను కూడా ఇటీవలే మాసిడోనియన్లకు బానిసగా ఉంటానని అంగీకరించిన విషయం తమ ఆడంబరపు రాజుకి గుర్తు చేద్దామని ఉన్నా ఇంద్రదత్ మౌనంగా ఉండిపోయాడు. ఏమీ అనకుండా.

'మహారాజా, సెల్యూకస్, కళింగరాజుల గురించి మనం ఆందోళన చెందాల్సిన పని లేదు. పాటలీపుత్రానికి వెళ్ళే దారిలో వీళ్ళు మనకు అడ్డుకాదు' ఇంద్రదత్ సలహా ఇచ్చాడు.

'మరెవరు?' కోపంగా అడిగాడు పురుషోత్తముడు.

'చాణక్యుడు' సమాధానమిచ్చాడు ఇంద్రదత్.

పాటలీపుత్రంలోని పరిచారక వీధిలో మురికిగా ఉన్న పాత వేర్‌హౌస్‌లో చాలామంది మనుషులు ఒక విచిత్రమైన పొడిని దంచడం ఎవరూ గమనించలేదు. ప్రతి మనిషి చేతిలో బండలున్నాయి. రోట్లో ఏదో మిశ్రమాన్ని దంచుతున్నారు. వాళ్ళ చుట్టూ చాలా పదార్థాలున్నాయి – కొన్ని విదేశాల నుంచి తెప్పించారు. దాదాపు యాభై రకాల పదార్థాలు వేసి మెత్తగా నూరుతున్నారు వాళ్ళు. వాటిలో దేశీయంగా దొరికే జిగురు,

యాలకులు, కుంకుమపువ్వు, దాల్చిని, టర్పంటైన్ రెజిన్, అల్లం, వెనిగర్, తేనె, గులాబీరేకలు, కేరట్ విత్తనాలు వంటి పదార్థాలెన్నో ఉన్నాయి. జీవసిద్ధి వారందరినీ పర్యవేక్షిస్తూ, చాణక్యుడు పావురాల టపాద్వారా పంపే సూచనలను తుచ తప్పక పాటిస్తున్నాడు.

పక్క గదిలో మరో సమూహం ముఖాలకి నూలు తొడుగులు వేసుకుని ఉన్నారు. వాళ్ళింకా ప్రమాదకరమైన కషాయం తయారుచేస్తున్నారు. వాళ్ళు సింధూరాన్ని వేయిస్తున్నారు, మగధకు తూర్పున దొరికే నారింజరంగు ఖనిజం. ఇలా చేస్తే ఫేనాశ్మభస్మం అనే తెల్ల పాషాణం తయారవుతుంది. రోటిలో మిగిలిన పొడిని వట్టి చేతులతో తీస్తున్న మనిషిని చూసి 'జీవసిద్ధి' మూర్ఖుడా!' అని అరిచాడు. 'చేతులు శుభ్రంగా కడుక్కో వెంటనే! తర్వాత పక్కగదిలో ఉన్న మైత్రిదాతె ద్రవం రాయి!'

ఏం చేస్తున్నారో వాళ్ళకే తెలియని మూర్ఖులతో నేనెందుకు పనిచేయాల్సి వచ్చింది అనుకున్నాడు. తర్వాత ఆలోచించాడు. తర్వాత చిరునవ్వు నవ్వుకున్నాడు. వాళ్ళకి తెలియదు కనుకే ఈ పని చెయ్యడానికి ఒప్పుకున్నారని తెలుసుకున్నాడు. అవసరమైన వాళ్ళకే తెలిసేలా పనిచేయడం ఎప్పుడూ మంచిది. ఈ మామూలు మనుషులకు ఏమీ తెలుసుకోవాల్సిన అవసరం లేదు.

ఇంద్రప్రస్థం నుంచి పాటలీపుత్రానికి వెళ్లే కొత్త రథం రహదారిలో శబ్దం చేస్తూ ఎద్దులబండి వెళుతోంది. బండి చాలా పాతదైపోయింది, కాని ఎద్దులు ఆశ్చర్యకరంగా మంచిపోషణ కలిగినవిగా బలంగా ఉన్నాయి. భారాలు మోసే పశువులు కదులు తున్నప్పుడల్లా వాటి మెడలో చిరుగంటలు మోగుతున్నాయి. బండిలో ముగ్గురు వ్యక్తులున్నారు. వాళ్ళలో ఒకడు వృద్ధుడు. నల్లగా, స్ఫోటకం మచ్చల ముఖం కలిగి ఉన్నాడు. పూర్తిగా నగ్నంగా ఉన్నాడు – గోచీ కూడా లేకుండా. అతని పొడవాటి జుట్టు, గడ్డం, మీసాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. చందనపు పొడి, స్మశానంలో బూడిద ముఖానికి, శరీరానికి పూసుకున్నాడు. అతను అఘోరపంథిలా అనిపిస్తున్నాడు – శివుడిని పూజించే ఉగ్ర విపరీత ప్రవర్తన కలయోగులు వాళ్ళు. 'దేనికీ భయపడరు' అని వాళ్ళ పేరుకి అర్థం ఎందుకంటే వాళ్ళకి చావంటే భయం లేదు. ఈ ప్రపంచంలో ప్రతిదీ దైవిక పదార్థంతో తయారైందేనని, ఏదీ అపవిత్రమైనది కాదని వాళ్ళు భావిస్తారు. విశ్వమంతా దేవుడిలా పవిత్రమైంది, లోపాలు లేనిది. అఘోరపంథిలు ధ్యానం, తపస్సు స్మశానాలలో

కూర్చుని చేస్తారు, చనిపోయిన వారి ఆత్మ శాంతికి ప్రార్థిస్తూ, చనిపోయినవారి మాంసం తింటారు. వాళ్ళు నరమాంస భక్షకులు.

మిగిలిన ఇద్దరు మనుషులు అతని శిష్యులని స్పష్టమవుతోంది. ఒక వ్యక్తి ముందు కూర్చుని ఎద్దుల్ని నడుపుతున్నాడు. మరొక వ్యక్తి గురువుకు ఎదురుగా కూర్చున్నాడు. శిష్యులిద్దరూ మొలకు చిన్నగోచీలు కట్టుకొన్నారు. తెలుపు కలిసిన బూడిదరంగువి, బూడిదరంగు అంటుకుని ఉంది వాటికి. అఘోర పంథిలతో ఎవరూ గొడవ పడరు. వాళ్ళు మానవరూపంలో ఉన్న శివుడు. వాళ్లు స్మశానాలలో ఉంటారు ఎందుకంటే అక్కడే శివుడుంటాడు. సామాన్య మానవులలా వాళ్ళు భ్రమలో ఉండరు కనుక ప్రపంచంతో సంబంధం లేకుండా ఉంటారు గనుక వాళ్ళు పూర్తిగా నగ్నంగా ఉంటారు. వాళ్ళ పిచ్చిలో ఒక పద్ధతి ఉంది. తీవ్రంగా చేసే తపస్సు ద్వారా మానవోద్వేగాలైన అభిమానం, గర్వం, ఈర్ష్య, ద్వేషం మొదలైనవాటికి అతీతులై యోగులయ్యారు.

మార్గంలో వారి బండిని సరిహద్దులలో ఎక్కడా తనిఖీ చేయలేదు ఆపలేదు. వాళ్ళని చూసి కాపలావాళ్ళు భయపడ్డారు, లేకపోతే సజీవంగా ఉండగానే తమని తినేస్తారనుకున్నారు. తమని చూసి భయపడుతున్న మనుషులని చూసి ఆ ముగ్గురూ భుజాలెగరేశారు. చాణక్యుడు, చంద్రగుప్తుడు, శారంగరావు పాటలీపుత్రానికి చాలా తొందరగా చేరుకున్నారు.

ప్రాసాదం ఆవరణలో ధననందుడు రాజ్యంలోని నూట పదిమంది బ్రాహ్మణులతో హోమం జరిపిస్తూ, వెన్న, పాలు, ధాన్యం, సోమాలను దానిలో ఆహుతి చేస్తూ తీరిక లేకుండా ఉన్నాడు. తన సింహాసనాన్ని పొందాలనుకుంటున్న దుష్టులపై విజయం చేకూర్చమని దేవుడిని నిష్ఠగా వేడుకుంటున్నాడతను. ఈ పూజలు పూర్తయిన తర్వాత ఆ బ్రాహ్మణులను రాజుగారి భోజనశాలలోకి తీసుకెళతారు. అక్కడ పదిమంది పెద్ద బ్రాహ్మణులకు బంగారు కంచాలలో తినిపిస్తారు. మిగిలిన వందమంది బ్రాహ్మణులు కూడా వారి వెనుక నిలబడి వేదమంత్రాలు చదువుతారు. వారు వెండి కంచాలలో తింటారు. బ్రాహ్మణులను సంతృప్తి పరిస్తే దేవుణ్ణి సంతృప్తి పరిచినట్టే. ధననందుడు తన సంతోషాన్ని ఎలాగో కొంచెం సేపు పక్కన పెట్టి పవిత్ర పూజలు చెయ్యడానికి సమయం వెచ్చించాడు.

ప్రార్థనలు ముగిశాయి, బ్రాహ్మణులను భోజనశాలకు తీసుకువెళ్ళారు. మూడు బంగారు పళ్ళేల ముందు ముగ్గురు అఘోరపంథిలు కూర్చుని ఉండడం చూసి వాళ్ళు

నిశ్చేష్టులయ్యారు. 'శవాలతో కలిసి ఉండే, కుళ్ళిన మాంసం తినేవీరితో కలిసి మేమెలా తినగలం?' వాళ్ళలో పెద్ద బ్రాహ్మణుడు అడిగాడు. ధననందుడు కూడా కోపగించాడు. ఈ అశ్లీల యోగులని కాపలా వాళ్ళెలా రానిచ్చారు?

'వాళ్ళు నన్ను శపిస్తామన్నారు. నా పేగులు పొట్టలోంచి బయటికి వస్తాయని, వాళ్ళు వాటిని తినేస్తామన్నారు!' భయపడిన భటుడు ధననందుడికి చెప్పాడు. అతనిపై అధికారి, అందమైన యువకుడు, మీసాలకు బాగా నూనె పెట్టుకున్నవాడు ఆందోళనగా, 'మహారాజా, నా కాళ్ళూ చేతులు ఊడిపోయి మీ పవిత్రాగ్నిలో పడిపోతాయన్నారు. నా ఎముకలకు ఉన్న మాంసం చక్కగా చేయించుకుని తింటామన్నారు!'

'ఓ రాజా, మేం అఘోరపంథిలం కావచ్చు. నీ విజయానికి దైవిక ప్రమేయం కల్పించడానికి ఇక్కడికి వచ్చాము. ఈ గదిలో ఉన్న నూట పదిమంది బ్రాహ్మణుల శక్తికన్న మాశక్తులెంతో గొప్పవి. మమ్మల్ని అవమానించి నీకు నువ్వు శివాగ్రహాన్ని కొని తెచ్చుకున్నావు. శివుడి రక్తం మీ నూతులను విషపూరితం చేస్తుంది. మీ పౌరులు దాహంతో చచ్చిపోతారు. తోడేళ్ళలా శత్రువులు మీ నగరద్వారాలను చేరుకుంటారు. నిన్ను, నీ రాజ్యాన్ని ఇప్పుడెవరూ రక్షించలేరు – మరో వెయ్యి హెూమాలైనా సరే!' అరిచాడు నగ్నంగా ఉన్న చాణక్యుడు ముగ్గురూ చేతుల్లో కంచాలు పట్టుకుని నిలబడ్డారు. తమ చేతుల్లోని పళ్ళేలను నేలమీదికి విసిరి భోజనశాల నుంచి బైటికి వెళ్ళిపోయారు విసురుగా. భటులెవ్వరూ వారి మార్గాన్ని అడ్డుకోలేదు. ధననందుడు కూడా భయంతో కదలకుండా నిలబడిపోయాడు. కొన్ని నిముషాల తర్వాత భటులు అతని పాదాల దగ్గర మూత్రం చూశారు.

'పాముకి విషం లేకపోతే, తప్పకుండా విషం ఉన్నట్లుగా నటించాలది' చాణక్యుడు చిన్నగా అన్నాడు. చంద్రగుప్తుడితోను, శారంగరావుతోను ఆవరణనుంచి వెళ్ళిపోతూ.

'త్వరగా ఫేనాశ్మభస్మం సూర్యోదయానికి ముందే అన్ని నూతుల్లోను కలపండి. మూర్ఖులతో కలిసి ఎందుకు పనిచేయాల్సి వస్తోంది!' పనివాళ్ళు పాటలీపుత్రంలోని నూతుల్లో, చెరువులో, రిజర్వాయర్లలో విషం కలపడంతో తీరిక లేకుండా ఉన్నప్పుడు జీవసిద్ధి లోలోపల గొణుక్కున్నాడు.

'మగధను జయించడానికి అమాయకులనెందుకు చంపడం?' చంద్రగుప్తుడు చాణక్యుడి నడిగాడు.

అతని గురువు ఇలా చెప్పాడు, 'ఉదయమే ముందుగా నీళ్ళు తాగేది పశువులు. అందుకే రాత్రి పూట విషం కలుపుతున్నాం – మనుషులు చావకుండా నివారించడానికి. అఘోరపంథిల శాపం విషయం ఇప్పటికే పాక్కి పోయింది. కొంచెంసేపటిలో ప్రజలు మనం ఏది చెబితే అది చేస్తారు'.

'మరి మండలి మనని పిలిపించి, శాపం వెనక్కి తీసికోమని ప్రార్థిస్తే అప్పుడేం చేస్తాం?' శారంగరావు అడిగాడు.

'ఇలా ఉల్లంఘించినందుకు ధననందుడు పెద్ద త్యాగం చెయ్యాలని చెబుదాం. అంతే. అతను తన ప్రాసాదాన్ని వదిలి – అడవులలో నివసించడానికి వెళ్ళాలి –అజ్ఞాతానికి. ఈ లోగా జీవసిద్ధి మైత్రిదాతై విరుగుడుని ముందురోజు రాత్రి విషం కలిపిన బావుల్లో వేయిస్తాడు. మహిమలు జరుగుతాయి తెలుసా!' నవ్వాడు చాణక్యుడు.

'కాని నగరం మనవశమెలా అవుతుంది?' చంద్రగుప్తుడడిగాడు. గురువుగారు వేసే క్లిష్టమైన ప్రణాళికలు అతన్నెపుడూ అయోమయంలో పడేస్తాయి. తను స్వయంగా పాల్గొనే ముఖాముఖి యుద్ధం కావాలని అతను కోరుకుంటాడెప్పుడూ.

'ధననందుడి సైన్యాధిపతిని జీవసిద్ధి పూర్తిగా కొనేశాడు. ధననందుడు ద్వారం దాటగానే, భద్రశాలుడు మగధ సైన్యాన్ని నీ అధీనం చేస్తాడు చంద్రగుప్తా, మనం ఇస్తామన్న లంచం ఇచ్చేస్తే.'

'అయినా పురుషోత్తముడు, కళింగరాజు తూర్పు, పడమరల్లో యుద్ధం కోసం తహతహలాడుతూ ఉంటారు', చంద్రగుప్తుడు అన్నాడు.

'వాళ్ళు మనతో యుద్ధం చెయ్యరు. చేతులు చాచి వాళ్ళని స్నేహితుల్లా ఆహ్వానిద్దాం' చాణక్యుడన్నాడు.

'అంటే మనం నగ్నంగా పిచ్చిపట్టిన నరమాంస భక్షకుల్లా ఇంత కష్టపడి ప్రయాణం చేసి వచ్చింది. శత్రువుకి తలుపు తెరిచి తాళాలు చేతికివ్వడానికా?' అడిగాడు చంద్రగుప్తుడు పాటలీపుత్రంలోకి అహంకారి పురుషోత్తముడిని ఆహ్వానించాలా అనే ఉద్దేశంతో.

చాణక్యుడు నవ్వాడు. గంభీరంగా ఆయనన్నాడు; 'చంద్రగుప్తా, నేను చెప్పిన మొదటి విషయాన్నే నువ్వు మర్చిపోయినట్టున్నావ్. స్నేహితులను సన్నిహితంగా ఉంచుకో. శత్రువులను మరింత సన్నిహితంగా ఉంచుకో'.

మహారాజు ధననందుడు తన ప్రాసాదాన్ని, రాజ్యాన్ని విడిచిపెట్టి అతనితో కలిసి రావడానికి ఇష్టపడని దురదృష్టవంతులైన భార్యలను, సేవకులను వెంట తీసుకుని రథాలు, గుర్రాలు, ఏనుగులతో వెళ్ళిపోవడాన్ని భద్రశాలుడు ఒక పక్కగా నిలబడి చూశాడు. అతను స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నాడు– అతని అప్పులు తీరిపోయాయి. ఇప్పుడు చాలా ధనవంతుడు. రాజు వెళ్ళేటప్పుడు అతని సమీపంలో ఎక్కడా సువాసిని కనిపించకుండా చూడమని జీవసిద్ధికి చాణక్యుడు చెప్పాడు. ఆమె తుది చర్చలకు అవసరమవుతుంది – అలా అనుకుని తనకు తాను సర్దిచెప్పుకున్నాడో మరి. ఆమె అంటే తనకున్న జీవితకాలపు ఆకర్షణతో కూడిన తొలిప్రేమను గర్వంగా అంగీకరిస్తాడు.

ధననందుడు తన రథంలో వెళ్ళగానే, 'అతడిని చంపెయ్యండి' అని శారంగరావుతో చాణక్యుడు చెప్పాడు. చక్రవర్తి ఒక్క రోజులోనే పదేళ్ళు పైబడినట్లు కనిపించాడు. అతని ముఖంలో ఎప్పుడూ కనిపించే క్రూరమైన నవ్వుపోయింది. అహంకారం పోయింది. మగధ సామ్రాజ్యమూ పోయింది.

'ఇప్పుడతన్ని చంపేస్తే జనమంతా మనమే దానికి కారణం అనుకుంటారు –అది నిజమే కదా', వాదించాడు శారంగరావు.

'మనకు ఇప్పుడు పెద్ద సమస్య భద్రశాలుడు. అతను ఇప్పటికే సైన్యాధిపతి పదవి తనదే అనుకుంటున్నాడు. అతను మన టపా పావురాల ద్వారా రాక్షసుడితో మంతనాలు జరుపుతూనే ఉన్నాడు', చిన్నగా చెప్పాడు జీవసిద్ధి.

'అతను తన కత్తిని మనకు సమర్పించాడా?' అడిగాడు చాణక్యుడు.

'లేదు', జీవసిద్ధి సమాధానం చెప్పాడు.

'వెంటనే అది జరిగేలా చూడండి. నాకు అతని కత్తి కావాలి. నా దగ్గరో పథకం ఉంది', చాణక్యుడన్నాడు మగధ ప్రజలు ధననందుడు వెళ్ళిపోయినందుకు వేడుక చేసుకుంటూ ఉండగా. అతని పరివారం అంతా పాటలీపుత్రం ద్వారాలు దాటగానే, పురుషోత్తముడికి, కళింగరాజుకి వారు పాటలీపుత్రం కోటలోకి ప్రవేశించవచ్చునని, ఘనస్వాగతం లభిస్తుందని సందేశాలు పంపమని ఆదేశించాడు.

'నాకిష్టం లేకుండా మీరు వారిని లోపలికి ఆహ్వానిస్తున్నారు' అన్నాడు చాణక్యుడితో చంద్రగుప్తుడు. అతని గురువు చిరునవ్వు నవ్వాడు. 'నా సమస్యేమిటంటే' ఆచార్యుడు చెప్పాడు. 'నీకు పట్టుదల ఉంది. కాని బలహీనులతో నాకు పనిలేదు!'

కేకయ, కళింగ సైన్యాలు పాటలీపుత్రానికి చేరాయి. చాణక్యుడు ప్రాసాద ప్రవేశ ద్వారం దగ్గరే నిలబడ్డాడు అతిథులను ఆహ్వానించడానికి. వారి రథాలు లోపలికి ప్రవేశిస్తుండగా వందలాది భేరీధ్వానాలు వినిపించాయి చెవులు చిల్లులు పడేలా.

కళింగరాజు పురుషోత్తముడి అంత పొడవు లేడు కాని దృఢంగా ఉన్నాడు. అతను తన జాతకానికి సరిపడే పిల్లికన్ను రాయిని ఇత్తడి శిరస్త్రాణంలో ఉంచుకున్నాడు. ఛాతీపైన ఇనుపకొక్కేలున్న చర్మపు కవచం ఉంది. అతని బెల్టుకు పొడవాటి కత్తి వేలాడుతూ ఉంది. అతను రథం దిగగానే చాణక్యుడు పలకరించాడు. 'ఓ మహారాజా, పాటలీపుత్రానికి స్వాగతం' అన్నాడు స్పష్టంగా. తర్వాత మృదువుగా', 'ఈ రాజ్యం మీ ఉదార పాలనలో వర్ధిల్లుతుందని ఆశిస్తాను' అన్నాడు.

పురుషోత్తముడు సందర్భానికి తగినట్టుగా అలంకరించుకొన్నాడు. లేత పసుపు తలపాగాలో నెమలి ఈకను తలపిస్తూ పచ్చలు, నీలాలు పొదిగి ఉన్నాయి. నీలము ఆకుపచ్చ కలసి రాచనెమలి హంగునిచ్చాయి. మూడు తెల్లగుర్రాలు లాగుతున్న రథంలో నించి ఆజానుబాహుడు దిగుతుండగా, చాణక్యుడు వినయంగా చేతులు జోడించి నిలబడ్డాడు. 'ఓ దైవాంశ సంభూతుడవైన చక్రవర్తీ, పాటలీపుత్రానికి స్వాగతం' అన్నాడు బుద్ధిహీనుడైన రాజుని గట్టిగా ప్రశంసిస్తూ. తర్వాత చిన్నగా అన్నాడు, మీ సమర్థమైన పాలనలో మగధ వర్ధిల్లుతుందని ఆశిస్తాను' అన్నాడు. పురుషోత్తముడు చిరునవ్వు నవ్వాడు. *ఈ వెధవని ఎక్కడుంచాలో అక్కడుంచాను,* అనుకున్నాడు.

రాజులిద్దరూ వైభవోపేతమైన వారి వసతులలో సుఖంగా ఉన్నపుడు, వాళ్ళని విడివిడిగా కలవడానికి నల్లటి వ్యక్తి వెళ్ళాడు. 'మగధ పోటీ నుంచి తప్పుకోమని నేను ఇప్పటికే చంద్రగుప్తుడికి చెప్పేశాను', అన్నాడు చాణక్యుడు. రాజ్యాన్ని పెద్దదిక్కు లేకుండా వదలకూడదు. చంద్రగుప్తుడు పాలించకపోతే, మీ ఇద్దరిలో ఎవరో ఒకరు పాలించాలి. సైన్యాలతో యుద్ధం చేసేకన్న రాజులిద్దరూ ద్వంద్వ యుద్ధం చేస్తే మంచిది. జయించిన వాళ్ళు మగధను తీసుకోండి', అతను సూచించాడు. ఆ ఇద్దరి అహంకారానికి ఆ సలహా నచ్చుతుందని అతనికి తెలుసు.

పురుషోత్తముడు తన కత్తి దగ్గరకు వెళ్ళి దాన్ని బయటికి తీశాడు. దాన్ని ప్రేమగా స్పృశిస్తూ పిడిని పట్టుకొన్నాడు. యుద్ధం చెయ్యడానికి దానిని సిద్ధం చేసుకున్నాడు.

కళింగరాజు తన కత్తిని ఎడమ చేత్తో పట్టుకున్నాడు. ఎడమచేతి వాటం వల్ల ప్రయోజనం ఉంది. అతని ప్రత్యర్థులలో చాలామంది అతనితో సరిగా యుద్ధం చేయలేకపోయారు. వాళ్ళకి ఎడమచేతి వాటం గలవారితో యుద్ధం చెయ్యడం రాదు. తనకి కుడిచేతి వాటం గలవాళ్ళతో యుద్ధం చెయ్యడం బాగా వచ్చు.

ఇద్దరూ యుద్ధక్రీడా కళల్లోలా ఒకరి చుట్టూ ఒకరు తిరుగుతూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూస్తూ ఉన్నారు. కనురెప్ప వేస్తే చాలు పైచేయి ఎవరిదో తెలుస్తుంది. ఇద్దరూ చివరికి యుద్ధం ఆరంభించడంతో కత్తులు ఖణేల్‌మంటున్నాయి.

ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకుంది. ఒకరి కత్తి మరొకరి మెడ మీద ఆనడంతో. కళింగ రెప్పనార్పే వరకు కొన్ని సెకనుల పాటు అదే నిశ్శబ్దం కొనసాగింది. పురుషోత్తముడు తన కత్తిని ముందుకు జరిపాడు కాని కళింగ మూడు వందల అరవై డిగ్రీల కోణంలో త్వరితంగా తిరిగి దాడిని తప్పించుకున్నాడు. పురుషోత్తముడు గాయపరిచాడు కాని ప్రాణం తీయలేదు.

పోరాటాన్ని సమాప్తం చేయాలని రాజులిద్దరూ పోరాడారు. ద్వంద్వ యుద్ధం ఎవరో ఒకరి చావుతో సమాప్తమవుతుందని ఇద్దరికీ తెలుసు. అయితే ఏదో ఒకటి అవశ్యంగా జరగాలని అదీ త్వరగా జరగాలని ఇద్దరికీ తెలుసు.

కళింగ తడబడ్డాడు. అరక్షణంలో తన ప్రాణం పోతుందని అతనికి తెలిసిపోయింది. కాని దాడికి ముందుకు ఉరికాడు. పురుషోత్తముడు నిశ్శబ్దంగా పక్కకు జరిగి కళింగ మెడ మీద కత్తితో వేటు వేశాడు. కళింగ నేల మీద పడగానే, గాయం నుంచి రక్తం ఉబికింది. కత్తి శబ్దం చేస్తూ కిందపడింది. సాహసౌదార్యాలతో పురుషోత్తముడు తన కత్తిని కిందపడవేసి ప్రత్యర్థి ముందు మోకరిల్లాడు. కళింగరక్తం ప్రవహిస్తూ, ప్రాణం పోతుండగా పురుషోత్తముడన్నాడు. 'సెలవు మహావీరా, నీతో యుద్ధం చేసినందుకు పురుషోత్తముడు గర్విస్తున్నాడు'.

*ఒకరు పోయారు, మరొకరు పోవాలి అనుకున్నాడు చాణక్యుడు.*

పాటలీపుత్రం తూర్పుజిల్లా శివ వీధిలో నెమలి సంఘం ఆర్థిక సాయం అందించే నృత్య పాఠశాల, మరొక విద్యార్థికి పట్టా ఇవ్వబోతుంది. వాళ్ళ విద్యార్థినులలో విశాఖ ప్రతిభగల విద్యార్థిని. ఆమె చక్కని శరీరాకృతి, ముత్యంలాంటి శరీరఛాయ, మెరిసే పచ్చని కళ్ళు, కెంపుల్లాంటి పెదవులు, సున్నితంగా సూటిగా ఉన్న ముక్కు, మృదువైన మెత్తని

జుట్టు పురుషులను తేనెకు ఆకర్షింపబడిన తేనెటీగలను చేసినట్లుగా ఆకర్షింపచేస్తాయి. ఈ ప్రత్యేక తేనె విషపూరితం అంతే తేడా.

పన్నెండు రాశుల్లో తిరిగే ఇరవై ఏడు నక్షత్రాల ఆధారంగా వేదాల్లో జ్యోతిషం చెప్పబడింది. ప్రతి నక్షత్రానికి పదమూడు డిగ్రీల కోణం, ఇరవై నిముషాలపాటు ఉంటుంది. దీనిని ఇరవై ఏడుతో హెచ్చువేస్తే పూర్తిగా మూడు వందల అరవై డిగ్రీలు వేద జ్యోతిష్యులకు లభిస్తాయి. పన్నెండురాశుల్లో చంద్రుడున్న స్థితిని బట్టి జన్మించిన బిడ్డ రాశి నిర్ధారింపబడుతుంది. చాంద్రమానం ప్రకారం రాశి ఏర్పడుతుంది, కాని రాశి కన్న ముఖ్యమైనది వ్యక్తి నక్షత్రంలో చంద్రుడున్న స్థితి. మగధలోని ప్రాచీన యోగులు చంద్రుడు కొన్ని ప్రత్యేక స్థితులలో ఉన్నప్పుడు జన్మించిన ఆడపిల్లలకు త్వరగా వైధవ్యం సంభవిస్తుందని గమనించారు. మంగళవారం, సప్తమి తిథి, విశాఖనక్షత్రం ఉన్న రోజున పుట్టిన ఆడపిల్లల జాతకాల్లో వాళ్ళతో సంగమించిన పురుషుడెవరైనా మరణిస్తాడు. ఆ యోగం వారి జాతకాలలో ఉంటుందని యోగులు గుర్తించారు. వారు విషకన్యలు.

పట్టా తీసుకునే వారంలో విశాఖ, మిగిలిన అమ్మాయిలు తాము విషాన్ని తట్టుకొనగలమని నిరూపించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ విద్యార్థులను వరుసలో నిలబెట్టి, ప్రధానోపాధ్యాయురాలు మూత ఉన్న బుట్టల్లో ప్రతి ఒక్కరిని వారి చేతులను పెట్టమని చెబుతుంది. ప్రతి బుట్టలో విషనాగులుంటాయి. వారం పాటు పాముకాట్లను ఎటువంటి ఇబ్బంది లేకుండా తట్టుకొన్నది విశాఖ ఒక్కతే. ఆమె తనని కరచిన పాములకన్న విషభరితమైంది. చాణక్యుడికి సమర్పించవలసినది విశాఖనే అని ప్రధానోపాధ్యాయురాలు గుర్తించింది. పాఠశాల వ్యవస్థాపకుడికి మంచివారినే సమర్పించాలి.

## పద్దెనిమిదో అధ్యాయం

# వర్తమానం

హారీ రిచర్డ్సన్ నిట్టూర్చాడు. చరిత్ర అత్యంత విసుగు కలిగించే విషయం. చివరికి ఉత్సాహి హెన్రీ–VIII కాని కొత్త భార్యల కోసం అతని వెంపర్లాట కాని అతనికి ఆసక్తిని కలిగించలేదు. తన ఫాల్స్ కాలర్ని, తెల్లని టైని పాఠ్యపుస్తకాన్ని మళ్ళీ చదువుతూ సర్దుకున్నాడు. మెడ దురదపెడుతోంది. స్కూలు యూనిఫాంకి అలవాటు పడలేదతను– బ్లాక్టైల్కోటు, వెయిస్ట్కోటు, సన్నగీతల ప్యాంటు. ఈటన్ని భరించలేం.

గోడోల్ఫిన్ హౌస్లో తన ప్రయివేటు గదిలో కుర్చీలో అసౌకర్యంగా కదిలాడు అతను. విభజనకు ఆలస్యంగా వెళ్ళినందుకు ముందురోజు హెడ్ మాస్టర్ చేతిలో తిన్న అయిదు బెత్తం దెబ్బలతో పిర్రలు ఇంకా మండుతున్నాయి. పొట్టకూడా ఖాళీగా ఉంది. బెకింటన్ సెంట్రల్ డైనింగ్ కాంప్లెక్స్లో మూడు పూటలా తినడం – అస్సలు రుచించదు. అతనికి నచ్చే ఆహారాలు రెండే – మిడ్ మార్నింగ్ ఛాంబర్స్ ఉపాహారం, మిడ్ – ఆఫ్టర్నూన్ బోయ్స్ టీ. కాని ఈరోజు పూర్తి చేయాల్సిన పని ఉండడంతో రెంటికీ వెళ్ళలేదు. ఇంటికి వెళ్ళాలని బాగా అనిపిస్తోంది అతనికి.

హారీ అందంగా ఉంటాడు. పాలిపోయినట్టుగా ఉండే చర్మానికి కొంచెం పసుపు మెరుగు ఉంటుంది. జుట్టు బాగా దట్టంగా నల్లగా మెరుస్తూ ఉంటుంది. ఏడో తరగతిలో ఉన్న ఆ పిల్లవాడు ఇప్పుడే అయిదడుగుల నాలుగంగుళాలు ఉన్నాడు. కవళికలు చక్కగా ఉంటాయి. ముఖం అమాయకంగా, పెదవులు మృదువుగా, చెక్కిన ముక్కు, మరకతపచ్చ కళ్ళు.

వాళ్ళమ్మ జోసఫిన్ని చాలాసార్లు అడిగాడు ఈటన్లో ఎందుకు చదవాలి, ఆమెతో పాటే గ్రాస్మియర్లో ఉంటూ దగ్గర్లో ఉన్న స్కూల్లో చదవచ్చుగా అని. అతన్ని ఎక్కువ

రోజులు లాంగ్ లీవ్ హాఫ్‌లో, మైకేల్మాస్ హాఫ్‌కి ఒకసారి, లెంట్ హాఫ్‌కి ఒకసారి కొన్ని రోజులకోసం ఇంటికి పంపుతారు. నాన్న చనిపోయాక హారీని తనే పెంచవలసి వచ్చిందని తల్లి చెప్పింది. బాగా పనిచేస్తేనేగాని ఈటన్ బోర్డింగు ఫీజు, ఇద్దరి ఖర్చులూ నెగ్గుకు రాలేమని చెప్పిందామె. 'చిత్రకారుల పని ఎంత కష్టంగా ఉంటుంది', అనుకున్నాడు హారీ. చాలామంది కళాకారులు తమ చిత్రాలు అమ్మితే తినడం, తాగడం, మైథునాలకు పనికొస్తాయని చిత్రాలు గీస్తారు. ఆమె ఎప్పుడూ వాటిని అమ్మినట్లుగా కనిపించదు - ఇల్లంతా అవే ఉంటాయి. తన పోషకుడు భారతదేశంలో ఉన్న ఒక వృద్ధుడని జోసఫిన్ ఎప్పుడూ హారీకి చెప్పలేదు - ఆ మనిషి ఉదారత వల్ల జోసఫిన్ కళాకారిణిలా జీవితం గడపగలుగుతోంది - ఆయన పండిట్ గంగాసాగర్ మిశ్ర. జోసఫిన్, ఆమె తండ్రి చాందినిని సంరక్షించినప్పటి నుంచి జోసఫిన్ సంరక్షణ తన బాధ్యతగా గంగాసాగర్ భావించాడు.

ఈటన్‌లో అన్ని క్రీడలు ఉన్నాయి - సాకర్, రగ్బీ, హాకీ, క్రికెట్, బాస్కెట్‌బాల్, రోయింగ్, అథ్లెటిక్స్, ఫెన్సింగ్, - ఎన్నో ఈ పట్టికకి అంతులేదు. క్రీడలు ఇష్టంకాని వారికి అన్ని సంగీత వాద్యాలు - డిడ్జరిడూ తో సహా అన్నీ అత్యాధునికమైన సంగీత శాఖలో ఉన్నాయి. దానిలో అద్భుతమైన మ్యూజిక్ టెక్నాలజీసూట్, రికార్డింగ్ స్టూడియో ఉన్నాయి. స్కూల్లో రెండు థియేటర్లున్నాయి. రంగస్థలం అంటే ఆసక్తి ఉన్నవాళ్ళు స్కూల్లో వేసే నాటకాలు, హౌస్‌ప్లేల్లో రచనలో పాల్గొనవచ్చు. ఇవేకాక ఈటన్లో చిత్రకళ, డ్రాయింగ్, శిల్పం, సిరామిక్స్ ప్రింట్‌మేకింగ్, చర్చ, ప్రసంగం వంటివి కూడా నేర్పుతారు.

కాని హారీకి వయొలిన్‌పైనే ఆసక్తి. గత ఏడాది ఇచ్చిన ఎనిమిది సంగీత స్కాలర్ షిప్‌లలో అతనిది ఒకటి. దాన్ని పొందడానికి ఎంతో ఓపిక పట్టాల్సి వచ్చింది. జనవరి చివరిలో ఈటన్లో జరిగింది మ్యూజిక్ స్కాలర్‌షిప్ పరీక్ష. అభ్యర్థులు ప్రధాన వాయిద్యంపైన రెండు పరస్పర విరుద్ధమైన పీస్‌లు వాయించాలి. రెండో వాయిద్యం పైన ఒక పీస్ వాయించాలి. స్వరలిపిని చదవాలి, అడిగిన స్వరలిపిలో వాయించాలి. గ్రేడ్లకి తగిన స్కేల్స్‌ని వాయించాలి. హారీ మంచి మార్కులతో పాసయ్యాడు. వయొలిన్లో ఈటన్‌కి రాకముందే ఎనిమిదో గ్రేడ్‌లో ఉన్నాడతను. అతను స్ట్రింగ్ క్వార్టెట్ ధ్వనులు పొట్టలోనే వింటూ పుట్టాడేమో అనిపిస్తుంది.

*జోసఫిన్ ఒక గ్రామఫోన్ తెచ్చి చాందిని గదిలో ఒక మూల పెట్టింది. చాందినికి ఇష్టమైన మ్యూజిక్ - వయొలిన్ కచేరీల ప్లేయింగ్ రికార్డులు - బాక్, బీథోవెన్, బ్రామ్స్,*

చెకోవ్‌స్కీ, పగనినిలవి తెచ్చిపెట్టింది. చాందిని కిటికీ పక్కన కూర్చుని ప్రశాంతమైన గ్రాస్మియర్ వీధులను ఎగుడు దిగుడు శిఖరాలను చూస్తూ ఉంటుంది. చాందిని వయొలిన్ వింటూ ధ్యానంలోకి వెళితే, జోసఫిన్ తరచు మార్కెట్‌కి వెళుతుంది. తిరిగి వచ్చాక కొన్నిసార్లు జోసఫిన్‌కి చాందిని కళ్ళు చెమ్మగిల్లినట్టు, ముఖం మీద కన్నీటి చారికలు కనిపించేవి. వయొలిన్ వింటుంటే జాఫ్రీ ఎక్కువగా గుర్తు వచ్చేవాడు. చాందిని కిష్టమైన గులాబీరంగు చేమంతులు తాజాగా తెచ్చి అప్పుడప్పుడు కిటికీలో పెట్టి జోసఫిన్ ఆమెని సంతోషంగా ఉంచాలని చూసేది.

వచ్చిన ఎనిమిది నెలల తర్వాత చాందినికి ప్రసవ సమయం వచ్చింది. ప్రసవమంటే ముక్కు రంధ్రంలోనుంచి బౌలింగ్ బంతిని తోస్తున్నట్టుగా ఉంటుందని చాందినికి తెలియదు. మేట్రన్ ఆమె గర్భాశయం వ్యాకోచించిందా లేదా అని పరీక్ష చేస్తున్నపుడు జోసఫిన్ పక్కనే నిలబడి చాందిని చేతిని పట్టుకొంది. రక్తం, ఉమ్మనీరు పడుతున్నాయి. కొంచెం ముక్కి బిడ్డను బయటికి తోయమని నర్స్ బ్రతిమాలింది. చాందిని శక్తినంతా ఉపయోగించి బిడ్డని బయటికి తోసింది. తన లోపలి నుంచి బిడ్డ జారినట్టు అనిపించింది కాని వెంటనే ఆమెకి స్పృహ తప్పింది.

చాందిని మేల్కొనేసరికి తనని శుభ్రంచేసి, తన గదిలోకి చేర్చారని గ్రహించింది. జోసఫిన్ ఆమె పక్కనే కూర్చుని ఆమె తల నిమురుతోంది. ఒక్కసారి జోసఫిన్‌ను చూడగానే, ఆమెకు అర్థమైపోయింది.

'ఐ యాం సారీ హనీ, నీకు ఇంకా పిల్లలు పుడతారని, ఈ బిడ్డ కడుపులోనే చనిపోయిందని డాక్టరు చెప్పింది' అంది జోసఫిన్ నెమ్మదిగా.

"భాబువా స్టేట్ కోపరేటివ్ బ్యాంక్' చెప్పాడు గంగాసాగర్. 'ఏమిటది?' అడిగారు అగర్వాల్‌గారు.

'మనం నియమించిన రిజర్వ్‌బ్యాంకు గవర్నర్ని ఈ బ్యాంకు గురించి కూపీ లాగమని అడగాలి నేను.'

'ఎందుకు?'

గంగాసాగర్ ఒక షేర్ ట్రాన్స్‌ఫర్ పత్రాన్ని చూపించాడు. ఆయన ముందు అలాంటివి ఒక కట్ట ఉన్నాయి. 'చూశారా ఈ లావాదేవీ? శివ ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఈ స్టాక్ నంతటినీ విష్ణు ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు అమ్మింది.'

'కంపెనీ స్టాక్స్ అమ్మడం ఎప్పట్నుంచి నేరమైంది? ఏమైనా గాని బీహార్‌లో ఉన్న చిన్న కోపరేటివ్ బ్యాంక్‌కి దీనితో ఏం సంబంధం?'

'ఇంకొంచెం బాగా తరచి చూడండి. విష్ణు ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఈ బ్యాచ్ షేర్లన్నిటినీ బ్రహ్మ సెక్యూరిటీస్ ప్రయివేట్ లిమిటెడ్‌కి అమ్మింది'.

'నాకింకా అర్థం కాలేదు, గంగా. షేర్ల వ్యాపారం అంటే అమ్మడం, కొనడం. ఈ కంపెనీలు చేసిన తప్పేంటి? భాబువా కోపరేటివ్ బ్యాంక్‌కి దీనితో సంబంధం ఏమిటి?'

'ఇంకా అర్థంకాలేదా? హిందువుల త్రిమూర్తులు – బ్రహ్మ, విష్ణు, శివులు?'

'సారీ, నువ్వేం చెబుతున్నావో నాకర్థం కావడం లేదు'

'బ్రహ్మ–సృష్టికర్త, విష్ణు–రక్షకుడు, శివుడు–లయకర్త. ఒకే అస్తిత్వంలోని మూడు ముఖాలు. ఈ మూడూ ఒకే ప్రమోటర్‌వి అనిపించటం లేదా?'

'అయితే మాత్రం, సమస్యేమిటి?'

'సమస్య ఇది. ఈ బ్యాచ్ స్టాక్స్‌ని శివ సోమవారం నాడు ఒక్కో షేరు రూ. 140 చొప్పున విష్ణుకి అమ్ముతాడు. తర్వాత రోజు మంగళవారం – విష్ణు వీటిని ఒక్కో షేరు 150 రూపాయలకు బ్రహ్మకు అమ్ముతాడు, మార్కెట్ రేటుకన్న కొంచెం ఎక్కువకి. బుధవారం బ్రహ్మ మళ్ళీ ఈ షేర్లను 160 రూపాయలకి శివుడికి అమ్ముతాడు!'

'అయితే?'

'శివ షేరుకి ఇరవై రూపాయలు నష్టపోతాడు. విష్ణు, బ్రహ్మ చెరో పది నష్టపోతారు. ఈ మూడు సంస్థలు ఒకే ప్రమోటర్‌వి అయితే ఇది సున్నవచ్చేఆట!'

'కాని ఎందుకలా చేయడం? లాభం లేనప్పుడు'.

'ఎందుకంటే ఇలా ఒకే షేర్లతో తరచుగా చేస్తూపోతే, నీ దగ్గర డబ్బుంటే, మార్కెట్ ధరను పెంచుతూ పోవచ్చు. ఈ మూడు సంస్థలు లావాదేవీలు జరిపిన షేరు మూడు రోజులు! మూడు రోజుల్లో పధ్నాలుగు శాతం పెరిగింది!'

'ఈ వ్యాపారానికి డబ్బులెక్కడివి?'

'భాబువా స్టేట్ కోపరేటివ్ బ్యాంక్'.

'బ్యాంకులు క్యాష్ రిజర్వ్ రేషియో కాపాడుకోవాలి కదా. రెగ్యులేటర్‌కి

తెలియకుండా స్టాక్ స్పెక్యులేషన్‌కి పెద్దమొత్తాలను బీహార్లో ఎక్కడో మారుమూల చిన్న బ్యాంకు పెద్దమొత్తాలు ఇచ్చే అవకాశం లేదు', అగర్వాల్ గారు వాదించారు.

'సులువైన పరిష్కారం. బ్యాంకులు పదిహేను రోజులకోసారి మాత్రమే రిజర్వుబ్యాంకుకు నగదు నిల్వ గురించి చెప్పాలి. మిగిలిన పదమూడు రోజుల్లో చెప్పాల్సిన పనిలేదు. అమ్మడం, కొనడం ఈ పదమూడు రోజుల్లో చేసి పద్నాలుగో రోజున లెక్క సరిచేసేస్తారు. రెగ్యులేటర్‌కి ఎన్నటికీ తెలియదు'.

'అయితే, మరి షేర్ వ్యాపారుల వెంటపడు? వాళ్ళే కదా స్పెక్యులేషన్ చేసేది'.

'ఎందుకంటే బ్రహ్మ, విష్ణు, శివ ఒక ముఖ్యమైన వ్యక్తికి సొంతం కాబట్టి'.

'ఎవరు?'

'బీహారు ముఖ్యమంత్రి'.

'ఝాబువా జిల్లా కోపరేటివ్ బ్యాంకు గురించి తెలుసుకుని ఏం సాధించాలనుకుంటున్నావు?'

'మ్యూజికల్ ఛైర్స్ ఆటలో ప్రతిసారీ మ్యూజిక్ ఆగినపుడు ఏం జరుగుతుంది?'

'ఒక కుర్చీ తగ్గుతుంటుంది?'

'ఖచ్చితంగా అదే. బ్యాంకు లావాదేవీలను రిపోర్ట్ చేయాల్సిన పదిహేను రోజుల మధ్యలో ఫ్రీజ్ చెయ్యాలి. నగదులో హెచ్చు తగ్గులకు వాళ్లు కారణం చెప్పలేరు. అందుకే రిజర్వ్‌బ్యాంకులో నా మనిషి ఉండాలనుకున్నాను'.

'నీకొచ్చేలా లాభమేంటి?'

'బీహార్‌లో భయపడుతూ ఉండే ముఖ్యమంత్రి'.

చాందిని గ్రామానికి చేరుకుంది. చివరి మైలు దూరం నడుస్తూ. బీహార్లో తూర్పు చంపారన్ జిల్లాలో ఉన్న జితౌరా ముసాహర్‌తోలా గ్రామానికి రోడ్లు లేవు, విద్యుత్తు లేదు, మంచినీళ్ళు లేవు, బడి లేదు, ఆసుపత్రి లేదు. జితౌరాని నాగరకత పూర్తిగా చిన్నచూపు చూసినట్లుగా ఉంది.

ఆమె ఆ రాత్రి ఒక దళిత గృహంలో, ఆ గుడిసెని అలా పిలవగలిగితే దానిలో

ఉంటుంది. దోమలు, పందికొక్కులు, పాములున్నాయి. ఆ పాక దేని నుంచీ రక్షణ నివ్వడం లేదు. మట్టినేల మీద చాప పరచుకుని మిగిలిన దళితులతో కలిసి రొట్టెలు, ఉల్లిపాయ, ఉప్పు తిన్నది. బ్రాహ్మణులు అస్పృశ్యులు అని ముద్రవేసిన మనుషులు వీళ్ళు. అరశతాబ్దం కిందట అస్పృశ్యతని నిషేధించినా, ఇంకా దురాచారం మిగిలే ఉంది. పిల్లల్ని వెట్టిచాకిరికి అమ్ముకుని పొట్ట నింపుకున్నామని వారు చెబుతుంటే ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది.

న్యూఢిల్లీ వచ్చిన తర్వాత, రెండు రోజులకి తన అధికార నివాసం తీన్‌మూర్తి లేన్లోని 19వ నెంబరు బంగ్లాలో గంగాసాగర్‌ని కలుసుకుంది.

'నన్నక్కడికెందుకు పంపారు? పరిస్థితి పూర్తిగా దయనీయంగా ఉంది! రెండు వందల మంది పిల్లలున్న ఆ ఊర్లో ముగ్గురే బడికి వెళతారు! అతి దగ్గరగా ఉన్న స్కూలు ఆరు మైళ్ళ దూరంలో ఉంది! ఆసుపత్రుల సంగతి అటుంచి, ప్రాథమిక వైద్యం కోసం డిస్పెన్సరీ కూడా లేదు. పారిశుద్ధ్యం లేదు – టైఫాయిడ్, కలరా గ్రామీణులని తరచూ పలకరిస్తాయి. మీకు బాధగా అనిపించడం లేదా?' చాందిని అడిగింది.

'బాధ ఊగే కుర్చీలాంటిది; అది మనల్ని కదుపుతున్నట్టుంటుంది కాని ఎక్కడకీ చేర్చదు' సమాధానమిచ్చాడు గంగాసాగర్, తను కూర్చున్న సోఫాలో వెనక్కీ ముందుకీ కదులుతూ... 'ప్రయివేటు నిధులతో ట్రస్టు నేర్పాటు చేయమని అగర్వాల్ గారి నడిగాను. ఆర్ అండ్ ఎస్ నుంచి వచ్చే డబ్బు మొత్తం రాజకీయ ప్రయోజనాల కోసం వాడడం లేదు. బీహార్లో దళిత గ్రామాలను గుర్తించి బీదాతి బీద గ్రామాల్లో – చిన్న చిన్న సమస్యలు తీరుస్తుంది'.

'ఏ సమస్యలు?'

ప్రాథమిక పాఠశాల, మంచినీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రోజూ పోషకాహారం అందేలా చూడడం'.

'లబ్ధి పొందే గ్రామాలేవి?'

'బీహార్లో ఉన్న రోహతస్, భాబువా జిల్లాల్లో ఉన్న గ్రామాలు'

'రోహతస్, భాబువా జిల్లాలను ఎంచుకొనడానికి వెనుకున్న కారణం బీహార్ దళిత ముఖ్యమంత్రికి కంచుకోటలాంటి ప్రాంతాలనా?' చాందిని చతురంగా అడిగింది.

'బీహార్ ముఖ్యమంత్రి మిమ్మల్ని కలవాలనుకుంటున్నాడు,' చెప్పాడు మీనన్.

'ఆహా!' అన్నాడు గంగాసాగర్ చిరునవ్వుతో.

'బీహార్ మీద ఎందుకంత ఆసక్తి చూపిస్తున్నారు?' అడిగింది చాందిని. 'మనకి ఉత్తరప్రదేశ్ కంచుకోట'.

'అమ్మా, బీహార్ నుంచి ఏభై నాలుగు మంది ఎంపీలు లోక్‌సభకి వస్తారు. గత ఎన్నికల్లో బీహార్ ముఖ్యమంత్రి పాలక పక్షంతో పొత్తు పెట్టుకున్నాడు. అతని పార్టీ యాభై శాతం సీట్లలో పోటీ చేస్తే, పాలక పక్షం మరో యాభై శాతం సీట్లకు పోటీ చేసింది. వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లకూ తానే పోటీ చెయ్యాలనుకుంటున్నాడు'.

'మరి అతనికి మన అవసరం ఏముంది?'

'ఎందుకంటే మనతో కలిస్తే, మనం ఉత్తరప్రదేశ్‌లోనే పోటీ చేస్తాం. బీహార్లో కాదు, అతను బీహార్లోనే పోటీ చేస్తాడు – ఉత్తరప్రదేశ్‌లో కాదు. ఇద్దరికీ ఇది పనికొస్తుంది'.

'కాని బీహార్లో అతనికి పట్టున్న చోటికి నన్ను పంపారు!'

'మరి అతన్ని నేనెలా భయపెట్టగలను?'

'అగర్వాల్ గారితో చెప్పి రెగ్యులేటర్లతో అతని బ్యాంకును ఇబ్బంది పెట్టారు'.

'బ్యాంకును పట్టుకొనడమే ముఖ్యమంత్రిని భయపెట్టడానికి సరైన పద్ధతి. అంతా చూస్తే నా పథకం పారినట్టే ఉంది!'

'సభలో బీహార్ ఒక్కటే మనకి మెజారిటీ రప్పించదు. ఉత్తరప్రదేశ్‌లో ఎనభై అయిదు సీట్లు **అభానస**వే అనుకున్నా, బీహార్లో ఏభై నాలుగు సీట్లు అతనివి అనుకున్నా మొత్తం కలిపి నూట ముప్ఫయి తొమ్మిదే అవుతాయి. మనంతట మనం ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లలో సగం మాత్రమే అవుతాయి'.

'మిగిలిన వాటి సంగతి బీహార్ ముఖ్యమంత్రి చూసుకుంటాడు'

'ఎలా?'

'ప్రతిపక్ష నేతకు అతను ఆత్మీయ స్నేహితుడని నీకు తెలియదా?'

'అమెరికావాళ్ళు కొన్ని బిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాలను పాకిస్థాన్‌కు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు', చెప్పాడు **రా** చీఫ్. 'వార్త ఇంకా బయటికి రాలేదు. వైట్‌హౌస్ వచ్చే నెలలో ప్రకటిస్తుంది'.

'వాళ్ళు ప్రమాదకరమైన ఆటాడుతున్నారు', అంది చాందిని. పాకిస్థాను సైన్యం భారతదేశంతో యుద్ధం చేస్తూ తీరిక లేకుండా ఉందని, వాళ్ళ అసలైన శత్రువు ముస్లిం తీవ్రవాదాన్ని పట్టించుకొనడం లేదని వాళ్ళకి తెలుసు'.

'పాకిస్థానుకు ఆయుధాలు సరఫరా చేయడం, వాళ్ళకే మంచిది కాదని అమెరికాకు మనం సర్ది చెప్పలేమా?' అడిగాడు ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు.

'అన్ని ప్రయత్నాలు అయ్యాయి. అవకాశమున్న అన్ని దౌత్యమార్గాలని వినియోగించుకున్నాం. మన లాబీయిస్టులు అమెరికా ప్రెసిడెంటు తాజా ఆకర్షితురాలిని కూడా కలిశారు. ఆమె అందంగానే ఉంది – కొంచెం బొద్దుగా ఉంది అంతే', చాందిని చిరునవ్వుతో అంది.

'నాదో ఆలోచన' డైరెక్టర్ అన్నాడు.

'ఏమిటి?' అడిగింది చాందిని.

'గ్యాస్' చెప్పాడు డైరెక్టర్.

'అయ్యో, నేను మీకు మంట తగ్గించే మందేమైనా తెప్పించనా?'

'గ్యాస్ కాదు. గ్యాస్ సెంట్రిఫ్యూజ్‌లు' సిగ్గుపడ్డ డైరెక్టర్ చెప్పాడు.

'మీరిద్దరూ దేని గురించి మాట్లాడుతున్నారు? **రా** చీఫ్ అడిగాడు మధ్యలో. ముఖ్యమైన చర్చలో తనని వదిలిపెట్టినట్లు భావిస్తూ.

'పాకిస్థాను వాళ్ళు వాళ్ళ అణురియాక్టర్లలో అణుపదార్థాన్ని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే గ్యాస్ సెంట్రిఫ్యూజ్‌ల డిజైన్లు జర్మనీలో యూరోనికా అనే కంపెనీ నుంచి ఎవరో దొంగతనం చేశారు' వివరించాడు డైరెక్టరు.

'అయితే ఏంటి? పాకిస్థాను అణు కార్యక్రమం అంతా దొంగతనం చేసిన టెక్నాలజీతోనే కదా ఉంది', చాందిని అంది.

'అవును. కాని యూరోనికా డిజైన్లు రష్యన్ డిజైన్ ఆధారంగా చేసినవి. మీరడిగితే, రష్యన్లు సంతోషంగా ఆ డిజైన్ మనకి ఇస్తారు', డైరెక్టర్ చెప్పాడు.

'మన దగ్గర ఇప్పటికే ఆ టెక్నాలజీ ఉంది. అది కాదని ఈ పాత డిజైన్లు కోసం నేనెందుకు అడగాలి?' చాందిని ఆశ్చర్యంగా అడిగింది.

'మా డిపార్టుమెంటులో పాత డిజైన్లు చేయడంలో నిపుణుడైన వ్యక్తి ఉన్నాడు - ఆయన పురావస్తుశాఖలో పనిచేసేవాడు', చెప్పాడు డైరెక్టర్.

'అది మనకెలా ఉపయోగపడుతుంది?' రా చీఫ్ అడిగాడు వెంటనే.

'ఆ డ్రాయింగులు మనం రహస్యంగా ఉత్తర కొరియాకు, లిబియాకు అమ్మవచ్చు', డైరెక్టర్ చెప్పాడు.

'అది అర్థరహితం! మనం వీటిని పెంచడానికి ఎన్నడూ సహకరించలేదు', అంది చాందిని.

'అక్కడే నా మనిషి రంగంలోకి వస్తాడు', డైరెక్టర్ అన్నాడు. తను చెప్పే మాటలు శ్రద్ధగా వింటున్నారని లోలోపల ఆనందిస్తూ. మాజీ పోలీసు కమీషనర్ ఇప్పుడు సంతోషంగా, ఆందోళన లేకుండా ఉన్నాడు. 'ఆ టెక్నాలజీ పనికి రాకుండా అతను కొన్ని తప్పులు చేస్తాడు. కాని అసలైనదిలా కనిపించేలా చేస్తాడు.'

'అమెరికాతో చర్చలకు ఇదెలా పనికొస్తుంది?' అడిగింది చాందిని.

'అహా! డిజైన్లు యురోనికా ప్లాన్‌లా ఉంటాయి అవి పాకిస్థాన్‌లో మళ్ళీ గీశారనుకుంటారు. తరువాత జరిగే రభస వల్ల అణ్వాయుధ ఉత్పత్తి చేసే హార్డ్‌వేర్‌ని పాకిస్థాన్‌కి సరఫరా చేయాలనే ప్రణాళికలు మానుకొనే పరిస్థితిలో అమెరికాను పడవేయగుగుతాం'.

'ఆర్ అండ్ ఎస్ నుంచి వచ్చే కమిషన్ల మొత్తంలో ఎక్కువ భాగం మనం అనుకున్నట్లుగా ఖర్చు పెడుతున్నారనుకుంటాను?' అడిగాడు గంగాసాగర్.

అగర్వాల్ తలూపారు. బీహార్‌లో ట్రస్టుకి కొంచెం, మిగిలినదంతా సెంటియోసిస్ షేర్లు కొనడానికి ఉపయోగిస్తున్నాం. ఇప్పుడు కంపెనీలో అయిదు శాతం మనదే.

'గుడ్' అన్నాడు గంగాసాగర్.

'సెంటియోసిస్ ఎందుకు కొంటున్నాం?' అడిగాడు అగర్వాల్. ఇంకా మంచి

సాఫ్ట్‌వేర్ కంపెనీలున్నాయి. మనం పెట్టుబడి పెట్టడానికి. మన పెట్టుబడిని రెండింతలు చేసుకోవచ్చు కూడా!'

'దాని పేరు నచ్చింది నాకు' గంగాసాగర్ అన్నాడు మాజీ బాస్‌కి కన్నుగీటుతూ.

'ప్రతిపక్షనేత నియమభంగాక్షేపణ చేస్తున్నారా?' అడిగాడు స్పీకర్.

'అవును, మిస్టర్ స్పీకర్ సర్. ఇటీవల హైజాక్ విషయంలో ఈ ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు సంబంధించి–'

'ప్రతిపక్షనేతను తమ సీటులో కూర్చోవలసిందిగా కోరుతున్నాను. ప్రధాని ఇప్పుడే సంఘటన గురించి తన వివరణ ఇస్తున్నారు. సభ ఆయన చెప్పేది విన్న –'

'నియమ భంగాక్షేపణ గురించి మిస్టర్ స్పీకర్. ప్రధాని కంట్రోల్ రూంలో లేరు. విదేశాంగమంత్రి ఉన్నారు. ఆమె నుంచి వినాలనుకుంటున్నాం' ప్రతిపక్షనేత వాదానికి దిగాడు.

ప్రధాని కూర్చున్నాడు, చాందిని లేచి నించుంది మాట్లాడడానికి వీలుగా. 'గౌరవనీయులైన విదేశాంగ మంత్రి సభనుద్దేశించి ప్రసంగిస్తారు' స్పీకర్ చెప్పాడు.

సందర్శకుల గ్యాలరీలో కూర్చున్న గంగాసాగర్ నవ్వాడు. ప్రతిపక్షనేత చాందినిని ప్రముఖురాలిని చేస్తున్నాడు.

***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'*** గంగాసాగర్ లోలోపల చదువుకున్నాడు.

'నువ్వు రాజీనామా చెయ్యాలి. వాస్తవానికి కేబినెట్‌లో ఉన్న **అభానస** వాళ్ళందరూ రాజీనామా చెయ్యాలి'.

'కాని ప్రభుత్వంలో మేమూ ఒక భాగం అనుకుంటున్నారు', వాదించింది చాందిని. 'దాన్ని మేమే దించేస్తున్నట్టుగా ఉండకూడదు!'

'మంచి కారణం ఉంటే ఏమీ కాదు' అన్నాడు గంగాసాగర్, జాగ్రత్తగా వెండి పెట్టెను తెరిచాడు – అగర్వాల్‌గారిచ్చిన కానుక – దాన్లోంచి తాంబూలం తీసుకుని

ఆలోచిస్తూ నోట్లో పెట్టుకున్నాడు. నోటిలో ద్రవాలూరుతుండగా మెదడుకు మేత వేస్తూ ఆలోచిస్తున్నాడు. చాందినితో కలిసి ఆమె అధికార వాహనంలో వెనక సీట్లో కూర్చున్నాడు. కారు విదేశాంగ మంత్రిత్వశాఖ ఉన్న సౌత్‌బ్లాక్‌వైపు వెళుతోంది.

'మంచి కారణమేంటి?'

'ఈ ప్రభుత్వాన్ని దించడానికి, మళ్ళీ ఎన్నికలు రప్పించడానికి ఇది మంచి సమయం' అన్నాడు గంగాసాగర్. 'ఈ ఉదయం మన స్నేహితుడు ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌తో సమావేశమయ్యాను. విచారణ సెల్ నుంచి ప్రధాని చెప్పాడని రషీద్‌ని విడుదల చేశారు'.

'వాణ్ణెందుకు వదిలేశారు? అతను నన్ను చంపడానికి కుట్రపన్నాడు!'

'అది నిజమే' చెప్పాడు గంగాసాగర్, 'రషీద్ అసలు **రా** ఏజెంటు మఖ్మద్ అనీ, నువ్వే అతన్ని చైనా వాళ్ళ చేతిలో అరెస్టయ్యేలా చేశావనేది కూడా నిజమే. మనిషికి కోపం రావడంలో అర్థం ఉంది', చాందిని ముఖంలో కోపం చూసి ఆయన నవ్వాడు.

త్వరగా తేరుకున్నాడు. 'కాని రషీద్ **రా** ఏజెంట్ అని ప్రధాని చెప్పలేదు. దేశం కోసం చనిపోయిన **అభానస** నేతగా ఇక్రంని హీరో చేయడానికి ఇదే మనకు మంచి అవకాశం. కుట్రకు కారణమైన కీలకవ్యక్తిని – రషీద్‌ని విడుదల చేసిన ప్రధానిని క్రూరుడిగా చెప్పే అవకాశం మనకిది. చివరగా, నువ్వు ఇక్రం ఉదాత్త వారసత్వానికి వారసురాలివి – దీనికి క్షోభ చెంది నీ **అభానస** సహచరులతో రాజీనామా చేస్తావు!'

'ఎలా నిరూపించగలం?'

'ఐబి డైరెక్టర్ బహిరంగ ప్రకటన చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. రషీద్ తన కస్టడీలో ఉన్నాడని, ప్రధాని అతనిని విడుదల చేయమని ఒత్తిడి చేశాడని ప్రకటిస్తాడు'.

'మేము రాజీనామా చేస్తే ఈ ప్రభుత్వం పడిపోతుంది. మీకు ఆ సంగతి తెలుసా?'

'లెక్కలేనన్ని కుంభకోణాలలో ఇరుక్కొని ఈ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి, ప్రధాని రాజీనామా చేశారు. బీహారు ముఖ్యమంత్రితో మనకు ఒప్పందం కుదిరింది. ప్రతిపక్షనేత సంకేతం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంక ఎంతో కాలం ఆగకూడదు'.

'ప్రతిపక్ష నేత ఏ సంకేతం కోసం ఎదురుచూస్తున్నాడు?'

'R' అనే అక్షరానికి మధ్య గీతగీసి కోయాలనుకుంటున్నాడు'

'ఆఁ?'

'రూపాయి గుర్తు'.

'ఇప్పుడున్న పరిస్థితులు బాగాలేవు. ప్రతిపక్షం తమ కత్తులకి పదును పెడుతోంది. అయినా నేను మీతోనే ఉన్నాను. **అభానస** అంతా మీతోనే మా మద్దతు మీకుంటుంది', ప్రధానితో గంగాసాగర్ అన్నాడు.

'అయితే మరి మీ మంత్రులందరూ కేబినెట్ నుంచి రాజీనామా చేస్తారని వింటున్నాను. అదేమిటి మరి?' విచారంగా ఉన్న ప్రధాని అడిగాడు.

'వదంతులు త్వరగా వ్యాపిస్తాయి కాని నిజంలా నిలకడగా ఉండవు. అటువంటి వార్తలు పట్టించుకోకూడదు'.

'మనం ఇలా మాట్లాడుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది. మీరెందుకు నన్ను కలవాలనుకున్నారు?'

'మన చుట్టూ ఉన్న పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయి. దైవికమైన ఆశీస్సులు అవసరమవుతాయనిపిస్తోంది.'

'ఏం చేయమంటున్నారు, గంగాసాగర్‌గారూ. మీరు దేవుడి ఆశీస్సుల కోసం ప్రార్థించడంపై నమ్మకం కలవారని నాకు తెలీదు'.

'కొన్నిసార్లు మోకరిల్లితే మనం స్థిరంగా ఉంటాం', గంగాసాగర్ జోక్ చేశాడు. 'ఈ రోజు కొంచెంసేపటి తర్వాత నేను ముంబయి వెళ్ళాలనుకుంటున్నాను. గణేశోత్సవాలు జరుగుతున్నాయి, తెలుసుగా. లాల్ బాగ్చా రాజా ఆశీస్సుల కోసం వెళుతున్నాను'.

ప్రధాని తల ఊపాడు. లాల్‌బాగ్చా రాజా గురించి విన్నాడు కాని ఎప్పుడూ సందర్శించే అవకాశం రాలేదు. ప్రతి ఏడాది పండుగ రోజుల్లో పన్నెండు అడుగుల ఎత్తు ఉండే గణేశ్ విగ్రహాన్ని లాల్‌బాగ్‌లో పెడతారు – ముంబయి టెక్స్‌టైల్ మిల్ జిల్లా మధ్యలో – రోజూ లక్షమందికి పైగా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు తర్వాత పదకొండురోజుల పాటు.

'ఈ సంవత్సరం పదికోట్ల రూపాయలకు పైగా దేవుడికి వస్తాయంటున్నారు', అన్నాడు ప్రధాని.

'తప్పనిసరిగా. నేను కూడా కొన్నివేలు తెచ్చాను, నేనీ డబ్బుని లాల్‌బాగ్చా రాజాకు తీసుకువెళ్ళేముందుగా వీటిని మీరూ పట్టుకోండి. మీ తరఫున కూడా మన విజయాలు కొనసాగాలని దేవుణ్ణి ప్రార్థిస్తాను', అన్నాడు గంగాసాగర్ కొత్త వెయ్యి రూపాయల కట్టను ప్రధానికి ఇస్తూ.

'థ్యాంక్యూ, గంగాసాగర్ గారూ, నా ప్రభుత్వానికి ఇంత మంచి స్నేహితుడిగా ఉన్నందుకు. మనిషి మార్గం నిరాశాపూరిత గమ్యానికి దారితీస్తుంది. కాని దైవమార్గం అంతం లేని ఆశకు దారిచూపుతుంది', అంటూ డబ్బుని గంగాసాగర్‌కు ఇచ్చేశాడు.

గుర్రపు పాదం ఆకారంలో ఉన్న లోక్‌సభ ఛాంబర్లో రెండు చేతుల మధ్యలో స్పీకర్ కుర్చీ ఉంది. ఛాంబర్ మధ్య, ఆయన కుర్చీ దిగువున సెక్రటరీ జనరల్, సెక్రటేరియట్ ఆఫీసర్లు, సభావ్యవహారాలను రికార్డు చేసేవారు కూర్చునే టేబుల్ ఉంది. స్పీకర్ కుడివైపున పాలకపక్షం బెంచీలు, ఎడమవైపున ప్రతిపక్షం కూర్చుని ఉన్నారు. ప్రభుత్వ బెంచీల్లో ముందువరుసలో ప్రధాని ఎప్పుడూ కూర్చునే సీటులో కూర్చున్నాడు. ఎడమవైపున విఐపిల కోసం ఉంచిన ప్రత్యేక స్థలంలో గంగాసాగర్ కూర్చుని ఉన్నాడు. పాలక పక్షం బెంచీల మొదటి వరుసలో చాందిని కూడా కూర్చుని ఉంది. లేతాకు పచ్చ చీర – తన పచ్చని కళ్ళకు సరిపడేరంగు – ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్యం ఛాంబర్లో ఉన్న ఆకుపచ్చ లెదర్‌లో కలిసిపోయే రంగు చీర కట్టుకుంది.

స్పీకర్‌కి ఎదురుగా ఛాంబర్లో వల్లభాయ్ పటేల్ చిత్రం వేలాడుతోంది. కేంద్ర శాసనసభకు ఎన్నికైన మొదటి అధ్యక్షుడు. పార్లమెంటరీ సంప్రదాయాలకు అత్యంత విలువనిచ్చిన వ్యక్తి. ఆ రోజు అన్ని పార్లమెంటరీ సంప్రదాయాలు మంటగలుస్తాయని ఆ బొమ్మలోని ముఖానికి ముందుగా తెలిసినట్టు లేదు.

'గౌరవనీయులైన విద్యుత్తుమంత్రిగారిని సభనుద్దేశించి ప్రసంగించవలసిందిగా కోరుతున్నాను', స్పీకర్ అన్నారు.

'గౌరవనీయులైన స్పీకర్, సర్, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ స్థాపించడానికి, దానికి సంబంధించిన విషయాలను గురించి బిల్లు ప్రవేశపెట్టటానికి అనుమతి కోరుతున్నాను', విద్యుత్తుమంత్రి అన్నాడు.

'అనుమతించబడింది' స్పీకర్ యాంత్రికంగా అన్నాడు.

'సర్, నేను రూల్ 72 ప్రకారం ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ నోటీసు ఇచ్చాను', ప్రతిపక్ష నేత లేచి నిలబడుతూ చెప్పాడు.

'అవునవును. గౌరవనీయులైన ప్రతిపక్షనేత సభనుద్దేశించి మాట్లాడవచ్చు', స్పీకర్ చెప్పాడు.

'సర్, నా చేతిలో పదిలక్షల రూపాయలకు పైగా ఉన్నాయి. ఈ డబ్బుని గౌరవనీయుడైన మా సభ్యుడొకరికి పార్లమెంటులో ఈ బిల్లుకు ఓటు వెయ్యమని లంచంగా ప్రధాని ఇచ్చారు. దీనిపై వెంటనే నేను ప్రకటన.....

సభలో వ్యవహారాలు గందరగోళం కావడంతో ప్రధాని ముఖం నల్లబడింది. గోల చెవులు చిల్లులు పడేలా ఉంది. ప్రతిపక్ష సభ్యులు 'సిగ్గు' సిగ్గు' అని అరుస్తున్నారు. పాలకపక్షం సభ్యులు 'అబద్ధాలకోరు' అని అరుస్తున్నారు. ఇంకా డబ్బు కట్టలు చేతిలో పట్టుకొని నిలబడిన ప్రతిపక్షనేత వాళ్ళని మించి గట్టిగా 'ఈ నోట్లు స్వయంగా ప్రధాని ఇచ్చారు. వీటిపై ఆయన వేలిముద్రలున్నాయో లేదో పరిశోధన సంస్థలు తనిఖీ చెయ్యాలి!'

గోల మధ్యలో వినిపించేలా, స్పీకర్ అరిచాడు, 'సభ్యులందరూ తమ స్థానాలలో కూర్చోవాలని కోరుతున్నాను. ఈ సభలో, సభా మర్యాదను పాటిస్తూ, హుందాగా ఎందుకుండడం లేదు'.

'ప్రధానమంత్రే అవినీతికి పాల్పడితే మర్యాదను పాటించడం సాధ్యం కాదు – ఈ ప్రభుత్వం కుళ్ళిపోయింది పూర్తిగా. ఈ సభకు దీనిపై నమ్మకం పోయింది!' ఈ స్వరం ప్రతిపక్షనేతల బెంచీల నుంచి వినిపించలేదు. ఆ స్వరం చాందినిది. 'ఈ క్షణంలో **అభానస** ఎనిమిది సభ్యులు తమ రాజీనామాలిచ్చేస్తున్నారు. ఈ ప్రభుత్వం నా హెలికాప్టర్ కూల్చేయడానికి ప్రయత్నించిన, తర్వాత ఐసి-617ని హైజాక్ చేసిన కీలక వ్యక్తిని వదిలి పెట్టేసింది! దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కీర్తిశేషులైన ఇక్రంషేక్ జ్ఞాపకాన్ని మనం గౌరవించే పద్ధతి ఇదా?'

ప్రతిపక్ష సభ్యులు సభ మధ్యలోకి వచ్చేశారు. స్పీకర్‌కి ఇంక సభను వాయిదా వేయడం తప్ప మార్గం లేకుండాపోయింది. సందర్శకుల గ్యాలరీలో కూర్చున్న గంగాసాగర్ ఇదంతా చూస్తూ నవ్వుకున్నాడు. చాందిని ముందురోజే ప్రధానికి రాజీనామా ఇచ్చెయ్యాలనుకుంది. అతను అలా చేయవద్దని చెప్పాడు.

'మీరేగా రాజీనామా చేయమని చెప్పారు మాకు. మా లేఖలు ఎందుకివ్వొద్దంటున్నారు?' చాందిని డిమాండ్ చేసింది.

'మీరలా ఇచ్చేటప్పుడు లైవ్ టెలివిజన్ కెమేరాలుండాలని అనుకున్నాను, అందుకని,' ఆయన చెప్పాడు.

'సెంటియోసిస్‌లో మన పరిస్థితేంటి?' గంగాసాగర్ అడిగాడు.

'ఇప్పుడు కంపెనీలో ఇరవై అయిదు శాతం మనది'.

'గుడ్' అన్నాడు గంగాసాగర్.

'ఇప్పటికీ నాకర్థం కావడం లేదు. మనమెందుకు సెంటియోసిస్ షేర్లు కొంటున్నామో? అన్నారు అగర్వాల్. 'గత మూడేళ్ళుగా కంపెనీ నష్టాల్లోనే ఉంది. ఆర్ అండ్ ఎస్ నుంచి వచ్చే కమిషన్లు చాలా ఎక్కువ. అయినా గాని మనం డబ్బుని తీసుకెళ్ళి పాడుచేస్తున్నాం. ఎందుకు?'

'వాళ్ళ వార్షిక నివేదిక కవర్ డిజైన్ నచ్చింది నాకు' గంగాసాగర్ సంతోషంగా అన్నాడు.

'రష్యన్ల నుంచి గ్యాస్ సెంట్రిఫ్యూజ్ డిజైన్లు సంపాదించమని చాందినిని ఒప్పించావా?' గంగాసాగర్ అడిగాడు. ఐబి డైరెక్టర్ తలూపాడు.

'యూరోనికో ప్లాన్లలాగా వీటిని మళ్లీ తయారుచేశారా, నేను చెప్పినట్లుగా?'

'చేశాం–అందంగా, కళాత్మకంగా'.

'**రా** చీఫ్ చేత ఉత్తర కొరియాకు ఆ ప్లాను అమ్మించావా?' అడిగాడు పండిట్.

'వాళ్ళే కొంటామని వచ్చారు', అన్నాడు డైరెక్టర్. 'పాకిస్థాని బ్లాక్ మార్కెట్ ద్వారా ప్లాన్‌లు దొరికాయని వాళ్ళనుకుంటున్నారు'.

'మరి డబ్బు?'

'మీరిచ్చిన లిచెన్ స్టీన్ బ్యాంకు అకౌంటు నంబరులో వేశాం.'

'మంచి మనిషి. నిన్ను పోలీసు కమీషనరు నుంచి ఇంటలిజెన్స్ డైరెక్టరుగా చేసినందుకు రుణం తీర్చేశావు'.

సిమ్లాలో సాధ్వి కుటీరం వెనుక భాగం నిశ్శబ్దంగా ఉంది. సాధ్వి - పూజ్యమాత - మండుతున్న అగ్నికెదురుగా కూర్చుని ఉంది. ఆమెకెదురుగా ముగ్గురు ప్రధానులు కూర్చున్నారు. మొదటి వ్యక్తి ఆమె తండ్రి - మాజీ ప్రధాని - సాధ్వితో తనకున్న బంధుత్వం గురించి గంగాసాగర్ ప్రెస్‌కి లీక్ చేసినందుకు బలవంతంగా రాజీనామా ఇచ్చాడు. రెండో వ్యక్తి గంగాసాగర్ సలహా మీద హెలికాప్టర్లోంచి నిచ్చెన మీద కిందకి దిగాడు - మాజీ రక్షణమంత్రి. టెలికాం, మేత, సెజ్, పెట్రోలియం కుంభకోణాలతో పదవీచ్యుతుడు కావడానికే ప్రధాని పదవిని స్వీకరించాడు. మూడో వ్యక్తి ప్రస్తుత ప్రధాని - అతని పోర్ట్‌ఫోలియోని ఇక్రంకు ఇచ్చారు - ఓటుకు నోటు అపవాదులవల్ల పదవి వదులుకొని ఇటీవలే ఆపద్ధర్మ ప్రధానిగా అయ్యాడు ఎన్నికలయ్యేవరకు.

ఆ ముగ్గురి వ్యక్తుల ముందు నల్లబట్టలో చుట్టిన మేక కళేబరం ఉంది, పిండితో చేసిన బొమ్మ ఉంది దానిపై. దానిచుట్టూ నిమ్మకాయలు, మేకులు, అక్షతలు, కోడి ఎముకలు వంటి విచిత్ర వస్తువులున్నాయి. సాధ్వి మంట వేస్తోంది. ఆవాలు, మరికొన్ని రహస్య పదార్థాలు అగ్నిలో వేస్తూ '*ఓం లింగలింగలింగలింగ కిలికిలి....* అంటూ మంత్రాలు చదువుతూ ఉంది. మంటలో వింత వింత రంగులు కనిపిస్తున్నాయి. విచిత్ర వాసనలు, ధ్వనులు పుడుతున్నాయి.

తండ్రిని చూసి తలూపింది. అతను పాత ఈకను గిన్నెలోని మేక రక్తంలో ముంచి కాగితంపైన 'గంగాసాగర్' అని రాశాడు. తరవాత ఆ కాగితాన్ని ఆమె చేతికిచ్చాడు. ఆమె ఆ కాగితాన్ని నేతిలో ముంచి అగ్నిలో వేసింది. అది కాలిపోయింది.

పిండి బొమ్మ మీద నీళ్ళు చిలకరించి నెమలి ఈకతో బొమ్మను తుడిచి, బొమ్మ మెడకు దారం చుట్టింది. మాజీ రక్షణమంత్రిని దారానికి ఒక చివర పట్టుకోమని, తానొక చివర పట్టుకొంది. ఇద్దరూ దారం లాగారు. బొమ్మ తల తెగి మంటలో పడేవరకు లాగారు.

తర్వాత ఓటుకు నోటు ప్రధానిని పిలిచింది. సాధ్వి మంత్రం ఓ *లింగలింగ లింగలింగ, కిలికిలి...* అంటుండగా ఆపద్ధర్మ ప్రధాని మేకుల్లోంచి ఒక్కో మేకుని తీసికొని తల తెగిన పిండి మొండేనికి గుచ్చుతున్నాడు. సాధ్వి నవ్వింది. ముగ్గురు వ్యక్తులూ తృప్తిగా చిరునవ్వు నవ్వారు. చేతబడి ఫలితం తిరుగులేనిది. ఆ కుతంత్రాలు పన్నే గంగాసాగర్ గుణపాఠం నేర్చుకోవాలి.

సాధ్వి కుటీరంలో ఏకాంతంగా సమావేశం జరిగింది. ఎవరిపైన దుష్ప్రచారం చేశాడో ఆ మనిషితో తను కలిసి కూర్చున్నాననే విషయాన్ని రిపోర్టర్ నమ్మలేకపోతున్నాడు. సాధ్వి మూలంగా కళంకితుడైన మాజీ ప్రధాని కప్పులో టీ ఇచ్చి, తన కుర్చీలో కూర్చున్నాడు.

'నీ మీద నాకేం కోపం లేదని చెప్పడానికి పిలిచాను. నువ్వు నీ పని చేశావు. ప్రెస్ నిర్భయంగా, స్వతంత్రంగా పనిచేస్తేనే భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది', అన్నాడు అవసరానికి తగినట్టుగా మాట్లాడే రాజకీయ నాయకుడు. రిపోర్టరు భుజాలు ఎగరేశాడు, ఏమీ మాట్లాడలేదు.

'సాధ్వి గురించి - పూజ్యమాత - నా అక్రమ సంతానమనే ఆసక్తి కలిగించే విషయం నీకు చెప్పడానికి ముందు, నువ్వు మరో వార్త కోసం ఎక్కడికో వెళ్ళాలనుకున్నావు అని తెలిసింది. చాందిని గురించి తెలుసుకోవాలని', మాజీ రాజనీతిజ్ఞుడు అన్నాడు, రిపోర్టర్ని చూస్తూ చిరునవ్వుతో.

'నేను చేసి ఉంటే మాత్రం ఏమిటి?' రిపోర్టర్ అడిగాడు, ఆసక్తి లేనట్లుగా కనిపించడానికి బాగా ప్రయత్నిస్తూ, శ్రద్ధగా వింటున్నాగాని.

'ఛానెల్ దీవుల్లో ఉన్న గర్న్‌సీలో లేక్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న గ్రాస్మియర్లో ఒక తల్లి, ఆమె కొడుకు కోసం గంగాసాగర్ ట్రస్టు ఫండ్ ఏర్పాటు చేశాడని చెబితే ఏం చేస్తావు?'

'అయితే, ముసలాయన బ్రహ్మచారి కాదన్నమాట. ఒక స్త్రీతో వ్యవహారం నడిపాడంటే పెద్ద విషయమే - మీకులానే!' మాజీ ప్రధానికి కన్ను గిలుకుతూ అన్నాడు రిపోర్టర్.

'నీకు విషయం అర్థం కాలేదు మై ఫ్రెండ్. ఆ తల్లీ బిడ్డలకి గంగాసాగర్‌కి సంబంధం లేదు. ఆ బిడ్డ చాందిని బిడ్డ - భారత ప్రజలకు ఇష్టమైన ప్రధాని అభ్యర్థి!'

'ఈ విషయం మీకెలా తెలిసింది?' అడిగాడు రిపోర్టర్, ఒకవేళ తననెవరైనా ఇలాంటి ప్రశ్న అడిగితే ఆ వివరాలు తాను చెప్పలేనని చెబుతాడని తెలిసి కూడా.

'గర్న్‌సీ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమీషన్ డైరెక్టర్ ద్వారా నా కోసం మాజీ ఆర్థికమంత్రి ఈ సమాచారం కనుక్కున్నాడు. ప్రత్యేక సాయం చేశాడు', వివరించాడు చిక్కుల్లో ఉన్నానని మర్చిపోయిన ప్రధాని.

'ఒక బిడ్డ పుట్టాడని, అతను కడుపులోనే చనిపోయాడని నాకు తెలిసింది' చెప్పాడు

రిపోర్టర్, జాగ్రత్తగా మాటలు పేర్చుతూ. 'ఆమె గర్భస్రావం చేయించుకోవాలనుకుంది ముందు, కాని తర్వాత మనసు మార్చుకుంది!'

'నీకు సమాచారం ఇచ్చిన వాళ్ళు తప్పు చేశారు', చిరునవ్వు నవ్వాడు రాజకీయ నాయకుడు.

'వాస్తవాలు మళ్ళీ నా అంతట నేను మరోసారి తెలుసుకోవాలి'.

'అందుకే నేను ఒక టికెట్, విదేశీ మారకం సిద్ధంగా ఉంచాను. ఎంత త్వరగా బయల్దేరగలవ్?'

లక్నోలో టుండీ కెబాబ్స్ దగ్గర హమీదా అనే కొజ్జా ఉంటుంది. నేనామెను కలవాలి', ఆపద్ధర్మ ప్రధాని అన్నాడు. పార్లమెంటులో జరిగిన గలభా మూలంగా భారతదేశంలో మరోసారి సాధారణ ఎన్నికలొచ్చాయి. దేశం రాష్ట్రపతి పాలనలో ఉంది. అతని ప్రభుత్వం కుంటిదైంది.

'ప్రథమ మహిళ బిడ్డకు జన్మనిచ్చారని నాకు తెలియదు, నేను వెంటనే –' ఆయన ప్రయివేటు సెక్రటరీ చెప్పబోయాడు.

'నేను చెప్పేది పిచ్చి ప్రథమ మహిళ గురించి కాదు', వెంటనే అన్నాడు ప్రధాని, తన భార్య గురించి ఒక చెడ్డ మాట అనేశానని గుర్తించి.

'జన్మించిన బిడ్డ కోసం ఆశీస్సులు కాదు నాక్కావలసింది. ఈ కొజ్జాని నేను కలవాలి. అంతే – పిలిపించండి!'

హమీదాని మంచి దుస్తులు వేసుకోమని చెప్పారు. కొజ్జాలా కనిపిస్తూ ఆమె ప్రధాని బంగ్లాలోకి వెళ్ళలేదు. సెక్యూరిటీ గార్డులేమనుకుంటారు? క్షవరానికి, బిజినెస్ సూట్‌కి ప్రధాని ప్రయివేటు సెక్రటరీ ఏర్పాట్లు చేశాడు. 'ఈ బట్టలు నేను ఉంచేసుకోవచ్చా?' హమీదా అడిగింది.

ప్రయివేటు సెక్రటరీ తలూపాడు. ఆమె వేసుకున్న బట్టలు ఎలాగూ ఎవరూ వేసుకోరు. హమీదాకు సందర్శకుల పాస్ జారీచేవారు సెక్యూరిటీ వాళ్ళు. అది లామినేట్ చేసి, నీలం తాడుకి వేలాడదీసి ఉంది. ప్రయివేటు సెక్రటరీ దానినామెకి ఇచ్చాడు.

'సౌత్‌బ్లాక్‌లో, నార్త్‌బ్లాక్‌లో, రాష్ట్రపతి భవన్‌లో ఒక గంట సేపు ఇది పనిచేస్తుంది. బయటికి వచ్చేటప్పుడు దీనిని గార్డ్‌కి ఇచ్చెయ్', బార్‌కోడ్ ఉన్న పాస్‌ని హమీదా మెడలో వేసుకుంటుండగా చెప్పాడు అతను.

వాళ్ళు ఆఫీసులోకి నడవగానే, 'గంగాసాగర్ మీద కక్షతీర్చుకునే అవకాశముంటే ఏం చేస్తావ్?' ప్రధాని ఆమెని చూస్తూ జిత్తులమారిలా అడిగాడు.

'నేను మెలకువగా ఉన్న ప్రతి నిముషం అతన్ని చంపడానికి పథకాలు వేస్తుంటాను. నా కలల్లో అతన్ని చంపుతున్నట్లుగా కూడా అనిపిస్తుంది నాకు. అతను నా వట్టలే కోయించలేదు, నా జీవితానికే బుద్దకొట్టాడు' అంది హమీదా.

'నువ్వతన్ని నాశనం చసే మార్గమొకటుంది. హైజాక్ ఎన్‌కౌంటర్లో ఇక్రం చనిపోయేలా గంగాసాగర్ ఏర్పాటు చేశాడని చెప్పు చాందినికి'.

'అది నిజం కాదు కదా. ఇక్రం భాయ్‌ని రషీద్ చంపాడు'.

'అయినా ఆమె నిన్ను నమ్ముతుంది. ఆమెని కాపాడుతూ నీ సొంత ఆస్తుల్ని పోగొట్టుకున్నావు కదా!'

హమీదాతో సమావేశం ఇరవై నిముషాల్లోపే అయిపోయింది. బయటికి వస్తూ హమీదా తడబడి ప్రయివేటు సెక్రటరీ మీద పడిపోయింది అతని మెడలో చేతులు వేసింది. 'మనిద్దరం ఒకరి కోసం ఒకరం పుట్టామనుకుంటా' అని గుసగుసగా అంది అతని చెవిలో. అతను వణికిపోయాడు.

హమీదా వెళ్ళిపోతూ తన సందర్శకుల పాస్‌ని వాడేసిన పాస్‌లు వేసే చోట వేసింది. దానితో ఆమెకి ఇంక అవసరం లేదు. ఆమె దగ్గర ప్రయివేట్ సెక్రటరీ పాస్ ఉంది. సచ్లాదేవి ఇచ్చే శిక్షణ వల్ల ప్రయోజనాలున్నాయి.

మాజీ ఆర్థికమంత్రి పడక్కుర్చీలో సౌకర్యంగా కూర్చుని ఉన్నాడు, రంగ్తా, సోమాని పక్కనే ఉన్నారు. 'మీ ఒప్పందాలు పునరుద్ధరించుకోవడానికి నన్ను త్యాగం చేసేశారు మీరు. దాన్ని నేనర్థం చేసుకోగలను. వ్యాపారంలో అంతా న్యాయమే. కాని పదిశాతం ఆదాయాన్ని అగర్వాల్ గారికెందుకు ఇస్తామన్నారు. మీరు చేస్తున్నదానివల్ల వాళ్ళు ఆర్థికంగా బలపడుతున్నారు' అతను అడిగాడు.

'మేమెక్కువగానే ఇచ్చామని ఒప్పుకుంటాను', చెప్పాడు రంగ్తా', కాని ఇప్పుడు మేం ఇరుక్కుపోయాం. వెనక్కి రావడం కష్టం'

'ఒక మార్గం ఉంది', రాజకీయ నాయకుడు మృదువుగా అన్నాడు.

'చాందినికి, గంగాసాగర్‌కి మధ్య విభేదాలు సృష్టించండి. ఆమెకి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. సులభంగా వచ్చేసారి ప్రధాని అవగలదు. గంగాసాగర్ని ఆమె ద్వేషించేలా చేయండి. ఆమె సంతోషంగా గంగాసాగర్ చేసిన ఏర్పాట్లు తిరగదోడుతుంది'.

'కాని వాళ్ళిద్దరి మధ్య విభేదాలు ఎట్లా తేగలం?'

'వదంతులు నిజమే అయితే, ఆమెకి తన సెక్రటరీ – శంకర్ అనే అతనితో ప్రేమ వ్యవహారం ఉంది. గంగాసాగర్‌కి కోపం వచ్చి గుర్తు తెలియని బండితో గుద్దించి అతన్ని చంపించాడు'.

'దీన్నెలా నిరూపిస్తాం?' సోమాని అడిగాడు.

'హృదయానికి సంబంధించిన విషయాన్ని మనం రుజువు చెయ్యనవసరం లేదు, ఫ్రెండ్స్. గంగాసాగరే దాన్ని తను చేయలేదని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది'.

ఆపద్ధర్మ ప్రధాని తన ప్రయివేటు సెక్రటరీని పిలిచాడు. 'ఈ ఎన్నికలు భిన్నంగా ఉంటాయి' అన్నాడు ఐసువేసిన టీ తాగుతూ.

'ఎలా సర్?' అతనంటే గౌరవం ఉన్న ప్రయివేట్ సెక్రటరీ, చాలా ఏళ్ళుగా అతనికి నమ్మకస్థుడు.

'ఇక్రం లేడు. ఉత్తరప్రదేశ్‌లో అవకతవకలు జరగక్కుండా ఎవరు చూస్తారు? ఇక్రం గుండాలు అన్ని పోలింగు కేంద్రాలకి వెళ్ళి కాపలా కాసేవారు. గంగాసాగర్ విలువైన మనిషిని కోల్పోయాడు.

'అంటే మనకి ఇప్పుడు అవకాశమా అది?' ప్రయివేటు సెక్రటరీ నవ్వుతూ బాస్‌ని అడిగాడు.

'ఇప్పుడు సెంటియోసిస్‌లో మనకెంత ఉంది?' అడిగాడు గంగాసాగర్.

'యాభై ఒక్క శాతం', సమాధానమిచ్చాడు అగర్వాల్‌గారు తల ఊపుతూ, అతను పెట్టిన చెత్త పెట్టుబడి అదే.

'అద్భుతం', అన్నాడు గంగాసాగర్. ఇప్పుడు మేనేజ్‌మెంట్ పెద్దలతో మాట్లాడవచ్చు'.

'నిన్ను చాలాసార్లు నేనర్థం చేసుకోలేను, గంగా. ఎందుకంత మొండిపట్టు. ఈ కంపెనీ నీకెందుకింత ముఖ్యమో చెబుతావా?'

'వాళ్ళ సిఇఒకి ఇరవై నాలుగేళ్ళట. యువకులని ప్రోత్సహించడం నాకిష్టం' అన్నాడు గంగాసాగర్ భుజాలెగరేస్తూ.

---

గంగాసాగర్ ముందురోజు చదవని పేపర్లు చదవడంలో తీరిక లేకుండా ఉన్నాడు. చదువుతున్న పేపర్ మడిచి నేల మీద చదివేసిన పేపర్లపై పడేశాడు. గంగాసాగర్, చాందిని, అగర్వాల్‌గారు, మీనన్, మేజర్ బేడి కలిసి గంగాసాగర్ ఇంటిలో కూర్చుని వ్యూహరచన చేస్తున్నారు.

'ఈ మురికి కూపంలోంచి బయటికి రావాలని ఆలోచించారా?' అనడిగింది చాందిని న్యూఢిల్లీ ప్రభుత్వంలో చేరాక. 'దేశంలో అత్యంత శక్తిమంతుల్లో మీరొకరు. అయినాగాని పేదరికంలోనే ఉంటానంటారు?'

'పరిత్యాగానికున్న శక్తిని గురించి నేను చెప్పిన పాఠాన్ని ఎన్నడూ మర్చిపోకు తల్లీ', ఆయన సమాధానమిచ్చాడు.

'ఎన్నికల వ్యూహాల్ని చర్చించడానికి మేజర్ బేడీతో ఏర్పాటు చేసిన సమావేశం కాదా ఇది? లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల్ని ఖరారు చెయ్యాలి. మీరింకా పేపర్లే చదువుకుంటున్నారు', చిరాగ్గా అంది చాందిని.

'ఎన్నికల వ్యూహం నిర్ణయించడానికి మీరు నలుగురున్నారు. నేను దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి,' గంగాసాగర్ సమాధానమిచ్చాడు.

'మీరెప్పుడూ ఎకనామిక్ టైమ్స్, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ చదివేవారు కాదు కదా. ఇప్పుడు రాజకీయాలు వదిలి ఆర్థిక విషయాలపై ఆసక్తి ఎందుకు కలిగింది?' చాందిని అడిగింది.

'రెండూ ఒకటే! రాజకీయాధికారం దేశ ఆర్థిక వనరులని నియంత్రిస్తుంది. ఆర్థిక శక్తి రాజకీయ నాయకులను నియంత్రించాలని చూస్తుంది' సరదాగా సమాధానమిచ్చాడు. కంపెనీ రిపోర్టులు చూడడం కొనసాగించాడు, ముఖ్యంగా సెంటియోసిస్‌వి.

'ఇంక, మీరో క్షణం నామాటవింటే, ఉత్తరప్రదేశ్‌లోని ఎనభై అయిదు సీట్లకు మన అభ్యర్థులు పాతవారు, కొందరు కొత్తవారు –' మేజర్ బేడి చెప్పసాగాడు.

గంగాసాగర్ ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌లోంచి తలెత్తి, 'గత ఎన్నికల్లో మన ఓటు షేరు ఎంత?' అడిగాడు.

'ముప్ఫయిశాతం', మేజర్ బేడి సమాధానం చెప్పాడు.

'అయినా మనం డెబ్భయ్యారు శాతం సీట్లు గెల్చుకున్నాం. దాని వల్ల మీకేమర్థమవుతుంది?' గంగాసాగర్ అడిగాడు.

'మనం ఎక్కువ ఓట్లు రావడం వల్ల గెలవలేదు అని, మిగిలిన ఓట్లు చీలడం వల్ల అని' చెప్పాడు బేడి, గంగాసాగర్ అపరిశుభ్ర పరిసరాలకు తనను తాను అలవాటు చేసుకోవడానికి తలపాగా సర్దుకుంటూ.

'మన ఓట్లు పెంచే బలమైన అభ్యర్థుల కోసం వెదకడానికి శ్రమపడకండి. ఓట్ షేర్ అర్థరహితమైంది. బదులుగా మిగిలిన అభ్యర్థుల ఓట్లలో చీలికలు వచ్చేలా ప్రయత్నించండి', చెప్పాడు గంగాసాగర్ ఏదో సాధించినట్లుగా.

'దాన్నెలా చేయాలని అంటారు? చాందిని అడిగింది.

'నేను దాని గురించే ఆలోచిస్తున్నాను', అన్నాడు గంగాసాగర్, అన్యమనస్కంగా తన ముందున్న సెంటియోసిస్ లెక్కలున్న పేపర్ని చూస్తూ.

ఈసారి ఇక్రం భాయ్ లేడు. పోలింగ్ బూత్‌లు కాపాడేందుకు ఎవరూ ఉండరు. ప్రత్యర్థులు వాటిని ఆక్రమిస్తే', చెప్పాడు మీనన్ అందరూ వెళ్ళగానే గంగాసాగర్‌తో.

'మంచి శాండ్‌విచ్‌ని మరింత రుచికరంగా చేసేదేంటో నీకు తెలుసా?' గంగాసాగర్ అడిగాడు, ఇక్రం లేదని చెప్పిన విషయాన్ని పట్టించుకోకుండా.

'ఏమిటి?' అడిగాడు మీనన్.

'పక్కన చిప్స్ ఉండాలి' గంగాసాగర్ చెప్పాడు.

**'ఇవిఎం!'** అన్నాడు గంగాసాగర్ గట్టిగా.

'ఎక్స్‌క్యూజ్‌మి సర్?' అన్నాడు మీనన్.

'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్. వాటిని ఈ ఎన్నికలలో వాడుతున్నారు. పేపర్ బ్యాలెట్లు లేవు'.

'ఆ. అవును. అవే సమర్థంగా బాగా పనిచేస్తాయని అంటున్నారు', అన్నాడు మీనన్.

'మీనన్ ఈ **ఇవిఎం**ల లోపల ఏముంటాయో తెలుసా?

'ఏముంటాయి?'

'చిప్స్', చెప్పాడు గంగాసాగర్. **ఇవిఎం** శాండ్‌విచ్‌లా ఉంటుంది. చిప్స్ లేకపోతే అది పనిచెయ్యదు'.

'**ఇవిఎం**ల్లో ఉండే క్లిష్టమైన విధానం చిప్స్‌ని పనిచేసేలా చేస్తుంది. మీకు తెలుసా?' అడిగాడు గంగాసాగర్.

అగర్వాల్ గారు తన కప్పులో టీని సాసర్లో పోసుకోవడం ఆపారు. 'లేదు నాకు తెలియదు. ఇది తెలుసుకోవాల్సిన అవసరం నాకుందా?'

ఉందని కాదు. వివిధ కంపెనీలు **ఇవిఎం**లను తయారుచేస్తాయి. అవి అన్నీ ఒకే సెంట్రల్ చిప్‌ని వాడతాయి. మిషన్లో ఓట్లు రిజిష్టరయి, ఫలితాలను చెప్పే సాఫ్ట్‌వేర్ దాన్లో ఉంటుంది.

'అహా అలాగా', సాసర్లోంచి చప్పుడు చేస్తూ టీ తాగుతూ అన్నారు అగర్వాల్.

'ఎప్పుడైనా లాటిన్ నేర్చుకున్నారా?' గంగాసాగర్ హఠాత్తుగా అడిగాడు.

'లేదు. ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం నేర్చుకున్నాను. లాటిన్ నేర్చుకోలా'.

'అందుకే తెలియలేదు'.

'ఏమిటి?'

'ఇంగ్లీషు ఓటు లాటిన్‌లో సెంటియో అని. ఇప్పుడు మీరు సెంటియోసిస్‌కి – అంటే చిప్స్ తయారుచేసే కంపెనీకి యజమాని'.

≡⊃≡

'కాని కాని అది మోసం గంగా. మనకి ఎక్కువ ఓట్లు రావాలని ఈ మిషన్లని రిగ్ చేయలేం' అగర్వాల్ అన్నారు కంగారుగా. గంగాసాగర్ పథకాలకి అంతులేకుండాపోతోంది.

'ఒప్పుకుంటాను. మిషన్లు మనకి ఎక్కువ ఓట్లు ఇచ్చేలా రిగ్ చేస్తే అది మోసం. కాని ఇతరులకు ఎక్కువ ఓట్లు వచ్చేలా చేస్తే? అడిగాడు అమాయకంగా.

'నీకేమైనా పిచ్చి పట్టిందా? అగర్వాల్ అడిగారు. 'ఇతర్లకి ఎక్కువ ఓట్లు వచ్చేలా మిషన్లు రిగ్ చేస్తావా?'

'కేవలం అవసరమైనవాళ్ళకి', చెప్పాడు గంగాసాగర్.

≡⊃≡

'అసలు ఏం చెబుతున్నావు గంగా నువ్వు?' అడిగాడు విసిగిపోయిన అగర్వాల్‌గారు.

**అభానస** అభ్యర్థి ఒకరు ఒక నియోజకవర్గంలో పోటీ చేస్తున్నాడనుకుందాం. మన అభ్యర్థికి యాభై ఒక శాతం ఓట్లు ఉన్నాయనుకుందాం, అతను గెలుస్తాడు ఖాయంగా అవునా?

'అవును'.

'ఒకవేళ అతనికి ఏభై ఒక శాతం కాదు – ఏభై శాతం ఉంటే? అతను గెలుస్తాడా, ఓడిపోతాడా అని నిర్ణయించేది ఏమిటి?

'మిగిలిన యాభై శాతం ఎలా విభజించబడ్డాయనే దానిపైన?'

'కరెక్ట్. ఆ మిగిలిన యాభై శాతం ఒకే అభ్యర్థికి వస్తే, టై అవుతుంది. అవి ఒకరు లేదా ఇద్దరు అభ్యర్థుల మధ్య విభజింపబడితే మన అభ్యర్థి గెలుస్తాడు. ఒకవేళ మన అభ్యర్థికి నలభై శాతం ఓట్లు వస్తే అప్పుడేమవుతుంది?'

'మిగిలిన అరవైశాతం ఓట్లు ఎవరికి వచ్చాయనే దాని మీద అతని విజయం ఆధారపడి ఉంటుంది'.

'కరెక్ట్. మిగిలిన అరవైశాతం ఒకే అభ్యర్థికి రావచ్చు. అప్పుడు మన అభ్యర్థి ఓడిపోతాడు. అరవై శాతం ఇద్దరు అభ్యర్థులకు వచ్చినా మన అభ్యర్థి ఓడిపోవచ్చు. యాభై ఒకరికి – పది ఒకరికి వస్తే, కాని అరవై శాతం ఓట్లు ముప్పయి, ముప్పయిగా విభజింపబడితే మన అభ్యర్థి గెలుస్తాడు.

'అయితే దానికి నువ్వేం చేయాలనుకుంటున్నావు?'

'ఆల్గోరిథం మన అభ్యర్థి ఓట్లెన్నో అదే నిర్ణయిస్తుంది. అబద్ధపు ఓట్లు కలపదు. కాని మిగిలిన ఓట్లను మళ్ళీ కేటాయిస్తుంది. ఎప్పుడూ గెలవడమే కాదు మన బలాన్ని పెంచేది, శత్రువు బలాన్ని తగ్గించడం కూడా అని నా అభిప్రాయం. నేను చెప్పేదేమిటంటే, మన చుట్టూ శత్రువులున్నారు. ఉన్న కుట్రలూ, కుతంత్రాలు ఉపయోగించడానికేమాత్రం సందేహించరు!

---

హారీ రిచర్డ్‌సన్ ఉద్విగ్నంగా ఉన్నాడు. ఈటన్ కళాశాల కచ్చేరీ హాలులో ఉన్న రెండు వందల యాభై సీట్లు నిండిపోయాయి. ఇది అతను ఒక్కడే ఇచ్చే మొదటి కచేరీ. ఈటన్ కళాశాల సింఫనీ ఆర్కెస్ట్రా అతనితో ఉంది. ఈ కచేరీ ఐజాక్ పెర్ల్‌మేన్ అనే ప్రసిద్ధ వయొలినిస్టు సిఫారసుతో ఏర్పాటైంది. ఆయన ఈటన్‌లో ఒకసారి హారీ వాయిస్తుండగా విన్నాడు. తర్వాత తన అభిప్రాయాలు లేఖ ద్వారా స్కూలుకు తెలిపాడు. 'మనం హారీ రిచర్డ్‌సన్‌తో మొదలుపెడదాం. అతను విశిష్ట వయొలినిస్టు. సంగీత హృదయం స్వతఃసిద్ధ ప్రతిభ ఉన్నవాడు. ఏ చిన్న విషయాన్ని అశ్రద్ధ చేయడు. ఇతరులకు ప్రశ్నలే కనిపించని చోట హారీకి సమాధానాలు కనిపిస్తాయి....'

ఈ రోజు ఇచ్చే కచేరీ *డి మైనర్ పార్టిటా నెం. 2*లో చాకొనె డి మైనర్– ప్రయోగాత్మక సంగీతంలో బాక్ ప్రసిద్ధ పీస్ అది. చాకొనె బాక్ కాలంలో సోలో ప్రదర్శనలో అతి విశిష్టంగా గుర్తింపు పొందింది. ఎందుకంటే దానిలో వయొలిన్ వాయించడంలోని ప్రతి కోణమూ ప్రదర్శితమవుతుంది. హారీ ఇంతకుముందెవరూ వాయించనిది, చాలా కష్టమైన వాటిలోంచి ఒకదాన్ని ఎంచుకుని తప్పులు లేకుండా వాయించాడు.

తల్లి–జోసఫిన్– మొదటి వరుసలో కూర్చుని ఆసక్తిగా వింటూ శ్రోతలతో కలిసి చప్పట్లు కొట్టడం చూశాడు. వాళ్ళు నిలబడి అభినందిస్తున్నారు. అమూల్యమైన కొడుకుని చూసి ఆమె గర్వపడింది.

పెర్ల్‌మేన్ అభినందించాడు కనుక ప్రేక్షకుల్లో ప్రెస్‌వాళ్ళు కూడా ఉన్నారు. బ్రిటన్ నుంచే కాదు. బాల ప్రతిభావంతుడిని అందరూ ఫోటోలు తీశారు. దూరంగా, భారతీయ విలేఖరి కూడా ఫోటో తీయడం హరీ చూశాడు.

'మీరు జాఫ్రీని చంపేశారు!' ఆమె అరిచింది.

'చాందినీ, చెప్పేది విను–' గంగాసాగర్ మొదలుపెట్టాడు.

'శంకర్‌ని కూడా హత్య చేయించారు!' ఆమె ఏడుస్తోంది.

'దానికి కారణాలున్నాయి–' ఆయన మొదలుపెట్టాడు.

'మరి ఇక్రంభాయ్ సంగతేంటి? అతన్ని కూడా చంపించారా, మీరు?'

'దైవసాక్షిగా, అతనంటే నాకిష్టం. నువ్వు చేసే ఆరోపణలన్నీ అంగీకరిస్తాను. అది మాత్రం ఒప్పుకోను!' గర్జించాడు గంగాసాగర్.

'గంగా, అంకుల్. మీరు కఠినాత్ములని నాకు తెలుసు – మీ లక్ష్యాలని సాధించుకోవడానికి మీరేమైనా చేస్తారు – కాని బొత్తిగా హృదయం లేని మనిషని అనుకోలేదు. ఈ రోజు నా అభిప్రాయం మార్చుకున్నాను', ఆమె అంది, చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

'ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. నువ్వే తరువాతి ప్రధానమంత్రివి అవుతావనేది ఖాయం! చాందినీ, ఇలాంటప్పుడు దృష్టి మరలకూడదు. మనం ఇంకా చాలా దూరం వెళ్ళాల్సి ఉంది'.

'మనం అనేది లేదు ఇంక – కేవలం మీరు, నేను అంతే. మనిద్దరం ఎవరి దారిన వాళ్ళు వెళ్ళాల్సిన అవసరం వచ్చింది. నేను మిమ్మల్ని వదిలేస్తే ఆపద్ధర్మ ప్రధాని మద్దతు లభిస్తుంది మిమ్మల్ని ద్వేషిస్తాడు కనుక. బీహారు, ఉత్తరప్రదేశ్‌తో కలిపి సరిగ్గా నాక్కావలసిన ఎంపీల సంఖ్య అతని దగ్గరుంది'.

'నిన్ను కింద పడెయ్యడానికే, నీకు మద్దతిస్తానంటాడు చాందినీ. దెయ్యంతో ఒప్పందం చేసుకోకు' చెప్పాడు గంగాసాగర్.

'ఎందుకొద్దు?' ఆమె అరిచింది. 'మీతో చేసుకున్నాను కదా. కాదా?' మైక్రోఫోను

ధ్వని తరంగాలను గ్రహించి డయాఫ్రంను కంపింపచేసి విద్యుత్తు సంకేతాలు పంపింది. కొన్ని ఇళ్ళ అవతల ఉన్న రిసీవర్‌కు ట్రాన్స్‌మీటర్ ద్వారా ఈ సంకేతాలు అందాయి. ఎసి గదిలో ఆపద్ధర్మ ప్రధాని కూర్చుని ఉన్నాడు. సంభాషణ వింటూ నవ్వుకున్నాడు.

చాందిని విసురుగా గంగాసాగర్ ఫ్లాట్లోంచి బయటికి వచ్చింది, గంగాసాగర్ వెనుక నుంచి పిలుస్తున్నాడు, 'చాందినీ, వెనక్కిరా – నీకోసమే నేనిదంతా చేశాను–' కాని ఆయన వాక్యం పూర్తిచేయలేకపోయాడు. బాగా దగ్గురావడంతో మాటలు రాలేదు. రుమాలు మీద ఎర్రటి రక్తపు మరకలు కనిపించేవరకు ఆయన దాన్ని పట్టించుకోలేదు.

# పందొమ్మిదో అధ్యాయం

# 2300 ఏళ్ళ కిందట

బందిపోట్లు పెద్ద బండరాయి మీద నిలబడి ధననందుడు, అతని పరివారం చెట్లలో నుంచి వెళ్ళడం చూశారు. వాళ్ళ నాయకుడు, బీభత్సకుడు వెయ్యిమందిని పైగా చంపాడంటారు. అతని తల మురిగ్గా, దువ్వకోకుండా ఉంది. బుగ్గల మీదకు మెలితిరిగి మీసాలున్నాయి. గడ్డం శుభ్రంగా చేసుకున్నాడు. మురికిగా ఉన్న తెల్ల ధోతి మందపాటి తోలు చెప్పులు, ముదురు బూడిదరంగు దుప్పటి కప్పుకొని ఉన్నాడు. చర్మం నల్లగా జిడ్డుగా ఉంది – చాలా ఏళ్ళుగా సరిగా స్నానం చేయక – వక్కపొడివల్ల పళ్ళు గారపట్టి ఉన్నాయి.

తన వేటని చూస్తూ కాండ్రించి ఉమ్మేశాడు. బాగా తాగినందువల్ల అతని కళ్ళు రక్తపు ముద్దల్లా ఉన్నాయి. నుదుటి మీద ఎర్రటి తిలకంతో సమానంగా ఎర్రగా ఉన్నాయవి. అయితే ఈ తిలకం సింధూరంతో చేసింది కాదు. తాజాగా అతను చంపినవాడి రక్తమది. చేతిలో వంకర కత్తి ఉంది, అచ్చొచ్చినది. తను చంపిన వెయ్యిమందికి అచ్చిరానిది. మరో చేతిలో గత రాత్రి కానుకగా ఇచ్చిన కత్తి ఉంది. ఇది సరిపోతుంది అనుకున్నాడు బీభత్సకుడు. చంపిన ప్రతివాడు ధనం ఇవ్వడమే కాదు, కాళీమాతకు బలి కూడా అయ్యాడు. నదీతీరంలో ఆమెకో గుడికట్టాడు. ప్రతి రోజూ తప్పనిసరిగా తాజాగా మనిషి రక్తాన్ని ఆమెకు సమర్పించడం కూడా చేసేవాడు. ఆ గుడి ఉన్న చోటికి ఎవరూ రారు. ఎప్పుడూ నిర్జనంగా ఉంటుంది. దాన్ని కాళీఘాట్ అంటారు.

'రాత్రివేళ ఆగినపుడు మనం దాడి చేద్దాం' అన్నాడు బీభత్సకుడు.

'బృందంలో చాలామంది ఉన్నారు. రక్షకభటులున్నారు. వాళ్ళు పూర్తిగా ఆదమరిచి ఉన్నపుడు పట్టుకోవాలి. చాలా బాగుండేటట్టుందిది!' అతని మనుషులు – పాతికమంది

– నవ్వారు. తన వాళ్ళని ఎలా చూసుకోవాలో నాయకుడికి తెలుసు. వాళ్ళు ధనవంతులవుతారు.

బీభత్సకుడు అప్పటికే ధనవంతుడు. శారంగరావు అతనితో అర్థరాత్రి రహస్యంగా జరిపిన సమావేశంలో దోపిడి సొత్తు ఎంత ఉన్నాగాని, ఈ పని కోసం పెద్ద మొత్తం ఇస్తామని చెప్పాడు. భద్రశాలుడి కత్తిని కూడా ఇచ్చాడు. ధననందుడిని ఆ కత్తితోనే చంపాలని, నేరం చేసిన చోటే కత్తిని వదిలి రావాలని చెప్పాడు.

'కాని ఆచార్యా, మహారాజు పురుషోత్తముడికి వెంటనే మగధ చక్రవర్తిగా పట్టాభిషేకం చేయడం మంచిది కదా?' అడిగాడు ఇంద్రదత్.

'మహారాజుగారి జాతకంలో ఇంద్రుడు ధనూరాశిలో ఇరవై మూడు డిగ్రీల కోణంలో ఉన్న శుక్రుడిని చూస్తున్నాడు. మహారాజుగారి జన్మజాతకంలో బుధుడికి, శని–వరుణుల అశుభదృష్టి ఉంది. అందువల్ల బుధుడు–శని–ఇంద్రుడు–శుక్రుడులు అశుభయోగం ఇస్తున్నారు కనుక మహారాజుగారికి ఇప్పుడు పట్టాభిషేకం చేయకపోవడం మంచిది' చెప్పాడు రాజపురోహితుడు. ధననందుడి విలాసమందిరంలో ఉన్నారు వాళ్ళందరూ. చాణక్యుడు నవ్వుని ఆపుకున్నాడు. జ్యోతిష్యం ఎంత అద్భుత శాస్త్రం. నువ్వేం కావాలనుకుంటే అది నోరు తెరవకుండానే చెప్పించుకోవచ్చు.

'అంటే ఏమిటి?' ఆశ్చర్యపోయిన పురుషోత్తముడడిగాడు.

'మీరు పట్టాభిషేకానికి రెండు పగళ్ళు, రెండు రాత్రులు ఆగాలి మహారాజా' చాణక్యుడు కల్పించుకున్నాడు.

'అప్పటివరకూ నేనేం చెయ్యాలి?' అడిగాడు పురుషోత్తముడు.

'మహారాజుగారి కాలక్షేపం కోసం నేను ఏర్పాట్లు చేశాను', చాణక్యుడు సూచించాడు, విశాఖ హుందాగా ఆడపులిలా నడచి వస్తుండగా.

'పులి సిద్ధంగా ఉందా?' చాణక్యుడు అడిగాడు. జీవసిద్ధి తలూపాడు. 'మంచిది. నీ రహస్య సేవకులని చంద్రగుప్తుడు వచ్చేవరకూ పులిని అడవిలో బోనులోనే బంధించి ఉంచమను. చంద్రగుప్తుడు కనిపించగానే పులిని వదలాలి, అర్థమైందా?' అంటూ

సూచనలిచ్చి చిన్న సంచిని జీవసిద్ధికి ఇచ్చాడు చాణక్యుడు. 'ఆ జంతువు తాగే నీటిలో దీనిని కలపాలి తప్పనిసరిగా. అప్పుడే దానికి మత్తు, మదం కలుగుతాయి' అన్నాడు.

మగధ రాజులకు మాంసభక్షణ చేసే పిల్లి జాతి జంతువైన పులులను వేటాడడం ఇష్టమైన క్రీడా వినోదం. మామూలుగా గేదెలకు అడవిలో ఎరగా వేసి, వేటగాడు మంచెపైన ఉంటాడు. వాద్యాలు మోగిస్తూ పులిని ఆ చోటికి వచ్చేలా నిపుణంగా చేస్తారు వాద్య గాళ్ళు. చంద్రగుప్తుడు ఒక మంచెపైన ఉన్నాడు. నేలకి ఇరవై అడుగుల ఎత్తులో చెట్టుపైన మంచెను నిర్మిస్తారు. అతని ముఖానికి ఆడ పులి మూత్రాన్ని రాశారు. అది దుర్గంధం వస్తోంది. దానిని ముందు రోజు చంపిన ఆడపులి మూత్రకోశం నుంచి తీశారు. అతని సహాయకులు కూడా మంచెలపై ఉండి పులికోసం ఎదురు చూస్తున్నారు. అడవి అంతా నిశ్శబ్దంగా ఉంది. శ్వాస తీసుకుంటున్న శబ్దం తప్ప మరేదీ వినబడడం లేదు.

చంద్రగుప్తుడితో ఉన్న వందలాది మంది వాద్యగాళ్ళకు గాని, ఎరవేసిన వారికి గాని నేపథ్యంలో జీవసిద్ధి చేసిన పనులేవీ తెలియవు. జీవసిద్ధి తన సహాయకుణ్ణి చూసి తల ఊపాడు. అతను బోను తలుపు తెరిచాడు. నెమ్మదిగా జంతువుని లక్ష్యం వైపు వదిలాడు. మత్తుగా ఉన్న జంతువు బోనులోంచి బైటకి వచ్చి వాసన చూసింది. పులులు ఏ చిన్న అలికిడి అయినా వినగలవు, ఎంత దూరమైనా చూడగలవు కాని వాసనను అంతగా పసిగట్టలేవు. కాని ఈ వాసన భిన్నమైంది. ఏ మగపులి అయినా సరే దీనిని గుర్తించకుండా ఉండలేదు. దానిలో లైంగిక ప్రేరణ కలిగించే ఫెరోమోన్లుంటాయి.

పులి ఇరుకుగా ఉన్న చంద్రగుప్తుడి మంచె ఉన్న ప్రదేశానికి వచ్చింది. ఆ రాజు నేల మీదికి దూకాడు దానికి ఎదురుగా, పై నుంచి ఈటె విసరకుండా. మత్తులో ఉన్న జంతువు కళ్ళు తెరవలేకపోతుంది - దానికి కావలసిందల్లా - సుగంధం - ప్రేరణ కలిగించే ఫెరోమోనుల వచ్చేదెక్కడి నుంచో మాత్రమే.

తన ముందున్న వేటగాడి బుగ్గల నుంచి ఆ సుగంధం వస్తోందని ఆ జంతువు వెంటనే గ్రహించింది. చంద్రగుప్తుడు మోకాళ్ళమీద వంగాడు. దురదృష్టవశాత్తు లెక్క తప్పినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఈటెని సిద్ధంగా పట్టుకున్నాడు, అప్పుడే ఆ బృహజ్జంతువు నోరు తెరిచింది, నాలుక తెరిచింది. దుర్గంధం వచ్చే ఉమ్మిని చంద్రగుప్తుడి బుగ్గలకు రాసి పడిపోయింది.

'దైవిక సంకేతం!' వేటలో సహాయకుడిగా వచ్చిన వ్యక్తి అన్నాడు.

అద్భుతం! చంద్రగుప్తుడికి దైవసాయం ఉంది. ఇది మహిమ కాకపోతే మరేంటి?'

'నిజమే' అన్నాడు మరొకడు. ఇలా లక్షమందిలో ఒకళ్ళకి జరుగుతుంది. ఇది దేవుడి ఆశీస్సు. మగధ ప్రజలకు అసలైన రాజు వచ్చాడని, వాళ్ళ మధ్య ఉన్నాడని దేవుడిలా చెబుతున్నాడు. చంద్రగుప్తుడే ఆ గొప్పరాజు. మరెవరూ కాదు!'

పురుషోత్తముడు పాటలీపుత్రంలోని రాజుగారి విలాసమందిరంలో విశాఖ ఒడిలో చనిపోయి ఉన్నాడు పట్టు పరుపు మీద. రాజోద్యానంలో నెమళ్ళు నాట్యం చేస్తూనే ఉన్నాయి.

ధననందుడి నిర్జీవశరీరం అడవిలో పడి ఉంది. రక్తంతో తడిసిన భద్రశాలుడి కత్తి పక్కనే పడి ఉంది. నదీతీరంలోని కాళీఘాట్‌లో కాళీమాత కోసం బీభత్సకుడు ధననందుని రక్తం తీసికెళ్ళాడు.

అడవిలో నిద్రపోతున్న పులి తృప్తిగా గురకపెడుతోంది.

చాణక్యుడు, చంద్రగుప్తుడు, శారంగరావు, కాత్యాయనుడు రాజుగారి మంత్రిమండలి సమావేశమందిరంలో తరువాతేం చేయాలో చర్చించుకుంటున్నారు. మగధలోని ఒక న్యాయాధికారి వాళ్ళ ముందు నిలుచుని ఉన్నాడు ఆదేశాల కోసం ఎదురుచూస్తూ.

'భద్రశాలుడిని వెంటనే బంధించండి, తర్వాత ఉరితీయండి', చాణక్యుడు న్యాయాధికారికి చెప్పాడు అతను కొత్త యజమాని ఆదేశాలు సంతోషంగా శిరసా వహించాలని వెళ్ళాడు.

'మనకు భద్రశాలుడు సాయం చేశాడు ఆచార్యా, మనం అతడితో ఉదారంగా ఉండాలి. ధననందుడి హత్య వెనుక అతని ప్రమేయం లేదని మనకు తెలుసు కదా అన్నాడు శారంగరావు.

'అతను మనకేమీ సాయం చేయలేదు. తనకు తను సాయం చేసుకున్నాడు అంతే, శారంగరావ్' అన్నాడు కోపం వచ్చిన బ్రాహ్మణుడు కళ్ళు నిప్పులు చెరుగుతుండగా. 'అతను ఏ పాలకుడికైనా బరువే! ధననందుడైనా చంద్రగుప్తుడైనా! రాచరికం దయకు సంబంధించింది కాదు. అధికారానికి సంబంధించింది.

'రాక్షసుడు బాధపడతాడు. భద్రశాలుడు అతని స్నేహితుడు', అన్నాడు కాత్యాయనుడు.

'ఇప్పుడదంత పెద్ద విషయం కాదు, కాత్యాయనగారూ? ధననందుడు లేడని తెలిస్తే రాక్షసుడు పరిగెత్తుకుంటూ మగధకు వస్తాడు', అన్నాడు చాణక్యుడు.

'కాని రాక్షసుడు తక్షశిలలో సుఖంగా ఉందని, మగధకు తిరిగి రావాలని అనుకోవడం లేదని అంటున్నారు', శారంగరావు వాదించాడు.

'ఆ నీచుడు రాక్షసుడు ఇక్కడికి తిరిగి రావాలి. అతనిక్కడ ఉప ప్రధానిగా ఉంటే చంద్రగుప్తుడి పాలనకు చట్టసమ్మతి లభిస్తుంది', వివరించాడు చాణక్యుడు.

'ఉప ప్రధానా?' చంద్రగుప్తుడడిగాడు. 'ధననందుడి దగ్గర అతను ప్రధాని కాదా?'

'అవును. కానీ నీ కొత్త ప్రధాని కాత్యాయనగారు – అనుకొనేది భయపడకుండా రాజుకి చెప్పే మనిషి!'

వృద్ధుడైన కాత్యాయనుడు లేచి నిలబడి, చిరునవ్వుతో చంద్రగుప్తుడి ముందుకు వెళ్ళి యజమానికి వంగి నమస్కరించాడు. చాణక్యుడి వైపు తిరిగి 'కాని ఆచార్యా రాక్షసుడిని తిరిగి రమ్మని మీరు బలవంతపెట్టలేరు. తక్షశిలలో అతి విలాసంగా జీవిస్తున్నాడతను'.

'నేను మిహిర్‌ని నమ్ముతాను – తక్షశిలలో ఈ ఒక్కకారణంతోనే అతన్ని ఉంచి వచ్చాను – ఈ సమస్యను ఈపాటికి పరిష్కరించి ఉంటాడు' అన్నాడు చాణక్యుడు గూఢంగా.

'మిహిర్‌కి మీరిచ్చిన ఆదేశాలేమిటి?' అడిగాడు చంద్రగుప్తుడు.

'నేను సువాసినిని బందీగా ఉంచానని, అతను వచ్చేవరకు ఆమెని విడిచిపెట్టనని చెప్పమన్నాను రాక్షసుడికి! కొంచెం పంచదార పాకం నేల మీద వెయ్యి. చీమలు పరిగెత్తు కుంటూ వస్తాయి! సువాసిని నా పంచదార పాకం, రాక్షసుడు – నా చీమ!' పెద్దగా నవ్వాడు చాణక్యుడు.

'ఆచార్యా! ఇది చాలా కపటంగా ఉందని చెప్పాల్సి వస్తోంది', వ్యాఖ్యానించాడు చంద్రగుప్తుడు.

'నాయనా, ఎప్పుడూ పూర్తి నిజాయితీగా ఉండకూడదు. నువ్విప్పుడే వేట నుంచి వచ్చావు కదా. కాదా? నిటారుగా పెరిగిన చెట్లనే నరకడం చూడలేదా? వంపు తిరిగిన వాటిని వదిలేయడం గమనించలేదా?' అడిగాడు చాణక్యుడు.

'అయితే మోసంతో సంపాదించిన సింహాసనంపైన నేను కూర్చోవాలా?'

నువ్వు రాజువి. కాదా? శిఖరాగ్రాన్ని చేరావు. నీకు అధికారం, సంపద ఉంది – ఓ రాజా! రెంటినీ వివేకంతో ఉపయోగించు!' అన్నాడు చాణక్యుడు.

చంద్రగుప్తుడు ఇంకా ఇబ్బందిగా చూస్తున్నాడు.

చాణక్యుడు మళ్ళీ అన్నాడు. 'పండ్లు కాయని చెట్ల మీద పక్షులు గూళ్ళు కట్టవు, బీదవాళ్ళపై వేశ్యలకు ప్రేమ ఉండదు, అధికారం లేని రాజుకు ప్రజలు విధేయంగా ఉండరు రాజా!' అంటూ ధననందుడి ఆస్థానంలో విప్పిన శిఖను మొదటిసారిగా అన్నేళ్ళ తర్వాత ముడివేశాడు.

సువాసిని గదినంతా చూసింది. కిటికీలు లేవు. కాని సౌకర్యంగా ఉంది – శుభ్రంగా ఉంది – గాలి వస్తోంది. మంచి వస్తువులున్నాయి. తలుపు తెరవాలని ప్రయత్నించింది కాని అది బయట తాళం వేసి ఉంది. దబదబా తలుపు మీద కొట్టింది ఎవరైనా వింటారని. కాని లాభం లేకపోయింది. బయట ఎవరూ లేరు. బందీగా ఉన్నందుకు విచారించుతూ మంచం మీద కూర్చుని ఏడ్వసాగింది నిశ్శబ్దంగా. ఇదెలాంటి పాపిష్టి జీవితం? రాక్షసుడు ఉపయోగించుకున్నాడు, ధననందుడు దురుపయోగం చేశాడు, చాణక్యుడు కానిపనులకుపయోగించాడు?

ఆమె తన దయనీయ జీవితాన్ని గురించి ఆలోచించుకుంటూ ఉండగా, బయట అడుగుల చప్పుడు వినిపించింది. తర్వాత తలుపులు గడియ తీస్తున్న శబ్దం వినిపించింది. ఇద్దరు భటులు తలుపు తెరిచి ద్వారానికి ఇరుప్రక్కల నిలబడ్డారు. చేతులు వీపు వెనక్కి పెట్టుకుని చాణక్యుడు ఆలోచిస్తూ నడచివచ్చాడు.

సువాసిని మంచం మీద నుంచి లేచి అతని దగ్గరకు గబగబా వెళ్ళింది, చెంపలపై కన్నీళ్ళు కారుతున్నాయి. జుట్టు ముఖం మీదకు పడింది.

'విష్ణూ! నిన్ను చూస్తే హృదయం తేలికైంది. నన్ను విడిపించడానికి వచ్చావు కదా. కాదా? నాకెప్పుడో తెలుసు చివరికి నన్ను రక్షించేది నువ్వేనని!' అంటూ ఏడుస్తూ అతని ముందు మోకరిల్లింది.

'సువాసినీ లే', అన్నాడు చాణక్యుడు ఆమె భుజాలు పట్టుకొని లేవదీస్తూ. ఈ గదిలో నిన్ను బంధించినందుకు నన్ను క్షమించు, కాని నువ్వు కనిపిస్తే, ధననందుడితోపాటు

నువ్వు అజ్ఞాతానికి వెళ్ళాల్సి ఉంటుందని నాకు తెలుసు. అందుకే బంధించాను', అతను వివరించాడు.

'నాకు తెలుసు, విష్ణూ, అంది ఆమె మృదువుగా. తన తలని అతని ఛాతీకి ఆనించి అతన్ని కౌగలించుకుంది. ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది, కళ్ళెత్తి అతని కళ్ళలోకి చూస్తూ అతని ప్రేమను అర్థిస్తోంది, అతనికి ఇప్పటికే లభించిన విజయం కోసం మనసులో ప్రార్థిస్తూ. 'ఓం త్రయంబకం యజామహే, సుగన్ధింపుష్టివర్ధనమ్; ఉర్వారుకమివబన్ధనాన్మృత్యోర్ముక్షీయమామృతాత్.

'ఈ బందిఖానా నుంచి నేను వెళ్ళవచ్చా? నేను స్వేచ్ఛగా ఉండాలనుకుంటున్నాను', అతన్ని గట్టిగా పట్టుకొని ఆమె గొణిగింది.

'అయ్యో, సువాసినీ నేను నిన్ను ప్రేమిస్తున్నా గాని, నువ్వడిగిన పని చేయలేను. మగధ కోసం నిన్నిక్కడ ఉంచాను', తన గొంతులోని ఉద్వేగాన్ని అణచుకుంటూ వార్త అందించాడు.

'ఏమిటి ధననందుడు చనిపోయాడు అయినా నువ్వు నన్ను బంధించి ఉంచాలనుకుంటున్నావా? నా ప్రియమైన విష్ణూ నీకేమైంది? మామూలు మనిషి హృదయం నీలో లేదా? నువ్వు ప్రేమించిన ఒకే ఒక స్త్రీకి నువ్విలా ఎలా చేయగలవు?' ఆమె కోపంగా అడిగింది కౌగిలి నుంచి విడివడుతూ.

'నా ప్రియమైన సువాసినీ, నేను నిన్ను ప్రేమించి ఉండవచ్చు. కాని నేను భారతదేశాన్ని ఇంకా ఎక్కువ ప్రేమిస్తాను. దీనిని ఎలా వీలైతే అలా రక్షించాలనే దీక్షలో ఉన్నాను. ఇప్పుడు నాకు రాక్షసుడు అవసరం. రాక్షసుడికి నీకంటె ప్రియమైన వారు లేరు, సువాసినీ. నాకష్టం నీకు అర్థమైందా?' అడిగాడు చాణక్యుడు.

'నువ్వు ప్రేమించేస్త్రీని బందీగా చేస్తావా, ఆమె నీ చదరంగం బల్లలో పావు అయిందనా? ఆగ్రహదేవుడా, విలయకారకుడా! వెయ్యిజన్మల వరకూ నువ్వు నరకంలో మగ్గు – నువ్వు రాజకీయాల పేరుతో చేసిన హత్యలు, కుతంత్రాలకు అనుభవిస్తావు! నీకు నీ పేరును ముందుకు తీసుకెళ్ళే వారసత్వం ఉండదు. నీ జ్ఞానంపైన నీకెంత లాలసత్వం ఉందో అది ఎవరికీ ఉపయోగపడదు. నువ్వు, నీ శాపగ్రస్త వేదాంతం రెండూ మరుగున పడిపోతాయి!' అంటూ అతన్ని శపించి, మంచం మీద పడి ఏడిచింది.

'నీ శాపాన్ని నేను నమ్మను సువాసినీ. కొందరున్నారు నిజమే– మంత్రగాళ్ళు, వైద్యులు – ఇతరులను మంత్రాలతో చంపేవారు, కనిపించకుండా ఉండి లేదా తమను

తాము తోడేలుగా మార్చుకున్న వ్యక్తులు. అంధత్వాన్ని, అతి తిండిని, పిచ్చిని, చావుని తెచ్చే చేతబడులు వంటి మంత్రతంత్రాలున్నాయి. శాపం హృదయంలోంచి రావాలి, పైపై కోపంతో కాదు. నువ్వింకా నన్ను ప్రేమిస్తున్నావు. ఎన్నడూ నీ శాపం నిజం కావాలనుకోవడం లేదు', చాణక్యుడు విచారంగా అన్నాడు.

'నేను నిన్ను ప్రేమిస్తున్నాను విష్ణూ, కాని నీలో ఉన్న చాణక్యుణ్ణి ద్వేషిస్తున్నాను కూడా' ఏడుస్తూ అంది. 'మంత్రాలకి, శాపాలకి ఉన్న శక్తి గురించి వస్తే నేను శివుడిని రోజూ నీ విజయం కోసం ప్రార్థించకుండా ఉంటే, నువ్వు నీకుందని భావించే ఈ శక్తి అంతా నీకు వచ్చేదే కాదు!'

'నిన్ను బందీగా ఉంచడం తప్ప నాకు వేరే మార్గం లేదు సువాసినీ', చెప్పాడు చాణక్యుడు. 'దైవానికి తెలుసు, నీకంటె ఎక్కువగా నేనెవరినీ ప్రేమించలేదు!'

'నా నిర్బంధం కొనసాగితే, నా శాపం కూడా ఫలిస్తుంది. అయితే నేను నిన్ను ప్రేమిస్తున్నాను గనుక దీనిని తగ్గించుకునే మార్గం చెబుతాను. ఇప్పటి నుంచి కొన్ని వేల ఏళ్ళ తర్వాత, ఎవరైనా ఒక మంత్రాన్ని ధ్యానిస్తే, అతడు చాణక్యుని జ్ఞానాన్ని మళ్ళీ పొందగలుగుతాడు, కాని ఆ జ్ఞానాన్ని ఒక స్త్రీ పురోగతి కోసం అతను వాడితేనే సుమా!' తనని బంధించిన వ్యక్తికి తర్జని చూపుతూ అందామె.

'మంత్రమేమిటి?' అడిగాడు చాణక్యుడు.

***'ఆదిశక్తి నమోనమః, సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'*** చెప్పింది సువాసిని. 'ఈ మంత్రాన్ని రోజుకి నాలుగు వందలసార్లు, నాలుగువేల రోజులు చదివితే, చదివిన వ్యక్తికి చాణక్యుడి శక్తులు లభించి మరొక నేతని రూపొందించగలుగుతాడు – అయితే ఆ వ్యక్తి స్త్రీ అయి ఉండాలి. నూతన యుగంలో శివుడి కన్న శక్తి బలవంతురాలు అవుతుంది!'

చాణక్యుడు ఆమెనోసారి గంభీరంగా చూశాడు, 'నువ్వెలా అనుకుంటే అలాగే ప్రియతమా. ఇతరుల పట్ల నాకింకా పెద్ద బాధ్యత ఉంది, ఇతర యుగాల్లో కూడా. నేను చివరిసారిగా ఒకసారి నిన్ను వదిలివెళ్ళాలి. నా జ్ఞానము, వివేకము నా జీవితకాలంలో నశించకూడదు. రాబోయే రాజుల ప్రయోజనం కోసం, వారి రాజ్యాల్లో సంపద కోసం నా ఆలోచనలను రాసి ఉంచాలి, చంచలమైన చరిత్ర కళ నా ఆలోచనలను రాసి ఉంచకపోవచ్చు.'

అతను నిదానంగా వెనక్కి వెళుతూ ఆ గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు. 'అంతా నేను రాయాలి' వెళ్ళిపోతూ లోలోపలే అతనేమంటున్నాడో వినాలని ఆమె ప్రయత్నించింది.

'నా అర్థశాస్త్రం - నా సృష్టి - సంపదను సృష్టించే శాస్త్రం.

చాణక్యుడు నిరాడంబరంగా ఉన్న తన కుటీరంలో కూర్చుని మంత్రాన్ని లోలోన చదువుకున్నాడు. **ఆదిశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; సర్వవ్యాపిత శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; దైవసృష్టికి సాయపడే శక్తి నీకు నమస్కరిస్తున్నాను; కుండలినీ సృజనాత్మక శక్తీ, సర్వమాతా నీకు నమస్కరిస్తున్నాను.**

చాణక్యుడు చదువుతూనే ఉన్నాడు - అతని కళ్ళు ప్రార్థిస్తూ మూసుకున్నాయి - చంద్రగుప్తుడి నేతృత్వంలో భారతదేశం ఏకీకరింపబడిందని, తన లక్ష్యం నెరవేరిందని అతనికి తెలిసింది. దానిని సాధించడానికి అతడు ప్రేమించడానికి తనకున్న ఒకే ఒక అవకాశాన్ని తాగ్యం చేశాడు.

సువాసిని ముప్ఫయి ఎనిమిది ఏళ్ళు వచ్చేవరకూ లైంగిక వాంఛతో, ప్రేమ రాహిత్యంతో పోరాడుతూ జీవించి చనిపోయింది. చంద్రగుప్తుడి ఉప ప్రధాని - రాక్షసుడు - సిద్ధంగా, ఇష్టంగా ఉన్నా.

ఇరవయ్యో అధ్యాయం

# వర్తమానం

ఈ సమయంలో ఆలిండియా మెడికల్ సైన్సెస్ వరండాల్లో జనాలు లేరు. అర్ధరాత్రికి కొంచెం ముందుగా వస్తే పరీక్షలు చేస్తానని ఎవరికీ తెలియకుండా ఉంటుందని చెప్పాడు. వాళ్ళిప్పుడు అతని ఆఫీసులో కూర్చున్నారు - గంగాసాగర్, మీనన్ - న్యాయమూర్తి తీర్పు వినడానికి సిద్ధంగా ఉన్న నిందితుల్లా.

'మీకు ఊపిరితిత్తుల కేన్సర్ ఉంది, గంగాసాగర్‌గారూ', డాక్టరు చెప్పాడు సానుభూతిగా.

'నేనేం పొగతాగను కదా' ఫిర్యాదు చేశాడు గంగాసాగర్, తనకు మామూలుగా ఉన్న సర్దిచెప్పే శక్తితో ఈ భయంకరవ్యాధి మీకు లేదు అని డాక్టరుతో చెప్పించాలని అనుకున్నాడు.

'పొగతాగేవాళ్ళకే ఈ జబ్బురాదు. మీరు బాగా కాలుష్యమున్న వాతావరణంలో ఉంటారు. ఆటోరిక్షాలు వదిలే పొగకూడా ప్రమాదకరమైనదే. చాలా వాటి వల్ల ఇది రావచ్చు. పొగతాగడం, పొగ పీల్చడం, గాలి కాలుష్యం, ఆజ్‌బెస్టాస్–'

'ఇప్పటివరకూ నాకాలక్షణలేమీ కనిపించలేదు' చెప్పాడు గంగాసాగర్ ప్రాణాన్ని రక్షించుకొంటూ.

'ఇరవై అయిదు శాతం మంది రోగులకు బాగా ముదిరిపోయే వరకు ఏమీ కనిపించవు' డాక్టరు మృదువుగా చెప్పాడు.

'నేను బ్రతుకుతానా?' అడిగాడు గంగాసాగర్, హఠాత్తుగా చనిపోతాననే విషయం అర్థమై.

డాక్టరు నిదానంగా తలూపాడు. 'గంగాసాగర్ గారూ, మహిమలు జరుగుతాయి. దురదృష్టవశాత్తు కేన్సర్ బాగా ముదిరిపోయే వరకు మనకేమీ లక్షణాలు కనిపించలేదు. ఈ స్థితిలో శస్త్రచికిత్సగానీ కీమోథెరపీగాని అంతగా ఉపయోగపడవు'.

'ఇంకా నాకెంత సమయముంది?' ముసలి పండిట్ అడిగాడు.

డాక్టరు భుజాలెగరేశాడు. 'ఈ విషయాలు ఊహించడం కష్టం. బాగా అయితే ఒక నెల – అని నాకనిపిస్తోంది'.

'ఆమెని ప్రధానిని చేయడానికి ఆ సమయం చాలు', అన్నాడు గంగాసాగర్. డాక్టర్ని అయోమయంలో పడేసి, 'ఈ విషయమంతా పూర్తిగా రహస్యంగా ఉంచాలి డాక్టర్. నేనిప్పుడు వెళతాను. చాలా పని ఉంది'.

'కాని గంగాసాగర్గారూ, మేమిప్పుడు మిమ్మల్ని ఆసుపత్రిలో చేర్చుకోవాలి. మీ పరిస్థితి గమనిస్తూ'

'వినండి, డాక్టర్. చనిపోవడంలో గొప్పతనమేమీ లేదు – ఎవరైనా చనిపోతారు. నన్ను పుట్టించినవాడి దగ్గరకు వెళ్ళే పరిస్థితి రాగానే మీనన్ నన్ను తీసుకొస్తాడు!' అంటూ గబగబా నడుచుకుంటూ డాక్టరు ఆఫీసులోంచి బయటికొచ్చేశాడు.

మీనన్ గబగబా ఆయన్ని అనుసరించి బయటికి వస్తూ, తన యజమాని లోలోపల మృదువుగా జపించుకోవడం విన్నాడు. ***'ఆదిశక్తి, నమోనమః; సర్వశక్తి నమోనమః ప్రథమ భగవతి, నమోనమః; కుండలినీ మాతాశక్తి; మాతాశక్తి నమోనమః'***

'ఆమె ప్రధాని కాబోతోంది. మేం ఆమె ప్రేమ వ్యవహారంలో పుట్టిన బిడ్డ గురించి బయటపెట్టబోతున్నాం' అన్నాడు సోమాని గంగాసాగర్తో. 'పత్రికలవాళ్ళకి పండుగే'.

'అటువంటిదేదైనా చేసేముందు నేను జాగ్రత్తగా ఆలోచిస్తాను' గంగాసాగర్ మృదువుగా అన్నాడు, దగ్గు తెర రానివ్వకుండా ప్రయత్నిస్తూ.

'గంగాసాగర్, మీరు మమ్మల్ని ఆపలేరు. అయినా మీకెందుకు బాధ? ఆమె మిమ్మల్ని వదిలేసిందిగా', అన్నాడు రంగ్తా.

'రాతిబొమ్మని వేలాదిమంది ప్రార్థిస్తే, దానిలో తమ శక్తిని నిక్షిప్తం చేస్తారు. బొమ్మ ఏమనుకుంటుందో అనవసరం. చాందిని అలాంటి బొమ్మ. ఆమేమనుకుంటుందో నాకనవసరం. నా ఏకైక లక్ష్యం ఆమెని ప్రధానిని చేయడం'.

'మీ లక్ష్యం నెరవేరదు! భారతదేశం లాంటి సంప్రదాయదేశం నైతికశీలం లేని స్త్రీని ప్రధాని కానివ్వదు గంగాసాగర్', అన్నాడు సోమాని.

'నైతిక శీలం లేని స్త్రీల గురించి మాట్లాడాలంటే', చెప్పాడు గంగాసాగర్. చాలా ప్రియమైన స్నేహితురాలిని మీ ఇద్దరికీ పరిచయం చేయాలనుకుంటున్నాను. ఆమె **అభానస**కు బాగా చేయూతనిచ్చింది'.

'ఎవరు?' అడిగాడు సోమాని కుతూహలంగా.

అంజలి, బాలీవుడ్ సైరెన్, నల్లటి చీరలో అందంగా కనిపిస్తూ వచ్చింది. ఆమె గదిలో ఉన్నవాళ్ళని గమనించినట్లుగా సోఫాలో కూర్చుని వెర్రెక్కించేలా సిగరెట్ ముట్టించింది.

'ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చాందినికి తోడుగా అంజలిని సమావేశానికి రమ్మని మీరడిగినపుడు మేము చాలా కృతజ్ఞులుగా ఉన్నాం. మా కృతజ్ఞత చూపించడానికి మన రాష్ట్రం నుంచి ఆమెని రాజ్యసభకు నామినేట్ చేశాం. అంజలి నాకు సముద్రం ఒడ్డున వైభవమైన తన ముంబయి భవనానికి రోజూ రాత్రి పూట వచ్చే స్నేహితుడి గురించి ఎప్పటికప్పుడు చెబుతూ ఉంది', అన్నాడు గంగాసాగర్.

సోమాని ముఖం ఎర్రబడింది. గంగాసాగర్ కొనసాగించాడు.

'ఈ ప్రత్యేక స్నేహితుడు బాగా ధనవంతుడు. కాని ఆయన భార్య ఆయన అవసరాలు తీర్చలేదు. నా మనసులో మెదిలే ప్రశ్న ఇది. భారతదేశంలాంటి సంప్రదాయ దేశం - ముఖ్యంగా సోమాని గారి అందమైన భార్య- ఈ దిగ్గజం పడక విషయాలు వినడానికి సిద్ధంగా ఉన్నారా?'

నల్లబడ్డ ముఖంతో సోమానీని చూశాడు రంగ్తా. 'నీ పాంటు జిప్ సరిగ్గా పెట్టుకో- జాగ్రత్తగా ఉండు అని చెప్పాను, వినలేదు' అని అరిచాడు.

'నేనొప్పుకుంటాను. మనిషి ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి', తలూపుతూ అన్నాడు గంగాసాగర్. 'ప్రపంచంలో ఎనభై శాతం మంది ప్రజలు ప్రమాదాల ఫలితంగానే పుట్టారనిపిస్తోంది'.

'అగర్వాల్ గారికి పదిశాతం ఆదాయం ఇస్తామన్న ఒప్పందం రద్దు చెయ్యాలి' తన చేతి నుంచి చుక్కాని జారిందని తెలిసీ అన్నాడు రంగ్తా.

'నేనొప్పుకుంటాను', గంగాసాగర్ అన్నాడు. మనం పదిశాతం చెల్లింపును ఆపేద్దాం.

అబ్బ- ఎంత సహేతుకంగా ఆలోచించారు. గంగాసాగర్‌గారూ, అన్నాడు సోమాని.

'నేను మీకు మిగిల్చిన పదిశాతాన్ని కార్మికులకు ఇవ్వండి. ఇలా ఇవ్వడానికి కారణం **ఎబిఎన్‌కెయు** అని చెప్పండి. ఆ యూనియన్‌లో మీ కార్మికులు డెబ్భయిశాతానికి పైగా ఉన్నారు' అన్నాడు గంగాసాగర్.

'కాని అది అర్థం లేనిది! ఎవరూ రెవెన్యూలో పదిశాతం కార్మికులకి ఇవ్వరు! ఆశ్చర్యపోయాడు రంగ్తా, శరీరంలోంచి వేడి బైటికి వెళ్ళేలా కాలర్ వదులు చేసుకుంటూ.

'అయితే అంజలి కార్మికులని కలవడం మీకిష్టమనుకుంటాను. వచ్చేవారం **ఎబిఎన్‌కెయు** వారపు సమావేశానికి ఆమెని నేను పిలుస్తాను'.

మాజీ ఆర్థికమంత్రికి ఆలస్యమైంది. ప్రసంగం సమయం అయిపోతోంది. ఆయన సెక్రటరీ ఆయన పది నిముషాల్లో వస్తాడని గంగాసాగర్‌కు చెప్పాడు', 'నేను నిరీక్షిస్తాను' అని గంగాసాగర్ స్టడీలో ఉన్న పడక్కుర్చీలో సౌకర్యంగా కూర్చున్నాడు.

కొన్ని నిముషాల తర్వాత మాజీ మంత్రి లోపలికి వచ్చాడు. ఆయన జాగ్రత్తగా పలకరించాడు గంగాసాగర్ని. 'ఇలా నన్ను కలుసుకుని సంతోషపెట్టడానికి కారణమేమిటి గంగాసాగర్‌గారూ?' అనడిగాడు వ్యంగ్యంగా.

'మీ స్నేహితులు ఇప్పుడు నాక్కూడా స్నేహితులే అని చెప్పడానికి వచ్చాను, రంగ్తా అండ్ సోమానితో నాకిప్పుడు అభిప్రాయభేదాలు లేవు, చెప్పాడు గంగాసాగర్.

'వాళ్ళు మీకు స్నేహితులైనంత మాత్రాన మీరు నాకు స్నేహితులవరు' మాజీమంత్రి కోపంగా చెప్పాడు. 'మీరు నా ప్రతిష్టని, నా వృత్తిని నాశనం చేశారు. ఇప్పుడు మీ ప్రియ విద్యార్థిని – చాందినిగుప్త – ఒక్కరోజు కూడా ప్రధానిగా ఉండలేకుండా చేస్తాను – ఆమె అంతవరకూ వెళితే', చెప్పాడు మాజీ కేబినెట్‌మంత్రి.

'నాకు పూర్తిగా అర్థమైంది' అన్నాడు గంగాసాగర్. 'పత్రికా సమావేశాన్ని నేను పిలవనా? మీరు పిలుస్తారా?' అని అడుగుతూ **సిబిడిటి** ఛైర్మన్ బీమా పాలసీలా ఇచ్చిన మెమో కాపీని బయటికి తీశాడు.

*గౌరవనీయులైన ఆర్థికమంత్రి. ఆర్ అండ్ ఎస్ కార్యకలాపాలను పరిశోధించిన మీదట చాలా సందర్భాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు రుజువైంది. తాము కొన్న చాలా వస్తువుల ధరలను బాగా పెంచినట్లు, ఆదాయంపై పన్ను తగ్గించుకునే ఉద్దేశ్యంతో ఈ విధంగా చేసినట్లు స్పష్టమైంది. అంతేకాక లాభాలు పంచుకునే ఉద్దేశ్యంతో ప్రయివేటు భాగస్వామ్యాలను సృష్టించి, ఆదాయం వచ్చే చాలా అంశాలను డిఫర్ చేశారు, పన్ను సేకరణ అధికారులకు రెవెన్యూ చెల్లించనవసరం లేకుండా కొన్ని లావాదేవీలు - ముఖ్యంగా ఆస్తుల కొనుగోలు అమ్మకం - మూల్యాంకనం ప్రశ్నించదగిన విధంగా ఉంది. పన్ను భారాన్ని మరింత తగ్గించే విధంగా ఉంది, కనీసం పేపరు మీద. పై పరిస్థితుల దృష్ట్యా, ఈ విషయంలో తీసుకోవలసిన చర్య గురించి మీ సలహా కోరుతున్నాను. కృతజ్ఞతలతో. ఛైర్మన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్.*

మెమో తర్వాత ఆర్థికమంత్రి చేతి రాతతో రిమార్కు ఉంది.

*వారితో మనం దయగా, మృదువుగా ప్రవర్తించాలి. వారి మద్దతు లేకుండా ఏ ప్రభుత్వమూ అధికారంలో ఉండలేదు. తగినంత సరళంగా వ్యవహరించాలని సూచిస్తున్నాను. శుభాకాంక్షలు, ఆర్థికమంత్రి.*

హిందూ ఆశ్రమం పురోహితుడు గౌరవనీయమైన అతిథిని చూసి చాలా సంతోషించాడు. తనకోసం వేసిన పరుపు మీద కూర్చుని గంగాసాగర్ అడిగాడు, 'మీ అబ్బాయి బాగా చదువుకుంటున్నాడా? మెడికల్ కాలేజీలో ప్రవేశం దొరకడం ఉపయోగపడిందా?'

పురోహితుడు చిరునవ్వు నవ్వాడు. అతనికి పూర్తిగా బట్టతల. ముఖం బాగా ముడతలు పడింది. బోసినోరు. పళ్ళు కనిపించని నవ్వు అంతా చెప్పింది. 'బాగానే ఉంది, గంగాసాగర్ గారూ, చదువు తొందరలోనే పూర్తయిపోతుంది. మీ ఉదారతకు ధన్యవాదాలు'.

కాగితాలున్నాయా? ఆ వార్తను రాసిన నీచుడైన రిపోర్టర్‌కు ఇవ్వకుండా దాచినవి? గంగాసాగర్ అడిగాడు.

ఆ వృద్ధుడు బాగా పసుపురంగు తిరిగిన పాత పోస్టుకార్డులు, ఉత్తరాల కట్ట ఇచ్చాడు. అవన్నీ గర్భవతియైన తల్లి, అక్కడలేని తండ్రి మధ్య జరిగిన ప్రేమ పూర్వక ఉత్తర ప్రత్యుత్తరాలు. సాక్ష్యం తిరుగులేకుండా ఉంది.

'కృతజ్ఞతలు' అన్నాడు గంగాసాగర్.

పురోహితుడు బోసినవ్వు నవ్వాడు.

---

మాజీ ప్రధాని, ఆయన అక్రమ సంతానమైన కూతురు సిమ్లాలో ఉన్నారు. వాతావరణం చల్లగా ఉంది. దేవదారు సువాసన గాలిలో వ్యాపించి ఉంది. గంగాసాగర్ కొంచెం కష్టపడి ప్రయాణం చేశాడు, కాని చల్లని పర్వత గాలి కొంచెం బాగానే ఉందని పించింది ఆయనకి.

ఆ ఇంటివాళ్ళు అతిథిని చూసి ఆశ్చర్యపోయారు కాని మర్యాదగానే ఆహ్వానించారు. పనివాడు యాపిల్ రసం, పన్నీరు పకోడీలు తెచ్చాడు, 'గంగాసాగర్ పేపర్ల కట్టని ఇచ్చాడు వాళ్ళకి. 'ఇవి మీ ఇద్దరికీ చెందుతాయి. ఒక కుటుంబం వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూసే అధికారం ఎవరికీ లేదు'. ఆయన అన్నాడు.

మాజీ రాజనీతిజ్ఞుడు ఆ కాగితాలను చూశాడు, పెదాలపై చిరునవ్వు కనిపించింది. సాధ్వి తల్లిని తనెంతగా ప్రేమించాడో ఆయనకి గుర్తువచ్చింది. ఆమె అద్భుతమైన స్త్రీ – తెలివైనవి – అందమైనది – కూతురిలానే.

'థాంక్యూ గంగాసాగర్ గారూ, ఇవెందుకిస్తున్నారు? ఇప్పుడు మీకు నా మీద ఏమీ ఉండదు మీదగ్గర' అన్నాడు మాజీ ప్రధాని. సాధ్వి మౌనంగా ధ్యానం చేసుకుంటున్నట్టు కనిపించింది.

'నాకు అవన్నీ అవసరం లేదు. నేను కొన్ని ఉంచుకున్నాను. వాటిని సేఫ్ డిపాజిట్ వాల్ట్‌లో ఉంచాను. నా వీలునామాలో ఆ తాళం మీకు ఇవ్వమని రాశాను. నా వీలునామా అమలయ్యేటప్పుడు ఆ తాళం మీకు లభిస్తుంది', చెప్పాడు గంగాసాగర్.

'కాని ఎందుకు?' అడిగింది సాధ్వికళ్ళు తెరిచి.

'వీలునామా అమలు చేయడానికి భారతదేశంలో కొన్నేళ్ళు పడుతుంది. ఒకవేళ నేను రేపే చనిపోయినా, ప్రధానిగా నిలదొక్కుకునే సమయం చాందినికి లభిస్తుంది'.

---

ఆపద్ధర్మ ప్రధాని ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల్లో ఓడిపోయినా, ఆయన పార్టీ చాందినీతో కూటమి కలిసింది. వాళ్ళ ఎంపీలు చాందినికి ప్రధాని కావడానికి మద్దతిస్తారు. బదులుగా కొన్ని కేబినెట్ బెర్తులు వాళ్ళకివ్వాలి. గంగాసాగర్ నిస్పృహగా

కనిపించాడు. కాని ఆపద్ధర్మ ప్రధాని దీనిని నమ్మలేదు. నిస్పృహ కేవలం శక్తి లేని ఆగ్రహమని అతనికి తెలుసు.

'చాందినితో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని నాకు తెలుసు' చెప్పాడు గంగాసాగర్, 'ఆమె ప్రభుత్వాన్ని పురిటిలోనే దించరని ఆశిస్తాను'.

'దాని గురించి మీకెందుకంత బాధ? అడిగాడు ఆపద్ధర్మ ప్రధాని. మీరు, మీ శిష్యురాలు మాట్లాడుకోవడం లేదని విన్నాను'.

'అహ, అవును. మేము అప్పుడప్పుడు పోట్లాడుకుంటాం. కాని కేవలం ఇతరుల్ని తప్పు దారి పట్టించడానికి' అన్నాడు గంగాసాగర్.

'అది పనిచేసింది కూడా. మేం పోట్లాడుకోకపోతే మీరెన్నటికీ ఆమెకి మద్దతిచ్చేవారు కాదు' గంగాసాగర్ ఆపద్ధర్మ ప్రధాని ముఖం ఆగ్రహంతో ఎర్రబడడం చూస్తూ చెప్పాడు.

'ఇప్పుడు మీకు, మీ తోలుబొమ్మకి నేనేం చేస్తానో చూపిస్తాను' గర్జించాడు ఆపద్ధర్మ ప్రధాని. 'ఇప్పుడు నా దగ్గర మిమ్మల్ని, మీ శిష్యురాలిని ఆకాశంలోకి పేల్చేయ్యగలిగినంత పేలుడు సామగ్రి ఉంది నా దగ్గర. ఛానెల్ దీవుల్లో ఒక ట్రస్టు ఫండ్ ఉంది ఆమె అక్రమంగా కన్న కొడుకు చదువుకి, పోషణకి. దాన్ని రుజువు చెయ్యడానికి కావలసిన కాగితాలున్నాయి నా దగ్గర. ఆమె ప్రధాని కాగానే మద్దతు ఉపసంహరించుకోవడానికి దానినుపయోగిస్తాను. అతి కొద్దిసేపు ప్రధానిగా ఉన్న వ్యక్తిగా ఆమె చరిత్రలోకెళ్ళిపోతుంది!'

'మీరిలా ప్రవర్తించాలనుకోవడం దురదృష్టకరం' చెప్పాడు గంగాసాగర్. దాదాపు ఒక తల్లి బిడ్డను మందలిస్తున్నట్లుగా. ఆమె తప్పుకోవాలి. ప్రమాణస్వీకారం చేయకూడదు. దేశానికి ఒక కులట పరిపాలన అవసరం లేదు!' అరిచాడు ప్రధాని.

'మీ పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించుకోమని సూచిస్తున్నాను ప్రధానిగారూ' అన్నాడు గంగాసాగర్ మృదువుగా.

'నేనెందుకు చూసుకోవాలి?' అరిచాడు ప్రధానమంత్రి.

'ఎందుకంటే, లిచెన్‌స్టీన్‌లో ఖాతా కాగితాలు నా దగ్గరున్నాయి ఇప్పుడు. దానికి నార్త్ కొరియా నుంచి లిబియా నుంచి చెల్లింపులు జరిగాయి – సున్నితమైన అణు సాంకేతికత – గ్యాస్ సెంట్రిఫ్యూజ్‌లకి సంబంధించి – అని నాకు తెలిసింది. విచిత్ర

మేమిటంటే ఆ ఖాతా మీది. అందుకని ఈ కొత్త పాలక పక్షానికి పూర్తికాలం మద్దతు ఉపసంహరించుకొనడానికి నేనైతే జాగ్రత్తగా ఉంటాను'.

అంబులెన్స్ రొద చేసుకుంటూ కాన్పూర్ రోడ్ల మీద పరుగుతీసింది. వెనుక గంగాసాగర్ ముఖానికి ఆక్సిజన్ మాస్క్‌పెట్టి, సోడియం క్లోరైడ్ ఐవి పెట్టాడు డాక్టరు. ఉదయం పూట ప్రార్థన పూర్తికాగానే వృద్ధ పండితుడు పడిపోయాడు. మీనన్ కంగారుగా అంబులెన్స్‌కి ఫోన్ చేశాడు. ఆలిండియా మెడికల్ సైన్సెస్ డాక్టరు ఢిల్లీకి తీసుకురమ్మన్నాడు కాని గంగాసాగర్ వప్పుకోలేదు. ఆయన కాన్పూర్లో ఇంట్లోనే ఉన్నాడు.

పండిట్ పక్కనే మీనన్ కూర్చుని, సున్నితంగా ఆయన చేయి పట్టుకున్నాడు. మాస్క్‌లోంచి గాలి పీల్చుకోడానికి ఆయన కష్టపడుతున్నాడు. మీనన్ ప్రపంచమంతా గంగాసాగరే. తన విషమ పరిస్థితిలో కూడా మీనన్ దుఃఖాన్ని పండిట్ గమనించి ఏదో చెప్పబోయాడు. 'ఆదిశక్తి--' అంటూ మొదలుపెట్టాడు. కాని శ్వాస తీసుకోవడమనే చిన్న ప్రయత్నం కూడా కష్టమై ఆయన ఇంక మాట్లాడలేకపోయాడు.

కొన్ని గంటల తరువాత, ఆసుపత్రిలో గదిలో కొంచెం తేరుకున్నాడు వృద్ధుడు. మీనన్, అగర్వాల్‌గారు పక్కనే ఉన్నారు. గంగాసాగర్ తన ప్రార్థన చేసుకుంటూనే ఉన్నాడు. ***'ఆదిశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; సర్వవ్యాపిత శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; దైవసృష్టికి సాయపడే శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; కుండలినీ సృజనాత్మకశక్తీ; సర్వమాతా నీకు నమస్కరిస్తున్నాను.***

మర్నాటి ఉదయం పడక మీద పడుకుని ఉన్నాడు.

'ఆమెకి చెప్పలేదుగా?' అడిగాడు మీనన్‌ని.

'చెప్పలేదు' అబద్ధమాడాడు మీనన్. ఆసుపత్రికి రాగానే చాందినికి ఫోన్ చేశాడు.

'ఇంటలిజెన్స్ బ్యూరో ఫ్రెండ్‌ని కలవాల్సిన పని ఉంది'.

మీనన్‌తో గుసగుసగా బొంగురుగా చెప్పాడు. డాక్టర్లు సందర్శకుల నెవ్వరినీ గంగాసాగర్ని చూడడానికి అనుమతించడం లేదని అతనికి తెలుసు – ఏ కొంచెం శ్రమ కలిగినా ఈ పరిస్థితిలో తట్టుకొనడం కష్టం. డాక్టరు ఆదేశాలు వినిపించారు అగర్వాల్‌గారు.

'నా అనారోగ్యాన్ని మాత్రలతో చంపలేదు. బదులుగా బిల్లులతో నన్ను చంపాలనుకుంటున్నాడు. ఐబి డైరెక్టర్ని పిలవండి'.

మురిగ్గా ఉన్న గదిలోకి వచ్చి ఆ మనిషి బల్లముందు కూర్చోమనకుండానే కూర్చుంది హమీదా. గది గోడలు ఇటుకలు, కాంక్రీటుతో కట్టినవి. బల్ల మీద ఒంటరిగా బల్బు ఉంది. ఆ మనిషి చుట్ట పొగవాసన గదంతా పట్టేసింది. ఆమె వైపోసారి అసహ్యంగా చూసి ముఖం తిప్పుకున్నాడు.

'ఇక్కడికెందుకొచ్చావు ఛక్కా?' అనడిగాడు కొజ్జాలను నిందాత్మకంగా పిలిచే పదం వాడుతూ.

'నీతో పడుకోడానికి కాదు, స్వీటీ' అంది హమీదా, మామూలుగా కొజ్జాలు తిడుతూ మాట్లాడే పద్ధతిలో సునాయాసంగా.

'నేను అడుక్కోడానికి రాలేదు. కొనడానికి వచ్చాను'.

'ఏం కొనాలనుకుంటున్నావు ఛక్కా?' అతనడిగాడు.

'తుపాకి' చెప్పింది హమీదా.

'సారీ, మగతనం లేని వాళ్ళకి నేను తుపాకులమ్మను. తుపాకి మగాళ్లది. నీకు తెలుసా. ఆడాళ్ళయిన మగాళ్ళకి కాదు'.

'ఎలక మొహమా విను. నేను స్టింగర్ .22 మాగ్నమ్ పెన్‌గన్‌కి ఎన్ని డబ్బులయితే అంతా ఇస్తాను. నాకు నువ్వు దాన్ని అమ్మలేదనుకో, నేను సచ్లాదేవిని తీసుకొచ్చి రోజూ నీ ముందు ఆమె అంగాన్ని ఆడించేలా చేస్తాను. బహుశా అది నీకు బాగుంటుందేమో!'

ఆ మనిషి గొణుక్కున్నాడు. ప్రపంచంలో ఉన్న చెత్తముఖాలందరూ తన కస్టమర్లవు తారెందుకు? వృత్తి మార్చుకోవాలి అనుకుంటూ కొజ్జా అడిగిన గన్ కోసం పెట్టెల్లో వెతుకుతున్నాడు.

బయట నిలబడి ఇదంతా గమనిస్తున్న ఇంటలిజెన్స్ బ్యూరో ఏజెంటు చూసినదంతా డైరెక్టర్‌కి చెప్పాడు.

హమీదా వెళ్ళిన మరోచోట కొంచెం బాగానే ఉంది. అది దొంగచాటుగా వస్తువులమ్మే దుకాణం. హమీదా రాగానే యజమాని నిట్టూర్చాడు. 'డబ్బు కావాలా, తీసుకో' అంటూ యాభై రూపాయల నోటు ఇచ్చి, 'తొందరగా వెళ్ళిపో. నా కస్టమర్లు వెళ్ళిపోతారు'.

'ఇది నీకు అదృష్టం కలిసొచ్చిన రోజు' అంది హమీదా. 'నేను నీకు చెల్లించేందుకు వచ్చాను. నాకు వాడిన అసాహి పెంటాక్స్ 35 ఎంఎంఎస్ఎల్ఆర్ కావాలి. ఎంతయితే అంత ఇచ్చేస్తాను.'

'నా దగ్గరకెందుకొచ్చావు ఫిఫ్టీఫిఫ్టీ?' అనడిగాడు వీధియాసలో కొజ్జాలని పిలుస్తున్నట్లుగా మాట్లాడుతూ. 'ఇంకా ఇలాంటివి చాలామంది డీలర్లు అమ్ముతారు'.

'కాని ఎవరూ నీలా తియ్యగా మాట్లాడరు బాయ్యా? అంది హమీదా వ్యంగ్యంగా.

యజమాని నిట్టూర్చాడు మళ్ళీ. మనుషుల్లో ఉన్న క్షుద్రులతో ఎందుకు పనిచెయ్యాల్సి వస్తోంది? కార్టూన్లు వెతుకుతూ ఫిఫ్టీఫిఫ్టీ అడిగిన కెమేరా కోసం చూస్తూ గుక్క కోక్ తాగితే ఎంత బాగుంటుందో అనుకున్నాడు.

బయట నిలబడి ఇదంతా చూస్తున్న ఇంటలిజెన్స్ బ్యూరో ఏజెంటు చూసిందంతా డైరెక్టరుకి చెప్పాడు.

హమీదా తన గదిలో ఉన్న చిన్న చెక్క టేబులు మీద వంగి ఉంది. ఆమె ముందు పెంటాక్స్ పాత కెమేరా విడదీసి ఉంది. పక్కనే స్టింగర్ .22 మాగ్నం పెన్ గన్ ఉంది. నిదానంగా దాన్ని కెమేరా లోపల పెట్టింది. కెమేరా ఫిల్ము కదిల్చే లీవర్ దగ్గర సరిగ్గా పెట్టానా లేదా అని చూసుకోవాలి. షట్టర్‌ని రిలీజ్ చేసే బటన్ నొక్కగానే గ్లాస్ లెన్స్ పగలకొడుతూ షూట్ చెయ్యాలది.

టేబుల్ మీద ఒక పక్కన ప్రధాని ప్రయివేటు సెక్రటరీ దగ్గర కొట్టేసిన పాస్ ఉంది. బార్‌కోడ్ ఇంకా పనిచెయ్యాలని, రాష్ట్రపతి భవన్‌లోకి ప్రవేశం దొరకాలని ఆమె కోరుకుంది. సందర్శకుల పాస్‌లే నార్త్‌బ్లాక్, సౌత్‌బ్లాక్, రాష్ట్రపతి భవన్‌లోకి వెళ్ళడానికి పనికొస్తే, సీనియర్ అధికారుల పాస్‌లు ఎందుకు పనికిరావు అనుకుంది.

ఒక గోడకి ఉన్నమేకుకి హాంగర్ ఉంది. ప్రయివేటు సెక్రటరీ ఇచ్చిన సూటు, షర్ట్, టై ఇస్త్రీ చేసి దానికి తగిలించి ఉన్నాయి. 'నువ్వు చచ్చిపోతే నాకేం ఉపయోగం గంగాసాగర్?, అనుకుంది హమీదా. 'ప్రతీకారం తీర్చుకొనే అవకాశం పోయింది. అయ్యో, ఇప్పుడు నీ ప్రియమైన చాందిని బలవ్వాలి'.

'రాష్ట్రపతి భవన్‌లోని అశోకాహాలు పెద్ద ఆభరణాల పెట్టెలా కనిపిస్తుంది. కాని నిజానికి ముప్ఫయి రెండు మీటర్ల పొడవు, ఇరవై మీటర్ల వెడల్పు ఉంటే దీర్ఘచతురస్రం అది. హాలులో కొట్టొచ్చినట్టు కనిపించే లక్షణం సీలింగుకి పెయింటు వేసి ఉంటుంది.

మధ్య ఉన్న పెయింటింగు – పర్షియను శైలిలో రాజుల వేట చిత్రం ఉంది. అశోకాహాలుని ముందు బ్రిటిష్ వైస్రాయ్‌కి స్టేట్ బాల్‌రూంగా కట్టారు. దానిలో చెక్కతో చేసిన డాన్స్‌ఫ్లోర్ కూడా ఉంది. ప్రధానులు, ఇతర మంత్రులు ప్రమాణస్వీకారాన్ని ఈ ప్రత్యేక హాలులోనే చేయడం విశేషం. నిజానికి ప్రధానమంత్రులకి లోలోపల చంపాలనే ప్రవృత్తి లేకపోతే ఆ హొదాకు రాలేరేమో. తరువాత వారి పదవీకాలమంతా భారత ప్రజాస్వామ్యం చేసే గొప్పనృత్యంతో – పార్టీ ఫిరాయింపులు, తిరుగుబాట్లు, సాధారణ సంక్షోభాలతో చిత్ర విచిత్రంగా ఉంటుంది.

ప్రభుత్వానికి ఎన్నికైన సభ్యులందరూ వేచి చూస్తున్నారు హాలు నిండిపోయింది. ప్రతిపక్ష సభ్యులు కూడా ఒక పౌర ప్రభుత్వం నుంచి మరో పౌర ప్రభుత్వానికి ప్రశాంతంగా జరుగుతున్న అధికార బదలాయింపును చూడడానికి హాజరయ్యారు. చాందిని లోపలికి వచ్చింది, మామూలుగా ఆమె కట్టుకొనే కోరా చీర, దానికి బంగారు రంగు అంచు, చెవులకి ఒంటిరాయి వజ్రాల దిద్దులు ధరించింది. ఇంకే ఆభరణాలు లేవు. అక్కడున్న జనమంతా ఆమె రాగానే నిలబడి హర్షధ్వానాలు చేశారు. యుద్ధం తరువాత జయించిన సంపదని పొందడానికి వస్తున్న విజేత ఆమె. చాందిని కృతజ్ఞతతో అభినందనలు తెలిపిన వారందరికీ నమస్కరించి బీహారు ముఖ్యమంత్రితో కలిసి, మొదటి వరుసలో కూర్చుంది. వాళ్ళిద్దరి కలయిక ఎదురులేనిదిగా నిలిచింది. ఇద్దరూ కలిసి భారతదేశంలో రెండు పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్ లోక్‌సభ సీట్లని గెలిచారు. వర్కింగ్ మెజారిటీకి కావలసిన మిగిలిన సభ్యుల మద్దతును, అపద్ధర్మ ప్రధాని ఏర్పాటు చేశాడు – గంగాసాగర్, ఆమె విడిపోయారనుకుని.

ఈలలు మోగాయి, రాష్ట్రపతి అంగరక్షకుడు రాష్ట్రపతిని వెంటబెట్టుకుని హాలులోకి వచ్చాడు. బ్యాండువాళ్ళు జాతీయ గీతాన్ని వాయించారు. భారత రాజకీయ నేతలందరూ గౌరవంగా లేచినిలబడ్డారు, కెమేరాలలో ముఖాలు బాగా వచ్చేలా హుందాతనాన్ని కనబరిచారు. హాలులో మూడోవంతు ప్రెస్‌కి సరిపోయింది. వాళ్ళలో ఒక యువకుడి దగ్గర ఫ్లాష్ వెలగని పెంటాక్స్ కెమేరా ఉంది.

రాష్ట్రపతి భవన్లో దృశ్యాన్ని గంగాసాగర్ చూస్తున్నాడు. రాష్ట్రపతి చాందిని చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్నాడు. ఆమె ముందు ప్రమాణం చేసే పాఠం ఉంది కాగితంలో. కాని ఆమెకి దానితో అవసరం లేనట్లుగా ఉంది. ఈ సందర్భం కోసమే ఆమె జీవితమంతా తయారైనట్లుగా ఉంది. తన ఆక్స్‌ఫర్డ్ యాసలో ఆంగ్లంలో ఆమె ప్రమాణస్వీకారం చేస్తోంది.

'చాందిని గుప్త అనే నేను దైవసాక్షిగా ప్రమాణం చేసి - భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసాన్ని, విధేయతను కలిగిఉంటానని, చట్టప్రకారం భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమైక్యతను కాపాడతానని, విశ్వాసంతో, చిత్తశుద్ధితో ప్రధానమంత్రిగా నా విధులు నిర్వహిస్తానని ప్రజలందరికీ భయంగాని, పక్షపాతంగాని, అభిమానంగాని, దుశ్చింతగాని లేకుండా రాజ్యాంగం ప్రకారం, చట్టప్రకారం న్యాయం చేస్తానని చెబుతున్నాను.

ధర్మపిత చిరునవ్వు నవ్వాడు. భయం, అభిమానం, పక్షపాతం, దుశ్చింత లేకుండా! ఎంత అసంబద్ధం? వృద్ధుడు ప్రార్థన చేస్తూనే ఉన్నాడు. కష్టపడి పదాలు బయటికి అనాలని ప్రయత్నిస్తున్నాడు అవి **'ఆదిశక్తీ నీకు నమస్కరిస్తున్నాను; సర్వవ్యాపిత శక్తీ నీకు నమస్కరిస్తున్నాను; దైవసృష్టికి సాయపడే శక్తీ నీకు నమస్కరిస్తున్నాను;' కుండలినీ సృజనాత్మకశక్తీ; సర్వమాతా నీకు నమస్కరిస్తున్నాను.**

తన శిష్యురాలిని చూశాడు - ఇప్పుడు భారతదేశ పద్దెనిమిదో ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసింది - చేతులు జోడించి వినయంగా కృతజ్ఞతతో టీవీ కెమెరాల వైపు చూసింది. తర్వాత వెనక్కి పడిపోయింది. ఆమె ఎడమ భుజం పైన ఎర్రమరక - నిదానంగా కదులుతున్నట్టుంది - స్టింగర్.22 నుంచి కాల్చబడింది. దాని చిన్నకేసు, సబ్‌సానిక్ వెలాసిటీలు, రూజర్10/22 సైలెన్సర్‌తో కలిపి వాడడానికి అనువుగా ఉన్నాయి. అది నమ్మదగింది, భయంకరం, చాలా నిశ్శబ్దంగా ఉంటుంది.

సంతోషంగా ఉన్న రాష్ట్రపతి భవన్ అశోకాహాలు ఒక్కసారిగా గందరగోళ పడింది. తుపాకి కాల్పులతో. వందలాది మంది భారత రాజకీయ నాయకులు తూటాలు తగలకుండా దాక్కున్నారు. కొన్ని నిముషాల తర్వాత ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు నిర్జీవంగా ఉన్న హమీదా శరీరాన్ని అక్కడి నుంచి తీయించాడు. అశోకాహాలులో చెక్కతో కట్టిన డాన్సు ఫ్లోర్‌లో రక్తం కారుతూ, స్పృహ తప్పుతున్న చాందిని దగ్గరికి పారా మెడికోలు హడావిడిగా వచ్చారు.

నృత్యం మొదలైంది.

టీవీలో ఈ దృశ్యాన్ని చూస్తున్న పండిట్ గంగాసాగర్ మిశ్ర అగర్వాల్‌గారికి చెప్పాడు; 'నేను రాసిన నోట్ గర్న్‌సీలో ఉన్న లాయరుకి తప్పకుండా చేరేలా చూడండి, మిత్రమా. ఇది నేనిచ్చే చిట్టచివరి ఆదేశం!'

అగర్వాల్‌గారు, మీనన్ ఆయన మంచం పక్కనే నిలబడి ఉన్నారు. గంగాసాగర్ ప్రార్థిస్తూ కళ్ళు మూసుకున్నాడు, మళ్ళీ వాటిని తెరవాలని ప్రయత్నించలేదు.

# ముగింపు

ఆమె తన ట్రేడ్ మార్క్ కోరా చీర కట్టుకుంది. అయితే ఆమె బట్టలలో కొన్ని మార్పులొచ్చాయి. నూలు చీర బదులు పట్టుచీర కట్టుకొంది శిశిరం చలికి. చీర మీద బర్‌బెరీ కోటు వేసుకుంది. మామూలుగా వేసుకొనే వేసవి పాదరక్షల స్థానంలో స్టాకింగ్సు, జిమ్మీఛూ బూట్లు వేసుకుంది. ఆమె ముఖంలో వయసు కనిపించడం లేదు, కాని కళ్ళు మరో కథ చెబుతున్నాయి. అవి ఎంతో లోకాన్ని చూసిన మరకత పచ్చకళ్ళు. మానవ ప్రకృతిలోని దుష్టత్వాన్ని చూడడం ఆపేసి, జీవనసౌందర్యాన్ని చూస్తే బాగుండునని ఆ కళ్ళు ఎన్నోసార్లు తపించాయి. ఈ హైడ్‌పార్కులో వాహ్యాళికి వెళ్తున్నట్లుగా.

ఆమెపక్కనే ఇరవై ఒక్కేళ్ల యువకుడున్నాడు. అతను నీలంరంగు సెవైల్‌రో సూట్, ఆకుపచ్చ గీతలున్న ఆక్స్‌ఫర్డ్ టై వేసుకున్నాడు. అతని ఆకుపచ్చకళ్ళకు, దుస్తులకు సరిగ్గా సరిపోయింది. వంకీలు తిరిగిన జుట్టు చక్కగా దువ్వి ఉంది, ముఖం మీద పడే రెండు మూడు వెంట్రుకలు తప్ప. ఆమె చేతిని తన చేత్తో పట్టుకుని ఆమె పక్కనే నడుస్తున్నాడు.

ముందురోజు రాత్రి తన సందర్శన సందర్భంగా బ్రిటిష్ ప్రధాని తన గౌరవార్థం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొంది. సితార్ కళాకారిణి రాధికాశంకరన్, బ్రిటన్లో రాయల్ అకాడెమీ ఆఫ్ మ్యూజిక్ నుంచి వచ్చిన పేరొందిన వయొలిన్ కళాకారుడు హారీ రిచర్డ్‌సన్‌తో కలిసి కచేరీ చేసింది. అతనే ఇప్పుడామెతో నడుస్తున్నాడు. వయొలిన్, సితార్‌లు కలిసి చేసిన కచేరీలో రాధిక, హారీ ప్రాచీన భారతీయ రాగాలనుంచి కొత్త వాటిని సృష్టించి వాయించారు. ఒకరి నోట్స్ మరొకరు తీసుకుని తమ స్వంత విశిష్ట శైలిలో వాయించారు. అందరూ ఊపిరి బిగబట్టి చూసిన కచేరీ అది. ఆ ఇద్దరు సంగీత కళాకారులకూ చాందిని, బ్రిటిష్ ప్రధాని నిలబడి మరీ హర్షధ్వానాలు చేశారు.

'ప్రధాని నీ చేతిని పట్టుకొని, ఎందుకు సాయం చేశారు?' అడిగాడు హారీ.

'ఆయన భార్య అక్కడ లేదనేమో?' ఆమె జోక్ చేసింది. వయసు ఆమెలో చిలిపిదనాన్ని తగ్గించలేదు. వాళ్ళు నడుస్తూనే ఉన్నారు, అంగరక్షకులు వాళ్ళకి కొంచెం దూరంలో ముందూ, వెనుక నడుస్తున్నారు.

'ఆయన నాకు ముందే చెప్పి ఉండాల్సింది, నేను నీ కొడుకునని'. అన్నాడు హారీ. 'ఆయన కాకపోయినా, నువ్వయినా'.

'నిజంగా నాకు తెలియదు. గంగా అంకుల్‌కి, జోసఫిన్‌కి మాత్రమే తెలుసు. ట్రస్ట్‌డీడ్‌లో నీ తల్లిదండ్రులెవరో నీకు మాత్రమే తెలియాలని రాశాడు - ఇరవై ఒక్కేళ్ళకి. నాకు కాదు', అంది ఆమె. 'నేను నీ దగ్గర లేను. ఐయాం సారీ హారీ. అసలు నువ్వున్నావనే నాకు తెలియదు'.

'నన్ను రహస్యంగానే ఉంచుతావా నువ్వు?', అడిగాడు హారీ అందరూ తనని ఆమె రాజకీయ జీవితానికి అడ్డంకిగా భావించారనే విషయం గుర్తుకు వచ్చి బాధతో.

'భారత ప్రధానిగా ఇది నా మూడో పదవీకాలం, హారీ', ఆమె అంది. 'చాలాకాలం పనిచేశాను - చాలా ఎక్కువకాలం అని కొందరంటారు. 'రాజకీయ నాయకులు ముడ్డి గుడ్డల్లాంటి వారని, వాళ్ళని తరచుగా మారుస్తుండాలని గంగ అంకుల్ అనేవారు', ఆమె నవ్వింది. 'నాకు కొడుకున్నాడనేదే నాకు ముఖ్యం!'

'నాకు నాన్న లేడని ఎప్పుడూ బాధగా ఉండేది. మమ్-జోసఫిన్- ఎప్పుడూ నా తండ్రి భారతీయుడని, విమానప్రమాదంలో చనిపోయాడని చెప్పేది', అన్నాడు హారీ.

'మీ అమ్మ నుంచి వచ్చిన అందం గురించి నీకు వివరించాల్సి వచ్చి ఉంటుంది తనకి', అంది చాందిని సంభాషణని నవ్వుల్లోకి దించాలని.

'నా అభిప్రాయంలో నాకిద్దరమ్మలున్నారు', హారీ చిరునవ్వుతో అన్నాడు.

'ఆ ఇద్దరికీ నువ్వంటే ఇష్టం', అంది చాందిని అతని చేతిని నొక్కుతూ. 'అలాగే రాధికా శంకరన్‌కి కూడా, కచేరీలో రాత్రి ఆమె నిన్ను చూస్తున్న పద్ధతి చూస్తే'. విసురుగా వస్తున్నగాలి ముఖానికి తాకేలా వాళ్లు అక్కడే బెంచీ మీద కూర్చున్నారు.

హారీ తన జాకెట్ జేబులోంచి మూసి వున్న కవరుని తీసి చాందినికి ఇచ్చాడు. గంగాసాగర్ చేతిరాతలో దాని మీద చాందిని పేరు రాసి ఉంది. 'ఇది లాయర్ల దగ్గర ఉంచారు. నన్ను నీకివ్వమని చెప్పారు', అతను చెప్పాడు. ఆమె జాగ్రత్తగా దానిని తెరిచింది. నోట్‌ని చదవసాగింది.

మైడియర్ చాందినీ,

నీకు క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను. కాల్చిన వ్యక్తిని – ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ని – మళ్ళీ కుడిభుజాన్నే కాల్చమని చెప్పలేకపోయాను. దీన్ని ఇప్పటికే అలహాబాద్‌లో ఉపయోగించేశాం. హామీదా తుపాకి పేలదని, కాని ఇంక అతని బాధ నీకు లేకుండా చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చాడు. నీ గాయం పైపైనే ఉంటుందని హామీ ఇచ్చాడు. అయ్యో, రాజకీయ భవిష్యత్తు కోసం మనిషి చేయాల్సిన త్యాగాలివి. నీ విషయంలో నీ రెండు భుజాలు, నీ ఇద్దరు ప్రేమికులు.

ఈ లేఖ చదివేటప్పటికి నువ్వు ప్రధానిగా ఉండాలని ప్రార్థిస్తున్నాను – నా వ్యూహం ఫలించిందని ఇది రుజువు చేస్తుంది. మన దేశానికి త్యాగం, పరిత్యాగం ఇష్టం. ప్రజల మధ్యలో నిలబడాలంటే స్థిరంగా ప్రేమగా ఉంచే లక్షణాలివి. నిలబడే ఉండాలంటే మనిషి ఒక్కోసారి మనిషి తరచుగా పడుతూ ఉండాలి. మన చివరి సంభాషణ – మనం ముందు తయారుచేసుకున్న వాగ్వాదం – రాజకీయ ప్రత్యర్థుల కోసం, ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా వినేవాళ్ళకోసం కావడం దయనీయం.

లేకపోతే నిన్ను చూసి గర్విస్తున్నాని నీకు చెప్పాలనుకున్నాను.

నువ్వీలేఖ చదువుతున్నప్పుడు నీ పక్కన హారీ ఉంటాడనుకుంటున్నాను. నీ రాజకీయ భవిష్యత్తు కాపాడడానికి అతన్ని రహస్యంగా ఉంచాను. ఇంక జాఫ్రీ విషయంలో – నేను చేసిన దానికి చింతించడం లేదు. అతను దుర్వార్త. శంకర్ విషయం వేరు. అతను నిన్ను నిజంగానే ప్రేమించాడు అనుకుంటాను, కాని తరచుగా ద్వేషం కన్న ప్రేమే ఎక్కువ హాని చేస్తుంది. ఎలిజబెత్–1 కన్యగా ఉండి ఇంగ్లండుని పాలించింది. నువ్వు కూడా అలాగే చేయాలని అనుకున్నాను.

తన తండ్రి నిక్‌నేమ్ హారీ కనుక తనకి హారీ అని పేరు పెట్టానని జోసఫిన్ హారీకి చెప్పింది. ఆమె ఆ సంబంధాన్ని కొనసాగించాలనుకుంది. ఆమె అతనికి చెప్పని విషయం ఏమిటంటే హిందీలో 'హరి' అంటే 'ఆకుపచ్చ' అని అర్థం. నీ కళ్ళలాంటి కళ్ళున్నందుకు పిల్లవాడికి ఆ పేరు ఎంచుకున్నానని. చూస్తున్నావుగా అబ్బాయి పోషణలో ఎటువంటి లోటూ చేయలేదు. నువ్వు గర్వపడేలా ఆ యువకుడున్నాడిప్పుడు.

భారతదేశ ఐక్యత, సమైక్యతకు బలమైన నాయకులు కావాలి. తరచుగా ఈ నాయకులు తొండి ఆటలు ఆడాలి. చాణక్యుడు తన శిష్యుడు చంద్రగుప్తుడి కోసం అలా

**చేశాడు. ఇప్పుడు నేను నా శిష్యురాలు చాందిని గుప్త కోసం మళ్ళీ అలా చేశాను. అవును, శక్తి శివుణ్ణి జయించింది - మన కాలానికి గుర్తు. నేను దేనికీ విచారించడం లేదు.**

చాందిని లేఖ మూసి నిలబడింది. 'లెకాప్రిస్‌లో డిన్నర్‌కి వెళుతున్నామా?', ఆమె అడిగింది.

'నాకూ రావాలని ఉంది. కాని రేపు వెళదామా? నేనొకరిని కలవాలి', అన్నాడు హారీ.

'ఎవరు?'

'రాధికాశంకరన్' అన్నాడు హారీ. కొంచెం సిగ్గుపడుతూ.

'అయితే నేనొక్కదాన్నే తినాలన్నమాట', అంది చాందిని ఉత్తుత్తి నిరాశతో.

'భోజనం అంత బాగా లేదని విన్నాను', చెప్పాడు హారీ.

'లెకాప్రిస్‌లోనా?' అడిగింది చాందిని.

'నంబర్ టెన్‌లో. ఆయన భార్య నగరంలో లేదు', చెప్పాడు హారీ.

'విస్మయం కలిగించే పుస్తకం... అద్భుతమైన పరిశోధన... మన రాజకీయ నాయకులు ఈ పుస్తకాన్ని చదివేంత అక్షరాస్యులైయ్యుంటే బాగుండేది' - ప్రహ్లాద్ కకర్

'తప్పనిసరిగా చదవాల్సినది.... ద రోజబల్ లైన్‌లా కుశాగ్రం' - ప్రీతిష్‌నంది

'చాలా నచ్చింది.... అందరూ చదవాలని గట్టిగా చెబుతున్నా' - అమిష్ త్రిపాఠి

క్రీ.పూ. 340వ సంవత్సరం. వేటాడబడుతున్న, వెంటాడబడుతున్న బ్రాహ్మణయువకుడు ప్రియమైన తండ్రి భయంకర హత్యకు ప్రతీకారం తీర్చుకొనడానికి చేసిన ప్రతిజ్ఞ.

కఠినంగా, తొణక్కుండా, క్రూరంగా, ఎలాంటి నైతిక నియమాలు లేకుండా భారతదేశ రాజకీయ వ్యూహకర్తలలో అత్యంత శక్తిమంతుడయ్యాడు. ప్రపంచ విజేత, దైవాంశ సంభూతుడు అని పేరొందిన అలెగ్జాండర్ దండయాత్ర నుంచి దేశాన్ని కాపాడి ముక్కలైన దేశాన్ని ఒక్కటిగా చేయడంలో సఫలీకృతుడయ్యాడు.

రెండు శక్తుల బలహీనతలను పరస్పర వ్యతిరేకంగా పురికొల్పి, క్రూరమైన, ఆశ్చర్యం గొలిపే విజయాన్ని సాధించి, శక్తిమంతమైన మౌర్య సామ్రాజ్య సింహాసనంపై చంద్రగుప్తుణ్ణి ప్రతిష్ఠించడంలో కృతకృత్యుడయ్యాడు. చరిత్రలో కుశాగ్ర వ్యూహకర్త చాణక్యుడిగా ప్రసిద్ధుడతడు.

ప్రతిభగల తన మేధను కొంచెం ఉపయోగించి రాజ ప్రతిష్ఠాపకుడుగా తృప్తి చెంది - ఇంక తన విజయానికి విసుగు చెంది అర్థశాస్త్రాన్ని రాయడానికి వెళ్ళిపోయాడు.

చరిత్ర పునరావృతమవుతుంది. రెండు వేల మూడొందల యేళ్ళ తర్వాత గంగాసాగర్ మిశ్ర అవతారంలో చాణక్యుణ్ణి మళ్ళీ పుట్టించింది. భారతదేశంలో చిన్న పట్టణంలోని బ్రాహ్మణఉపాధ్యాయుడు, అత్యాశగల వ్యక్తులను తోలుబొమ్మల్లా ఆడించాడు - మురికివాడలో పుట్టి, అందమైన, శక్తిమంతురాలుగా ఎదిగిన ఆడపిల్లతో సహా అందరినీ ఆడించాడు.

ఆధునిక భారతదేశం కూడా ప్రాచీన భారతంలా వర్గద్వేషం, అవినీతి, విభజన రాజకీయాలు కలిగి ఉన్నదే - ఈ పరిస్థితి గంగాసాగర్ పండుగ చేసుకొనే వీలున్నదే. అత్యాశ, అవినీతి, లైంగిక అక్రమాలను వేటాడే ఈ జిత్తులమారి పండితుడు భారతదేశాన్ని ఐక్యం చేసే మహిమను చూపగలడా?

చాణక్యుడి మంత్రం మళ్ళీ మహిమ చూపుతుందా?

Elevate Your Life. Transform Your World.

JAICO BOOKS

www.jaicobooks.com

Thriller

ISBN-13: 978-81-8495-553-8

9788184955538

₹ 260